కాలేజీలో చదువుకొనే రోజుల నుంచి 'భరణి' అనే కలం పేరుతో కథలు రాసేవాణ్ణి. నా మొదటి కథ 'మంచి చేసిన వంచన'. 1973లో ఇంటర్‌లో ఉండగా ఆ కథ రాశా. తరువాత చాలా కాలానికి నా కథల సంపుటి 'ఎన్నో రంగుల తెల్ల కిరణం' (తొలి ముద్రణ: 2004 జనవరి) పేరిట పుస్తకంగా వచ్చింది. ఇప్పటికి నూరు దాకా కథలు రాసి, ఉంటా. వాటిలో ఒక పది, పదిహేను కథలు మాత్రం ప్రచురితమై ఉంటాయి. కథ ఒకసారి రాసేసినా, ప్రచురణకు పంపేదాకా, పంపిన తరువాత కూడా ఏవో మార్పులు, చేర్పులతో రీ-రైట్ చేస్తుంటా. అందుకే, ప్రచురితమైన నా కథలకు కూడా వేరే వెర్షన్ ఉంటుంది. నా పాటల లాగానే, నా కథలు కూడా పదచిత్రాలతో, కళ్ల ముందు ఆ దృశ్యం కదలాడే పద్ధతిలో ఉంటాయి. ప్రాథమికంగా నా రచన శైలి అది.

మీరు నాటకాలు రాశారు, నటించారు. కానీ, వాటి గురించి ఏ ఇంటర్వ్యూలో నూ చెప్పినట్లు లేరు!

అవును. అదో అధ్యాయం. ఒక దశలో నేను నాటికలు కూడా రాశా. ప్రధానంగా నాలుగు - 'భాగీరథి', 'ది రెలెటివ్ థీరీ', 'సన్మానో పనిషత్తు', 'నాన్నాపులి'. అన్నీ విలక్షణమైన కాన్సెప్టులే. కొన్ని నాటికల్లో నేను ముఖ్య పాత్రల్లో నటించాను కూడా!

ఆనాటి నాటకాల మీద ఒక రకమైన నిరసన పుట్టి, ప్రయోగాత్మకంగా 'ది రెలెటివ్ థీరీ' రాశా. నోబెల్ బహుమతి పొందిన నాటకకర్తల నాటకాలు 'ది డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మ్యాన్', 'కింగ్ ఆఫ్ ది జంగిల్' లాంటివి చదివి, అలా ఆధునిక తరహాలో రాయాలని రాశా. అట్టర్ ఫెయిల్యూర్ అయింది. ఆ ఉక్రోషంతో రాసిన పూర్తి హాస్యనాటకం 'సన్మానోపనిషత్తు'. నేను కవి పాత్ర వేస్తే, ఆకెళ్ల బ్రోకర్ పాత్ర వేసేవారు. కడుపుబ్బ నవ్వించే ఆ నాటకం హిట్. అప్పట్లోనే ఓ డజను ప్రదర్శనలిచ్చాం. 'చిన్నారి పొన్నారి చడ్డీలు ధరియించు నాడె...' అంటూ కవి పాత్రకు నవ్వించేలా సీసపద్యాలు కూడా రాశా.

తర్కం, సృజనాత్మకత - రెండు పరస్పర విరుద్ధమైన కోణాలు కదా! రచయితగా వాటిని మీరెలా సమన్వయం చేసుకుంటూ వచ్చారు?

తాత్వికత, తార్కికత, సృజనాత్మకత - ఇలా మూడూ ఉన్న త్రీ టైర్ కంపార్ట్‌మెంట్ నాది. నా పాటల్లో ప్రధానమైనది, వాటిపై ప్రభావం చూపేది నా తాత్వికత. అది మొదటి బెర్త్. దాని తార్కిక విశ్లేషణ రెండో బెర్త్. అయితే, అక్కడ నాది ఆబ్జెక్టివ్ తర్కమే తప్ప, సబ్జెక్టివ్ తర్కం కాదు. మూడో బెర్త్ సృజనాత్మకత. వీటన్నిటినీ సృజనాత్మకంగా చెప్పడం అక్కడ వస్తుంది. మొదటి రెండూ లేకుండా, కేవలం మూడోదైన సృజనాత్మకత మాత్రమే ఉన్నవాడు జగత్ కల్యాణకారకమైనది ఏదీ రాయలేడు, చేయలేడు. మూడూ ఉంటేనే అది సరైన రచన. అందుకే, నన్ను కేవలం కవి అంటే అది అవమానమే. నాకు వచ్చిన విద్యను పొట్టకూటి కోసం వినియోగిస్తున్నా. ఎలా బతకాలన్నదానిపై నాకున్న జీవన సంవిధానాన్నే పాట రాయడానికీ అప్లయ్ చేస్తున్నా.

మరి, మీ ఆధ్యాత్మిక విశ్వాసాల మాటేమిటి?

మూఢవిశ్వాసంగా, అర్థం లేని ఆచారంగా అనుసరించే భక్తి, పూజలు, తీర్థయాత్రలు, ఆ తరహా ఆధ్యాత్మిక విషయాలపై నాకు ఆసక్తి లేదు. చిన్నప్పటి నుంచి ప్రతిదీ ప్రశ్నించుకొని, ఆ ప్రశ్నలకు జవాబులు అన్వేషిస్తూ సాగడమే నా పద్ధతి. అది భౌతికమైనా, ఆధ్యాత్మికమైనా! నిజానికి, నా సోకాల్డ్ డిగ్రీల చదువు సరిగ్గా సాగకపోవడానికీ, కానీ అదే సమయంలో వ్యక్తిగా, రచయితగా ఇతరులకు భిన్నంగా నిలబడడానికీ కూడా ఈ ప్రశ్నా ధోరణే హేతువు. అయితే, ఆదిశంకరులు రాసిన అద్భుతమైన 'శివ మానస పూజాస్తోత్రం'లోని అయిదు శ్లోకాల్లో ఒకటి 'ఆత్మా త్వమ్... గిరిజా మతిః... సహచరాః ప్రాణాః... శరీరమ్ గృహమ్... పూజా తే విషయోపభోగ రచనా...' అంటూ సాగుతుంది. 'నా ఆత్మ నువ్వు, నా బుద్ధి అమ్మవారు. నా ప్రాణాలే నీకు గణాలు. ఈ శరీరమే నీ గుడి' అంటూ, 'శంభో శంకరా... నిత్యజీవితంలో నేను చేస్తున్న పనులన్నీ నీ ఆరాధనలే' అని ఆ శ్లోకార్థం. ఆ ఉదాత్త భావన, ఆ శ్లోకం... నా తాత్వికతకు సరైన లింకు.

నా ఆధ్యాత్మిక గురువు సద్గురు కందుకూరి శివానంద మూర్తిగారు, ఆయన మాటలు నా అన్వేషణలో దోవ చూపెట్టాయి. 'భారతదేశంలో పేదరికం ఎప్పుడూ ఉంది. కానీ, దరిద్రం ఎప్పుడూ లేదు' అని గురువుగారు అనేవారు. మన సమాజంలో, జీవితంలో కష్టాలు, పేదరికం, లేమి ఒక భాగం. అదే సమయంలో ఒక దశ దాటాక ఎక్కువుంటే వాటిని వదిలేసి, స్వచ్ఛందంగా పేదరికం అనుభవించడం మరో భాగం. కేవలం భౌతిక సుఖాలు, వాటి కోసం అర్రులు చాచడం కాకుండా, నేను ఎవరిని, నా అసలైన ప్రయాణం ఏమిటి, నా అన్వేషణ దేనికి అనేది ముఖ్యం. భౌతికమైన బతుకులో వాటిని తెలుసుకొనేలా వీలైనంతగా వాటికి దగ్గరగా వెళ్లిపోవాలి. మనం మన లోలోపలకు అలా వెళుతున్న

కొద్దీ, ఆధ్యాత్మికంగా మన ఊర్ధ్వలోక ప్రయాణం సాగుతుంది. మనం చేయాల్సిన ప్రయాణం అదే!

మరి, రెండున్నర నుంచి మూడు వేల పాటలు రాసిన మీ ప్రయాణం పమనిపిస్తుంటుంది?

దాదాపు రెండు వేల పైచిలుకు పాటలు రాశా. నా దృష్టిలో నేను రెండు వేల రకాలుగా ఒకే పాట రాశా. ఎందుకంటే, నా పాటలన్నీ నా ప్రశ్నలు, నా ప్రయాణమే! నా పాటలు... నా స్వగతాలు. అంతే. మనుషులు, మానవ సంబంధాలు, ప్రేమ, పెళ్లి, డ్యూయట్లు, వివాహ వేడుక, దేశభక్తి - ఇలా అన్ని రకాల పాటలూ రాశా. ఏ పాట రాసినా ఆ పాట తాలూకు ప్రయోజనం, పరమార్థం చెప్పాలన్నదే నా ప్రయత్నం. పర్పస్ లేని పాట నేను రాయలేను. నిజానికి, పాటలు నేను రాశాను అనడం కన్నా అత్యధిక సందర్భాల్లో అవి తమను తాము ఆవిష్కరించుకున్నాయి అనడం సబబు. ఉదాహరణకు, 'స్వర్ణకమలం' (1988)లోని 'అందెల రవమిది పదములదా...' పాట. ఆ పాటలో ఒకచోట మొదట 'నయనతేజమే నకారమై...' అని మాత్రం అన్నా. దాన్ని అలా కొనసాగిస్తూ, శివపంచాక్షరిని చెబితే బాగుంటుందని అనుకున్నాం. అంతే... అప్పటికప్పుడు ఆన్ ది స్పాట్‌లో 'మనోనిశ్చయం మకారమై...' అంటూ మిగతా లైన్లు గబగబా వచ్చేశాయి. అందుకే, అవి తమను తాము ఆవిష్కరించుకున్నాయే తప్ప, నేను రాశా ననడం తప్పు. సినిమాను ఒక క్రీడలా చేసుకొని, పాటల ఆవిష్కరణకు నేనొక మాధ్యమం అయ్యా.

కానీ, పదకొండు నంది అవార్డులొచ్చాయి. తెలుగులో సినీ గీత రచన విభాగంలో తొలి 'పద్మశ్రీ' కూడా మీరే కదా!

అవార్డులు, పురస్కారాలు జీవితానికి గీటురాయి కాదు. 1985లో మద్రాసుకు వెళ్లి, సినీ రంగంలో కాలుపెడితే, సినిమాకు పాటలు రాసిన మొదటి సినిమా 'సిరివెన్నెల'కే మొదటి నంది వచ్చింది. అది ఎవరో కాదు... నేను కూడా ఊహించలేదు. తొలి సినిమాకు, పాటకు నంది రావడమే ఒక మిరకిల్. తరువాత అసలు ఖాళీ లేకుండా పాటలు రాస్తుండడం, పేరు రావడం మరో మిరకిల్. రెండో ఏడాదీ నాకే నంది అవార్డు ఇస్తూ, ప్రకటన వచ్చింది. సినీ పరిశ్రమలోకి వచ్చినప్పటి నుంచి వరుసగా మూడేళ్లు ఉత్తమ గీత రచయితగా నంది అవార్డు నాకే రావడం ఓ రికార్డని అప్పట్లో అనుకొనేవారు. అలాగే, ఇప్పుడు తాజాగా 'పద్మశ్రీ' కూడా! నా ప్రయాణంలో ఇదొక మజిలీ. నేను సాధించింది ఏమీ లేదు. అంతా దైవదత్తం. అంతే!

ఇలాంటి మీ జీవిత దృక్పథానికి కారకులు, మీ మీద ప్రభావం చూపిన వ్యక్తి అంటే...?

సందర్భాన్ని బట్టి చాలామందే ఉన్నారు. కానీ, నా మీద మా నాన్నగారి ప్రభావం ఎక్కువ. నా ధైర్యం, నా తర్కం - అన్నీ ఆయన నుంచి నాకు వారసత్వంగా సంక్రమించినవే. రోజుకు 20 గంటలు పనిచేసే ఆయన ఏ సబ్జెక్టు పైన అయినా మూడు రోజుల్లో మాస్టరీ చేసేసేవారు. మాకు మోడరన్ ఫిజిక్స్ ఉంది, చెప్పమంటే, మూడు రోజుల్లో నేర్చుకొని, నా సహాధ్యాయుల్ని




కూడా పిలిచి, అందరికీ అద్భుతంగా పాఠం చెప్పారు. నాకు పి.బి. ఉడ్‌హౌస్, ఒమర్ ఖయ్యామ్, గాలిబ్ తదితర రచయితలను పరిచయం చేసింది ఆయనే. కుర్రతనంతో ఆయనను బాగానే ఇబ్బంది పెట్టాను. చిన్నప్పటి నుంచి నాకు సినిమాల పిచ్చి చాలా ఉండేది. స్కూలు ఎగ్గొట్టి, అనకాపల్లి పరమేశ్వరా టాకీస్‌లో 40 పైసల నేల టిక్కెట్టుతో, ఎన్ని సినిమాలకు వెళ్లానో! కాకినాడలో కాలేజీలో ఉండగానూ అదే వరస. నాన్నగారి జేబులో డబ్బులు కొట్టేసి సిగరెట్లు తాగడం - ఇలాంటి పిల్ల చేష్టలెన్నో తెలియనితనంతో చేసేవాణ్ణి. అయితే, ప్రతిసారీ ఆయన తన ప్రేమతో, మంచి మాటలతో, చేతలతో విడిగా చెప్పకుండానే నన్ను సరిదిద్దారు.

ఆ రోజు నుంచి నా జీవితం తెరచిన పుస్తకం. అబద్ధాలు ఆడడం లాంటివి నాకు నేనే మానేసేలా చేసిన అరుదైన పెంపకం అది. తెలిసీ తెలియని వయసులో, రకరకాల ఆకర్షణల్లో పడిపోయే ఆ వయసులో శిల లాంటి నన్ను శిల్పంగా చెక్కింది ఆయన, ఆయన విధానమే. ఆయన మాటల వర్షంలోని ఒక్కొక్క చినుకు, నాలో ఒక్కో విత్తనాన్ని మొలకెత్తించింది. ఆయన నాటిన ఆ విత్తనాలే నాలో వృక్షాలయ్యాయి. ఆయనకు రానివి - కవిత్వం, నాట్యం, సంగీతం మూడే అనేవారాయన. భగవదనుగ్రహంతో ఆ అంశాలు నాకు వచ్చాయి.

మీరు మీ ఆత్మకథ రాయవచ్చు కదా!

మా నాన్న గారి జీవితం, ఆయనతో పలువురి అనుభవాలు, జ్ఞాపకాల మేళవింపుగా మా పెద్దతమ్ముడు (శ్రీరామ్ 'సమ్మాన్యుడు' అని ఒక పుస్తకం రాసి, ప్రచురించాడు. నాకంటూ వేరే వ్యక్తిగత జీవితం, ప్రత్యేకించి క్రమబద్ధమైన ఆత్మకథ ఏమీ లేవు. ఇప్పటికే చాలామంది అడిగారు. కానీ, నేను రాయడానికి ఏమీ లేదు. దాచడానికీ ఏమీ లేదు. నేనెప్పుడూ వర్తమానంలోనే జీవించాను. 'జగమంత కుటుంబం నాది...' అన్న పాటే నా ఆత్మకథ. మళ్లీ చెబుతున్నా... నా పాటలన్నీ నా స్వగతాలే! *

ఊపిరి ఎంత సహజమో కవిత్వం అంత సహజంగా ఉండాలనే కె. శివారెడ్డికి 'సరస్వతి సమ్మాన్' అవార్డు లభించిన సందర్భంలో మాట ముచ్చట...



ప్రవహించే కవనానికి సరస్వతీ సమ్మాన్

కొండ

కరుగుతూ, కదులుతూ, కదిలిస్తూ కవిత్వంగా ప్రవహిస్తున్న జీవితం ఆయనది. ప్రతి యువకవిని అక్కున చేర్చుకుని ప్రోత్సహించడం ఆయన నైజం. నిర్భయుడు కాని వాడు కవి కాలేడని నిక్కచ్చిగా చెప్పిన కె. శివారెడ్డి కవిత్వంలో సామాజిక విధ్వంసాన్ని, సాంస్కృతిక విధ్వంసాన్ని, కుటుంబ జీవితమే కాదు వ్యక్తిగత జీవితాల్లోను విధ్వంసాన్ని తన అక్షరాల్లో బంధించిన కవి.

కవులేం జేస్తారు... గోడలకు నోరిస్తారు
చెట్లకు కళ్లిస్తారు, గాలికి గొంతిస్తారు
ప్రజలకు చేతులిస్తారు... ప్రజల చేతుల్లో
అనంత శక్తి సంపన్నమయిన పద్యాన్ని పెడతారు

అని కవుల కర్తవ్యమేమిటో నిర్భయంగా ప్రకటించినవాడు.

దిగంబర కవిత్వం, విప్లవకవిత్వం, ఆ తర్వాత అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో స్త్రీవాద కవిత్వం, దళిత కవిత్వం, మైనారిటీ కవిత్వం... ఇలా ఎన్ని వచ్చినా తనదైన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ రాస్తున్న కవి.

ప్రతిష్ఠాత్మకమైన సరస్వతి సమ్మాన్ అవార్డు లభించిన మీ కవిత్వ సంపుటి పక్కకు వత్తిగిల్లితే... శీర్షికలోనే ఒక ప్రత్యేకత ధ్వనిస్తుంది. ఈ పుస్తకం గురించి చెప్పండి.

ఇందులో ప్రారంభంలోని రెండు కవితల గురించి చెబితే చాలు ఈ పుస్తకం గురించి మీకు తెలుస్తుంది. మొదటి కవిత శీర్షికే ఈ సంపుటికి పెట్టిన పేరు. మొదటి కవిత ఏంటంటే...

పక్కకి
ఒత్తిగిలితే తగిలిందో వాక్యం
అంటూ ప్రారంభమైంది.

పూర్వం
ఒక రాజు
తనకీ, పెళ్లానికి మధ్య
కత్తి నాటాడట పక్క మధ్యలో
ఎవరు కదిలినా రక్తం పలుకుతుంది
పండిన వేపకాయ హృదయం
తీయతీయగా చేదు చేదుగా
తడి తడిగా
అంతే

కవిత్వం రాయడమంటే
ఖడ్గంతో సహజీవనం చేయడం
మొద్దు బారడానికి వీల్లేదు
మోడుగా మిగలడానికి వీల్లేదు

ఇది కవిత్వానికి నిర్వచనం, వస్తువుకు నిర్వచనంలాంటి కవిత. ఇక రెండవ కవిత గురించి కూడా చెబితే ఈ పుస్తకం ఏంటో పూర్తిగా అర్థమవుతుంది. రెండో కవిత పేరు 'కొత్త ఊహ.' ఈ కవితలో...

ఒక కొత్త ఊహ బుట్టాలే గాని
పూలకుండి ఒకటి ఆకాశం నుంచి
భూమ్మీదకి దిగుతుంది
మట్టిలోంచి ఒక నల్లటి మేఘం
అలా ఆకాశంలోని లేస్తుంది
ఒక కొత్త ఊహ బుట్టాలే గాని
రాజకుమారి స్నానం చేస్తే నది ఏర్పడుతుంది
రాకుమారుడొకడు ఒక వెంట్రుక దొరికితే
ఆ అందాల రాశిని వెదకడానికి బయల్దేరుతాడు

ఇవన్నీ ఏంటంటే, చిన్నప్పుడు విన్న జానపద కథలన్నీ వాడుకుంటూ కవిత కొనసాగుతుంది. చివర-

ఒక కొత్త ఊహ బుట్టాలేగాని
జీవితమంత మధురంగా
కవిత్వముంటుంది
కవిత్వమంత మధురంగా
ప్రాణప్రదంగా జీవితముంటుంది

అని ముగించాను. కవిత్వానికి ఊహ చాలా ప్రధానం. వాస్తవం ముఖ్యమే, కాని వాస్తవం ప్రాముఖ్యాన్ని గుండెల్లో నాటుకునేలా చెప్పడానికి, వాస్తవాన్ని అద్భుతంగా వికసించేలా చేయడానికి ఊహ కావాలి. ఈ కవిత్వ సంపుటిలో కీలకమైన కవితలు ఈ రెండు కవితలు. ఈ రెండు కవితలు కవిత్వమంటే ఏమిటో, జీవితమంటే ఏమిటో చెబుతున్న కవితలు. జీవితం సౌందర్యవంతంగా ఉండాలంటే, సృజనాత్మకంగా ఉండాలంటే, జీవితం జీవితంలా ఉండాలంటే ఊహ కావాలి. ఊహ లేకపోతే నిర్వీర్యమవుతుంది. పొద్దుట వాకిలి ఊడ్చి, కళ్లాపి జల్లి, ముగ్గేస్తారు. రకరకాల ముగ్గులు వేస్తారు. పూర్వం తడికలుండేవి. వాటిని పేడతో అలికి, దానిపై అద్భుతమైన తీగలు, పువ్వుల చిత్రాలు వేసేవారు. ఇదంతా ఊహ. అదే జీవన సౌందర్యం. కవిత్వం జీవితాన్ని సౌందర్యవంతం చేస్తుంది. రైతువా, రైతుకూలివా, మరొకడివా అనేది కాదు, అందరికీ జీవితాలు ఉన్నాయి. ప్రతి మనిషి తనదైన జీవితం నుంచి ఒక అద్భుతమైన శక్తిని ఉత్సాహాన్ని సంపాదించడానికి, ఆనందించడానికి, ఊహ కావాలి. ఊహ అనేది అవాస్తవికమైనది కానక్కర్లేదు. వాస్తవికమైన ఊహ అవసరం. చూసే దృశ్యాన్ని కొత్తరకంగా చూడాలి. అందుకే ఒకచోట రాశాను...

ఆకులో ఆకాశాన్ని
ఆకాశంలో అడవుల్ని చూడలేని వాడు
మనుషుల్లోని మహత్తర ఆకాశ అటవీ సౌందర్యాన్ని
చూడలేడు

నేత్రధనుస్సు కవిత్వ సంపుటిలో పద్యం ఇది. ఆ రోజుల్లో ఒక వస్తువును ఎలా చూడాలి అనే చర్చలు జరిగేవి. ఈ కవిత పేరు కూడా ఏచూపులి అని పెట్టాను.

రోడ్లలో నదుల్ని
నదుల్లో నవఛైత్ర పథాల్ని చూడలేనివాడు
మనుషుల్లోని నవనవోన్మేష
ఆశా వసంతోత్సవాన్ని చూడలేడు

ఈ చూపు చాలా ముఖ్యం. జీవితం శోభాయమానంగా, సౌందర్యవంతంగా ఉండాలంటే చూసే శక్తి ఉండాలి. జీవితం చాలా అందమైనది. ఈ భావన నుంచి మనిషి దూరంగా పోరాదు. ఏవిం జీవితమిది?లి అనే భావన రాకూడదు. జీవితాన్ని జీవించేలా పాఠకులను ప్రిపేర్ చేయడం కవుల బాధ్యత. జీవితాన్ని అనుభవించేలా, జీవించే ఆనందం పొందేలా చేయాలి. అనుభవించడమంటే సుఖవిలాసాలు కావు. ఉన్న జీవితాన్నే ఆనందంగా గడిపే మనస్తత్వం.

మీరు ఒక కవిత ఎలా రాస్తారు?

ఇది యాభయ్యేళ్ల పరిణామం. ఎవరో డిక్టేట్ చేస్తే, నేను రాస్తానని ఒక మిత్రుడుతో అన్నా. సరదాగా చెప్పినా అది వాస్తవమే. కూచుని మాట్లాడుతున్నప్పుడు, ఒక మాట తడితే ఒక కవిత తయారవుతుంది. ఒక వాక్యం తడితే కవిత వస్తుంది. ఈ స్థితి రావడానికి యాభయ్యేళ్ల కవిత్వ జీవితం పునాది. యాభయ్యేళ్ల సాధన ఉంది. యాభయ్యేళ్ల అధ్యయనం ఉంది. జీవితాన్ని లోలోతుల్లో చూసిన స్థితి ఉంది. ఈ యాభయ్యేళ్లలో జరిగిన మార్పేమిటంటే, కవిత అల్లిక మారింది. కవిత నేతలో తేడా వచ్చింది. ప్రారంభంలో కవిత నేత కాస్త మొరటుగా ఉంటే, ఇప్పుడు జిలుగు సంతరించుకుంది. సాలీడు గూడు అల్లిన తర్వాత ఉషోదయపు మంచుబిందువు దానిపై పడి తళతళ మెరుస్తున్న దృశ్యంలా నేతలో కొత్త మెరుపు వచ్చింది. దీని క్కారణం ఇప్పటి సందర్భం.

కవికి చూపు ముఖ్యమన్నారు కదా... ఆ చూపు ఎలా సాధించాలి?

చూడ్డం నేర్చుకోవాలి. నేను ఈ మాట చాలాసార్లు చెప్పాను. కవికి కన్ను, చెవి ఈ రెండు చాలా ముఖ్యం. వస్తువును చూసే నేర్పు సాధించాలి. ఇది అభ్యాసం వల్ల, సాధన వల్లనే వస్తుంది. ఇదంతా ఎలా తెలుస్తుందంటే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కవులను చదవడం వల్ల తెలుస్తుంది. ఒక కవిని చదివినప్పుడు, ఈ వస్తువు మీద మంచి పద్యం రాశాడే.. నాకు తట్టనే లేదు అని అనుకునే పరిస్థితి ఉంటుంది. ఆ వస్తువును చూడగలిగిన ఆ కవి చూపును గుర్తించడం ద్వారా ప్రతి కవి తన చూపును మెరుగుపరచుకోగలడు. గోల్నాక మీదుగా నేను కాలేజీకి వెళతాను. మూసీ

పక్కన ఒంటెలు కట్టేసి ఉంటాయి. వాటిని చూసిన తర్వాత మూసీ నది ఒంటెలు అని ఒక పద్యం రాశాను. నగర జీవితాన్ని కూడా మనం సరిగా చూడ్డం లేదన్నది నా కంప్లయింట్. నగరంలో ఇన్నాళ్లుగా ఉన్నా నగరంలో లోలోతుల్లో జీవితాన్ని చూడడం లేదు. అందువల్ల మనకు రియల్ అర్బన్ పొయట్రీ లేదు. మన ఆశారాజు పాతనగర జీవితాన్ని కవిత్వీకరించారు. ఆయనదంతా పూర్తిగా సౌందర్యదృష్టి. ఇరుకుగల్లీల్లో బతుకుతున్న ఒక ముస్లిం జీవితం, పాతనగరంలోని దుఃఖం, వేదన ఇవన్నీ కూడా కవిత్వంలో రావాలి. పర్‌స్పెక్టివ్ అనేది చాలా ముఖ్యం.

సరస్వతి సమ్మాన్ అవార్డు పొందిన ఈ పుస్తకం కవితలు ఎప్పుడు రాసినవి?

ఇవన్నీ రెండేళ్ల కాలంలో రాసిన కవితలు. 2014లో 'గాథ' కవిత్వ సంపుటి వచ్చింది. ఈ పుస్తకం 2016లో వచ్చింది. ఈ రెండు సంవత్సరాల జీవితమే ఈ కవితలు. రెండు సంవత్సరాల కాలంలో ప్రపంచవ్యాప్తంగా పరిణామాలు. జీవితంలో కొన సాగుతున్న విధ్వంసం ఇవన్నీ ఈ కవితల్లో ఉన్నాయి.

ఇప్పుడు చాలామంది యువకవులు ఉత్సాహంగా రాస్తున్నారు. కవితా వస్తువు ఎంపికలో ఎలాంటి దృష్టి ఉండాలి?

నేను ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. నా మనవడు కథ చెప్పమంటే గండభేరుండ పక్షులంటూ ఒక కథ చెప్పాను. ఒక్కో పక్షి మనిల్ల అంత ఉంటుందిరా... ఒక దేశంలో మనుషుల్ని ఈ పక్షులు ఎత్తుకుపోయేవి, అప్పుడు రాజుగారు ఈ గండభేరుండ పక్షులను చంపి దేశాన్ని రక్షించిన వాడికి కూతురినిచ్చి వివాహం చేసి రాజ్యం రాసిస్తానని చెప్పాడు. వాటిని చంపడానికి ఒక డొచ్చాడు, వాడే హీరో అంటూ కథ చెప్పాను. మా మనవడికి చెప్పే కథలో వాడే హీరో. ఆ తర్వాత ఒక కవిత రాశాను. ఆంధ్రజ్యోతిలో వచ్చింది. కవిత శీర్షిక 'పద్యాలు.' ఈ కవితలో కూడా వాడే హీరో... కాని ఆ హీరో రైతు. రైతు కథలోకి వచ్చిన తర్వాత సారం మారింది... ఆ కవిత వాక్యాలు చూడండి...

పద్యాలు
నా పక్కలో పడుకుంటాయి
పొట్ట మీద కాలేసి
మెడ వాటేసుకుని పడుకుంటాయి
కథ చెప్పమని గొడవ చేస్తాయి

అంటూ కవిత ప్రారంభమవుతుంది. చెప్పింది అదే కథ. చివరకు ఒక పల్లెటూరి రైతు నోటితో ఊదితే వేల మంటలు కమ్ముకుని దగ్ధం చేశాయి, దేశం సుభిక్షమైంది అంటూ కవిత సాగుతుంది. దేశం సుభిక్షంగా ఉండాలంటే అది రైతు వల్లనే సాధ్యం. కవిత ముగింపులో-

నా పొట్ట మీద కాలేసుకు పడుకున్న
పద్యం లేచి కూచుని
నన్ను తేరిపార చూసి
మళ్లీ తన లోపలికి తాను వెళ్లిపోయింది

అని ముగించాను. వస్తువు అదే, ఊహ కూడా అదే. కాని సారం వేరు. ఇది పిల్లవాడికి కాలక్షేపం కోసం చెప్పిన కథ కాదు. ఒక సామాజిక దుఃఖాన్ని, వ్యక్తుల జీవితాల్లో కూడా ఇంకిపోయిన దుఃఖాన్ని ప్రకటించడం. దాని పరిష్కారం కూడా చెప్పడం. కాబట్టి వస్తు ఎంపిక విషయంలో ఇప్పుడున్న సామాజిక రాజకీయ పరిస్థితి దృష్టిలో ఉంచుకోవాలి. మేము మొదలుపెట్టినప్పటి పరిస్థితి ఇప్పుడు లేదు. కాబట్టి ఇప్పుడు రాసే యువకవులకు ఇవే కవితా వస్తువులవుతాయి. అభ్యుదయ కవిత్వం వచ్చిన తొలిరోజుల నాటి స్థితి వేరు. ఇప్పటి స్థితి వేరు. ప్రపంచంలో ఇప్పుడు ప్రైవసీ లేకుండా పోయింది. నిఘా పెరిగిపోయింది. ఇప్పుడు వ్యక్తిగత జీవితం ఇంతగా డిస్టర్బయిన నేపథ్యంలో అన్నీ బహిరంగమైపోయాయి. ఈ పరిస్థితుల్లో జరిగిందేమిటంటే, జీవితంలో నాణ్యత లేకుండా పోయింది. ఇది నా జీవితం అని చెప్పుకునే జీవితం మిగల్లేదు. కుర్రాళ్లు ఇప్పటి సమాజంలో ఉన్న మానసిక స్థితిని ప్రతిబింబించడానికి ప్రయత్నిస్తున్నారు. తమదైన భాషలో రాస్తున్నారు. ఈ సంక్లిష్టస్థితిలో తమ లోపలి బాధను అక్షరాల్లో పెడుతున్నారు. ఇది మొత్తం సమాజంలో ఉన్న దుఃఖమేనని గుర్తించాలి.

ఇప్పుడు భాష కూడా మారిందంటారా?

సామాజిక సన్నివేశం మారినప్పుడు వస్తువు మారుతుంది. వస్తువుకు అనుగుణమైన భాష కవి ఎన్నుకుంటాడు. అలంకారాలు కూడా కొత్తవి వస్తాయి. ఇంతవరకు సాహిత్యం చూడని అలంకారాలు కూడా రావచ్చు. గమనించవలసిన విషయమేమంటే, కొత్త కవులు దేన్ని వాడాలన్నా సంకోచించడం లేదు. ఈ మాట వాడితే ఎవరేమన్నా అనుకుంటారేమో అనే ఊగిసలాట లేదు. చాలా ధైర్యంగా రాస్తున్నారు. తాను ఏది కరక్టు అనుకుంటే అదే మాట వాడుతున్నాడు. కొత్త తరానికి అధ్యయనం పట్ల ఆసక్తి లేదని, చదవడం లేదని ఎవరైనా చెబితే నేను ఒప్పుకోను. మనం అనుకుంటున్నది వాళ్లు చదవకపోవచ్చు. కాని వాళ్లు చదవవలసినవి, చదవాలనుకుంటున్నవి చదువుతున్నారు. ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత తన ఇష్టమొచ్చింది చదివే అవకాశం దొరికింది. గతంతో పోల్చితే సాంప్రదాయికంగా ఫలానా ఫలానా పుస్తకాలు చదవాలన్న క్రమం ఇప్పుడు లేదు. మేము నన్నయ్యాదుల నుంచి మొదలుపెట్టి చదివాం. ఇప్పుడు కొత్త కవులకు ఆ క్రమాన్ని పాటించవలసిన అవసరం లేదు. ఆ ట్రెడిషనల్ ఓరియంటేషన్ లేదు. గురజాడతో తన అధ్యయనం మొదలెట్టవచ్చు లేదా శ్రీశ్రీతో మొదలెట్టవచ్చు. కాని ఒక విషయం చెప్పాలి. దీర్ఘకాలికంగా కవిగా నిలబడాలనుకుంటే, కవిగా విస్తరించాలనుకుంటే సాంప్రదాయిక సాహిత్య పరిచయం అవసరం. అప్పుడప్పుడు మంచిపద్యం రాయడం వేరు. కాని పదేళ్లు, ఇరవయ్యేళ్లు కవిగా కొనసాగుతూ రాస్తూ ఉండాలంటే ఈ సాహిత్య పరిచయం అవసరం. కనీసం ఆధునిక కవిత్వం దగ్గరి నుంచైనా చదవాలి. కవిత్వ పరిణామం తెలుసుకోవాలి. శ్రీశ్రీ మహా ప్రస్థానం నాటి స్థితి ఇప్పుడు లేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆధునిక కవిత్వం పరిణామాన్ని తెలుసుకోవాలి. ఏదీ చదవకుండా కవిగా నిలబడడం కుదరదు. గొప్ప టాలంట్ ఉన్న యువకవులున్నారు.

తమ ప్రతిభను విస్తృతపరచుకుని ముందుకు సాగాలంటే అధ్యయనం అవసరం.

అధ్యయనం మీకు ఎలా ఉపయోగపడింది?

ఇన్నాళ్లుగా నేను సంపాదించుకుంది ఒక పెద్ద లైబ్రరీ. అందుకే కొత్త కవులతో తరచు చెబుతుంటాను. ఏకాంతంగా కూర్చుని ఉన్నప్పుడు నీ చుట్టు ఉండేది పుస్తకాలే కాని మనుషులు కాదు. మనిషిని కుంగుబాటు నుంచి ఒక్క కవిత రక్షించవచ్చు. కవి తన్ను తాను మార్చుకోకుండా, తన నిర్మాణం చేసుకోకుండా ఇంకెవరినీ సంస్కరించలేడు. ఇక్కడ వ్యక్తి ముఖ్యమా అంటే వ్యక్తే ముఖ్యం. వ్యక్తి లేకపోతే సమూహం లేదు. వ్యక్తి మానసికవైఖరి అనేది చాలా ముఖ్యమైనది. వ్యక్తిత్వం అంటే అదే. మొత్తం జీవితమే ఒక నిర్మాణ క్రియ. కవిత్వం కూడా నిర్మాణ క్రియే. హైదరాబాదు వచ్చినప్పుడు తొలిరోజుల్లో ఉన్న ఒంటరితనాన్ని, అధ్యయనం, ఆత్మవిమర్శలతో నిర్మాణాత్మకంగా మలచుకోవడం ప్రారంభమైంది. ముఖ్యంగా మార్క్సిజాన్ని అధ్యయనం చేయడం. మార్క్సిజం పరిణామశీలమైంది.

పల్లెలకు, నగరాలకు మధ్య జీవన వైరుధ్యం పెరిగిందంటారా? ఇప్పుడు రాస్తున్న కవుల్లో ఈ వైరుధ్యం ప్రభావం ఎంత ఉంది?

పల్లెల్లో పుట్టి పెరిగి, అక్కడే చదువుకుని నగరానికి వచ్చిన వాడికి ఒక ద్వైదీస్థితి ఉంటుంది. నగర వాతావరణం వేరు, జీవితం వేరు, పల్లె వాతావరణం వేరు, జీవితం వేరు. ఈ రెండు స్థితుల ఘర్షణను అనుభవించి రాసినప్పుడు గొప్ప కవిత్వం వస్తుంది. ఇప్పుడు గ్రామాలు కూడా నగరాల్లా మారిపోతున్నాయి. నేను చెప్పేది జీవన విధానానికి సంబంధించింది. గ్లోబలైజేషన్ చేసిన పనేమిటంటే ఆహారాన్ని జనరలైజ్ చేసింది. ఇప్పుడు పెళ్లి భోజనం మా ఊళ్లో తిన్నా, తెనాల్లో తిన్నా, హైదరాబాద్‌లో తిన్నా ఒక్కటే. అదే మెను కనిపిస్తుంది. అంటే కొన్ని కొన్ని విషయాలు జనరలైజ్ అయిపోయాయి. ఇవి అర్థం కావాలంటే ప్రపంచకవులందరినీ చదివితే చాలా విషయాలు అర్థమవుతాయి. దార్విష్‌ని చదివితే, కేదార్‌నాథ్ సింగ్‌ను చదివితే, అశోక్ వాజపేయిని చదివితే, ఇలాంటి వేర్వేరు ప్రాంతాల వేర్వేరు భాషల కవుల్ని చదివితే అనేక విషయాలు తెలుస్తాయి. అందరు జీవించేది జీవితమే. అందరి జీవితం ఒకటే. ఒకరు అన్నం తింటే మరొకడు రొట్టెలు తినవచ్చు. కాని అందరి ఆకలి ఒకటే. వేదన ఒకటే. అదే ముఖ్యం. ఇవన్నీ అర్థం కావాలంటే అధ్యయనం తప్ప మరో మార్గం లేదు.

జీవితాన్ని కవి ఎలా చూడాలి?

జీవితాన్ని తరచి తరచి చూడాలి. జీవితాన్ని పూర్తిగా అనుభవించాలి. మనకు అనుభవించడమే చేతకావడం లేదు. కొత్తకవులు నేర్చుకోవలసింది జీవితాన్ని అనుభవించడం... జీవితాన్ని అనుభవించడమంటే మెక్ డొనాల్డ్‌లో పోయి తినడం కాదు... సుఖ విలాసాలు కాదు... ఎలా ఉన్నామో ఆ స్థితిని ఎంజాయ్ చేయడం. ఉన్న జీవితం లోతులనే తరచి చూడడం. జీవితంలో ఉన్న సమస్తాన్ని అనుభవించాలి. దుఃఖాన్ని కూడా అనుభవించాలి.

బహుమానం

కె. శివారెడ్డి

రోజులు గడుస్తాయి
హాయిగానో అన్ హాయిగానో
ఆశతోనో నిరాశతోనో
రోజులకు రెక్కలతికిస్తామా!
బహుపక్ష పక్షి రోజు అలా ఎగురుకుంటూ
గాల్లో కలిసిపోతుంది

కిందున్న మనం
దాని కాలిగోళ్ల సందుల్లో యిరుక్కుని
కొట్టుకులాడుతున్న కాలాన్ని చూస్తాం
ఎండాకాలం నేల నెర్రెలు బారుతుంది
తొలకరి జల్లులు పడగానే- కదలబారి
అన్నీ కలిసిపోతాయి-

లోన్నుంచి ఒక పక్షి పైకి వస్తుంది
రోజులు జారతాయి- నీ కళ్ల నుంచో
నీ చేతివేళ్ల నుంచో-
నీ శరీరం పీఠభూమి విచ్చుకుంటుంది
రథం బయల్దేరుతుంది
తండోపతండాలుగా జనం రథం వెంబడే
మబ్బుల కింద- ఆకాశంలో
నీ చేయెత్తులో జండా ఎగురుతుంది
బహుశ నీ చేయే జండాగా రూపు దిద్దుకుంటుంది

ఒక్కొక్క రోజును
ఒక్కొక్క పూవులా వంచి వాసన చూస్తాను
తెంపను, తెంపితే అందం చెడుతుంది-
నాశనం చేయకుండా
ఆనందించటం, ఆరాధించటం
ప్రతిరోజూ, రోజుకి మనమిచ్చే బహుమానం

ఆదాయం పెరిగినా, సౌకర్యాలు పెరిగినా జీవనదుఃఖం మనిషిని వదలదు. దీన్నుంచి క్షణమాత్రమైనా స్వాంతన కావాలంటే కళను ఆశ్రయించాలి. ప్రపంచం మొత్తం దుఃఖం కౌగిలిలోనే ఉంది. దాన్నుంచి బయటపడాలంటే కళ తప్ప మరో మార్గం లేదు. కళ అంటే సాహిత్యమో, కథో, కవితో ఏదైనా కావచ్చు. అప్పుడే దాన్నుంచి కొంత బయటపడతాం.

ఒంటరితనాన్ని కవిత్వం పోగొడుతుందన్నారు. ఎలాగో చెబుతారా? మీ విషయంలో ఎలా జరిగింది?

ఒంటరితనం అనేది తప్పనిసరిగా తోడుంటుంది. అది సృజనకారుడికైనా, వ్యక్తికైనా ఎవరికైనా సరే. నా ఒంటరితనం మా అమ్మ చనిపోయిన తర్వాతి నుంచి ప్రారంభమైంది. ఈ ఒంటరి

తనం నుంచి నన్ను రక్షించింది పని. వ్యవసాయం రక్షించింది. అధ్యయనం రక్షించింది. ఒంటరితనం అనేది క్రుంగుబాటుకు కారణం కావచ్చు. కాని నీ చుట్టు ఉన్న వ్యక్తుల్ని పరిశీలించడం, సామాజిక సమస్యలను పరిశీలించడం, వాటిని సృజన చేయడం... ఈ క్రమంలో ఒంటరితనానికి కారణం కనుక్కునే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒంటరితనం అనేది ఇతరులు అర్థం చేసుకోవడం లేదన్న భావం వల్ల రావచ్చు. ఆశించింది సాధించలేక పోవడం వల్ల రావచ్చు. కారణాలు చాలా ఉండొచ్చు. కాని సృజన కారుడికి ఒంటరితనం అనేది చాలా కీలకమైనది. ఇక్కడ ఒంటరితనం అంటే దుఃఖం కాదు. ఇది ఒకవిధంగా చెప్పాలంటే సమాధి వంటిది. ఈ ఒంటరితనం నుంచి నన్ను మార్క్సిజం కాపాడింది.

కవి పుట్టిన ప్రాంతం, కులం, మతం, అతని నేపథ్యం అతని కవిత్వంలో ఉంటుందంటారా?

ఒక కవి నాకో పుస్తకం ఇచ్చాడనుకోండి. అతని పేరు లేకుండా, అతనెవరో తెలియకపోయినా. ఆ కవిత్వం చదివి నేను అతనెవరో చెప్పగలను. ఎందుకంటే ఈ మూలాలన్నీ కవిత్వంలో అంతర్లగగా ఉంటాయి. వాటిని తొలగించడం సాధ్యం కాదు. అందువల్ల ప్రాంతం, పుట్టిన ఊరు, కులం ఇవి మనిషి జీవితంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆ విషయం మనకు తెలియకపోవచ్చు. తర్వాత విశ్లేషించుకుంటేనే అర్థమవుతుంది.

వచనకవిత్వం ఇంత ప్రాచుర్యం పొందడానికి కారణమేమిటి?

సింపుల్‌గా చెప్పాలంటే రూపం. కొందరు దీన్ని బూర్జువా రూపం అని విమర్శించడం కూడా ఉంది, కాని నా దృష్టిలో ఇది బూర్జువారూపం అనడం తప్పు. ప్రజాస్వామ్య పరిణామ ప్రక్రియకు ప్రతిబింబమే వచనకవిత్వం. ఉద్యమాల్లో పాటలు రావచ్చు. పాటలు ప్రజల్లో చొచ్చుకుపోవచ్చు. కాని పాటలు న్నప్పటికీ వచన కవిత్వం ప్రభావాన్ని చూసి భయపడినవాళ్లున్నారు. ఎందుకంటే సైద్ధాంతిక విమర్శను, విశ్లేషణను పాటలో చెప్పడం సాధ్యం కాదు. కాని సిద్ధాంతాన్ని వచనకవిత్వంలో చాలా ప్రభావ శీలంగా చెప్పవచ్చు. ఫిలాసఫీని దృశ్యమానం చేసి ఆకట్టుకునేలా చెప్పవచ్చు. దాంతోపాటు ఆలోచనల్లో ఫిలాసఫీని రంగరించేలా, ఆలోచనలను రేకెత్తించేలా చెప్పడం వచనకవిత్వం చేస్తుంది. ఇది ప్రజాస్వామిక ప్రక్రియ. ప్రజాస్వామిక స్పృహకి చిహ్నం వచన కవిత్వం. వచనకవిత్వానికి ఛందోబద్ధమైన నిబంధనలేమీ లేవు. ఎవరైనా, ఎలాగైనా రాయవచ్చు. వచనకవిత్వానికి రూపపరమైన ఆంక్షలు లేవు. ఆంక్షలు లేకపోవడం వల్ల కవుల ఊహ, అభివ్యక్తి అద్భుతంగా కవిత్వంలో కనిపించింది. అద్భుతమైన కవిత్వం, గొప్ప రూపకాలు, గొప్ప గొప్ప ఊహలు, ప్రతీకలు, ఉపమలు, ప్రతిమలు కవిత్వంలో వచ్చాయి. ఇంత ప్రగతి వచనకవిత్వంలో తప్ప మరెక్కడా కనబడదు. ఇంతమంది కవులు విస్తారంగా, అద్భుతంగా రాయడానికి కారణం వచనకవిత్వమే కదా.

~~ఈ యాభై సంవత్సరాల్లో ఏం చేశారన్నది ఒక్కమాటలో చెప్పమంటే...~~

విస్తారంగా నా ఊహాశక్తిని పెంచుకోవడం. వాస్తవాన్ని వాస్తవంగా చూపించడానికి ఊహ కావాలి. సినిమాలైనా సరే అంతే. బైసికల్ థీఫ్ గొప్ప సినిమా. ఎందుకు గొప్ప సినిమా అయ్యిందంటే వాస్తవాన్ని పెంచి అందరికీ కనిపించేలా చూపించారు. వాస్తవాన్ని elevate చేయడానికి అనంతమైన ఊహాశక్తి కావాలి.

మీ కవిత్వం గురించి మూడుముక్కల్లో చెప్పాలంటే ఏం చెబుతారు?

నా అధ్యయనం, ఉద్యమాలతో నాకున్న సంబంధం, నా పరిమితులకు లోబడి, నా శక్త్యానుసారం, వివిధ సామాజిక సందర్భాల్లో నన్ను నేను గాఢంగా వ్యక్తీకరించుకోడానికి నేను చేసిన ప్రయత్నమే నా కవిత్వం. నేను నా ప్రజలకేమిటో చెప్పే ప్రయత్నమే కవిత్వం. నా జీవితం నుంచి నన్ను విడదీసి నా సమాజం నుంచి నన్ను విడదీసి నా కాలన్నుంచి నన్ను విడదీస్తే నా కవిత్వమే మిగలదు.

కొత్తతరం కవులకు మీరిచ్చే సలహా?

విస్తృతంగా చదవండి. వీలయితే మన ప్రాచీన సాహిత్యం దగ్గరి నుంచి ఇప్పటి దాకా వచ్చిన కవిత్వం మొత్తాన్ని చదవాలి. కవిత్వ పరిణామమంటే ఒకరకంగా భాషా పరిణామం. అందినంత మట్టుకు పరభాషా కవిత్వాలనీ చదవాలి. ఒక సమాజాన్ని అర్థం చేసుకోడానికి సామాజిక దృష్టికోణం ముఖ్యం అవుతుంది. అది అలవరచుకోవాలి. కవిత్వం రాయడం జీవితాంతం చేసే పని అని గుర్తు పెట్టుకోవాలి.

చేతుల్లేని వర్తమానానికి చేతులు
కళ్లు లేని వర్తమానానికి కళ్లు
గుండె లేని వర్తమానానికి గుండె యివ్వాలని
ఒక సంచార యజ్ఞం చేస్తూ అతను...

శివారెడ్డిగారితో ముచ్చట్లలో మూడుగంటల సమయం ఎలా గడిచిపోయిందో తెలియలేదు. కవిత్వం గురించి ఆయనతో మాట్లాడవలసింది ఇంకా చాలా మిగిలిపోయిందన్న భావనతోనే చివరకు వీడ్కోలు తీసుకున్నాను.

తెలుగు వెలుగు సౌజన్యంతో



అబ్దుల్ వాహెద్ కవి, రచయిత, పాత్రికేయుడు. పుట్టింది పశ్చిమ గోదావరి జిల్లా గుండుగొలను. 'ధూళిచెట్టు,' కవిత్వ సంపుటి, 'మత్తకోకిల' తెలుగు గజల్ సంపుటి, ప్రసిద్ధ ఉర్దూకవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ జీవితం, కవిత్వంపై 'సోషలిస్టు సూఫీ ఫైజ్ అహ్మద్ ఫైజ్', అభ్యుదయ కవి మఖ్దూం మొహియుద్దీన్ జీవితం, కవిత్వంపై 'షాయరె తెలంగాణ మఖ్దూం' పుస్తకం ప్రచురించారు. గత మూడు దశాబ్దాలుగా హైదరాబాదులో నివాసం.

CRYSTAL
SONA MASOORI RICE
CRISTAL RIZ SONA MASOORI RICE

LAXMI
HOUSE OF SPICES



Item Code
4SMC25

Packing Size
2X20 LB

UPC Code
723246264783

Master case code
20723246264787

Distributed By : HOUSE OF SPICES (INDIA) INC. 127-40 Willets Point Blvd. Flushing NY 11368
customerservice@houseofspicesindia.com | www.hosindia.com


ICICI Bank Money2India

Exclusive offer! Only for the attendees of 'TANA 2019'

Celebrate the joy of sending more back home.

Get **60 paise** better rate* on your next 3 money transfers to India.

USE PROMO CODE: **TANA60**



Hurry! Limited period offer valid till
December 31, 2019

Scan the QR code here

or visit:
www.icicibank.com/event

Transfer money in 3 easy steps

Select a previous transaction → Review the details → Confirm & pay


Offer Terms and conditions apply: Offer applicable on doing your next transaction using the promo code TANA60 within the offer period. Offer cannot be clubbed with any other preferential exchange rate offer

Eg: Remittance of USD 100 @ sample rate of INR 65/USD. Use TANA60 promo for bonus of 60 paise, you will get a rate of 65.60 which will yield INR 6560.

ICICI Bank Limited New York Branch ("ICICI New York") is an OCC regulated federal branch office of ICICI Bank Limited ("ICICI Bank"), a bank incorporated in India and regulated by the Reserve Bank of India ("RBI"). These products and services are provided in the United States of America by ICICI New York and are subject to product specific terms & conditions. The products are not eligible for or covered by deposit insurance of the Federal Deposit Insurance Corporation ("FDIC"). Please familiarize yourself with the terms and conditions applicable, available at http://www.icicibankusa.com/remittance_services/money2india/terms-and-conditions.page?. The products and services are also subject to applicable foreign and domestic regulations, prevailing foreign exchange regulations & other applicable Laws. ICICI New York reserves the right to modify or change all or any of the terms and conditions governing the products and services. ICICI New York also reserves the right to discontinue the products and services without assigning any reasons whatsoever. Any references to timelines or service levels are only indicative and should not be construed to refer to any commitment by us or any other service provider.

DFCBUI_2019_APR_ICICI_11175410_PN_SIZE_8.5 (W) X 11 (H) IN_MAGAZINE AD

విషయసూచిక



ఈ ఆవరణంలో...

1.	తెలుగు భాష, సాహిత్య వికాసంలో తానా	డా॥ జంపాల చౌదరి	18
2.	అమరావతి పరిసర దేవాలయాలు	డా॥ ఈమని శివనాగిరెడ్డి స్థపతి	25
3.	కాళహస్తి కలంకారీ కథ	ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు	34
4.	నేల నాలుగు చెరగులా తెలుగు గుబాళింపే	వాసిరెడ్డి నవీన్	39
5.	చిత్రకళా తపస్వి వడ్డాది పాపయ్య	బీర శ్రీనివాస్	42
6.	Recent Advancement of Telugu in South India	Akkaraju Sarma	44
7.	తెలుగులో బాల సాహిత్యం	డా॥ గంగిశెట్టి శివకుమార్	46
8.	విస్తరిస్తున్న బాలోత్సవ సంస్కృతి-నేపథ్యం	డా॥ వాసిరెడ్డి రమేష్‌బాబు	49
9.	చారిత్రక నవల - తులనాత్మక పరిశీలన	డా॥ రమేష్ రావెళ్ల	52
10.	ఒకసారి వెనక్కి....	డా॥ పాపినేని శివశంకర్	58
11.	ఆంధ్ర మహిళాసభ	లలితకుమారి చతుర్వేదుల	61
12.	అనగనగా ఒక రాజ్యం	దాసరి అమరేంద్ర	63
13.	మనకి మంచి హాస్య నవల రాదేమి?	పన్నాల సుబ్రహ్మణ్య భట్టు	69
14.	సినిమాటోగ్రాఫిక్ సోల్జర్	డా॥ రెంటాల జయదేవ	73
15.	తొలితరం స్త్రీల కథలు	కె.ఎన్. మల్లీశ్వరి	79
16.	యువత-మనోభావాలు	డా॥ పద్మజ సందిగామ	82
17.	చెప్పాలని ఉంది... గుండె విప్పాలని ఉంది	జ్యోతి పిశుపాటి	84
18.	తెలంగాణ సాహిత్య అకాడమి ప్రస్థానం	డా॥ ఏసుగు నరసింహారెడ్డి	86
19.	తెలుగు సినిమాని మలుపు తిప్పిన దశాబ్దం	వెంకట్ శిద్ధారెడ్డి	89
20.	పేదపిల్లల పెన్నిధి పద్మశ్రీ ప్రకాశరావు	శ్రీకాంత్ కాశెట్టి	96
21.	Preventing Another Farmington	Santosh Reddy	98
22.	Jumping In	Bhavana Bhattiprolu	100
23.	పాటే ప్రాణంగా...	ముంజులూరి కృష్ణకుమారి	102

తానా భాష, సాహిత్య సేవ

తెలుగు భాష, సాహిత్య వికాసంలో తానా

డా॥ జంపాల చౌదరి

నలభై రెండేళ్ల తన ప్రస్థానంలో తెలుగు సాహిత్యము, భాషావికాసాలకు తానా ప్రముఖమైన పాత్ర పోషించింది. ఆ కృషి పుస్తక ప్రచురణ, నవలల-కథల పోటీల నిర్వహణ, తెలుగు భాషా పురస్కారాలు వంటి విస్తరణ కార్యక్రమాలతో కొనసాగుతున్న వైనం...

నలభై రెండేళ్ల క్రిందట, 1977లో న్యూయార్క్ నగరంలో డా. గుత్తికొండ రవీంద్రనాథ్, డా. కాకర్ల సుబ్బారావుల నాయకత్వంలో అమెరికా తెలుగువారు మొదటి ఉత్తర అమెరికా తెలుగు మహాసభలు జరుపుకొని, అమెరికాలో తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షించుకోవటం, వ్యాప్తి చేయటం ఆశయాలుగా ఉత్తర అమెరికా తెలుగు సంఘాన్ని (ఆంగ్లంలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, సంక్షిప్తంగా TANA - తానా) ఏర్పరచుకొన్నప్పటి నుంచి తానా ఆశయాలు భాష, సాహిత్యం, సంస్కృతులతో ముడిపడి ఉన్నాయి. అమెరికాలో తెలుగుభాష నేర్చుకోవటానికి వీలు కల్పించడం, తెలుగు సాహిత్య కార్య క్రమాలు నిర్వహించడం, తెలుగు భాష వ్యాప్తికి సహకరించడం సంస్థకు ముఖ్యమైన ఆశయాలుగా తానా సంస్థాపక సూత్రాల్లోనూ, రాజ్యాంగంలోనూ స్పష్టంగా నిర్వచించబడ్డాయి. సంస్థ ప్రారంభం నుంచి తానా ఈ ఆశయాలను సాధించడానికి నిరంతరంగా, బహుముఖాలుగా కృషి చేస్తూనే ఉంది. ఆ కృషిలో కొన్ని ముఖ్యాం శాల్ని కొన్నిటిని ఇక్కడ పరిచయం చేస్తాను.

తెలుగు భాషా బోధన

పిల్లలు తెలుగు నేర్చుకోవటంకోసం పాఠశాల సంస్థతో కలసి అనేక నగరాలలో తానా కార్యకర్తలు 2015 నుంచి తెలుగు బడు లను నిర్వహిస్తున్నారు. ఏటా వేలాదిమంది చిన్నారులు ఈ పాఠశాలలో తెలుగు నేర్చుకొంటున్నారు. ప్రాథమిక స్థాయిలో తెలుగు నేర్చుకునేవారి కోసం బాపు-రమణలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోసం తయారుచేసిన వీడియో పాఠాలను, తానా 1990-93 మధ్యలోనే సభ్యులకు సరఫరా చేసింది. తానాపత్రికలో తెలుగు పాఠాలు ప్రచురించటమే కాక, తెలుగు నేర్చుకోవడానికి బొమ్మల అక్షరాల పుస్తకాలను కూడా సభ్యులకు అందజేసింది.

విశ్వవిద్యాలయ స్థాయిలో...

అమెరికాలో విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగు నేర్పటానికీ, తెలుగుభాషలో పరిశోధనలు జరగటానికీ, అనువైన వాతావరణం కల్పించటానికి తానా కృషి చేస్తుంది. పూర్వం విస్కాన్సిన్ (మాడిసన్) విశ్వవిద్యాలయంలో తెలుగు క్లాసులు నడుస్తున్న రోజుల్లో, తెలుగు నేర్చుకుందామని ముందుకు వచ్చిన విద్యార్థు లకు తానా ఫౌండేషన్ ఉపకారవేతనాలు ఇచ్చేది. తర్వాత మిచిగన్ (యాన్ ఆర్బర్) విశ్వవిద్యాలయంలో ఐదేళ్లపాటు తెలుగు నేర్పే అధ్యాపకులకు వేతనం ఇవ్వడానికి తానా నిధులు సమకూర్చింది. ఒక దశాబ్దం పాటు ఆస్టిన్ నగరంలో ఉన్న టెక్సాస్ విశ్వవిద్యా లయంలో తెలుగు తరగతులు నిర్వహించటానికీ, అధ్యాపకుల వేతనాలకీ తానా నిధులు సమకూర్చింది. ఏటా చాలామంది విద్యా ర్థులు ఇక్కడ తెలుగు నేర్చుకున్నారు. వీరిలో భారతసంతతివారే కాక, విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా ఉన్నారు.

పిల్లల తెలుగు జ్ఞానాన్ని పెంపొందించటం కోసం 2003 నుంచి తెలుగు పదవిజ్ఞాన పోటీలను వివిధ నగరాలలోనూ, ద్వైవార్షిక సమావేశాలలోనూ తానా నిర్వహిస్తుంది. ఇప్పుడు తెలుగు పాఠాలు నేర్చుకోవడానికి వీలయ్యే వర్క్‌బుక్స్‌ను ప్రచురించటానికి, బాలలలో తెలుగుపై ఆసక్తి పెంచటానికి ప్రత్యేకంగా నాణ్యతగల పిల్లల తెలుగు పుస్తకాలు ప్రచురించటానికి తానా సన్నాహాలు చేస్తుంది.

విద్యార్థుల పర్యటనలు: అమెరికాలో ఉన్న తెలుగు సంతతి వారికి తెలుగు జీవితం, సంస్కృతి, భాషలు పరిచయం చేయటానికి విద్యార్థి బృందాలను ఎంపిక చేసి, ఉపకార వేతనాలు ఇచ్చి ఆంధ్రప్రదేశ్ యాత్రలు నిర్వహించింది.

ఎల్లలు లేని తెలుగు

తెలుగు రాష్ట్రాల బయట ఉన్న లక్షలాది తెలుగువారిలో చాలామందికి తెలుగు నేర్చుకొనే సదుపాయాలు లేకపోవటంతో వారు వారి మాతృభాషకు దూరమవుతున్నారు. ఈ సమస్య మన సరిహద్దు రాష్ట్రాలలో మరీ ఎక్కువగా కనిపిస్తుంది. వీరికి తెలుగు నేర్చుకొనే సదుపాయాలు కల్పించటానికి, 2015లో నేను అధ్యక్షుని గా ఉన్నప్పుడు తానా 'ఎల్లలు లేని తెలుగు' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. శ్రీ సవెం రమేస్ సారధ్యంలో, మద్రాసుకు చెందిన తెలుగువాణి సంస్థ, ఉడుములపేటకు చెందిన మార్టూరు వసంత్ నాయుడుల సహకారంతో హోసూరు ప్రాంతంలోనూ, కోయంబత్తూరు ప్రాంతంలోనూ ఉన్న తెలుగువారిలో దాదాపు పదివేలమంది తెలుగు వారికి తెలుగు చదవడం, రాయడం నేర్పించింది. ఈ పథకానికి డెట్రాయిట్ నివాసులు శ్రీ కన్నెగంటి రామారావు, మాధవి దంపతులు ఆర్థికంగా సహాయం చేశారు.

ఎల్లలు లేని తెలుగు ఎప్పటికీ వెలుగు అన్న ముఖ్యాంశంతో జరుపుకున్న 2017 తానా సమావేశంలో ఈ విషయంపై ఒక సదస్సును నిర్వహించాము.



తానా సమావేశాల్లో సాహిత్యసభలు

తొలిరోజుల నుంచి తానా సమావేశాల్లో సాహిత్యాభిమానుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయటం జరుగుతూంది. 1980లో చికాగోలో జరిగిన మూడవ సమావేశానికి మహాకవి శ్రీశ్రీ, దాశరథి, సి. నారాయణ రెడ్డి, మల్లెమాల (ఎం.ఎస్. రెడ్డి), త్రిపురనేని మహారథి వంటి కవులు, రచయితలు ప్రత్యేక అతిథులుగా రావటంతో సమావేశ ప్రారంభోత్సవం కవిసమ్మేళనంలా అనిపించింది. అప్పటినుంచి ఇప్పటివరకు వందలాది రచయితలు తానా కార్యక్రమాలకు అతిథులుగా వచ్చారు. శ్రీయుతులు ఆరుద్ర, కాళీపట్నం రామారావు, మధురాంతకం రాజారాం, పి.కృష్ణారెడ్డి, స్మైల్, జగ్గయ్య, ఓల్గా, జయప్రభ, కాత్యాయనీ విద్మహే, మృణాళిని, గొల్లపూడి మారుతీరావు, కె. శివారెడ్డి, వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్, చంద్రలత, సూర్యదేవర రామ్మోహనరావు, ముదిగొండ శివప్రసాద్, నవోదయా రామ్మోహనరావు, కడియాల రామ్మోహనరాయ్, నాగభైరవ కోటేశ్వరరావు, యార్లగడ్డ బాల గంగాధరరావు, వేటూరి సుందరరామమూర్తి, సిరివెన్నెల సీతారామ శాస్త్రి, సుద్దాల అశోక్‌తేజ, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కిరాజు సుందరరామకృష్ణ, ప్రసాద రాయ కులపతి, యేలూరిపాటి అనంతరామయ్య, భద్రిరాజు కృష్ణమూర్తి, ఐ. వెంకట్రావు, ఆర్. ఉమామహేశ్వరరావు, సోమరాజు సుశీల, స.వెం. రమేశ్, చందు సుబ్బారావు వంటి ప్రసిద్ధ రచయితలు, కవులు, పండితులు, విమర్శకులు, ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, పాత్రికేయులు తానా మహాసభల సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రముఖ రచయిత, పరిశోధకుడు, విమర్శకుడు, అనువాదకుడు, తెలుగు బోధకుడు ఆచార్య వెల్చేరు నారాయణ రావును 2007లో తానా జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించింది. 2011లో బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ గొల్లపూడి మారుతీ రావును తానా ప్రత్యేక పురస్కారంతో గౌరవించింది. శ్రీ సుద్దాల అశోక్ తేజ, శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి గార్లను తానా-యన్టీఆర్ తెలుగు సంస్కృతి సేవా పురస్కారంతో గౌరవించింది.

2001 తానా సమావేశాల ప్రదర్శన కోసమే ప్రత్యేకంగా ఇంద్రగంటి శ్రీకాంతశర్మ 'ఆగతానికి స్వాగతం' అనే ప్రత్యేక సాహితీ చరిత్రాత్మక రూపకాన్ని రచించారు. 2009, 2015, 2017 సమావేశ ఆరంభ నృత్యాల కోసం శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి, 2013 సమావేశం కోసం శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు రచించిన గేయరూపకాలు ప్రశంసలు పొందాయి.

అవధాన హేల

1989లో తానా సమావేశాలకు ప్రత్యేక అతిథిగా వచ్చిన శ్రీ మేడసాని మోహన్ అష్టావధానాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల మెప్పును పొందారు. అప్పటినుంచి ప్రతి తానా సమావేశంలోనూ సాహితీ ప్రియుల నుంచి అత్యాదరణ పొందే ప్రక్రియ అవధానమే.

సమావేశ స్థలంలో అన్నిటికన్నా పెద్ద బాల్ రూమ్‌లో వేయికిపైగా ప్రేక్షకులు అవధానాన్ని అవధరించటానికి ఏర్పాట్లు చేస్తుంటారు. మోహన్‌గారే కాక శ్రీయుతులు మాడుగుల నాగఫణిశర్మ, గరికపాటి నరసింహారావు, రాళ్లబండి కవితాప్రసాద్, నరాల రామిరెడ్డి, ఇతర అవధానులు విడివిడిగానూ, కలివిడిగానూ తమ విద్యను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అవధానాలతో పాటు, భువనవిజయం, ఆగతానికి స్వాగతం వంటి సాహిత్య రూపకాలు కూడా తానా సమావేశాలలో మంచి ప్రేక్షకాదరణ పొందాయి.

తానా సభల్లో తెలుగు పుస్తకాలు



తానా మహాసభల సందర్భంగా ప్రత్యేకంగా తెలుగు పుస్తకాలు ప్రచురించి, ఆవిష్కరించటం ఒక ఆనవాయితీ. 1991 అట్లాంటా సమావేశం సందర్భంగా ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర రెండో ప్రచురణ ఆవిష్కరించారు. 1993లో న్యూయార్క్ సభల సందర్భంగా తానా ప్రచురించిన, 'తానా తెలుగు కథ' (సంపాదకుడు శ్రీ ఏ.ఎస్.మూర్తి), 'మంచుతునకలు' (సంపాదకుడు శ్రీ పెమ్మరాజు వేణుగోపాలరావు) కవితాసంకలనాలు చాలా ప్రశంసలు పొందాయి. అప్పుడే తానా ప్రత్యేకంగా ప్రచురించిన కాళీపట్నం రామారావుగారి 'యజ్ఞంతో తొమ్మిది' కథా సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు రావడం తానాకు గర్వ కారణం.

1995 చికాగో సమావేశంలో తానా బాపు-రమణల స్వర్ణోత్సవం జరిపిన సందర్భంలో వారిద్దరి మొదటి ప్రచురణల గుర్తుగా 'బొమ్మా-బొరుసు' అనే పుస్తకాన్ని ప్రత్యేకంగా ప్రచురించారు. ఆ సమావేశానికి కీలకోపన్యాసకుడుగా వచ్చిన శ్రీ కొంగర జగ్గయ్య తన 'గీతాంజలి' అనువాదాన్ని ఆవిష్కరిస్తే, ఇంకో గౌరవ అతిథి శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తన 'ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇదే సందర్భంలో భమిడిపాటి రామగోపాలం 'బాపురమణలకు నూటపదహార్లు' అంటూ ప్రచురించిన 'సరదా కథలు', స్మైల్ 'ఖాళీ సీసాలు' కథాసంకలనం, కె. సదాశివరావు 'క్రాస్ రోడ్స్' కథాసంకలనం ప్రచురించబడ్డాయి. ఇలా తానా సమావేశాల సందర్భంగా ప్రత్యేకంగా ప్రచురించి ఆవిష్కరించిన పుస్తకాల జాబితా చాలా పెద్దదే.

తెలుగు ప్రచురణలు


తెలుగు పలుకు: తానా సమావేశాల జ్ఞాపికలు (సావెనీర్లు)

1977 నుంచీ ప్రతి తానా సమావేశానికి, 'తెలుగు పలుకు' అన్న పేరుతో ఒక జ్ఞాపిక (సావనీరు)ను ప్రచురించటం సంప్రదాయం. సమావేశం వివరాలు, అమెరికా అంధ్రుల రచనలు,




సావెనీరుకోసం ఇండియా నుంచి తెప్పించుకున్న ప్రత్యేక రచనలతో సర్వాంగసుందరంగా తయారయ్యే ఈ ప్రత్యేక సంచికలు నిజంగా దాచుకోదగ్గవి. మొదట్లో ఈ సావెనీర్లను ఇండియాలో అచ్చు వేయించేవారు. తర్వాత ఇండియాలో కంపోజ్ చేయించి అమెరికాలోనే ముద్రించటం మొదలైంది. 1991 అట్లాంటా తానా సమావేశం కోసం డా. రవి శర్మ సంపాదకత్వంలో తొలిసారిగా సావనీర్లో కొంత భాగాన్ని కొత్తగా అందుబాటులోకి వచ్చిన సాంకేతికత ఉపయోగించి అమెరికాలోనే కంపోజ్ చేశారు. 1995లో నా సంపాదకత్వంలో వచ్చిన సావెనీరు మొత్తం చికాగోలోనే కంపోజ్ చేసి ముద్రించాము. ఈ ఒరవడి కొన్నాళ్లు సాగింది కానీ, ఇప్పుడు ఇండియాలో డిటిపి, పేజ్ మేకప్ చేయించుకుని, ఇంటర్నెట్లో ఫైళ్లు తెప్పించుకుని అమెరికాలో ముద్రించడం జరుగుతుంది. కొన్ని తానా సావెనీర్లు ప్రత్యేకాంశాల మీద దృష్టి పెట్టి తగిన వ్యాసాలు వ్రాయించి, సేకరించి, సమీకరించటం వల్ల (ఉదాహరణకు 1995, 2009 సావెనీర్లలో ఆంధ్రుల చిత్రకళపై వ్యాసాలు, చిత్రాలు) ఆ విషయాలపై ఆసక్తి ఉన్నవారు సేకరించి దాచుకొనే స్థాయిలో ఉంటాయి.

తానాపత్రిక




తానా సంస్థాగత విషయాలను సభ్యులకు చేర్చటంకోసం ఏర్పాటు చేసుకున్న పత్రిక తానా పత్రిక. ఈ పేరు పెట్టింది అప్పటి సంపాదకులు స్వర్గీయ కిడాంబి రఘునాథ్. 1989 వరకు పత్రిక అప్పుడప్పుడూ వచ్చేది. నల్లమోతు సత్యనారాయణగారు తానా అధ్యక్షులుగా ఉన్నప్పుడు పత్రికను శ్రీ చెరుకుపల్లి నెహ్రూ సంపాదకత్వంలో ప్రతి నెలా ప్రచురించటం మొదలుబెట్టి సంస్థను సభ్యులకు దగ్గరగా తెచ్చారు. 1993లో యలవర్తి రామరాజభూషణుడు, నేను సంపాదకులుగా ఉన్నప్పుడు పత్రికలో సంస్థాగత విషయాలతోపాటు, సాహిత్య



సాంస్కృతిక విషయాలకు ప్రాధాన్యత ఇచ్చి, పత్రికను అందంగా తయారుచేయడంతో పత్రికకు ఆదరణ బాగా పెరిగింది. 1993 నుంచి 2004 వరకూ (కొద్ది విరామంతో), తిరిగి 2013 నుంచి 2015 వరకు తానా పత్రికకు సంపాదకునిగా పనిచేసే అవకాశం నాకు కలిగింది. ఇప్పటి సాంకేతిక వనరులు ఆరోజుల్లో లేకపోయినా, అందంగా, ఆకర్షణీయంగా పత్రికను తీర్చిదిద్దటంలో, పాఠకులకు ఆసక్తి కలిగించడంలో కృతకృత్యులయ్యామనే భావిస్తాను. శ్రీయుతులు వంగూరి చిట్టెన్‌రాజు, కన్నెగంటి చంద్రశేఖర్, కిరణ్‌ప్రభ వివిధ దశలలో సంపాదక బాధ్యతలు నిర్వహించారు. గత రెండేళ్లుగా శ్రీ గొర్తి బ్రహ్మానందం సంపాదకులుగా ఉంటున్నారు. 2015 నుండి తానాపత్రిక ప్రధానంగా ఎలక్ట్రానిక్ పత్రికగా మారింది; సంవత్సరానికి ఒకటి, రెండుసార్లు అచ్చుపత్రిక సభ్యులందరి గృహాలకు చేరుతుంది.

తానా నవలల, కథల పోటీలు

ఇండియాలో పత్రికలతో కలసి తానా కథల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వటం ఎప్పటినుంచో ఉంది. తెలుగు సాహితీరంగంలో పెనుమార్పులు వచ్చి, సరైన ప్రోత్సాహం, ప్రచురించే మార్గాలు లేక నాణ్యత గల నవలలు మృగ్యమైపోతున్న సమయంలో నవలా రచనను ప్రోత్సహించే ఉద్దేశంతో, 1997 లాస్ ఏంజెల్స్ తానా సమావేశం సందర్భంగా మూడువేల డాలర్లు (అప్పట్లో లక్షా ముప్పై వేల రూపాయలు) బహుమతితో నవలల పోటీ నిర్వహించటానికి శ్రీ మురళి చందూరి తలపెట్టారు. ఆహ్వానం పత్రిక సహకారంతో నడిపిన ఈ మొదటి పోటీకి మురళిగారితోపాటు, నేను, కనకప్రసాద్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించాము. శ్రీమతి చంద్రలత వ్రాసిన నవల 'రేగడివిత్తులు' ఆ సంవత్సరం బహుమతిని గెల్చుకొంది. ఆ నవల, బహుమతి మొత్తం రెండూ పెద్ద సంచలనమే సృష్టించాయి.



మొదటి నవలల పోటీ జయప్రదం కావడంతో 1999, 2001, 2003, 2005 సమావేశాల వరకు తానా ప్రచురణ కమిటీ తరపున నవలలు, కథల పోటీలు నా ఆధ్వర్యంలో నిర్వహించాము. స్వాతి పత్రిక, కథాసాహితి సంస్థ ఈ పోటీలు నిర్వహించటంలో సహాయం చేశాయి. తెలుగునాట ప్రసిద్ధ రచయితల్లో చాలామంది ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ కాశీభట్ల వేణుగోపాల్



వ్రాసిన 'తపన' నవలకు 1999లో లక్షరూపాయల బహుమతి లభించింది. కాలక్రమేణా ఇండియాలోనూ పెద్ద ప్రైజు మొత్తాలతో పోటీలు నిర్వహింపబడటం, తానా నిర్ణయించుకొన్న ప్రమాణాల స్థాయి రచనలు రాకపోవడం వంటి కారణాల వల్ల ఈ పోటీలను కొన్నాళ్లు నిలిపివేసి మళ్లీ 2017లో, బహుమతిని రెండు లక్షల రూపాయలకు పెంచి, నవలల పోటీలను తిరిగి ప్రారంభించాము. ఈ పోటీలో విజేతలుగా నిలచిన మూడు నవలలు 'ఒంటరి' ((శ్రీ సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి), 'నీల' (శ్రీమతి కె.ఎన్. మల్లీశ్వరి), 'శప్తభూమి' (బండి నారాయణస్వామి) విమర్శకులని మెప్పించటమే కాక, ఒక్క నెలలోనే రెండో ముద్రణకు వెళ్లి పాఠకుల మన్ననలు కూడా పొందాయి. 2019లో కూడా తానా ఈ నవలల పోటీని నిర్వహిస్తూంది.

తానా ప్రచురణల కమిటీ

1997లో నేను తానా ప్రచురణల కమిటీ అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి, తెలుగు సాహిత్య విస్తరణకు ప్రోత్సాహం ఇచ్చే అనేక కార్యక్రమాలను కమిటీ తరపున చేపట్టాము. 2015 నుండి శ్రీ కన్నెగంటి చంద్రశేఖర్ ఈ కమిటీ అధ్యక్షులుగా పని చేస్తున్నారు.

కథ వార్షిక సంపుటాలు




తెలుగులో ప్రతి సంవత్సరం వచ్చే ఉత్తమకథలను ఎంపిక చేసి వార్షిక సంపుటాలుగా ప్రచురిస్తున్న కథా సాహితి సంస్థకు గత పదమూడేళ్లుగా ప్రతి సంవత్సరం తానా ప్రచురణల కమిటీ ఆర్థిక సహకారాన్నందిస్తుంది. ఈ సహాయంతో తెలుగులో మంచి కథలను ప్రతి సంవత్సరమూ గుర్తించి భద్రపరచటమే కాక ఈ కథాసంపుటాలను తక్కువ ధరలో ఎక్కువమంది పాఠకులు అందుకోగలుగుతున్నారు. 1999-2009 సంవత్సరాల మధ్య తెలుగులో వచ్చిన 30 ఉత్తమ కథలను ఎంపిక చేసిన 'రెండు దశాబ్దాలు' కథా సంకలనం ప్రచురణకు కూడా తానా ప్రచురణల కమిటీ సహాయ మందించింది.

తానా ప్రచురణలు



వ్యాపార ప్రచురణకర్తలు ప్రచురించలేని ముఖ్యమైన తెలుగు పుస్తకాలు మరుగున పడిపోకుండా పాఠకులకు అందు బాటులో ఉంచడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తానా ప్రచురణలు-వేంకటాధ్వరి ప్రాసిన 'విశ్వగుణాదర్శం' చంపూ కావ్యం (ఇంద్ర గంటి శ్రీకాంతశర్మ వ్యాఖ్యానం), వెల్చేరు నారాయణరావుగారి సిద్ధాంత గ్రంథం 'తెలుగులోకవితా విప్లవాల స్వరూపం', 'కథ-నేపథ్యం' రెండు సంపుటాలు (సంపాదకులు: శ్రీయుతులు: ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు, జంపాల చౌదరి, వాసిరెడ్డి నవీన్), 'దిద్దుబాటలు' (దిద్దుబాటుకు ముందు తెలుగు కథానికలు; సంపాదకులు: శ్రీ వివినమూర్తి) పుస్తకాలను ప్రచురించింది. ప్రతి సంవత్సరమూ, కనీసం ఒక అరుదైన పుస్తకాన్ని ప్రచురించాలని ఈ కమిటీ ఆశయం.



అనువాదాలు

తెలుగు సాహిత్యానికి ప్రపంచసాహిత్యంలో గుర్తింపు రావాలంటే, నాణ్యత గల అనువాదాలు, ఆ అనువాదాలను అందరికీ అందించగల ప్రసిద్ధ ప్రచురణకర్తలు చాలా ముఖ్యం. ఈ ఉద్దేశంతో విస్కాన్సిన్ యూనివర్సిటీ వారు అంతర్జాతీయ పాఠకులు మొదటిసారిగా ఆధునిక తెలుగు కవిత్వాన్ని ఆస్వాదించటంకోసం 'Hibiscus On The Lake', An Anthology of Modern Telugu Poetry ప్రచురించటంలో తానా ప్రముఖపాత్ర వహించింది. అలాగే తెలుగులో ఆధునికోద్యమానికి తెరదీసిన శ్రీ గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం తెలుగు నాటకాన్ని ప్రపంచానికి పరిచయం చేయటానికి 'Girls For Sale' పేర ఇండియానా యూనివర్సిటీ ప్రచురించటానికీ తానా సహాయ పడింది. ఈ రెండు పుస్తకాలనూ ఆచార్య వెల్చేరు నారాయణరావు అనువదించారు.

కథానిలయం

తెలుగు కథను భద్రపరచి శాశ్వతత్వాన్ని కలుగచేయాలన్న ఉద్దేశంతో ప్రముఖ రచయిత శ్రీ కాళీపట్నం రామారావు శ్రీకాకుళంలో ఏర్పరచిన కథానిలయానికి తానా ప్రచురణల కమిటీ ఐదు లక్షల రూపాయల మూలధనం ఏర్పాటుచేసింది.

శతాబ్దిలో శతపుస్తకాలు


21వ దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, వెల్చేరు నారాయణరావు, చేకూరి రామారావు, జంపాల చౌదరి, కె.వి.ఎస్. రామారావు, కన్నెగంటి చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో ఇంటర్నెట్లో సర్వేలు, అనేక చర్చల అనంతరం 20వ శతాబ్దిలో వచ్చిన తెలుగు పుస్తకాలలో ఉత్తమమైన 100 పుస్తకాల జాబితాను తానా ప్రచురించింది.

తెలుగు కంప్యూటరీకరణలో తానా

తెలుగు ఖతులు (ఫాంట్లు)

కంప్యూటర్ల వాడకం, ఇంటర్నెట్ విస్తరిస్తున్న తొలిరోజులలో, 1995 చికాగో తానా సమావేశాల సందర్భంగా, తెలుగులో కంప్యూటరీకరణపై తానా ఒక ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఆ రోజుల్లో ఇంటర్నెట్లో, పర్సనల్ కంప్యూటర్లలో తెలుగు వాడకం కోసం కృషి చేస్తున్న శ్రీయుతులు తిరుమల దేశికాచారి, ముక్కవల్లి లక్ష్మణరావు, కన్నెగంటి రామారావు తదితరులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఆ సంవత్సరమే, శ్రీ దేశికాచార్యులు తయారుచేసిన పోతన తెలుగు ఫాంటును తానా ఖరీదు చేసి ఇంటర్నెట్లో తెలుగువారికి ఉచితంగా అందుబాటులో ఉంచింది. ఒక దశాబ్దంపాటు, వ్యాపార ఫాంట్లు వ్యాప్తిలోకి వచ్చేవరకూ, ఔత్సాహికులందరూ ఇంటర్నెట్లో, వెబ్‌సైట్లలో, పర్సనల్ కంప్యూటర్లలో ఈ పోతన ఫాంటునే వాడుతుండేవారు. 1995 తానా సావనీరు తెలుగు విభాగం మొత్తం ఈ పోతన ఫాంటుతోనే ముద్రించబడింది.

ఇంటర్నెట్లో తెలుగు డిక్షనరీలు



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో తెలుగువారు ప్రముఖ పాత్రలు పోషిస్తున్నా ఇంటర్నెట్‌లో తెలుగు మాత్రం ఉండవలసిన స్థాయికి ఇంకా చేరుకోలేదు. కొన్నాళ్ల క్రితం వరకూ తెలుగు పదానికి అర్థం కావాలంటే, ఇంటర్నెట్ తెలుగు వేదికల మీద తెలిసినవారిని సంప్రదించవలసిందే కాని స్వయంగా వెంటనే వెతుక్కునే అవకాశం ఉండేది కాదు. తెలుగుకు సంబంధించిన అన్ని నిఘంటువులనూ ఒక్కచోటకు తీసుకొనివచ్చి ఒక్క మౌస్ క్లిక్కుతో అందరికీ అందుబాటులో ఉంచాలనే ప్రయత్నం మొదలుబెట్టిన ఆంధ్ర భారతి సంస్థకు (నిర్వాహకులు: శ్రీయుతులు వాడపల్లి శేషతల్ప సాయి, కాలేపు నాగభూషణరావు) తానా ప్రచురణల కమిటీ చేయూతనిచ్చింది.

ఈరోజు తెలుగుమాటలకు అర్థాల్ని ఇంటర్నెట్‌లో వెదుక్కోవడం సులభ సాధ్యమయ్యింది.

http://andhrabharati.com/dictionary/index.php సైటుకు వెళ్తే (లేకపోతే http://andhrabharati.com/ సైటులో నిఘంటు శోధన పై క్లిక్ చేస్తే) తెలుగుమాటకు తెలుగు అర్థం, తెలుగుమాటకు ఇంగ్లీషులో అర్థం, ఇంగ్లీషు మాటకు తెలుగు

అర్థం, ఉర్దూ మాటకు తెలుగు అర్థం ఇప్పుడు సులభంగా తెలుసుకోవచ్చు. మీ వీలుని బట్టి మీకు కావలసిన మాటను ఇంగ్లీషులో కాని తెలుగులో కాని టైపు చేస్తే చాలు. ఇప్పటికి 46 నిఘంటువులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

ఈ ప్రాజెక్టు పూర్తయ్యేసరికి కనీసం 71 నిఘంటువులు (53,898 పేజీలు) ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఈ నిఘంటువుల్లో ప్రామాణిక సాంప్రదాయ నిఘంటువులతో పాటు, మాండలిక పదకోశాలు, వివిధ వృత్తుల పారిభాషిక పదాల, పర్యాయ పదాల నిఘంటువులు కూడా ఉంటాయి. వీటికితోడు, ఇంగ్లీషు, సంస్కృత, ఉర్దూ పదాలు, పురాణాల్లో వచ్చే పేర్లు, సంగీతం, ఆయుర్వేదం వంటి వివిధ శాస్త్రాల్లో వచ్చే పదాలు, సాంకేతిక పదాల అర్థాలు కూడా ఇక్కడ లభ్యమౌతాయి.

తెలుగు రచయిత వెబ్‌సైట్

తానా సహకారంతో 2016లో ప్రారంభించిన తెలుగు రచయిత (telugurachayita.org) వెబ్‌సైటులో తెలుగు రచయితల గురించి విస్తృతమైన వివరాలు పొందుపొరిచి ఉన్నాయి. ఈ వెబ్‌సైట్ నిర్వాహకులు ప్రతిరోజూ ఒక రచయిత గురించిన వివరాలను ఈ వెబ్‌సైటులో చేరుస్తూ ఉంటారు. ఇప్పటికి ఈ వెబ్ సైటులో వేయికి పైగా రచయితల సమగ్ర వివరాలు ఉన్నాయి. శ్రీమతి కె. గీత, శ్రీయుతులు వేణు ఆసూరి, సుభాష్ పెద్దు ఈ వెబ్‌సైటు నిర్వహిస్తున్నారు.

తెలుగుకు ప్రాచీన భాష హోదా ఉద్యమం

కొన్నేళ్లక్రితం తెలుగుకు ప్రాచీన భాష హోదా తీసుకురావటానికి చేసిన ఉద్యమంలో కూడా తానా ప్రముఖ పాత్ర వహించింది. 2006 డిశంబరులో తానా ఆధ్వర్యంలో తెలుగుకు ప్రాచీన భాషా హోదా కోసం వివిధసంస్థలతో కలసి ఒక పెద్ద ప్రదర్శనను నిర్వహించింది. తానా ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రులనూ, అధికారులనూ కలుసుకొని తెలుగుకు ప్రాచీనభాష హోదా ఇవ్వటం విషయంపై చర్చలు జరిపి ఆధారపత్రాలను అందజేసింది.

తానా చైతన్య స్రవంతి

రెండేళ్లకొకసారి తెలుగు జానపద కళారూపాల పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్‌లో తానా చైతన్యస్రవంతి పేర ప్రదర్శనలు, సెమినార్లు, సభలు నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా జానపద కళా రూపాలపై పరిచయ, పరిశోధక వ్యాసాలతో చైతన్యస్రవంతి అనే సావెనీరును కూడా ప్రచురిస్తుంది.



తెలుగు సాహిత్యసభలు




చైతన్యస్రవంతిలో భాగంగా తానా ఆంధ్రప్రదేశ్‌లో వివిధ నగరాల్లో రచయితల మహాసభలను కూడా నిర్వహిస్తుంది. తెలుగు సాహిత్యంపై రసవత్తరమైన గోష్టులూ, చర్చాకార్యక్రమాలూ ఈ సభలలో జరుగుతాయి. 2002లో విజయవాడలో జరిగిన తానా రచయితల మహాసభలో వందలాది రచయితలు, ప్రేక్షకులు పాల్గొన్నారు. అప్పటి చర్చలనూ, ప్రసంగ వ్యాసాలనూ తానా ఒక సావెనీరుగా ప్రచురించింది.


పిల్లలకు సృజనాత్మక తరగతులు

2016లో విద్యార్థులకోసం తెలుగు సాహిత్యంపై తానా ఖమ్మంలో ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. ప్రముఖ కవి శ్రీ సీతారాం కవిత్వం రాయడంపై ఒక శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, అనేకమంది పిల్లలు అప్పటికప్పుడు కవితలు రాసి అందర్నీ ఆశ్చర్యపరిచారు. శ్రీయుతులు రామతీర్థ, నందిని సిద్ధారెడ్డి, పెద్దింటి అశోక్‌కుమార్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, మువ్వా శ్రీనివాసరావు, ఇతర ప్రముఖ రచయితలు విద్యార్థుల నుద్దేశించి ఉత్తేజకరమైన ప్రసంగాలు చేశారు.

పిల్లల సాహిత్య పోటీలు



పిల్లలలో తెలుగు పట్ల ఆసక్తి పెరగాలంటే, వారికి ఆసక్తికరమైన, నాణ్యమైన, వయసుకు తగ్గ తెలుగు పుస్తకాలు అందించటం అవసరం అన్న ఉద్దేశంతో, 2017, 2019లలో మంచి పుస్తకం అనే పిల్లల పుస్తకాలు ప్రచురించే సంస్థతో కలసి తానా పిల్లల పుస్తకాల పోటీలు నిర్వహించింది.



పదేళ్లలోపు పిల్లలను ఉద్దేశించి 10 పుస్తకాలు, ఇంకా పెద్ద పిల్లల కోసం 15 పుస్తకాలకు బహుమతులు ప్రచురించటమే కాక, 1000 స్కూళ్లలో లైబ్రరీలకు తానా ఈ పుస్తకాలను ఉచితంగా BREAD సంస్థ సహకారంతో అందించింది.

దాశరథి సోదరుల విగ్రహావిష్కరణ

తెలంగాణాకు చెందిన ప్రసిద్ధ రచయితలు, దాశరథి కృష్ణమాచార్య, రంగాచార్యల విగ్రహాలను 2016లో ఖమ్మంలో తానా ప్రతిష్టించింది.

గిడుగు రామ్మూర్తి అవార్డు



తెలుగు భాష అధ్యయనం, అభ్యుదయం కోసం నిరంతరం కృషి చేస్తున్నవారిని గుర్తించి ప్రోత్సహించటం, ఇతరులకు స్ఫూర్తి కలిగించటం లక్ష్యాలుగా తానా గిడుగు రామ్మూర్తి అవార్డుని నెలకొల్పింది. 2002 నుంచి ప్రతి రెండేళ్లకూ, తెలుగు భాష ప్రగతికి అంకితమైన ఒక వ్యక్తిని గిడుగు రామ్మూర్తి అవార్డు, 50 వేల రూపాయల నగదుతో తానా సత్కరిస్తుంది. ఇప్పటివరకు ఈ అవార్డును శ్రీయుతులు చేకూరి రామారావు, భద్రిరాజు కృష్ణమూర్తి, సి. ధర్మారావు, స.వెం. రమేష్, ఎ.బి.కె. ప్రసాద్, పి.ఎస్. సుబ్రహ్మణ్యం, రవ్వా శ్రీహరి, సామల రమేష్‌బాబులు అందు కున్నారు.

భవిష్యత్కార్యక్రమాలు, ప్రణాళికలు

గత రెండు దశాబ్దాలలో సాంకేతిక విప్లవంలో పాలు పంచు కుంటూ తెలుగువారు పెద్ద ఎత్తున అమెరికాకు వచ్చి స్థిర పడటంతో ఇక్కడ తెలుగువారి అవసరాలు బాగా మారి పోయాయి. అమెరికాలో ప్రస్తుతం పదేళ్ల లోపు వయసు తెలుగు పిల్లలు లక్షకు మించి ఉంటారని ఒక అంచనా. ఈ పిల్లలకు తెలుగుపై మక్కువ కలిగించి ఆసక్తి పెంచటం ఇప్పుడు తానా చేయవలసిన ముఖ్యమైన పనుల్లో ఒకటి.

ఇప్పటివరకు ప్రతి సంవత్సరం తెలుగు భాషా సాహిత్యాల కోసం చేస్తున్న కార్యక్రమాలు కొనసాగిస్తూనే, ఇక ముందు ప్రత్యేకంగా పిల్లలకోసం బొమ్మల అక్షరాల పుస్తకాల దగ్గర్నుంచి పెద్ద పిల్లలు తేలిగ్గా చదువుకోగల సాహిత్యం వరకు వివిధ స్థాయిలలో బాలసాహిత్యానికి చేయూత నివ్వడం, పిల్లలకు తెలుగు వీడియోలు, కంప్యూటర్ల ద్వారా ఆటలు, పాటలు, పాఠాలు, ప్రోగ్రాములు, పాఠ్యపుస్తకాలు అందుబాటులో వచ్చేలా చేయడం తానా ఎంచుకొన్న కార్యక్రమాలలో ముఖ్యమైనవి.

తెలుగుభాష, సాహిత్యాల సేవలలో తానా చేసిన, చేస్తున్న అనేక కార్యక్రమాలలో ఇవి కొన్ని మాత్రమే. భాషను కాపాడుకొని, పరిపుష్టం చేసి, వ్యాప్తి పొందించటానికి జరిగే అన్ని ప్రయత్నాల లోనూ తానా ఉత్సాహంగా పాలు పంచుకొంటుంది. అవసరమై నప్పుడు తానే ముందడుగు వేసి ఇతర సంస్థలకు, ప్రభుత్వానికి ఉత్ప్రేరకంగానూ, ఉత్తేజకరంగానూ పనిచేస్తుంది.

తెలుగుభాష, సాహిత్యాల కోసం తానా ఇంతగా కృషి చేస్తుం దంటే, ఈ కార్యక్రమాలకు తానా కార్యవర్గం, సభ్యులు ఏకాభి ప్రాయంతో ఇస్తున్న మద్దతు ముఖ్యకారణం. ఎటువంటి వనరులు అవసరమైనా, వాటిని సమకూర్చుకోవటానికి తానా సభ్యులు వెనుకంజవేయకుండా సహాయం చేయటమే తానా ముఖ్యబలం. తానాకు బాసటగా నిలుస్తున్న ఉత్తర అమెరికా తెలుగు కుటుం బానికి మా కృతజ్ఞతలు.

తెలుగు మన భాష, దానిని రక్షించుకోవలసిన బాధ్యత మనదేనని తానా సభ్యులందరి భావన. ఈ ఆశయసాధనకు తానా వ్యయప్రయాసలకు వెరవకుండా అంకితభావంతో నిరం తరంగా, బహుముఖంగా కృషి చేస్తూనే ఉంటుంది.



వృత్తిరీత్యా వైద్యరంగంలో ఉన్న జంపాల చౌదరి సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఇటు అమెరికాలోను, అటు ఇండియాలోను ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. 13 సంవత్సరాలు తానాపత్రిక సంపాదకులు . అమెరికా నుంచి 'తెలుగునాడి' పత్రికను స్వీయ సంపాదకత్వంలో నిర్వహించారు. 'కథ నేపథ్యం', 'కథ - రెండు దశాబ్దాలు' సంకలనాలకు సహసంపాదకులు. 2015-2017 కాలంలో తానా అధ్యక్షులు. భార్య అరుణ, పిల్లలు- నవ్యత, వేమనలతో చికాగోలో నివాసం.



అమరావతి పరిసర దేవాలయాలు

డా॥ ఈమని శివనాగిరెడ్డి స్థపతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతి పరిసర ప్రాంతాలు ఆలయాలకు, ఆరామాలకు ప్రతీతి. అమరావతిలోని అమరేశ్వరాలయం, పాన్నూరు భావనారాయణస్వామి దేవాలయం, పానకాలస్వామిగా ప్రసిద్ధి పొందిన మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, కృష్ణానదికి ఉత్తరానున్న కనకదుర్గ దేవాలయం, శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణు దేవాలయం మొదలైన దేవాలయాల గాథలు, చారిత్రక విశేషాలతో...

అమరలింగేశ్వరాలయం, అమరావతి

గుంటూరుజిల్లాలో కృష్ణానది దక్షిణపు ఒడ్డున అమరావతిలో గల అమరలింగేశ్వరాలయాన్ని గుంటూరు (32కి.మీ), విజయవాడ (45కి.మీ) ల నుంచి చేరుకోవచ్చు. పంచారామక్షేత్రాల్లో మొదటి దైన ఈ ఆలయాన్ని తూర్పు చాళుక్యరాజైన మొదటి భీముడు (క్రీ.శ 892-922) నిర్మించాడు. ఈ ఆలయం మూడు ప్రాకారా లను కలిగి తూర్పు అభిముఖంగా నిర్మింపబడింది. మొదటి ప్రాకారములో నాలుగువైపుల ప్రవేశద్వారాలున్నాయి. దక్షిణవైపు ద్వారం ప్రధానమైనది. తూర్పువైపున కూడా గోపురమున్నది. తూర్పుగోపురం గుండా భక్తులు లోనికి ప్రవేశించి, ఆలయ ప్రాంగణంలోని ప్రణవేశ్వర, వీరభద్ర, జ్వాలాముఖి, పార్ధివేశ్వర, సోమేశ్వర, మహిషమర్దిని, కోసవేశ్వరాలయంలను దర్శించు కుంటారు. రెండో ప్రాకారంలో, శ్రీకృష్ణదేవరాయలు రాజా వేంక టాద్రి నాయుని తులాభార మండపాలు ఉన్నాయి. ఆగ్నేయాన విఘ్నేశ్వర, నైరుతిన కాలభైరవ, వాయువ్యమూలన కుమారస్వామి, ఈశాన్యమున ఆంజనేయుని ఆలయాలున్నాయి. ప్రాకారం మధ్యలో గల ఎత్తైన వేదికపైకి చేరుటకు తూర్పు, ఉత్తరం, దక్షిణ వైపున మెట్లున్నాయి. మూడో ప్రాకారంలో శ్రీకాళహస్తీశ్వ, శ్రీశైల మల్లేశ్వర, కాశీవిశ్వేశ్వర, చండీశ్వరాలయాలున్నాయి.

ఎత్తైన వేదికపైగల అమరేశ్వరాలయం, గర్భాలయ, అర్ధ మండప, ముఖమండప, మహామండపాలను కలిగిఉంది. చదరపు గర్భాలయంలో 14 అడుగుల ఎత్తైన పల్నాటి సున్నపురాతి వృత్తా కారపు శివలింగమున్నది. మహామండప ఉత్తరం వైపున శ్రీబాల చాముండేశ్వర ఆలయముంది. మహామండపంలో ఎదురుగా నందీశ్వరుడు, అంజలిముద్రలోనున్న రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుని విగ్రహాలున్నాయి. ప్రధానాలయ ఉత్తర దిక్కున క్షేత్ర పాలకుడైన శ్రీవేణుగోపాలస్వామి దేవాలయముంది.

చారిత్రకంగా చూచినట్లైతే భీముడు తూర్పుచాళుక్య రాజు. మొదటి భీముడు క్రీ.శ. 892 ప్రాంతంలో అమరేశ్వరాలయాన్ని వేంగీచాళుక్య వాస్తుశైలిలో నిర్మించాడని చెప్పొచ్చు. క్రీ.శ. 1155లో మహా మండలేశ్వర కులోత్తుంగ చూడగొంక నరేశ్వరుని అధికారి దావులూరి కొమ్మన, కురిగల్లును పాలిస్తుండగా, అమరేశ్వరస్వామి అఖండ వత్తి దీపానికవసరమైన నేయికొరకు యాభై ఐదు గొర్రెలను దానం చేసినట్లు తెలిపే శాసనం, ప్రధానాలయ ముఖ ద్వారం ఉత్తరం వైపు మొదటి స్థంభంపైన ఉంది. తరువాత మహా మండపేశ్వర కోటకేత రాజులు అతని భార్యలు విజమ, సబ్బమ, పార్వతి, నాగమ, కుమారదేవులు క్రీ.శ. 1197వ సం॥లో అమరేశ్వర



మహాదేవులకు అఖండ వత్తి దీపాలు ఐదింటిని దానం చేసినట్లుగా ఒక శాసనం, వేంకటాద్రినాయుని మండపంలో తూర్పు సింహ ద్వారానికి ఉంది. క్రీ.శ.1182కోటకేతరాజు అమరేశ్వరునికీ, బుద్ధ దేవరకూ, కంతేరు, మేడికొండూరు, డొంకిపర్రు (డోకిపర్రు) గ్రామాలను దానము చేసినట్లుగా తెలిపే శాసనం ప్రధానాలయ దక్షిణద్వార మండపం తూర్పు వైపు స్థంభంపైన ఉంది. ఈ శాసనం పైన శివలింగం, బుద్ధుని బొమ్మ చెక్కి ఉన్నాయి.

కాకతీయులు తరువాత, బహమనీల దండయాత్రలో అమరేశ్వరాలయం దెబ్బతినగా, కొండవీటి రాజైన అనపోతారెడ్డి మంత్రి కేతయమల్లయవేమన, క్రీ.శ.1361లో పునఃప్రతిష్ఠి చేసినట్లునూ, అటుతరువాత, అనవేమారెడ్డి కాటయ వేమారెడ్డి కూడా ఆలయ శిఖరంపైన బంగారు కలశాలను ప్రతిష్ఠచేసినట్లుగా మొదటి ప్రాకారంలోని గోపురం లోపలిపక్క తూర్పు వైపునున్న శాసనం తెలియజేస్తుంది.

తూర్పు దిగ్విజయ యాత్రలో భాగంగా కొండవీడును జయించి, ధరణికోట అమరేశ్వరాలయానికి క్రీ.శ. 1515జూలై8వ తేదీన విచ్చేసి, తులాపురుషదానం చేసి, భార్యలు చిన్నాదేవి చేత రత్న మహాదానాన్ని తిరుమలదేవి చేత సప్తసాగర మహాదానాన్ని చేయించి, తల్లిదండ్రులకు పుణ్యంగా దేవుని నైవేద్య మహాపూజ లకు పెదమద్దుల గ్రామాన్ని 108 మంది బ్రాహ్మణులకు, అద్దంకి సీమలోని నిడమానూరు, అమ్మనబోలుసీమలోని వల్లూరు గ్రామా లను తమ పురోహితులకు సర్వమాన్యంగా దానం చేసినట్లు తెలిపే శాసనం, కృష్ణరాయుని తులాభార మండపం పక్కనే పశ్చిమంలో నిలబెట్టి ఉంది.

క్రీ.శ.1626లో జుజ్జూరు నివాసియైన భారద్వాజ గోత్రీయుడు హంద్రిక పెద్దప్ప మంత్రి, ఆయన భార్యలు కొండాయమ్మ, వెంకా యమ్మలతో కలిసి క్రీ.శ. 1626లో ధాన్య కటక శ్రీ అమరేశ్వర లింగాన్ని మూడోసారి ప్రతిష్ఠచేసినట్లున్న శాసనం, రెండో ప్రాకారం, పశ్చిమ ద్వారానికి దక్షిణంగా నిలబెట్టి ఉంది. చివరగా చింతపల్లి నుంచి ధరణికోటకు తూర్పుగా కొత్తపట్నం నిర్మించి, దానికి అమరావతి అని పేరుపెట్టి క్రీ.శ. 1797లో అమరేశ్వరుని నాలుగోసారి ప్రతిష్ఠ చేసిన శాసనం అలయంలో ఉంది.

భావనారాయణస్వామి దేవాలయం, పొన్నూరు


గుంటూరు-బాపట్ల మార్గంలో బాపట్లకు 20 కి.మీ దూరం లో ఉన్న పొన్నూరు భావనారాయణస్వామి దేవాలయానికి ప్రసిద్ధి. పంటలతోనూ, సిరిసంపదలతోనూ తులతూగిన పట్టణం కాబట్టి పొన్నూరుకు స్వర్ణపురి అని కూడ పేరుంది.

ప్రచారంలో ఉన్న కథ ప్రకారం, అత్రి మహర్షి, కాశీక్షేత్రంలో తన మనోభావనతో శ్రీమన్నారాయణుని సాక్షాత్కరింప జేసుకొన టంతో, స్వామిని భావనారాయణ అని పిలువబడి, పూజింపబడు తున్నాడు.

ఇంకో కథ ప్రకారం కేశవశర్మ అనే బ్రాహ్మణుడు తన కుమార్తెను కాశీలో ఉండే తన మేనల్లుడు గురు గోవిందునికి ఇస్తానని వాగ్దానం చేశాడు. తరువాత అది మరచి వేరే వారితో సంబంధాలు చూస్తున్న సంగతి తెలిసి మామను నిలదీయగా నేను నీకు కన్యాదానం చేస్తానని మాటిచ్చినట్లుగా సాక్ష్యం చూపిస్తే తన కుమార్తెని నీకే ఇస్తానని చెప్పాడు. అపుడు గురు గోవిందుడు, కాశీవెళ్లి, కాశీవిశ్వేశ్వరుడు, భావనారాయణులను వేరుచేయగా ఆ ఇరువురు స్వాములు, వెనుక కేశవశర్మ గ్రామానికి బయలు దేరారు. గోవిందుడు వెనుదిరిగి చూసేలోగా కాశీవిశ్వేశ్వరుడు జాగర్లమూడిలో శివలింగాకృతి పొందగా అప్పటికి పొన్నూరు చేరిని భావనారాయణ, అక్కడే శిలామూర్తి అయినాడని, సాక్షిగా వచ్చాడు గాబట్టి సాక్షి భావనారాయణుడని పిలువబడినాడు. పొన్నూరులో, కాశీవిశ్వేశ్వర, విశాలాక్షి దేవాలయాలు, గోష్టివనంలో సహస్ర లింగేశ్వర, చెన్నకేశవ, లక్ష్మీనృసింహ, దాసాంజనేయ, గరుడాళ్వారు దేవాలయాలున్నాయి.

ప్రధానాలయం, గర్భాలయం, అర్ధమండప మహామండపాల తోనూ, ఉపాలయంలతోనూ చుట్టూ ప్రాకారం ఉన్నాయి. ఈ ఆలయంలో క్రీ.శ. 1119 నాటి కులోత్తుంగ చోడయదేవరాజులు, భావనారాయణునికి వైశాఖ తిరునాళ్లను అంగరంగ భోగాలకు కొన్ని గ్రామాలను దానంగా ఇచ్చినట్లున్నారు.

క్రీ.శ. 1255 నాటి శాసనంలో యనమలకుదురుకు చెందిన గోళ్ల నారాయణదాసు, ఆయన తమ్ముడు గోళ్ల గోపాలదాసు



భావనారాయణకు గరికపాడును దానం చేశారు. తూర్పు ద్వారం పైనగల క్రీ.శ. 1393 నాటి శాసనంలో నరహరి తెలుంగవి కాలో చిత ధరను చెల్లించి తల్లిదండ్రుల పుణ్యమునకై పొన్నూరు భావ నారాయణ పెరుమాళ్లకు పుట్టి 10 తూముల భూమిని దానం చేసినట్లు చెప్పబడింది.

ఇదే దేవాలయంలోనున్న రాగిరేకు శాసనంలో క్రీ.శ. 1613వ సం॥లో గుంటుపల్లి ముత్తరాజు భార్య ఆనతిన తిప్పరాజుగారు, పారనూరు గ్రామం పారనూరు గ్రామంలో తేసరిపాటు 10 కుచ్చెళ్ల పొలాన్ని భావనారాయణునికి సమర్పించి నట్లుగా పేర్కొన బడింది.

లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, మంగళగిరి

లక్ష్మీనరసింహస్వామి దేవాలయమున్న మంగళగిరి పట్టణం, విజయవాడకు 14 కి.మీ గుంటూరుకు 21 కి.మీ. దూరంలో రెండు పట్టణాల మధ్య ఉన్నది. పట్టణానికి ఉత్తరంగా పానకాల స్వామి ఉన్న కొండను మంగళాద్రి లేక మంగళగిరి అని పేరు. అదే పేరుతో పట్టణాన్ని కూడ మంగళగిరి అని పిలుస్తారు. కొండ కిందగల పట్టణంలో లక్ష్మీనరసింహాలయం, కొండపైనున్న ఆలయం పానకాలరాయుని ఆలయమని పిలుస్తారు. ఈ రెండు ఆలయాలకు మధ్యన మల్లిఖార్జునాలయముంది. పట్టణంలోని మిద్దెసెంటర్లో క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి దేవాలయ ముంది.

స్థలపురాణం ప్రకారం కుల పర్వతాల్లో ఒక్కటైన పారి యంత్రుని పుత్రుడైన హ్రస్వశృంగి ఒక కురూపిగా ఉండగా చూచిన తల్లిదండ్రులు బాధపడుతుండేవారనీ ఇదిగమనించిన హ్రస్వశృంగి ఇల్లువదలి దేశాటనంచేస్తూ కృష్ణాతీరాన విష్ణుమూర్తి కోసం తపమాచరించసాగాడు. వెతుక్కుంటూ వచ్చిన తల్లిదండ్రు లను చూచిన హ్రస్వశృంగి ఏనుగురూపాన్ని పొందాడు. పారి యంత్రుడు కుమారుని గురించి విచారించగా, ఏనుగు రూపంలో నున్న అతని కుమారుణ్ణి చూపించారు. ఎంత బ్రతిమాలినా తండ్రితో వెళ్లని హ్రస్వశృంగి, విష్ణు పాదమును వీడిరాలేనని చెప్పగా, అదివిన్న తండ్రి తిరిగి వెళ్లిపోయారు. విష్ణుసేవలో స్థిరచిత్తుడైన హ్రస్వశృంగిని మెచ్చుకొని వైష్ణవులంతా స్తుతించుట చేత ముందుగా అది స్తుతాద్రిగా పిలువబడి తరువాత మంగళాద్రి అయిందని చెప్పబడినది.

ఇంకో కథ ప్రకారం అరణ్యవాసంలో నున్న పాండవులు ఇచటికి వచ్చి తోతాద్రిపైగల నరసింహస్వామిని దర్శించి కొండ దిగువున, ధర్మరాజు లక్ష్మీనరసింహస్వామిని ప్రతిష్ఠించారు. ఇవీ కొండపైన కొండకింద గల నరసింహస్వామి ఆలయాల గాథలు.

చరిత్రలోకి తొంగిచూస్తే కొండమీదికి వెళ్లే మెట్లదారిపక్క నున్న క్రీ.శ. 1516 నాటి శాసనంలో నాదెండ్ల తిమ్మయ, మంగళగిరి ఆలయానికి మహామండపం నిర్మించినట్లు, మరికొన్ని



దానాలు చేసినట్లు పేర్కొంటుంది. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్న క్రీ.శ. 1558లో విజయనగర ప్రభువు సదాశివ రాయలు ఆనతిన కొండవీటి నేలుచున్న తిమ్మరాజయ్య చేసిన దాన వివరాలున్నాయి.

లక్ష్మీనరసింహస్వామి ఆలయం, గర్భాలయం, అర్ధ మండపం, అంతరాళం, మహామండపం, ముందుగోపురం నిర్మింపబడినాయి. ఈ గోపురాన్ని క్రీ.శ.1807-09 మధ్య అమరావతి పాలకుడు రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు పునరుద్ధరించాడు. ఆలయానికి ఎడమవైపున లక్ష్మీదేవికి ఆలయం, నైరుతిన కళ్యాణ మండపం, పశ్చిమాన విజయనగర కాలపు గోపురం ఉన్నాయి.

కొండమీద గుహలో పానకాలస్వామి నోరు తెరుచుకున్న ముఖం మాత్రం కన్పిస్తూ, ఎంత పానకం పోస్తే అందులో సగం స్వామి తాగి మిగాతా సగం పోసినవారికే ఇస్తాడన్న గట్టి నమ్మక ముంది.

కొండమీది పానకాలస్వామికి, గుహ (గర్భాలయం) అర్ధమండప, మహామండపాలకు కింది వరకూ మెట్లున్నాయి.

కనకదుర్గ దేవాలయం, విజయవాడ

విజయవాడలోని కనకదుర్గాలయం ఆదాయపరంగా శ్రీవేంకటేశ్వరుని తరువాత రెండో దేవాలయంగా గుర్తింపును సోచుకుంది. కృష్ణాతీరాన ఉన్న విజయవాడలోని ఇంద్రకీల పర్వతంపైన కొలువైన కనకదుర్గ పైన కొన్ని కథలు, గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఒక కథ ప్రకారం కీలుడు అనే యక్షుడు అమ్మవారి గురించి తపమాచరించి ప్రసన్నురాలుని చేసుకొన్నాడు.



ఏమికావాలో కోరుకోమని వరమివ్వగా అతడు అమ్మవారిని తన హృదయస్థానంలో నివశించమని కోరాడు. కృతయుగంలో రాక్షస సంహారానంతరం, తాను యక్షుడు ఒక కొండగా మారితే అలాగే ఉంటానని చెప్పింది. కీలుడు కొండగా మారి అమ్మవారికోసం ఎదురు చూస్తుండగా, అమ్మవారు ఆ కొండపైన నివశించగా, ఇంద్రాది దేవతలు ఇక్కడికే వచ్చి అమ్మవారిని అర్చించుచుండగా ఆ కొండకు ఇంద్రకీలాద్రి అనే పేరొచ్చిందంటారు.

ఇంకో కథ ప్రకారం అర్జునుడు అరణ్యవాసంలో ఇంద్ర కీలాద్రి మీద ఇంద్రుని గురించి తపస్సు చేయగా, ఇంద్రుడు ప్రత్యక్షమై పాశుపతాస్త్రం కొరకు శివుని ఆరాధించమని చెప్పి అంతర్ధానమౌతాడు. అర్జునుడు శివుని కొరకు కఠోరతపస్సు చేస్తుండగా ఒకనాడు ఒక పందివచ్చి తపస్సును భంగం కలిగిస్తుంది. తపోభంగం తరువాత అర్జునుడు కోపంతో ఆ పందిని బాణంతో వేటాడగా ఆ పంది అర్జునుని బాణాలను తప్పించుకుంటుంది. గురిచూచి అర్జునుడు బాణం వేయగా, అదిగుచ్చుకున్న పంది ఆగిపోయిందనీ, వెళ్లిచూడగా రెండు బాణాలు దిగిఉండటాన్ని చూచిన అర్జునుడు ఆ పందిని సమీపించేసరికి ఒక కోయవాడు ఆ పందిని తీసుకుపోతుండగా, అర్జునుడు అతనితో ఆ పందిని నేను చంపాను నాకివ్వమనగా, కోయదొర నవ్వి ఊరుకుంటాడు. అపుడు అర్జునుడు అతనితో పోరాడతాడు. శివుడు ప్రత్యక్షమై ఆ కిరాతుణ్ణి నేనేనంటాడు. అర్జునుడు శివుణ్ణి క్షమించమని కోరతాడు. తరువాత శివుడు అర్జునునికి పాశుపతాస్త్రం ఇచ్చి మాయమౌతాడు. విజయం సాధించిన అర్జునునికి విజయుడనే పేరు, ఆ ప్రాంతానికి విజయవాటిక, విజయవాడ అని పేర్లు కలిగాయంటారు.

మరో కథ ప్రకారం విజయవాడనుంచి పాలిస్తున్న మాధవ వర్మ కుమారుడు ఒక రథంలో పోతుండగా, రథం చక్రం కింద ఒక చింతపండు అమ్మే ఆవిడ కొడుకు మరణిస్తాడు. ఆమె రాజును కలిసి, జరిగిన సంగతి విన్నవించి రాకుమారుణ్ణి శిక్షించ మనగా, రాజు వ్యక్తిని చంపిన నేరానికి తన కుమారునికి మరణ దండన శిక్ష అమలు పరుస్తాడు. రాజు న్యాయనిరతికి అచ్చెరు వొందిన దుర్గ, కనకవర్షం కురిపించిందనీ, మరణించిన ఇద్దరూ బతికారనీ, అప్పట్నుంచి అమ్మవారు కనకదుర్గగా పేరుగాంచింది.

అమ్మవారి ఆలయం గర్భాలయం, అర్ధమండపం, మహా మండపం, ముందు రాజగోపురం, అమ్మవారికి ఎదురుగా అశ్వత్థ వృక్షం, దానికింద ఆంజనేయుని విగ్రహం, ఈశాన్యంగా మల్లేశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయ సముదాయంలో సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయం కూడా ఉంది.భక్తులకోసం భవానీ మంటపం, కళ్యాణ మండపం, శంకరాచార్య మండపం, చండీ హోమ మండపం, నవగ్రహాలయం, అద్దాలమండపం ఉన్నాయి. కనకదుర్గ అమ్మవారి ప్రస్తావన క్రీ.శ.16వ శతాబ్దినుంచే శాసనాల్లో కనిపిస్తుంది. 95 కి పైగా గల శాసనాలు మల్లేశ్వరస్వామికి ఇచ్చిన దాన వివరాలు ఉన్నాయి.

ఆంధ్ర మహావిష్ణు దేవాలయం, శ్రీకాకుళం

దివిసీమలోని శ్రీకాకుళం గ్రామం శ్రీకాకుళేశ్వరస్వామి దేవాలయానికి ప్రసిద్ధి. విజయవాడకు 45 కి.మీ, ఘంటసాలకు 15 కి.మీ దూరంలో కృష్ణాతీరాన గల శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామికి ఆంధ్ర మహావిష్ణువు, ఆంధ్రనాయకుడు, ఆంధ్ర వల్లభుడు, తెలుగు వల్లభుడు, తెలుగురాయడని పేర్లున్నాయి. తెలుగురాయనిపేర, శ్రీకాకుళం ప్రక్కనే తెలుగురాయపురమనే గ్రామమున్నది.

'ఆంధ్ర కౌముది' గ్రంథం ప్రకారం, శ్రీ మహావిష్ణువు, శ్రీకాకుళంలోని సుచంద్రుడనే రాజు కుమారునిగా జన్మించి, ఆంధ్ర మహావిష్ణువను పేరున రాజ్యం చేశాడని చెప్పబడింది. మరో కథ ప్రకారం, పూర్వం ఈ ప్రాంతంలో తపం చేస్తున్న మహర్షులకు కనిపించగా, విష్ణువును ఇక్కడే ఉండమని ప్రాధేయ పడగా, శ్రీకాకుళంలో స్థిరపడ్డాడనీ అందువల్ల ఆయనకు శ్రీకాకు ళాంధ్ర మహావిష్ణువని పేరు కలిగిదంటారు. శ్రీకాకుళంలోని ఆంధ్ర మహావిష్ణువుకు మీసాలుండటం ఒక ప్రత్యేకతగా చెబుతారు.



108 దివ్య తిరుపతుల్లో 57వ క్షేత్రంగా పేరుపడిన శ్రీకాకుళంలోని ఆంధ్రనాయకుని ఆలయంలో గర్భాలయ, అర్థమండప, మహామండపం, అటూ ఇటూ చెన్నకేశవ, రాజ్యలక్ష్మీ అమ్మవార్ల ఆలయాలున్నాయి.

ఆగ్నేయ దిశగా శ్రీకృష్ణదేవరాయలు రచనకు శ్రీకారం చుట్టిన ఆముక్తమాల్యద మంటపం, ఈశాన్యంగా, ఆస్థాన మండపం, ముందు రాజగోపురం, చుట్టూ ప్రాకారం ఉన్నాయి. కుడివైపున ఏకరాత్ర ప్రసన్నమల్లికార్జున స్వామి దేవాలయముంది. గర్భాలయ, అర్థమండప, మహామండపం, ముందు మరో మండపం, ఎదురుగా గోపురం, చుట్టూ ప్రాకారం ఉన్నాయి.

క్రీ.శ 12వ శతాబ్దపు తరువాతి శాసనాల్లో శ్రీకాకుళాన్ని కాకొలను, కాకొలని, కాకుళీ, శ్రీకాకులమని పేర్కొన్నాయి. చందోలు పాలకుడైన వెలనాటిగొంకని క్రీ.శ 1132వ సం॥ మొదటి శాసనం కాగా క్రీ.శ 1518 నాటి శ్రీకృష్ణదేవరాయలిది చివరి శాసనం. శ్రీకృష్ణ దేవరాయలు శ్రీకాకుళంలో శ్రీ కాళేశ్వరస్వామిని దర్శించి విడిది చేసినపుడు, స్వామి కలలో కనిపించి తనపై ఒక గ్రంథాన్ని రాయమనగా, ఆముక్తమాల్యద గ్రంథాన్ని రాశానని ఆయనే చెప్పుకొన్నాడు.

శాసనాల్లో, వెలనాటి చోళులు, కళ్యాణ చాళుక్యులు, పరిచ్ఛేది, కోటరాజులు, ముదిగొండ చాళుక్యులు, కాకతీయులు, తూర్పుగాంగులు, గజపతులు, విజయనగర చక్రవర్తులు, శ్రీకాళేశ్వరునికి చేసిన దానాల వివరాలున్నాయి.

క్రీ.శ 18వ శతాబ్దిలో శ్రీకాకుళ స్వామిపై 'చిత్రచిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ! హతవిమతజీవ శ్రీకాకుళాంధ్రదేవ' అన్న మకుటంతో శ్రీకాకుళం దగ్గర్లోని పెదప్రోలు గ్రామానికి చెందిన కాసుల పురుషోత్తమ కవి ఆంధ్రనాయక శతకాన్ని రాయగా, అటు తరువాత మరికొంతమంది కవులు, దేవుణ్ణి స్తుతిస్తూ పుస్తకాలు రాశారు. ఆలయం శిథిలం కాగా, క్రీ.శ 18వ శతాబ్ది చివరిభాగంలో చల్లపల్లి జమీందారు యార్లగడ్డ కోదండరామన్న పునరుద్ధరించారు.

ఆంధ్ర మహావిష్ణు దేవాలయ కోష్టాలలో మహిషమర్దిని, గణేశ, జనార్థన, కేశవ, వేణుగోపాల, వరాహ, బాలకృష్ణ మొదలైన శిల్పాలు నాటిశిల్పకళ వైశిష్ట్యాన్ని తెలియజేస్తున్నాయి. శ్రీకాకుళం దేవాలయంలో వైశాఖ పున్నమి రోజున జరిగే కళ్యాణోత్సవం, తిరునాళ్లు తెలుగునేలంతా ప్రసిద్ధి గాంచాయి.

శ్రీకాకుళ దేవాలయ సముదాయంలో ఆంధ్ర మహావిష్ణు దేవాలయం, ఏకరాత్ర ప్రసన్న మల్లికార్జునాలయం, ఇంకా ఆముక్త మాల్యద మండపం ఉన్నాయి.

ఆంధ్రమహావిష్ణు దేవాలయం

చుట్టూ ప్రాకారం, తూర్పు వైపున ప్రవేశద్వారంగా పంచతల గోపురం, ఎదురుగా మహామండపం, గర్భాలయాలతోనూ, నిలువుగా అధిష్టానం, పాదవర్గం, ప్రస్తరంపైన మూడంతస్తుల విమానంతో అలరారు తుంది. గర్భాలయం వెలుపల దేవ



కోష్ఠాలు, ద్వారానికి ఇరువైపులా జయ, విజయ ద్వారపాలకులతో నిర్మించబడింది. గర్భాలయంలో ఆంధ్రమహావిష్ణువు, అటూఇటూ శ్రీదేవి, భూదేవి విగ్రహాలు ప్రతిష్ఠించబడినాయి. గర్భాలయం ముందున్న అర్ధమండపంబయట దేవ కోష్టాలలో మహిషమర్దిని, నాట్యగణపతి విగ్రహాలున్నాయి. అర్ధమండపం ముందున్న మహామండపంలో రెండువైపులా రెండు ద్వారపాలకుల విగ్రహాలున్నాయి. స్థంభాలపైన బాలకృష్ణ, రామ, నాట్య గత్తెల శిల్పాలు అందంగా చెక్కబడినాయి.

ఆంధ్రమహావిష్ణు దేవాలయం

చదరంగా ఉన్న గర్భాలయంలో అత్యంత సుందరమూర్తి అయిన ఆంధ్రమహావిష్ణు విగ్రహం ఉంది. ఒకే రాతిపైన గల ప్రభామండలం కింద అటూ ఇటూ శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు చెక్కబడినారు. నిలబడి ఉన్న స్వామివారు నాలుగు చేతులు కలిగి, పై కుడి ఎడమ చేతుల్లో శంఖం, చక్రము, కింది కుడి ఎడమ చేతుల్లో పద్మము, గదలను ధరించారు. శ్రీదేవీ, భూదేవీ సహితుడైన ఆంధ్రమహావిష్ణువును భోగస్థానక మూర్తిగా పిలుస్తున్నారు. అన్ని అలంకారాలతో ఉన్న స్వామి వక్షస్థలంలో కౌస్తుభం, శ్రీవత్సం, చన్నవీరం, ఉదరబంధం, కంఠహారం, తలపై మకుట కిరీటం, పత్రకుండలాలు, కేయూరం, కంకణాలను ధరించి యున్నారు. స్వామివారి మూతిమీద మీసాలుండటం ఇక్కడి ప్రత్యేకత. స్వామి వెనుక గల ప్రభామండలం పైన దశావతారాలు చెక్కబడినాయి.

గర్భాలయం తరువాత గల అంతరాలం దీర్ఘచదరంగా ఉంది. వెలుపల ఉత్తర, దక్షిణ కోష్టాలలో మహిషమర్దిని, నాట్య గణపతి విగ్రహాలున్నాయి.

మహామండపం

మహామండపం మధ్యలో రంగమండపముంది. బహుశ ముద్దుపళని ఇక్కడే నాట్యం చేసిందేమో. నిత్యార్చనల సందర్భంగా అంగరంగ వైభోగాల్లో నృత్యం కూడా ఒకటి. నృత్యాన్ని రంగ మండపంలోనే అర్పించటం ఆలయ సంస్కృతిలో భాగం.

ఏకరాత్ర ప్రసన్న మల్లికార్జునాలయం

ఆంధ్రమహావిష్ణు ఆలయానికి ఎడమవైపుగా గల శివాలయాన్ని ఏకరాత్ర ప్రసన్నాలయం అంటారు. ప్రధానాలయంలో శివుడు, అటూ ఇటూ గల ఆలయాల్లో పార్వతి (భ్రమరాంబ), వీరభద్రులున్నాయి. ఇది త్రికైటాకృతిలో నిర్మించబడింది. ఈ ఆలయ ప్రాశస్త్యం గురించి పండితారాధ్య చరిత్రలో వివరించబడింది. గర్భాలయం మధ్యలోగల పానవట్టంపైన శివలింగం ప్రతిష్ఠించబడింది. ముందు అర్ధమండపం, తరువాత 16 స్తంభాల మహామండపం ఉంది. ఆలయం చుట్టూ ప్రాకారం, తూర్పున రాజగోపురం ఉన్నాయి. ఈశాన్యాన 16 స్తంభాల మండపం ఉంది.

ఆలయంలోని శిల్పాలు

ఆంధ్రవిష్ణు గర్భాలయంలో నాలుగు చేతులతో శంఖం, చక్రం, పద్మం, గద కలిగి నిలబడి స్వామివారు అన్ని ఆభరణాలను ధరించి ఉన్నారు. వెనుకవైపు ప్రభామండలం, దానిపైన కుడి ఎడమ వైపుల్లో శ్రీదేవి, భూదేవి విగ్రహాలు ఒక చేత్తో పద్మం, మరో చేతిని లోలహస్తంగా, త్రిభంగిమలో నిలబడి ఉన్నారు.

ఆలయ ఎడమవైపు కోష్ఠంలో కేశవ, దక్షిణ వైపున జనార్ధన, అంతరాళం కోష్ఠంలో మహిషమర్దిని, ఆంజనేయ, భోగలక్ష్మి విగ్రహాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. మహామండప స్తంభాలపై మురళీకృష్ణ, హనుమాన్, గరుడ, గణపతి విగ్రహాలు చెక్కబడినాయి. గోపుర స్తంభాలకింద లతాపత్రసుందరి బొమ్మలు రమణీయంగా ఉన్నాయి.

శ్రీ బాలపరమేశ్వరీ సమేత జలధీశ్వరస్వామి దేవాలయం, ఘంటసాల

విజయవాడ నుంచి అవనిగడ్డ వెళ్లే దారిలో, కొడాలికి ఎడమ వైపున 5కి.మీ దూరంలో గల ఘంటసాల గ్రామంలోని బాల పరమేశ్వరీ సమేత జలధీశ్వరాలయం, జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటి. విజయవాడకు 60, చల్లపల్లికి 5 కి.మీల దూరంలో నున్న ఈ ఆలయాన్ని ప్రతిరోజూ అధిక సంఖ్యలో భక్తులు సందర్శిస్తుంటారు. ఘంటసాల గ్రామానికి రెండువేల ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ గల క్రీ.శ. 1-3 శతాబ్దాల నాటి బౌద్ధస్థూపం, చక్రాకారంలో నిర్మించబడింది.

క్రీ.శ 2వ శతాబ్దానికి చెందిన గ్రీకు భూగోళ శాస్త్రవేత్త టాలెమీ ఈ గ్రామాన్ని కంటకస్సిల అనిపేర్కొనటం గమనార్హం. సిద్ధార్థుని గుర్రమైన కంటకం పేరు మీద ఈ గ్రామానికి కంటకశైల మనీ, తరువాత కంటకశిల అనీ రానురాను ఘంటసాలగా మారిందని చరిత్రకారుల అభిప్రాయం.

క్రీ.శ 1870-1904ల మధ్య గ్రామంలోని ఘోటకం దిబ్బ దగ్గర బౌద్ధస్థూపాన్ని, రమణీయంగా చెక్కిన బౌద్ధ శిల్పాలున్న ఫలకాలు, శిలాకృత శాసనస్థంభాలు, బుద్ధ విగ్రహాలు లభించాయి. క్రీస్తు శకారంభంలో ఇదొక రేవు పట్టణంగా ఉండేదనీ, ఇక్కడ విదేశాలతో వర్తకం సాగించిన మహా నావికులున్నారనీ, క్రీ.శ. 3వ శతాబ్దంలో ఉపాసిక బోధిసిరి ఇక్కడొక శిలా మండపాన్ని కట్టించిందని శాసనాలు తెలియజేస్తున్నాయి.

గ్రామంలో శాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి నాణాలు, పశ్చిమ క్షాత్రపుల నాణేలు, రోమన్ నాణేలు, సాలంకాయనుల నాణేలు లభించాయి. దక్షిణ కైలాసంగా కూడా పిలువబడిన ఘంటసాల గ్రామంలోని జలధీశ్వరలింగాన్ని అగస్త్య మహాముని ప్రతిష్ఠించాడని, క్రీ.శ 8వ శతాబ్దిలో ఆదిశంకరాచార్యులు ఈ లింగాన్ని అర్చించారని స్థలపురాణంలో ఉంది. క్రీ.శ 12, 13 శతాబ్దాల శాసనాల్లో ఘంటసాలలోని శివాలయాన్ని జలధీశ్వరాలయంగా పిలిచారు.

జలధి అనగా సముద్రం. సముద్రంపై వర్తక వాణిజ్యాలు నెరపేవారికి అభయమిచ్చే స్వామిగా శివుణ్ణి జలధీశ్వరస్వామి అని పిలిచారని స్థలపురాణంలో ఉంది. ఘంటసాలలో దేశ, విదేశాల వర్తకులు, చోళ, పాండ్యరాజ్యాల వర్తకులుండాన ఈ గ్రామాన్ని ఆ రోజుల్లో చోళపాండ్య పురమని, దేవుణ్ణి విశ్వేశ్వరస్వామి అని పేర్కొన్నారు. ఆలయం గర్భాలయంలోని పానవట్టంపై పల్నాటి సున్నపురాతితో చెక్కిన శివలింగం, బాలపార్వతి అమ్మవారు ప్రతిష్ఠించబడి ఉండటం ఒక ప్రత్యేకత. జలధీశ్వరాలయం శిథిలం కాగా ఇటీవల ఆధునికంగా నిర్మించారు.

విశాల ప్రాంగణంలో నాగరాజు, కుమారస్వామి, నవగ్రహాలు ప్రతిష్ఠితమై ఉన్నాయి. ఆలయానికి ఎదురుగా గోపురమూ, మూడు వైపులా ప్రవేశ ద్వారాలూ ఉన్నాయి. ఆలయ మహా మండపానికి ఇరువైపులా పల్నాటి సున్నపురాతితో చెక్కిన భైరవుడు, నరసింహస్వామి విగ్రహాలున్నాయి. నరసింహస్వామి క్షేత్రపాలకునిగానూ, భైరవుడు ద్వారపాలకునిగానూ ఉండటం ఈ ఆలయం మరో ప్రత్యేకత. ఘంటసాలలో ఇంకా వేణుగోపాల స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, విశ్వేశ్వరాలయం, అన్నపూర్ణాంబ ఆలయం, భావనారుషి ఆలయం, రామాలయం, పెన్నేరమ్మ, ముత్యాలమ్మలకు కూడా దేవాలయాలున్నాయి. ఘంటసాలలోని జలధీశ్వరాలయాన్ని దర్శించి, తరించండి.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరాలయం, మోపిదేవి

విజయవాడ నుంచి అవనిగడ్డ వెళ్లే దారిలో, విజయవాడకు 65, అవనిగడ్డకు 5 కి.మీ దూరంలోగల మోపిదేవి గ్రామంలో



సుబ్రహ్మణ్యేశ్వరాలయముంది. మోహినీపురమని కూడా పిలువ బడిన మోపిదేవి గ్రామాన్ని వింధ్య పర్వత గర్వమణచిన అగస్త్య మహర్షి తనదక్షిణ దేశయాత్రలో భాగంగా సందర్శించాడనీ, అప్పుడు ఒక పుట్టలో నుంచి వెలుగులు విరజిమ్మిందనీ, దివ్య దృష్టితో చూచిన అగస్త్యునికి, ఆ పుట్టలో పాము రూపంలో నున్న సుబ్రహ్మణ్యస్వామి కనిపించాడని స్థలపురాణంలో ఉంది.

ఒకప్పుడు కొన్ని దోషాల నివారణ కోసం, ఇంకా దివ్యశక్తుల కోసం, సుబ్రహ్మణ్యస్వామి తపమాచరించానికి అనువైన ప్రదేశాన్ని వెదుకుతుండగా, సుందరతర ప్రకృతిలో ఓలలాడుతూ కృష్ణా తీరంలో నున్న మోపిదేవి పరిసరాలు నచ్చాయని, ఇక్కడ తపమా చరించిన సుబ్రహ్మణ్యస్వామికి పరమేశ్వరుడు ప్రత్యక్షమై అనుగ్రహించాడని, ఇదంతా దివ్యదృష్టితో గ్రహించిన అగస్త్యముని, ఈ ప్రదేశంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పేర ఒక లింగాన్ని ప్రతిష్ఠిం చాడనీ కూడా చెప్పబడింది.

అటు తరువాత శుభాంగుడు అనే రాజు భక్తి ప్రపత్తులతో సుబ్రహ్మణ్యేవ్వరునికి నిర్మించిన ఆలయం భక్తుల పాలిట పెన్నిధిగా నిలిచిందనీ చెప్పబడింది. ఆలయానికి అటూ, ఇటూ వల్లీ దేవసేనలకు ఆలయాలున్నాయి.

ఆలయానికి దక్షిణ దిశగానున్న పుట్టనుంచి గర్భాలయం లోని లింగం అడుగుభాగంలోనున్న పుట్టకు దారి ఉండేదని అర్చకులు చెబుతున్నారు. ఈ మార్గం ద్వారా ప్రయాణించిన భక్తులకు సర్పదోషం తొలగిపోతుందని నమ్మకం. పిల్లలు లేని వారు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మొక్కుబడులు చెల్లిస్తే సంతానాన్ని పొందుతారనే నమ్మకంతో ప్రతిరోజూ వేలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తున్నారు.

శ్రీ దుర్గానాగేశ్వరస్వామి దేవాలయం, పెదకళ్లేపల్లి

దివిసీమలో అవనిగడ్డకు 15 కి.మీ, మోపిదేవికి 12 కి.మీ. దూరంలో ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న కృష్ణాతీరంలోగల పెద కళ్లేపల్లి చారిత్రక ప్రదేశము. క్రీ.శ 1-2 శతాబ్దాల్లో ఇదొక బౌద్ధ క్షేత్రమని, నాగేశ్వరాలయంలోనున్న బౌద్ధస్థంభాలు తెలియ జేస్తున్నాయి.

కడలుపురి, కదళీపురంగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి, దక్షిణ కాశిగా కూడా ప్రసిద్ధి చెందింది. విశాలమైన ఈ తీర్థక్షేత్రం గురించి స్కాంధపురాణంలో వివరించబడింది. జనమేజయుడు ఇక్కడే సర్పయాగం చేశాడని, కర్కోటకం మొదలుగాగల మహానాగాలు, వశిష్ఠుడులాంటి మహర్షులు తపమాచరించిన ప్రదేశమనీ పురాణాలు పేర్కొంటున్నాయి.

ఈ క్షేత్ర మహిమ శ్రీమత్కదళీపుర మహాత్మ్యంలో ఉంది. ఆలయంలో దుర్గ, నాగేశ్వర, పార్వతి, కాలభైరవ, భైరవ ఆలయాలు, ముందు ఒక సరోవరం ఉన్నాయి. ప్రధానాలయమైన నాగేశ్వరాలయం, గర్భాలయం, అర్థమండపం, మహా మండపం, ముఖమండపం, ధ్వజస్థంభం, రాజగోపురం ఉన్నాయి. ఆల



యానికి ఎదురుగా ఈశాన్యంవైపున్న నాగ సరోవరంలో స్నానాలు ఆచరిస్తే నాగదోషాలు, పాపాలు తొలగిపోయి పునీతులౌతారని స్థానికుల నమ్మకం.

గర్భాలయంలో, నాగేశ్వరస్వామి, అర్థమండప ద్వారాలపై దిండి, ముండి, మహా మండపంలో కుడి, ఎడమ వైపుగల కోష్టాల్లో వీరభద్రుడు, భద్రకాళి విగ్రహాలున్నాయి. దుర్గ, భైరవులకు ప్రత్యేకాలయాలున్నాయి. ఆలయం ఈశాన్యదిశలో కళ్యాణ మండపం, దక్షిణాన ఒక బౌద్ధస్థంభం, దానిముందు కర్కోటక నాగశిల్పం ఉన్నాయి. దీనిని సత్యస్థంభమని కూడా అంటారు. ఆలయం ఎడమవైపున గోడకు క్రీ.శ 13వ శతాబ్ది చివరలో ఆలయాన్ని పునరుద్ధరించిన సోమ శివాచార్యుల శిల్పం ఉంది. ఆలయంలోని గోపురానికి బిగించిన రెండు శాసనాలు, కళ్యాణ మండప స్థంభాలపై నాలుగు శాసనాలు, బౌద్ధ స్థంభంపైన ప్రాకృత శాసనం ఉన్నాయి.

క్రీ.శ 11-18 శతాబ్దాల మధ్య కాలానికి చెందిన ఈ శాసనాల్లో ఆలయనిర్మాణం, అఖండ దీపానికి కావలసిన నేతిని సరఫరా చేయానికి అవసరమైన ఆవులు, ఎనుములు, గొఱ్ఱెలను దానం చేసిన వివరాలున్నాయి.

కాకతీయ ప్రతాపరుద్రుని క్రీ.శ 1292వ సం॥ శాసనంలో సోమ శివాచార్యుని ఆధ్వర్యంలో ఆలయం రాతిగోడల నిర్మాణం జరిగిందని చెప్పబడింది. చల్లపల్లి జమీందారు రాజా యార్లగడ్డ కోదండరామన్న దేశాయి, 1782లో ఆలయానికి జీర్ణోద్ధరణ చేశారు.

తరువాత 1796లో ఆలయ గాలిగోపురాన్ని నాగేశ్వర నాయుడు నిర్మించారన్న శాసనం గోపురానికి బిగించబడి ఉంది. మహాశివరాత్రికి వేలాదిమంది భక్తులతో ఆలయ ప్రాంగణం కళ కళలాడుతుంది. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, సుసర్ల దక్షిణా మూర్తి గారులాంటి సాహితీ, సంగీత విద్వాంసులు పుట్టిన పెద కళ్లేపల్లి కృష్ణాతీరంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించు కుంది.

గ్రామంలో ఇంకా వేణుగోపాలస్వామి, ఆంజనేయుని ఆలయాలున్నాయి. వేణుగోపాల స్వామి ఆలయం క్రీ.శ.10వ శతాబ్దికి చెందినది. ఆలయంలోని వైకుంఠనారాయణ, ద్వారపాల

శిల్పాలు, వేంగీ చాళుక్య శిల్పకళకు అద్దం పడుతున్నాయి. పుష్కర పుణ్యకాలంలో పెదకళ్లేపల్లిలోని నాగసరోవరంలోను, సమీపంలో గల కృష్ణా నదిలోని స్నానమాచరించి తరించండి.

శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయం, అవనిగడ్డ

అవనిగడ్డలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయం చరిత్ర ప్రసిద్ధి గాంచింది. వెయ్యేళ్లనాటి ఈ ఆలయంలోని లక్ష్మీ నారాయణ విగ్రహాన్ని త్రేతాయుగంలో శ్రీరాముడు ప్రతిష్ఠించాడనీ, వశిష్టుడు సీతాదేవికి ఇక్కడే ధార్మిక విషయాలు బోధిం చాడనీ, అందుచేత ఈ ప్రదేశానికి అవనిజపురమని పేరొచ్చిందనీ, అవనీ పురమే అవనిగడ్డ అయిందని స్థలపురాణం వివరిస్తుంది.

అవనిగడ్డకు కొద్ది దూరంలో వ్యాఘ్రమహర్షి ఆశ్రమం ఉండేదనీ, ఆ ప్రదేశాన్ని వ్యాఘ్రేశ్వరపురమనిపిలిచే వారనీ, రాను రాను అది పులిగడ్డగా పిలువబడిందని స్థానిక పెద్దలు చెబు తున్నారు. ఆలయంలో క్రీ.శ 1138-1154 సం॥ మధ్యకాలానికి చెందిన 5 శాసనాలలో చోడనారాయణుడుగా పిలువబడిన, లక్ష్మీ నారాయణుని, అఖండదీపానికి కొల్లూరి ప్రభువులు ధనాన్ని, గోవు లను దానం చేసిన వివరాలున్నాయి.

ఆలయం, గర్భాలయం, అర్థమండపం, మూడు ప్రవేశ ద్వారాలతో మహామండపం, ఎదురుగా రెండువైపులా చక్కటి శిల్పాలతో నున్న మెట్లమార్గం, ఎడమవైపున ఒక ఆలయం, కుడి



వైపున మరో ఆలయం, ఈశాన్యంలో నాలుగు స్థంభాల గోష్ఠి మండపం, తూర్పు వైపున ఎత్తైన ఏడంతస్తుల రాజగోపురం, లోపల ప్రతిమా మండపం, చుట్టూ ప్రదక్షిణా పథముంది. నిలువుగా అధిష్ఠానం, పాదవర్గం (గోడ), ప్రస్తరం (కప్పు), దాని మీద రెండతస్తుల విమానం ఉన్నాయి.

గర్భాలయంలో లక్ష్మీనారాయణ విగ్రహం, అర్థమండపంతో ఉత్సవమూర్తులు రూపలావణ్యంతో చూపరులను ఆకట్టుకుంటు న్నాయి. ద్వార శాఖలపై జయ, విజయ ద్వారపాలకులు, పైన గజలక్ష్మి విగ్రహాలు అందంగా తీర్చిదిద్దబడినాయి.

మహామండప స్థంభాలపై రుక్మిణీ, సత్యభామ, విష్ణుమూర్తి, లక్ష్మీనారాయణులు, వేణుగోపాలుడు, గణపతి, సతీసమేతుడై ఉన్న గణపతి, వాద్యగాళ్లు, నాట్యగత్తెలు, యుద్ధం చేస్తున్న యుద్ధ వీరులు, ఇంకా మహామండపం ముందు వరుసలోనున్న స్థంభా లకు చెక్కిన సింహాలు, వెలనాటి చోళుల శిల్పకళారీతికి అద్దం పడుతున్నాయి. ఈ ఆలయానికి కుడివైపునున్న, శివా (రాజశేఖరా) లయం కూడా చూడదగ్గదే. ఈ ఆలయం దివిసీమకే కాక, ఆంధ్రరాష్ట్రంలోనే ఒక ప్రత్యేక ఆలయంగా గుర్తింపు పొందింది. రథాకార దేవాలయంగా పేరుగాంచిన కోణార్క సూర్యాలయం క్రీ.శ 1254లో నిర్మించబడగా, అంతకంటే నూరేళ్ల ముందే అంటే క్రీ.శ 1154లోనే రథాకార దేవాలయంగా నిర్మించ బడింది. మహామండపం ముందున్న మెట్లకు రెండువైపులా, ఆలయాన్ని రథంలా ముందుకు లాగుతున్నట్లు చక్రాలు, వాటి ముందు గుర్రాలు, గుర్రాలపైన రథకుల శిల్పాలు చక్కగా చెక్కబడినాయి.

ఇక 7 అంతస్తుల రాజగోపురం, కప్పు వరకూ రాతిలోనూ, పైన ఇటుకలతోనూ, వెనుకవైపుగల ప్రతిమా మండపం రాతి తోనూ నిర్మించబడింది. కోష్టాల (గూళ్లు)తో ఆంజనేయ, లక్ష్మీ నారాయణ, గరుడ, లక్ష్మీ నరసింహా, గణపతి, నాగరాజ విగ్రహాలు, ద్వారశాఖలకు జయ, విజయ విగ్రహాలు చూడముచ్చటగా ఉన్నాయి.

100 అడుగుల ఎత్తున్న ఈ గోపురం, దివిసీమలోనే ఎత్తైన గోపురంగా తీర్చిదిద్దబడింది. అంతేకాదు, దేవాదాయ, ధర్మా దాయ శాఖవారి మాసపత్రిక 'ఆరాధన' మకుటచిత్రంగా స్వీకరించ బడి ప్రత్యేక గుర్తింపుకు నోచుకుంది. అవనిగడ్డలోని శ్రీభూనీలా రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వైఖానస ఆగమ సంప్రదాయంలో నిత్యార్చనతోపాటు, నృసింహజయంతి, కృష్ణాష్టమి, కార్తీక పున్నమి, పారువేటసేవ, ముక్కోటి ఏకాదశి, వార్షిక బ్రహ్మోత్సవాలు, ఉగాదికి పంచాంగ శ్రవణం, కుంభ, ఆకాశ దీపోత్సవాలు, రాజ్యలక్ష్మీ దేవికి శుక్రవార పూజలు ఘనంగా జరుగుతున్నాయి. హంసలదీవి, నాగాయలంక, గణపేశ్వరాలయా లకు ముఖద్వారంగా ఉన్న అవనిగడ్డలోని లక్ష్మీనారాయణుని దర్శించి ఆశీస్సులు పొందండి.

శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం, హంసలదీవి



దివిసీమలో కృష్ణానది సముద్రంలో కలిసే ప్రదేశానికి సమీపంలో గల హంసలదీవి గ్రామంలో వేణుగోపాలస్వామి దేవాలయం, సాగరసంగమానికి దగ్గరగా ఉన్న తీర్థక్షేత్రం.

అవనిగడ్డ, మచిలీపట్నం నుంచి చేరుకోగల ఈ ఆలయం క్రీ.శ. 11 శతాబ్దికి చెందినదని అక్కడున్న తమిళ శాసనాలు రుజువు చేస్తున్నాయి.

ఒకప్పుడు రెండువైపులా కృష్ణానదీపాయలు ముందు సముద్రంతో ఒకదీవిగా ఏర్పడింది. ఇక్కడ దేవతలు రాత్రివేళ హంసల రూపంలో సముద్రస్నానాలు చేసి వేణుగోపాలస్వామిని దర్శించుకొనేవారని ఐతిహ్యముంది.

ఈ దివిపైన గల స్వామిని దేవతలు హంసల రూపంలో దర్శించుకున్నందువల్లనూ, పాపపంకిలమైన గంగానది కాకి రూపంలో వచ్చి సాగరసంగమంలో స్నానమాచరించి హంసరూపం ధరించిందనీ, అందుకే హంసలదీవి అని పేరొచ్చిందని అంటారు.

ఆలయంలో గర్భాలయం, అర్ధమండపం, ముఖమండపం తో మూడువైపులా ప్రవేశ ద్వారాలతో ఉంది. ముఖమండపంలో మూడు ఉపాలయాలు కూడా నిర్మించబడినాయి. గర్భాలయంలో వేణుగోపాలస్వామి, దక్షిణవైపు ఉపాలయంలో లక్ష్మీనరసింహ స్వామి, ఉత్తరం వైపు ఉపాలయంలో విష్ణుమూర్తి విగ్రహం ఉన్నాయి. మరో ఉపాలయంలో దక్షిణాభిముఖంగా రాజ్యలక్ష్మీ అమ్మవారున్నారు. ఆలయానికి ఈశాన్యంగా పవిత్ర పుష్కరిణి ఉంది.

వేంగీ చాళుక్య వాస్తుశిల్పం ఉట్టిపడుతున్న ఈ ఆలయ కోష్టాలలో దుర్గ, గణేశ, ఆంజనేయ, విగ్రహాలు, విడిగా రెండు ద్వారపాల విగ్రహాలున్నాయి. ప్రతిసంవత్సరం ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

సంగమేశ్వరస్వామి దేవాలయం, సంగమేశ్వరం

అవనిగడ్డ నుంచి కోడూరు మీదుగా చేరుకోవానికి వీలున్న సంగమేశ్వరం గ్రామంలోని సంగమేశ్వరాలయానికి జిల్లాలోనే ప్రత్యేక ఆలయంగా గుర్తింపు ఉంది. కృష్ణానది, సముద్రం (సాగరం)లో కలిసే చోటు గాబట్టి గ్రామానికి సంగమని, సంగమేశ్వరుని పేరు మీదుగా సంగమేశ్వరమని పేరు కలిగింది.

భౌగోళిక పరిస్థితుల్లో మార్పుల వల్ల, గ్రామం ప్రస్తుత సంగమప్రదేశానికి కొద్ది దూరంగా ఉంది. ఆలయానికి రెండు వైపులా గంగాపార్వతి, నాగేంద్రస్వామి ఆలయాలున్నాయి.

గర్భాలయం, అర్ధమండపం, ఈశాన్యదిశలో, నవగ్రహ మండపం ఉన్నాయి. గర్భాలయంలో సంగమేశ్వరుని పేరిట శివ లింగం, ఆలయ కోష్టాలలోని కుమారస్వామి, దుర్గామాత శిల్పాలు దైవత్వం ఉట్టిపడేలా ఉన్నాయి.

గర్భాలయంలోని చిన్న పానపట్టం మీద ఉన్న లింగం పరమ పవిత్రంగా భావించబడి, పూజలందుంకుంటుంది. అర్ధ మండపంలో బాలాత్రిపురసుందరి, మహిషాసుర మర్దని విగ్రహాలు, కాలభైరవుని శిల్పం చూడ చక్కగా ఉన్నాయి. ప్రత్యేకంగా ప్రతిష్టించిన వినాయకుడు, విఘ్నరాజుగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గరికతో పూజిస్తుంటారు.

ఇక్కడి విశేషమేమిటంటే గర్భాలయంలోని శివలింగంపై మహాశివరాత్రినాడు సూర్యకిరణాలు ప్రసరిస్తాయి. ఆ విధంగా ఆలయంలోని ఉపాలయాల్లో తగు ఏర్పాటు చేశారు ఆనాటి శిల్పులు.

కృష్ణా, సాగరం కలిసే పరమపవిత్రమైన ఈ సంగమేశ్వరం లో స్వామిని దర్శించానికి భక్తులు రాష్ట్రం నలుమూలల నుండి వస్తుంటారు.



డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి దేవాలయ పునర్నిర్మాణ ప్రక్రియలో నిష్ణాతులు. ఆలంపురం, సోమశిల, నల్గొండ, రామప్ప దేవాలయాల పునర్నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పురావస్తు శాఖలో స్థపతిగా పనిచేసి పదవీ విరమణానంతరం కొత్త రాజధాని అమరావతిలో ప్రభుత్వానికి సలహాదారుగా సేవలు అందిస్తున్నారు. గౌతమీపుత్ర శాతకర్ణి, కొండవీటి రెడ్డిరాజులు వంటి అనేక చారిత్రక గ్రంథాలు రచించారు.



జీవకళ

కాళహస్తి కలంకారీ కథ

ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు

సంప్రదాయ కలంకారీ కళ కొత్త నడకలు నడుస్తోంది. రేఖల్లో , రంగుల్లో, బొమ్మల్లో కొత్తదనం కనిపిస్తోంది. శతాబ్దాల కిందటి కళ గుడులూ, రథాలూ, రాజమందిరాల్లో వేలాడే పరదాలూ, తోరణాల నుంచి వస్త్రధారణలో ఆధునిక డిజైన్లుగా మారింది. గాడా గుడ్డ దశ నుంచి పట్టు చీరల దాకా పాకింది. ముదురు రంగులకే పరిమితం అయిన కలంకారీలో లేత ఛాయలూ సాధ్యం అవుతున్నాయి. కేన్వాసు మీద చిత్రమై, మట్టిబొమ్మలూ, దారుశిల్పాల మీద రేఖలై ఆధునిక అభిరుచులకు అనుగుణంగా ఎన్నో మార్పు చేర్పులతో కలంకారీ కళ విస్తరిస్తోంది. 'మొఘలాయీ చక్రవర్తులు మెచ్చిన కళ, చోళ,పల్లవ విజయనగర రాజులు పోషించన ఈ ప్రాచీన కళ ఇప్పడు ఆధునిక అభిరుచికి నిర్మనంగా మారిపోయింది. ఈ మార్పు వెనుక పెద్ద కథే ఉంది...

కాలానుగుణ మార్పులకు గురైనపుడే ఏ కళకైనా విస్తృతి పెరుగుతుంది. సంప్రదాయం పేరిట యధాతధ వాదం ముందు కొచ్చినపుడు కళ రెక్కలు విప్పుకోలేని పక్షే అవుతుంది. భారతీయ పురాతన కళలు అనేకం ఈ పెనుగులాటకు గురయ్యాయి. మార్పును అంగీకరించని కళలు కొన్ని అంతరించిపోయాయి. అభిరుచులకు అనుగుణంగా స్పందించిన కళలు ఆదరణ పొందాయి. ధక్షిణభారతదేశపు ప్రాచీన వస్త్ర చిత్ర కళ కలంకారీ ఇటువంటి వొడిదుడుకులకే గురయ్యింది. చోళ,పాండ్య,పల్లవ, విజయనగర, మొఘల్ రాజమందిరాల్లోనూ, ఆలయాల్లోనూ పరదాల మీద పల్లవించిన కలంకారీ కళ ఆ తర్వాత దాదాపు వందా రెండు వందల యేళ్ల పాటూ అనాదరణకు గురయ్యింది. వలస పాలకుల కంట పడి వారిని అబ్బురపరచినా మ్యూజియం లకే ఈ పురాతన చిత్రాలు పరిమితం అయ్యాయి. స్వాతంత్ర్యా నంతర భారతదేశంలో పురాతన కళల పునరుద్ధరణ ప్రయత్నాలు మొదలయ్యాక మాత్రమే కలంకారీ కోసం తిరిగి వెతుకులాట మొదలయ్యింది. 1956లో భారత జాతీయ హస్తకళల సంస్థ మొదలైంది. కమలాదేవి ఛటోపాధ్యాయ తొలి అధ్యక్షులుగా నియమితులయ్యారు. లండన్‌లో చదువుకుంటున్న రోజుల్లో విక్టోరియా మ్యూజియంలోని ఒక వస్త్ర చిత్రం ఆమెను ఆకర్షించింది. అది 15వ శతాబ్దం నాటి భారతీయ కలంకారీ చిత్రం అని తెలుసుకున్న ఆమె హస్తకళల సంస్థ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించగానే కలంకారీ కళ ఉనికిని భారతదేశంలో గుర్తించడానికి ఒక బృందాన్ని నియమించారు.

దక్షిణ భారతదేశంలో పర్యటించిన ఆ బృందం శ్రీకాళహస్తి, బందరు ప్రాంతాల్లో కలంకారీ జాడలు కనిపెట్టింది. ఆ కళ తెలిసిన వారి కోసం అన్వేషణ మొదలైంది. శ్రీకాళహస్తిలో మూడు కుటుంబాలు కలంకారీని వృత్తిగా కొనసాగించేవనే సమాచారం సేకరించారు. ఆరణి, జంపాల, జొన్నలగడ్డ కుటుంబాలను వెతికి పట్టుకున్నారు. ఈ మూడింటిలో ఒక కుటుంబం వేరే వృత్తిలోకి మారిపోయింది. మరొక కుటుంబం 'ఇది మా కుటుంబ ఆచారం వేరే వారికి నేర్పే ప్రశ్నే లేదు' అని సహాయ నిరాకరణ ప్రకటించింది. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న జొన్నలగడ్డ లక్ష్మయ్య మాత్రం ముందు

కొచ్చారు. ఆయనే తొలి గురువుగా శ్రీకాళహస్తి కేంద్రంగా కలంకారీ పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. జాతీయ హస్తకళల సంస్థ ఆధ్వర్యంలో 1957లో శ్రీకాళహస్తిలో కలంకారీ శిక్షణ, ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఆరుగురు విద్యార్థులతో రెండు సంవత్సరాల కోర్సుకు అనుమతి లభించింది. అయితే తొలి సంవత్సరం అయిదుగురే చేరారు. ఐతూరి మునికృష్ణయ్య, రమణయ్య, గురప్పశెట్టి, రాంభోజినాయక్, విజయకుమార్ తొలి విద్యార్థులు. దాదాపుగా అంతరించిపోయిన కలంకారీ కళ పునరుద్ధరణ వీరితోనే మొదలైంది. 1961లో జొన్నలగడ్డ లక్ష్మయ్య కలంకారీ కేంద్రం బాధ్యతల నుంచి తప్పుకున్నారు. 1962లో ఆయన శిష్యుల్లో ఒకరైన ఐతూరి మునికృష్ణయ్య గురు బాధ్యతలు స్వీకరించారు. ప్రతి రెండేళ్లకీ అయిదారుగురు శిక్షణ పొందేవారు. జీవనభృతికి సరిపడేంత ఆదాయంగల వృత్తి కాకపోవడంతో ఈ కోర్సులో చేరడానికి పెద్దగా ఎవరూ ఉత్సాహం చూపేవారు కాదు. కలంకారీ చిత్ర రచన చాలా క్లిష్టమైన ప్రక్రియ కావడం కూడా ఒక కారణం.

కలంకారీ చిత్రాలకు ప్రధాన వస్తువు భారతీయ పురాణాలు. వీటి పట్ల అవగాహన ఉండాలి. బొమ్మలు గీయడంలో నేర్పరితనం ఉండాలి. ఆకులు అలములు, వనమూలికల నుంచి రాబట్టిన సహజ రంగులతోనే బొమ్మ పూర్తి చేయాలి. అరమీటరు కలంకారీ చిత్రం పూర్తి చేయడానికి దశలవారీ ప్రక్రియలతో నెలరోజుల సమయం పడుతుంది. ఏ దశలో చిన్న పొరపాటు జరిగినా చేసిన శ్రమం మొత్తం వృధా అయిపోతుంది. ఓపిక ఉండాలి. ఇంత చేసీ పూర్తి చేసిన చిత్రం అమ్ముడుపోవడం గగనం అయ్యేది. అమ్మినా కూలి కూడా గిట్టుబాటు అయ్యేది కాదు. సంపన్నులు ఎవ్వరూ ఈ కళ నేర్చుకోవడానికి ఆసక్తి చూపేవారు కాదు. శ్రీకాళహస్తిలో కలంకారీ కేంద్రం నెలకొల్పిన బహదూర్ పేట పరిసర ప్రాంతాల్లోని వారే ఒకరిద్దరు నేర్చుకునేవారు. వీళ్లలో ఎక్కువమంది చేనేత వృత్తి పనివారు. లేపాక్షి వంటి వంటి చోట్ల అమ్మడం ద్వారానూ, అవార్డులు ఇవ్వడం ద్వారానూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించినా తొలినాళ్లలో కలంకారీ కళ ఈసురోమంటూ ఉండేది.

1990లో కలంకారీ గురించి నాకు తొలిగా తెలిసింది శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ పరిశోధక విద్యార్థి తీర్థం బాలాజీ ద్వారా. ఆయనది శ్రీకాళహస్తి. చేనేత కుటుంబం. రాంభోజి నాయక్ దగ్గర కలంకారీ నేర్చుకున్నారు. కలంకారీ గురించి మరింత తెలుసుకుని వ్యాసం రాసేందుకు కావలసిన సమాచారం కోసం నేను శ్రీకాళహస్తికి మూడు నాలుగుసార్లు వెళ్లవలసి వచ్చింది. కలంకారీ బొమ్మలు గీస్తున్న వాళ్లు అప్పుడు పది పదహైదు మందికి మించి శ్రీకాళహస్తిలో లేరు. బందరు సమీపంలోని పెడనలో మాత్రం లుంగీలు, దుప్పట్లు, కర్టెన్లు, దిండు కవర్లు వంటివి కలంకారీలో చేస్తున్నారు. అయితే వారు చెక్క బ్లాక్‌ల డిజైన్‌లతో అద్దకం చేయడంతో వీటి ధర చవగ్గా ఉండేది. శ్రీకాళహస్తి కలంకారీ చిత్రాలు వీటితో పోటీ పడగలిగేవి కాదు. ఆ తర్వాత శ్రీకాళహస్తిలోనూ వేలాడే చిత్రాల నుంచి కలంకారీ బొమ్మలు చీరల మీదకీ, చుడీదార్ల మీదకీ ఎక్కాయి. బెంగుళూరు ఫ్యాషన్ డిజైనర్ల జోక్యంతో శ్రీకాళహస్తి కలంకారీలో ఎన్నో మార్పులు వచ్చాయి. తొలి రోజుల్లో సంప్రదాయ కలంకారీ కళాకారులు ఈ మార్పులను తీవ్రంగా వ్యతిరేకించారు.

కలంకారీ అన్నది సన్నని రేఖలతో లతలూ, పూల అంచుల నడుమ పురాణ ఘట్టాలూ, పాత్రల చిత్రణకే పరిమితం అయి ఉండేది. నలుపు గీతలూ, ముదురు గావు రంగు, వెలిసిపోయిన పసుపు వంటి రంగులు మాత్రమే ఉండేవి. అనేక సన్నని వొంపులతో బార్డర్లు ఆకర్షణీయంగా ఉన్నా బొమ్మల్లోని పాత్రల



కలంకారీ చిత్రం ఇలా రూపొందుతుంది...

ఫ్రేములో బిగించిన కలంకారీ చిత్రంగానీ, వేసుకునే వస్త్రం మీది కలంకారీ డిజైన్ కానీ ఎలా రూపొందుతుందో తెలిస్తే తప్ప కలంకారీ ప్రత్యేకతను గుర్తించలేరు. స్క్రీన్ ప్రింటింగ్‌లూ, లేజర్ ప్రింటింగ్‌లూ రాజ్యమేలుతున్న కాలంలో కేవలం చేతులతో గీసి, రంగులు వేసే ప్రక్రియ ఇప్పటికీ కొనసాగడమే శ్రీకాళహస్తి కలంకారీ ప్రత్యేకత. పెడన (బందరు)లాగా అచ్చుల జోలికి వెళ్లకుండా, రసాయన రంగుల్లోకి మారకుండా సంప్రదాయ సహజ శైలిని వీడకుండానే కలంకారీ చిత్రాలు రూపొందిస్తున్నారు.

* బొమ్మ వేయడానికి ముందు గుడ్డను సిద్ధం చేసుకోవడం ఒక పెద్ద పని. పాలల్లో కరక్కాయ పొడిని కలిపి అందులో గుడ్డను ముంచి ఆరబెడతారు. తర్వాత గుడ్డను మడతలు పెట్టి రోకలి వంటి కొయ్యతో మర్దనా చేస్తారు. కరక్కాయ మిశ్రమం ముద్దలుగా గుడ్డ మీద మిగిలిపోకుండా ఇలా చేస్తారు.
* ఈ గుడ్డ మీద బొమ్మ, డిజైన్ కోసం స్కెచ్ గీసుకోవాలి. ఇందుకోసం పెన్సిల్ వంటివి వాడరు. ఎండి రాలిన సన్నని చింత పుల్లలను ఏరి సంప్రదాయ పద్ధతిలో కాల్చి మట్టిలో పూడ్చిపెట్టి బొగ్గులుగా మార్చుకుంటారు. ఈ చింతబొగ్గు పుల్లలను కూసుగా పెన్సిల్ మొనలా చెక్కుకుంటారు.
* మడతలు లేకుండా గుడ్డను పరిచి బొమ్మ, డిజైన్ స్కెచ్ గీసుకుంటారు.
* బెల్లం, తాటిబెల్లం నీళ్లలో కరగబెట్టి అందులో తుప్పు పట్టిన ఇనుప ముక్కలు వేసి పదహైదు రోజులు మట్టికుండలో మగ్గబెట్టి నలుపు గీతల కోసం ఒక మిశ్రమం తయారు చేసుకుంటారు. దీనిని కసిం అంటారు. దీంతో స్కెచ్ మీద అవుట్ లైన్‌లు గీసుకుంటారు. గీసినపుడు ఇది నలుపు రంగులో కనిపించదు. నీటి చెమ్మలా లేత పచ్చ వర్ణంలో ఉంటుంది. గీసిన చోటే మళ్లీ గీస్తే ముద్దగా పడిపోయి పాడైపోతుంది.
* ఈ గీతలు గీయడానికి సన్నని వెదురుపుల్ల మొన చెక్కు కుని దానికి నూలుతో ఉండలా చుట్టి కలం తయారు చేసుకుంటారు. నూలు ఉండ భాగాన్ని కసింలో ముంచి నపుడు మిశ్రమాన్ని వీల్చుకుంటుంది. బొటనవేలు, చూపుడు వేళ్లతో నూలు ఉండను పట్టుకుని సున్నితంగా నొక్కుతూ గీత గీస్తూ ఉంటూ సన్నని ధారలా కసిం మిశ్రమం రేఖ మీద పడుతుంది. గట్టిగా నొక్కితే ముద్దగా పడిపోతుంది. సరిగా నొక్కకపోతే కసిం కారదు. ఒకే రకమైన ఒత్తిడితోనే చివరి వరకూ కొనసాగించాలి. బొమ్మలో నలుపు రంగు అవసర మైన చోట అంతా కసిం నింపాలి.



* బొమ్మలో ఎరుపు రంగు నింపవలసిన తావుల్లో పటికనీళ్లలో కలం ముంచి నింపుతారు. వేయగానే ఇది లేత గోధుమ రంగులో కనిపిస్తుంది.
* ఈ గుడ్డను పారుతున్న నీటిలో వేసి జాడిస్తారు. లేదా. ఎక్కువ మోతాదులో నీరున్న తొట్టెలో అయినా వేసి గుడ్డ ఒక చివర పట్టుకుని జాడిస్తారు.
* సురుడు చెక్క, చావల్కొడి, మంజిష్ట కలిపిన నీటినిగానీ దానిమ్మ బెరడు, మోదుగు పూలు, వరిగడ్డి వేసిన నీటినిగానీ మరగబెడుతారు. గుడ్డను దీనిలో గంటన్నర పాటు ఉడకనిస్తారు. చిత్రంలో తెల్లని తెలుపు భాగం రావాలనుకుంటే ఈ నీటిలో పబ్బాకు వేస్తారు.
* బయటకు తీసిన గుడ్డను నాలుగు గంటల పాటు ఎండలో ఆరబెడతారు. మళ్లీ ఒకసారి కరక్కాయపొడి,పాల మిశ్రమంలో గుడ్డను ముంచి కొంతసేపు ఎండలో ఉంచి తీసి నీడలో రెండు రోజులు ఆరబెడతారు.
* గుడ్డ ఆరే కొద్దీ నలుపు, ఎరుపు రంగులు కనిపిస్తాయి. ఎరుపు రంగు చిత్రంలో ఎక్కువ భాగం ఉంటుంది. అది తెరలు తెరలుగా ఉంటే మరొకసారి పటికనీటితో ఆ భాగాలను కలంతో నింపి పారేనీటిలోనూ, మరిగే నీటిలోనూ మరొకసారి ఉంచి ఎండలో, నీడలో ఆరబెట్టి, చివరికి పారే నీటిలో శుభ్రంగా ఉతికి ఆరబెడితే కలంకారీ చిత్రం తయారవుతుంది. ఇది సంప్రదాయ కలంకారీ రంగుల పద్ధతి.
* పసుపు, నీలం, ఆకుపచ్చ రంగుల కోసం గొర్రె పేడ మిశ్రమంలో ఒక రాత్రి అంతా నానబెట్టి ఉతుకుతారు. నీలి ఆకులు, జాప్రా గింజలు, మామిడి చెక్క వంటివి కూడా వాడుతారు.
* లేత వర్ణాలు కోసం వేలికి దూది ఉండ చుట్టిన గుడ్డను కట్టుకుని మిశ్రమం వేసిన చోట అద్దుకుంటూ వెళ్లడం ద్వారా రంగు గాఢత తగ్గిస్తారు.

ఇంత సుదీర్ఘ ప్రక్రియల్లోంచి రూపొందిన కలంకారీ రంగులు ఎప్పటికీ వెలిసిపోవు. గుడ్డ చిరిగిపోవలసిందే కానీ రంగులు పాలిపోవు.



ముఖాలు సున్నితంగా సొగసుగా ఉండేవి కావు. మొరటుగా కనిపించేవి. వీటిల్లో మార్పులు తీసుకురావాలని రాంభోజి నాయక్ తపన పడేవారు. లేత రంగుల కోసం ప్రయోగాలు చేసేవారు. ఆయన తరంలో సాధ్యం కాకపోయినా, ఆయన తర్వాతి తరంలో ఇది సాధ్యం అయింది. తీర్థం బాలాజీ వంటి శిష్యులు బొమ్మల్లో అనేక మార్పులు తీసుకువచ్చారు. తంజావూరు, మధురై వంటి ఆలయాలను సందర్శించి శిల్ప చిత్రాలను పోలిన బొమ్మలు కలంకారీ గుడ్డ మీదకు తీసుకువచ్చారు. బాపూ బొమ్మల్లా సొగసు గలిగిన ఆ బొమ్మలు చూసి మొదట్లో శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు మండిపడ్డారు. సంప్రదాయం మంటగలుపుతున్నా డని ఆవేశపడ్డారు. అయితే తీర్థం బాలాజీ ప్రధాన వృత్తి కలంకారీ కాదు, చదువుకుంటూనే ఆయన అనేక ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. పురాణ వస్తువుతో పాటూ సమకాలీన సామాజిక పరిస్థితులను కలంకారీలో చిత్రించారు. పిల్లలకు ఆయన వేసిన బొమ్మలతో మద్రాసులోని ఒక ప్రచురణ సంస్థ అందమైన పుస్తకం అచ్చు వేసింది. కలంకారీని ఇలా కూడా వాడుకోవచ్చా అని సంప్రదాయ చిత్రకారులు ఆశ్చర్యపోయారు. చదువులో భాగంగా ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాలకు వెళ్లిన తీర్థం బాలాజీ తన వెంట కలంకారీని కూడా తీసుకువెళ్లారు. ఆ దేశాల్లో కలంకారీ నేర్పిస్తూ, అక్కడ కలంకారీ చిత్రాల ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఢిల్లీ, ఆగ్రా, బెంగుళూరు, చెన్నై నగరాల్లోనూ ఆయన చిత్రాలు ప్రదర్శించే అవకాశం వచ్చింది. కలంకారీ ప్రచారానికి ఇది బాగా ఉపయోగపడింది. బాలాజీకి జాతీయ అవార్డు కూడా వచ్చింది. ఆ తర్వాత శాస్త్రవేత్తగా ఆయన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడ్డా కలంకారీని కొనసాగించారు.

ఆయన శిష్యుడు రమేష్ గొర్జాల అయితే కలంకారీలో పెనుమార్పులకే కారణం అయ్యారు. హైదరాబాద్ జెఎన్ టియులో ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేసిన రమేష్ గొర్జాల కలంకారీ చిత్రాలను గుడ్డ మీద నుంచి కేన్వాసు మీదకు బదిలీ చేశారు. పౌరాణిక ఘట్టాల నేపథ్యాన్నీ, ఆధునిక చిత్రాలనూ మేళవించి అక్రిలిక్ రంగుల్లో కొత్త చిత్రాలకు రూపం పోశారు. ఈ ప్రయోగంతో ఆయన అంతర్జాతీయ కళాకారుల జాబితాలో చేరిపోయారు. ఇప్పటికీ సంప్రదాయ కలంకారీ కళాకారులు ఆయన మీద రుస రుసలాడుతూనే ఉన్నా చిత్రకారుడిగా ఆయనకు లభించిన పేరు ప్రఖ్యాతులు ఆయననూ, కలంకారీనీ కాపాడుతున్నాయి.

2000 తర్వాత శ్రీకాళహస్తి కలంకారీ రెండు పాయలుగా విస్తరించడం మొదలైంది. ఒక పాయ వేలాడే చిత్రాలుగా అనేకానేక మార్పు చేర్పులకు గురవుతూ ఆదరణ పొందుతూ ఉంటే, మరొక పాయ ఫ్యాషన్ డిజైన్‌గా ఖ్యాతి పొందడం. మొదటిది పేరు ప్రఖ్యాతులు, అవార్డులు తెచ్చిపెడుతోంది. రెండవది ఒక పెద్ద ఉపాధి పరిశ్రమగా మారి దాదాపు రెండు వేలమందికి జీవనాధారం అయ్యింది. శ్రీకాళహస్తి కలంకారీ చిత్రాకారుల్లో 12 మంది జాతీయ హస్తకళల విభాగంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారంటేనే అర్థమవుతోంది కలంకారీ విశ్వరూపం. రాష్ట్ర అవార్డులు అందుకున్న వారి సంఖ్య అయితే లెక్కకు మిక్కిలి ఉంది. కలంకారీలో ఒక పాయ ప్రశంసలూ,



అవార్డులతో పేరు పొందుతూ ఉంటే, మరొక పాయ ఉపాధి పరిశ్రమగా స్త్రీలకు ఆసరా అయ్యింది. శ్రీకాళహస్తి కలంకారీ కేంద్రాలు అనేకం వెలిశాయి. వీటిల్లో భారీ ఎత్తున కలంకారీ వస్త్రాల ఉత్పత్తి జరుగుతోంది. అభిరుచికి తగ్గ డిజైన్లతో సిద్ధం చేసిన వస్త్రాలను వీరు దేశంలోని అన్ని ప్రాంతాలకూ పంపు తున్నారు. కోట్ల రూపాయల టర్నోవర్ గల పరిశ్రమగా ఇప్పుడు శ్రీకాళహస్తి కలంకారీ మారిపోయింది.

ముదురు గాడా గుడ్డకే ఒకనాడు పరిమితం అయిన కలంకారీ ఇప్పుడు పట్టు సహా సకల సిల్క్ వస్త్రాల మీదా కనిపి స్తోంది. రంగుల్లోనూ లేత ఛాయలు సాధించారు. కొత్త రంగుల సాధనలో పూజారి మునిరత్నం చేసిన కృషి గుర్తించతగినది. సంప్రదాయ రంగులకే పరిమితం కాకుండా ప్రకృతిలో దొరికే ఇతర ఆకులూ, బెరళ్లూ, వేళ్లూ, పూల సాయంతో ఆయన కొత్త రంగులను సృష్టించారు. ఏకంగా మనుషుల ముఖచిత్రాలనే కలంకారీ వస్త్రం మీదకు ఎక్కించగలుగుతున్నారు. సంప్రదాయ చిత్ర శైలికి ఏ మాత్రం భంగం వాటిల్లకుండా పూజారి మునిరత్నం చేస్తున్న ప్రయత్నాలు చిత్రప్రపంచాన్ని విశేషంగా ఆకర్షించాయి. ఒక రకంగా కలంకారీ చిత్రాల రూపురేఖల్లో విప్లవాత్మక మార్పు లకు ఆయన కారణం అయ్యారు. అయితే, ఆయన కూడా ఇప్పటికీ సంప్రదాయ చిత్రకారుల నిరసనలు ఎదుర్కొనక తప్పడం లేదు.

టీటీడీ శిల్పకళాశాలలో కలంకారీ బోధిస్తున్న ఆయన అనేకమంది కొత్త శిష్యలను తయారు చేస్తున్నారు. వర్తమాన చిత్రకారులు కలంకారీ శైలిని వస్త్రానికే పరిమితం చేయడం లేదు. కేన్వాసు మీదకీ, దారుశిల్పాల మీదకీ, గోడల మీదకీ కూడా ఎక్కి స్తున్నారు. వస్తువులోనూ, రంగుల్లోనూ కొత్తదనం కోసం ప్రయత్ని స్తున్నారు. సంప్రదాయం పేరుతో ఎటువంటి మార్పులకూ గురి కాకుండా ఉండి ఉంటే శ్రీకాళహస్తి కలంకారీ కళ పరదాల దశ దాటేది కాదు. ఇప్పుడు కలంకారీ చిత్రాలు దేశంలోని ప్రఖ్యాత హోటళ్లలోనూ, రెస్టారెంట్లలోనూ, అతిథి గృహాల్లోనూ, సంపన్నుల విలాసవంతమైన నివాసాల్లోనూ దర్శనమిస్తున్నాయి. ఈ పరి ణామాలు కలంకారీ కళ విస్తృతికీ, కళాకారుల జీవన స్థితిగతులు మెరుగుపడడానికీ కూడా ఉపయోగపడుతున్నాయి. శ్రీకాళహస్తిలో ఇప్పుడు కలంకారీ కళాకారులు వీధి వీధినా కనిపిస్తారు.



రాఘవులు, నిరంజన్, మునెయ్య, వాసు, ధనుంజయరావు, శ్రీనివాసులరెడ్డి, మురళి, ప్రసాద్, రమేష్, విశ్వనాధరెడ్డి, అజయ్ కుమార్, లక్ష్మమ్మ, గీత, రామచంద్రయ్య, మునిరత్నమ్మ, కైలాసం, భాస్కర్, సుబ్రహ్మణ్యం, నరసింహులు, బాల సుబ్రమ్మణ్యం... ఇంకా ఎందరో కలంకారీనీ కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.



కవి, పరిశోధకుడు, సీనియర్ పాత్రికేయుడు ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు దాదాపు 15 కథలు రాశారు. ఉత్తమ పాత్రికేయుడుగా వివిధ ప్రతిష్టాత్మక పురస్కారాలు లభించాయి. ఆంధ్రజ్యోతి రాయలసీమ బాధ్యుడు. నివాసం తిరుపతి. 2009 చికాగో తానా మహాసభల అతిథి.



మంచి పుస్తకం

నేల నాలుగు చెరగులా తెలుగు గుబాళింపే!

కాసిరెడ్డి నరేన్

ఎన్ని పుస్తకాలు చదివినా వాటిలో కొన్ని జీవితానికి సరిపడ జ్ఞానాన్ని, అనుభవాన్ని అందించి కలకాలం గుర్తుండిపోయేలా చేస్తాయి. అలా ఒక మంచి పుస్తకం చదవడం అరుదైన అనుభవంగా మిగిలిపోతుంది. అలాంటి అనుభవంలోంచి వచ్చినదే ఈ వ్యాసం.

మంచి పుస్తకం చదవడం దాచుకోదగిన, అరుదైన, అందమైన అనుభవం. మంచి పుస్తకం జీవిత అంతస్సారాన్ని అలవోకగా బోధపరుస్తుంది. జీవితంలో ఎన్నో అర్థంకాని సమస్యలకు అర్థవంతమైన పరిష్కారాలను అందించేది ఓ మంచి పుస్తకమే. చదివే అలవాటు, చదివిన దాన్ని అర్థం చేసుకొని అన్వయించుకొనే ఆరాటం ఉండాలేకాని జ్ఞానచక్షువులను తెరిపించేది పుస్తకమే. నవల కావచ్చు, కవిత్వం, కథ కావచ్చు, నాటకం లేదా జీవితచరిత్ర కావచ్చు. అది ఏదయినా జీవన విలువలను, సూత్రాలను అందిస్తుంది.

నవల, కథ, కవిత, నాటకం వంటి సృజనాత్మక రచనలు చదివినప్పుడు కలిగే ఆనందం, ఆత్మీయస్పర్శ జీవితచరిత్రలు లేదా ఆత్మకథల వంటి పుస్తకాలు చదివేటప్పుడు ఉండక పోవచ్చు. కానీ కొన్ని అందుకు మినహాయింపే. గాంధీజీ ఆత్మకథ 'సత్యశోధన' చదివాక ఉత్తేజితుడు కాని పాఠకుడుంటాడా? నెహ్రూగారి 'గ్లిమ్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' చదివినప్పుడు సంపాదించుకునే జ్ఞానం ఎన్ని గ్రంథాలు చదివితే, ఎన్ని సంవత్సరాల జీవనసారం పిండుకుంటే పొందగలుగుతాం?

తెలుగులో వెలువడిన అటువంటి ఆత్మకథల్లో టంగుటూరి ప్రకాశంపంతులు 'నా జీవితయాత్ర', ప్రముఖ విప్లవకారుడు, స్వాతంత్ర సమర యోధుడు దరిశి చెంచయ్య 'నేనూ నా దేశం', ప్రముఖ రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'అనుభవాలూ జ్ఞాపకాలూనూ' వంటి సరసన నిలబడే అద్భుతమయిన ఆత్మ కథాత్మక గ్రంథం 'హంపీ నుంచి హరప్పా దాకా.' రచయిత తిరుమల రామచంద్ర. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, సంస్కృత, ప్రాకృత, ఆంగ్ల భాషల్లో పాండిత్యమున్న బహుభాషా కోవిదుడు. 'లిపి-పుట్టు పూర్వోత్తరాలు', 'నుడి-నానుడి', 'గాథాసప్తశతిల్లో తెలుగు పదాలు' వంటి ఎన్నో పరిశోధనా గ్రంథాలు రచించారు. వివిధ పత్రికల్లో శీర్షికలు నిర్వహించి సాహితీ, సాంస్కృతిక విషయాల పై సాధికారిక వ్యాసాలు రాశారు. నిన్నమొన్నటి వరకూ మనమధ్యన సంచరించిన ఓ మహా పండితుడి జీవనశకలంలో కొన్ని భాగాలే ఈ పుస్తకం.

1913లో నేటి కర్ణాటక రాష్ట్రంలోని హంపీ దగ్గర ఉన్న కమలాపురంలో సాంప్రదాయ వైష్ణవ కుటుంబంలో జన్మించి అదే సంప్రదాయ పద్ధతుల్లో సంస్కృత విద్యను అభ్యసించారు. అనేగొంది, నెల్లూరు, తిరుపతి వంటి ఊళ్లల్లో చదువుకొన్నారు. ఉద్యోగం కోసం మద్రాసు నుండి లక్నో, అలహాబాద్, లాహోర్ వరకు ప్రయాణం చేసి నడివయసులో హైదరాబాద్ చేరుకొని వివిధ పత్రికల్లో పనిచేస్తూ, 1997లో తన ఎనభై నాలుగో ఏట మరణించారు. ఈ పుస్తకం 'హంపీ నుంచి హరప్పా దాకా' వారి మరణానంతరం 1997లో మొదటిసారి ప్రచురింపబడింది. ఆ తరువాత 2002 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది.

ఇంత సాంప్రదాయ వాతావరణంలో పుట్టి పెరిగి, చదువుకొని, వివిధ మతసారాలను ఆవాహనం చేసుకొని, గాంధీతత్వాన్ని జీవనవిధానంగా స్వీకరించి, బౌద్ధాన్ని అభిమానించి, మహా పండితులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని గురువుగా భావించిన తిరుమల రామచంద్ర ఏనాడూ దేవుడికి మొక్కిన సందర్భం లేదని (చిన్నతనంలో మినహా) చెప్పడం కొంచెం ఆశ్చర్యంగానే ఉంటుంది. స్వాతంత్రోద్యమంలో పాల్గొంటూనే కొంతకాలంపాటు విప్లవపంథాలో ప్రయాణంచేసి సంవత్సరం పాటు జైలు జీవితం గడిపి, చదువుకోసం కొన్ని సందర్భాల్లో రోజుల తరబడి తిండి లేకుండా గడిపిన వారి ఆదర్శానికి, జ్ఞానతృష్ణకు జోహార్లు అర్పించకుండా ఉండలేం. ఇలా వైవిధ్యభరితంగా, వైరుధ్యాలతో ఆయన గడిపిన జీవితంలో మూడవవంతు భాగాన్ని మాత్రమే 61 ప్రకరణాలతో ఈ పుస్తకాన్ని రాశారు. ఒక్కొక్క ప్రకరణం ఒక్కో కథలా సాగిపోతుంది. ప్రతిదానికి మొదలు, చివర ప్రాకృత, సంస్కృత శ్లోకాలను ఉదహరిస్తూ ఆ ప్రకరణాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దారు.



దాదాపు 500 పేజీలున్న ఈ గ్రంథాన్ని చదివాక తిరుమల రామచంద్ర, వారి మొత్తం జీవితాన్ని ఇలా అందించగలిగితే ఎంత బాగుండేది అనిపిస్తుంది. ఇక ఇప్పుడు ఆ మిగిలిన జీవిత భాగాన్ని తెలుసుకునే అదృష్టం పాఠకులకు లేదు కదా! తలుచుకుంటే బాధగానే ఉంటుంది.

రామచంద్రగారి ఇంట్లో తాతముత్తాతల కాలంనాటి సగం విరిగిన ఇనుపగుండు ఉండేదట. పిండి కొట్టడానికి, నూరడానికి దాన్ని వాడేవారట. అదేవిటో అర్థంకాక వారి తాతగారిని అడిగితే, అదో పెద్ద కథ అంటూ తిరుమల వంశం గురించి వివరించారట. అలా ప్రారంభమవుతుంది ఈ పుస్తకం. ఈ మొదటి ప్రకరణం పేరు- గుండ్రాయి చెప్పిన గాథ. దీనికి మొదట్లో-

అహో! శిలే తే సౌభాగ్యం
య దహల్యా కృతేయుగే
సంస్కృతే రితిహాసస్య
సాక్షిభూతా సి సర్వదా

దీని అర్థం ఇది- ఓ రాయీ! కృతయుగంలో నీవు అహల్యగా ఉన్నావు. ఎంత భాగ్యం నీది. సంస్కృతికి, ఇతిహాసానికి కూడా ఎప్పుడూ సాక్షిగానే ఉన్నావు. ఇలా అర్థవంతమైన శ్లోకాలతో ప్రతి ప్రకరణాన్ని ఒక అర్థవంతమైన జీవిత శకలపు కథగా మలిచారు రామచంద్ర. తాను పుట్టి పెరిగిన కమలాపుర చరిత్రను, హంపీనగర శిథిల ప్రాభవాన్ని, విజయనగర సామ్రాజ్యపు ప్రారంభ రాజధాని అనేగొంది ప్రాశస్త్యాన్ని, బళ్లారి పట్టణంలో నిత్యం గుబాళించే తెలుగు సొరభాన్ని, మద్రాసులో ఉండిన తెలుగు ప్రముఖుల పాండితీ ప్రకర్షనీ- ఇలా వారు సంచరించిన ప్రతి ప్రాంతంలోని పండితులకు సైతం తెలియని విశేషాలను రామచంద్ర ఉదహరించారు. అదే ఈ రచనలోని ప్రత్యేకత.

ఈ పుస్తకం చదువుతున్నంతసేపూ హృదయం భారమవుతుంది. ఒకనాటి తెలుగు సంప్రదాయాలు, భాష, తెలుగువారు నివసించిన, సంచరించిన ప్రాంతాలు ఇప్పుడేమయిపోయాయి? అవన్నీ మనకు కాకుండా ఎలా పోయాయో ఈ రాజకీయ చదరంగ క్రీడలో తెలుగువారికి కలిగిన అపార నష్టం తల్చుకుంటే గుండె తరుక్కుపోతుంది. ఇప్పుడు కర్ణాటకలో ఉన్న అనేగొంది, కమలాపురం, బళ్లారి ప్రాంతాల్లో తెలుగు పండుగులప్పుడు జరుపుకునే సంబరాలను తెలుసుకున్నప్పుడు, మహాతపస్విని కొండమ్మవ్వ ప్రకరణం చదువుతున్నప్పుడు, మద్రాసులో కాశీనాథుని నాగేశ్వరరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, మానవల్లి రామకృష్ణ కవి, తెలుగువారి పేరుప్రఖ్యాతులను ఖండాంతరాలకు సైతం వ్యాపింపజేసిన సుబామైసిన్ రూపకర్త ఎల్లాప్రగడ సుబ్బారావు వంటి ప్రముఖులతో రామచంద్రగారికున్న అనుబంధ బాంధవ్యాలను వివరిస్తున్నప్పుడు, యోగదార్శినికుడు మాస్టర్ సి.వి. కుంభకోణంలోని తెలుగువారని తెలిసినప్పుడు కించిత్ గర్వం కలుగుతుంది. తిరుపతి సంస్కృత కళాశాలలో, 'నాకు తెలుగు రాదు, తమిళ భాగం ఇవ్వమనండి,' అన్న తమిళ విద్యార్థితో ప్రిన్సిపల్ సేలం సుబ్బారావు, 'నాయనా, ఇది తెలుగుదేశం. నీవు తెలుగుదేశంలో ఉన్నావు. తెలుగు నేర్చుకోవాలి. లేకపోతే మార్కులు తగ్గిపోతాయి,' అని విస్పష్టంగా ప్రకటించిన తెలుగుస్ఫూర్తిని అనుభవించిన ఈ నేల ప్రస్తుత తెలుగు పాలనలో తెలుగుకు ఎంత దూరంగా జరిగిపోయిందో తలుచుకొని బాధపడాల్సిందే. నేల నాలుగు చెరగులా వ్యాపించిన తెలుగు వైభవం ఇప్పుడెక్కడ? అని ఖేదపడాల్సిందే. 1939లో తిరుమల రామచంద్ర లాహోర్‌లో ఉద్యోగిగా వెళ్లినప్పుడు అక్కడి ఆయుర్వేద కళాశాల నామఫలకం మీద, ఆ కాలేజీ పునాదిరాయి వేసిన వైద్యరత్న పండిట్ డి. గోపాలాచార్య పేరు చూసి మురిసిపోయారు. అంతేనా, ఓ సాయంత్రం లాహోర్ వీధుల్లో గుల్జార్‌సింగ్ క్రీడావిన్యాసాలు చూసి అబ్బురపడిన రామచంద్రకి ఆ గుల్జార్‌కి గురువు మన కోడి రామ్మూర్తిగారని తెలుసుకొని కించిత్ గర్వమూ కలిగింది. ఇలా కుంభకోణం మొదలు మద్రాసు, బళ్లారి నుండి లాహోర్ వరకు పరిమళించిన తెలుగు సౌరభం నేడెక్కడ? ఏవి తల్లీ, నిరుడు కురిసిన హిమసమూహములు.

భారతి పత్రిక సంపాదకులు గన్నవరపు సుబ్బరామయ్య గారింట్లో శ్రాద్ధకర్మలు నిర్వహించడానికి వచ్చిన మారేపల్లి రామశాస్త్రిగారి ఉదంతం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆయన వీరాంధ్రవాది. ఆ తద్దినాన్ని కూడా ఆయన తెలుగులోనే నిర్వహించారు. అంతేకాదు, ప్రతిరోజూ సంధ్యావందనం సైతం తెలుగులోనే చేసేవారట. ఆయన 'తెలుగు గుడి' అనే సంస్థను స్థాపించి, నుడికడలి అనే అచ్చతెలుగు నిఘంటు నిర్మాణం ప్రారంభించా

రని రామచంద్ర ఈ గ్రంథంలోని ఓ ప్రకరణంలో వివరంగా రాశారు. ఇప్పటికీ అచ్చుకాని మారేపల్లి వారి ఆ తెలుగు నిఘంటువు 'నుడికడలి' రాతప్రతి ఇప్పుడెక్కడుందో? అక్కడా ఇక్కడా ఉందని ఆ నోటా ఈ నోటా వినడమే కాని ఇంకా బయట పడలేదు.

ఇలా చెప్పుకుంటూ పోతే, ఎన్నో విషయాలు... ఎంతో అనుభవసారం... ఈ పుస్తకం చదువుతుంటే ఒక ఆత్మీయమైన, మానవీయమైన స్పర్శ మన గుండెల్ని తాకుతుంది. హృదయాన్ని ఆర్ద్రపరుస్తుంది. 'అనాచారం, దొంగతనం', 'అమ్మమాట', 'గొడుగుపాలుడు' వంటి ప్రకరణాలు పాఠకులకు కన్నీళ్లు తెప్పిస్తాయి. తెలుగు నుడికారాలతో, నానుడులతో, పదబంధాలతో నిండిన ఈ పుస్తకం చదవడం ఓ గొప్ప అనుభవం.

'ఎవడు దేశాలు తిరుగుతాడో, ఎవడు పండితులను సేవిస్తాడో వాడి బుద్ధి నీటిలో పడిన నూనెచుక్కలాగా విస్తరిస్తుంది. నాకవి రెండూ అవి ఎంతవరకు అబ్బినాయో బేరీజు వేసుకుంటూ నడిచాను. నూరేళ్లు ఇలా నడవ తప్పదేమో అనిపిస్తుంది.' ఈ వాక్యాలతో నిండిన శ్లోకంతో ఈ గ్రంథం పూర్తవుతుంది.

'ఓల్గా సే గంగా' వంటి అద్భుత గ్రంథాలను రాసిన రాహుల్ సాంకృత్యాన్‌కు దీటైన మన తెలుగు సాంకృత్యాయన్ తిరుమల రామచంద్ర కళ్ల ముందు కదలాడతారు. వారికి చేతులెత్తి నమస్కరిద్దాం.



తెలుగునాట 29 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా వార్షిక కథా సంకలనాలు ప్రచురిస్తున్న కథాసాహితి సహ సంపాదకులు. వ్యాసకర్త. అంతకుముందు ప్రజాసాహితి పత్రిక సంపాదకులు. 'తెలంగాణ సాయుధ పోరాట కథలు', 'తెలుగు కథ - 60-85' పుస్తకాలకు సంపాదకులు. కేంద్ర సాహిత్య అకాడమి పాలకమండలి సభ్యులు. నివాసం హైదరాబాద్. 2019 తానా సభల అతిథి.

idexcel



చిత్రకళా తపస్వి వడ్డాది పాపయ్య

బీర శ్రీనివాస్

ఇంద్రధనువులోని సప్తవర్ణాల సంగమం ఆయన చిత్రం. రంగులన్నీ కలబోసిన ఓ అద్భుత ప్రపంచాన్ని, తనదైన ఓ మనోహర వర్ణచిత్రాన్ని ఆవిష్కరించిన చిత్రకళా తపస్వి. రంగులకే రారాజు ఆయన. వర్ణ మిశ్రమంలో తనదైన ప్రత్యేకత, మరెవ్వరూ అనుకరింప వీలుకాని రంగుల పద్మవ్యూహం. ఆయన చిత్రణ చూపరుల మనస్సుని రాగరంజితం చేస్తుంది. తెలుగు బొమ్మ గొప్పదనాన్ని ప్రతిష్టను ఇనుమడింపజేసిన ఆ రంగులరేడు వడ్డాది పాపయ్య.

చిత్రకళకు నగిషీలు చెక్కుతూ వేలాది చిత్రాలను అలవోక గా గీసి, సన్మానాలకు పొగడ్తలకు దూరంగా చిత్రకళా తపస్సులో జీవితం గడిపిన చిత్రకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి వడ్డాది పాపయ్య.

వడ్డాది పాపయ్య నాగావళీ నదీతీరాన ఉన్న శ్రీకాకుళం జిల్లా కశింకోటలో 1921 సెప్టెంబరు 10న శ్రీరామమూర్తి, మహాలక్ష్మి దంపతులకు జన్మించారు. తండ్రి వృత్తిరీత్యా శ్రీకాకుళం హైస్కూల్లో (ఇప్పటి ఎన్.టి.ఆర్. మున్సిపల్ స్కూలు) చిత్రకళ ఉపాధ్యాయులు కావడంతో పాపయ్య తండ్రి వద్దనే చిత్రకళలో ఓనమాలు నేర్చుకొన్నారు. తండ్రి చిత్రాలు రచించే పద్ధతిని శ్రద్ధగా పరిశీలించిన పాపయ్య ఓ హనుమంతుని బొమ్మతో చిత్రకళా రంగంలోకి కుంచె మోపారు.

అహర్నిశలు శ్రమించి రేఖల్లో రంగులు మేళవించడంలో గట్టి పట్టు దొరికేసరికి వడ్డాది రంగుల రాజ్యానికి రారాజు కాగలిగారు.

వడ్డాది పాపయ్యగారి కుంచె పేరు వపా. ఆయన శైలి అనితర సాధ్యం. కావ్య నాయికలను ఆయన చిత్రించిన తీరు అద్భుతం. పౌరాణిక దృశ్యాలను ఆయన సినిమా సెట్లకన్నా మనోజ్ఞంగా చిత్రించి చూపారు. ఆయన చిత్రించిన స్త్రీల రూపు రేఖలు చిత్రంగా ఉంటాయి. చెవులకు నాగులజోడు, కొప్పులో మొగిలిరేకు, ముక్కుకు ముక్కెర, కాళ్లకు వెండి కడియాలు, గెడ్డం మీద పచ్చబొట్టు తప్పనిసరి. ఈయన తన కుంచెతో జానపద, పౌరాణిక, ఇతిహాసాలకు చిత్రరూపాన్నిచ్చారు. దేవతామూర్తుల నుండి దీనజనుల వరకు, గంధర్వ లోకాల నుండి గ్రామసీమల వరకు, వయ్యారాల నుండి ఒంపుసొంపుల వరకు ఆయన కుంచెకు కరతలామలకం. రాజుల కిరీటాల నుండి బిక్షగాళ్ల పాత్రల వరకు, అంత:పుర కన్యల అందాల నుండీ శ్రమజీవుల బతుకుల వరకు ఈయన గీయని విషయమంటూ లేదు. రతీమన్మధులకు ఆకృతులు కల్పించి రంభ, ఊర్వశి, తిలోత్తమ, విశ్వమోహినిలాంటి అచ్చర కన్నెలను తెలుగువారి ముంగిట సాక్షాత్కరింపజేశారు. నండూరివారి ఎంకి, నాగమల్లి ఆయన చేతుల్లో రూపుదిద్దు కొన్నారు. కావ్య నాయికలకే కాకుండా ఋతువులకు, రాగాలకు, నక్షత్రాలకు దృశ్యరూపమిచ్చిన అపరబ్రహ్మ వడ్డాది. ఆయన తన కుంచెతో చిత్రకళాభిమానులకు కళామృతాన్ని పంచిన కళామూర్తి.

వపా చిత్రకారుడు మాత్రమే కాదు. రచయిత, కార్టూనిస్టు కూడా! రేరాణి, అభిసారిక, భారతి పత్రికలలో ప్రచురితమైన

బొమ్మలతో ఆయన ఓ సంచలన చిత్రకారుడయ్యారు. చంద మామ సంపాదకులు చక్రపాణితో పరిచయం కలిగిన దగ్గర నుండి దాదాపు అర్ధశతాబ్దం పాటు క్రమం తప్పకుండా చందమామను తన కుంచెతో అలంకరించారు. చక్రపాణి సంపాదకత్వంలో వెలువడిన యువ పత్రికలో కూడా నెలకు ఆయన నాలుగు వర్ణ చిత్రాలు వేసేవారు. పోతన, దేవులపల్లి, శ్రీశ్రీ ఆయన ఇష్టపడే కవులు. అలాగే వీరికి సంగీతమంటే మక్కువ ఎక్కువ. కరుణశ్రీ గారి ఉదయశ్రీకి ఆయన వేసిన బొమ్మలు ఎంతో పేరును సంపాదించుకొన్నాయి. అప్పట్లో చందమామను ఎనిమిది భాషల్లో ప్రచురించడం వల్ల వడ్డాది చిత్రాలు దేశవిదేశాల్లో ప్రాచుర్యం పొందాయి. చందమామ, యువ పత్రికల తర్వాత స్వాతి వార పత్రిక వీరి చిత్రాలను ప్రచురించింది.

వపా చిత్రాల్లో ఎక్కువగా తెలుగుదనం, తెలుగు సంస్కృతి, ఆచార వ్యవహారాలు, అలంకరణలు, పండుగలకు ప్రత్యేక ప్రాముఖ్యత నిచ్చేవారు. చిత్రకారులు తమ చిత్రాలకు మోడల్స్‌ను ఉపయోగించడం అనాదిగా వస్తున్నదే. కానీ వపా చిత్రాల్లోని రూపాలు ఆయన మానస జన్మితాలే! మోడల్ అవసరం లేకుండానే ఆయన అందమైన స్త్రీ, పురుష రూపాలను అద్భుతంగా చిత్రించి విమర్శకులను సైతం మెప్పించగలిగారు.

ఏకాంతాన్ని అతిగా కోరుకొనే వడ్డాది పాపయ్య నిశ్శబ్దంగా ఉన్నప్పుడే చిత్రాలు గీసేవారు. వీరు ఖరగ్‌పూరులోను, శ్రీకాకుళం లోను తన వ్యక్తిగత చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించారు. అంతే!





ఆ తర్వాత వారిని ఎంతమంది కోరినా కళా ప్రదర్శనకు అంగీకరించలేదు. ఎందరో వీరిని సన్మానించాలని ఉత్సాహం చూపించినా ఆయన అందుకు అంగీకరించలేదు.

1938లో తన 17వ ఏట కదిలించిన తన కుంచెకు వపా 71వ ఏట తాను మరణించేదాకా విశ్రాంతినివ్వలేదు. వపా కొన్ని సార్లు తన చిత్రాల పై ○|○ అని సంతకం చేసేవారు. కశింకోట లోని ఆయన ఇంటి మీద కూడా ఈ గుర్తు వేసుకున్నారు. దీని అర్థం అడిగితే, 'ఇటు గతం శూన్యం. అటు భవిష్యత్తు శూన్యం. మధ్య లోని ఆ గీతను నేను మాత్రం నిజం,' అనేవారు. చిత్రకళా రంగంలో తనదైన శైలిలో వర్ణాలు విరజిమ్మిన వడ్డాది పాపయ్య విశాఖ జిల్లా, అనకాపల్లిలోని తన కుమార్తె ఇంట 1992 డిసెంబర్ 10న మరణించారు.

ఇంతటి అద్భుత దృశ్యాలను చిత్రాలుగా మలచిన వడ్డాదికి బ్రతికున్నప్పుడుగానీ, చనిపోయిన తర్వాతగానీ ఎటువంటి గుర్తింపు, అవార్డు ప్రభుత్వం ఇవ్వలేదు. వపా కూడా అటువంటి వాటికి ఏనాడూ ఆరాటపడలేదు.

వడ్డాది పాపయ్య సృష్టించిన అనేక వేల వర్ణచిత్రాలు తన స్నేహితులు, అభిమానుల వద్ద భద్రపరచి ఉన్నాయి. వాటన్నింటినీ ప్రభుత్వం సేకరించి కశింకోటలోని ఆయన ఇంటిని జాతీయ సంపదగా ప్రకటించి ఆర్ట్ గేలరీగా మార్చడం మాత్రమే ఆయనకు అర్పించగల నిజమైన నివాళి.



Recent Advancement of Telugu in South India

Akkaraju Sarma

The incoming TANA leadership need to set up a focus group to help retention and expansion of Telugu language speakers in India, most importantly in Tamilnadu and contiguous areas.

It has been the greatest experience I ever had, visiting the Potti Sriramulu Memorial Society Hall to attend the felicitation Dr.Chintalapati Purnanda Sastri with title "Maha Mahopadhyaya" bestowed at the

Amarajeevi Potti Sriramulu Smaraka Bhavanam on March 25, 2017. This significant Landmark for all Telugus is in Chennai, at 215 Royapettah High Road, Mylapore, Chennai, 600004. In the last 5-7 years, TANA has been progressively strengthening Telugu Language instruction in Tamil Nadu schools in many districts. We need to increase this activity. Demographically speaking, the median age, as of 2017, India is <30 years and many speak English that have accepted Hindi as the aid for communication. Note that after India had become a republic, Hindi became a major medium yet in Madras (also read as now Tamil Nadu), Hindi was disliked intensely and many at school took the language on a pass/fail mode.

I was in High School (1952) when Amarajeevi Potti Sriramulu garu sacrificed his life for a greatest cause and we are now enjoying the benefits. It was in that time, much of north Madras (now Chennai) Telugu was spoken by majority especially merchants and some parts like Tondiarpet, Washermanpet were Telugus. That continuum extended further north including Tiruttani, Sri Harikota, Tada, etc.

That continuum went farther north and needless for all of us be reminded of Tirumala Venkatesa. Many in Madras went on a strike for several weeks till the state of Madras was divided into Andhra Pradesh and Madras, as independent from erstwhile Madras State. Bust of Amarajeevi Potti Sriramulu Garu in Main Hall.

Society Building: The building has two floors about 120 feet x 240 feet plinth (approximate). First floor (ground level) has offices and a small podium with full size bust statue of Amarjeevi Potti Sriramulu and spending a few minutes is an overwhelming experience indeed. Besides there is a lecture hall in the first floor as well.

Portrait Gallery: There are many portraits of leading Telugus and other national leaders in the lecture hall of second floor. And a Telugu Library of first floor.

Overseas Telugus and at Home Telugus: The information on the explosive USA-Telugu Diaspora which has resulted in many Telugus become resident in continental USA is well known the fact that we are celebrating the 41 St. Annual Convention in Nation's

Capital, Washington DC is a recognition of our achievements. Looking at Spelling Bees, Science Talent and academic achievements, we can be proud but now is not the time to rest on that front. Stepping back to events after the birth of Andhra Pradesh, where is Telugu Language and culture "at extended home" heading? In June 2016 TANA Patrika, you see a key-hole view of the evolving Telugu speakers. In 2016 Sri.Ramesh Garu documented the spread of Telugu in Tamilnadu and contiguous areas. An invaluable contribution. As an example, TANA has supported several persons (of all ages) to gain that knowledge with a certificate of completion. Kudos to all, students, teachers, sponsoring organizations and individuals that guided this program. Other such programs need to be done by TANA and sister Telugu organizations.


Suggested Long Term Plans: The incoming TANA leadership need to set up a focus group to help retention and expansion of Telugu language speakers in India, most importantly in Tamilnadu and contiguous areas. There is little doubt we are doing well with Telugu Badi (and similar Telugu Balavihar Schools) and similarly we might develop programs in India. I have documented (go to www.researchgate.org and www.academia.edu where many of my publications are accessible) the existence of Telugu speakers in Bangladesh! Suffice it to say, languages have a strong persistence status with demonstrated loss due to not speaking for starters. In the 40 Th. TANA convention in St Louis, MO. in the Business and Exhibition Hall, several posters were on display and all are so informative. I am herewith including just two for information. These were openly displayed, and I thank TANA for exhibiting these invaluable paintings. I hope TANA Patrika will publish them all.

The importance of Potti Sriramulu Manorial Society Building and its crucial relevance need to be emphasized by TANA and sister organizations. They should set up a committee and fund it as needed in renovating the building, lecture hall and office space with state of art audio-visual equipment. If Telugu



culture in a political sense prevailed strongly so many decades, we need to bow respectfully to Amarajeevi Potti Sriramulu Garu. Tana (and sister organizations) might support 2-3 NRI College students work in Potti Sriramulu Society and its staff to improve the facilities and provided reports how we can even more enhance the Potti Sriramulu Memorial Society become a resource location for all Telugus.

I thank Dr. Ayathu Prasada Rao in Mylapore for facilitating my visit to the Cherished place of Amarajeevi Potti Sriramulu. A more detailed article on this subject will be published later this year. As many members of TANA and sister organization, when in Chennai to take a few minutes to visit Potti Sriramulu Society Building and it will be a rewarding experience. I gratefully acknowledge the sources for some photographs used. Many thanks to all.



Dr. Akkaraju Sarma lives in Huntingdon Valley, Pennsylvania. He actively participates in community activities in and around. He is the receipent of 1997 TANA Community Services Award and also receipent of 2016 Ellis Iceland Medal of Honour by US Government.



బాల సాహిత్యం

తెలుగులో బాలసాహిత్యం

డా॥ గంగిశెట్టి శివకుమార్

తెలుగులో బాలసాహిత్యానికి పెద్ద చరిత్రే ఉంది. ఆనాటి బాల పత్రిక నుంచి నేటి బాలభారతం వరకు పత్రికలు, నాటి చింతా దీక్షితులు నుంచి నేటి వరకు అనేకమంది రచయితలు బాలసాహిత్య వికాసానికి కృషి చేశారు. ఆ చరిత్ర పూర్వాపరాలు...

పాపం పుణ్యం - ప్రపంచమార్గం
కష్టం సౌఖ్యం శేషార్థాలు
ఏవీ ఎరుగని పూవుల్లారా
ఐదారేడుల పాపల్లారా!

అంటూ ప్రకృతిలో జరిగే సహజ మార్పులు తమకోసమే జరుగుతున్నాయని ఊహించే పాపలను గురించి-

మెరుపు మెరిస్తే - వాన కురిస్తే
ఆకసమున హరివిల్లు విరిస్తే
'అవి మాకే' అని ఆనందించే కూనల్లారా

అంటూ అమాయక హృదయాలను చూసి జాలిపడతారు శ్రీశ్రీ.

బాలలే విజ్ఞాన హేతువులు
నేడు రేపుల మధ్య సేతువులు
చంద్ర బంధుర సుధాశీతువులు
మానవత్వ వికాసహేతువులు

అంటూ బాలలలోని ఉదాత్త లక్షణాలను ప్రశంసించారు మహాకవి శ్రీశ్రీ.

'పసివాడు పెద్దవాడయ్యాక - అతడు తీర్చిదిద్దబడే తీరు అతని బాల్యం మీదే ఆధారపడి వుంటుంది,' అన్నాడు సిగ్మండ్ ఫ్రాయిడ్. అంటే బాల్యంలో పడిన పునాది మీదే వారి వ్యక్తిత్వం ఆధారపడి వుంటుందనేది ఆయన భావన.

దీన్నే మన పెద్దలు 'మొక్కై వంగనిది మానై వంగునా' అన్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో బాల సాహిత్యానిది చెప్పుకోదగ్గ స్థానం. పిల్లల్లో ఆలోచన, సృజనాత్మక శక్తులను పెంచేది, సమయస్ఫూర్తి, చాకచక్యం, యుక్తిలాంటి జీవన నైపుణ్యాలతో పాటు త్యాగం, పరోపకారం, ధర్మం తదితర మహోన్నత గుణాలను వికసింపజేసేదీ బాలసాహిత్యమే! దీంతోపాటు చిన్నారులకు తగినంత వినోదాన్నిస్తూ, వారి మానసిక పరిణతికి దోహదం చేసేదీ బాలసాహిత్యమే!

బాల్యం - దశలు

అయితే బాలసాహితీసృజనలో వారి వయోపరిమితులను దృష్టిలో వుంచుకోవాలి. పిల్లలు పుట్టినప్పటి నుండి ఐదేండ్ల వరకు మొదటి దశ. అందులో మూడేళ్లదాకా మరీ పసితనం. ఈ దశలో శ్రవ్య సాహిత్యం ప్రాధాన్యం కలిగి వుంటుంది. పిల్లల నుద్దేశించి తల్లులు పాడే జోల పాటలు, లాలిపాటలు, చందమామ పాటలు మొదలైనవి. చిన్నచిన్న కథలు కూడా ఈ దశలో అందించవచ్చు.

ఐదు సంవత్సరాల నుండి పది సంవత్సరాల మధ్యగల బాల్యాన్ని ద్వితీయ దశగా పరిగణించవచ్చు. ఈ దశలో బాగా ఉపయోగపడేది దృశ్య సాహిత్యం. రంగు రంగు బొమ్మలతో కూడి చక్కని పుస్తకాలు ఈ దశలోని బాలల నెమ్మదంతగానో అలరిస్తాయి. ఈ దశలోని పిల్లలకు ఉత్తమమైన భావాలు గల కథలను వినిపించాలి లేదా చదివించాలి. పశుపోష్యాదులు పాత్రలుగా గల కథలు ఈ దశలోని పిల్లలను బాగా ఆకర్షిస్తాయి. అద్భుత కథలు కూడా వీరిని ఆకర్షిస్తాయి.

పదకొండు సంవత్సరాల నుండి పదిహేనేళ్ల దాకా తృతీయ దశ. ఈ దశలో పఠన సాహిత్యం ప్రాధాన్యత కలిగి వుంటుంది. పిల్లలు తమంత తామే చదివి అర్థం చేసుకోగల సాహిత్యం పఠన సాహిత్యం. ఇది వారికి మానసిక వికాసాన్ని కల్గిస్తుంది. హాస్య కథలు, యుక్తి కథలు, చారిత్రక కథలు, వేమన పద్యాలు, సుమతీ శతక పద్యాలు బిడ్డలు నేర్చుకునేటట్లు, వాటిలోని సారాన్ని గ్రహించేటట్లు పెద్దలు తమ వంతు కృషిని తాము చేయాలి. ఉమ్మడి కుటుంబవ్యవస్థ దెబ్బతినడం, పుస్తకాల సంచి బరువెక్కడం, ఎల్‌కెజీ నుంచే ఐఐటి ఫౌండేషన్ కోర్సులు ప్రారంభమవడంతో పిల్లలకు వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించే బాలసాహిత్యం నిరాదరణకు గురవుతోంది. ఈ స్థితి త్వరగా మారాల్సిన అవసరం వుంది.

బాలసాహిత్య వికాసం

ప్రాచీన కాలంలో బాలసాహిత్యం అంటూ ప్రత్యేకంగా ఏమీ వుండేది కాదు. కావ్యాలలో బాలలకు సంబంధించిన ఆటలూ, పాటలూ తప్ప. పందొమ్మిదో శతాబ్ది ప్రారంభంలో మొదలైన సాంస్కృతిక పునరుజ్జీవనం తెలుగు బాలసాహిత్య ప్రగతికి అంకురార్పణ చేసింది. అంతకుముందు అమ్మమ్మలు, తాతయ్యలు చెప్పే కథలు, పొడుపు కథలు, చిన్న చిన్న గేయాలు బాల సాహిత్యంగా చలామణీ అవుతూ వుండేవి. పెద్దల సాహిత్యంలో పిల్లలకు పనికి వచ్చేదంతా అప్పట్లో బాలసాహిత్యమే!

19వ శతాబ్దం ఉత్తరార్ధంలో పత్రికలు-ప్రచురణలు ప్రారంభడం అయ్యాయి. ఆకాశవాణి, బాలానంద సంఘాలు ఆవిర్భవించాయి. ఇవన్నీ బాలసాహిత్య అభివృద్ధికి దోహదమయ్యాయి. మద్రాస్ స్కూల్ బుక్ సొసైటీలో సభ్యులైన వెన్నెల కంటి సుబ్బారావు వేడుక కథలు రాసి 1823లో ప్రచురించారు. తరువాత రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు ద్విత్రింశికత్వాల భంజిక కథలు (1819), పంచతంత్ర కథలు (1834)లో వ్యవహారిక భాషలో ప్రచురించారు. 1820లో వయోబేధాన్ని అనుసరించి నవీన విద్యాపద్ధతిలో పాఠ్యగ్రంథాలను The Madras School Text Book and Vernacular Society తయారుచేసింది. పుదూరి సీతారామ శాస్త్రిగారు 1865లో పెద్దబాల శిక్ష వెలువరించారు. వీటిలో అధికభాగం గ్రాంథిక భాషలో వున్నవే!

తర్వాత కాలంలో బాలబాలికలు, స్త్రీలు చదివి ఆనందించడానికి వీలుగా వున్న పుస్తకాల ప్రచురణ ప్రారంభం అయింది. గజ్జెల రామానుజనాయుడుగారు బాలల కోసం 'సతీహిత సంగ్రహం', బాలికల కోసం 'వివేక పరిగృహం' రాశారు. ఇందులో భాష కూడా కఠినమే! అందుకే కందుకూరి వీరేశలింగం పంతులు గారు సరళమైన భాషలో బాలల కోసం రచనలు ప్రారంభించారు. అందువల్ల ఈయనతో ఆధునిక బాలసాహిత్య దశ ప్రారంభమైందని చెప్పవచ్చు.

ఈయన ఆంగ్లంలోని ఈసపు కథలను 'నీతి కథామంజరి' పేరుతో తెలుగులోకి అనువదించారు (1893). నీతిదీపిక, స్త్రీ నీతిదీపిక రాశారు. కణుదురీగ, బాదంకాయ, వరికంకులు, బ్రాహ్మణి-ముంగిస, పరోపకారం అనే చిన్న చిన్న కథలు రాశారు. అబద్దాలాడటం వల్ల వచ్చే అనార్థలు వివరించటానికి 'సత్య సంజీవని' అనే పెద్ద కథను రాశారు. చిన్న తరగతుల పిల్లలకు వాచకాలు రాశారు. తర్వాత గురజాడ అప్పారావుగారు లవణరాజు కల, కన్యక, పూర్ణమ్మ, డామన్ పెథియస్‌లు రాశారు. ఇవి బాలసాహిత్యంలో నాలుగు వజ్రాలని విమర్శకుల అభిప్రాయం. రావికొలను సుబ్బారావుగారు బాలబాలికలకు ఆరోగ్య విషయాలు చెప్పేటందుకు 'కుమారీ హితచర్య'ను సరళమైన భాషలో రాశారు. 'తిర్య కథానిధి'ని విభాగాలుగా ప్రచురించారు. వేంకట పార్వతీశ్వర కవులు 'బాల గీతావళి'ని ఐదు భాగాలుగా ప్రచురించారు. నాళం కృష్ణారావుగారు పైడితేడి, అపరాధం, గోగీతం లాంటి రచనలు అనేకం చేశారు.

తర్వాత గిడుగు సీతాపతి, చింతా దీక్షితులు బాలసాహిత్యంలో కొత్త మార్పులు తెచ్చారు. బాలల ఓసం 'వివేకవతి' పత్రికలో ఎలుకా-పిల్లి, రైలుబండి, చిలుకమ్మ పెండ్లి లాంటి రచనలు చేశారు. 1940లో 'భారతి'లో సంపాదకుడిగా చేరాక 'బాలానందం' శీర్షికను రెండు పుటలతో కొనసాగించారు. పిల్లల వయసును బట్టి రచనలు చేయడం గిడుగు సీతాపతిగారి ప్రత్యేకత.

చింతా దీక్షితులు బాలసాహిత్యానికి ఎనలేని సేవ చేశారు. బాలవాఙ్మయ బ్రహ్మగా వినుతికెక్కారు. 'లక్కపిడతలు' 'సూరి-సీత-వెంకి', 'లీలాసుందరి' వీరి రచనలు. తర్వాత పిల్లల పత్రికలు, రేడియో, దూరదర్శన్‌లు బాలసాహిత్య అభివృద్ధికి దోహదపడ్డాయి.

కవికొండలరావు, టేకుమళ్ల కామేశ్వరరావు, నార్ల చిరంజీవి, రేడియో అన్నయ్య, అక్కయ్య (న్యాయపతి రాఘవరావు, కామేశ్వరి), బి.వి. నరసింహారావు, ఉత్పల సత్యనారాయణాచార్యులు, కె. సభా, మధురాంతకం రాజారాం, ఏడిద కామేశ్వరరావు, కవుల ఆంజనేయశర్మ, కవిరావు, పైడిపాటి సుబ్బరామశాస్త్రి, అలపర్తి వెంకట సుబ్బారావు, వేజెండ్ల సాంబశివరావు, చావలి

రామచంద్రరావు, మిరియాల రామకృష్ణ, కనుపర్తి వరలక్ష్మమ్మ లాంటి వారెందరో బాలసాహితీ సృజనకు మెరుగులు దిద్దారు.

బాలానంద సంఘాలు, చందమామ, బాలమిత్రు, బొమ్మరిల్లు, బాలభారతి లాంటి పత్రికలు బాలసాహిత్యాన్ని విరివిగా ప్రచురించి ప్రోత్సహించాయి.

బాలసాహిత్యం - లక్షణాలు

బాలసాహిత్యం పిల్లల మెదడులో కొన్ని మౌలికమైన భావనలను బలంగా నాటాలి. ధైర్యసాహసాలు, నిజాయితి, స్నేహ పాత్రత, త్యాగబుద్ధి, కార్యదీక్ష, న్యాయము మొదలైనవి జయించటం ద్వారా సంతృప్తిని కలిగించే కథలు ఎంత అవాస్తవంగా వున్నా పిల్లల మనసులకు చాలా మేలు చేస్తాయి. దేవుడి మీద భక్తిని, మతవిశ్వాసాలను ప్రచారం చెయ్యటానికి రచించిన కథలు పిల్లలకు చెప్పటం అంత మంచిది కాదు. 'కథలో నెగ్గవలసింది మనుష్యయత్నము, మనిషి సద్బుద్ధినూ,' అంటారు కొడవటిగంటి కుటుంబరావుగారు బాలసాహిత్యం గురించి.

పిల్లల కథల్లోని 'వాస్తవికత' గురించి చాలామంది చర్చిస్తూ ఉంటారు. 'బుల్లి చేపల చేత మాట్లాడించడంలోనే వున్నది చిక్కంతా' అన్నారట ఆలివర్ గోల్డ్‌స్మిత్. చేపలు, కాకులు, ఎలుకలు మాట్లాడడం వల్ల వాస్తవికత పోతుందని ఆయన భయం. కానీ బాలసాహిత్యంలో అలాంటి వాస్తవికత అనవసరం. పిల్లలు తాము చదివే, వినే కథల్లోని సన్నివేశాలను తమ పరంగా అన్వయించుకోనవసరం లేదు. వాళ్లు వాటికి ఎడంగా వుండే ఆనందం పొందాలి.

అద్భుతాలతో కూడిన జానపద కథలు చిన్నపిల్లల ఎమానసికాభివృద్ధికి చాలా అవసరమని ఒట్టో ఎవర్ట్ అన్నారు. "ఈ కథలను పదేపదే చెప్పడం వల్లనే పిల్లల్లో ఏర్పడే ఘర్షణలు, భయాలు తొలగిపోతాయి. పిల్లలు ఈ కథల్లోని వాస్తవికత గురించి ఆలోచించరు. ఇవి వారి ఊహాశక్తికి పదును పెడతాయి. అంతేగాక ఈ కథలు సుఖాంతం అవుతాయి గనక వారిలో ఏదో సాధించామన్న తృప్తి కూడా కలుగుతుంది," అంటారాయన. ఒట్టో ఎవర్ట్ హాటెన్‌బర్గ్ యూనివర్శిటీలో మానసిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్.

నిజాయితీపరులు, త్యాగశీలురు, ధైర్యవంతులను గెలిపించే కథలు పిల్లలకు మంచి చేస్తాయి. దురాశ, ఓర్వలేనితనం, అధికార గర్వం, క్రూరత్వం, కృతఘ్నత, అధర్మం, స్వార్థం తదితరాలు ఓడిపోవడం కూడా పిల్లలకు తృప్తినిస్తుంది. రాక్షసులను మనుషులు జయించడం, ధనికులను వాళ్ల సేవకులు భంగ పరచడం, అతి సామాన్య వ్యక్తుల్లో అసాధారణ శక్తులు ఉండడం లేదా వారికి అవి లభ్యం కావడం లాంటి అవాస్తవాలు కలిగిన జానపద కథలు చదవటం వల్ల పిల్లల్లో మంచి ఊహాశక్తి, సృజనాత్మకత పెంపొందుతాయి.

ఇక అసభ్యత విషయానికొస్తే, బాలసాహిత్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అసభ్యతకు తావులేదు. బాలసాహిత్యం బాలలను తీర్చిదిద్దడానికి వారి భావిజీవితాన్ని సుఖమయం చేయడానికి కావాల్సిన జీవితవిధానాన్ని, గుణగణాలను పెంపొందించేందుకు తోడ్పడాలి. పురాణ, చారిత్రక, మహాపురుషులను గురించి చెప్పేటప్పుడు వారిలోని బలహీనతలను బయల్పరచకూడదు. వారిలోని శౌర్యపరాక్రమాలు, సభ్యతాసంస్కారాలు, ఆదర్శప్రాయ మైన వారి గుణగణాలను మాత్రమే చెప్పాలి. అందుకేనేమో చక్రపాణిగారు చందమామ కథల్లో 'ప్రేమ', 'గర్భవతి' లాంటి పదాలు ఉండడానికి కూడా యిష్టపడేవారు కాదట!

యుక్తి, సమయస్ఫూర్తి, చాకచక్యం పిల్లల కథల్లో యిమిడి వుంటే వాళ్లకి భావిజీవితంలో ఎదురయ్యే సమస్యలు అధిగమించ డానికి తోడ్పడతాయి. కథల్లో సంభాషణలు క్లుప్తంగా వుండాలి. ఆ సంభాషణల్లో హాస్యం, చమత్కారం, సమయస్ఫూర్తి కనిపిం చాలి. అర్థంకాని కఠిన పదజాలం ఉండకూడదు. కథగానీ, గేయం గానీ మరే బాలసాహితీ ప్రక్రియ అయినా చిన్నచిన్న పదాలతో హృదయాలను చూరగొనాలి. సందేశం, నీతి అంతర్లీనంగా వుండాలి. "పిల్లల్లో దౌర్బల్యాన్ని పెంపొందించేది బాలసాహిత్యం కాదు. మహాసత్వుల కథలు ఉత్తమ బాలసాహిత్యం. ఒక లక్ష్యం పెట్టుకున్నాక మహాసత్వుడైనవాడు ప్రమాదాలను లక్ష్యపెట్టడు. అటువంటి పాత్రలుగా గల కథలు ఎంత హెచ్చుగా చదివితే పిల్లలకు అంత క్యారెక్టర్ ఏర్పడుతుంది. మన దేశాల లాంటి పేద దేశాలలో పిల్లలకు డబ్బు మీద దృష్టి ఏర్పడటం కన్నా, క్యారక్టర్ మీద ఏర్పడటం అవసరం," అంటారు కొడవటిగంటి. ఈ విషయాల్ని మనసులో వుంచుకుని వర్తమాన బాలసాహితీవేత్తలు తెలుగు బాలసాహిత్యాన్ని పరిపుష్టం చేస్తారని ఆశిద్దాం.



నెల్లూరు జిల్లా రాపూరులో జన్మించిన డా॥ గంగిశెట్టి శివకుమార్ బాలసాహిత్యం మీద పిహెచ్.డి. చేశారు. చిన్నతనం నుంచే రాయడం ప్రారంభించి, దాదాపు అన్ని పిల్లల పత్రికల్లో కథలు రాశారు. 1980-82 మధ్య చందమామ పత్రికలో పనిచేశారు. 'మూన్ బీమ్' అనే ఇంగ్లీష్ కథల పుస్తకం ఐ డ్రీమ్ పబ్లికేషన్స్ వారు ప్రచురించారు. వివిధ అవార్డులు అందుకున్న వీరు ప్రస్తుతం 'పున్నమి' మాసపత్రిక సంపాదకులు.



పిల్లల లోకం



విస్తరిస్తున్న బాలోత్సవ సంస్కృతి - నేపథ్యం

డా॥ కాసిరెడ్డి రమేష్‌బాబు

పాతికేళ్లు అప్రతిహతంగా ఒకే ప్రాంతంలో ఒక కార్యక్రమం నిర్వహించడం అంత తేలికైన విషయం కాదు. అదీ వేలమంది పిల్లలతో. అదే కొత్తగూడెం బాలోత్సవం. దాని స్ఫూర్తితో రెండు తెలుగు రాష్ట్రాల్లో విరివిగా విస్తరిస్తున్న బాలోత్సవ సంస్కృతికి పునాదులు పడిన తీరుతెన్నులు...

ఈ సమాజం మనకు ఎన్నో ఇస్తుంది. ప్రతిగా సమాజానికి ఏదో ఒకటి చేయాలన్న సత్‌సంకల్పంతో కొంతమంది మహాను భావులు, కొన్ని పనులు చేపడతారు.

మనసా, వాచా, కర్మణా తాము చేపట్టిన కార్యక్రమానికి న్యాయం చేకూర్చడానికి, అందుబాటులో వున్న వనరులన్నింటిని వినియోగించుకొని సఫలీకృతులవుతారు.

'కొత్తగూడెం బాలోత్సవ్' మాత్రం అటువంటి ఉద్దేశంతో మొదలైంది కాదు. తోటి మిత్రులకు ఇచ్చిన మాట నిలబెట్టు కోవడానికి ఒక మామూలు మనిషి చేపట్టిన ఒక చిన్ని ప్రయత్నం.

తెలంగాణ రాష్ట్రంలో మొన్నటిదాకా ఖమ్మం జిల్లాలో కొత్త గూడెం ఒక చిన్న పట్టణం. కేవలం డెబ్భైవేల జనాభాతో ప్రధాన రైలుమార్గాలకి దూరంగా వున్న పట్టణం. ఒకానొకప్పుడు భద్రాద్రి రామయ్యను దర్శించుకొనే యాత్రికులు మాత్రమే ఈ ప్రాంతా నికి వచ్చేవారు.

అందుకని ఇప్పటికీ ఇక్కడి రైల్వే స్టేషన్ని 'భద్రాచలం రోడ్' అనే పిలుస్తారు. కాలక్రమంలో ఇక్కడ బొగ్గు నిల్వలు వున్నాయని తెలియ డంతో గనుల తవ్వకాలతో మెలమెల్లగా పట్టణంగా రూపు దిద్దు కుంది.

పట్టణ ప్రజల కాలక్షేపం నిమిత్తం 'కొత్తగూడెం క్లబ్' అనేక సంవత్సరాల కిందట ఇక్కడ ప్రారంభించబడింది. దానికి 1991లో జరిగిన క్లబ్ ఎన్నికల్లో నన్ను ప్రధాన కార్యదర్శిగా గెలిపిస్తే క్లబ్ రూపురేఖలు మార్చి, సాధారణ ప్రజల హృదయాల్లోకి క్లబ్‌ని తీసికెళ్తానని వాగ్దానం చేశాను.

ఆమాట నిలబెట్టుకోడానికి అదే సంవత్సరం పాఠశాల స్థాయి పిల్లలకోసం 'బాలోత్సవ్' అనే ఒక చిన్న కార్యక్రమాన్ని రూపొందించాము. పట్టణస్థాయిలో రెండు వందలమంది పిల్లలతో ఈ ప్రయత్నం మొదలైంది.

సంవత్సరాలు గడిచాయి. పట్టణ స్థాయి, మండల స్థాయిగా, జిల్లాస్థాయిగా ఎదిగింది. కేవలం మూడు, నాలుగు అంశాలతో ప్రారంభించబడ్డ ఈ ఉత్సవం ప్రతిసంవత్సరం అనేక కొత్త కొత్త అంశాలతో, అనేక విభాగాలతో, నూతన రంగులు పులుముకుంటూ, బాల బాలికల మనసులు దోచుకోసాగింది.

2000 సంవత్సరం నుండి 'రాష్ట్రస్థాయి బాలోత్సవ్'గా, అప్పటినుండి ఉమ్మడి రాష్ట్రంలోని ఇరవైమూడు జిల్లాల పిల్లలు, ప్రతి సంవత్సరం ఈ మూడు రోజుల పండుగ కోసం ఎదురుచూసేలా ఇది రూపుదిద్దుకుంది.

2014లో రాష్ట్ర విభజన తరువాత 'జాతీయస్థాయి పండుగ' గా మార్చి, భారతదేశంలోని ఏ రాష్ట్రంలో నివసిస్తున్న తెలుగు పిల్లలైనా వచ్చి మా బాలోత్సవ్‌లో పాల్గొనవచ్చని పిలుపునిచ్చాం. ఢిల్లీతో సహా అనేక రాష్ట్రాల నుండి ముఖ్యంగా మన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి పదిహేనువేల మంది పిల్లలు ఉత్సవాలు జరిగే మూడు రోజులు కొత్తగూడెం పట్టణానికి వచ్చేవారు. పది, పదిహేను వేలమంది పిల్లలతో ఆ మూడు రోజులు కొత్తగూడెం కళకళలాడేది.



కొత్తగూడెం చిన్నపట్టణం. అన్ని వేలమంది పిల్లలకు ఆతిథ్యం ఇవ్వగలగడం పెద్ద సాహసం.

పాతిక సంవత్సరాలు అందరూ మెచ్చేలా కార్యక్రమాలను నిర్వహించగలిగామంటే దాని వెనుక అనేకమంది కృషి వుంది.

తెరమీద కనిపించే వ్యక్తిని నేనే కాని తెర వెనుక వుండి నన్ను అడించే మహానుభావులు ఎందరో... ఇక్కడ అందరి పేర్లూ పేర్కొని ఏ ఒక్కరి పేరునైనా మరచిపోవడం భావ్యం కాదు.

అలాగని అహోరాత్రులు శ్రమించిన కొందరినైనా తల్చుకోకుండా వుండలేను. ప్రారంభం అనేక సంవత్సరాల పాటు రామచంద్ర కళాశాల ఉపన్యాసకుడైన శ్రీ ఛటర్జీగారు బాధ్యత అంతా తన భుజాలమీద వేసుకుని నడిపాడు. ఉద్యోగ ధర్మంలో భాగంగా ఆయన బదిలీ మీద ఊరు విడిచి వెళ్లిపోయినప్పుడు మేము కార్యక్రమాలను ఎలానడపాలో అర్థంగాక కొట్టుమిట్టాడుతున్నప్పుడు మేమున్నామంటు ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయులైన శ్రీ కె.వి.యస్. శర్మగారు, సింగరేణి ఉద్యోగి అయిన ఎ. చంద్రశేఖర్ గారు అదే సంస్థలో అధికారి అయిన మాధవరావుగార్లు ముందు కొచ్చారు.వారంతా మూడు మాసాలపాటు రేయింబవళ్లు శ్రమించే వారు. ముఖ్యంగా మాధవరావుగారు తానో అధికారినన్న విషయాన్ని కూడా మర్చిపోయి ఆ నాలుగురోజుపాటు వేలాది మంది పిల్లలకు ఫలహారభోజనాదుల సదుపాయాలను సకాలంలో అందిస్తూ వారికి తమ తల్లిదండ్రులు గూడా గుర్తుకురాకుండా చూసుకునేవాడు. అందుకు ప్రతిగా ఆయనను పిల్లలంతా మాధవ రావు మామయ్యా! అంటూ తమ ఆప్యాతలను ఆయనకు పంచేవారు.

ఆవిధంగా అనేకమంది అనేక రంగాలలో శ్రమించేవారు. వారందరినీ తల్చుకుంటే మనసు ఉప్పొంగిపోతుంది.

బాలోత్సవంలో పాల్గొనటానికి ఎలాంటి ప్రవేశ రుసుము లేదు. పైగా ఆ మూడురోజులు కార్యక్రమానికి వచ్చిన పిల్లలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రు లకు ఉచిత భోజన వసతి సదుపాయాలు సమకూర్చేవాళ్లం. నెలరోజుల ముందునుండే ఊరంతా ముస్తాబయ్యేది. చాలా మంది తమ ఇళ్లకు పిల్లలను తీసుకొని వెళ్లి ప్రేమను పంచేవారు.

దాదాపు మూడువందల మంది సింగరేణి అధికారులు, డాక్టర్లు, లాయర్లు, టీచర్లు, వ్యాపారులు, కార్మికులు, రెండు నెలల పాటు శ్రమించేవారు. ఇది ఒక ఊరి పండుగ. ఉమ్మడిపండుగ. ఇష్టంగా కష్టపడేవాళ్లం.

ముఖ్యంగా పిల్లల్లో మాతృభాషపై మమకారం పెంచడానికి బాలోత్సవ్‌లో అనేక అంశాలను పొందుపర్చాము.

తెలుగు మాట్లాడుదాం, నీతిపద్యం, అనగనగా కథ చెప్తా (వాటిలో కొన్ని). సాహిత్యంలో ప్రవేశం కల్పించడానికి కథారచన, కవితా రచన, కథా విశ్లేషణ, లేఖా రచన లాంటి అనేక అంశాలు.

కళలతో సాన్నిహిత్యాన్ని పెంచడానికి, శాస్త్రీయ, జానపద నృత్యాలు, సినీ లలిత జానపద గీతాలు, వాద్య సంగీతం, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం ఇలా అనేక అంశాలు. విశ్లేషణా సామర్థ్యాన్ని పెంచడానికి, కథా విశ్లేషణ, కవితా విశ్లేషణ, వీధి నాటిక విశ్లేషణ, లఘుచిత్ర సమీక్ష - మొదలైన అంశాలు.

పదిసంవత్సరాలపాటు పెద్ద గుర్తింపు పొందకుండా సాగిపోయింది. మెలమెల్లగా పిల్లల నుండి పెద్దలకు తెలిసింది. మీడియా గుర్తించసాగింది. తెలుగు ప్రాంతాల్లోని ప్రతి దినపత్రిక తమ ఆదివారం అనుబంధాల్లో బాలోత్సవాన్ని గురించి ముఖచిత్ర కథనాలు ప్రచురించాయి.

అనేక సంవత్సరాల క్రితం సాహిత్యానికి సంబంధించిన అంశం కోసం వాసిరెడ్డి నవీన్‌గారిని ఆహ్వానించాము. ఆయన 'బాలోత్సవ్'ను నిర్వహిస్తున్న తీరుకి అచ్చెరు వొందారు. వేలాది మంది పిల్లలను ఒక్కచోట చూడడానికి ముచ్చటపడి అప్పటి నుండి సాహిత్య అంశాల బాధ్యత తన భుజాలమీద వేసుకున్నారు. ప్రముఖ రచయితలు, కవులు ప్రేమతో వచ్చి బాధ్యతగా కార్య శాలలు నిర్వహించారు. పిల్లలతో వారి తల్లిదండ్రులే కాక పిల్లల ప్రేమికులు అనేక మంది వచ్చేవారు. ఒక సంవత్సరం చూడడానికి వచ్చినవారు మరు సంవత్సరం వాలంటీర్లుగా పనిచేసేవారు.

అలా కాకినాడ నుండి జగన్నాధరావుతోపాటు మరికొందరు యువకులు మూడు సంవత్సరాలు మాతో పనిచేసి కాకినాడలో 'క్రియ' పిల్లల పండుగను ప్రారంభించారు. ఇప్పుడది పదివేల మంది పిల్లలతో ప్రతి సంవత్సరం జరిగే పండుగయింది.

తానా ప్రస్తుత అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్, వారి అన్నయ్య రాజశేఖర్ కలిసి వారి నాన్నగారి పేరు మీద భద్రాచలం పట్టణం లో నెలకొల్పిన 'తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్' గత ఏడు సంవత్సరాలుగా 'భద్రాద్రి బాలోత్సవమ్'ను కన్నుల పండుగగా నిర్వహిస్తోంది.

అనేక సంవత్సరాలుగా మధిర పట్టణంలో కూడా బాలోత్సవ్ నిర్వహిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా చర్లలో డా॥ డి.యన్. కుమార్‌గారు గిరిజన పిల్లలకోసం 'చర్ల బాలోత్సవ్' నిర్వహిస్తున్నారు.

రెండు సంవత్సరాల నుండి గుంటూరు వి.వి.ఐ.టి. ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీ వాసిరెడ్డి విద్యాసాగర్‌గారి ఆధ్వర్యంలో పదిహేను వేలమంది పిల్లలతో 'వి.వి.ఐ.టి. బాలోత్సవ్' జరుగుతోంది. ఆ సంవత్సరమే విజయవాడలో శ్రీ పిన్నమనేని మురళీకృష్ణ గారి బృందం 'అమరావతి బాలోత్సవ్' మొదలుపెట్టారు.

ఇంకా చిలకలూరిపేట, సిరిసిల్ల, మచిలీపట్నం వంటి అనేక పట్టణాల్లో బాలోత్సవాలు మొదలయ్యాయి. ఈ సంవత్సరం ఖమ్మంలో ప్రియదర్శిని కళాశాలలో ప్రారంభం కానున్నది.

ఇలా ఊరూరా బాలోత్సవాలు పండుగ వాతావరణంలో జరపటం చూస్తుంటే మేము కన్న కలలు వాస్తవరూపం దాలుస్తున్నాయని అనిపిస్తుంది.

ఇంకా అనేక జ్ఞాపకాలు, మధురానుభూతులు ఎన్నో...

ఓ అమ్మ తన కూతురిని తీసుకొచ్చి 'ఒకప్పుడు ఈ వేదిక మీద నేను నృత్యాన్ని ప్రదర్శించాను. ఇప్పుడు నా కూతురు ప్రదర్శించబోతుంది. మీరు చూస్తూనే వుంటే నా మనుమరాలిని కూడా తీసుకొస్తాను' అని ఆనందంగా చెప్పడం.

అమెరికాలోని డబ్ల్యూ.హెచ్.ఓ.లో పరిశోధన చేస్తున్న ఓ యువతి సామాజిక మాధ్యమంలో, 'నేను విద్యార్థిదశలో అనేక సార్లు బాలోత్సవానికి వచ్చాను. ఇప్పుడు అమెరికాలో వున్నాను. నా ఈ ఎదుగుదలలో బాలోత్సవ్ పాత్రను మర్చిపోలేను,' అని రాయడం.

కాకినాడ బాలోత్సవ్‌లో 'నాటికీకరణం' అనే అంశంలో అద్భుతంగా జీవించిన ఓ పాప ప్రదర్శన అనంతరం నేను తనను హత్తుకుని అభినందించినప్పుడు ఆనంద బాష్పాలు రాల్చుతూ...

"నాకు ఎన్నాళ్లుగానో ఇలా ప్రదర్శించాలని వుంది. కానీ, మా కార్పోరేట్ పాఠశాలల్లో ఏనాడూ నాకు అవకాశం రాలేదు. ఈరోజు ఆ కోరిక తీరింది. మీరిలా మెచ్చుకొనేసరికి నాకు కన్నీళ్లు ఆగలేదు," అంటూ భావోద్వేగంతో చెప్పడం.

ఇటువంటివి కోకొల్లలు.

ఒకనాడు కాకినాడలో ఓపెద్దాయన 'మీరు కొత్తగూడెంలో పాతిక సంత్సరాలపాటు బాలోత్సవ్‌ను నిర్వహించారు సంతోషం. మీ ప్రేరణతో ఇవ్వాళ్ల చాలా ప్రాంతాల్లో బాలోత్సవాలు వ్యాపించాయి. కానీ, వాటివల్లమీరు ఏం సాధించారు? ఈ బాలోత్సవ్‌ల వల్ల పిల్లలు ఏ విధంగా లాభం పొందారు? సమాజం మీద వాటి ప్రభావం ఏ మేరకు ప్రభావం చూపించింది. ఏప్పుడన్నా మీరీ కోణాన్ని గురించి పరిశీలించారా? ఏవైనా అధ్యయనాలు చేయించారా? ఇవి కేవలం నిర్వాహకుల ఆనందంకోసం మాత్రమే చేస్తున్నారా అని ఎవరైనా ప్రశ్నిస్తే మీ సమాధానం ఏమిటి?" అంటూ ప్రశ్నించాడు.

ఆయన ప్రశ్నలుకు నేను తక్షణమే స్పందించలేకపోయాను. దానికి సమాధానం కాగితాల మీద లేదు. కానీ, నిర్వాహకుల గుండెల్లోను కార్యక్రమాల్లో పాల్గొన్న వేలాదిమంది పిల్లల మనసుల్లోనూ ముద్రితమైపోయాయి.

జైలును మరిపించే తరగతి గదుల్లో బందీలవుతున్న పిల్లల బాల్యం ప్రశ్నించే తత్వాన్ని అణిచివేస్తూ చిన్న చిన్న కోరికల్ని, ఊహల్ని చిదిమివేస్తూ వారిలోని సృజనాత్మకతను వికసింపజేయని నేటి విద్యావిధానం ప్రభావం వారి లేత మనసుల మీద ముద్రలు వేసి మరమనుషులుగా మార్చడం మనందరికీ తెలిసిందే.



ప్రభుత్వాల ఆలోచనాసరళిలో మార్పురావాలి. విద్యా విధానం మారాలి. సమాజం మారాలి. మనమంతా మారాలి.

పాఠశాలలు కేవలం చదువులశాలలు కారాదు. నిజమైన విద్యాలయాలుగా మార్పుచెందాలి. ఆటపాటలతో బాల్యం జీవితంలో మాధురానుభూతిని మిగల్చగలగాలి. ప్రశ్నించే తత్వాన్ని, విశ్లేషణా సామర్థ్యాన్ని పెంచాలి. ముఖ్యంగా తమ మీద తమకు నమ్మకాన్ని పెంచాలి. ఎటువంటి ఒడుదుడుకులనైనా ఎదుర్కొనే మానసిక శక్తిని వారికి ప్రసాదించాలి. ప్రజల తీరు మారాలి. చుట్టూ జరిగే వాటని చూస్తూ కూర్చోలేక మేము చేసిన చిన్న ప్రయత్నమే కొత్తగూడెం బాలోత్సవ్‌కు మూలబీజమై నిలిచింది.

ఆఖరిగా ఒక్కమాట-

ఆమధ్య విజయవాడలో అమెరికా నుండి సెలవులకు వచ్చిన శ్రీమతి ఈడ్పుగంటి అనితగారు కనిపించి 'మా అమెరికాలో ఒహాయోలో దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని తెలుగుపిల్లలకోసం బాలోత్సవం నిర్వహించబోతున్నాం. కాబట్టి, మీరు తప్పకుండా రావాలి" అన్నారు.

ప్రస్తుతం 'అమెరికా బాలోత్సవ్' కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాను.



డా॥ వాసిరెడ్డి రమేష్‌బాబు వృత్తిరీత్యా వైద్యులు. ప్రవృత్తిరీత్యా పిల్లల కోడి. కొత్తగూడెంలో పాతికేళ్లుగా బాలోత్సవ్ నిర్వహిస్తున్నారు. ఇరవై ఏళ్లుగా దివ్యాంగులకు నాటక పోటీలు నిర్వహిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బాలోత్సవ సంస్కృతి వ్యాపింప చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు.



చారిత్రక నవలాసంపద

చారిత్రక నవల - తులనాత్మక పరిశీలన

డా॥ రమేష్ రొక్కం

తెలుగులో చారిత్రక నవలలకు విశేష ప్రాధాన్యం ఉంది. నాటి విశ్వనాథ, అడివి బాపిరాజు, నోరి నరసింహశాస్త్రి నుండి నేటి ముదిగొండ శివప్రసాద్ వరకూ అనేకమంది సాంప్రదాయ, ఆధునిక రచయితలు చారిత్రక నవలలు రచించారు. వాటిలో కొన్నిటి పరిశీలన...

ఏ భాషలోనయినా చారిత్రక నవలకో ప్రత్యేకస్థానం ఉంటుంది. చరిత్రకు తగు మోతాదులో కాల్పనికం జోడైనప్పుడు అది ఎంతో విజ్ఞానపరంగా వుంటుంది, రసవత్తరంగానూ ఉంటుంది.

ఇది ఎలా సాధ్యం? చరిత్ర, కాల్పనిక నవల పరస్పర విరుద్ధమయిన ప్రక్రియలు గదా. వాటిని మిళితం చేయడం అంత తేలిక పని కాదు. ఈ వైవిధ్యాన్ని గురించి ఎందరో వ్రాసారు. రచయిత్రి, సాహిత్య విమర్శకురాలు Joanne Brown ఈ క్రింది విధంగా వ్రాసినదాంట్లోని స్పష్టత, క్లుప్తత నాకు నచ్చింది.

The historian's approach is necessarily broader, examining historical complexities in greater depth and using digressions and footnotes to qualify and explain. Novelists, on the other hand, forego the expansive canvas that historians use in order to create clear characterizations and forward-moving plot lines that arrive, finally, at resolutions often denied to history.

చారిత్రకుని లేని స్వేచ్ఛ కాల్పనిక రచయితకు వుంటుంది. వాస్తవికత కన్నా కాల్పనికత ఒకోసారి అతివాస్తవికతగా కనపడుతుంది.

చరిత్ర గతకాలపంకంలో ఘనీభవించిన బండరాయి, లేక శిల్పం. కల్పన విశాలగగనంలో విహరిస్తూ, విన్యాసాలు చేసే విహంగం. చారిత్రక నవల ఆ నవలాకారుని చేతిలోని పతంగం. ఆ గాలిపటానికి పిట్టకున్నంత స్వేచ్ఛ ఉండదుగాని రంగురంగుల తోకతో ఆకాశనాట్యం చేయగలదు. కాల్పనికతకు ఉన్న శక్తిని Aristotle (384-322 BCE) గుర్తిస్తూ, అది నిర్జీవ వస్తువులకు అలంకార జీవితాన్ని ఇస్తుందన్నాడు. అలంకార శాస్త్రజ్ఞుడు రుద్రటుడు (తొమ్మిదో శతాబ్దం) చెప్పిన రసహీనమైన రచన నిష్ప్రయోజనం అన్న సూత్రం Aristotle చెప్పిన భావానికి అన్వయించవచ్చును.

వాస్తవికతకూ, కాల్పనికతకూ ఉన్న భేదాన్ని వివరిస్తూ, చింతనకు రూపకం, అలంకారం (metaphor) ఎంత అవసరమో, Aristotle తన Rhetoric గ్రంథంలో ఈవిధంగా సూచించినాడు.

We all naturally find it agreeable to get hold of new ideas easily: words express ideas, and therefore those words are the most agreeable to us that enable us to get hold of new ideas. Now strange words simply puzzle us; ordinary words convey only what we know already; it is from the metaphor that we can best get hold of something fresh.

చరిత్రాత్మక నవల చారిత్రక నవల అనగానే మనం అవి రాజులు, రాణులు, సామ్రాజ్యాలు, యుద్ధాలకు సంబంధించినవి అని అనుకుంటాము. చరిత్ర వాస్తవికత, చారిత్రక నవల ఉత్ప్రేక్ష, రూపకం. హంగరీ దేశస్థుడు, మార్క్సిస్టు, సాహిత్య సిద్ధాంతకర్త జార్జ్ లూకాచ్ Georg Lukcs (1885-1971) చారిత్రిక నవలకు

అయిదు లక్షణాలుండాలని ప్రతిపాదించాడు. అందులో ముఖ్యమైనవి ఈ నవలల్లో చారిత్రక వ్యక్తులు నామమాత్రికులేననీ, సమాజంలోని సాధారణుల జీవితాలు, అందులో మార్పులను ప్రతిబింబించాలన్న సూచనలు.

మరి శ్రీశ్రీ కూడా అదే అన్నాడు, తనదైన శైలిలో.

ఏ యుద్ధం ఎందుకు జరిగెనో?
ఏ రాజ్యం ఎన్నాళ్లుందో ?
తారీఖులు, దస్తావేజులు
ఇవి కావోయి చరిత్రకర్థం.

మరి ఏమిటండీ, శ్రీశ్రీగారూ?

సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహస మెట్టిది?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్,
అది మోసిన బోయీ లెవ్వరు?

...

చారిత్రక విభాతసంధ్యల
మానవకథ వికాసమెట్టిది?
ఏ దేశం ఏ కాలంలో
సాధించిన దే పరమార్థం?

ఏ శిల్పం? ఏ సాహిత్యం?
ఏ శాస్త్రం? ఏ గాంధర్వం?
ఏ వెల్గులకీ ప్రస్థానం ?
ఏ స్వప్నం? ఏ దిగ్విజయం?

ఇలాంటి ప్రశ్నలకు చరిత్ర జవాబు చెప్పలేదు. చారిత్రక నవలలతోనే ఇది సాధ్యం అవుతుంది.

అమెరికన్ చరిత్రలో సామ్రాజ్యాలు, రాజులూ లేరు గదా. కాని చారిత్రక ఘట్టాలు ఉన్నాయి. అందువల్లనే అమెరికన్ చారిత్రక నవలలు ఆ ఘట్టాల నేపధ్యంలోనే ఉంటాయి. అమెరికన్ స్వాతంత్ర్య, విప్లవ యుద్ధము (1775-1783), అంతర్యుద్ధము (1861-1865), మొదటి ప్రపంచయుద్ధము (1914-1918), రెండవ ప్రపంచయుద్ధము (1939-1945) ముఖ్యమయిన చారిత్రక ఘట్టాలు. వీటిపై ఎన్నో చారిత్రక నవలలు వచ్చాయి. అన్నిట్లోకి బహుళప్రజాదరణ పొందిన చారిత్రక నవల మార్గరెట్ మిచెల్ (1900-1949) అంతర్యుద్ధము ఘట్టంపై వ్రాసిన Gone with the Wind (1936). దీనిని ఎం.వి. రమణారెడ్డి తెలుగులోకి 'చివరకు మిగిలింది?' అనే పేరుతో అనువాదం చేశారు. ఈ నవల నవ్యవీక్లీలో ధారావాహికంగా వచ్చింది.

అమెరికాలో వచ్చిన ఆర్థిక మహాసంక్షోభం (Great Depression, 1929-1939) పై జాన్ స్టీన్ బెక్ 1939లో వ్రాసిన 'రగులుతున్న ద్రాక్షలు' (Grapes of Wrath) ఒక మహత్తర చారిత్రక నవల. సంవత్సరాలపాటు వర్షాల్లేక, దేశం మధ్యలోని వ్యవసాయ రాష్ట్రాలలో పంటభూములన్నీ ఎడారులయిపోయినవి. గాలి దుమ్ములతో ఆ విశాల భూములన్నీ ధూళిభాండంగా, దుమ్ము బౌచ్చెగా (Dust Bowl) తయారయ్యాయి. సన్నకారు రైతులు తమ కుటుంబాలతో కాలిఫోర్నియా వలస వెళ్లి అక్కడ పండ్ల తోటల్లోనూ, నిర్మాణరంగంలోనూ రోజువారీ కార్మికులయ్యారు. ఈ పేద వలస కుటుంబాల హృదయవిదారక జీవితాల గురించి వ్రాసిన నవల ఇది. ఈ నవలకు నేషనల్ బుక్ అవార్డు, పులిట్జరు ప్రైజు లభించాయి. స్టీన్ బెక్‌కి 1962లో నోబెల్ బహుమతి రావటానికి ఈ నవల ముఖ్య కారణం. Grapes of Wrath నవల గురించి ఒక చిన్న విషయం. అది స్టీన్ బెక్ వ్రాసినప్పుడు సమకాలీన (contemporary) నవల. చారిత్రక నవలలో ఇతివృత్త కాలానికి, రచన కాలానికి మధ్య కనీసం 50 సంవత్సరాలు ఉండాలి అంటారు సాహిత్య సూత్రాచార్యులు. కాని ఇప్పుడు అది చారిత్రక నవలగా మనం గ్రహించవచ్చునని నా అభిప్రాయం. మహీధర రామమోహనరావు వ్రాసిన 'కొల్లాయి గట్టితేనేమి?' నవల విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. సమకాలీన కాకపోయినా, రెండు తరాల కాలభ్రమణం లేదు.

తెలుగులో దుగ్గిరాల రామచంద్రయ్య (విజయనగర సామ్రాజ్యము), విశ్వనాథ సత్యనారాయణ (ఏకవీర, బద్దన్న సేనాని), మల్లాది వసుంధర (తంజావూరు పతనం, సప్తపర్ణి), ధూళిపాళ శ్రీరామమూర్తి (భువన విజయము, గృహరాజు మేడ), పాటిబండ మాధవశర్మ (రాజశిల్పి), తెన్నేటి సూరి (చెంఘిజ్ ఖాన్), మహీధర రామమోహనరావు (కొల్లాయి గట్టితేనేమి?), ముదిగొండ శివప్రసాద్ (తంజావూరు విజయము, ఇంకా ఎన్నో), నోరి నరసింహశాస్త్రి, అడివి బాపిరాజు లాంటి ఎందరో ప్రసిద్ధులు చారిత్రక నవలలు వ్రాశారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు (నేటి ఆంధ్ర యూనివర్సిటీ) 1951లో జరిపిన చారిత్రిక నవలల పోటీలో మల్లాది వసుంధర, ధూళిపాళ శ్రీరామమూర్తి, పాటిబండ మాధవ శర్మ తమ పై జెప్పిన నవలలతో విజేతలుగా ఒక్కొక్క నవలకు వెయ్యి రూపాయలు చొప్పున బహుమతులు గెల్చుకున్నారు.

ఈ వ్యాసంలో నోరి నరసింహశాస్త్రిగారు, అడవి బాపిరాజు గారు వ్రాసిన కొన్ని చారిత్రక నవలలను పరిచయం చేసి,






తులనాత్మక పరిశీలనా ప్రయత్నం చేస్తాను.

ముందు వారిరువురు వ్రాసిన చెరి మూడు చారిత్రక నవలలను స్థూలంగా పరిచయం చేస్తాను.

నారాయణ భట్టు (నోరి నరసింహశాస్త్రి)

ఈ నవల పదకొండో శతాబ్దంలోని చోళచక్రవర్తి రాజరాజ నరేంద్రుని ఆస్థానంలోని కథ. రాజమహేంద్రనగరంలో (నేటి రాజమండ్రి) ఆ చక్రవర్తికి నారాయణభట్టు మంత్రి. నన్నయభట్టు ఆస్థానకవి. ఇద్దరు భట్టులు చిరకాల మిత్రులు. అప్పటి క్రీడలు, ఉత్సవాలు, దైనందిక జీవితం, వైదిక బౌద్ధమతాల మధ్య అంతర్గత పోరాటాలు, ఆస్థాన రాజకీయాలు, రాజకీయ విప్లవాలు ఈ నవలలో చక్కగా చిత్రించారు. సముద్రతీరంలో ఉన్న విశాఖపట్నం, భీమునిపట్నం, మోటుపల్లి, కృష్ణపట్నం లాంటి రేవు పట్నాలు అప్పటికే ప్రసిద్ధి గాంచినవని ఇందువల్ల తెలియవస్తుంది. రాజరాజనరేంద్రుడు నన్నయభట్టుని మహాభారతాన్ని తెలుగులో వ్రాయమని ఆదేశిస్తాడు. నన్నయ ఆ బృహత్తర కార్యక్రమంలో నిమగ్నమయి ఉన్నప్పుడు నవల ముగుస్తుంది.



రుద్రమదేవి (నోరి నరసింహశాస్త్రి)

పదమూడో శతాబ్దంలో ఓరుగల్లు పట్టణం రాజధానిగా కాకతీయ సామ్రాజ్యాన్ని ఏలుతున్న గణపతి దేవమహారాజు వృద్ధాప్యములో తన పుత్రిక రుద్రమదేవికి పట్టం కడతాడు. రుద్రమదేవి భర్త చాళుక్యరాజు వీరభద్రేశ్వరునికి ఆ నిర్ణయం నచ్చదు. తన మొదటి భార్యకు పుట్టిన తనయుడు మహారాజు కావలయునని అతడి కోరిక. కొందరు సామంతరాజులతో కలిసి రుద్రమదేవిని ఓడించవలెనని కుట్ర చేస్తాడు. రుద్రమదేవి ఆ తిరుగబడిన రాజులను ఓడించి, వీరభద్రేశ్వరుడుని శిక్షిస్తుంది. సామ్రాజ్యాన్ని సురక్షితం చేస్తుంది.

తిక్కన సోమయాజి నేలూరు నుండి ఓరుగల్లు వచ్చి, అక్కడ మహాభారత రచన చేస్తుంటాడు. నోరి వారు తిక్కన గురించి, ఓరుగల్లులోని సాధారణ ప్రజల దైనందిన జీవితాలను గురించి విపులంగా వర్ణించినారు. పతాక సన్నివేశంలో మహారాష్ట్రుల సైన్యం రుద్రమదేవి కోటను ముట్టడించినప్పుడు, వారిని ఓడించిన వైనం ఎంతో ఉత్కంఠభరితంగా ఉన్నది.

కవిద్వయం (నోరి నరసింహశాస్త్రి)

ఈ నవల శ్రీనాథుని (15వ శతాబ్దం) అంతిమదశనూ, పోతన మహాభాగవతము వ్రాయకముందు యువకవిగా ఉన్నప్పటి కాలంనూ వివరిస్తుంది. శ్రీనాథుడు తన రెండవ భార్య భూదేవితో శ్రీశైలం వెళ్లతాడు. అక్కడ మూడు నెలలు ఉండి శివరాత్రి మహాత్మ్యము కావ్యము వ్రాసి తనకు ఆశ్రయమిచ్చిన దండు రాజుకి అంకితం ఇస్తాడు. పోతన శ్రీశైలం వచ్చి శ్రీనాథుడితో రెండు మూడు రోజులు గడుపుతాడు. శ్రీనాథుడు ఇలా అంటాడు.

"పోతనా, నీవు తప్పక భాగవతము ఆంధ్రీకరింపవలె. నీలో నాకు మొదటి నుంచీ శ్రీకృష్ణ పరమాత్మ కళావేశము గోచరిస్తున్నదోయి. తప్పక వ్రాసి కృతార్థుడవు కావలె."

శ్రీనాథుడు నేటి విజయవాడ దగ్గరి తన స్వస్థానము బొడ్డపల్లెకి వస్తూ, దారిలో మాచెర్ల దగ్గర చంద్రవంక తీరాన కొద్ది రోజులు ఆగి, పల్నాటి వీరచరిత్రము వ్రాసెను. వ్రాయస కాడు పిడుగు వీరభద్రునికి, శ్రీనాథునికి ఉన్న అనుబంధమూ, వారి సంభాషణలు రసవత్తరంగా ఉన్నవి.

బొడ్డపల్లెలో శ్రీనాథుని పొలాలు కొంత వరదలో దెబ్బతిన్నాయి. పైరుకంకె లను పిట్టలు తినివేసాయి. ఆదాయం లేక పోవటంతో టంకం కట్టలేకపోతాడు. అధికారులతో దెబ్బలు తిని స్పృహ కోల్పోతాడు. అమరావతి ప్రజలు డబ్బు పోగుజేసి టంకం కట్టి శ్రీనాథుని విడిపిస్తారు. తరువాత శ్రీనాథుడు ప్రస్థానం చేస్తాడు.

నవల తరువాతి భాగం పోతన గురించి సాగుతుంది. పోతన తండ్రి కేసన చావుబ్రతుకుల్లో ఉన్నాడు. పోతన అన్న తిప్పన్నకు, ఇతర కుటుంబ సభ్యులకు భేదాభిప్రాయము వస్తుంది, తమ తండ్రి చనిపోతే, ఖననము (పాతిపెట్టుట) లేక దహనము (కాల్చుట) చేయాలా అన్న విషయం గురించి. ఈ విషయ చర్చ ఎన్నో పేజీలకు సాగుతుంది. ఇది నాకు అప్రస్తుతం అనిపించింది. పైగా ఖననం చేసినచో పోతన తల్లికి సహగమనం చేయటానికి వీలుండదని, దానికి వ్యతిరేకత అట. సహగమనం ఓడిపోయిన రాజుల రాణివాసాల్లో స్త్రీలు శారీరక, మానసిక భంగములు తప్పించుకోవటానికి చేసే దుర్భరచర్య కానీ, సాధారణస్త్రీలకు పైగా శాంతికాలంలో ఈ చర్యకు అవసరంలేదు గదా! ఈ విషయ ప్రస్తావనలో నోరివారి ప్రతీకాత్మకత లేక గుర్తిమి (Symbolism) నాకు బోధపడలేదు.

తరువాత పోతన భాగవతరచన మొదలెట్టిన సన్నివేశంతో నవల ముగుస్తుంది.

అంశుమతి (అడివి బాపిరాజు)


ఈ నవల ఏడవ శతాబ్దంలో తూర్పు చాళుక్యులు ఆంధ్ర చాళుక్య సామ్రాజ్యమును స్థాపించిననాటి గాథ. వేంగీ రాజ్యాధిపతి విష్ణుకుండిన మంచన భట్టారకుని ఏకైక పుత్రిక అంశుమతి. పదునెనిమిది వర్షముల ప్రాయములో నున్న అత్యంత సౌందర్యరాశి. ఎందరో రాజకుమారులు ఆమెను వివాహమాడ కోరుతూ

రాయబారములు వేంగీ రాజుకి పంపుతున్నప్పటికీ అంశుమతి ఆ రాయబారాలనన్నిటినీ తిరస్కరించింది. ఏదైనా గ్రహచారము ఉన్నదేమోనని గోదావరిలో నలుబది దినములు స్నానవ్రతము చేయుమని అంశుమతిని గోవూరు పంపించినారు ప్రభువులు. ఒకరోజు స్నానవ్రతము ముగించి రాజనౌకలో గోవూరులోని తన విడిదికి వెళ్లుతుండగా కళింగ రాజ్యదుండగులు అంశుమతిని అపహరించి కళింగరాజులు ఆక్రమించిన పిష్టపురం కోటలో బంధించారు.

ఇది ఇలా వుండగా, వాతాపి చాళుక్య సామ్రాట్టు పులకేశి మహారాజు తన చిన్న తమ్ముడగు కుబ్జ విష్ణువర్ధనుడిని ఆంధ్ర ప్రాంతపు చిన్నచిన్న రాజ్యాలను జయించి, తూర్పుచాళుక్య సామ్రాజ్యాన్ని స్థాపించుమని పంపినాడు. అ ప్రయత్నంలో విష్ణు వర్ధనుడు పిష్టపురంను రహస్యంగా చుట్టుముట్టి అకస్మాత్తుగా ఒక అర్ధరాత్రి ఆ కోటపై దండెత్తి, కళింగులపై విజయం సాధించెను. అక్కడ బందీగా వున్న అంశుమతికి విముక్తి లభిస్తుంది. అంశుమతి, విష్ణువర్ధనుడు ఒక పుష్పవనంలో (ఇంకెక్కడ?) అనుకోకుండా తారసపడి, తమ తమ పుట్టుపూర్వోత్తరాలను తెలుపకుండా ప్రేమలో పడతారు. వేంగీ రాజు మంచన భట్టారకుడు వారి ప్రేమ వ్యవహారము తెలుసుకొని, తన పుత్రిక అంశుమతిని విష్ణువర్ధనుడికి ఇచ్చి వైభోగంగా వివాహం జరిపి, తన వేంగీ రాజ్యాన్ని విష్ణువర్ధనుడుకి కట్టబెట్టుతాడు. ఆవిధంగా కుబ్జ విష్ణువర్ధనుడు ఆంధ్రచాళుక్య సామ్రాజ్యాన్ని స్థాపించినాడు. ఆ మహాసామ్రాజ్యానికి మూలపురుషుడయినాడు.

గోన గన్నారెడ్డి (అడివి బాపిరాజు)

కాకతీయ సామ్రాజ్యాధిపతి గణపతిదేవుని సామంతులలో ఒకడయిన గోన బుద్ధారెడ్డి తనయుడు గన్నారెడ్డి. బుద్ధారెడ్డి వృద్ధాప్యంలో గన్నారెడ్డి బాగోగులను తన తమ్ముడు లకుమయా రెడ్డికి అప్పజెప్పి, తన రాజ్యాన్ని కూడా అప్పజెప్పి, గన్నారెడ్డి పెద్దయ్యాక ఆ సామంత రాజ్యాన్ని గన్నారెడ్డికి ఇవ్వవలసినదిగా కోరుతాడు, తరువాత చనిపోతాడు.



ఆదవోని మహారాజు కోటారెడ్డి కుమార్తె అన్నమాదేవి (అన్నాంబిక) పెళ్లి లకుమయా రెడ్డి కొడుకు వరదారెడ్డితో జరగ బోతున్న ప్పుడు గన్నారెడ్డి తన అనుచరులతో వెళ్లి మందిరంపై దాడి చేసి వరదారెడ్డిని లాక్కుని తీసుపోతారు. వివాహం ఆగిపో తుంది.

గణపతిదేవుడు పుత్రాభావంచేత తన ప్రధమపుత్రిక రుద్రమదేవిని పురుషునిగా పెంచి, ఆమె స్త్రీత్వాన్ని గోప్యంగా వుంచి, తన సర్వసేనాని కుమార్తె ముమ్మిడమ్మతో వివాహం చేస్తారు. రుద్రమదేవి ముమ్మిడమ్మకు తన రహస్యం చెప్పి, సరైన సమయంలో తన రహస్యం ప్రజలకు తెలుపుతాననీ, అప్పుడు ముమ్మిడమ్మకు పెళ్లి జరిపిస్తాననీ చెప్పుతుంది.

అన్నాంబిక, గన్నారెడ్డి ప్రేమలో పడతారు. అన్నాంబికను తన అక్క సాయంతో ఆదవోని నుండి ఓరుగల్లు తెప్పించి రుద్రమదేవి రాణివాసంలో చేర్పిస్తాడు. రుద్రమదేవి, ముమ్మిడమ్మ, అన్నాంబిక స్నేహితురాళ్లు అవుతారు. రుద్రమదేవి గన్నారెడ్డి సహాయంతో తిరుగుబడిన సామంతరాజులను ఓడిస్తుంది. రుద్రమదేవి చాళుక్య వీరభద్రమహారాజుని వరించి, వివాహం చేసుకొంటుంది. ముమ్మిడమ్మకు వీరభద్రమహారాజు తమ్ముడయిన చాళుక్య మహాదేవమహారాజుకిచ్చి పెళ్లి జరిపిస్తుంది. గన్నారెడ్డి గజదొంగ కాదనీ, కాకతీయ సామ్రాజ్యభక్తుడనీ జగద్విదితం అవుతుంది. అన్నాంబిక, గన్నారెడ్డి దంపతులవుతారు.

స్థలాభావం వల్ల ఈ పరిచయాన్ని విశేషంగా కుదించాను. ఈ నవలకు pustakam.netలో బెల్లంకొండ లోకేష్ శ్రీకాంత్ వ్రాసిన చక్కటి పరిచయం ఇక్కడ చదవవచ్చును. http://pustakam.net/?p=4075

హిమబిందు (అడివి బాపిరాజు)

శాతవాహన మహారాజు శ్రీముఖుని కాలంలో రాజధాని పట్టణం ధాన్యకటకంలో చారుగుప్తుడు ప్రముఖ వర్తకుడు, అత్యంత ధనవంతుడు. అందాలరాశి అయిన తన పుత్రిక హిమబిందుని శ్రీముఖుని జ్యేష్ట పుత్రుడు శ్రీకృష్ణయువరాజు కిచ్చి పెళ్లి చేయాలని అతని కోరిక. ఎడ్లబండి పందాలలో తన బంగారు శకటము గెలిస్తే, ఆ బండిని యువరాజుకి బహూకరించి, మహారాజువారి మన్ననలను బొందితే, హిమబిందు, శ్రీకృష్ణుల వివాహం జరగడానికి వీలుంటుందని చారుగుప్తుడు భావించాడు. కాని ఆ పందెంలో ఇంకొక శకటచోదకుడు సువర్ణశ్రీ గెలుస్తాడు. హిమబిందు సువర్ణశ్రీతో ప్రేమలో పడుతుంది.

శాతవాహనులు బౌద్ధమతాభి మానులు. స్థాలతిష్యులు అనే హిందుమహర్షి శాత వాహనుల సామ్రాజ్యాన్ని హిందు సామ్రాజ్యంగా మార్చటానికి ఒక పన్నాగం పన్నినాడు. తన మనుమరాలు చంద్రబాలను విషకన్యగా చేసి, ఆమె తన దగ్గరతనంతో శ్రీకృష్ణుని చంపివేయటం, మహారాజు రెండవ పుత్రుడు మంజుశ్రీని తస్కరించి, అతనికి రహస్యంగా హిందూమత బోధ చేసి, అతన్ని మహారాజుగా గద్దె ఎక్కించడం అతని పన్నాగం. కాని శ్రీకృష్ణుడు చంద్రబాలను ప్రేమించి, రాజవైద్యుల మందులతో చంద్ర బాలను అమృతకన్యగా మార్చి, పెళ్లి చేసుకొంటాడు. హిమబిందు, సువర్ణశ్రీ

కూడా పెళ్లి చేసుకొంటారు. చారుగుప్తుడు, స్థాలతిష్యులు వేసిన ఉపాయాలు ఫలించలేదు. ప్రణయాలు వేరే దారికి మళ్లాయి.

ఎడ్లబండ్ల పందెము, హిమబిందుని దుండగులు అపహరించటం, సువర్ణశ్రీ ఆమెను కాపాడటము, ఇంకా ఎన్నో సన్ని వేశాలు పాఠకుడిని కట్టివేస్తాయి. బాపిరాజుగారు అప్పటి సాధారణ జీవనవిధానాలను కళ్లకు కట్టినట్లుగా వర్ణించారు.

తులనాత్మక పరిశీలన (Comparative analysis)

తులనాత్మక పద్ధతి అనగా "సమానేతి వృత్తములుగల కావ్యములను, సమాన ధర్మముగల కవులను, సమకాలికులైన కవులను పరస్పరము పోల్చి చూచుచు తారతమ్య నిరూపణము చేయవలెను" అని పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర సాహిత్య చరిత్రలో వ్రాశారు.

ఆ ప్రయత్నం ఇప్పుడు చేస్తాను.

నోరి నరసింహశాస్త్రి కవి, నవలారచయితయే కాదు, ప్రముఖ సాహిత్య విమర్శకుడు. తాను వ్రాసిన చారిత్రక నవలలను, బాపిరాజు నవలలను పోలుస్తూ ఇలా వ్రాశారు. "శ్రీ నోరి నరసింహశాస్త్రి ప్రకృతి ఒకవిధంగా బాపిరాజు ప్రకృతికి విరుద్ధమైనది. బాపిరాజు ఉత్సాహము నిరంకుశంగా పొంగులెత్తుతుంది. నోరి ఉత్సాహము సంయమనంతో నిండి ఉంటుంది. బాపిరాజుకి ఆంధ్రాభిమాన మెక్కువ. నోరికి మహాభారతాభిమాన మెక్కువ."

నోరి వారు కవిప్రియుడు. వారు వ్రాసిన చారిత్రక నవలలన్నిటిలోనూ కవుల ప్రసక్తి ఉంటుంది. 'నారాయణభట్టు' ఆదికవి నన్నయ గురించి, 'రుద్రమదేవి' తిక్కన సోమయాజి గురించి, 'కవిద్వయము' శ్రీనాథుడు, పోతన గురించి ఉన్నాయి. పైగా 'మల్లారెడ్డి' అనే నవలలో ఎర్రన ప్రసక్తి వుంటుంది. ఇక 'కవి సార్వభౌముడు', 'ధూర్జటి' నవలల్లో కవులే ప్రధాన పాత్రలు.

నోరి వారి శైలి చాలా సరళంగా వుంటుంది. పాత్రల చిత్రణ, సన్నివేశాలు సహజంగా పరిమితస్థాయిలో ఉంటాయి. అక్కిరాజు రమాపతిరావుగారు నోరివారి గురించి ఇలా వ్రాశారు. "చారిత్రక నవలలు వ్రాయటంలో, నాటి సామాజిక వాతావరణాన్ని కళ్లకు కట్టినట్టు చూపిస్తూ, భావుకతాస్ఫోరకంగా, పాత్రచిత్రణలో సజీవికా రామణీయక స్ఫూర్తితో, ఇతివృత్తనిర్మాణం చేయడం నోరివారి రచనా విశిష్టత."

బాపిరాజు కవి, చిత్రలేఖకుడు, చలనచిత్ర దర్శకుడు. చాలా సన్నివేశాలు దృశ్యప్రాధాన్యంగా ఉంటాయి. కళ్లకు కట్టినట్లుండు ఆ వర్ణనలతో పాఠకులు ఆ చలన భూరిత సన్నివేశాల్లో లీనమయి పోతారు. బాపిరాజుగారికి ఆంధ్రాభిమానము, స్త్రీపాత్ర ప్రేమ అతి మోతాదులో ఉంటాయి. ఆంధ్రుల వీరత్వం గురించిగాని, వారు పండించే పంటల గురించిగాని ఏ ప్రసక్తి వచ్చినా ఆయన్ని ఆపడం కష్టం. కళ్లెం వదిలిన గుర్రంలాగా దూసుకుపోతారు. స్త్రీపాత్ర వర్ణనలూ అంతియే. బాపిరాజుకి స్త్రీ పాత్రలపై మిక్కిలి మక్కువ. ఆ నాయికలను ఆకాశానికి ఎత్తేస్తారు. చదువరులు కూడా దిగ్భ్రమ చెందుతారు, మంత్రముగ్ధులవుతారు.

నోరి నరసింహశాస్త్రి బాపిరాజు గురించి ఇలా వ్రాశారు. "ఆంధ్ర చారిత్రక నవలను ఆంధ్ర సారస్వత పరిధిని దాటించిన వారిలో ప్రథముడు అడవి బాపిరాజు. ఆయన మూడు చారిత్రక నవలలలో 'హిమబిందు' నిస్సందేహంగా ప్రపంచ భాషలలోని ఉత్తమ నవలల స్థాయి నందుకొన్నది."

నా ఉద్దేశంలో నోరివారి 'నారాయణభట్టు' కూడా అదే కోవకు చెందుతుంది.

బాపిరాజుగారిపై ప్రశంసలు కొన్ని చూద్దాము.

అక్కిరాజు రమాపతిరావు (తెలుగు నవల): "స్వర్గీయ అడవి బాపిరాజు అన్నిటా భావుకుడు. గంధర్వలోకాల నుండి శప్తుడై వచ్చి తెలుగుదేశంలో కవిగా, చిత్రకారుడిగా, భావుకుడిగా, సౌందర్యపిపాసిగా, కళావేత్తగా ఆయన జన్మించారేమోననిపిస్తుంది. తెలుగు దేశం, తెలుగుభాష, తెలుగు చరిత్ర, తెలుగు విజ్ఞానం, తెలుగు అన్నది ఏదైనా ఆయనను పులకింపచేసేది, పరవశింపచేసేది."

కురుగంటి సీతారామ భట్టాచార్యులు (హిమబిందు నవల పీఠిక): "బాపిరాజు ఉపమానము లొకప్పుడు వాల్మీకిని తలపింప జేయును. ...రత్నములవలె నెడనెడ పొదుగబడియున్నవి. సంభాషణములు కడు హృదయంగమములుగ నుండి పాత్రల శీలమున కుచితములై సమంజసములై యుండును. ఎక్కడ చదువుచున్నను కవి శిల్పిగనో, చిత్రకారునిగనో, బాలునిగనో, శాస్త్రవేత్తగనో తొంగి చూచుచుండును."

బాపిరాజుగారిపై ప్రశంసలతో పాటు విమర్శలూ ఉన్నాయి.

అక్కిరాజు రమాపతిరావు (తెలుగు నవల): "బాపిరాజు నవలల్లో ఇతివృత్తానికి అపరిహార్యం కాని విషయాలు కూడా విశేషంగా చోటు చేసుకొంటాయనీ, పాత్రచిత్రణం, వర్ణనలు మొదలైనవాటిలో వైవిధ్యంకూడా చెప్పుకోదగినంతగా కనిపించదనీ ఒక విమర్శ ఉన్నది."

బెల్లంకొండ శ్రీనివాస్ (పుస్తకం.నెట్): "గోన గన్నారెడ్డి నవల చదవడానికి చాలా ఓపిక, ఏకాగ్రత కావాలి. రచన గ్రాంథిక భాషలో సాగటం యిందుకు కారణం కాకపోయినా, వాక్య నిర్మాణం, రాజవంశీయుల చరిత్రలు, వారి పేర్లు (ఒకే పేరు ఇద్దరు ముగ్గురికి వుండటం), బిరుదులు కొన్నిసార్లు తికమక పెడతాయి. కథలో ప్రధాన పాత్రలకే కాకుండా, ఇతర పాత్రలకు కూడా స్తోత్రపాఠాలు వ్రాశారు బాపిరాజుగారు. సగం పేజీ ఆక్రమించే ఆ బిరుదపాఠాలు చాలా చోట్ల అనవసరమనిపిస్తాయి."

చూశారా, బాపిరాజుగారిలాగే వారి ప్రశంసకులు, విమర్శకులు కూడా మోతాదు మించారు కదా!

మరి నావంతు. 'హిమబిందు' నవలలో హిమబిందుని ప్రియుడు సువర్ణశ్రీ చూస్తుంటాడు.

"ఆమె భుజరేఖలు సువ్వనబారి అంగుళీరేఖలలో వికస్వర మైనవి. బాహుమూల పార్శ్వశోభారేఖలు వక్షోపరిసమున్నత సుందరాకృతులు తాల్చి, వక్రపతనావేగమున డిగ్గనురికి మధ్య దేశమున నించుక కాలూని, మలుపులై నితంబచక్రముల సుళ్లుతిరిగి ప్రవహించి, ప్రవహించి పదరేఖల మొగ్గలు దొడిగినవి."

ఇందులో నాకు విచిత్రంగా కనపడినదేమిటంటే ఈ వర్ణన హిమబిందుది కాదు. ఆమె ప్రతిమ వర్ణన. ఆమె యొక్క రేఖాచిత్రం (sketch) గీస్తే, ఎలా వుంటుందో, లేక ఆమె శిల్పం చెక్కితే ఎలా వుంటుందో ఆ ఊహాచిత్రపు వర్ణన. అందులోనూ కేవలం బాహిర్యరేఖలు (outer lines) మాత్రమే. వక్షస్థానం నుండి మధ్యస్థానం వరకూ వంకరగీత వడిగా పడిపోతుందట, అక్కడ కొంచెంసేపు ఆగిపోతుందట. మరి చిత్రకారుడలాగే గదా గీసేది, చిత్రప్రేక్షకుడు అలాగే కదా చిత్రాన్ని చూసేది. సువర్ణశ్రీ స్వతహా శిల్పి. చిత్రలేఖనంలో సిద్ధహస్తుడయిన బాపిరాజుగారు ఇక్కడ హిమబిందుని కాకుండా, ఆ యువశిల్పి ఊహలో ఆ సౌందర్యవతి శిల్పం ఎలా వుంటుందో, ఆ ప్రతిమను వర్ణిస్తున్నాడు.

శ్రీ విద్యానాథుని 'ఆంధ్ర ప్రతాపరుద్రీయము' (జమ్మల మడక మాధవరామశర్మగారి అనువాదం) అలంకారశాస్త్రం చూస్తే బాపిరాజు ఇక్కడ వాడినది భావికాలంకారం అని అర్థమయినది.

మన చరిత్రలోకి వెళ్లితే, ఆంధ్రులవి నాలుగు సామ్రాజ్యాలు. వరుసవారిగా అవి శాతవాహన సామ్రాజ్యము (100 BCE కాని 2nd century CE), తూర్పు చాళుక్య (624-1189), కాకతీయ (1163-1323), విజయనగర (1336-1646) సామ్రాజ్యాలు. ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఆరు నవలలు ఈ నాలుగు సామ్రాజ్యాల కాలాల్లో జరిగిన కాల్పనిక కథలు. ఈ ఆరు నవలలతో పాటు నరసింహశాస్త్రిగారు, బాపిరాజుగారు వ్రాసిన ఇతర చారిత్రక నవలలు చదివితే చాలు, మన పూర్వీకుల రెండువేల సంవత్సరాల చరిత్రకు వీక్షకులమవుతాము. ఆ అన్వేషణకు నోరి, బాపిరాజు గార్లు దిక్సూచకులు. అందుకు తెలుగు పాఠకులు వారిరువురికి ఎప్పటికీ ఋణపడి ఉంటారు.

❖

నోరి నరసింహశాస్త్రి (1900-1978) గుంటూరులో పండిత కుటుంబములో జన్మించారు. మద్రాసులో బి.ఏ, బి.ఏల్ చదివారు. గుంటూరు జిల్లాలో కృష్ణానది తీరాన ఉన్న రేపల్లెలో స్థిరపడి, న్యాయవాది వృత్తితోపాటు, తమ సాహిత్యవ్యాసంగం కూడా సాగించారు. ఏబది సంవత్సరాలకు పైగా చేసిన సాహిత్యకృషిలో ఎన్నో నవలలు, కవితలు, నాటకాలు, వందలకొద్దీ సాహిత్య వ్యాసాలు వ్రాశారు. పేరు ప్రఖ్యాతులు గడించారు. తెలుగు, సంస్కృతము, ఇంగ్లీషు, కన్నడ భాషలలో పారంగతుడు. కవి సామ్రాట్ బిరుదు నందుకొన్నారు. తల్లావఝుల శివశంకరశాస్త్రితో కలిసి గుంటూరులో సాహితీసమితి స్థాపించి, ఎన్నో సాహిత్య ప్రయోగాలు చేశారు. వీరు వ్రాసిన చారిత్రక నవలలు ఎంతో ప్రసిద్ధి చెందినవి. నారాయణభట్టు, రుద్రమదేవి, మల్లారెడ్డి, ధూర్జటి, కవిసార్వభౌముడు, కవిద్వయము వీరు వ్రాసిన చారిత్రక నవలలు.

❖

అడివి బాపిరాజు (1895-1952) పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో జన్మించారు. రాజమండ్రిలో బి.ఏ, మద్రాసులో బి.ఎల్. చదివారు. కొద్దికాలం న్యాయవాద వృత్తిలో వుండి, అది మానివేసి, ఇతర వృత్తులలోకి ప్రవేశించారు. మచిలీపట్నంలోని నేషనల్ కాలేజిలో ప్రిన్సిపాల్‌గానూ, తరువాత తెలుగు దినపత్రిక మీజాన్ సంపాదకునిగానూ, ఆ తరువాత విజయవాడ ఆకాశవాణి రేడియోలో సాహిత్య సలహాదారుడుగానూ పనిచేశారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, ఒక సంవత్సరం జైలుశిక్ష అనుభవించారు. కొన్ని సినిమాలకు దర్శకుడిగా పనిచేశారు.

బాపిరాజు బాల్యం నుండి కవితలు వ్రాసేవారు. 1934లో ఆంధ్రవిశ్వకళాపరిషత్తు (నేటి ఆంధ్ర యూనివర్సిటీ) నిర్వహించిన నవలల పోటీలో బాపిరాజు వ్రాసిన నారాయణరావు నవలకు, విశ్వనాథ సత్యనారాయణ వ్రాసిన వేయిపడగలుతో పాటు, ప్రథమ బహుమతి లభించింది. ఎన్నో నవలలు, కథలు, కవితలు, నాటికలు ప్రచురించారు. గోన గన్నారెడ్డి, హిమబిందు, అడవి శాంతిశ్రీ, అంశుమతి బాపిరాజు వ్రాసిన చారిత్రక నవలలు.



*డా॥ రమేష్ రావెళ్ల Federal **Aviation Administration** లో **Automation Systems** పైన సీనియర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. వీరు వ్రాసిన 'ఆంధ్ర యూనివర్సిటీ కథలు' విశాఖ సంస్కృతి సాహిత్య మాసపత్రికలో ధారావాహికంగా వచ్చాయి. నివాసం వర్జీనియా.*



పద్య సాహిత్యం

ఒక్కసారి పద్యం వైపు...

డా॥ పాపినేని శివశంకర్

ప్రాచీన సంప్రదాయ సాహిత్యాలలో సామాజిక జీవన విధానం అంతగా కనబడదని భావించేవారికి కనువిప్పుగా పద్య సాహిత్యంలో పాదుకొన్న సామాజిక జీవన వికాసాన్ని, చలనాన్ని చూపించిన ప్రత్యేక వ్యాసం.

'ఓడు ఓడంటే కంచమంతా ఓడే' అన్నాడని సామెత. అట్లా ప్రాచీన సాహిత్యాన్నంతా ఒక్కమాటలో కొట్టిపారేసే వాళ్లున్నారు. (మనలో మాటగా చెప్పుకొంటే సదరు విమర్శకుల్లో ఆ గ్రాంథిక భాషా నియమాలు, వ్యాకరణాలంకారాలు బొత్తిగా తెలియని బాపతే ఎక్కువ!) సామాజిక చైతన్యమే సాహిత్యానికి పరమ ప్రమాణమని ఏకైక నిర్ధారణకు వచ్చిన ఆధునిక రచయితలకు వెనకటి సాహిత్యంలో ఆ రకం దినుసు కనపడలేదు. నిజమే. దైవం/ధర్మం/శృంగారం కేంద్రబిందువుగా నన్నయ నుంచి 19వ శతాబ్ది దాక సాగిన తెలుగు సాహిత్య ప్రస్థానంలో సమకాలిక సామాజిక సమస్యలు దాదాపుగా చర్చకు రాలేదు. అయితే **ఒక రచన గొప్పతనానికి కేవలం అందలి సామాజిక చైతన్యమే ఏకైక ప్రమాణం కాదని చెప్పదలచుకొన్నాను.** ఎందుకంటే వర్తమాన సమస్యల్ని ఏకరువు పెడుతూ, వాటిని పరిష్కరించి పారేస్తున్న వివిధ వాదాల చప్పిడి రాతల్ని చదువుతూనే ఉన్నాం. చదవగానే మర్చిపోతూనే ఉన్నాం. మరి శతాబ్దాల నాటి కవుల రచనలు ఇంకా గుర్తుండటానికి కారణం ఏమిటా అని ఆలోచిస్తారా? ఊహు.

ప్రాచీన కావ్య ప్రారంభంలో కనపడే 'అభ్యుదయ పరంపరాభి వృద్ధికి', ఆధునిక అభ్యుదయ దృక్పథానికి బాదరాయణ సంబంధం లేదు. అయితే అప్పటి రచనల్లో ఆనాటి సమాజం గురించి కొంతైనా తెలుసుకొనే అవకాశం ఉందా అనేది ప్రశ్న. ఉందనే నా సమాధానం. శతకాలు, యక్షగానాలు, వేమన, వీరబ్రహ్మం వంటి మహనీయుల రచనల్లో సమకాలిక సమాజం తప్పక దృశ్యమానమవుతుంది. మొత్తం మీద ప్రాచీన సాహిత్యంలో సామాజిక చైతన్యం ఏమంత కనపడకపోయినా 'సామాజిక చలనం' కొంత కనపడుతుందని నా ప్రతిపాదన. ఆధునికత పొడ సోకని భూస్వామ్య, రాజరిక సమాజంలో వేగం లేని, కుదుపులు లేని మందకొడి జీవనమే ఉంటుంది. అయినా అందులోనూ ఏదో ఒక స్థాయిలో కదలిక ఉంటుంది. ఆ చలనాన్ని తెలిపే 'సామూహిక జీవనం' అక్కడక్కడా మనకు తారసపడుతుంది. ఆ కాలంలో నలుగురూ కలిసే సందర్భాలు ఎట్లా ఉండేవి? సామాజిక ఆచార వ్యవహారాలు, ఆటపాటలు, కలిసి భోం చేయటాలు, కబుర్లు, కాకరకాయలు ఎట్లా ఉండేవి? నాలుగైదు దృశ్యాలు చూద్దాం.

ఉన్నట్టుండి కారుమబ్బు కమ్మింది. చెప్పాపెట్టకుండా, ఎలగోలు జల్లు (ముందస్తు జల్లు) లేకుండా ఒక్కసారిగా జడివాన మొదలైంది. గ్రామంలో అటూ ఇటూ పనుల మీద తిరుగుతున్న బాటసారులు తల దాచుకోవటానికి రచ్చబండల వద్ద మండపాల కిందకి చేరారు. వాన అప్పుడప్పుడే తగ్గేటట్టు లేదు. మరి వాళ్లకి కాలక్షేపం ఏమిటి? ఏమిటో 'ఆముక్త మాల్యద' కావ్యంలో శ్రీకృష్ణదేవరాయలు చెపుతున్నాడు.

రయమున వృష్టికై యొదిగి రచ్చలపై విధియింతు, రుగ్రతన్
హయపతి మీద దంతిపతి, నాతనిపై నృపతిన్ గజాది ని
ర్ణయముల మొత్తులాడుదురు; ప్రబ్బిక యింతయు విప్ప విచ్చు మె
గ్గయి మఱి పాసిపోదురు సమస్త దిశాగతులైన యధ్వగుల్

వాన మొదలు కాగానే పలు దిక్కులకు పోతున్న బాటసారు లంతా తటాలున రచ్చచావిళ్లలోకి ఒదుగుతూ చేరతారు. ఇక పోసుకోలు కబుర్లు మొదలు. ఒకడేమో అప్పటి రోజుల్లో 'హయపతి' గొప్పవాడంటాడు. హయపతి అంటే అశ్వబలం ఎక్కువగల బహమనీ సుల్తాను. మరొకడేమో అతని కన్న 'దంతిపతి' గొప్ప అంటాడు. దంతిపతి అంటే కటకం ప్రభువైన ప్రతాపరుద్ర గజపతి. వాళ్లిద్దరి కంటే 'నృపతి' గొప్ప అని ఇంకొకడు వాదిస్తాడు. నృపతి (నరపతి) అంటే కాల్బలం ఎక్కువగల విజయనగర ప్రభువు శ్రీకృష్ణదేవరాయలు అన్నమాట. ఆపైన ఏ రాజు గజ బలం, అశ్వబలం, కాల్బలం ఎంత అనే లెక్కలు మొదలవుతాయి. రెచ్చిపోయి తన్నులాడుకొంటారు. ఇంతలో వాన తగ్గి వెలి మబ్బారుతుంది. దాంతో మొగ్గ విచ్చుకొన్నట్టు ఒక్కసారిగా ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోతారు.

పల్లెటూళ్లలో వానాకాలం సర్వసాధారణంగా కనపడే దృశ్యం ఇది. అయితే ఆ దృశ్యం ప్రజలకు దూరంగా ఎక్కడో రాజాంత:పురంలో ఉండే రాయలకి ఎట్లా తెలిసింది? ఎప్పుడు చూసి ఉంటాడు? ఆశ్చర్యం. ఇటువంటి అద్భుతమైన దృశ్యాలెన్నో 'ఆముక్తమాల్యద'లో కనిపిస్తాయి. నిజానికి తన ఆస్థానంలోని అష్ట దిగ్గజ కవులకన్నా మహాకవి ఆ ఆంధ్రభోజుడు. ప్రజల జీవన విశేషా లను అంత చక్కగా, స్వభావోక్తిరమ్యంగా వర్ణించిన కవులు అరుదు. ఏరువాక సాగిన రైతుల అవస్థలేమిటి, జడివానలో ఇల్లాళ్ల వంటావార్పుల తిప్పలేమిటి, పుష్పలావికల (పూలు అమ్మే యువతులు) సరససల్లాపాలేమిటి, ఎండాకాలం భోగపరుల భోజన సుఖాలేమిటి, దిగుడుబావుల నుంచి కడవలతో నీళ్లు తెచ్చుకొనే యువతుల సొగసులేమిటి- ఇట్లా ఆనాటి జనజీవన చిత్రాలెన్నో కళ్ల ముందు నిలిపాడు ఆ సాహితీ సమరాంగణ చక్రవర్తి.

రాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లో ఒకడుగా తెనాలి రామకృష్ణుడు ప్రసిద్ధికెక్కాడు. వికటకవిగా హాస్యకథలకే అతడిని పరిమితం చేశారు సాహిత్యకారులు. కాని తెనాలివాడు అపరిమిత ప్రతిభాశాలి. 'కుమారభారతి' బిరుదాంకితుడు. ఆయన రచించిన ఉద్భటారాధ్య చరిత్ర, ఘటికాచల మాహాత్మ్యము, పాండురంగ మాహాత్మ్యము అనే మూడు పద్యకావ్యాల్లో చివరిది విశిష్టమైంది. అందులోని నిగమశర్మోపాఖ్యానంలో సమకాలిక ప్రజాజీవన చిత్రణ కనపడుతుంది.

దేశంలో పశువులకు గాలికుంటు వ్యాధి ప్రబలింది. అది అంటువ్యాధి. అది తగిలితే పశువులు పాలివ్వలేవు. బళ్లు లాగలేవు. నీరసించి నీలుక్కుపోతాయి. వాటికి నికరమైన వైద్యం లేదు. వాటికేదో గాలి సోకిందని జనం భావించే కాలం. కనుక ఆ పట్టణాన్ని ఏలే రాజు గాలిగంగల (క్షుద్రదేవతల) జాతర ప్రకటిం చాడు. ఇక జనం వేడుక ఎలా ఉందో తెనాలి కవి విపులంగా వర్ణించాడు. గోరువెచ్చని పసుపునీళ్లతో స్నానాలు చేసి, వేపచిగుళ్ల మాలలు వేసుకొని, మోటుగా అలంకరించుకొని ఆడామగా అంతా ఊరి పొలిమేరలో ఉన్న గ్రామదేవత గుడి దగ్గరికి తరలి వెళ్లారు. జాతర మొదలైంది. మేకలు మొదలుగా పశువుల్ని బలి యిచ్చారు.

అంబోధరము క్రింద నసియాడు వైరావ
తియు బోలె సిడి వ్రేలె దెఱవ యోర్తు
చెందమ్మి కొలన రంజిల్లు నంచయు బోలె
నిప్పుటేట నటించె నెలత యోర్తు
తొలుసంజ యెండ నర్తిలు జక్కవయు బోలె
నీగె బందిరిగుండ మింతి యోర్తు
జలనీలిపై నిక్కు కలువమొగ్గయు బోలె
ననటాకు నర్తించె నతివ యోర్తు

కాంత యొక్కర్తె మూపున కండ లిచ్చె
మాఱుగా లిచ్చె నొక సుధామధుర వాణి
లలన యొక్కర్తు నోరి తాళంబు లిచ్చె
శక్తి జాతర తమ భక్తి శక్తు లెసగ

ఆ గ్రామదేవత పండుగలో ఒక స్త్రీ ఎత్తైన సిడిమానుకు తనను తగిలించుకొని వేలాడింది. మరొక మగువ నిప్పులవాగు మీద నాట్యం చేసింది. ఇంకొక స్త్రీ నిప్పులగుండం తొక్కింది. వేరొక యువతి అరటి ఆకు మీద నాట్యం చేసింది. ఒక వనిత భుజం మీద కండలను కోసి సమర్పించింది. మరొక ఆడకూతురు మొక్కుబడిని బట్టి దేవతకు కాలి అలంకారం చేయించి యిచ్చింది. మరొక లలన మౌనవ్రతం పాటిస్తూ రెండు దొడల గుండా (లేదా నాలుక గుండా) ఇనుపసూదులు గుచ్చుకొని తన భక్తి వెల్లడించింది.

ఇదీ వాళ్ల భక్తి, శక్తి. ఇవన్నీ మూఢ విశ్వాసాలే కావచ్చు. కానీ యిప్పటికీ మన జాతర్లలో ఇటువంటి ఆచారాలు కనపడుతూనే ఉన్నాయి. భారతీయ సంస్కృతిలోని ఒక విచిత్ర వైరుధ్యం ఏమిటంటే - అత్యాధునికమైన జీవన విధానం పక్కనే ఆదిమ ఆచారాల కొనసాగింపు. ఏది ఏమైనా ఆ పశువులకు గాలికుంటు వ్యాధి తగ్గిందోలేదోగాని 'శారద నీ రూపము' అని ప్రశంసింప బడిన రామలింగ కవి వెనకటి కాలంనాటి ఒక సామూహిక ఆచారాన్ని మన కళ్లముందుంచాడు.

భక్తి దాటి కాస్త రక్తిలో పడదాం. ఆటపాటల్లో పందేలు పసందుగా ఉంటాయని అభిజ్ఞుల ఉవాచ! 'పందెమ్ములందు ఏ పందెమ్ము మేలయా?' అని అడిగితే ఠక్కున 'క్రికెట్' అంటారు పందెం రాయుళ్లు. కాదు కాదు, కోడిపందేలంటారు మరి కొందరు. 'ఈ కోడిపందెంబు లేమి సెప్పెడినయా! ఆంధ్ర జాతీయ శౌర్యాభిలిప్స' అన్నాడు తెనుగులెంక తుమ్మల. సంక్రాంతి వచ్చేటప్పటికి కనుమనాడు ఇప్పటికీ తెలుగునాట కోడి పందేలు విపరీతంగా జరుగుతున్నాయి. ఈ ప్రాచీన క్రీడ గురించి

అయ్యలరాజు నారాయణామాత్యుడు ((క్రీ.శ. 18వ శతాబ్ది) 'హంస వింశతి' కావ్యంలో ఇట్లా వర్ణించాడు.

చొరబడి కాలిపాతలను జుట్టియు, కత్తులు వేసి, సందిటం
బెరయగ బట్టి, చెక్కు గఱపించి, గిరేర్పడ గీచి, నిల్పి కొం
కురలగ పూంచి, పందియపుటంకువ దిద్దుచు చిట్కె వేసి, స
ల్లిరి మఱి 'భో' యటంచును 'ఖళీఖిళి' పుంజులు
తన్నులాడగన్

డేగ, నెమలి, పింగళి, కాకి, డేగ కాకి మొదలైన జాతి కోళ్లతో రంగంలోకి దిగారు పందెం రాయుళ్లు. పుంజుల కాళ్లకి పాత గుడ్డలతో కత్తులు కట్టారు. సందిట్లో పట్టుకొని వాటికి పౌరుషం రగిలించడానికి చెక్కిళ్లు కరిపించారు. గిరి గీసి అందులో వాటిని నిలిపి, చిటికె వేసి 'భో' అంటూ రెచ్చగొట్టి, పుంజులు తన్నులాడుతుంటే ఉత్సాహపడుతున్నారు. పందేలకు తోడు పై పందేలుంటాయి. పోటీపడేవాళ్లు పదిమంది ఉంటే ప్రేక్షకులు వందమంది ఉంటారు. వాళ్లకి చెలగాటం, పుంజులకి ప్రాణ సంకటం! ఇంతకీ ఆ పందెంలో డేగ గెలిచిందా, నెమలి గెలిచిందా అనేది మాత్రం చెప్పలేదు కవి.

ఆదిమ మానవుడికి అడవే మాతృగర్భం. ఆధునికుడు ఆ ప్రకృతికి దూరమయ్యాడు. క్రమంగా సమిష్టి జీవనానికీ దూరమయ్యాడు. చివరికి తన సిసలైన మానవీయతకీ దూరమయ్యాడు. ఇది మూడు పొరల పరాయితనం (Alienation). కాకపోతే అప్పుడప్పుడు నాలుక కరుచుకొని కార్తికమాసంలో (కార్తీకం కాదు) వనభోజనాలకి సిద్ధమవుతాం. వనం అంటే అడవి గదా! అడవులన్నీ సుబ్బరంగా దుంప నాశనం చేశాం గనుక ఎక్కడో ఏదో చెట్టు నీడన సరదాగా భోజనాలు కానిస్తాం. ఆ విధంగానైనా ప్రకృతికి కాస్త దగ్గరవుతాం గదా! నలుగురూ కలవటమే అక్కడ విశేషం. అందుకే ఆ పబ్బం ఏర్పడి ఉంటుంది. అయితే సిసలైన వన భోజనాలు చూడాలంటే పోతన భాగవతంలోకి వెళ్లాల్సిందే.

ఒకానొకనాడు శ్రీకృష్ణుడు గోప బాలకులతో కలిసి 'కాంతారంబున బంతి చల్దులు కుడువ నుద్యోగించి' (అడవిలో బంతి భోజనాలు) కొమ్ముబూర ఊదాడు. గోప బాలకులంతా భుజాల మీద చల్ది బువ్వల కావిళ్లతో, పిల్లనగ్రోవులతో పశుగణంతో ఆటలాడుతూ, పాటలు పాడుతూ అడవిలో ప్రయాణించారు. అక్కడ ఒక సరస్సు వద్ద విడిది చేశారు. పశువులు అక్కడక్కడా మేత మేస్తున్నాయి. గోపబాలకులంతా కృష్ణుని చుట్టూ తామర పువ్వు మధ్య దుద్దు పక్కన రేకుల్లాగా చుట్టూ చేరి కూర్చున్నారు. భోజనాలు మొదలు.

మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు
కూరుగాయలు దినుచుండు నొక్క
డొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి
చూడు లేదని నోరు సూపు నొక్క
డేపురార్గుర చల్దు లెలమి పన్నిద మాడి
కూర్కొని కూర్కొని కుడుచు నొక్క
డిన్నియు తగ పంచి యిచ్చుట నెచ్చెలితన
మనుచు బంతెన గుండు లాడు నొకడు

కృష్ణు జూడుమనుచు కికురించి పరు మ్రోలి
మేలి భక్ష్యరాశి మెసగు నొకడు
నవ్వునొకడు సఖుల నవ్వించు నొక్కడు
ముచ్చటాడు నొకడు మురియు నొకడు

ఒక కుర్రాడు తక్కినవాళ్లని ఊరిస్తూ ఊరగాయలు తింటున్నాడు. పక్కవాడి కంచంలోది లాక్కొని చటుక్కున మింగి 'ఏదీ? లేదు' అని నోరు చూపిస్తున్నాడు ఇంకో రాలుగాయి. పందెం వేసి ఐదారుగురు తినే చల్దులు ఒక్కడే నోట్లో కుక్కుకుని కుక్కుకొని తింటున్నాడొకడు. అన్నం, కూరలు అన్నీ చక్కగా అందరికీ సమంగా పంచిపెట్టటమే స్నేహధర్మం అని ముద్దలు చేసి అందిస్తున్నాడొకడు. మరో ఉలిపికట్టె 'అడుగో కృష్ణుడిని చూడు'మని పక్కవాడి విస్తట్లో రుచి గల పదార్థాలు కాజేస్తున్నాడు. నవ్వేవాడొకడు, నవ్వించేవాడొకడు, ముచ్చట్లాడే వాడొకడు, మురిసే వాడొకడు. ఏమి దృశ్యం!

ఇదిట్లా ఉంటే కృష్ణుడేమో నడుముకు కట్టిన వస్త్రంలో పిల్లనగ్రోవి దూర్చి, కొమ్ముబూర, బెత్తం ఎడమ చంకలో ఇరికించి, మీగడ పెరుగు చద్దిముద్ద ఎడమ చేతిలో పెట్టుకొని, వేళ్ల సందున ఊరగాయలు ఇరికించి, సావాసగాళ్ల మధ్య చక్కగా కూర్చొని సరససల్లాపాలాడుతూ బువ్వ తిన్నాడు. ఇంతకన్న సంతోషకరమైన వనభోజనాల సందడి ఉంటుందా? ఇంతకీ యిదంతా మూల భాగవతంలో లేని పోతనగారి కల్పనే. ఆయనకెంతో యిష్టమైన విషయం గాబట్టే యింత చక్కగా వనభోజనాలను వర్ణించాడు.

ఇట్లాంటి చక్కని సమూహ దృశ్యాలెన్నో వెనకటి కావ్యాల్లో ఉన్నాయి. అప్పటి సాహిత్యం ఓటికుండ కాదు, గట్టికుండే అని పిస్తుంది. మోగించి చూడగల సామర్థ్యమే కావాల్సింది. సాహిత్య కారులకు ముందు చూపే కాదు, ఇంత దూరం ఎట్లా నడిచి వచ్చామో తెలుసుకోవాలంటే కాస్తంత వెనకచూపు కూడా ఉండాలి కదా?



కథ, కవిత్వం, విమర్శ, సంపాదకత్వం- ఇలా అన్ని రచనా ప్రక్రియల్లో అందవేసిన చేయి పాపినేని శివశంకర్. నాలుగు కవితాసంపుటాలు, రెండు కథానంపుటాలు, మూడు వ్యాససంపుటాలు ప్రచురించారు. కథాసాహితి సహ సంపాదకులు. ఇటీవలే వీరి కవితాసంపుటి 'రజనీగంధ'కు ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. నివాసం గుంటూరు. 2001, 2017 తానా సభల అతిథి.



ఆంధ్ర మహిళాసభ

చరితకురాలి చతుర్వేదుల

తెలుగు నేలపై స్త్రీల వికాసానికి కృషి చేసిన మహిళామణులు ఎందరో ఉన్నారు. వారిలో ఆచరణాత్మక కృషిలో ప్రధానపాత్ర వహించిన శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ నెలకొల్పిన ఆంధ్ర మహిళాసభ పుట్టుపూర్వోత్తరాలు...

దుర్గాబాయి దేశముఖ్‌గారు అనగానే, వారు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహిళగా, ఉద్యమం కోసమని గాంధీజీ గారు వచ్చినపుడు ఆలోచించకుండా తన చేతి బంగారు గాజులు ఇచ్చే సారని అని ఇలా చాలామంది తెలుగువారు తమ పాఠ్యపుస్తకాలలో చదువుకునే ఉంటారు. కానీ ఆవిడ జీవితం గురించి, అతి చిన్న వయసులోనే వారు చేసిన సంఘసేవ ముఖ్యంగా మహిళలకి వారు చేసిన సేవ గురించి చెప్పాలంటే చాలానే చెప్పుకోవాలి. దాదాపు 80 సంవత్సరాల క్రితమే మహిళాభ్యుదయానికి పాటుపడిన ఒక ప్రత్యేకమైన సామాజిక కార్యకర్త దుర్గాబాయమ్మగారు.

దుర్గాబాయమ్మగారు 1909లో రాజమండ్రిలో జన్మించి కాకినాడలో పెరిగారు. ఒక మహిళగా సంఘసేవ, ఆడవాళ్లకి సహాయం చేయాలని ఆవిడ ముందుకి వచ్చారు. దుర్గాబాయిగారి ఆశయాలకు చేదోడు వాదోడుగా వాళ్లమ్మగారు కృష్ణవేణమ్మ గారు కూడా నిలిచారు. 10వ ఏట బడి మానేసి హిందీ చదువుతూ 12 ఏళ్లకే హిందీ బోధనా పాఠశాలను స్థాపించారు. 14 ఏళ్లకి రాజకీయాలలో తిరిగి, జైలుకి కూడా వెళ్లారు. అక్కడ మహిళలు పడుతున్న కష్టాలు చూసి వారికోసం పాటుపడాలనుకున్నారు. ఆమె తన 24వ ఏట బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం మెట్రిక్ పరీక్షలు వ్రాసి ఉత్తీర్ణురాలాయినారు. తరువాత ఆంధ్రా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం చదివి 32 సం॥లకు క్రిమినల్ లాయర్ అయ్యారు.

దుర్గాబాయమ్మగారు మద్రాసులో 1937-39 ప్రాంతంలో Little Ladies of Brindavan అనే చిన్న సంస్థను స్థాపించారు. పిల్లలకు training కాకుండా, స్త్రీలకు కూడా workshop పెట్టి చేతివృత్తులు అనగా నూలు వడకటం, పేపరు బుట్టలు చేయించడం నేర్పించారు. అదే సమయంలో ముళ్లపూడి వెంకటరమణగారి తల్లిగారు కూడా విస్తరాకులు కుట్టడం నేర్పించారు. చేతివృత్తులతో ఆగిపోరాదని వారికి చదువు చెప్పడం కూడా ప్రారంభించారు. అందులో కొంతమంది చేత బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం మెట్రిక్ పరీక్షలు వ్రాయించారు. వారందరూ ఉత్తీర్ణులు కూడా అయ్యారు. కొంతకాలమైన తరువాత ఆవిడ మద్రాసులో వికలాంగులకు కూడా చాలా కార్యక్రమాలు చేపట్టి వారి అభివృద్ధికి చాలా దోహదపడ్డారు. వారికీ చేతివృత్తులు నేర్పించారు.

తరువాత నెమ్మదిగా ఆవిడ హైద్రాబాదులో కూడా ఈ సంస్థను స్థాపించాలని సంకల్పించి 1958లో ప్రారంభించారు. ఆ విధంగా దుర్గాబాయమ్మగారు మహిళాసంక్షేమం కోసం స్థాపించిన అనేక సంస్థల్లో ముఖ్యసంస్థ అయిన ఆంధ్ర మహిళాసభ హైద్రాబాద్‌లో మొదలయ్యింది. హైద్రాబాదులోని విద్యానగర్‌లో Durgabai Deshmukh Hospital, AMS Collegel of Nursing , Ramachandra Girls high School, B.Ed College, Literacy House, Arts and Science College, Vocational Training and Rehabilitaion Center for the Handicapped మొదలైనవి స్థాపించారు. ఈనాటి ఎంతోమంది స్త్రీలకి Ramachandra Girls high School , Arts and Science College లు విద్యను ప్రసాదించాయి.

దుర్గాబాయమ్మగారికి చేదోడువాదోడుగా, ఆవిడకి అత్యంత సన్నిహితురాలయిన సుగుణమణిగారు పనిచేసేవారు.

సుగుణమణిగారు దుర్గాబాయమ్మగారితో పాటు అన్నీ సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొంటూ చాలా నిస్వార్థ సేవ చేసారు. వారిరువురూ అన్నీ శాఖలను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తూ, ఇబ్బందులను కనుక్కొంటూ పరిష్కరించేవారు. దుర్గాబాయమ్మ గారి తదనంతరం సుగుణమణిగారు 'సభ'ని తన బిడ్డలాగా చూసుకున్నారు.

ఆంధ్ర మహిళాసభతో నా అనుబంధం

1980లో ఆంధ్రమహిళాసభ ప్రసూతి ఆసుపత్రిలో మా చెల్లెలు పురుడు పోసుకుంది. తనకి సహాయంగా వెళ్లినపుడు, నేను దుర్గాబాయమ్మగారిని చూశాను. ఆ వయసులో కూడా ఆసుపత్రి లో అన్నిటినీ స్వయంగా పర్యవేక్షిస్తూ ఉండేవారు. ఆవిధంగా నా లాంటి సామాన్యురాలికి ఆ మహాతల్లి దర్శనభాగ్యం లభించింది.

నేను చదివినది బీయస్సీ అయినా, చిన్నప్పటి నుంచీ కుట్లు, అల్లికలు అంటే చాలా ఆసక్తిగా చేసేదాన్ని. 1982-83 సంవత్సరా లలో, మా పిల్లలు పెరిగి కొంచెం పెద్దవారయ్యాక, నాకు చాలా ఇష్టమైన అభిరుచి అయిన కుట్టులో మెళుకువలు నేర్చుకోవాలని పించింది. ఆ విధంగా కుట్టుశిక్షణ పొంది పరీక్షలలో ఉత్తీర్ణురాలిని కూడా అయ్యాను. ఆ తరువాత ఆంధ్ర మహిళాసభలో కుట్టు టీచర్ కావాలంటూ పోస్టు ఒకటి వచ్చింది. దరఖాస్తు పెట్టుకొని, Dr Durgabai Deshmukh Vocational Training & Rehabilitation Centre For Handicappedలో కుట్టు టీచర్‌గా చేరడం జరిగింది.. ఆ విధంగా ఆ సంస్థలో దాదాపుగా 15 ఏళ్లపాటు సేవచేసే అవ కాశం లభించింది. దుర్గాబాయమ్మగారికి ఎంతో సన్నిహితురాలైన సుగుణమణిగారిలాంటి వారి దగ్గర పనిచేశాను. అక్కడ అనుభవాల గురించి కొన్ని విషయాలు ఇక్కడ చెబుతాను.

ఈరోజుల్లో మానసిక మరియు శారీరిక వికలాంగులకు బడులు చాలానే ఉంటున్నాయి. చాలామందికి autism వంటి వాటి మీద అవగాహన కూడా ఉంటోంది. కానీ ఒక 40 ఏళ్ల క్రితం పిల్లలు వికలాంగులు అనగానే ఆ కుటుంబాన్ని, పిల్లల్ని సమాజం వెలివేసినట్లుగా చూసేది. అటువంటి రోజుల్లో ఇటువంటి వారి కోసం ఒక సంస్థ నెలకొల్పాలి అన్న సంకల్పం రావటం అనేది చాలా గొప్ప విషయం!!

Vocational Training Center Oslo Tailoring egen stoerto Book binding, Letter press printing, Music, Computer training కూడా ఉన్నాయి. సంవత్సరానికి, 16-30 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలని, సంస్థలో చేర్చుకుంటారు. పిల్లల యొక్క అనుకూలతను, అభిరుచిని బట్టి కావలసిన శిక్షణ ఇచ్చి, వారి కాళ్ల మీద వారు నిలబడేటట్టు చేయడమే ముఖ్యోద్దేశ్యము. టీచర్లకు కూడా కొంత ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుంది. ప్రతీ టీచరు కూడా ఏదో మొక్కుబడిగా ఉద్యోగం చేస్తున్నట్లుగా భావించకుండా పిల్లల అభివృద్ధి కోసమే అన్నట్లుగా సేవలనందిస్తారు. ఇక్కడ పనిచేసే టీచర్లు ఎన్నో ఏళ్ల నుంచీ అదే సంస్థలో పనిచేస్తున్నారు. ఈ సంస్థ ఇతర వికలాంగుల సంస్థల్లాగా కాకుండా, ఒక్క వికలాంగులనే కాక, Vocational Course చేయాలన్నవారినీ, కేవలం ఒక అభిరుచి గా నేర్చుకోవాలన్న వారినీ కూడా జేర్చుకుంటారు. ఆ విధంగా అందరినీ కలిపి పాఠాలు చెప్పడం వలన, వికలాంగులైన పిల్లలు వారినేదో ప్రత్యేకంగా చూస్తున్నట్లు భావించరు. ముఖ్యంగా మాన సికంగా ఎదుగుదల లేని పిల్లలలో చాలా అభివృద్ధి కనిపిస్తుంది.

నా పదిహేనేళ్ల కుట్టు టీచరు ప్రయాణంలో ఎంతోమంది శిష్యులతో, ఎన్నో మరిచిపోలేని జ్ఞాపకాలు ఇచ్చింది ఈ సంస్థ. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలకి ఇచ్చే నెలవారి స్టైయిఫెండ్ క్రమం తప్పకుండా తీసుకుని, ఎప్పుడెప్పుడు పిల్లలను వదిలించు కుందామా అన్నట్లు ఉంటే, కొందరు పిల్లలను ఇన్‌స్టిట్యూట్‌లో పొద్దున్నే వదిలి పెట్టి సాయంత్రం ఇన్‌స్టిట్యూట్ విడిచే వరకు పిల్లలు ఎప్పుడు వస్తారా అని ఎండనకా వాననకా అక్కడే చెట్ల క్రింద కూర్చుని కాలక్షేపం చేసేవారు. చిన్నప్పుడే ఒక చేయి లేకుండా పుట్టిన విజయ, ఏది కుట్టడం చూపించినా ఇట్టే కుట్టేసేది. తరువాత ఉత్తీర్ణురాలై తానే పదిమందికి నేర్పిస్తూ, ఒక కుట్టు షాప్ పెట్టుకుంది. నోటితో మాట్లాడలేకపోయినా ఎంతో అద్భుతంగా కుడుతూ, నా పక్కనే కూర్చుని బోలెడు కబుర్లు చెప్పేది అనురాధ. 25 ఏళ్ల క్రితం ఎప్పుడో మా దగ్గర ఎంబ్రాయిడరీ నేర్చుకున్న గౌరి, ఈరోజుకి మమ్మల్ని ఎక్కడ చూసినా 'మేడంగారూ' అంటూ గట్టిగా కావలించుకుంటుంది. ఇన్‌స్టిట్యూట్‌లో చేరినపుడు చేతితో సూది కూడా సరిగ్గా పట్టుకోలేని పిల్లలు బటన్లు, హుక్కులు కుడుతుంటారు. అక్కడికి వచ్చే పిల్లలకి చాలా బాగా తెలిసిన విషయం ఏంటంటే, ఎవరు పలుకరించినా పలుకరించక పోయినా ఈ బడి వారు తమని ఆప్యాయంగా దగ్గరికి తీసి సేద తీరుస్తారు అని.

ఎన్నో ఏళ్ల క్రితం దుర్గాబాయమ్మ గారిచే స్థాపించబడిన ఆంధ్ర మహిళాసభ సంస్థ ఎంతోమందికి ఉపాధి పొందే అవ కాశాలు ఇచ్చింది. ఒక ధృడమైన సంకల్పంతో ఎన్నో జీవితా లని తీర్చిదిద్దిన అటువంటి మహాతల్లి మన తెలుగువారి ఆడపడుచు గా పుట్టడం తెలుగువారందరూ ఎంతో గర్వంగా చెప్పుకోవలసిన విషయం కదూ.



లలిత కుమారి చతుర్వేదుల హైద్రాబాద్ వాస్తవ్యులు. హైద్రాబాద్, విద్యానగర్ లోని ఆంధ్ర మహిళా సభ వారి Durgabai Deshmukh Vocational Training & Rehabilitation Centre for the Handicapped సంస్థలో కుట్టు టీచర్ గా, దాదాపు పదహారేళ్లు పనిచేసారు.



భ్రమణకాంక్ష

అనగనగా ఒక రాజ్యం

దాసరి అమరేంద్ర

కళ్లతో మాత్రమే కాదు, అంత:చక్షువులతో చూడాలేగాని మనం చూసే ప్రతి ప్రదేశం అబ్బురంగానే కనబడుతుంది. ఇటీవలే తెలుగులో యాత్రా సాహిత్యానికి మంచి గుర్తింపు వచ్చింది. నాటి కాశీయాత్ర చరిత్ర నుంచి కొనసాగుతున్న పరంపరలో ఈ థాయ్‌లాండ్ యాత్ర...

థాయ్‌లాండ్ వెళదామని నేను ఏనాడూ అనుకోలేదు.

రెండు నెలల క్రితం బ్యాంకాక్‌లో ఉంటోన్న సాహితీ మిత్రులు కళ్యాణి-సత్యజిత్ ప్రతిపాదించారు. 'మీరొస్తే అంతా కలసి రోడ్డు ట్రిప్పు వేద్దాం. రండి... మాకు దగ్గర్లోనే క్వాయ్ నది ఉంది. డెత్ రైల్వే ఉంది. జలపాతాలున్నాయి. రండి...'

రివర్ క్వాయ్, డెత్ రైల్వే నాకు బాగా తెలిసిన ప్రదేశాలు. 'ది బ్రిడ్జ్ ఆన్ ది రివర్ క్వాయ్' అన్న నవల చదివాను. సినిమా చూశాను.

"సరే! మే మూడు ఉదయం బ్యాంకాక్ చేరతాను. మళ్లా పది ఉదయం ఢిల్లీ తిరుగు ప్రయాణం. రోడ్డు ట్రిప్పుతో పాటు నాకో సిటీటూరు, పట్టాయా టూరూ కూడా ప్లాన్ చేసి పెడతారా..."

రిజర్వేషన్లు చేసేశాను. వీసా బ్యాంకాక్‌లో దిగాకా కూడా తీసుకోవచ్చు.

❖

రెండో తారీఖు రాత్రి తొమ్మిదిన్నరకు నా విమానం. టైమ్ డిఫరెన్స్ కలుపుకుని మూడు ఉదయం మూడు గంటలకు బ్యాంకాక్ చేరుతుందది.

విమానం నిండా భారతీయ పర్యాటకులు. ఇరవై పాతిక మంది భారతదేశాన్ని, బుద్దుడు తిరుగాడిన ప్రాంతాలను చూడడానికి వచ్చిన థాయ్‌లాండ్ విద్యార్థులు. నా పక్క రెండు సీట్లలోనూ వాళ్లే. మాట్లాడే ప్రయత్నం చేశానుగానీ భాషా సమస్య.

ఠంచనుగా మూడింటికి బ్యాంకాక్‌లో దిగాను.

దిగీదిగగానే కళ్యాణి, సత్యజిత్‌ల ఫోనులు, సూచనలు.

వీసా ఫారాలు నింపి క్యూలో చేరేసరికి నాలుగు.

క్యూలో నా ముందూ వెనుకా ఓ ఘజియాబాద్ కుటుంబం. మరో గురుగ్రామ్ యువతి. తడిపొడి కబుర్లు... గంట నడిచిన క్యూ.

టాక్సీ తీసుకొని పాతిక కిలోమీటర్ల దూరాన ఉన్న కళ్యాణి వాళ్ల ఇంటికి చేరేసరికి తెల్లారిపోయింది. "వచ్చేసారా?' అని ఆవిడ, 'వచ్చేసానా?!' అని నేనూ సంబరమే సంబరం. ఆ వారంరోజులూ అదే నా ఇల్లు.

కానీ నాకో సంకోచం ఉండనే ఉంది.

పదిహేడో శతాబ్దపు జపాను హైకూ కవి మత్సువొబషొ తన 'హైకూయాత్ర' అన్న రచనలో అంటాడు- ప్రయాణాల్లో అలసి సొలసి నీ అతిథేయుల ఇంటికి చేరి ప్రశాంతంగా కూర్చున్నావూ అంటే నీ శ్రమనూ వత్తిడినీ ఆ గృహిణికి బదిలీ చేస్తున్నావు అన్నమాట...'

చదివినపుడు 'హమ్మో నిజమే గదా' అనిపించింది.

రాబోయే వారమే నా విషయంలో నేను కరెక్టో, బషో కరెక్టో చెపుతుందనిపించింది.

కళ్యాణిగారో నిరంతర జిజ్ఞాసి. సాహిత్యమన్నా, మనుషులన్నా, ప్రపంచమన్నా ఆసక్తి. గత నాలుగయిదేళ్లుగా ఆయా

విషయాల మీద రాస్తున్నారు. మేవు ఎపుడు కలసినా క్షణాల్లో చర్చల్లో పడిపోతాం. అభిప్రాయ ప్రకటనలు, చర్చలు, ఒకరి నుంచి మరొకరు నేర్చుకోడాలు...

ఆ ఉదయం అదే జరిగింది, గంటన్నర..

"రేపు మీరూ నేనూ ఇక్కడికి రెండు గంటల దూరంలో ఉన్న రైల్వే మార్కెట్టు, ఫ్లోటింగ్ మార్కెట్టు చూసి వస్తున్నాం. ఎల్లుండి మీరూ సత్యజిత్ గంటన్నర దూరాన ఉన్న అయుథయ అన్న పాత రాజధానీ నగరం వెళ్లి వస్తారు. ఆరూ ఏడూ ఎనిమిదీ మన రోడ్డు ట్రిప్పు. కాంచనబుర అన్న పట్నాన్ని స్థావరంగా చేసుకొని క్వాయ్ నది, డెత్ రైల్వే, హెల్ ఫైర్ కనుమ, జలపాతాలు చూసి వద్దాం. తొమ్మిదో తారీఖు మీ సిటీ టూర్ అనుకొంటున్నాం," వివరించారు కళ్యాణి.

ఈలోగా వాళ్ల పాప మధుర వచ్చి పలకరించింది.

మద్రాసు కళాక్షేత్రంలో సంగీతం చదువుకుంటోంది మధుర.

❖

రేపట్నించీ పోగ్రాములు సరే - మరి మే మూడు సంగతేవిటీ?

బ్యాంకాక్‌లో చక్కని లోకల్ రైళ్లున్నాయని గూగుల్ చెప్పింది. దగ్గర్లో అశోక్ అన్న స్టేషను ఉందని కళ్యాణి చెప్పి, తన 'రాబిట్ కార్డ్' అందించారు. ఆ రైళ్లలో ఊరును చూస్తూ చిట్టచివరి దాకా వెళ్లాలన్నది నా ప్లాను. నగరపు నాడిని వడివడిగా అందుకోవాలని నా తహతహ. నా తపనకు తగ్గట్టే అశోక్ ప్రాంతపు లైను స్కైట్రైన్ లైనట!! దారిదారంతా నేలకు ముప్పై నలభై అడుగులు ఎత్తునే నడుస్తుందంట... మరింకేం!!

రైలు పట్టుకొన్నాను. ఒక చివర చేరడానికి నలభై నిమిషాలు పట్టింది.

నగరపు ప్రధాన ప్రదేశాలలో ప్రయాణం. అటూ ఇటూ కళ్లు చెదిరే అత్యాధునిక భవనాలు... క్రమబద్ధమైన జీవన సరళి. సంపన్నత ఉట్టిపడే ప్రదేశాలు.

నిజానికి నాకు థాయ్‌లాండ్ గురించి తెలిసింది తక్కువ.



ఆగ్నేయాసియాలో ఒక చిన్న దేశమనీ, బహుశా అంతగా అభివృద్ధి చెందని ప్రాంతమనీ, ఇప్పటికీ రాచరిక వ్యవస్థ వదలని దేశమనీ, మత్తుమందులకూ సెక్స్ టూరిజంకూ నిలయమనీ అరకొర పరిజ్ఞానం.

దగ్గరకు వెళితే అర్థమయింది.

అది సువిశాల దేశం. వైశాల్యంలో దాదాపు దక్షిణ భారతదేశమంత. ఏడుకోట్ల జనాభా. ఆగ్నేయాసియాలోకెల్లా రెండో సంపన్న దేశం. అయిదు లక్షల (మన) రూపాయల వార్షిక తలసరి ఆదాయం. చక్కని రహదారి వ్యవస్థ. పరిశ్రమలు, వ్యవసాయం, టూరిజం- ప్రధాన ఆర్థిక వనరులు. బౌద్ధం పుణ్యమా అని పరుగులు లేని బతుకులు- ఇవన్నీ ఎవరో చెప్పనక్కర్లేదు... గూగుల్‌లో అరగంట, రైళ్లలో మరో గంట గడిపితే చాలు!

కానీ ఇంత ఘనమైన దేశంలోనూ చరిత్రలోకి వెళితే మొట్ట మొదటి జనావాసాలు పదకొండో శతాబ్దానివేనట. చైనా నైరుతి భాగంలోంచి వచ్చి స్థిరపడిన వారివట. నమ్మటం కష్టమనిపించింది. చిన్న చిన్న రాజ్యాలు- అనేకానేక యుద్ధాలు... పొరుగున కంబోడియా, మలేషియా, లావోస్, బర్మాలు... పదమూడో శతాబ్దంలో ఏర్పడిన సుఖథోయ్ రాజవంశం, నూటపదేళ్ల పాలన... ఆ తర్వాత నాలుగు వందల సంవత్సరాల పాటు అయుథయ వంశపు పరిపాలన. 1782లో ఉనికిలోకి వచ్చిన ప్రస్తుతపు రాజవంశం- వారు స్థాపించిన రతన్‌కోసిన్ రాజ్యం... ఎంతోకాలం ప్రజారంజకంగా పాలించిన 'రామ9' అన్న రాజు రెండేళ్ల క్రితం గతించగా మే ఏడో తారీఖున పట్టాభిషేకపు వేడుకలకు సిద్ధపడుతోన్న అతని కొడుకు రామ10, నగరం నిండా కొత్త రాజుగారి వర్ణచిత్రాలు...

దేశంలో తొంభై అయిదు శాతం ప్రజలది బౌద్ధం. నాలుగు శాతం ఇస్లాం. హిందువుల సంఖ్య స్వల్పాతి స్వల్పం. కానీ రాజులంతా హిందూమత అనుయాయులు. తమ అసలు పేరుకు 'రామ' అన్న గౌరవనామం జోడించే వంశం వారిది!!

రైలు ఖేహ అన్న చిట్టచివరి స్టేషను చేరింది. రైలు ప్రయాణం పుణ్యమా అని అసలుసిసలు థాయ్‌లాండ్‌లో అడుగుపెట్టినట్టనిపించింది. ఎక్కేవాళ్లు దిగేవాళ్లు, స్త్రీ బాల వృద్ధులు, వారివారి వేషభాషలు... హావభావాలు, ఆర్థిక స్థితిగతులు... అదో మినీ థాయ్‌లాండ్.

ఖేహా నుంచి దక్షిణంగా నాలుగు కిలోమీటర్లు వెళితే ఏన్షియంట్ సిటీ అన్న సముద్రతీర ప్రాంతముందనీ, ఆ సముద్రమే గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్ అనీ మ్యాపులు చెప్పాయి. అడుగులు అటు పడ్డాయి. ఎండ అవరోధమనిపించలేదు.

కుడివేపున దక్షిణానికి సాగుతోన్న సుఖమ్‌విట్ రోడ్డు, ఎడమన పచ్చరంగు చిక్కని నీళ్లతో ఏభై అడుగుల కాలువ. రోడ్డుకీ కాలువకీ మధ్య అతి చక్కని కాలిబాట. కాలువ ఒడ్డున గుల్‌మొహర్ పూలచెట్లు. అడుగడుగునా వంతెనలు-దిట్టమైన వంతెనల దగ్గర్నించి నలుగురు నడిస్తే పడిపోతాయా అనిపించే చెక్కవంతెనల వరకూ వంతెనలే వంతెనలు. ఆ చెక్క వంతెనల

అవతలివేపున బీదవాళ్ల ఇళ్లు. అలాంటి ఇల్లు ఒకటి కనపడితే అది టీకొట్టు అవకపోతుందా అన్న ఆశతో అక్కడ కనిపించిన పెద్దాయన్ని వాకబు చెయ్యగా అరకొర ఆంగ్ల పదాలలో 'అది మా ఇల్లు' అని ఆయన చెప్పడం, కిర్రు చప్పుళ్ల వంతెన దాటి ఆయన ఇంటికి వెళ్లి ఓ పావుగంట. ఇరుగు పొరుగుల పలకరింపు.

'పురాతన నగరం' సంగతి ఎలా ఉన్నా గంట గడిచాక కుడివేపున మియామీబజార్ అన్న ప్రదేశం కనిపించింది. దిశ మార్చి సముద్రం వేపుకు వెళ్లే సన్నపాటి రోడ్డు పట్టుకొని కిలో మీటరు నడిచాను. సీఫుడ్ రెస్టారెంట్ అన్నచోట విశాల జలదృశ్య దర్శనం. 'ఛో ఫ్రయా' అంటూ బ్యాంకాక్ నగరంలో మెలికలు మెలికలు తిరుగుతూ పారే స్థానిక నది సముద్రంలో కలిసే చోటది. ఆ రెస్టారెంటు వచ్చేసిన అక్కడో అరగంట. పెప్సీ. స్టీరియోలో థాయ్ సంగీతం. దారి తప్పి వచ్చిన నామీద అక్కడివాళ్ల ఆసక్తి, కబుర్లు.

తిరుగు ప్రయాణంలో ఆ అనుభవం కోసం ఖేహా స్టేషను దాకా ఓ సెవన్ సీటర్ టాక్సీ ఎక్కాను. సహ ప్రయాణీకులు సంతోషంగా సహకరించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఇల్లు.

❖

ఇంటికి చేరేసరికి కల్యాణి సత్యజిత్ సాయంతో నాకో సాయంత్రపు కార్యక్రమం రూపొందించారు. ఏసియాటిక్ రివర్ ఫ్రంట్ అన్నచోట చక్కని నైట్ మార్కెట్ ఉందట. రెండు రైళ్లూ ఒక ఫెర్రీ ఎక్కి గంటా గంటంపావులో అక్కడికి చేరుకోవచ్చట.

రెండు మూడు గంటలు సేదదీరి మళ్లా సాయంత్రం అయి దింటికి అటువేపు బయల్దేరాను. రైళ్లలో ప్రయాణం సులువుగా సాగినా పడవల రేవులో చాతాడంత క్యూ. ఆ క్యూలో ఓపిగ్గా కదులుతోన్న దేశవిదేశాల పర్యాటకులు. ఈలోగా ఆకాశంలో సంధ్యాసమయపు వర్ణ విన్యాసాలు... పరిసరాల్లో అలుముకొన్న ఉత్సవ వాతావరణం... విసుగనిపించలేదు.

నిజంగానే ఏషియాటిక్ నైట్ మార్కెట్ ఒక ఉత్తేజకరమైన ప్రదేశం. అనేకానేక స్థాయీ స్థోమతుల రకరకాల దుకాణాలు, రెస్టారెంట్లు, వస్తు సముదాయం, సీఫుడ్ ప్రదర్శనలు, జిగేలుమనే అలంకరణలు, తీర్చిదిద్దినట్లున్న సన్నపాటి సందులు, నదీ తీరాన వెలుగుల వెల్లువలు, దూరాన మెరిసేటి బడాభవనాలు- సరదా ప్రదేశం.

❖

రెండోరోజు కల్యాణిగారితో కలిసి ఆరున్నరకల్లా టూరు మినీవ్యాను ఎక్కాను. పదిమంది సహ ప్రయాణీకులు... స్నేహంగా పలకరించి కబుర్లాడిన ఓ ఇటలీ యువజంట... మాటకారితనం పుష్కలంగా ప్రదర్శిస్తోన్న స్నేహరూపపు టూరిస్టు గైడు...

"మిగిలినవాళ్లంతా టూరిస్టుల్ని తిన్నగా రైల్వే మార్కెట్ దగ్గరకు తీసుకెళతారు. మేవలాకాదు- ముందుగా ఆ రైలు బయల్దేరే బన్‌కలాంగ్ అన్న స్టేషనుకు తీసుకువెళతాం. అక్కడ మీరు రైలు ఎక్కి మా గ్రామసీమలలో ఓ గంట ప్రయాణించి



రైలుతోపాటు మీరూ ఆ రైల్వేమార్కెట్లో ప్రవేశిస్తారు. అదో అద్భుతమైన అనుభవం," వివరించాడు మా గైడు.

గంటన్నర ప్రయాణించి బన్‌కలాంగ్ చేరుకొన్నాం.

చిన్నచిన్న ఊళ్లు... పరిసరాల్లో ఉప్పుమళ్లు... పొలాలు... తోటలు... సముద్రపుగాలి... పరిచయాలు జరిగిపోయి పరాచికాల స్థాయికి చేరుకొన్న సహ ప్రయాణీకులు... ఓ మెక్సికన్ పెద్ద వయసు జంట-వారబ్బాయి, మరో అమెరికన్ సీనియర్ సిటిజన్ జంట, ఇద్దరు స్థానిక యువతులు, ఓ బ్రిటిషు నడివయసు మనిషి- అంతా కలిపి పదీపదకొండు మందిమి.

రైలు సముద్రతీరానికి హత్తుకొని సాగింది. గంట ప్రయాణం. మెక్లాంగ్ స్టేషను మా గమ్యం. ఆ స్టేషనుకు మూడు వందల మీటర్ల ముందు నుంచి రైల్వేమార్కెట్. పట్టాలకు హత్తుకుని అటూఇటూ అనేకానేక రకాల దుకాణాలు... రైలు వచ్చే సమయంలో తమతమ సామాన్లు పట్టాల నుంచి దూరంగా పెట్టుకొంటోన్న దుకాణాలవాళ్లు... దుకాణాల ముందుండే నీడ పట్టాలను గబగబా విప్పేసుకొంటోన్న యజమానులు... మా రైలుబండి రాకను ఆహ్వానిస్తూ రెండుపక్కలా సర్దుకుని నిలబడ్డ టూరిస్టుల కేరింతలు... ఆ దృశ్యంలో భాగమవడం ఊహాతీతమైన ఆనందం కలిగించి మాతోను కేరింతలు కొట్టించింది.

రైల్వే మార్కెట్లో అరగంట గడిపి, దుకాణదారులతో కబుర్లాడి, చిరు కొనుగోళ్లు చేసి, తిరుగు ప్రయాణం ఆరంభించిన రైలుకు ఈసారి మేవు పక్కన నిలబడి వీడ్కోలు పలికి, మా మరుసటి మజిలీ వేపు మళ్లాం.

మరోగంట ప్రయాణం చేసిన మా వ్యాను ఓ పడవల రేవు చేరుకొంది. అక్కడ ఎక్కిన పడవ మరో చిన్న కాలువలోకి, మరింకో చిరు కాలువలోకి ప్రవేశించి సాగి చివరికి ఫ్లోటింగ్ మార్కెట్ అన్న పాతిక అడుగులు వెడల్పు ఉన్న జలమార్గంలో ప్రవేశించింది.

ఓ వందా నూట ఏభై మీటర్ల మేర చిన్నచిన్న నావల్లో తిరుగాడుతోన్న దుకాణాల సమూహం. మళ్లా కాలువ రెండు ఒడ్డులా దుకాణాల వరుసలు... కూరగాయలు, పళ్లు, పూలు, భోజనాలు, టీ షర్టులు, హ్యాండ్ బ్యాగులు, అలంకరణ సామాగ్రి, ఐస్‌క్రీములు,

కొబ్బరిబొండాలు- దొరకని వస్తువు లేదు. నేనూ కల్యాణిగారూ మాకు గైడు ఇచ్చిన గంటన్నర సమయాన్ని నింపాదిగా మా బాణీలో మేవు తిరుగాడుతూ గడిపాం.

కాలువగట్టున అతి శుభ్రంగా ఉన్న గట్టు మీద చేరగిల బడ్డాం. ఎదురుగా తన చిరు ఆహారాల పడవను సిద్ధపరుస్తోన్న పాతికేళ్ల అమ్మాయి. ఆమెకు సాయం చేస్తోన్న ఏభై ఏళ్ల పొరుగు పడవ మనిషి. 'మీ నాన్నా?' అడిగాను. 'కాదు, స్నేహితుడు,' అంది. ఆ ఇద్దరితో కబుర్లు, చెణుకులు... ఫోటోలు.

❖

మూడోనాటి కార్యక్రమం సత్యజిత్‌తో అయుథయ ప్రయాణం. అన్నట్లు అయుథయ అంటే అయోధ్య అన్న మాటకు స్థానిక రూపం.

ఆరింటికల్లా గైడుతో సహా ఇంటికే వచ్చింది వాహనం.

బ్యాంకాక్ నుంచి ఉత్తరం వేపుకు గంటన్నర ప్రయాణం... తొంభై కిలోమీటర్లు. అయుథయను కేంద్రంగా చేసుకొని ముప్ఫై మూడుమంది రాజులు నాలుగువందల సంవత్సరాలు పాలన చేసారట. ఒకానొక దశలో పదిలక్షల జనాభాతో కళకళలాడిన నగరమట. చుట్టూ మూడు నదులు... మధ్యలో ఇపుడు కనుమరుగయిపోయిన రాజప్రసాద ప్రాంగణం... ఇప్పుడు శిథిలాలుగానే మిగిలి పోయినా యాత్రికులను ఆకట్టుకొనే ఆనాటి మందిరాలు... యునెస్కో హెరిటేజ్ సైట్ ఇది.

ముందుగా వెళ్లింది విహాన్ ఫరా మోంగ్ ఖోన్ బాఫిట్ అన్న చోటుకు. పధ్నాలుగో శతాబ్దపు బౌద్ధమందిరం ఇక్కడ ఉండేదనీ, 1767లో శత్రువులు ధ్వంసం చేసారనీ, పందొమ్మిదో శతాబ్దపు చివరిలో కింగ్ రామా4 దాన్ని మళ్లా కట్టించాడనీ అక్కడి వివరాలు.

ఈ మందిరాన్ని ఆనుకొనే వాట్ ఫరసి సన్‌ఫెట్ అన్న శిథిలాలయం ఉంది. దానిని ఆనుకునే అప్పటి రాజసౌధమూ తదితర భవనాలూ ఉండేవనీ, ఓ అగ్నిప్రమాదంలో అవన్నీ గతించాయనీ, ఈ ఆలయం అప్పటి ప్రభువుల ప్రత్యేక మందిరమనీ గైడమ్మ వివరణ.

మరో రెండు కిలోమీటర్లు దూరాన వాట్ మహాథట్ అన్న మందిరపు శిథిలాలు. గొప్ప సౌందర్యమున్న మందిరమిది.



రావిచెట్టు మొదళ్లలో వేళ్ల మధ్య వికసించిన బుద్ధుని శిరస్సు ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ.

'ఇంకెక్కడికీ?' అంటే, 'పవళిస్తోన్న బుద్ధుడిని చూద్దాం,' అన్నది గైడమ్మ. నూటయాభై అడుగుల పొడవూ, పాతిక అడుగుల ఎత్తూ ఉన్న విగ్రహది.

ఆ దగ్గరలోనే ఉన్న ఓ నేషనల్ మ్యూజియం మా చిట్టచివరి అంశం.

ఒక విలక్షణ శిథిల నగరాన్ని కళ్లారా చూసిన సంతృప్తి. ఇవన్నీ ఓ ప్రివ్యూలానే చూశానుగాని పూర్తిగా ఆస్వాదించలేదన్న అసంతృప్తి...

❖

రెండ్రోజులు గడిచేసరికి మధురతో పరిచయం పెరిగింది. చనువు ఏర్పడింది. మాటలు సరళంగా సాగాయి.

అడగగానే త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామిల సంగీతపు కృషి గురించి వివరించింది. వారివారి పాటలు వినిపించింది. అన్నమయ్య కృతి కూడా.

శాస్త్రీయ సంగీతమే కాకుండా తలత్ మెహమూద్ నుంచి అర్జిత్ సింగ్ దాకానూ, ఓపీ నయ్యర్ నుంచి 'అబ్బా' మీదుగా రెహమాన్ దాకానూ తనకు మంచి పరిచయం ఉంది. 'నువ్వు పుట్టడానికి నలభై ఏళ్ల ముందుగా పాడిన వీళ్లందరితో నీకు ఎలా పరిచయం?' అని అడిగితే, 'వీళ్లున్నారుగా,' అని కల్యాణి-సత్యజిత్‌లను చూపించి నవ్వింది. నిజమే- వాళ్లకీ సంగీతమంటే వెర్రి ప్రేమ! మా నలుగురి అభిరుచులూ ఈ విషయంలో బాగా కలిసాయి. ఇహ చెప్పేదేముంది? గంటల తరబడి ఆయా పాటలు వినడం, కొత్త కొత్త పాటల్ని ఒకరికొకరు వినిపించుకోవడం, అంతా కలసి పరవశించిపోవడం- అరుదైన ఆనందాలవి!!

❖

మే ఆరూ, ఏడూ ఎనిమిదీ మా కాంచనపుర యాత్ర

మా వాహనం ఓ శక్తివంతమైన ఎస్‌యూవీ. రథసారధి సత్యజిత్.

బాగా తెల్లవారుఝామున బయల్దేరి పడమటి దిక్కున నూటనలభై కిలోమీటర్ల దూరాన ఉన్న మా 'ప్లకన్ రిసార్ట్' ఎనిమిదిన్నరకల్లా చేరుకున్నాం. రిక్- మా గైడు ఎదురుచూస్తూ కనిపించాడు. మెక్లాంగ్ నది ఒడ్డునే ఉందీ రిసార్టు. అక్కడికి నాలుగు కిలోమీటర్లు ముందే ఉత్తరదిశ నుంచి వచ్చే పెద్ద క్వాయ్ నదీ, దక్షిణపు చిన్న క్వాయ్ నదీ సంగమించి ఈ మెక్లాంగ్ నదిగా రూపొందాయి.

సామాన్లు రిసార్ట్‌లో పెట్టి అంతా ఇరావన్ జలపాతాలకేసి సాగిపోయాం. ఎనభై కిలోమీటర్లు. గంటన్నర ప్రయాణం. పెద్ద క్వాయ్ నదిని ఒరుసుకుంటూ సాగింది. గంట గడిచేసరికి నదికి తోడుగా అడవి వచ్చి నిలిచింది. ఇరావన్-ఐరావతం నేషనల్ పార్కుట అది. 'జలపాతం ఐరావతంలా కనిపిస్తుంది కాబట్టి దానికా పేరు,' రిక్ వివరణ. ఏడంచెల జలపాతమది. రెండున్నర కిలోమీటర్ల కొండదారిలో విస్తరించి ఉంది. నడి వేసవి గదా

నీళ్లుండవేమో అని భయపడుతూ వెళ్లాం. ఉన్నాయి. కానీ తక్కువ. ఉన్నంతవరకూ ఆ జలపాతపు అంచెలు ఎంతో సుందరంగా ఉన్నాయి. నిజంగా వర్షాకాలంలో ఇంకెంత సొగసుగా ఉంటాయో అనిపించింది. నాలుగో అంచె వరకూ అందరమూ నడిచాం- ఎక్కాం అనాలి.

'ఈసారి మరింత అడవిలో వెళదాం రండి,' అంటూ అవరోహణకు కొత్తదారి తెరిచాడు రిక్. పచ్చని చక్కని వెదురుపొదలు నిండిన సరళమైన కాలిబాట అది. హఠాత్తుగా, 'ఇవిగోండి, వెదురు బియ్యం కంకులు,' అని చూపించాడు రిక్. అంతా కలిపి ఇరవై నిమిషాల చక్కని నడక.

జలపాతం దాటుకుని మరికాస్త ఎగువకు నది ఒడ్డునే సాగి మరో పావుగంటకి శ్రీనగరిండ్ డామ్ అన్న చోటుకు చేరుకొన్నాం. ఎదురుగా బాగా దిగువున పచ్చని కొండలూ అడవుల మధ్య పారుతోన్న క్వాయ్ నది. వెనుక సువిశాల జలాశయం. పైన మండే ఎండ. లంచ్ కోసం పరిసరాల్లోని చక్కని ప్రవేశానికి దారితీశాడు రిక్.

❖

ఏడో తారీఖు ప్రయాణ పరంపర నా థాయ్‌లాండ్ యాత్రకు కలికితురాయి.

కాంచనపురి దగ్గర రైలు ఎక్కి క్వాయ్ నది ఒడ్డునే ఏభై కిలోమీటర్లు సాగి 'థమ్‌కసె బ్రిడ్జ్' అన్న చోటుకు చేరుకోవడం మా కార్యక్రమంలో మొదటి అంశం.

అక్కణ్నించి నది ఒడ్డునే ఉత్తరంగా సాగి హెల్‌ఫైర్ పాస్ అన్నచోటుకు చేరుకోవడం రెండో అంశం. ఆ నగకాగ్ని కనుమ నుంచి తిరుగు ప్రయాణంలో పైయోక్ నేషనల్ పార్క్‌లో ఉన్న చిన్న జలపాతాన్ని చూడటం చిట్టచివరి అంశం.

ఈ రైలు ప్రయాణమూ, ఆ రైలు మార్గమూ సామాన్యమైనవి కావు. లక్షమంది ప్రాణాలను బలి తీసుకొన్న మృత్యుమార్గం- డెత్ రైల్వే అది.

1942లో ఆగ్నేయాసియా దేశాలన్నీ జపానువారి ఆధీనంలో ఉన్న సమయమది. భారతదేశ ప్రవేశానికి థాయ్‌లాండ్ నుంచి బర్మా వరకూ రైలుమార్గం నిర్మిస్తే తమ పని సులువవుతుందని జపనీయుల భావన. మొత్తం 415 కిలోమీటర్లు. బ్యాంకాక్ దగ్గరలోని బన్‌పాంగ్ అన్న చోటు నుంచి ఉత్తరంగా సాగి బర్మాలోని థన్‌బైజాయిట్ అన్న సముద్రతీర ప్రాంతం వరకూ సాగే రైలు మార్గమది. మెరుపు వేగంతో పదిహేను నెలల్లో పూర్తిచేసారా పని. అందుకు మూడు లక్షలమంది శ్రమించారు. మలేషియా, థాయ్‌లాండ్‌లకు చెందిన కూలీలు, వీళ్లతోపాటు అమెరికా ఆస్ట్రేలియా బ్రిటన్లకు చెందిన వేలాది యుద్ధఖైదీలూ, వీళ్లేగాకుండా పదివేల మంది జపాను పనివాళ్లూ అధికారులూ... పని విజయవంతమయిన మాట నిజమేగానీ ఆ విజయం ఖరీదు లక్ష ప్రాణాలు- అందులో వెయ్యిమంది జపానువాళ్లవి.

ఈ రైలుమార్గ నిర్మాణంలో జరిగిన దారుణాల మీద రచనలూ సినిమాలు వచ్చాయి. 1952లో ఓ ఫ్రెంచి రచయిత



రాసిన 'ది బ్రిడ్జ్ ఆన్ ది రివర్ క్వాయ్' నవల వాటిల్లో ముఖ్యమైనది. 1957లో అదే పేరుతో సినిమాగా వచ్చింది. అలాగే 'హెల్ ఫైర్‌పాస్' దారుణాల గురించి 2016లో 'ది రైల్వేమాన్' అన్న సినిమా వచ్చింది.

కాంచనపురి పరిసరాల్లోనే రైలు 'ది బ్రిడ్జ్ ఆన్ ది రివర్ క్వాయ్' దాటింది. 'అయ్యో! ఇక్కడ ఆగమా?!' నా ఆక్రోశం. 'తిరుగు ప్రయాణంలో తప్పకుండా ఆగుదాం,' సత్యజిత్ భరోసా! రైలుబండి గంటా గంటన్నరసేపు చిన్న క్వాయ్ తీరం వెంబడే సాగింది. పొలాలు, కొండలు, అడవులు, ఎర్రెర్రని పూలు, ఎక్కి దిగే గ్రామీణులు- ఏడున్నర ప్రాంతంలో థమ్‌కసె బ్రిడ్జ్ స్టేషను చేరాం.

అదో కలల ప్రపంచం.

హత్తుకుని పారుతోన్న నది... అతి చక్కని రైల్వేస్టేషను... నది తిరిగే పెద్ద మలుపు... ఆ మలుపు వెంబడే కట్టిన సుదీర్ఘమైన వయాడక్టు, ఆ చివర గుహలో ఓ బౌద్ధ మందిరం, అంతా కలిసి ఐదారువందల మీటర్ల సుందర ప్రాంతమది. తనివిదీరా ఒకటికి రెండుసార్లు పట్టాల మీద నడకలు...

వదలలేక వదలలేక ఆ నదినీ, రైలుమార్గాన్నీ వదిలి ఉత్తరంగా ఏభై కిలోమీటర్లు దూరాన ఉన్న హెల్ ఫైర్‌పాస్ వేపు సాగాం. రెండు నేషనల్ పార్కుల నడుమ గుండా, బర్మా బోర్డరుకు అతి సన్నిహితంగా, స్విట్జర్లాండు ప్రకృతి దృశ్యాలను గుర్తుకు తెస్తూ సాగిందా ప్రయాణం.

ఇక్కడి కనుమను రైలుమార్గానికి అనుగుణంగా మలచి పట్టాలు వెయ్యడం బర్మా రైలుమార్గ నిర్మాణంలో రెండవ కీలక ఘట్టమట. అందుకు అతి దారుణంగా రేయింబవళ్లు పని చేయించారట. ఆ ప్రక్రియలో అక్కడ మరణించినవారిలో ఆస్ట్రేలియాకు చెందిన వేలాది యుద్ధ ఖైదీలు ఉన్నారట. వారికి నివాళిగా 1987లో ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఒక శిలాఫలకాన్ని ప్రతిష్ఠించింది. ఓ మ్యూజియం నెల

కొల్పింది. రైలుమార్గం అవశేషాల దాకా చక్కని కాలిబాట ఏర్పాటు చేసింది. ఆ కొండ చరియల్లో అప్పటి మృతుల వివరాలూ ఫోటోలూ తాపడం చేసింది. ఇంకా బ్రతికి ఉన్నవాళ్ల జ్ఞాపకాల వీడియోలు తీసి ప్రదర్శిస్తోంది... వెంటాడే అనుభవమది!

కాంచనబురి తిరుగు ప్రయాణానికి రెండు గంటలు పట్టింది. ఊరి పొలిమేరలోని రివర్ క్వాయ్ వంతెన దగ్గర ఓ గంట సేపు ఆగాం.

నవలా సినిమాలలో గ్రహించిన వివరాల వల్ల ఆ ప్రదేశం నాకు సుపరిచితం అనిపించింది. నది పక్కనే అప్పటి యుద్ధ ఖైదీల క్యాంపు నడిచిన సువిశాల ప్రదేశం... ఆనాటి మినీ ట్రక్కులు... వంతెన ప్రాముఖ్యతనూ, నిర్మాణ వివరాలను చెప్పే శిలా ఫలకాలు... వంతెనను ప్రేమగా దాటుతోన్న దేశవిదేశ పర్యాటకులు... ప్రకృతి సంతోషించి కురిపించిన సన్నపాటి వర్షం...

❖

థాయ్‌లాండ్ యాత్రలో చిట్టచివరి రోజు- మే తొమ్మిది అచ్చంగా నాకోసమే అట్టే పెట్టుకొన్నాను. రైలు, బస్సు, కాలి నడకలతో బ్యాంకాక్ నగరాన్ని నాదైన బాణీలో తిరిగి తిరిగి చూడాలన్నది నా సంకల్పం.

మొదటి మజిలీ విక్టరీ మాన్యుమెంటు. 1941 నాటి థాయ్-ఫ్రాంకో యుద్ధంలో విజయ చిహ్నంగా నిర్మించిన కట్టడమది. అక్కడి స్కైవాక్ మీంచి మేల్కొంటోన్న నగరాన్ని చూడటం చక్కని అనుభవం.

దేశంలోకెల్లా ముఖ్యమైన టూరిస్టు ఆకర్షణ- గ్రాండ్ పాలెస్ చూడడానికి బస్సు ఎక్కాను. అచ్చమైన రాజమార్గాల గుండా ప్రయాణం. రెండ్రోజుల నాటి పట్టాభిషేక శోభ అణువణువునా కనిపించింది. ఒక్కసారిగా బాహుబలి కాలంలోకి వెళ్లినట్టని పించింది. కానీ 2019లోంచి 1819లోకో 1019లోకో వెళ్లినట్టుగా కాకుండా ఆ 1019నే 2019లోకి తీసుకు వచ్చినట్టు అనిపించింది!!

రాజసౌధపు ప్రవేశ రుసుము ఐదువందల బాథ్‌లు- సుమారు 1200 రూపాయలు. 'హమ్మో' అనిపించింది. 1782లో కట్టిన ప్రాంగణమట. కింగ్ రామ1 దీని రూపశిల్పి. రాజుగారి నివాసం, కార్యాలయాలు, దర్బారు హాలు, అతి ప్రసిద్ధ ఎమెరాల్డ్ బుద్ధ ఆలయం, ఓ మ్యూజియం. మందిరపు మంటపాల పొడవునా రామాయణ దృశ్యాల మ్యూరల్స్, మన అమరావతికి కాసిన్ని ఐడియాలు అందించగల వాస్తుశిల్ప రీతి- అపురూప అనుభవం.

❖



వారంరోజులు. థాయ్‌లాండ్ దేశాన్ని చూశానా? తెలుసు కొన్నానా? నా పరిజ్ఞాన పరంపరలో అప్పటిదాకా చిన్నపాటి చుక్కలా ఉన్న థాయ్‌లాండ్ ఇపుడు ప్రస్ఫుటమైన బిందువయిన మాట నిజం. కానీ ఎంత చెప్పినా నాది ఉపరితల పరామర్శే! తిరిగి వచ్చాక నన్ను వెంటాడే ప్రశ్నలు అసంఖ్యాకం!

-ప్రస్తుతం ఇంతగా అభివృద్ధి చెందిన దేశానికి చెప్పుకోదగ్గ ప్రాచీన చరిత్ర లేకపోవడం ఏమిటి?

-రాచరికం, సైనిక పాలన, ప్రజాస్వామ్యం, ఎన్నికలు; ఇవన్నీ ఏకకాలంలో ఎలా సాధ్యం?

-దేశమంతా బౌద్ధం నిండి ఉండగా రాజ పరంపర 'రామ' రాజులై ఉండటం ఎలా సాధ్యమయింది?


-పల్లెలూ, పట్నాలూ కూడా సుఖ సౌకర్యాలతో కళకళలాడే ఈ దేశపు సంపదామార్గాలేవిటి?

-దేశంలో కనిపించే మర్యాద, క్రమశిక్షణ, పౌరధర్మ నిర్వహణ- వీటి మూలాలు ఎక్కడున్నాయి?


-ఇన్ని సుగుణాల మధ్య మత్తుమందుల వ్యాపారం, సెక్స్ టూరిజం దేశంలో ఎందుకు ఉన్నాయి?

ఇవన్నీ తెలుసుకోడానికి వారం చాలదు. కనీసం నెల అవసరం. ఓ ఏడాదిపాటు ఇక్కడ గడపగలిగితే మరీ మంచిది! అప్పటిదాకా నావి శేషప్రశ్నలే!!





తెలుగు సాహిత్యంలో యాత్రాసాహిత్యాలను రాయడంలో ప్రత్యేక ముద్ర కనబరచిన దాసరి అమరేంద్ర కథకుడు, వ్యాసకర్త కూడా. నిరంతర పథికుడు. నాలుగు యాత్రాకథనాలు, ఒక కథాసంపుటి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి మరో కథాసంపుటి ప్రచురించారు. నివాసం న్యూఢిల్లీ. 2015 తానా సభల అతిథి.



హాస్యం

మనకి మంచి హాస్య నవల రాదేమి?

పన్నాల సుబ్రహ్మణ్య భట్టు

ఇంతకీ తెలుగులో హాస్యం ఎందుకు కరువయింది? మరీ ముఖ్యంగా నవలల విషయంలో. ఒకవేళ 'కన్యాశుల్కం' నాటకమే నవల అయ్యుంటే తెలుగు హాస్యనవలా వికాసానికి పునాది అయ్యేదా? ఆసక్తి కలిగించే చర్చ ఈ వ్యాసంలో...

సత్య మార్గాన నడవమని చెప్పేది హాస్యం.

ఈ వంకర దారిలో నడవడం పాఠకులకి నచ్చదు. సత్యం కిట్టుబాటు కాదు!

140 సంవత్సరాల క్రితమే ప్రహసనాలుగా వచ్చిన హాస్య సాహిత్యం మనది. అయినా మన రచయితలందరికీ శోషవచ్చి కాళ్లు బార చాపారు కాని ఒక్క సంపూర్ణ హాస్యనవలని రాయ లేకపోయారు. వంద సంవత్సరాల వయసు మీరిన ఒక ఆధునిక భాషా సాహిత్యానికి ఇంత తక్కువ పూలదోసిళ్లు రావలసిన కారణాలు శోధించాలి.

కాలికి జుబ్బా తొడుక్కుంటే సరిగా నడవలేరు. అక్కడో ఇక్కడో హాస్య పోకడల పొగాకుకాడ పట్టుకున్నంతలో హాస్యపు చుట్టను కాల్చలేం. అది పూర్తిగా పొగాకు ఆకుల పరిమళంతో పెరిగి ఉండాలి. ఈ యింప్యూర్ టుబాకోతో అంతర్జాతీయంగా మనకు అంతర్ దేశీయంగా కాదు, అంతర్ రాష్ట్రములలోనే ఎక్కడా పరి గణన లేకుండాపోయింది. విజయవాడలో పాతిక సంవత్సరాలుగా కామెడీ నాటకాలను పోషిస్తే, ప్రజలు చూసిన తరువాత 'ఈసారీ మూడు కంటె బాగుగా లేవులెండి, మిగిలినవన్నీ మరీ తక్కువ స్థాయి' అని పెదవి విరుస్తు న్నారు. ఒక పెద్దమనిషి హాస్యరచయితల సభ పెడ్డామనీ వారి హాస్యాన్ని చర్చించుకొంటే బాగుంటుందని సలహా ఇచ్చాడు. పేర్ల కోసం కూర్చొంటే 50 మంది తేలడం కష్టమయింది. ఇక వారి మీద చర్చించే ఉపన్యాసకుల సంఖ్య చూదామంటే పట్టుమని 10 మందిని చెప్పలేకపోయాను.

'వాడు తప్ప మీకెవరూ నచ్చరురా?' అంటారు కానీ హాస్య రచనకి గురజాడ ఒకడే నిఖార్సయిన బృహత్ ప్రయత్నం చేశారు. సంభావన కిట్టిన పండితులు అపూర్వ కావ్యమని, నాటకమనీ, కెలికి వేత అనీ అంటున్నారు. కాని నిజంగానే అది కొండమీద కొక్కి రాయి, కాలుజారిపడిపోదు. అంత శిఖరాయమైన కీర్తికి అర్హతగల నాటకం.

కాని నవల కాదు కదా! అదే నవల అవుతే ఆధునిక ఆంధ్ర సాహిత్యం కూడా అదిరిపోయేది. నవలా చక్రం మారేది. అందరూ చదివి వుండేవారు. ఇంతకీ తెలంగాణాలో కన్యాశుల్కం ప్రచారం పొందిందా?

ప్రశ్నించటం సాధువుల లక్షణం సమాధానం చెప్పటం మేధావుల బాధ్యత. గురజాడ ఉపన్యాసకులు ఈ ప్రశ్నకి సమా ధానం చెప్పాలి. గురజాడ తీసుకున్న కథావస్తువు, కన్యాశుల్కం లోనిది, హాస్య నవలకి పనికి వచ్చేదా? నాటకానికి పనికివచ్చేదా? తేల్చవలెను.

కన్యాశుల్కం వలన రచయితకి మనసు నిండింది. అంతు లేని కీర్తి వచ్చింది. విమర్శకులకు ఇప్పటికీ గొప్ప ఉపన్యాసం చెప్పిన ఆత్మతృప్తి కలుగుతునే ఉన్నది. కాని ఆందులో ఉన్న వస్తుసంపద- ముఖ్యంగా కథావస్తువు కాకుండా మిగిలినది చిల్లర నాటక విషయాల బాపతు. చదివితే అమాంబాపతు గొప్ప నాటకమే. చూస్తే ఇప్పటికీ ఆ ఆడ వేషమేమిటి? ఈ గిరీశం ఎవడు? హీరో కాదు. ఆ సౌజన్యారావు ఏబార్ ఎట్లా చదివాడు. ఆయనకి ఆ రైట్ వింగ్

లాంగ్ కోట్ ఎందుకూ? ఇన్ని తోస్తాయి. మన ఎమ్‌సెట్ పరీక్ష కోసం ఆస్తులు ఇప్పట్లో అమ్ముకునే వాడిని ఆనాడే ఇంగ్లీషు చదువుల పిచ్చికోసం డబ్బు తగలేసే వారిలా చూపి దూరదృష్టిగల వాడైనాడు గురజాడ. కన్యాశుల్కం నాటకంగా కాకుండా హాస్య నవలకి బాగా ఇమిడే కథావస్తువు. అది గొప్ప హాస్య నవలే అయ్యేది. నవలయితే హాస్య సన్నివేశానికి తూగే పొడి పొడి మాటలలో పాత్ర నైజమనే బందోబస్తులో సంభాషణలు రాయనక్కరలేకపోయేది. గురజాడ అనేక సామాజికమైన అంశాలపై రచయిత దృష్టినీ, పాత్రల అంతర్‌దృష్టినీ బాగా తరచి చూపించి ఉండేవాడు. పిల్ల కోసం ఆ డ్రామాలు చేయడం కాని, ఆ వ్యక్తుల మిత్రుల సంధానతగానీ సాంఘిక వాతావరణం కానీ అద్భుతంగా నవల అయితేనే తేటతెల్లమయ్యేవి. నాటకం కావడంతో గురజాడ అభిప్రాయాలూ, ఆనాటి సాంఘిక కట్టుబాట్ల మీద జీవితాల మీద పాత్రలుగా రాని వారి అభిప్రాయాలు తెలిపినవి కొద్దిపాటి. నాటక కల్పనా క్రమ శిక్షణలో, నడిపించే నాటకీయ రక్తి పాలనాపరిధిలో చిక్కుకొని గురజాడ కథనీ పాత్రలనీ సరిగా పెరగనీయలేదు. పూర్తిగా విజృంభించిన పాత్రలతో గురజాడ గొప్ప నవలను సృష్టించే అవకాశాన్ని కాదని కాలదన్ని, గొప్ప నాటకాన్ని రాసుకున్నాడు. ఆయనకు రావలసిన పేరు ఆయనకి వచ్చింది. తరువాతి కాలంలో గొప్ప విమర్శకులు ఒక పరిశ్రమనే స్థాపించారు. కాని వస్తువును ఆఘ్రాణించిన చూసిన, పరికించిన, లౌకిక సామాన్య ప్రజలే లేరు. కరువయ్యారు. అప్పటికీ ఇప్పటికీ చదవని నాటకంపై చర్చలు వినేది ఈ ఒక్క నాటకంపైనే. ఉత్పత్తిగా దానికి పెద్దపేరు వచ్చింది. చూడని మైలు రాయిగా నిలిచింది. అదీ విషాదం.

ఈనాటికీ విమర్శకులు గమనించని విషయం ఏమిటి? సగం మంది ప్రజల, స్త్రీల దృష్టిని- ఆయన కాలంలోనూ, ఈ కాలంలోనూ ఈ గొప్ప నాటకం ఆకర్షించలేదు. స్త్రీలకి స్త్రీవాదులకి అతి ప్రియమైన విషయాలు ముచ్చటించిన ఒక గొప్ప నాటకం, ఆడవారే చదవని స్థితిలో వంద సంవత్సరాలూ ఉండిపోయింది. ఇప్పటికీ వీరిచేత గురజాడగారి కాలంలోని స్త్రీల రాజకీయాలు కానీ స్త్రీవాద విషయాలు కాని చర్చింపబడవు. కర్మవశాత్తూ మధురవాణిని మాత్రం ప్రస్తావిస్తారు. ఆవిడో బెంగుళూరు నాగరత్నమ్మ అని భ్రమపడ్తారు. గిరీశంలాటి పేట న్యూసెన్స్ మనుష్యులని ఎదుర్కొన్న నాయికగా చిత్రిస్తారు. ఆవిడ గూఢచారిణా? మధురవాణి కోరిన స్వాతంత్ర్యమేమిటి? సౌజన్యారావు, గిరీశం మధురవాణి ఉన్న దృశ్యంలో ముగింపు సమయంలో డామిట్ అడ్డం తిరిగిందిలోనే ఒక మంచి హాస్య సృజనలోకమే ఆవిర్భవించి ఉండేది ఇది నవల అయితే. సమస్త స్త్రీవాద రచయితల లోకాన్ని వంద సంవత్సరాలకు ముందే హెచ్చరిస్తూ పిలపునిచ్చేది. 'డామిట్ కథ' అడ్డం తిరిగింది ఒక ముగింపు కాదు, ఒక హెచ్చరిక, ఒక కొనసాగింపు. 'మగవాడిలోని ఈ బీట్ రౌడీ లక్షణాలు కొనసాగుతాయి. ఇప్పటికీ సర్లే, మరొకసారి, ఇంకోచోట, ప్రయత్నిద్దాం' అనే అర్థాన్నిచ్చే ఆ వాక్యం బీట్‌రౌడీల సంస్కృతిని హెచ్చరించే పిలుపు అయ్యేది. 'దారి తప్పిన ఆడవారిని వారి అదృష్టాన్ని పరీక్షించడానికి ఇలాటి చలంలు ఉద్భవిస్తూ ఉంటారు'. వారిని నమ్మకండి, సమాజం దగ్గిరే ఈ ఆడ సమస్యకి పరిష్కారం లేదని' గురజాడ సూచించాడు. ఈ సూచనల విరాట్ స్వరూపంగా ఆఖరి దృశ్యం ఎంతగా వికాసం చెందాలో అంతగా పుష్పించకుండా నాటక ప్రక్రియే గురజాడకు అవరోధమయింది. ఇంత విపుల అర్థం సమీకరించుకొన్న విషయం చిన్న గుర్తుంచుకొనవలసిన తేలిక వాక్యంగా నాటకంలో భ్రష్టమయింది.

హాస్య నవల అయి వుంటే దానిని చదివిన స్త్రీ పాఠకులు, రచయిత్రులుగా మారితే మారి ఉంటే ఈ దేశంలో స్త్రీవాద సూర్యుడు ఎన్నో దశాబ్దాల ముందుగా ఉదయించేవాడు. నవలను ఎంతోమంది పురుషులూ పూర్తిగా చదివి ఆనందించేవారు. కొత్త ప్రమాణాలతో నవలలూ వచ్చి ఉండేవి. నవలగా కన్యాశుల్కం ఆదర్శమయ్యేది. కన్యాశుల్కం నవలగా వచ్చి వుంటే దాని రూపు, వ్యక్తీకరణ వేరుగా ఉండేవి.

అప్పటికాలంలో ప్లీడరీ చదవాలనే కాంక్ష గలవారూ, కోర్టులు, వ్యాజ్యాల పిచ్చిగల ప్రజలున్నారు. వీరిపై కన్యాశుల్కంలో పాత్రల మధ్య చర్చ వచ్చింది. వాటిలో కొన్ని 'మెటామీనింగ్స్' అంతర్ అర్థాలున్నాయి. ఇది పాత్రల ద్వారా వచ్చిన మాటలు. ఇవి నాటకంలో కాకుండా, హాస్య నవలలో అవుతే- ప్రీవీ కౌన్సిల్‌దాకా వెళ్లి వచ్చిన వారి వ్యక్తిత్వాలు పరువునష్టం దావాల్లో గూడార్థాలు, ఇంగ్లీషు భాషా వ్యామోహం, ఉపన్యాసాల ఉద్ఘోషల మీద అభిమానం వంటివి బాగా విచ్చుకొనే అవకాశం పొందేవి. మరికొన్ని ఉపగ్రహ పాత్రల సృజనకు దారితీసేది. గురజాడ నాటకంలో పెట్టుకొన్న అతి స్వల్ప దృశ్యాల ధ్వని హాస్యనవలలో గాఢంగా, స్ఫుటంగా వినిపించేది. కన్యాశుల్కం హాస్యనాటకం కావటం వల్ల రైలుపట్టాల మీద బండిలాగా కొన్ని ధర్మాలతో నడవవలసి వచ్చింది. అది హాస్యనవల అయి వుంటే గాలిబుడగల హరివిల్లులా నృత్యహేలను చూసేవారం. ఇన్ని ప్రచురణలు వేసినా ఇరవై వేలకు మించి ప్రచురించి ఉండరు. ఇటీవల ఈ పూర్తి నాటకాన్ని ఓపిక చేసుకొని చూసిన వారిని కలుపుకున్నా, పూర్తినిడివి నాటకం చసినవారి సంఖ్య అన్ని ఊళ్లలో కలిసి ఇప్పటికి 40వేల ప్రేక్షకులకు మించదు. హాస్య నవలలో అయితే గిరీశం ఇంకా ఎంత ఎత్తుకు దిగిపోయేవాడో? ఎంత శిఖరాయమానంగా తెలుగు సాహిత్యంలో మిగిలిపోయే వాడో? గురజాడ వారు స్వాతంత్రో ద్యమం మీద కొద్దిపాటి విసురు లయినా హాస్య నవలలో చొప్పించ గలిగేవారు. ఆయన ఉద్యోగం, మనోరీతితో పాటు, నాటక ప్రక్రియ అందుకు 'ఒల్లనీయలేదు' తెలుగులో గిరీశం ఒక 'అధీర నెపోలియన్' పాత్ర కాగల అవకాశం పోయింది.


కన్యాశుల్కం కంటె గొప్ప కథావస్తువును తరువాతి తరం వారు తమ హాస్య నవలకు ఎందుకు ఎంచుకొనలేకపోయారు?

ఒకటి రెండు దశాబ్దాల తరువాత డబ్బుకి ఎంతకైనా దిగజారే కుటుంబం గురించి అమెరికన్ నవలలు వచ్చాయి. మరొక దేశంలో చిత్రమైన హాస్య నవలలు వెలువడినాయి. ఈ దేశంలో ఎందుకు రాలేదు? అని నిలదీయడం న్యాయంకాదు. మానవ హృదయ సంబంధాలబట్టి అల్లబడిన రెండు దేశాల సాహిత్యాల నుండి కొన్ని వివరణలూ పోలికలు వస్తాయి. చిత్రమే మిటంటే మానవత్వం లేని

సంబంధాలు శాసించిన పరిస్థితులలో కూడా ఇరు దేశాల సాహిత్యం నుండి కొన్ని పోలికలు కనబడ్తాయి. అక్కడా, ఇక్కడా నిర్దయగా ప్రజలు నియంతల వంటి నాయకుల చేత కష్టాల కొలిమిలోకి ఎలా తోయబడతారో తెలుస్తుంది. హాస్య సాహిత్యం కూడా ఈ అరాచకాల కొలిమిలో చిందులు తొక్కుతూ సత్యాన్ని చిలుకుతుంది. తన వంతు సాహిత్యసేవ చేస్తుంది.

హాస్య నవలా రచనను చదవటం, కథను చదవటం కంటె భిన్నమైనది. అమానవీయ పాత్రలుంటే వారి బలహీనతలపైన పాఠకులకు ప్రేమ తక్కువగా వుంటుంది. వారి మనసులోకి ఆ పాత్రలు ఎక్కవు. కన్యాశుల్కం తర్వాత 3 దశాబ్దాలకు 1941 నాటికి అమెరికాలో ఫాక్‌నర్ అనే నవలా రచయిత పరమ పిసినారులు అయిన అయిదుగురు స్నూప్స్ సోదరుల నవల రాశాడు.

ఇటువంటివి మన గ్రామీణ పాత్రలు మనకు 1900 నుండి 1930 దశకాలలో ఉన్నా హాస్య నవలలు రాకపోవటం వలన మన గ్రామీణ వ్యాపార రాజకీయాలు, పశువుల సంతలలో మోసాలు, ద్రవ్యోల్బణానికి దారి తీసిన సంఘటనలు, దాని వెనుక జమీందారీ వ్యవస్థలో దగాకోరులు తెలిసి రాలేదు. ప్రజల వెతలను బాగా చెప్పేది సాధారణ సాహిత్యమే కాదు, హాస్య సాహిత్యం కూడా అని చాటకుండా మన సాహిత్యవిమర్శ వచ్చింది. కాని జీవన క్రమంలో పాఠకుడు నిత్యం ఆనందించేది హాస్య రచనలనే. వినోదం పొందేది హాస్య రచనల వల్లనే. వీటితో బాటు కాస్త ఆశ కూడా ఈ సాహిత్యమే అందిస్తోంది. ఇంటి నుంచి పారిపోయిన వాడి జ్ఞాపకాలు రాయగలగాలి కానీ బ్రహ్మాండంగా ఉంటాయి.



హాస్యం అంటే అధీర నాయకుల దీన లేదా విజయగాథ. తెలుగు సాహిత్యంలో ఈ భీరువులు నాయకులుగా నవలలు రాసిన రచయితలున్నారు. కాని, 'ఒక మంచి పెళ్లి కూతురు కోసం వెతుకులాట' రాసిన రచయితా లేడు. 'బుద్ధిమంతుడి కోసం ఇంకా చూస్తూనే ఉన్నా' అని రాసిన రచయిత్రీ లేదు. ఇలాటివి రాయగల్గిన బుచ్చిబాబు, పాలగుమ్మి, గోపీచంద్, కొడవటిగంటి వేరే అధీర నాయకులపై తమ ప్రయత్నాలు సాగించి వారిపై ఆశపెట్టుకొన్న మన హాస్య సాహిత్యాన్ని నిరుత్సాహపరిచారు. వారికి ఇతర భాషా సాహిత్యాలలో కనీసం అమెరికన్ సాహిత్యంలో వచ్చిన హాస్య రస సాహిత్య వైఖరులు తెలియనివి అనుకొనలేము.

మన తెలుగు హాస్యనావ తొలి ప్రయాణాలు నిజంగా గర్వించదగినవిగా ఉన్నవా? పానుగంటి వారి ఉపన్యాస చక్రాలు తరువాత బారిష్టర్ పార్వతీశం నవలకు గెంతవలసి వస్తోంది. హాస్యానికి నాయక లక్షణాలు భావైక్యాలు సమకాలీన కత్తిసాములు ఏమిటి? భావ గాంభీర్యం వెనుక హాస్య నాయకుడు పరిగెత్తితే, జడ్జీగారు కామెడీ చేసినట్లుంటుంది. చదువుకై ప్రయాణంతో మొదలెట్టి మొక్కపాటి వారు తన బారిష్టర్ పార్వతీశం నవలతో అడవి బాపిరాజుగారితో పోటీపడదామనుకున్నారు. అంతకు ముందు వచ్చిన గణపతిని హాస్యనవలగా ఎందుకు చెప్పుకొన కూడదో ఏకంగా సభ పెట్టాలి. చదువుకొనకపోతే భ్రష్టుడవు అవుతావు అని చెప్పే హెచ్చరిక పతాక అది. రేడియోలో ప్రసార మయి ఒక నటుడికి పేరు తెచ్చింది తప్ప అది చేసిన హాస్య నిర్వాకం ఏమీలేదు. చాలాకాలానికి ఒక వారపత్రికలో చలపతీ జిందాబాద్ అని సమకాలీనమైన, వలంటరీ నాయకుల అసహన రాజకీయ తంత్రాలపై నవల వచ్చింది కానీ దానిలో హాస్య ఇంధనం తక్కువ. ముందు మంచిశక్తిగల పాత్రగా తోచింది. నెమ్మదిగా జారిపోయింది. ఎవరూ - పాఠకులు విమర్శకులు పట్టించుకోలేదు.

సంపాదకుడు అసలు హాస్య కథకుడి పాత్రను అర్థం చేసు కొనడంలోనే ఈ చిక్కులు ఏర్పడ్డాయి. అందువల్ల గొప్ప గొప్ప హాస్య వస్తువులు పెద్ద పత్రికల్లో రాలేదు. చిన్న చిన్న పత్రికల్లో ఏళ్ల తరబడి వచ్చి అనామకంగా బూడిదయిపోయాయి. పైగా పత్రికల్లో ఉద్యోగులుగా పనిచేసేవాళ్లే హాస్యకాలమ్- పలికినా పలకకపోయినా- ప్రతివారం రాస్తామంటారు. అలా సమకాలీన రాజకీయాల మీద విసుర్లకి కాలమ్ వేదిక అయింది, తప్ప రావూరు భరద్వాజగారి కాలమ్‌ల వలె పసందుగా నడవలేదు.

నిర్మాణంలోనే కథకీ, హాస్యకాలమ్‌కీ తేడాలున్నాయి. కథ కదిలించాలి. హాస్యం నడిపించాలి. కథకి ప్లాటు కలిసి రావాలి, హాస్యం వస్తువు కల్పించిన గదుల్లో తిరగాడాలి. అది కరుణ, విచిత్రాల వైపు నడుస్తుంది. ఈ హాస్యం మంచివైపు, నీతివైపు 'మానుకోరా బాబూ ఈ అలవాట్లు, నాశనమైపోతావు' అంటూ వాపోతుంది. పాఠకుడు కథ చదివి కితాబులిస్తాడు రచయితకి. హాస్యం చదివి 'ఇంకా రాయాలి, తగలేసాడు- ఫలానా వాడంటే వీడికి కడుపుమంట' అంటూ శాపనార్థాలు, నవ్వుతూనే పెడతాడు. కథని చదివి రుమాలుతో కనులు తుడుచుకొనడానికి సిద్ధమయిన శ్రోత, హాస్యం చదివి క్షణంలో విసుగ్గా పేజీ త్రిప్పేస్తాడు. కథకి ఇచ్చిన ప్రశాంత చిత్తాన్ని పాఠకుడు హాస్యానికి విదిలించడు. ఏమిటి చెప్పాడు అన్నట్లు ఒకసారి పైపైన చూసి వదిలేస్తాడు. ఇంక పండితులలో తల ఆడించేవారేలేరు. వందేళ్ల క్రితం ఆ గౌరవం పానుగంటి వారికి దక్కింది కాని నీ హాస్యంలో ఆ ఉపన్యాసాలేమి టిరా? అని ఇప్పుడు జాగ్రత్తలు చెప్తారు. ఇక బంధువులైన పాఠకులు కథకి బహుమతి వస్తే ఉత్సవంలా అభినందిస్తారు. అదే హాస్యకథకి బహుమతి వస్తే ఈసారి ఎవడ్ని బాదేవ్, ఎవడి మీద పడ్డావ్ అంటూ పలకరిస్తారు.

కథకి ప్రథమ బహుమతి లభిస్తే, 'మావాడు జాక్‌పాట్ కొట్టాడు. టెస్టుట్యూబ్ బేబీ మీద రాశాడు' అని వివరాలు అందిస్తారు. అదే కామెడీ కథలో వస్తే బహుమతి ఈసారి పోటీకి

ఎన్ని వచ్చాయిరా? అని లెక్కలు నొక్కుతారు. తలెత్తుకొని తిరగవలసిన మైనర్‌జాతి పక్షులుగా, అంతరించిపోతున్న మృగ సంతతిలాగా చూసుకోవలసిన హాస్య రచయితలని మిత్రులు, బంధుగణం అవాంఛిత మొటిమలను చూసినట్లు చూస్తున్నారు. మావాడు కథ రాశాడు అని ఆనందంగా తిరిగే తండ్రి ఒకవైపు, ఈసారి ఎవర్ని తిట్టావురా అని విచారించే తండ్రి మరోవైపు- హాస్య రచయితల పాలిట తలతీసే తలారులు. ఈలోగా 'మా ఫ్రెండ్ ఫాదర్ సైకిల్ మీద రాసాడు నాన్నా' అంటూ రచయిత చెల్లి వైకి వస్తుంది. దానితో హాస్య రచయిత పూర్తిగా పల్టీ కొడతాడు. అదే కవిత్వం రాసే కుమారుడయితే ముచ్చట- కూతురు కవయిత్రి అయితే పుస్తకాల సూడిద, భార్య కవయిత్రి అయితే పట్టుచీర, తమ్ముడికి అకాడెమీ బహుమతి ప్రకటన పేపర్లో వస్తే మందు పార్టీ. అంతగా హాస్య రచయిత మీద వివక్ష పేరుకుపోయింది. ఇక పాలకుల సంగతి చెప్పనక్కర్లేదు. ప్రిన్స్‌పాలకుడైనా, మునిసిపాలకుడైనా, కార్టూన్ పక్షిమీదా, రాసే జంతువులాటి వాడిమీద ఒక దెబ్బ కొట్టాలని పగతో ఉంటారు. 'మీ దాడికి మేమెక్కడ ఆగగలమండి బాబూ!' అంటూ వ్యంగ్య రచయితనీ, వ్యంగ్య చిత్రకారుడినీ పరిహాసంగా పలకరిస్తారు. సమయం వచ్చినపుడు మాత్రం ఈ పెద్దలు పగతీర్చుకుంటారు. దేశంలో చట్టాలే వ్యంగ్య వ్యూహాలకి ఎదురుగా నించున్నాయి. జడ్జీగారి మీదా వ్యంగ్యాస్త్రాలకు అవకాశమే లేదు. ఒక అబ్రహాం అదృష్టవశాత్తూ అధ్యక్షుడిమీదే కార్టూన్ వేసి పేరు తెచ్చుకున్నవాడు. రాష్ట్రాలవ్యాప్తంగా రాజకీయ పాలకుల మీద బొమ్మలు గీసి భయం జైలులో ఇరుక్కున్న వాళ్లే ఎక్కువ. ఇలా ఇంతమంది చూపే విరోధంతో హాస్య రచయిత బ్రతకవలసి వస్తున్నపుడు ప్రక్రియా పరంగా కూడా పెరగడం కష్టమే. గౌరవకరమైన వేదికని కవులవలె- సిద్ధం చేసుకొనటం హాస్య రచయితలకు కష్టమే. నవల రాయడమూ కష్టమే.

ఇలాంటి బయటి కష్టాలతో బాటు అంతరీయ చిక్కుల్లో కూడా మన హాస్య సంజీవకులు ఇరుక్కున్నారు. తన పాత్ర ఏమిటో హాస్య రచయితకు అర్థంకావటం లేదు. నిరసన ప్రకటనని కవిలాగ చేసి, 10 లైన్లు రాసి బైటకు నిష్క్రమించలేడు. చొక్కా అంతా కష్టపడి కుట్టాలి. దానికి చేతులు, కాళ్లు వ్రేలాడకూడదు. కరెక్టు లెక్కల్లో కుదర్చాలి. రాసే లైన్లు అనే కుట్లు బాగుండాలి. అక్క డక్కడ బొత్తాంలాటి పాత్రలతో షోకులు చేయాలి. కూర్చునే కిస్తీ అంటారే- సీటింగ్ ఏర్పాటు విశాలంగా ఇబ్బంది పెట్టకుండా కుట్టి నప్పించాలి. అప్పుడే పాఠకులు ఈ హాస్య రచయిత అనే టైలర్‌ని గౌరవిస్తారు. దర్జాగా చూస్తారు. ఇన్ని యోగ్యతలతో ఈ ఉద్యో గంలో చేరటం ఎందుకని మంచి లైన్లు అల్లే రచించే మగ రచయితలు దూరమై పోతున్నారు. ఈ చేతులులేని జాకెట్లు కుట్టడం మనకెందుకని రచయిత్రులు దూరంగా ఉన్నారు. పోనీ అల్లికపరంగా చూదా మన్నా హాస్య నవలలో అనేక సంధియంత్రాలున్నాయి. సూదులు దిగవు. రకరకాల కుటుంబాల మీద రాయాలంటే వస్తువును బట్టి పాత్రలా, పాత్రలను బట్టి వస్తువా? అని రచయిత తేల్చుకోవాలి. వారిని ఆ ఊరికే పరిమితం చేయాలా? హాస్య నవల కదా అని వివిధ నగరాలకి త్రిప్పాలా? తేల్చుకోవాలి. ఇలా అంతర్గత ఏర్పాట్లు - ఇంటీరియర్ డెకొరేషన్ పనివాళ్లకి పెట్టాల్సిన మేనరిజాలూ, భాషించవలసిన స్నానరిజాలు - ఇన్ని చూసుకోవాలి. అందుకే ఇది ఏ రచయితకయినా ప్రోత్సాహమిచ్చే ప్రక్రియగా తెలుగులో వృద్ధి చెందలేదు. అరుదుగా దొరికే ధాతువు హాస్యం. పాఠకులున్నారని తెలిసినా, పత్రికలకి సంకోచం. తీరా హాస్యనవల మొదలెడ్తే పాఠకులు 10 వారాలు జారిపోతారేమోనని భయం.

దశాబ్దానికి తెలుగుదేశంలో రెండు, రెండు గొప్ప సంఘ టనలు ఉద్యమంలాగా జరుగుతూనే వుంటాయి. స్వరాజ్యోద్యమం - యువత జేరిపోయింది. వామపక్ష ఉద్యమం మరో రెండు తరాలు సాగిపోయింది. ఈలోగా బీమా ఉద్యోగాలు కాంట్రాక్టు కుటుం బాలు, కమీషన్ వ్యాపారాలు, కబ్జా కుటుంబాలు, జెండాల వీరులు, కాఫీ ఇడ్లీ వ్యాపారాలు, సంగీత పాఠాలు, రెవెన్యూ ఉద్యోగాలు, తర్వాత టీచర్ ఉద్యోగాలు, బ్యాంకు ఉద్యోగాలు, ఫ్యాక్టరీ ఉ ద్యోగాలు, ఇప్పుడు కంప్యూటర్ ఉద్యోగాలు - ఇలా హాస్య బంగారం కలసిన మట్టిలేదని కాదు. తవ్వే నాథులే కరువయ్యారు. రాజకీయా ల్లోకి సినిమావారు ప్రవేశించిన ఈ నలభై సంవత్సరాలలోనే గొప్ప హాస్య రచనలకి నవలలకీ వేదిక లభించింది. కుటుంబాలలో పెళ్లిళ్లు, వేరు కాపురాలు, విచిత్ర విడాకులు కార్పొరేట్ చదువులు, నిరుద్యోగులు అన్నీ నవలా వస్తువులే. రాసేవాడే లేడు.

హాస్య రచనకు రాళ్లెత్తిన కూలీలు లేరేమి అన్న వ్యాసపూర్వక సమాధానం వ్రాయవచ్చు. అలాగే హాస్య నవలా రచనలు లేవేమి అన్న అయిదు లైన్ల సమాధానం రావాల్సి ఉంది. బయట ఎంత నోరు పారేసుకున్నా- ఇంట్లోంచి ఇల్లాలు ప్రతిస్పందిస్తేనే కాని అడిగేవాడి జోలి నిండదు- సమాధానం దొరకదు. అందుకే నాలుగు కోరికలు :

1. కామెడీ కథల పోటీలు విరివిగా పత్రికలు జరపాలమ్మా!
2. మినీ హాస్య నవలల పోటీలు జరుపాలమ్మా!
3. పెరిగిపోతున్న స్త్రీ వాద రచయిత్రులకు విపుల వేదికగా స్త్రీల హాస్య నవలల పోటీని ప్రత్యేకంగా పెట్టండి తల్లీ!
4. కామెడీ కథలను వృద్ధిపరచిన ఒక వారపత్రిక, తానా అమెరికా సంస్థ ప్రత్యేక హాస్య నవలల పోటీ వేరువేరుగా ప్రకటించాలి బాబూ!

చివరగా ఒక కొంటె ప్రశ్న: ప్రతి రెండేళ్లకి నవలాపోటీలు నిర్వహించే తానావారు హాస్య నవలల పోటీలను ఒక్కసారైనా ఎందుకు పెట్టలేదు?



సంగీత, సాహిత్యరంగాలలో అపరిమితమైన అనుభవం, అభినివేశం ఉన్న పన్నాల సుబ్రహ్మణ్య భట్టు చాలాకాలం ఆకాశవాణిలో ఉద్యోగం చేసి పదవీ విరమణానంతరం విజయవాడలో నివాసం ఉంటున్నారు.



సినిమా కబుర్లు

మాయాబజార్‌కి హంగులు అద్దిన
సినిమాటోగ్రాఫిక్ సోల్జర్

డా॥ రెంటాల జయదేవ

అన్ని భాష ల్లోనూ కలిపి ఆయన ఛాయాగ్రహణం అందించింది నలభై నుంచి యాభై సినిమాల లోపే! అయితేనేం, వాటిలో అత్యధిక భాగం ఆయన కెమేరా కంటితో కళా ఖండాలయ్యాయి. మనకి అంతగా తెలియని ఆ ఆ కళాఖండాల సృష్టికర్త గురించి...

సాంకేతికత విస్తరించిన ఈ డిజిటల్ యుగంలో, కళ్లు చెదిరిపోయే రంగులు నిండిన వెండితెర కాలంలో సినిమాటోగ్రఫీ ఒక డిస్కషన్ పాయింట్ అవడంలో ఆశ్చర్యం లేదు. కానీ, బ్లాక్ అండ్ వైట్ సినిమాల రోజుల్లోనే ఒక సినిమాటోగ్రాఫర్ గురించి, అందులోనూ ప్రత్యేకమైన అతని పనితనం గురించి జనం చెప్పుకోవడమంటే ఆశ్చర్యం. అలాంటిది. సాంకేతికత అభివృద్ధి చెందని రోజుల నాటి ఆ వ్యక్తి గురించి, ఆయన తెరపై చేసిన పునఃసృష్టి గురించి ఇవాళ్టికీ సినిమాజనం పదేపదే ముచ్చటించుకుంటున్నారూ అంటే... అది నిజంగా వింత, విడ్డూరమే. తెలుగు సినిమాకు దక్కిన అలాంటి సినిమాటోగ్రఫీ ఆణిముత్యం... మార్కస్ బార్ట్లే.

దక్షిణ భారతీయ సినీ రంగం పైన, అందులోనూ తెలుగు సినిమాపై ప్రత్యేక ముద్ర వేసిన తొలి తరం ఛాయాగ్రాహకులంటే... ముందు వరుసలో ఉండే పేరు మార్కస్ బార్ట్లే. వర్ధమాన నటుడు మొదలు పేరున్న హీరో దాకా ఎవరైనా, ఎంత కొమ్ములు తిరిగిన దర్శక, నిర్మాత అయినా... పనిలో బార్ట్లే తదేక దీక్ష, ఏకాగ్రతలకు లొంగిపోవాల్సిందే. ఆయన 'యోగి వేమన' లాంటి హిస్టారికల్ బయోపిక్స్ చేశారు. 'గుణసుందరి కథ', 'పాతాళభైరవి' లాంటి సూపర్‌హిట్ జానపదాలు తీశారు. 'మాయాబజార్' లాంటి మన పౌరాణికాలను దృశ్యకావ్యాలుగా మలిచారు. 'మిస్సమ్మ', 'గుండమ్మ కథ' లాంటి సాంఘికాలను వెండితెరపై సార్వకాలీన సినిమాలను చేశారు. ఇలా అన్ని రకాల కోవల చిత్రాల్లోనూ కెమెరాతో విశ్వరూపం చూపారు. తన పనితనాన్ని మరెవ్వరితోనూ పోల్చలేని పరిస్థితిని తెచ్చారు.

మామూలు డబ్బా కెమేరాతో ఫోటోలు తీసే ఓ చిన్న పిల్లాడు... సినిమా కెమేరాలోకి ఫిల్మ్ రోల్ ఎలా ఎక్కించాలో కూడా తెలీని ఓ కుర్రాడు... స్టిల్ ఫోటోలు, న్యూస్ రీలు తీయడం తన సౌందర్యాన్వేషణకు సరిపడవని భావించిన ఓ యువకుడు... చివరకు సినిమాటోగ్రఫీలో ప్రయోగాల దిట్టగా ఎలా మారాడన్నది ఓ ఆసక్తికరమైన కథ. ఓ సినిమా కథలో ఉన్నన్ని మలుపులు, కుదుపులు సినిమాటోగ్రఫీ లెజండ్ మార్కస్ బార్ట్లే జీవితంలోనూ ఉన్నాయి.

డాక్టర్ల కుటుంబం నుంచి...

ప్రచారానికి దూరంగా పనిలోనే బతికేసిన బార్ట్లే వ్యక్తిగత జీవితం గురించి ఇప్పటి వరకు చాలా కొద్దిగానే వెలుగులోకి వచ్చింది. అదీ అరకొరగా! మార్కస్ బార్ట్లే కుటుంబ సభ్యులు, సమకాలికుల మొదలు చరిత్రకారుల దాకా వివిధ వర్గాల నుంచి సేకరించిన సమాచారం, బార్ట్లే స్వయంగా చెప్పిన మాటల ఆధారంగా ఈ వ్యాసం.


తమిళనాడులోని సేలం దగ్గరలోని ఏర్కాడు ప్రాంతానికి చెందిన పేరున్న ఆంగ్లో ఇండియన్ డాక్టర్ల కుటుంబం బార్ట్లేది. 1917 ఏప్రిల్ 22న జన్మించిన మార్కస్ బార్ట్లే కూడా వైద్యవృత్తి లోకి వస్తారని అందరూ అనుకున్నారు. మరి ఆయన ఫిల్ములు, కెమేరాల వైపు ఎలా వచ్చారు? దాని వెనుక ఓ కథ ఉంది. మార్కస్ బార్ట్లే నాన్న డెంటిస్ట్. వృత్తిలో భాగంగా ఆయన అనివార్యంగా ఎక్స్ రేలు తీయించాల్సి వచ్చేది. ఆ ఎక్స్ రే ఫిల్ములను ఆయన డిపార్ట్మెంటే స్వయంగా కడిగి, డెవలప్ చేసేది.

"అది చూసి నాకూ ఆసక్తి కలిగింది. చిన్నప్పుడు నేను కూడా స్వయంగా అందులో కొంత పని చేసేవాణ్ణి. ఫిల్ములు డెవలప్ చేయడం కాకుండా, మనమే సొంతంగా బొమ్మలు తీయవచ్చు కదా అనే ఆలోచన వచ్చింది. మొదటిసారి బ్రౌనీ కెమేరాను పట్టుకొని, దాంతో ఫోటోలు తీస్తూ, ఫిల్మ్‌రోల్ డెవలప్ చేయించి, ఫలితాలు వస్తున్నప్పుడు, అవి చూసుకున్నప్పుడు చెప్పలేనంత థ్రిల్‌కు గురయ్యా. అప్పటినుంచి నేను కెమేరాకు అతుక్కుపోయా. నేను తీసిన ఫోటోల తాలూకు ప్రింట్లు తీయడం మొదలుపెట్టా. ఇక, అలా అలా అర్థవంతమైన ఫోటోలు తీయాలనే కోరిక పుట్టింది. ఏనాటికైనా సినిమాటోగ్రాఫర్ కావాలని అప్పుడే నిశ్చయించుకున్నా" అని బార్ట్లే స్వయంగా చెప్పుకొన్నారు.

ఇది జరిగింది 1931లో. అప్పటికి మార్కస్ బార్ట్లేకు పట్టుమని పదమూడేళ్లే. మద్రాసులో చదువుకొంటున్నారు. వెండి తెరపై మూకీలను అధిగమించి, కొత్తగా టాకీలు వస్తున్న రోజులవి. వాటి ప్రభావం ప్రజల మీద కూడా బలంగా ఉంది. ముఖ్యంగా సంగీత చిత్రాలు, వాటిలోని చిత్రవిచిత్ర దృశ్యాలు, కనువిందైన సీన్ల ఆకర్షణకు బార్ట్లే కూడా లోనయ్యారు.

ఫోటోగ్రాఫర్‌గా... 36కు 36!

అలా మొత్తానికి 1934లో మార్కస్ బార్ట్లే తన స్కూలు చదువుకు స్వస్తి చెప్పి, మెయిల్ ఆర్ట్ ఎడిటర్ జాన్ విల్సన్ సహాయంతో బొంబాయిలోని ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో ప్రెస్ ఫోటోగ్రాఫర్‌గా చేరారు. అక్కడ స్టాన్సీ జెప్సన్ అనే బాస్ కింద, నెలకు 70 రూపాయలకు పనిచేస్తుండేవారు. సర్వసాధారణంగా ప్రెస్ ఫోటోగ్రాఫర్ అంటే, ఏదైనా జరుగుతుంటే గబగబా ఫోటోలు తీసేయాల్సి ఉంటుంది. ఫిల్ము రోల్‌కి 36 ఫోటోలు ఉంటే, అందులో మహా అయితే నాలుగైదు మంచి ఫోటోలు వస్తే అదృష్టమే. కానీ, బార్ట్లే అప్పట్లో ఫోటోలు తీస్తే దాదాపుగా ప్రతి సారీ 36కు 36 మంచి ఫోటోలు వచ్చేవట. అప్పట్లో ఆయన సన్నిహితులైన శాంతీలాల్ షా ఆ సంగతి చెప్పేవారు.



సౌందర్యానికి తావు లేని ప్రెస్ ఫోటోగ్రఫీ మీద బార్ట్లేకు ఏ విధమైన మమకారం లేదు. దాంతో, తరువాత కాలంలో ఆయన బొంబాయి నుంచి దక్షిణాదికి తిరిగొచ్చేశారు. సినిమాల్లో పనిచేయడం మొదలుపెట్టారు. అలా జర్నలిజమ్ రంగం ఓ మంచి ఫోటో జర్నలిస్టును నష్టపోతే, సినిమారంగం ఓ మంచి సినిమాటోగ్రాఫర్‌ను అందిపుచ్చుకొని లాభపడింది.


అప్పట్లో 'బాంబే టాకీస్' సంస్థ సుప్రసిద్ధ చిత్ర నిర్మాణ సంస్థ. వాళ్ల లేబరేటరీకి అధిపతి జోలే. జర్మనీ వాడు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో బార్ట్లేకు పై అధికారి కూడా జర్మనీవాడే. ఆయన ద్వారా అంతకు మునుపే జోలేతో బార్ట్లేకు పరిచయం ఏర్పడింది. బ్రిటీష్ మూవీటోన్ వారు పంపిన కెమేరా ఎట్లా లోడ్ చేయాలో బార్ట్లేకు జోలే చూపెట్టారు. తరువాత ఆ కెమేరాతో బార్ట్లే కొన్ని షాట్లు తీసి, వాటిని బొంబాయిలోనే డెవలప్ చేయించి, చూసుకున్నారు. ఫలితాలు తృప్తిగానే అనిపించాయి. ఆ తరువాత కొద్ది కాలానికే బార్ట్లేకు తొలిసారిగా న్యూస్‌రీల్ పని తగిలింది. పండరిపూర్ ఉత్సవాలను బార్ట్లే తొలిసారిగా చిత్రీకరించారు. ఆ ఉత్సవం తాలూకు దృశ్యాలు తృప్తికరంగా ఉన్నట్టు బ్రిటీష్ మూవీటోన్ వారు కూడా తెలియజేశారు. దాంతో, బార్ట్లేకు ఫిల్ము కెమేరా చిత్రీకరణలో అనుభవం వచ్చింది.

న్యూస్‌రీల్ కెమేరామన్‌గా బార్ట్లే చేసిన గొప్ప పని లార్డ్ వెల్లింగ్టన్ వీడ్కోలు పర్యటన తాలూకు వార్తాదృశ్యాల చిత్రీకరణ! ఆ పర్యటనలో భాగంగా గ్వాలియర్, బికనేర్, బరోడా, జామ్‌నగర్, జూనాగఢ్, జోధ్‌పూర్, తదితర ఉత్తరదేశ సంస్థానాలన్నీ వెల్లింగ్టన్ తిరిగారు. ఆయన వెంటే బార్ట్లే కూడా అవన్నీ తిరిగారు. న్యూస్‌రీల్ కెమేరామన్‌గా బార్ట్లే చేసిన క్లిష్టతరమైన పని 1937లో బొంబాయిలో జరిగిన మతకలహాల దృశ్యాలు తీయడం!!

గాంధీ, నెహ్రూ, బోస్‌లనూ తీశారు!

1937 చివరలో బార్ట్లేకూ, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' సంస్థకూ మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయి. ఫలితంగా, ఆయన ఉద్యోగం వదిలి, బయటకు వచ్చేశారు. మూడు నెలల పాటు నిరుద్యోగిగా ఉన్నారు. అయితే, ఆ టైమ్ ఏమీ వృథా కాలేదు. సరిగ్గా అప్పుడే... ప్రసిద్ధ హరిపురా కాంగ్రెస్ మహాసభ జరిగింది. అది చాలా ముఖ్యమైన కాంగ్రెస్ సమావేశం. అందులో గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్ మొదలైన అగ్ర కాంగ్రెస్ నేతలందరూ పాల్గొన్నారు. వ్యాపారవేత్త, భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడు అయిన 'చికాగో రేడియోస్' సంస్థకు చెందిన మోత్వానీ ఆ మహా సభను చిత్రీకరించేందుకు బార్ట్లేను నియోగించారు. తరువాతి రోజుల్లో వెనక్కి తిరిగి చూసుకుంటే, అలాంటి మహామహులైన వారందరూ ఉన్న హరిపురా కాంగ్రెస్ మహాసభను స్వయంగా చిత్రీకరించడం ఆశ్చర్యంగా అనిపించిందని బార్ట్లేనే అన్నారు.

'మాయాబజార్' సన్నివేశాల గురించి



'లాహిరి లాహిరి లాహిరి లో...' పాట చిత్రీకరణ, అందులో వెన్నెలలో నౌకా విహారం సీను ఎవరూ మరిచిపోలేరు. శశిరేఖ అభిమన్యులు, రుక్మిణి - శ్రీకృష్ణులు, రేవతి బల రాములు...

ఇలా మూడు జంటలూ ఒకరి తరువాత మరొకరుగా నౌకలో విహరించే ఆ గమ్మత్తైన సన్నివేశం దృశ్యపరంగా, సంభాషణల పరంగా మనసుకు గిలిగింతలు పెడుతుంది. గమ్మత్తేమిటంటే, ఆ వెన్నెల, ఆ రాత్రివేళ నీటిలో నౌకావిహారం... అంతా మార్కస్ బార్ట్లే చేసిన కెమేరా మాయాజాలం. అదంతా తీసింది పట్టపగలు, ఎండలో అంటే ఆశ్చర్యం వేస్తుంది. మద్రాసుకు దగ్గరలో ఎన్నూరులో ఒక ఏరు ఉంది. ఈ పాటను అక్కడ డే లైట్‌లో చిత్రీకరించారు. కాకపోతే, కెమేరాకు ఫిల్టర్ వాడి, అచ్చం నైట్ ఎఫెక్ట్ వచ్చేలా చేశారు బార్ట్లే. మూన్‌లైట్ ఎఫెక్ట్ తెచ్చి, నీడలలో అలలను సృష్టించారు. ఆ ఎండలో ఏటి మీద కొద్ది నిమిషాలే షూటింగ్ చేసి, మిగతా భాగమంతా స్టూడియో సెట్‌లో తీశారు. అయినా, ఎక్కడా ఆ తేడా తెలియ నివ్వకుండా ప్రేక్షకులను లాహిరి లాహిరిలో ఓలలాడించడం మార్కస్ కెమేరా చేసిన మాయ.

'వివాహ భోజనంబు...' పాట తరువాత ఘటోత్కచుడు గుండిగలకొద్దీ వంటలన్నీ స్వాహా చేసే సన్నివేశంలో కూడా రకరకాల కెమెరా ట్రిక్స్ చేశారు. గమ్మత్తేమిటంటే, అన్నీ కామన్ సెన్స్ ఉపయోగించి చేసినవే. కెమేరా యాంగిల్‌తో... మన కంటికి కనిపించే సైజు తేడాను తెరపై ఎఫెక్టివ్‌గా వాడుకున్నారు. ముందు పెద్ద లడ్డూలుగా ఉన్నవి, తరువాత ఘటోత్కచుడు తన శరీరం పెంచేసి వాటిని తినడానికి కూర్చున్నప్పుడు కొంత చిన్నవిగా కనిపించాలి కాబట్టి, ఆ షాట్ కోసం ప్రత్యేకంగా మళ్లీ చిన్న సైజు లడ్డూలు అమర్చారు. ఘటోత్కచుడి నోట్లోకి లడ్డూలు చకచకా వెళ్లిపోయే దృశ్యం కోసం మరో చిన్న ట్రిక్ వాడారు. ఘటోత్కచుడు లడ్డూలు తినే దృశ్యం కోసం లడ్డూ పట్టే సైజుకు, కాగితంతో ఒక గరాటు లాంటిది చేయించారు. ఘటోత్కచ పాత్రధారి ఎస్వీఆర్ అలాగే కదలకుండా కూర్చొంటే, ఆయన నోటి పొజిషన్ ఎక్కడుంటుందో, అక్కడ ఫన్నెల్‌ను పెట్టారు. ఆ ఫన్నెల్‌లో ఒక లడ్డూను వదిలేస్తే, అది ఆ ఫన్నెల్ ద్వారా జారి, పళ్లెంలో పడుతుంది. ఆ యాంగిల్ చూసుకొని, సరిగ్గా అలా ఆ లడ్డూ పడే షాట్‌ను నాలుగైదు సార్లు చేశారు. లడ్డూలు కింద పళ్లెంలోకి పడుతున్నట్లు షాట్ వచ్చింది. ఇప్పుడు ఆ షాట్‌నే రివర్సులో తీసుకుంటే, లడ్డూలు ఘటోత్కచుడి నోటిలోకి వస్తున్నట్టుగా ఎఫెక్ట్ వస్తుంది. అదీ కామన్ సెన్స్ వాడి చేసిన కెమేరా ట్రిక్కే. అయితే, ఎక్కడా చిన్న తేడా కూడా లేకుండా ఇవన్నీ పెట్టి, షాట్ తీయడానికి నాలుగు రోజులు పట్టింది. అయితేనేం, కళా దర్శకుల సాయంతో కెమేరా విభాగం సహా అందరూ పడిన కష్టం... ఇప్పటికీ ఆబాలగోపాలం అబ్బురపడుతూ, కేరింతలు కొట్టే ఒక దృశ్యానుభూతిని అందించింది.



అప్పట్లో బార్ట్లే తీసిన ఈ న్యూస్ డాక్యుమెంటరీల్లో కొన్ని 1990ల నాటికి పుణేలోని నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్‌లో ఉన్నాయి. అయితే, ప్రెస్ ఫోటోగ్రఫీ లాగానే న్యూస్‌రీల్ పనిలో కూడా సృజనాత్మక కళాసృష్టికి ఆస్కారం లేదని బార్ట్లే అతి తొందరలో గ్రహించారు. అయితే, న్యూస్‌రీల్ పని పుణ్యమా అని సినిమాటోగ్రఫీలో కొంత పునాది ఏర్పడింది కాబట్టి, ఎలాగైనా సినిమాల్లోకి వెళితే బాగుంటుందని అనిపించింది.

ఏడు రోజులు... 50 రూపాయలు... రెండు రీళ్లు... ఓ సినిమా!

సినిమాల్లో బార్ట్లేకు తొలి బ్రేక్ ఇచ్చింది ప్రముఖ తమిళ దర్శక, నిర్మాత కె. సుబ్రమణ్యం. ఆయన వేరెవరో కాదు... ఇవాళ్టి సుప్రసిద్ధ భరతనాట్య కళాకారిణి పద్మా సుబ్రమణ్యం తండ్రి. తమిళంలో 'సేవాసదనం' (1938), 'త్యాగభూమి' (1939), తమిళ, తెలుగు భాషల్లో 'బాలయోగిని' (1937) లాంటి సంచలనాత్మక సంస్కరణవాద టాకీలు తొలినాళ్లలోనే తీసిన వ్యక్తి. అప్పట్లో ప్రముఖ తమిళ రంగస్థల హాస్యకళాకారులైన ఎన్.ఎస్. కృష్ణన్, టి.ఎ. మధురం జంటను పెట్టి, రెండు రీళ్ల చిన్న హాస్యచిత్రం తీయాలన్నది సుబ్రమణ్యం ప్రయత్నం. అయితే, పెద్ద కెమేరామన్ ఎవరూ ఆ చిన్న పనికి ఒప్పుకోలేదు. ఆ పనికి బార్ట్లే ఒప్పుకొని, వారం రోజులు చిత్రీకరించి, 'ఏమార్చవ సోనాగిరి' అనే ఆ హాస్య చిత్రాన్ని పూర్తిచేశారు. దానికి బార్ట్లేకు దక్కిన పారితోషికం అక్షరాలా యాభై రూపాయలు. అలా ప్రారంభమైన సినీజీవితం తెలుగు సినిమావైపుకు చేర్చింది.

సినీజీవితంలో పెద్ద మలుపు

సినీ రంగంలో బార్ట్లే చేసిన మొదటి నికరమైన ఉద్యోగం... న్యూటోన్ స్టూడియోలో. 1941 అక్టోబర్‌లో ఆయన న్యూటోన్‌లో ప్రవేశించారు. అప్పటి నుంచి 1947 దాకా అక్కడే ఉండి, అనేక చిత్రాలకు కెమేరామ్యాన్‌గా పనిచేశారు. అక్కడ ఆయన పనిచేసిన వాటిలో జూపిటర్ వారి తమిళ చిత్రాలైన కన్నాంబ 'కణ్ణగి'



ఆయన లైటింగ్ సూపర్

దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు

''విజయా సంస్థ వరకు చూస్తే... దర్శకుడు కె.వి. రెడ్డి గారి దగ్గర 'మాయా బజార్, జగదేకవీరుని కథ, ఉమా చండీ గౌరీ శంకరుల కథ' సినిమాలకు పనిచేశా. మూడింటికీ మార్కస్ బార్ట్లేనే కెమేరామన్. బార్ట్లేతో పని చేయడం ఓ గొప్ప ఎడ్యుకేషన్. అందుకు ఎన్నెన్నో ఉదాహరణలు.

లైటింగ్ విషయంలో బార్ట్లే చాలా జాగ్రత్తలు తీసుకొనే వారు. ఎన్టీఆర్, యస్వీఆర్ లాంటి మహామహులు సైతం బార్ట్లే అంటే సెట్‌లో ఎంతో గౌరవంతో ఉండేవారు. 'మాయా బజార్' లాంటి చిత్రాల్లో ఎన్టీఆర్, యస్వీఆర్‌లకు లైటింగ్ పెడితే, వాళ్ల ముక్కు నీడ కొద్దిగా రావాలి. అలా ఎన్టీఆర్ అందంగా కనిపించాలంటే, ఒక ఫ్లాట్ లైట్ చాలదు. ఒక బ్యాక్ లైట్ కూడా ఉండాలి. అది సరిగ్గా ఎంత బ్యాక్‌కు పోవాలనేది కీలకం. సాధారణంగా ఉజ్జాయింపుగా ఒక కీ లైట్ పెట్టి, అక్కడ బ్యాక్ లైట్ పెట్టి, అసలు నటీనటులు రాగానే కొద్దిగా మార్పులు, చేర్పులు చేస్తారు. కానీ, బార్ట్లే అలా చేసేవారు కాదు. ఎవరైతే ఆ షాట్‌లో నటిస్తారో... ఆ నటుడే కెమేరా ముందు నిలబడితే, వాళ్లకు తగ్గట్లు లైటింగ్ చేసేవారు. గమ్మత్తేమిటంటే, ఆ రోజుల్లో బార్ట్లే గంట సేపు లైట్ అప్ చేస్తుంటే, ఎన్టీఆర్ అంతసేపూ అక్కడ శ్రీకృష్ణుని వేషంలో నిలబడడం గమనార్హం. ఒకసారి యస్వీఆర్‌ను అలా నిలబెట్టి, లైటింగ్ చేస్తూ ఉంటే, నాతో ఆయన ఆకలి అన్నారు. అంతే తప్ప, సెట్‌లో నుంచి ఒక్క అంగుళం కూడా కదలలేదు. ఎప్పుడైనా సరే... షాట్‌కు అంతా రెడీ అయ్యాక, లెన్సులో నుంచి బార్ట్లే చూసేవారు. తరువాత కె.వి. రెడ్డిగారు వచ్చి, చూస్తారు. ఇద్దరూ సంతృప్తిపడగానే, చిత్రీకరణ చేపట్టేవారు. అంత చక్కటి సమన్వయం ఇద్దరిదీ! తెలుగు సినిమాకు ఆ దర్శక, ఛాయాగ్రాహకులు పెట్టిన ఒరవడి, చూపెట్టిన క్రమశిక్షణ మార్గం చిరస్మరణీయం.''

(1942), పాపనాశం శివన్ 'కుబేర కుచేల' (1943), కన్నాంబ పి.యు. చిన్నప్పల 'మహామాయ' (1944) మొదలైనవి ఉన్నాయి. 'కణ్ణగి' తమిళ చలనచిత్రచరిత్రలో ఇప్పటికీ ఓ క్లాసిక్‌గా నిలిచింది.

అనూహ్యంగా... తెలుగులోకి అలా వచ్చారు!

నిజం చెప్పాలంటే, తెలుగు సినిమాల్లోకి మార్కస్ బార్ట్లే ప్రవేశం కొంత అనూహ్యంగా జరిగింది. అప్పటికి వాహినీవారి చిత్రాలన్నిటికీ కె. రామ్‌నాథ్, ఏ.కె. శేఖర్ జంట కీలక టెక్నీషియన్లు. రామ్‌నాథ్ సినిమాటోగ్రఫీ, శేఖర్ కళాదర్శకత్వం పెట్టని కోటలు. ఏవో గొడవలతో వారిద్దరూ వాహినిని వదిలేసి జెమినీ స్టూడియో వైపు వెళ్లిపోయారు. బి.ఎన్. రెడ్డి నిరాశలో పడ్డారు. వారు లేకుండా సినిమాలు ఎలా తీయాలని తర్జనభర్జనలకు గురయ్యారు. ఒక దశలో సినిమా రంగాన్నే వదిలేయాలనుకున్నారు. సరిగ్గా ఆ సమయంలో ఆయన దృష్టిని ఆకర్షించిన ఆంగ్లో ఇండియనే మార్కస్ బార్ట్లే. మార్కస్ ప్రతిభను గుర్తించి, న్యూటోన్ స్టూడియోలో తీస్తున్న తమ సినిమాకు అక్కడి కెమేరామ్యాన్ అయిన ఆయననే వినియోగించుకున్నారు. అలా బి.ఎన్. రెడ్డి 'స్వర్గసీమ'తో తెలుగు చిత్రసీమకు పరిచయమయ్యారు బార్ట్లే.

ఈ సినిమా షూటింగ్ అంతా ప్రముఖ సినిమాటోగ్రాఫర్ జితేన్ బెనర్జీ నిర్వహణలోని న్యూటోన్ స్టూడియోలోనే జరిగింది. అన్ని సినిమాల షూటింగులూ సెట్స్‌లోనే జరిగే ఆ రోజుల్లో... స్టూడియోల్లో షూటింగుకు సెట్లు ఖాళీగా దొరకని ఆ సమయంలో... న్యూటోన్ స్టూడియోలో బి.ఎన్. రెడ్డి ఎన్నో చేదు అనుభవాలు చవిచూశారు. ఆ అనుభవాలే సొంతంగా వాహినీ స్టూడియో నిర్మాణానికి బీజం వేశాయి. అలా 1946 నుంచి 1950 మధ్య సుదీర్ఘంగా వాహినీ స్టూడియో నిర్మాణం సాగింది. నిర్మాణం అవుతూనే... బార్ట్లేను తమ స్టూడియోలోకి తీసుకున్నారు. అలా ఆ స్టూడియోకూ, వాహినీవారి చిత్రాలకూ మార్కస్ బార్ట్లే సినిమాటోగ్రఫీలో మూలస్తంభమయ్యారు. నిజానికి, బి.ఎన్. దర్శకత్వంలో బార్ట్లే చేసిన సినిమా 'స్వర్గసీమ' ఒక్కటే. అయితేనేం, అక్కడ నుంచి బార్ట్లే ఎదుగుదల జెట్ వేగాన్ని అందుకుంది. వాహినీ వారి తదుపరి చిత్రాలైన 'యోగి వేమన' (న్యూటోన్ స్టూడియోలోనే షూటింగ్ - రిలీజ్ 1947 ఏప్రిల్ 10), 'గుణసుందరి కథ'(వాహినీ స్టూడియోలో షూటింగ్ రిలీజ్ 1949 డిసెంబర్ 29)కూ, ఆ పైన బి.ఎన్. తమ్ముడు నాగిరెడ్డి, రచయిత చక్రపాణి 'విజయా' వారి పతాకంపై 'షావుకారు'తో మొదలుపెట్టి తీసిన చిత్రాలకూ బార్ట్లేయే పర్మనెంట్ సినిమాటో గ్రాఫర్. అలా ఆయన దేశంలో అగ్రశ్రేణి సినిమాటోగ్రాఫర్లలో ఒకరిగా ఎదిగారు.

ఫోటోగ్రఫీ వర్సెస్ సినిమాటోగ్రఫీ

ఫోటోగ్రఫీ నుంచి సినిమాటోగ్రఫీకి మారడం తనకు పెద్ద కష్టమేమీ కాలేదనేవారు బార్ట్లే. "ఫోటోగ్రఫీలో సందర్భానికి తగ్గట్టు ఒక కచ్చితమైన క్షణం ఉంటుంది. దాన్ని కెమేరాలో బంధించాలి. ఆ క్షణాన్ని అలా ఒడిసిపట్టిన నిశ్చలన ఛాయాచిత్రం మొత్తం కథను చెప్పేలా ఉండాలి. కానీ, సినిమాటోగ్రఫీలో ఏదైనా సరే సన్నివేశాల లెక్కలో ఆలోచించాలి. ఇక్కడ టైమ్ ఫ్రేమ్ ఫోటోలో కన్నా ఎక్కువ ఉంటుంది. ఫోటోగ్రాఫర్‌గా మొదలైన నేను సినిమాటోగ్రాఫర్‌గా మారడంలో పెద్ద కష్టమేమీ ఎదుర్కోలేదు. నిజం చెప్పాలంటే, స్టిల్స్ తీయడంలోని నా అనుభవం, మోషన్ పిక్చర్స్ తీయడంలో ఉపకరించింది. లైటింగ్ విషయానికి వస్తే, దేనికది భిన్నంగా ఉంటుంది'' అనేవారు బార్ట్లే. అలాగే, సినిమాల్లో అయితే సహజసిద్ధమైన లైటింగ్ అనిపించేలా పరిస్థితులను పునఃసృష్టించడం ముఖ్యం. అక్కడ అన్ని సందర్భాల్లో నేరుగా సూర్యకాంతినే వాడాల్సిన అవసరం లేదు. కిటికీలో నుంచి వచ్చిన కాంతి, నేల మీద ప్రతిఫలించిన కాంతి... ఇలా దేనినైనా వాడతాం. బొమ్మను సరిగ్గా తీర్చిదిద్దడంలో అది ఉపయోగపడుతుంది. అందుకే, సినిమాలో సన్నివేశాన్నిబట్టి దాన్ని మనం ఊహించు

కొని, ఆర్టిఫిషియల్ లైట్ల ద్వారా సృష్టించాలి. అయితే, కొన్ని సందర్భాల్లో ఆర్టిఫిషియల్ లైటింగ్‌ను నేను పూర్తిగా దూరం పెట్టేస్తుంటా. కాలక్రమంలో వాటన్నిటినీ సాధ్యం చేసే లెన్సులు, ఫిల్ములు వచ్చేశాయి" అని బార్ట్లే ఓ సందర్భంలో పేర్కొన్నారు.


విదేశీయుడని పారపడేవాళ్లు!

బార్ట్లే, ఆయన పనితీరు చాలా ప్రత్యేకం. సినిమాటోగ్రఫీలో ప్రధానంగా రెండు రకాల స్కూల్స్ ఉన్నాయంటారు. ఒకటి రియలిస్టిక్ స్కూల్. రెండోది హాలీవుడ్ స్కూల్. వాస్తవికతకు దగ్గరగా ఉండేలా చిత్రీకరించినప్పటికీ, బార్ట్లేది ప్రధానంగా హాలీవుడ్ స్టైల్ అనీ, అందులో ఆయన మాస్టర్ అనీ ప్రముఖ సినిమాటోగ్రాఫర్ స్వర్గీయ బాలూ మహేంద్ర లాంటి పలువురు నిపుణులు పేర్కొనేవారు. 'పాతాళభైరవి', 'మిస్సమ్మ', తదితర విజయా ప్రొడక్షన్స్ చిత్రాలన్నిటిలో బార్ట్లే హాలీవుడ్ శైలి కనిపిస్తుం దనేవారు. లైటింగ్‌లో దిట్ట అయిన బార్ట్లే చిత్రీకరణలో హాలీవుడ్ శైలిని అనుసరించేవారని వాళ్ల అభిప్రాయం. దానికి తగ్గట్టు బార్ట్లే తెల్లగా, పొడుగ్గా, నీలం రంగు కళ్లతో, హుందాగా ఉండేవారు.

ఇరవయ్యేళ్ల ముందే కలర్‌పై దూరదృష్టి


తొలినాటి బ్లాక్ అండ్ వైట్ చిత్రాల్లోనూ, తరువాతి కలర్ చిత్రాల్లోనూ బార్ట్లే సమాన ప్రతిభ కనపరచడం విశేషం. ఆ మాట కొస్తే, అప్పటికింకా కలర్ ఫిల్ములు మన దేశంలో పాపులర్ కాక ముందే... 1950 నాటికే కలర్ ఫిల్ములపై ప్రయోగాలు చేశా రాయన. "బ్లాక్ అండ్ వైట్ రోజుల్లోనే నేను కలర్‌ను స్వాగతించా! ఇక్కడ కలర్ ఫిల్ములు వాడడానికి కనీసం ఇరవై ఏళ్ల పైచిలుకు ముందే నేను కలర్ వాడి చూశా. ఇంకా చెప్పాలంటే, కలర్ వాడి తీరాల్సిందే అని ప్రాక్టికల్‌గా ఒత్తిడి తెచ్చా. సినిమాల్లోకి రంగులు వచ్చి తీరుతాయన్న నమ్మకం నాకు 1936లోనే కుదిరింది."

ఎన్టీఆర్ నటించిన విజయా వారి 'పెళ్లి చేసి చూడు' తమిళ వెర్షన్ 'కల్యాణం పణ్ణి పార్'లో (రిలీజ్ 1952 ఆగస్టు 15) కొన్ని దృశ్యాలను గేవా కలర్‌లో చిత్రీకరించి, ప్రేక్షకులను బార్ట్లే ఆనందాశ్చర్యాలలో ముంచెత్తడం విశేషం. దీన్నిబట్టి ఆయన ప్రయోగశీలత, దూరదృష్టి అర్థం చేసుకోవచ్చు.



ఆ వెన్నెల... ఆయన ట్రిక్ వర్క్

నటుడు రాళ్ళపల్లి కొండలరావు




"దక్షిణాదిన సినిమాటోగ్రఫీ దిగ్గజాల పేర్లు చెప్పమంటే ముందు గుర్తొచ్చే పేరు - మార్కస్ బార్ట్లే. అప్పటికీ, ఇప్పటికీ ఆయనంటే అందరికీ ఒక ప్రత్యేక గౌరవం. నేను సినిమారంగంలో ప్రవేశించే నాటికే ఆయనో టాప్ టెక్నీషియన్. సహాయ దర్శకత్వం, సినీ పత్రికా రచన లాంటివి చేస్తూ, తరువాతి రోజుల్లో కెమేరా వెనుక నుంచి కెమేరా ముందుకు వచ్చాక... ఆయన సినిమాటోగ్రఫీలో నటించాలని నాకు ఎంతో కోరిక ఉండేది.

సినిమాల్లో చందమామ, వెన్నెల షాట్లు అందరూ తీస్తారు. ఆకాశం మీద కార్డు బోర్డుతో తెల్లటి చందమామ ఆకారం పెట్టి, దానికి లైటింగ్ చేస్తారు. కానీ, బార్ట్లే సినిమాటోగ్రఫీ చేసిన సినిమాల్లో వెన్నెల ప్రత్యేకం. మిగతావాళ్లది ఏదో తెల్లగా ఉంటే, ఆయనది మాత్రం కొద్దిగా బ్లూయిష్‌గా, గమ్మత్తుగా ఉంటుంది. కలర్‌లో తీసిన 'శ్రీకృష్ణసత్య'లో సముద్రం నేపథ్యంలో వానరులందరూ వెన్నెలలో శ్రీరాముడికి గుడి కట్టి, పూజించే షాట్ భలే ఉంటుంది. ఇక బ్లాక్ అండ్ వైట్ చిత్రాల్లో అయితే చెప్పనే అక్కర్లేదు. తెలుగులో ఆయన తొలి చిత్రమైన 'స్వర్గసీమ' నాటి నుంచి మనకు ఆ ప్రత్యేకత కనిపిస్తుంది. మా చిన్నప్పుడు 'స్వర్గసీమ' లాంటివి చూస్తున్నప్పటి నుంచి ఆయన తరహా లైటింగ్ ప్రత్యేకంగా అనిపించేది. తెర మీది చందమామ వెన్నెల... హాలులో ముందు కూర్చొని చూస్తున్న మా మీద పడుతోందా అన్నట్లుండేది. ఏమిటా ప్రత్యేకత అంటే, 'ఐ ఓన్లీ యూజ్ ఎనీ స్పెషల్ లైట్. బట్ ఐ యూజ్ ది రిక్వైర్డ్ లైటింగ్. దట్సాల్' అని ఆయన నాతో ఒకసారి చెప్పారు.

"రంగులు భావచైతన్య కారకాలు. అందువల్ల బ్లాక్ అండ్ వైట్ సినిమాలతో కన్నా కలర్ సినిమాలతో భావచైతన్యం కలిగించే అవకాశం ఎక్కువ. సరిగ్గా ఉపయోగిస్తే సినిమాల్లో కలర్ మరో కీలకమైన ప్రభావం అవుతుంది" అని 1952 నాటికే ఆయన జోస్యం చెప్పారు. "నిజం ఆలోచిస్తే, వాస్తవికతకూ, సినిమాకూ మధ్య రెండే అడ్డంకులున్నాయి. ఒకటి థర్డ్ డైమన్షన్ (3డి). రెండోది రంగులు. మొదటిది ఇంకా దూరంగా ఉంది కానీ, కలర్ అందుబాటులోకి రానే వచ్చింది. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే, బ్లాక్ అండ్ వైట్ ఫోటోగ్రఫీ కన్నా కలర్ ఫోటోగ్రఫీ మరిన్ని రెట్లు నిర్దుష్టంగా ఉండాలి."

అయినా "కలర్ ఫిల్ముతో షూటింగ్ చేయడం కన్నా బ్లాక్ అండ్ వైట్ ఫిల్ముతో తీయడానికే మరింత నైపుణ్యం కావాలి" అని బార్ట్లే కుండబద్దలు కొట్టేవారు. "ఎందుకంటే, కళ్లెదుట కలర్‌లో కనిపిస్తున్న ఇమేజ్‌లను చకచకా అబ్‌స్ట్రాక్ట్ రూపంలోకి



మార్చుకోవాలి. చాలాసార్లు నేను బ్లాక్ అండ్ వైట్‌లో కనిపించే షాట్ కోసం కలర్ ఫిల్మును ఉపయోగిస్తుండేవాణ్ణి. దాంతో, ఏ మాత్రం కనిపించీ కనిపించని అతి కొద్దిపాటి కలర్ మాత్రం ఆ ఫ్రేమ్‌లో ఉండి, ఆ షాట్ మొత్తానికీ జీవం వచ్చేది" అని ఆయనే తన కెమేరా టెక్నిక్ ఒకటి వెల్లడించారు.

సినిమాలు వదిలేసి... సర్వీసింగ్‌లో...

నెమ్మదిగా సినిమారంగ వాతావరణం మారుతూ వచ్చింది. విజయా సంస్థ నుంచి బయటకు వచ్చేయడం, ఆ తరువాత బయట చిత్రాల వారి అన్ ప్రొఫెషనల్ విధానాలతో సర్దుకుపోలేక పోవడం, సినీరంగంలో మారుతూ వచ్చిన పరిస్థితులు... ఇవన్నీ క్రమంగా బార్ట్లే సినిమా కెరీర్‌కు ప్రతిబంధకాలయ్యాయి. 1970ల చివరకు వచ్చేసరికి, సినిమాటోగ్రఫీ పూర్తిగా తగ్గిపోయింది. 1979లో నవోదయ అప్పచ్చన్ తీసిన మలయాళ చిత్రం 'మామంగం', ఆ పై అయిదేళ్ల విరామం తరువాత 1984లో కె.ఎస్. సేతుమాధవన్ దర్శకత్వంలో రూపొందుతున్న మరో హిందీ చిత్రం 'జిందగీ జీనే కే లియే'కు బార్ట్లే పనిచేశారు. సినిమాటోగ్రాఫర్‌గా అదే ఆయన ఆఖరి చిత్రం.

ఏది ఏమైనా, 1980లకు వచ్చేసరికి అన్నిటి మీదా బార్ట్లేకు ఆసక్తి తగ్గింది. అసహనం, ఒంటరితనం ఎక్కువయ్యాయి. సినిమాటోగ్రఫీ మీద కన్నా కెమేరాలు, లెన్సులు బాగు చేయడం మీద దృష్టి పెట్టారు. ఫిజిక్సులో కానీ, ఆప్టికల్ ఇంజనీరింగ్‌లో కానీ ఏనాడూ నియమిత శిక్షణ అంటూ లేనప్పటికీ, అప్పటికి దక్షిణాది సినీసీమ అంతటికీ కేంద్రస్థానమైన మద్రాసులో కెమేరాలు, లెన్సులు ఒంటిచేతితో మెయిన్‌టెనెన్స్, సర్వీసింగ్ చేసేవారు. సినిమాటోగ్రఫీలోనే కాదు... సర్వీసింగ్‌లోనూ ది బెస్ట్ అనిపించుకున్నారు. ఆరీఫ్లెక్స్ సంస్థ ఆయనను తమ కెమేరాలకు ఆథరైజ్డ్ సర్వీస్ పర్సన్‌గా నియమించింది. సినిమాటోగ్రఫీ రోజుల్లో కన్నా ఎక్కువ బిజీ అయిపోయారు బార్ట్లే.

జన ఘన నివాళితో...

దురదృష్టవశాత్తూ, జీవితం చివరి దశలో చాలాకాలం బార్ట్లే మధుమేహ వ్యాధితో బాధపడ్డారు. అయితే, డాక్టర్ దగ్గరకు వెళ్లడానికి ఇష్టపడేవారు కాదు. ఎప్పుడూ సొంత వైద్యమే. చివరి రోజుల్లో, కుమారుడు అలెన్ బార్ట్లే ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలిసిన విజయా నాగిరెడ్డి, ఆయనను తమ విజయా హాస్పిటల్‌కు షిఫ్ట్ చేయించారు. అక్కడ ఆయనకు వ్యక్తిగత శ్రద్ధతో వైద్యచికిత్స అందించారు. విజయ వాహినీ స్టూడియోలో ఉజ్జ్వలమైన జీవితాన్ని గడిపి, వెండితెరను వెలిగించిన బార్ట్లే చివరకు ఆ ప్రాంగణాన్ని ఆనుకొనే ఉన్న విజయా హాస్పిటల్‌లో 1993 మార్చి 14న శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. ఆరోజున బార్ట్లే ఇంటికి వెళ్లే రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. ట్రాఫిక్ స్తంభించడంతో, సినిమా జనం కార్లు వదిలేసి, నడుచుకుంటూ ఆయన ఇంటికి చేరుకొని, నివాళులు అర్పించారని ప్రత్యక్షసాక్షుల కథనం. వందలాది జనం, పరిచయస్థులు, సినీ పరిశ్రమలోని వివిధ శాఖలవారు నివాళిగా తెచ్చి, వేసిన పూలదండలు గుట్టగా పేరుకు పోయాయి. అశ్రునయనాల మధ్య మార్కస్ బార్ట్లేకు తుది వీడ్కోలు సాగిపోయింది.

మార్కస్ బార్ట్లే సినీజీవితం మొత్తం చూస్తే... అన్ని భాషల్లోనూ కలిపి ఆయన ఛాయాగ్రహణం అందించింది నలభై నుంచి యాభై సినిమాల లోపే! అయితేనేం, వాటిలో అత్యధిక భాగం ఆయన కెమేరా కంటితో కళాఖండాలయ్యాయి. చిన్నప్పటి నుంచి చివరిదశ వరకు ఆయన ఎన్నడూ పరుగెత్తి పాలు తాగలేదు. నిలబడి నీళ్లే తాగారు. డబ్బు కోసం వెంపర్లాడలేదు. ఇచ్చిన జీత మేదో పుచ్చుకున్నారు. కానీ, వచ్చిన పనితనం మొత్తం వెండితెరపై చూపించేదాకా వదలలేదు. అందుకే, మార్కస్ బార్ట్లేకు అంత మంచి పేరు. దానివల్లే ఆయన ఇవాళ్టికీ దక్షిణ భారత సినీరంగం లో చిరస్మరణీయుడిగా మిగిలిపోయారు.



ఈనాడు దినపత్రికలో జర్నలిస్టుగా జీవితం ప్రారంభించి నెమ్మదిగా ప్రముఖ సినీ జర్నలిస్టుగా రూపొందారు. అనేకమంది సినీరంగ ప్రముఖుల్ని ఇంటర్వ్యూలు చేశారు. తెలుగు సినిమారంగంపై పరిశోధన చేసి, మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. 2012 సంవత్సరంలో ఉత్తమ సినీ జర్నలిస్టుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారం, ఉత్తమ సినీ గ్రంథ రచయితగా జాతీయ పురస్కారం పొందారు. నివాసం హైదరాబాదు.



సాహిత్యం

తొలితరం స్త్రీల కథలు - 1901-1910

కె.ఎన్. మల్లీశ్వరి

గురజాడ 'దిద్దుబాటు' తొలి కథ అని భావిస్తాం. కానీ అంతకుముందు ఇరవై పళ్ల నుంచే తెలుగులో కథలు రాయటం మొదలైంది. అందులోనూ సగం కథల పైగా స్త్రీలు రాసినవే. ఈ విషయం తానా ప్రచురించిన 'బిద్దుబాటలు' పుస్తకం వచ్చేదాకా తెలుగు సాహిత్యప్రపంచానికి తెలియదు. ఆ స్త్రీలు రాసిన కథల విశ్లేషణ...

1910లో గురజాడ రాసిన 'దిద్దుబాటు' తెలుగులో తొలికథ అన్నది దాదాపు వందేళ్లుగా సాహిత్య చరిత్రలో నమోదై ఉంది. అయితే పరిశోధనలలో కొత్త విషయాలు తెలిసేకొద్దీ ఎంత బలంగా స్థిరపడిన అంశాలయినా మార్పుకి లోను కావలిసిందే. ప్రధానంగా సాహిత్యచరిత్రలు ఇటువంటి మార్పులను నిష్పాక్షికంగా సరి చేయవలసి ఉంటుంది. సాధారణంగా 'తొలి' ప్రయత్నాల మీద నిర్ధారణలకు వచ్చే ముందు అవి 'తొలి' కాకుండాపోయే అవకాశాలు ఉంటాయన్న స్పృహ కూడా సాహిత్య చరిత్రకారులకి ఉండటం మంచి పరిణామం. ఇటీవల వివినమూర్తి సంపాదకత్వంలో Telugu Association North America (TANA) ప్రచురణల సంస్థ 'దిద్దుబాటలు' పేరుతో ఒక పుస్తకం ప్రచురించారు. 1910కి పూర్వమే తెలుగులో కథారచన ఉందని నిరూపిస్తూ తొంభై రెండు కథలను ప్రకటించారు. అయితే ఇందులో విశేషమైన విషయం ఒకటుంది. ఈ తొంభై రెండు కథలలో పేరు తెలియని రచయితలు రాసినవి ముప్పై ఒక్క కథలు. పదమూడు మంది పురుషులు రాసినవి- ముప్పై ఏడు కథలు కాగా, పదమూడు మంది స్త్రీలు రాసినవి- ఇరవై అయిదు కథలు ఉన్నాయి. ఇది చాలా ఆసక్తికరమైన సమాచారం.

నిజానికి ఇప్పటికీ సాహిత్య సాంస్కృతిక రంగాలలో స్త్రీల భాగస్వామ్యం విషయంలో వివక్ష నడుస్తూనే ఉంది. స్త్రీల సాహిత్యాన్ని పునర్నిర్మించే పని స్త్రీవాదం తెలుగులో 1980ల తర్వాత నిర్మాణాత్మకంగా మొదలైంది. అటువంటిది నూట ఇరవై ఏళ్లకు ముందే స్త్రీలు ఆధునిక ప్రక్రియ అయిన కథని ఎంచుకోవడం సమర్థవంతంగా నిర్వహించడం, కొనసాగించడం గుర్తించదగిన విషయాలు. 1901 మే నెలలో తెలుగు జనానా పత్రికలో బండారు అచ్చమాంబ రాసిన 'గుణవతియగు స్త్రీ' కథ తెలుగులో స్త్రీలు రాసిన మొదటి కథాప్రయత్నం. అప్పటినుంచి 1910 వరకు స్త్రీలు రాసిన కథలు ఇరవై అయిదు. నిజానికి ఆధునిక సాహిత్యచరిత్ర నిర్మాణంలో ఇది అతిపెద్ద భాగస్వామ్యం.

ఆనాటి తెలుగుసమాజంలో స్త్రీలపట్ల అనేక వ్యవస్థలు అమానవీయంగా ప్రవర్తిస్తూ ఉన్నాయి. వారికి అమానుషమైన చాకిరి అంటగట్టబడింది తప్ప హక్కులు లేవు. చాకలి పద్దులు రాసుకోవడానికి, రుక్మిణి కళ్యాణం చదువుకోవడానికి తప్ప సామాజికరంగంలో, శ్రమలో భాగస్వామ్యాన్ని పొందే చదువు నిరాకరించబడింది. అతిబాల్య అతిపృద్ధ వివాహాలు, కన్యాశుల్కం, మూఢనమ్మకాలు, స్త్రీని ఇంటికే పరిమితం చేయడం వంటి దురాచారాలు సమాజంలో అప్పటికి బలీయంగానే ఉన్నాయి. వాటిని అధిగమించి ఆధునిక దశలోకి స్త్రీలు ప్రవేశించడానికి చాలా సమయమే పట్టింది. సమాజంలో ఇటువంటి స్థితి కొనసాగు

తుండగా తెలుగు కథాసాహిత్యం ఆరంభదశలోనే ఇంతమంది స్త్రీలు ఎటువంటి సాహిత్యాన్ని సృష్టించారు, ఎటువంటి ఆలోచనలు చేశారు, పాతకాలపు సాంప్రదాయక స్థితిగతులను కొనసాగించారా, లేక ఒక అడుగు ముందుకు వేసి ఆ కాలపు సంఘసంస్కర్తల బాటలో నడిచారా లేదా కొత్తబాటలు వేసుకోవడానికి పూర్వరంగాన్ని సిద్ధం చేశారా అన్న ప్రశ్నలు వేసుకోవాలి.

ఈ పదమూడుమంది రచయిత్రులలో బండారు అచ్చమాంబ ఒక్కరే పదికథలు రాశారు. దీనిని వ్యక్తిగత సామర్థ్యం, వెసులుబాట్ల నుంచి చూసే ఆస్కారం ఉన్నప్పటికీ మిగతా రచయిత్రుల కథలను పరిశీలిస్తే వీరందరి కథారచనలో సమాంతరంగా కొన్ని గుణాలు కనపడతాయి. ఇరవయ్యవ శతాబ్ది తొలిదశకంలో తెలుగు స్త్రీలు రాసిన ఈ పాతిక కథల్లో ముఖ్యంగా కనబడే అంశం స్త్రీ విద్య ఆవశ్యకత. ఈ వస్తువుని ఎంచుకోవడానికి ప్రధాన కారణం ఆనాటి సంఘ సంస్కర్తల కృషి. ఈ వస్తువుని చెప్పడానికి ఎక్కువమంది రచయిత్రులు సంవాద కథనాన్ని ఎంచుకున్నారు. ఒకరు స్త్రీ విద్యని వ్యతిరేకిస్తే మరొకరు సమర్థిస్తారు. ఇట్లా మంచీ చెడూ రెండింటి చర్చ కనబడుతుంది. బండారు అచ్చమాంబ రాసిన 'భార్యాభర్తల సంవాదం-స్త్రీ విద్య' ఈ తరహా కథలకి తొలితీసింది.



అప్పటి తరం స్త్రీలు ఎంచుకొన్న కథన పద్ధతులు వారికి మాత్రమే సాధ్యమైన జానపద శైలిలో ఉంటాయి. పిల్లలకి కథలు చెప్పడం స్త్రీల జీవన విధానంలో భాగంగా ఉంటుంది. అందుకే వారు రాసిన కథల్లో కూడా ఈ మౌఖిక ధోరణి కనిపిస్తుంది. అట్లాగే వారి కథానేపథ్యాలను చూస్తే ప్రత్యేకమైన స్త్రీ ఆవరణం కనబడుతుంది. స్త్రీలు తరచుగా కలుసుకుని మాట్లాడుకునే స్థలాలు ఇక్కడ సంవాద స్థలాలుగా ప్రత్యక్షమయ్యాయి. మొసలి కంటి రమాబాయమ్మ రాసిన 'నీలాటి రేవులో ఇద్దరు స్త్రీల సంభాషణ' కథలో 'నీలాటి రేవు' స్త్రీ ఆవరణానికి ఒక ప్రతీక. ఊపిరాడని ఇంటి వాతావరణం నుంచి వారికి విముక్తి కలిగేది పనుల వంకన బైటకి వెళ్లిన ఆ కాసేపే. నీటి కోసం కడవలు చంకన పెట్టుకుని రేపు వెళ్లడం, అక్కడ కూడిన స్త్రీలు- కష్ట సుఖాలు కలబోసుకోవడం, బైటి ప్రపంచపు వింతలన్నీ ఒకరి నుంచి ఒకరు పంచుకునేది అక్కడే. అందుచేతనే స్త్రీ విద్య ఆవశ్యకతను చెప్పడానికి చర్చించుకోవడానికి ఇద్దరి స్త్రీలకు అనువైన వాతావరణంగా నీలాటి రేవుని రచయిత్రి ఎంచుకున్నారు. స్త్రీ విద్య ఆవశ్యకతను భార్యభర్తల సంవాదంగా బండారు అచ్చమాంబ రాస్తే ఇద్దరు స్త్రీల సంభాషణ గా రమాబాయమ్మ రాశారు.

ఇప్పటి దృష్టికోణంలో నుంచి చూస్తే ఈ కథలు పితృస్వామిక సమాజానికి లోబడి మాత్రమే ఉండొచ్చు. అయితే వాటి పరిమితుల్లోంచి కాక వాటి ప్రత్యేకతలో నుంచి చూసినట్లయితే అవి ఆ కాలపు సంస్కరణ దృష్టిని ప్రతిబింబించే కథలు. స్త్రీలు చదువుకోవాలనీ, సమాజానికి ఉపయోగపడాలనీ అదే సమయంలో కుటుంబాన్ని చక్కదిద్దుకోవాలనీ, చీరలు నగలు తదితర వస్తువుల కోసం భర్తని వేధించకూడదనీ ఇటువంటి బోధనల రూపంలో కథలు సాగాయి. 'దంపతుల ప్రథమ కలహం' కథ మొదలుపెట్టడమే '...వివాహమాడుట వలనను భర్తకు దాసి నగుదునాయేమి?' అన్న ప్రశ్నతో మొదలవుతుంది. కొత్త పెళ్లికూతురు మంకుతనంతో వేసిన ప్రశ్నలను, అలకలను కొత్త దంపతుల మధ్య వచ్చిన కలహాన్ని అమ్మమ్మ నేర్పుగా పరిష్కరించడం కథావస్తువు. అమ్మాయిని ఒద్దికైన ఇల్లాలుగా మార్చడమే ఈ కథ లక్ష్యం అయినప్పటికీ ఆ సంవాద సందర్భంలో కొత్త పెళ్లికూతురు వేసిన చాలా ప్రశ్నలు ఈ కాలానికి కూడా ప్రాసంగికమై ఉన్నాయి.

1902లో రాయబడిన 'దంపతుల ప్రథమ కలహం' కథకి 1910లో గురజాడ రాసిన 'దిద్దుబాటు' కథకి చాలా పోలికలు ఉన్నాయి. ప్రధానంగా రచనా సంవిధానం ఒకదానినొకటి పోలి ఉన్నాయి. భార్యాభర్తల మధ్య కలహం రావడం, ఇరువురు పరోక్షంలో దుఃఖించడం, ఆ కలహాన్ని పోగొట్టడానికి మధ్యవర్తులుగా 'దంపతుల ప్రథమ కలహం' కథలో అమ్మమ్మ, 'దిద్దుబాటు' కథలో రామయ్య కృషి చేస్తారు. దంపతులకి ఒకరి మీద ఒకరికి అపారమైన ప్రేమ ఉన్నప్పటికీ వేరే కారణాల రీత్యా కలహం రావడం, చివరికి ఒక కొసమెరుపుతో అది సమసిపోవడం అన్నవి, కథల్లో సమానంగా ఉన్న అంశాలు. కాకపోతే భాషా పరంగా, శిల్పపరంగా దిద్దుబాటు కథ నాజూకుగా ఉంటుంది. తన కథ కన్నా ఎనిమిది సంవత్సరాలు ముందు రాసిన ఈ స్త్రీల కథలు గురజాడ దృష్టిని దాటిపోవు. వాటి ప్రభావం ఆయన కథా సంవిధానం మీద ఉండే ఆస్కారం ఉంది.

'లలిత శారదలు', 'సుగుణవతి దుర్గుణవతి', 'ధైర్య స్థైర్యములు' వంటి కథల్లో మంచి-చెడ్డలు, వినయము-తెగింపు వంటి గుణాలు ఇద్దరు స్త్రీలలో పొందుపరిచి చెడు మీద మంచి, తెగింపు మీద వినయం, విజయం సాధించినట్లుగా చూపించడం అనే ఒక ట్రెండ్‌కి ఈ రచయిత్రుల కథలు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ దశాబ్దంలోనే మండపాక జోహానమ్మ రాసిన 'రెండు సంచులను కూర్చిన కథ' నీతి ప్రబోధకమైనది. జోహానమ్మ

క్రైస్తవ మైనారిటీకి చెందిన మహిళ. బైబిల్ నీతికథల ప్రభావం ఈ కథలో కనపడుతుంది. కథాప్రక్రియను ఎంచుకున్న ఈ తొలి తరం రచయిత్రుల్లో అనేకవర్గాల వారు ఉండటం అరుదైన విషయం. ఈ కాలానికి కూడా కుల, మత, వర్గ, ప్రాంత, లింగ, తెగ వివక్షలు సాహిత్యరంగంలో రాజ్యమేలుతూనే ఉన్నాయి. అటు వంటిది, ఆనాటి పలువర్గాల స్త్రీలు కథారచనకు పూనుకోవడం హర్షించదగ్గ విషయం. కథ చెప్పడం అన్నది వారికి చాలా పరిచయ మైన విషయం. నిత్యజీవిత వ్యవహారం. కనుకనే తొలితరం కథానికారచనలో పురుషులతో సమానంగా స్త్రీలు కథలు రాయడం కనపడుతుంది. మిగతా ఏ ప్రక్రియలో కూడా తొలి దశలో ఇటువంటి భాగస్వామ్యం కనిపించదు. కథాప్రక్రియ వారి అనుభవానికి దగ్గర విషయం కాబట్టి ఈ రచన వారికి సులువైన విషయంగా తోచి ఉండవచ్చు.

పురాణ సంబంధమైన అంశాలనుగానీ పాత్రలనుగానీ తీసుకుని స్వతంత్ర రచనగా మలచడం అన్న ధోరణి ప్రబంధ కాలం నుంచీ ఉంది. దానిని కథానికాప్రక్రియ కూడా కొనసాగించింది. ఈ దశాబ్దపు రచయిత్రులు కూడా అటువంటి ప్రయోగాలు చేసారు. 'రాధా వివాహం', 'గుణవతియగు స్త్రీ' వంటి కథలలో పౌరాణిక అంశాలు కనపడతాయి. ఆరోజుల్లో సాహిత్యాన్ని చదువుకోవడం అంటే పురాణ ఇతిహాసాలను వల్లె వేయడమే. జన వ్యవహారంలో పౌరాణిక గాథలు నలిగినలిగి కొత్త రూపును పొందడం అనేక ప్రక్రియల్లో చూసి ఉన్నాము. ఈ కథలు కూడా అటువంటి కొత్త రూపాలను సంతరించుకున్నాయి. తదనంతరకాలంలో కనుపర్తి వరలక్ష్మమ్మ లాంటివారు కైక వంటి పురాణపాత్రలను పునర్నిర్మించి స్త్రీ పాత్రలకు తార్కికమైన వ్యక్తిత్వాలను కల్పించారు. ఆ అవగాహన వెనుక తొలితరపు రచయిత్రుల ప్రభావం వారి మీద తప్పనిసరిగా ఉంటుంది.



కథ, నవల, వ్యాస ప్రక్రియల్లో రచనలు చేస్తున్న కె.ఎన్. మల్లీశ్వరి మూడు కథా సంపుటాలు, ఆరు నవలలు, రెండు వ్యాస సంపుటాలు ప్రచురించారు. ప్రతిష్టాత్మకంగా తానా 2017లో నిర్వహించిన నవలల పోటీలో వీరి నవల 'నీల'కు బహుమతి లభించింది. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి. వివిధ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాలుపంచుకొంటున్నారు. 2019 తానా సభల అతిథి. నివాసం విశాఖపట్నం.

AAPI CME FAMILY ANTARCTICA CRUISES

Ship 1 : OCEAN ATLANTIC : Nov 28th- Dec 10th, 2019: Few cabins left
Ship 3 : OCEAN ATLANTIC : Jan 12-24th, 2020 : $ 8990 /per person



Dr. Suresh Reddy
President



Dr. Ravi Kolli
Secretary



Dr. Satheesh Kathula
Organizer





If it's on your bucket list, just do it
Once in a lifetime opportunity to enjoy the greatest adventure of life with your friends and family and with Indian food and Indian Entertainment at rock bottom prices

Inclusions

- Unlimited alcoholic drinks in Ocean Atlantic ship (huge savings)
- Gratuity and tips (big savings)
- All Shore excursions
- Round trip chartered domestic flights from Buenos Aires to Ushuaia
- Tango show and half-day city tour of Buenos Aires
- Overnight stay in 5 star luxury premium hotels in Ushuaia and Buenos Aires
- Half day city Tour of Ushuaia
- AAPI exclusive Indian cuisine
- AAPI CME (8-12 hours)
- AAPI Indian Entertainment

AMERICAN ASSOCIATION OF PHYSICIANS OF INDIAN ORIGIN — AAPI

Please contact :

ATG Tours
Ph: 630-599 0595
info@atgtour.com

TO AVOID DISAPPOINTMENT PLEASE BOOK YOUR CABINS ASAP
NON- PHYSICIANS ARE ALSO WELCOME



యువత-మనోభావాలు

డా॥ పద్మజ నందిగాము

పిల్లలు అందరు ఒకేలాగ ఉండరు, రక రకాల మనస్తత్వాలు ఉంటాయి, అలాగే తల్లితండ్రులకి కూడా పిల్లల్ని ఎలా పెంచాలి అనే నిఘంటువు లేదు కాబట్టి, కాల మాన పరిస్థితులకి అనుగుణంగా అవసరమైతే నిపుణులు సహాయం తీసుకోవటానికి తల్లి తండ్రులు వెనకాడకూడదు.

ఈ మధ్య కాలంలో సోషల్ మీడియా వాడనివాళ్లు ఎవరూ కనపడటం లేదు. మూడేళ్ల వాళ్ల దగ్గరి నించి 80 ఏళ్లవాళ్ల దాకా ప్రతి వాళ్లకి ఫేస్‌బుక్, ఇంస్టాగ్రామ్‌లలో రెగ్యులర్‌గా పోస్టులు పెట్టుకుంటూ చాలా బిజీగా వుంటున్నారు. సోషల్ మీడియా వల్ల ఉపయోగాలు బోలెడు ఉన్నాయి. ఉదాహరణకు, సోషల్ కాంటాక్ట్స్ పెంచుకోవచ్చు, ఒంటరితనానికి దూరంగా ఉండచ్చు, బిజినెస్ అడ్వర్‌టైజ్ చేసుకుని సేల్స్ పెంచుకోవచ్చు. కానీ సరిగ్గా వాడుకోక పోతే దాని వల్లవచ్చే కష్టనష్టాలు చాలా వున్నాయి. సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా టీనేజర్స్ మీద కనిస్పిస్తోంది. ఇది ఒక వ్యసనం లాగ మారిపోయింది. ఇప్పుడు ఏ టీనేజర్‌ని చూసినా చెవులకి ఇయర్ ఫోన్స్ తగిలించుకుని, చేతిలో స్మార్ట్ ఫోన్ చూస్తూ, పక్కన ఏమి జరుగుతుందో పట్టించుకోకుండా తిరుగుతూ వుంటారు. సోషల్ మీడియాలో పోస్ట్ కానీ ఫోటో కానీ పెడితే వచ్చే థ్రిల్, టెక్స్ట్‌కి ఆన్సర్ వచ్చినప్పుడు ఉత్సాహం ఎలా వుంటుందో మన అందరికి తెలుసు. మన బ్రెయిన్‌లో డోపమైన్ (dopamine) అనే నియూరో ట్రాన్స్‌మీటర్ (neurotransmitter) రిలీజ్ అయ్యి మనకి ఆనందాన్ని కలిగిస్తుంది. టీనెజర్స్ ఆడోపమైన్ రిలీజ్‌కి అడిక్ట్ అయి పోయి, ఫోన్ చూడకుండా, పోస్ట్‌లు పెట్టకుండా ఉండలేరు, అదే లోకంగామారిపోతుంది. దానివల్ల, చదువు మీద ధ్యాస తగ్గుతుంది, మార్కులు తగ్గిపోతాయి, సోమరితనానికి అలవాటు పడిపోయి, డిప్రెషన్, యాంగ్జైయిటీ లాంటి మానసిక ఒత్తిడిలకి కూడా గురి అవుతారు.

టీనెజర్స్‌కి ఫ్రెండ్స్ లోకం... ఫ్రెండ్స్‌లాగ తయారవ్వాలి అనుకుంటారు, వాళ్లు చెప్పేదే నచ్చుతుంది. తోటి స్నేహితులతో పోల్చుకుని వాళ్లలాగా చేస్తూ వుంటారు. ఇలా పోల్చుకుంటూ ఒత్తిడికి (peer pressure) గురియై కొన్నిసార్లు చెడ్డ అలవాట్లుకి లోనయ్యి మద్యం, మత్తుమందు లాంటి వాటికి కూడా అలవాటు పడుతూ వుంటారు.

టీనెజర్స్‌కి చదువు వల్ల వచ్చే ఒత్తిడితో పాటు, వాళ్లు ఎలా వున్నారు, సన్నగా వున్నారా, లావుగా వున్నారా, అందంగా కనపడుతున్నారా లేదా, అన్న విషయాలు గురుంచి ఆలోచనలు, ఇవే కాకుండా అమ్మ నాన్నల ఆశలు తీర్చాలి, నిరాశ పరచకూడదు అనే తపన కూడా ఉంటుంది. టీనెజర్స్ కి ఆ వయసులో ఎన్నో ఆలోచనలు, మనసులోనిభావాలు వల్ల ఒత్తిడిలకి గురి అవుతూ వుంటారు. కాబట్టి వీటిని సరిగ్గా సమతుల్యం చేసుకోలేకపోతే మానసిక సమస్యలుగా మారే ప్రమాదం ఉంటుంది.

పిల్లలు మా మాట వినటం లేదు, సరిగ్గా మాట్లాడటంలేదు, మేము అనుకున్న విధంగా ప్రవర్తించటం లేదు అని తల్లి తండ్రులకి కంగారు, భయం, అమ్మ నాన్నతో మాట్లాడాలి అంటే చికాకు, విసుగు. ఇలాంటప్పుడు మేము ఏమి చెయ్యాలి అని

చాలామంది తల్లితండ్రులు అడుగుతూవుంటారు. టీనేజర్స్‌కి ఆ వయస్సులో హార్మోన్స్ వల్ల తిండి మీద ద్యాస ఉండదు, సరిగ్గా నిద్రపోరు, కోపోద్రేకాలు ఎక్కువగా ఉంటాయి. టీనేజ్‌లో నిర్ణయాలు, ప్రణాళికలు చేసే ఫ్రంటల్ లోబ్స్ (frontal lobes) అనే మెదడులోని భాగం ఇంకా అభివృద్ధి చెందుతూ ఉండటం వల్ల వాళ్లు వాళ్ల భావాలని అదుపులో పెట్టుకోలేక కోపోద్రేకాలకి త్వరగా గురి అవుతూ వుంటారు. ఆ సమయంలో తల్లితండ్రులే కాస్త ఓపికతో వాళ్లతో వాదనకి దిగకుండా ఉండటం చాలా అవసరం. తమ స్వతంత్ర భావాలని పెద్దలు గుర్తిస్తూచాలి అని అనుకొనే వయస్సులో వాళ్లకి మనం ప్రేమతో జాగర్తలు చెప్పినా, అన్ని మర్చిపోకు అని గుర్తుచేసినా వాళ్లు తల్లి తండ్రులు తమ మీద గురి, నమ్మకం లేకపోవటం వల్ల, ఇంకా చిన్నపిల్లలుగా భావిస్తున్నారు అని తప్పుగా అర్థం చేసుకుని చిరాకు పడిపోతారు.

కొన్నిసార్లు పిల్లల సామర్థ్యాలు మించి, తల్లితండ్రులు వాళ్ల మీద వత్తిడి తెస్తూ వుంటారు. తాము సాధించలేనివి తమ పిల్లలు చేస్తే బావుండు అని ఆశించి వాళ్ల మీద ఒత్తిడి తేవటం, వాళ్లు చెయ్యలేకపోతే వాళ్లని కించపరచటం లాంటివి చేసినప్పుడు దాని ప్రభావం వాళ్లని వాళ్ల తల్లితండ్రుల నుంచి దూరం చెయ్యడమే కాకుండా అనవసరమైన మానసిక ఆందోళనకి కూడా గురి చేస్తాయి. ఇంకొన్నిసార్లు తల్లితండ్రులు పిల్లలకి అన్నీ సమకూర్చాలి అనే తాపత్రయంతో, వాళ్లకి అన్ని అమర్చి, వాళ్లు ఏ చదువులు చదవాలి, ఎక్కడ చదవాలి, ఎవరితో తిరగాలి లాంటి ప్రతి చిన్న విషయంలో కల్పించుకుని, వాళ్లే నిర్ణయాలు తీసేసుకుంటారు. ఇలాంటి తల్లితండ్రుల్ని 'హెలికాప్టర్స్ పేరెంట్స్' (helicopter parents) అంటారు, అంటే వాళ్లు పిల్లలకి ఏమి అవసరం వచ్చినవాళ్ల అడిగినా అడగకపోయినా వాళ్లే కల్పించుకుని సమస్య లని పరిష్కారించేసి అంతా అమర్చిపెట్టేస్తారు. కొన్ని కొన్నిసార్లు తల్లితండ్రులు కాలేజీ అడ్మిషన్స్ విషయాలలో పిల్లలకన్నా ముందు వీళ్లే వెళ్లి ప్రొఫెసర్స్‌తో మాట్లాడటం, మార్కులు సరిగ్గా రాకపోతే రికమెండేషన్లు పెట్టించటం, డబ్బు ఇచ్చి సీట్లు కొనటం లాంటివి కూడా చేస్తున్నారు. ఇలా చెయ్యటం వల్ల పిల్లలకి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే ఆలోచనాశక్తి తగ్గిపోతుంది. కొత్త పరిస్థితులలో మెలగటం రాక, ఒడిదుడుకులు తట్టుకునే ధైర్యం కోల్పోయి నిస్సహాయతకి గురవుతారు. పిల్లల భవిష్యత్తుకే కదా చేస్తున్నాము అని తల్లితండ్రులు అనుకుంటారు కానీ పిల్లల్ని వదిలి ఉండలేకపోవటం వల్ల వచ్చే సెపెరేషన్ ఆంగ్జయిటీ (separation Anxiety)తో వాళ్లని ఉక్కిరిబిక్కిరి చేస్తారు.

ఇవన్నీ ఉద్దేశంలో పెట్టుకుని తల్లితండ్రులే వాళ్లతో వాస్తవిక ఆకాంక్షలుతో (realistic expectations), ఇంకొకళ్లతో పోల్చకుండా, విమర్శించకుండా, తరచూ మాట్లాడుతూ, వాళ్ల బాగోగులు, స్కూల్ విషయాలు కనుక్కుంటూ, ధైర్యం చెపుతూ, అప్పుడప్పుడు వాళ్లు చేసిన పనులని కానీ, ప్రవర్తనని కానీ గుర్తించి ప్రశంసిస్తూ, మంచి సలహాలు ఇస్తూ ఉండాలి. వాళ్ల స్నేహితులు ఎవరు, వాళ్లు ఎవరితో తిరుగుతున్నారు అన్న విషయాలు ఒక కంట కని పెడుతూ ఉండాలి. టీనేజర్స్‌కి తమ సొంత ఆలోచనలతో, నిర్ణయాలని తీసుకోవాలని ఉంటుంది. మనము వాళ్ల ఆలోచన లని గౌరవించి, వాళ్ల మీద నమ్మకము ఉంచి, వాళ్లు చేసే ప్రయత్నాల్ని ప్రోత్సహిస్తూ ఉండాలి.

మనం ఒకటి గుర్తుకు పెట్టుకోవాలిసింది ఏమిటి అంటే పిల్లలు మనలని చూసి చాలా నేర్చుకుంటారు. అందుకని మనం వాళ్లకి ఆదర్శవంతులుగా ఉండాలి. చిన్నప్పటి నించి క్రమశిక్షణ, పౌష్టికారమైన ఆహార అలవాట్లు, నిజాయితీగా మెలగటం, అబద్ధాలు చెప్పకుండా ఉండటం, దాపరికాలు లేకుండా, సరదాగా వాళ్లతో మాట్లాడుతూ కాలక్షేపం చేస్తూ ఉంటే వాళ్లకి కూడా తల్లితండ్రులతో చనువు పెరిగి వాళ్ల మనసులో మాటలు చెప్పుకోవటానికి వెనకాడరు.

పిల్లలు అందరు ఒకేలాగ ఉండరు, రక రకాల మనస్తత్వాలు ఉంటాయి, అలాగే తల్లితండ్రులకి కూడా పిల్లల్ని ఎలా పెంచాలి అనే నిఘంటువు లేదు కాబట్టి, కాల మాన పరిస్థితులకి అనుగుణంగా అవసరమైతే నిపుణులు సహాయం తీసుకోవటానికి తల్లి తండ్రులు వెనకాడకూడదు. మార్గదర్శకులు, పెద్దలు, సంరక్షకులు, అధ్యాపకులు సహాయముతో తల్లితండ్రులు తమ టీనేజర్స్‌ని ప్రేమ, సానుభూతితో వాళ్లని మంచి మార్గంలో నడిపించి వాళ్ల ఉన్నతికి తోడ్పడాలి.

It takes a whole village to Raise a child- African Proverb.



పద్మజ నందిగామ ప్రముఖ మనస్తత్వ విశ్లేషకులు (సైకాలజిస్ట్). వివిధ రంగాల వృత్తుల్లో ఉన్నవారికి, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఆత్మస్థైర్యము మొదలైన అంశాలపై కోచింగ్ ఇస్తూ ఉంటారు. వీరి ప్రసంగాలు 'లైఫ్ మ్యాజింగ్స్' పేరున యూట్యూబ్ ఛానెల్‌లో ఉన్నాయి. వారి వెబ్‌సైట్ www.positive-living.us



ప్రేరణ

చెప్పాలని ఉంది... గుండె విప్పాలని ఉంది

జ్యోతి పిశుపాటి

ఆటిజం అంటే లోపమూ కాదూ, బలహీనతా కాదు. అది నరైన దారిలోకి మనోనిబ్బరంతో మార్చుకుంటే అదే బలం. ఆటిజం ఉన్న పిల్లల్లో ఏ ప్రతిభ దాగి ఉందో కనిపెట్టి, వారిని ఆ పథంలో బలంగా, ఉన్నతంగా తీర్చిదిద్దాలి.

అతనిదొక రంగుల ప్రపంచం.

దానికి తానే రారాజు... తన కోటే తన ఇల్లు.

ఆ ఇంట్లోనే తన కలల దారులు. అందులో ఉన్న అమ్మా, నాన్నా, తన అన్నే తన పరివారం.

ఎన్నో సమస్యలు, చుట్టూ ఎంతో వింతగా చూసే మనుషులు. కానీ ఆ విషయలేవీ తనకు తెలీని, అర్థం కాని చిన్నపిల్లాడి మనస్తత్వం. ఎందుకంటే అతనికి 'సివియర్ ఆటిజం' (Severe Autism). ఏ విషయాలూ తెలుసుకునే పరిణితి లేదు. అయితేనేం? సహజ సిద్ధంగా, జన్యుపరంగా వచ్చిన చిత్రకళని అది ఆపలేకపోయింది. చిత్రకళలో అంచెలంచెలుగా పరిణితిని సాధించగలుగుతున్నాడు. 'ఆటిజం'ను అధిగమించి ఎన్నో విజయాలు తన ఖాతాలో వేసు కుంటున్నాడు.

అందుకే అతను రారాజు.

అతను మరెవరో కాదు- మన 'హిమల్'.

అతని గురించి చెప్పాలని ఉంది... గుండె విప్పాలని ఉంది...

అంతకు ముందు... ఆ తరువాత...

హిమల్‌కి రెండేళ్ల చిన్న వయసులోనే 'ఆటిజం' అని గుర్తించారు. అప్పటినుండీ వారు పడిన ఆవేదన, ఆందోళనా వర్ణనాతీతం. చికిత్సలు ఇప్పటికీ వారి జీవితంలో ఒక భాగమే. మొదట్లో కాస్త అధైర్యపడ్డా నెమ్మదిగా తట్టుకుని నిలుచోడానికి ఆలంబనగా నిలిచిందీ 'చిత్రలేఖనం'.

ఏ పనీ చేయనివాడూ,ఏదీ అర్థం చేసుకోలేనివాడూ, చెంచా కూడా సరిగ్గా పట్టుకోలేనివాడూ, రంగులు వేసే కుంచె పట్టుకోగానే ఏదో తెలియని ఆనందం, ప్రశాంతత... ఎక్కడా నిలకడలేని వాడికి రంగులు కనపడగానే నిలకడగా ఉండటం చూసి ఆశ్చర్యపోవడం హిమల్ తల్లిదండ్రుల వంతైంది. ఏదో చేయాలన్న హిమల్ పట్టుదలని అర్థం చేసుకుని, అతనితో బొమ్మలు వేయించే ప్రక్రియ మొదలుపెట్టారు. తనతోపాటు కూర్చుని వాళ్ల అమ్మ బొమ్మలు వేస్తుంటే గమనించి అనుసరించడం, ఎక్కడయినా నచ్చిన బొమ్మ కనపడితే దానిని అనుకరించడం మొదలుపెట్టాడు.

ఇక్కడ మనం గొప్పగా చెప్పుకోవాల్సింది హిమల్ తల్లి సంధ్యగారి గురించి. శివాజీని అలనాడు అతని తల్లి జీజాబాయి తీర్చిదిద్ది నట్టు, హిమల్ సాధిస్తున్న విజయాల వెనక అతని తల్లి పట్టుదల, కృషి అటువంటివి. ఆటిజం గురించి లోతుగా తెలుసుకోడానికి కోర్సులు చేశారు. అంతేకాక చిత్రకళ నేర్పే దిశగా కూడా కోర్సులు చేశారు. అలా చిత్రకళలో మెళకువలూ, జీవితంలో ఎదగడానికి కావాల్సిన ప్రాథమిక విషయాలూ నేర్పుతూ అతని భవిష్యత్తుకు బంగారుబాట వేస్తున్నారు.

అంతకుముందు ఆటిజంతో ఎదుర్కున్న కష్టాలు ఆ తరువాత ఈ చిత్రకళ ప్రవేశంతో హిమల్ జీవితం ఎంతో మారిపోయింది.

అందాల ఆనందం ఇందేనయ్యా...



మొదట్లో హిమల్ చెట్లూ, పూలూ, కొండల మధ్య సూర్యుడూ లాంటి చిత్రాలను గీయడం అందరిలానే మొదలు పెట్టినా అంచలంచలుగా అద్భుత దృశ్యాలతో నిండిన పెద్ద పెద్ద చిత్రపటాలు గీయడంలో ఆరితేరాడు. రంగుల మేళవింపులో నిష్ణాతుడయ్యాడు. అతని ప్రతిభకు మెచ్చి జాన్ హాప్కిన్స్ (John Hopkins), సిబ్లీ మెమోరియల్ హాస్పిటల్ (Sibley Memorial Hospital) వారు అతని చిత్రపటాలను వాళ్ల గోడల మీద అలంకరించుకుంటున్నారు. ఇవే కాక ఫ్రెడ్డీ మాక్ (Freddie Mac), జోలాన్ టెక్ (Zolan Tech) లాంటి కంపెనీల్లో కూడా హిమల్ గీసిన చిత్ర పటాలు చూడచ్చు. వాల్ మ్యూరల్స్ (Wall Murals) వేయటంలో కూడా హిమల్ మంచి దిట్ట. వాళ్లింటికి వెళ్లిన వారెవరికైనా ఇది తెలిసిన విషయమే. ఫోర్ సీజన్స్ హోటల్లో (Four Seasons Hotel), ఇంకా జెఫెర్సన్ హోటల్లో (Jefferson Hotel) అతను గీసిన వాల్ మ్యూరల్స్ మనకు దర్శనమిస్తాయి.

హిమల్ మొదట్లో వేసిన బొమ్మల్నీ ఆ తరువాత వేసిన బొమ్మల్నీ పోల్చి చూసుకుంటే అతనిలోని పరిణితి మనకు కనిపిస్తుంది. ఆ పరిణితి తన బొమ్మల్లోనే కాదు తనకి తెలీకుండా తనలోనే చాలా మార్పులు తెచ్చింది. నిలకడ లేనివాడికి నిలకడ, శ్రద్ధ తెచ్చిపెట్టింది. ఇదేకాక తన భావప్రకటనల్లో వచ్చిన మార్పులు మనల్ని ఆశ్చర్యానికి గురి చేస్తాయి. అసలు మాట్లాడనివాడు కొన్ని పదాలని పలకడం, భావప్రకటనే చెయ్యనివాడు తాను వేసిన బొమ్మల్ని చూసి అది తనదే అని గుర్తుపట్టడం, దానితో అడిగి మరీ ఫోటో తీయించుకోడంలాంటి అందమయిన మార్పులు ఎన్నో... ఎన్నెన్నో...

హిమల్ వేసిన బొమ్మలు చాలమందికి నచ్చడం, కొంటామని ముందుకు రావడం లాంటి సందర్భాలు- అతని తల్లి దండ్రులు 'జెనవివ్' (Zenaviv) అనే సంస్థ మొదలుపెట్టడానికి కారణాలయ్యాయి. ఆ పేరు పెట్టడంలో ముఖ్యపాత్ర అతని అన్న 'సాకేత్'దే... హిమల్ లాగానే మరికొంతమంది ఆటిజం ఉన్న పిల్లల్లోని చిత్రకళా ప్రతిభను ముందుకు తీస్కెళ్లాలన్న కోరికతో ఎంతోమంది జాతీయ, అంతర్జాతీయ పిల్లలను వారి సంస్థలో చేర్చుకుని, ఆ పిల్లల ఆత్మవిశ్వాసాన్నీ, ప్రతిభనూ పెంచుతున్నారు. పలుచోట్ల ఈ చిత్రపటాల ప్రదర్శన ద్వారా వచ్చే డబ్బుని ఆ పిల్లల ఆర్థిక అవసరాలకి, వారి వైద్య ఖర్చులకీ, వారి భవితవ్యానికీ పంచుతూ తమ వంతు కృషి చేస్తున్నారు. ఒక్క ప్రదర్శనలే కాక వారి చిత్రాలతో నిండిన మాగ్నెట్స్, క్యాలెండర్స్, బ్యాగులు, మగ్స్ లాంటి వస్తువులను తయారుచేసి ఎన్నో సంస్థలకు అమ్ముతున్నారు. జెనవివ్ అభివృద్ధికి వినియోగిస్తున్నారు. హిమల్ తో పాటు అందరి జీవితాలకీ ఒక అర్థం చేకూరుస్తున్నారు.

అందాల ఆనందం ఇందేనని తెలుసుకున్నారు.

జయమ్ము నిశ్చయమ్మురా...

ఆటిజం అంటే లోపమూ కాదూ, బలహీనతా కాదు. అది సరైన దారిలోకి మనోనిబ్బరంతో మార్చుకుంటే అదే బలం అని చాటి చెప్పారు హిమల్ తల్లిదండ్రులు... ఆటిజం ఉన్న పిల్లల్లో ఏ ప్రతిభ దాగి ఉందో కనిపెట్టి, వారిని ఆ పథంలో బలంగా, ఉన్నతంగా తీర్చిదిద్దాలని చెప్తుంటారు. ఇలా వారు చెప్పడమే కాదు, నమ్మి ఆచరించి నిరూపించారు కూడా! ఇలాంటి తల్లి దండ్రుల అండదండలతో ఎదుగుతూ,మానసికంగా తనను తాను తెలుసుకుంటూ, తాను ఏమిటో నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నాడు మన హిమల్... రాబోయే కాలంలో హిమాలయాలంత ఉన్నతంగా నిలవాలనీ, అంతటి మనోనిబ్బరం పెంపొందాలనీ మనందరం ఆకాంక్షిద్దాం. మన హిమల్ కి అభినందనలు తెలియజేద్దాం.

కష్టాల్లోంచే ఆలోచనలొస్తాయి
ఆ ఆలోచనల్లోంచే అభిప్రాయాలు స్థిరపడతాయి
ఆ అభిప్రాయాలే మనకు ఆత్మవిశ్వాసాన్నిస్తాయి
ఆ ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తేనే
జయమ్ము నిశ్చయమురా !
దీనికి నిలువెత్తు నిదర్శనమే 'హిమల్' కుటుంబం.



జ్యోతి పీఠంపాటి అప్పుడప్పుడూ రచనలు చేస్తుంటారు. వృత్తిరీత్యా లెక్కల ఉపాధ్యాయురాలైనా ప్రవృత్తిరీత్యా తెలుగు భాష మీద మక్కువతో Ashburn,Virginiaలో తెలుగు తరగతులు కూడా నిర్వహిస్తుంటారు.



తెలంగాణ సాహిత్య అకాడమి ప్రస్థానం

డా॥ ఏనుగు నరసింహారెడ్డి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ సాహిత్య అకాడమి తొలిసారిగా అస్తిత్వంలోకి వచ్చింది. దాని నిర్వహణలో ప్రపంచ తెలుగు మహాసభలు హైదరాబాదులో అంగరంగ వైభవంగా జరిగాయి. దానితో పాటు అనేక పుస్తకాలు ప్రచురించారు. వడివడిగా అడుగులేస్తున్న సాహిత్య అకాడమి ప్రస్థానం...

భారతదేశమనే భావన మొదటి నుండీ ఉన్నప్పటికీ తొలి చారిత్రక యుగంలో పాటలీపుత్రం కేంద్రంగా ఉన్న భారతదేశం విస్తృతి మనకు స్పష్టంగా తెలియదు. ఆంగ్లేయుల ఆగమనంతో బెంగాల్ కేంద్రిత రాజకీయాలు మొదలయ్యాయి. 1757లో ప్లాసీలో సిరాజుద్దౌలా ఓటమి మొదలుకొని భారత రాజకీయాలన్నీ బ్రిటిష్ వాళ్లకు, స్వదేశీ రాజులకు మధ్య సంబంధాల చరిత్రగానే గుర్తించబడ్డాయి. అలా కలకత్తా ఆధునిక భారతదేశానికి శక్తి కేంద్రమయింది. స్వాతంత్ర్యం రాకముందు భారతదేశపు రూపు రేఖలు నిరంతరం మారుతూ ఉండేవి. అందులో బ్రిటిష్ ఇండియా నిరంతరం విస్తరిస్తూ పోతుండగా స్వదేశీ రాజవంశాల పాలన కుంచించుకుపోతూ వచ్చింది. సిపాయి తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ పాలన స్థిరపడినప్పటికీ భూభాగం విషయంలో స్వతంత్ర రాజ్యాలకూ బ్రిటిష్ ఇండియాకు సరిహద్దు సమస్యలుండేవి. చాలా సార్లు ఇద్దరూ క్లెయిమ్ చేసే భూభాగాలుండేవి. స్వదేశీరాజులది చాలాచోట్ల అర్ధాధికారం కొనసాగుతుండేది. కారణాలు, చోదకశక్తులు ఏవైనా స్వాతంత్ర్యంతో పాటు దేశ విభజన జరిగింది. భారతదేశం భౌగోళికంగా ఒక స్థిరమైన రూపానికి వచ్చింది. హైద్రాబాద్, కాశ్మీరు సంస్థానాల సమస్యలున్నా చాలావరకు పరిష్కారమైపోయిన తర్వాత పలు మతాలు, భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలున్న భారత్‌లో భిన్నత్వాన్ని కాపాడుకుంటూ ఏకత్వం కోసం ప్రయత్నించాలని స్వతంత్ర భారతం తొలితరం నాయకులు భావించారు. అందుకుగానూ సంస్కృతిని, సాహిత్యాన్ని కాపాడే సంస్థలుండాలని కోరుకున్నారు. అలా ఢిల్లీ పాలకులు అకాడమీలకు రూపకల్పన చేసారు. తొలి ప్రధాని నెహ్రూ లాంటి దార్శనికుల చొరవతో అకాడమీలు ప్రభుత్వ శాఖలుగా కాక స్వతంత్ర అస్తిత్వమున్న సంస్థలుగా (Autonomus Bodies) వాటిని నిర్మించారు. కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయా రాష్ట్రాలలోని ప్రభుత్వాలు కూడా అకాడమీలను ఏర్పాటు చేసాయి.

అలా ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా స్వతంత్ర అస్తిత్వంతో నడిచే వెసులుబాటు ఇస్తూ అకాడమీలు ఏర్పరచింది. 1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఏర్పడింది. అత్యంత గౌరవప్రదమైన సంస్థగా గణనకెక్కింది. ఆంధ్ర రాష్ట్ర ముఖ్య మంత్రిగా పనిచేసిన అనంతరం బెజవాడ గోపాలరెడ్డి తిరిగి సాహిత్య అకాడమి అధ్యక్షులుగా పనిచేయడం దాని గౌరవానికి ఒక ఉదాహరణ. దాదాపు మూడు దశాబ్దాలు వివిధ సాహిత్య కార్యక్రమాలు నిర్వహించి సారస్వత సేవ చేసిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి 1984లో ఇతర అకాడమీలతో పాటు రద్దయింది.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో సాహిత్యం నిర్వహించిన భూమిక గొప్పది. తక్షణ రాజకీయ కారణాలతో నాయకులు

స్ఫూర్తి కోల్పోయినప్పుడల్లా ఇక్కడి కవిత్వం, పాట, కథనం తిరిగి పోరాటానికి సమాయత్త పరుస్తూ వచ్చింది. ప్రజల్లో రాష్ట్ర ఆకాంక్షను ఆరిపోనివ్వని దీపంగా వెలిగించింది. సబ్బండ వర్ణాలలో స్వరాష్ట్రానికి ప్రత్యామ్నాయాలు లేనేలేవని ఒక స్పష్టమైన, తిరుగులేని అభిప్రాయాన్ని స్థిరపరిచింది సాహిత్యకారులే. ఉద్యమకారుడైన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆ సంగతి తెలుసు. సాహిత్యం విలువ బాగా తెలిసినవాడు ఆయన. ఆ అవగాహనతోనే సాహిత్యస్ఫూర్తి నిరంతరం రగిలిస్తూ ఉండగలిగే సాహిత్య అకాడమిని ఏర్పాటుచేశారు. 2 మే, 2017 రోజున ఇతర అకాడమీలతో పాటు తెలంగాణ సాహిత్య అకాడమి పునరుద్ధరించబడింది. అదేరోజు తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన సుప్రసిద్ధ కవి డా॥ నందిని సిధారెడ్డిని అకాడమి చైర్మన్‌గా నియమించారు ముఖ్యమంత్రి. ప్రపంచ తెలుగు మహాసభల ఏర్పాట్లు ముమ్మరంగా జరగవలసిన సందర్భంలో 3 నవంబర్ 2017న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డా॥ ఏనుగు నరసింహారెడ్డిని అకాడమి కార్యదర్శిగా నియమించింది ప్రభుత్వం. సాహిత్యమే జీవితంగా ఎంచుకున్న ప్రసిద్ధ కవి నందిని సిధారెడ్డి ఆధ్వర్యంలో అకాడమి అనేక స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు నిర్వహించింది.

ప్రపంచ తెలుగు మహాసభలు

అకాడమి ఆవిర్భావానందం నుండి తేరుకోకముందే ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించాలని తెలంగాణ సాహిత్య అకాడమికి సూచించారు ముఖ్యమంత్రిగారు. తెలుగు ప్రజల ఆకాంక్షలను తెలంగాణ ప్రజల ఉద్వేగాలను దృష్టిలో ఉంచుకొని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఆహ్వానించి 2017 డిసెంబర్ 15 నుండి 19 వరకు హైద్రాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలను అంగరంగ వైభవంగా నిర్వహించింది సాహిత్య అకాడమి. భారత రాష్ట్రపతి కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారలు హాజరై ఈ సభలకు వినూత్న శోభ తెచ్చారు. ప్రపంచవ్యాప్తంగా 10 వేలకు పైగా నమోదు చేసుకున్న ప్రతినిధులు హాజరైన అపూర్వ ఘట్టమది. ప్రతినిధులందరికీ వసతి, భోజనాలు ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ శాఖలన్నీ మనస్ఫూర్తిగా పనిచేశాయి. తొమ్మిది వేల వరకు హోటల్ గదులను ఏర్పాటుచేయడం ఒక రికార్డు. వేలాదిమంది కవులు, కళాకారులు తమ ప్రదర్శనలిచ్చి మెప్పించారు. ప్రధాన వేదిక లాల్ బహదూర్ స్టేడియంలో ప్రతిరోజూ లక్షలాదిమంది ప్రేక్షకులు ఇష్టంగా వచ్చి ప్రదర్శనలు తిలకించారు. రవీంద్రభారతి, తెలుగు విశ్వవిద్యాలయ ఆడిటోరియం, సారస్వత పరిషత్తు, ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియం సాహిత్యకారులతో క్రిక్కిరిసిపోయింది. ప్రధానవేదిక మీద ముఖ్యమంత్రి ప్రసంగం తెలుగు ప్రజలందరికీ గుర్తుండిపోయింది.

కావ్య పరిమళం

ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం దగ్గర నుండే తెలంగాణ సాహిత్యం నిరాదరణకు గురయింది. ఒక్క పోతన్న, ఆధునిక



కవులలో దాశరథి, సినారెలను తప్ప తక్కిన సాహిత్యాన్ని ఆంధ్ర పాలకులు పట్టించుకోలేదు. ఈ విషయం మలిదశ ఉద్యమ సందర్భంలో విస్తృతంగా చర్చకొచ్చింది. రాం సిద్ధించి, అకాడమి ఏర్పడిన తర్వాత తెలంగాణ కావ్యాల లోతుల్ని సామాన్యులకు కూడా తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి మాసం రెండవ శుక్రవారం కావ్య పరిమళాన్ని నిర్వహించింది అకాడమి. విషయ నిపుణుల చేత ఒక గంట నిడివి ఉపన్యాసాలను ఏర్పాటుచేసింది అకాడమి. ప్రాచీన కావ్యాలలో పాల్కురికి సోమనాథుని 'బసవ పురాణం' పై ఆచార్య అనుమాండ్ల భూమయ్య, గోనబుద్ధారెడ్డి 'రంగనాథ రామాయం' పై ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, పోతన 'శ్రీ మద్భాగవతం' పై డా॥ గన్నమరాజు గిరిజా మనోహరబాబు, కొఱవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక' పై శ్రీ రంగాచార్య, చరిగొండ ధర్మన్న 'చిత్ర భారతం' పై డా॥ సంగనభట్ల నరసయ్య, పొన్నగంటి తెలగనార్య 'యయాతి చరిత్ర' పై ఆచార్య రవ్వా శ్రీహరి విశేషమైన ప్రసంగాలు చేసి సాహిత్య ప్రేమికులను ఆకట్టుకున్నారు. ఆధునిక కావ్యాలలో గంగుల శాయిరెడ్డి 'కాపు బిడ్డ' పై డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, పల్లా దుర్గయ్య 'గంగిరెద్దు' పై డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి, వానమామలై జగన్నాథాచార్యుల 'రైతు రామాయణం' పై డా॥ గండ్రా లక్ష్మణ్ రావు, కాళోజీ 'నా గొడవ' పై డా॥ తూర్పు మల్లారెడ్డి, దాశరథి 'అగ్నిధార' పై దేశపతి శ్రీనివాస్, డా॥ సి. నారాయణరెడ్డి 'నాగార్జున సాగరం' పై ఆచార్య టి. గౌరీశంకర్ ప్రసంగించారు. ఈ పన్నెండు ప్రసంగాలు నేరుగా హాజరై వినలేని సాహిత్యాభిమానుల కోసం ప్రసంగాల పూర్తి నిడివి వీడియోలను యూట్యూబ్‌లో ఉంచడం (Uplaod) జరిగింది. అలా దేశ విదేశా సాహిత్య మిత్రులు వీటిని చూసి ఉపయోగం పొందుతున్నారు.

నవలా స్రవంతి

తెలంగాణ ప్రసిద్ధ నవలలపై అకాడమి ప్రసంగాలు ఏర్పాటు చేసింది. ప్రతినెల రెండవ శుక్రవారం ఒక నవల మీద విశేషజ్ఞులతో ప్రసంగం ఉంటుంది. ఇప్పటివరకు వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి' పై ఎన్. వేణుగోపాల్, దాశరథి రంగాచార్య

'మోదుగుపూలు' పై అంపశయ్య నవీన్ ప్రసంగించారు. వీటిని దూరప్రాంతాల వాళ్లు యూట్యూబ్‌లో చూడవచ్చు.

అరుదైన గ్రంథాల ప్రచురణ

తెలంగాణ ప్రాంతం నుండి వచ్చిన విలువైన పుస్తకాలను ప్రచురించాలని, వాటిని అందుబాటు ధరల్లో ప్రజలకు విక్రయించాలని సంకల్పించింది. ఈ గ్రంథాలలో పరిశోధన పత్రాలు, సెమినార్ పేపర్లు, కవిత్వం, కథ, నవల, చరిత్ర గ్రంథాలు కూడా ఉన్నాయి. ఇప్పటివరకు అకాడమి 60 గ్రంథాలు ప్రచురించింది.

అనువాదాలు

ఇతర భాషా సాహిత్యాలతో ఎంతోకొంత తెలుగు ప్రభావిత మయింది కానీ తెలంగాణ సాహిత్యం ఇతర భాషల వారికి తెలిసే అవకాశం తక్కువ. అనేక సంఘటనలు, పోరాటాలు, ఉద్యమాలను ఇక్కడి సాహిత్యం రికార్డు చేసింది. అది ఇతర భాషల్లోకి అనువదించి వారికి అందుబాటులోకి తేవాలని అకాడమి భావించింది. తెలంగాణ ప్రాతినిధ్య కవిత్వాన్ని, కథల్ని ఎంపిక చేసి హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదించే కార్యక్రమాన్ని అకాడమి చేపట్టింది. కొద్దిరోజుల్లో ఈ అనువాదాల ద్వారా ఇతర భాషీయులకు తెలంగాణ కవిత్వం, కథ అందుబాటులోకి రానుంది.

సాహిత్య చరిత్రల రచన

తెలుగు సాహిత్యచరిత్ర నిర్మాణంలో తెలంగాణ సాహిత్యం సరియైన విధంగా రికార్డు చేయబడలేదన్న వాస్తవాన్ని అకాడమి గుర్తించింది. అందుకోసం 'తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర' రచన కోసం ప్రాజెక్టును ప్రారంభించడం జరిగింది. తెలంగాణ పదిజిల్లాలు పరిపాలనా సౌకర్యార్థం 33 జిల్లాలుగా పునర్విభజించబడ్డాయి. కొత్త జిల్లాలన్నింటికీ జిల్లా సాహిత్యచరిత్రలు రాయించడం మొదలుపెట్టింది అకాడమి. కొన్ని జిల్లాలకు సాహిత్య చరిత్ర రాయడం, ప్రచురించడం జరిగింది.

సదస్సులు, శిక్షణా శిబిరాలు

సాహిత్యాన్ని లోతుగా విశ్లేషించడం కోసం సదస్సులు, రచనాకౌశలానికి పదును పెట్టుకోవడం కోసం ఆసక్తితో ముందుకు వచ్చిన సంస్థలకు సౌజన్యాన్ని అందించింది అకాడమి. అకాడమి సహకారంతో యూనివర్సిటీల తెలుగు శాఖలు, డిగ్రీ కాలేజీలు, ఇతర సాహితీ సంస్థలు కార్యక్రమాలు నిర్వహించాయి.

వివిధ సాహిత్య సంస్థలు, విశ్వవిద్యాలయాల తెలుగు శాఖలు, డిగ్రీ కాలేజీల తెలుగు విభాగాల సహకారంలో సదస్సులు, కార్యశాలలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమాలు ఇతర సంస్థలతో కలిసి నిర్వహించడమే కాకుండా అకాడమి స్వంతంగా కూడా శిక్షణాశిబిరాలు, సదస్సులు నిర్వహించింది. 2018 ఫిబ్రవరి 8,9 తేదీలలో ఔత్సాహిక రచయితలకు కథ, నవల, కవితారచనలో శిక్షణాశిబిరం నిర్వహించింది. 2018 ఫిబ్రవరి 21న ప్రపంచ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించింది. 2018 జూలై 22 నుండి 29 వరకు దాశరథి, సినారెల జన్మదినోత్సవాల సందర్భంగా కవితా సప్తాహం నిర్వహించి ప్రతిరోజూ ఒక ప్రసంగం, డజను మంది కవుల కవితాగానం నిర్వహించబడింది. ఇవేకాకుండా ప్రసిద్ధ కవులు, రచయితల జన్మదినోత్సవాలను, వర్ధంతులను నిర్వహిస్తూ వారి రచనలను స్మరించుకోవడం ద్వారా వర్తమాన రచయితలకు స్ఫూర్తినివ్వడానికి ప్రయత్నిస్తుంది తెలంగాణ సాహిత్య అకాడమి.

అవార్డులు, ప్రోత్సాహకాలు

పరిశోధన, ప్రచురణ, అనువాదం, ప్రోత్సాహకాలు లక్ష్యంగా పనిచేస్తున్న అకాడమి నవలారచనను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో నవలల పోటీ నిర్వహించింది. అకాడమి ఆశించిన స్థాయి రచనలు రానందువల్ల ఐదు నవలలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరిగింది. 2019 సంవత్సరం నుండి కవిత్వం, వచన రచన విభాగాలలో సాహిత్య అకాడమి పురస్కారాలను ఇవ్వడం ప్రారంభించింది. 2019 సంవత్సరానికిగాను సిద్ధార్థ 'బొమ్మలబాయి'కి కవిత్వ విభాగంలో, ఉప్పల నరసింహం 'మట్టిమనిషి' కథల సంపుటికి వచనరచన విభాగంలో సాహిత్య అకాడమి పురస్కారాలను అందజేసింది.

పునాస

అకాడమి 'పునాస' సాహిత్య త్రైమాసికను ప్రచురిస్తుంది. ప్రామాణిక రచనలకు స్థానం కల్పించడం కోసం 2018 అక్టోబర్ నుండి ఈ పత్రిక ప్రారంభమయింది.

ప్రచురణ, పరిశోధనతో పాటు అనువాదాలు, సదస్సులు, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తూ తెలంగాణ సాహిత్యాన్ని భవిష్యత్తు దిశగా ప్రయాణం చేస్తుంది అకాడమి.



ప్రధానంగా కవి, వ్యాసకర్త అయిన ఏనుగు నరసింహారెడ్డి వృత్తిరీత్యా తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి. ఐదు కవితా సంపుటాలు, రెండు వ్యాససంపుటాలు ప్రచురించారు. నివాసం హైదరాబాదు.



సినిమా కబుర్లు

తెలుగు సినిమాని మలుపు తిప్పిన దశాబ్దం 2008-2018

వెంకట్ శిద్ధారెడ్డి

దశాబ్ద కాలంగా తెలుగు సినిమా నూతన దృక్పథాన్ని అలవరచుకుంది. కొత్త దర్శకులు కొత్త ఆలోచనలతో, ఊహలతో చలనచిత్రాలు నిర్మిస్తున్నారు. కమర్షియల్ హంగుల సినిమాలతో పోటీ పడలేకపోయినా ఈ దశాబ్దపు కొత్త తరం సినిమాలు తెలుగు సినిమా రంగాన్ని మలుపు తిప్పగలవని రుజువు చేస్తున్నాయి.

తెలుగు సినిమా ఇప్పుడు కొత్త ఆశలతో చిగురిస్తోంది. అంతా మన మంచికే.

"It was the best of times, it was the worst of times"

సినిమాలంటే ఇష్టంలేని తెలుగువాళ్లని నేను ఇంతవరకూ కలవలేదు. సినిమా మొదలైన నిమిషం నుంచీ, చివరి వరకూ లైవ్ అప్డేట్స్ అంటూ రన్నింగ్ కామెంట్రీ ఇచ్చే స్థాయికి మన ఫ్యాన్స్ ఎదిగిపోయారు. ఇలాంటి పరిస్థితి నేనెక్కడా చూడలేదు. ప్రపంచంలో అన్ని దేశాల్లో సినీ ప్రేమికులుంటారు కానీ, తెలుగువాళ్లంత సినిమా పిచ్చోళ్లని నేనెక్కడా చూడలేదు. మరీ అంతకాకపోయినా నేనూ పెద్ద సినిమా పిచ్చోడినే. గత పదిహేనుళ్లుగా రోజుకొక సినిమా అయినా చూడకుండా ఉన్న రోజులు చాలా తక్కువ అని చెప్పాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ, సినిమాలు చూస్తూ, సినిమా రివ్యూలు రాసుకుంటూ ఉన్న నాకు 2008లో ఒకరోజు జ్ఞానోదయం అయింది. సినిమాలు చూడడం కాదు. సినిమా నిర్మాణంలో నేనూ ఒక భాగం కావాలనుకున్నాను. 2009లో ఇండియా వచ్చేశాను. ఇప్పటికి దాదాపు పది సంవత్సరాలయింది, ఈ పదేళ్లలో తెలుగు సినిమా పరిశ్రమను అతిదగ్గరగా చూసిన వాడిగా నేను పంచుకోవాలనుకుంటున్న కొన్ని అనుభవాలు, జ్ఞాపకాలు ఇవి.

2008లో నేను UKలో ఉన్నాను. ఎప్పుడో పెద్ద హీరోల సినిమాలు తప్పితే అన్ని సినిమాలు అక్కడ రిలీజ్ అయ్యేవి కావు. అది కూడా నేనుండే ఊరి నుంచి లండన్ వెళ్లి సినిమా చూసి రావడమంటే పెద్ద పని. ట్రావెల్, టైం, మనీ ఇలా ఎన్నో విషయాలకు ముడిపడి ఉన్న అంశం అది. అంత కష్టపడి వెళ్లి సినిమా చూసొచ్చాక కలిగిన నిరాశను ఏ కొలతల్లో చెప్పాలో తెలియదు కానీ, ఒక రకమైన వైరాగ్యస్థితిలోకి వెళ్లిపోయేవాడిని. వైరాగ్య స్థితి అని ఎందుకంటున్నానంటే, కేవలం వైరాగ్యం వల్ల మాత్రమే మనిషిలో కోరికలు నశించి విముక్తి పొందగలుతాడు కాబట్టి. కానీ ఆ స్థితిలో నుంచి బయటకు రావడానికి ఇట్టే టైం పట్టేది కాదు. అందుకు కారణం కూడా సినిమానే. 2007లో నాకు లండన్ చలన చిత్రోత్సవంలో అక్రెడిట్ ప్రెస్ మెంబర్‌గా సినిమాలు చూసే అవకాశం వచ్చింది. అక్కడ చూసిన కొన్ని సినిమాల ద్వారా కొత్త సినిమా ప్రపంచానికి దారులు తెరుచుకున్నాయి. ఇప్పుడంటే నెట్ ఫ్లిక్స్‌లో ఆన్‌లైన్‌లో సినిమాలు చూడొచ్చు కానీ, ఆ రోజుల్లో నెట్ ఫ్లిక్స్ అంటే నెలకు ఎన్ని కావాలంటే అన్ని డివిడిలు ఇంటికి తెప్పించుకునే ఒక రెంటల్ సర్వీస్. అలా నెట్‌ఫ్లిక్స్‌లో తెప్పించుకున్న ప్రపంచ సినిమా చూస్తూ వైరాగ్యస్థితి నుంచి బయటపడేవాడిని. అంతే కాకుండా అప్పట్లో విడుదలైనా కొన్ని హిందీ సినిమాలు ఏ వెనెస్ డే, రాక్ ఆన్, ఓయ్ లక్కీ ఓయ్, ముంబై మేరీ జాన్, ఆమీర్

లాంటివి చూసి కొంత ఆశావాదాన్ని పెంపొందించుకునేవాడిని. అదంతా మరో తెలుగు సినిమా చూసేవరకే. ఛార్లెస్ డికెన్స్ మాట ల్లో చెప్పాలంటే "It was the best of times, it was the worst of times."

ఆ సమయానికి ప్రపంచ సినిమాలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పటివరకూ హాలీవుడ్ తీసే ఇంగ్లీష్ సినిమాలు తప్పితే మిగిలిన దేశాల సినిమాలు ఇతరులకు అందుబాటులో ఉండేవి కావు. కానీ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్, టొరెంట్ టెక్నాలజీల కారణంగా అందరికీ ప్రపంచ సినిమా దగ్గరైంది, రొమానియా దేశపు సినిమా పరిశ్రమ గురించి ఏ మాత్రం పరిచయం లేకపోయినా, 2008 లో వచ్చిన ఫోర్ మంత్స్ త్రీ వీక్స్, టు డేస్ సినిమాతో ప్రపంచం మొత్తం ఒక్కసారిగా రొమానియన్ సినిమా వైపు దృష్టి సారించింది. అదొక్కటే కాదు. అంతకుముందు సంవత్సరాల్లో వచ్చిన కొన్ని సినిమాలు సినీ ప్రేమికులను ఆయా దేశాల సినిమాల మీద దృష్టి సారించేలా చేశాయి. మనదేశంలో కూడా బాలీవుడ్, తమిళ్, మలయాళం, మరాఠీ, బెంగాలీ సినీ పరిశ్రమలో కొత్త దర్శకులు రావడంతో పాటు, కొత్త రకమైన సినిమాలు రావడం మొదలుపెట్టాయి. కానీ తెలుగు సినిమా మాత్రం ఒక మూసలో ఇరుక్కునిపోయి ఒకే రకమైన సినిమాని మళ్లీ మళ్లీ తీయడంలో మునిగిపోయుంది. ప్రపంచం మొత్తానికి it was the best of times. కానీ తెలుగు సినిమాకి worst of timesలా అనిపించేది.

దిశమార్చిన గమ్యం-2008

అయితే ఎక్కడో లైట్ ఎట్ ది ఎండ్ ఆఫ్ ది టనెల్‌లాగా శేఖర్ కమ్ముల, చంద్రశేఖర్ ఏలేటి లాంటి ఒకరిద్దరు దర్శకులు మాత్రం కొంత ప్రయత్నం చేస్తూ ఉండేవారు. కమర్షియల్ సినిమా పరిధిలో సుకుమార్, రాజమౌళి లాంటి కొంతమంది దర్శకులు



కొత్త హంగులు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తూ ఉండేవారు. ఇలాంటి సమయంలో క్రిష్ దర్శకత్వంలో వచ్చిన 'గమ్యం' (2008) సినిమా తెలుగు సినిమా గతిని మార్చే సినిమా అవు తుందని ఆరోజు ఎవరూ అనుకుని ఉండరు. అమెరికాలో చదువు కుని, అక్కడ ఉద్యోగం చేసుకుంటూ ఇండియాకి తిరిగివచ్చి సినిమాలు తీయాలనుకునే వారి సంఖ్య అప్పటికే చాలా ఎక్కువ ఉన్నప్పటికీ, ఆలోచనని ఆచరణ రూపంలోకి తెచ్చిన మొదటి వాళ్లలో క్రిష్ ఒకడు. అదే సంవత్సరంలో వచ్చిన 'అష్టా చెమ్మా' సినిమా కూడా తెలుగు సినిమా ప్రయాణిస్తున్న దిశని మార్చే సినిమాగా మనం పేర్కొనవచ్చు. విదేశాలలో సినిమా కళను అభ్యసించి, ఇండియాకి తిరిగొచ్చి సినిమాలు తీయాలనుకున్న తెలుగువాళ్లలో అప్పటికి శేఖర్ కమ్ముల ఒక్కరే ఉండేవాళ్లు. 'అష్టా చెమ్మా' సినిమాతో మోహన్ కృష్ణ ఇంద్రగంటి ఆ లిస్ట్‌లో రెండవ దర్శకుడయ్యాడు.

అంతే కాకుండా, ఐఐఎంలో చదువుకుని సురేష్ ప్రొడక్షన్స్, యూటివి లాంటి సంస్థల్లో పనిచేసిన అనుభవంతో రాంమోహన్ అనే నూతన నిర్మాత పూర్తిగా కొత్తవాళ్లతో నిర్మించిన 'అష్టా చెమ్మా' హిట్ కావడం ఒక కొత్త పరిణామం. ఇప్పుడొచ్చిన 'జెర్సీ' సినిమా చూస్తుంటే 'అష్టా చెమ్మ' సినిమా ద్వారానే కదా తెలుగు సినిమాకి నానిలాంటి అద్భుతమైన నటుడు పరిచయమైంది అని గుర్తుంచుకోవాలి. ఆ సంవత్సరంలోనే జరిగిన మరొక వినూత్న ప్రయత్నం, సాయికిరణ్ అడవి దర్శకత్వంలో వచ్చిన 'వినాయకుడు' సినిమా. 2008లో విజయవంతం అయిన ఈ మూడు సినిమాలు ఆ తర్వాత కాలంలో తెలుగు సినిమాని ఎంతో ప్రభావితం చేశాయి. ఆ సంవత్సరంలో వచ్చిన 'ఆవకాయ బిర్యాని (అనీష్ కురువిల్లా)' , 'నచ్చావులే (రవిబాబు)', 'కొత్తబంగారు లోకం (శ్రీకాంత్ అడ్డాల)' లాంటి కొన్ని సినిమాలు మార్పుకి స్వాగతం పలికినట్టుగా అనిపించాయి.

మగధీర ప్రభావం - 2009

మూస పద్ధతిలో కొట్టుకుపోతున్న తెలుగు సినిమా గురించి మాట్లాడినప్పుడల్లా అవతలి వైపు నుంచి వచ్చే సమాధానం ఒక్కటే , సినిమా అంటే వ్యాపారం. డబ్బులు పోగొట్టుకుని ఎవరూ కళని పోషించలేరు అని. అయితే కమర్షియల్ సినిమాని పూర్తిగా ఆపేసి కళాత్మకమైనా సినిమాలే రావాలని ఎవరూ అనరు. వినోదాన్ని ఎవరు కోరుకోరు? కానీ ఎంత మూల్యానికి. చెప్పిన కథే చెప్పడం. అంతకుముందు హిట్ అయిన సినిమానే రీమిక్స్ చేయడమే ప్రేక్షకుల అసహనానికి కారణం. కమర్షియల్ సినిమాలు ఉండాలి. అందులో ఉండాల్సిన మసాలాలు అవీ ఉండాలి. కానీ వాటితో పాటు అప్పుడప్పుడూ మనసుకి హత్తుకునే కథలూ కావాలి. కొంత సామాజిక స్పృహ ఉన్న సినిమాలు రావాలి. ఒక దర్శకుడు తను అనుకున్న కథను ఉన్నదున్నట్టుగా చెప్పే అవకాశమూ ఇవ్వాలి. కళ-వ్యాపారం రెండూ బ్యాలెన్స్ కావాలనేదే చాలామంది కోరు కునేది. తమిళ్, మలయాళం, హిందీ సినిమాల్లో రెండు రకాల సినిమాలకీ అవకాశం ఉంటుంది. తెలుగులోనే ఏ మాత్రం



కళాత్మక అంశాలున్నా ఆర్ట్ సినిమా అని కొట్టి పారేసే సమయం అది. అంతేకాకుండా 'అరుంధతి', 'మగధీర' లాంటి రెండు పెద్ద సినిమాలు భారీ విజయం సాధించడమే కాకుండా భారతదేశ మంతా తెలుగు సినిమావైపు చూసేలా చేశాయి. గ్రాఫిక్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాలు తెలుగు సినిమాకి ఒక ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి. ఇలాంటి సమయంలో కూడా చైతన్య దంతులూరి దర్శకత్వంలో వచ్చిన 'బాణం (చైతన్య దంతులూరి)' సినిమా కొత్త రకం సినిమాగా అందరి దృష్టిని ఆకర్షించింది.

మహా ప్రస్థానం - 2010

ఎవరో కొద్దిమంది దర్శకులు మాత్రమే కొత్త తరహా సినిమాల వైపు చూస్తున్న రోజులవి. ఒకవైపు తమిళ్‌లో శశికుమార్, సముద్రఖని లాంటి దర్శకులు తీసిన 'సుబ్రమణ్యపురం', 'నాడోడిగల్' సినిమాలతో ఒక కొత్త శకం మొదలైపోయింది. గౌతం మీనన్ అప్పటికే ఎన్నో మంచి సినిమాలు తీశారు. 'అంగాడి తెరు', 'అరణ్యకాండం', 'మైనా' లాంటి సినిమాలతో కొత్త రకం సినిమాలు, కొత్త దర్శకులు పరిచయమయ్యారు. కానీ తెలుగులో పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. క్రిష్ తీసిన 'వేదం' మల్టిపుల్ నేరేటివ్ పద్ధతిలో వచ్చిన ఒక అరుదైన తెలుగు సినిమా. అలాంటి ప్రయోగాత్మకమైన సినిమాలో పేరున్న నటీనటులు నటించడానికి ముందుకు రావడం తెలుగు సినిమాకి ఒక పెద్ద మలుపు. రానాని నటుడిగా పరిచయం చేస్తూ శేఖర్ కమ్ముల తీసిన 'లీడర్' సినిమా తెలుగులో వచ్చిన పొలిటికల్ సినిమాల్లో ఉత్తమమైన వాటిల్లో ఒకటిగా మిగిలిపోయింది. డబ్బింగ్ సినిమాల ద్వారా తెలుగు వారికి పరిచయం ఉన్న గౌతం మీనన్ తీసిన మొదటి తెలుగు చిత్రం 'యే మాయ చేశావే.' రొమాన్స్‌ని తెరకెక్కించడంలో కొత్త ప్రయోగం.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వదిలేసుకుని సినిమా దర్శకులు అవ్వాలని వచ్చిన మధుర శ్రీధర్ తీసిన 'స్నేహ గీతం' రియలిస్టిక్ సినిమాగా పేరు తెచ్చుకుంది. కానీ అన్నింటికంటే ముఖ్యంగా అమెరికా నుంచి తిరిగొచ్చిన దేవ కట్టా తీసిన 'ప్రస్థానం' ఒక సంచలనం కాబోయి ఆగిపోయింది. తెలుగు సినిమా అంటే, కామెడీ ట్రాక్ ఉండాలి, హీరోయిన్‌తో రొమాన్స్ తప్పక ఉండాలి, హీరో ఇంట్రడక్షన్ సాంగ్, ఫైట్ తప్పదు లాంటి పాత నియమాల ప్రకారం నడుస్తున్న రోజుల్లో, కథ, కథనం, పాత్ర చిత్రణలకు ప్రాముఖ్యం ఇస్తూ వచ్చిన సినిమా 'ప్రస్థానం'.

'ప్రస్థానం'తో తెలుగు సినిమాకి కొత్తరంగులు అద్ది, కథను నమ్మే పాతవైభవాన్ని మళ్లీతెస్తాడేమో అన్న ఆశలు రేపిన దర్శకుడు దేవకౌశిక్ కట్టా. కాంబినేషన్లు, మూసకథలు, కమర్షియల్ హంగులు, నిరర్థకమైన ఫార్ములాలే సినిమా అనుకుంటున్న తెలుగు పరిశ్రమ, అగాధపు అంచులు అందుకుంటున్న ఈ తరుణంలో వచ్చిన ఒక చల్లని తెమ్మెర దేవ కట్టా. సంచలనాల్ని నమ్మే ప్రపంచమలో స్వయంకృషిని నమ్ముకునొచ్చిన కార్యశీలి దేవ.



అయితే ఈ సినిమా విడుదలైన మొదటి రెండు రోజుల్లో చూసిన ప్రేక్షకులు సినిమా బావుంది. కానీ కమర్షియల్ అంశాలు అనవసరంగా ఇరికించారనే ఫీడ్ బ్యాక్ రావడంతో, ఆ సన్నివేశాలను తొలగించారు. ఇది చాలా గొప్ప పరిణామం. ఏ అంశాలైతే ఉంటే తెలుగు సినిమాలు ఆడుతాయని అన్నారో, ఆ అంశాలు ఉండడం కారణంగానే ఒక సినిమా ఆడడం లేదు అని తెలుగు సినిమా మొదటిసారి గుర్తించింది ఈ సినిమాతోనే. ఈ సినిమా విజయవంతమై ఉంటే తెలుగు సినిమా ఎప్పుడో కొత్త సినిమాలకు శ్రీకారం చుట్టేది. దురదృష్టవశాత్తూ ఈ సినిమా ఒక ప్రయోగంగానే నిలిచిపోయింది.

అలా మొదలైంది - 2011

మార్పు వచ్చినట్టే వచ్చి మళ్లీ కథ మొదటికి వచ్చిన సంవత్సరం 2011. అంతకుముందు వచ్చిన మూడు సంవత్సరాల్లో జరిగిన ప్రయోగాలేవీ 2011లో పెద్దగా జరగలేదు. 2011లో వచ్చిన 'అలా మొదలైంది' సినిమాతో తెలుగులో చాలా రోజుల తర్వాత నాని అనే మంచి నటుడు అందరి కళ్లల్లో పడ్డాడు. అంతేకాదు, చాలరోజుల తర్వాత నందిని రెడ్డి దర్శకురాలిగా ముందుకొచ్చింది ఈ సినిమాతోనే. కానీ ఎవరికీ తెలియకుండా లోలోపల తెలుగు సినిమా కొత్త దారులు వెతుక్కుంది ఈ సంవత్సరంలోనే.



అప్పటికే ప్రపంచవ్యాప్తంగా సినిమా నిర్మాణం ఫిల్మ్ రీల్ నుంచి డిజిటల్ సినిమా వైపు మళ్లుతోంది. గతంలోలాగా పెద్ద పెద్ద లైట్లు, కెమెరాలు లేకుండానే అరచేతిలో పట్టేటంతటి డిజిటల్ కెమెరాతో పూర్తిస్థాయి చలనచిత్రాలు నిర్మించొచ్చని అందరికీ అర్థమయింది. తెలుగులో అంతకుముందు ఐదారు సంవత్సరాల క్రితమే, దర్శకుడు మోహన్‌కృష్ణ ఇంద్రగంటి, సినిమాటోగ్రాఫర్ పిజివింద కలిసి 'గ్రహణం' అనే సినిమాని డిజిటల్ టెక్నాలజీతో నిర్మించారు. కానీ అదొక ప్రయోగంగానే మిగిలిపోయింది. కొత్త టెక్నాలజీని ఎప్పటికప్పుడు తన సినిమాల్లో వాడుతూ వచ్చిన రామ్ గోపాల్ వర్మ ఈ సంవత్సరంలో తీసిన సినిమా 'దొంగల ముఠా'. ఈ సినిమా 5D కెమెరాల ద్వారా కేవలం ఐదు రోజుల్లోనే చిత్రీకరించి కొంత సంచలనాన్ని సృష్టించారు. ఇలాంటి సినిమాలో నటించడానికి ఒప్పుకున్న రవితేజ లాంటి నటులను మనం అభినందించాలి. ఈ సినిమా విజయవంతం కాకపోయినప్పటికీ అందరికీ డిజిటల్ సినిమా మీద ఆసక్తి కలుగచేసిన సినిమా ఇది. అలా 2011లో డిజిటల్ సినిమా యుగం మొదలైంది.

ఇప్పటి సినిమాలకు పునాది అప్పట్లో వచ్చిన 'ఈ రోజుల్లో'

2012

2012 నాటికి తమిళ్‌లో షార్ట్ ఫిల్మ్స్ చాలానే వచ్చాయి. వాటిలో కొన్ని యూట్యూబ్‌లో చాలా ఫేమస్ అయ్యాయి కూడా. ఆ షార్ట్ ఫిల్మ్స్ ద్వారా చాలామంది యువ దర్శకులు సినిమా అవకాశాలను పొందారు. అలా వచ్చిన వాళ్లలో బాలాజీ మోహన్ ఒకరు. అతను తను తీసిన షార్ట్ ఫిల్మ్‌నే పూర్తి స్థాయి సినిమాగా రూపొందించారు. ఇలాంటి మరికొన్ని ప్రయత్నాలు తమళ్‌లో విజయవంతం అయ్యాయి. ఇదంతా డిజిటల్ సినిమా టెక్నాలజీ పుణ్యమే. ఇలాంటి సమయంలో మారుతి అనే కొత్త దర్శకుడు 'ఈ రోజుల్లో' అనే సినిమాతో తెలుగులో సంచలనం సృష్టించాడు. యాభై లక్షల రూపాయలతో తీసిన 'ఈ రోజుల్లో' సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించింది. సినిమా తీయడానికి మంచి కంటెంట్ కావాలి, కోట్ల రూపాయల బడ్జెట్లు అవసరంలేదని ఉదాహరణగా నిలిచిన సినిమా 'ఈ రోజుల్లో.' అప్పటివరకూ పూర్తిగా ఫిల్మ్ రీల్ ద్వారా సినిమాలు నిర్మించిన రాజమౌళి లాంటి దర్శకులు సైతం డిజిటల్ టెక్నాలజీ వైపు మళ్లారు. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'ఈగ' సినిమాతో ప్రపంచానికి తెలుగు సినిమాని పరిచయం చేసింది. చాలారోజుల తర్వాత సాహిత్యం నుంచి తీసుకున్న కథతో నిర్మించిన 'మిధునం' సినిమా కొంత మంది ప్రేక్షకులని ఆకట్టుకుంది. అన్ని మసాలాలు కలిపి కలగా పులగం చేసే తెలుగు సినిమాని పద్ధతి ప్రకారం ఏ జానర్ అనుకుంటే ఆ జానర్‌లో పూర్తిగా సినిమాని నడిపించే అతికొద్ది



మంది తెలుగు దర్శకుల్లో ఒకరైన రవిబాబు తీసిన 'అవును' సినిమా విజయవంతం కావడం ఒక కొత్త మార్పు. హను రాఘవ పూడి అనే దర్శకుడు తీసిన 'అందాల రాక్షసి' సినిమా చూసి విజువల్ పోయెట్రీ అన్నారు ప్రేక్షకులు. బహుశా ఇదే తెలుగులో ఫిల్మ్ రోల్ మీద తీసిన చివరి సినిమా. అచ్చమైన తెలుగు కథగా వచ్చిన 'ఓనమాలు' సినిమా మంచి రోజులు రాబోతున్నాయనే కొంత ఆశను నిలబెట్టింది.

తెలుగు సినిమా 'ఉయ్యాల జంపాల' అని ఊగిసలాడిన వేళ: 2013 -2015

తమిళనాడులోలాగే ఇక్కడ కూడా షార్ట్ ఫిల్మ్స్ తీసే కుర్రాళ్ల సంఖ్య ఎక్కువైపోయింది. అప్పటివరకూ సినిమా దర్శకుడిగా ఛాన్స్ కావాలంటే, ఏడేళ్లైనా కనీసం సినిమా పరిశ్రమలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసి, ఆ తర్వాత హీరోల చుట్టూ, నిర్మాతల చుట్టూ తిరిగి సినిమా చేసేసరికి కనీసం పదేళ్లైనా పట్టేది. కానీ పది నిమిషాల షార్ట్ ఫిల్మ్ తీసి, నిర్మాత, హీరోకి చూపించి సినిమా ఛాన్స్ కొట్టేసే యూత్ పరిశ్రమలోకి వచ్చి చేరింది. ఇదే సమయానికి చెన్నైలోని ఎల్వీ ప్రసాద్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో, కొలకత్తాలోని సత్యజిత్ రే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకొని వచ్చిన కొంతమంది తెలుగు వాళ్లు కూడా పరిశ్రమలోకి ప్రవేశించారు. క్రిష్ సినిమాలకు సినిమాటోగ్రాఫర్ గా పని చేసిన జ్ఞానశేఖర్, ఎడిటర్‌గా పనిచేసిన శ్రవణ్,



FTIIలో చదువుకుని వచ్చిన సుధాకర్ రెడ్డి, జయకృష్ణ గుమ్మడి లాంటి వాళ్లు రావడం కూడా తెలుగు సినిమా పరిశ్రమలో కొంత మార్పుకి కారణం అని చెప్పొచ్చు, ఒకవైపు ఫిల్మ్ స్కూల్స్‌లో చదువుకుని వచ్చిన టెక్నీషియన్స్, మరొకవైపు చేతిలో డిజిటల్ కెమెరాతో షార్ట్ ఫిల్మ్స్ తీసిన అనుభవం ఉన్న దర్శకులు. వీళ్లందరి ప్రభావమే 2013లో వచ్చిన ఏఉయ్యాల జంపాల (విరించి)', ఏసెకండ్ హ్యాండ్', ఏప్రేమ ఇష్క్ కాదల్ (పవన్ సాదినేని)', ఏవెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ (మేర్లపాక మురళి)', ఏస్వామి రారా (సుధీర్ వర్మ)' లాంటి సినిమాలు. కొత్త హీరోలా, పెద్ద హీరోలా అని కాకుండా కంటెంట్ ఉంటే జనాలు సినిమా చూస్తారనే నమ్మకం 2013 కలిగించింది.

కానీ చిన్న సినిమా చిన్న సినిమానే, ప్రేక్షకులు ఎప్పటికైనా పెద్ద హీరోల భారీ బడ్జెట్ సినిమాలనే చూస్తారు అని పరిశ్రమ గట్టిగా నమ్మే రోజులవి. అప్పటి మార్పులకు అనుగుణంగా 'చందమామ కథలు (ప్రవీణ్ సత్తారు)', 'ప్రతినిధి (ప్రశాంత్)' 'పాఠశాల (మహి)' 'అలా ఎలా (అనీష్ కృష్ణ)' లాంటి కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు వచ్చి పెద్దగా విజయవంతం కాకపోవడంతో, తెలుగు సినిమాలో మార్పు కోరుకునే వారికి 2014 ఎంతో నిరాశాజనకంగా ముగిసింది.

2015లో 'బాహుబలి' విడుదలైంది. తెలుగు సినిమాకి ఎన్నడూలేని కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చింది. 'శ్రీమంతుడు', 'టెంపర్' లాంటి కమర్షియల్ సినిమాలు కూడా కొంత కంటెంట్‌ని నమ్మడం మొదలైంది. 'పటాస్' సినిమాతో అనిల్ రావిపూడి కమర్షియల్ సినిమాని తిరిగి నిలబెట్టాడు. వీటన్నిటి మధ్యలో కూడా కథకు, కథనానికి ప్రాధాన్యమిచ్చిన చిన్న సినిమాలు 'లేడీస్ అండ్ జెంటిల్మన్ (మంజునాథ్)', 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు (క్రాంతి మాధవ్)', 'యెవడే సుబ్రమణ్యం (నాగ్ అశ్విన్)' 'అసుర (విజయ్ కృష్ణ)' కూడా వచ్చినప్పటికీ చిన్న సినిమాలకు పెద్ద భవిష్యత్తు లేదనీ, భారీ హంగులున్న పెద్ద సినిమాలే తెలుగు సినిమాని కాపాడతాయని ఉయ్యాల జంపాల ఊగింది తెలుగు సినిమా ఈ మూడు సంవత్సరాల్లో.

ముచ్చటగా మూడు సినిమాలు 2016

చిన్న సినిమాకు భవిష్యత్తు ఉందా లేదా అనే ఊగిసలాటలో ఉన్న తెలుగు సినిమాకి మూడు సినిమాలు ఊపిరి పోశాయి. అవి 'క్షణం (రవికాంత్)' , 'పెళ్లిచూపులు (తరుణ్ భాస్కర్)', 'అప్పట్లో ఒకడుండేవాడు (సాగర్ చంద్ర).

పివిపి అనే పెద్ద నిర్మాణ సంస్థ నిర్మించిన 'క్షణం' సినిమాకి రచయిత, నటుడు అయిన అడవి శేష్, దర్శకుడు రవికాంత్ కలిసి అతి తక్కువ బడ్జెట్‌తో సినిమా రూపొందించి భారీ విజయాన్ని అందించారు. కేవలం ఎనభై లక్షల్లో రూపొందించిన 'పెళ్లిచూపులు' సినిమాని బాక్సాఫీస్ వద్ద ఇరవై కోట్లకు పైగా కలెక్ట్ చేసి సంచలనం సృష్టించింది. అతి తక్కువ బడ్జెట్‌లో ఎంతో పెద్ద స్పాన్ ఉన్న కథను ఎంతో చాకచక్యంగా రూపొందించి విమర్శకుల మన్ననలు అందుకున్న సినిమా 'అప్పట్లో ఒకడుండేవాడు.'



తెలుగు సినిమా అంటే ఇలా ఉండాలి అని ఎక్కడా రాసి పెట్టిన నియమాలు లేవు కానీ, పరిశ్రమకు కొత్తగా వచ్చిన వాళ్లకు సులభంగా అర్థమయ్యే కొన్ని విషయాలు గట్టిగా అందరి మనసుల్లో నాటుకుని ఉన్న రోజులవి. కామెడీ ఉండాలి. ఐటెం సాంగ్ ఉండాలి, మొహాలు తెలిసిన నటీనటులు ఉండాలి, పాటలు విదేశాల్లో తీయాలి లాంటి అన్ సెడ్ రూల్స్ పాటించక తప్పని రోజులు.

అంతేకాకుండా సినిమా షూటింగులు జరిగే లొకేషన్లు, సినిమాలకు వాడే లైట్లు, ట్రాక్ అండ్ ట్రాలీ లాంటి ఎక్విప్‌మెంట్ విషయాల్లో కూడా ఇలాంటి అన్ సెడ్ నియమ నిబంధనలు ఉండేవి. ఇవి కాకుండా యూనియన్ మెంబర్స్‌తోనే పని చెయ్యాలి లాంటి నియమాలు అదనం. ఇటువంటి నిర్బంధ పరిస్థితులకు

వ్యతిరేకంగా నిర్మించబడ్డ సినిమాలు పైన పేర్కొన్న మూడు సినిమాలు.

లొకేషన్ల కోసం లక్షలు ఖర్చు పెట్టి సెట్లు వెయ్యలేదు. అందుబాటులో ఉన్న లొకేషన్లను సినిమాకు తగ్గట్టుగా ఎలా వాడుకోవాలి. రోజుకి ఇంతకావాలి అంతకావాలి అని అడిగే నటీనటులు అవసరం లేదు. కొత్తవాళ్లనే సినిమాలోని ముఖ్యపాత్ర లకు ఎన్నుకుంటే చాలు. అన్ని సినిమాలు డబ్బింగ్ చెయ్యనక్క ర్లేదు. సింక్ సౌండ్ ద్వారా మరింత నాచురల్‌గా నటీనటుల చేత నటింపచేయవచ్చు. సినిమా తీయడానికి భారీ ఎక్విప్‌మెంట్ అవసరం లేదు, ఉన్నవాటితో కూడా ఎఫెక్టివ్‌గా కథని చెప్పొచ్చు అని ఎన్నో కొత్త విషయాలను ఈ మూడు సినిమాలు తెలుగు సినిమాకి పరిచయం చేశాయి.

విజయ్ నామ సంవత్సరం 2017

2017 సంవత్సరం తెలుగు సినిమా చరిత్రలో ఎంతో ముఖ్య మైనది. ఈ సంవ్సతరంలోనే 'అర్జున్ రెడ్డి' సినిమా విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. అంతేకాదు తెలుగు సినిమా వేసుకున్న సంకెళ్లను పూర్తిగా తొలగించి కొత్త రకమైన సినిమాకు నాంది పలికింది. ఈ సినిమా ద్వారా తెలుగు హీరో కొత్తగా ఆవిష్కృతమయ్యాడు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'అర్జున్ రెడ్డి' సినిమా తెలుగు సినిమాకి ఉండాల్సిన మూస ధోరణులను చెరిపేసింది.



ఈ సంవత్సరంలోనే 'బాహుబలి' రెండవ భాగం విడుదలై భారతదేశంలోనే నెంబర్ వన్ సినిమాగా నిలిచింది. ఇదే సంవత్స రంలో సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'ఘాజీ' సినిమా గతంలో తెలుగులో తీయాలంటే ఆలోచనకు సైతం అందని కలగా ఉండేది. కానీ అలాంటి సినిమాని పూర్తిగా హైదరాబాద్‌లో నిర్మించి పలు భారతీయ భాషల్లో విడుదల చేసి విజయవంతం కావడం కూడా ఈ సంవత్సరం యొక్క ప్రత్యేకత.



హీరోయిజం జోలికి పోకుండా కథలోని పాత్రలకు ప్రాధాన్య మిస్తూ చేసిన 'ఫిదా (శేఖర్ కమ్ముల), 'నిన్ను కోరి (శివ నిర్వాణ)', 'గురు (సుధ కొంగర)', 'నేనే రాజు నేనే మంత్రి (తేజ)' సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎవరూ ఊహించనంత విజయం సాధించింది కూడా ఈ సంవత్సరంలోనే.

ఎన్నో విజయవంతమైన సినిమాలు, అందులోనూ కంటెంట్ ప్రాధాన్యమున్న సినిమాలే ఎక్కువ శాతం విజయం సాధించడంతో మెల్లగా తెలుగు సినిమా కొత్త కథలు, కొత్త దర్శకుల వైపు దృష్టి సారించింది ఈ సంవత్సరంలోనే.

కేరాఫ్ కొత్త సినిమా 2018

అప్పటివరకూ మాస్ మసాలా ఎంటర్‌టైనర్స్ వైపే చూసిన పెద్ద దర్శకులు, హీరోలు సైతం 2018లో కొత్త కంటెంట్ కావాలని కోరుకున్నారు. 'రంగస్థలం (సుకుమార్)' లాంటి నేపథ్యం ఉన్న సినిమాలో తెలుగులో టాప్ హీరో అయిన రాంచరణ్ నటించడం అందుకు ఉదాహరణ. 'మహానటి (నాగ్ అశ్విన్)' లాంటి సినిమాలో సమంత, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ లాంటి నటులు హీరో హీరోయిన్లుగా కాకుండా తమకు తగ్గ పాత్రల్లో నటించడానికి ఒప్పుకోవడం మరొక ఉదాహరణ. కాజల్, నాని, రెజీనా, శ్రీనివాస్ అవసరాల, నిత్యమీనన్, ఇషా లాంటి ఎంతో మంది పేరున్న నటీనటులు 'ఆ (ప్రశాంత్ వర్మ)' అనే సినిమాలో నటించడం, అది కూడా ఒక కొత్త దర్శకుడి చిత్రంలో నటించ డానికి అంగీకరించడం, అలాంటి సినిమాని నాని లాంటి ప్రముఖ హీరో నిర్మించడం తెలుగు సినిమా మారిందనడానికి ఒక నిదర్శనం.

హీరోయిన్ ప్రధాన పాత్ర పోషించిన 'చి.ల.సౌ (రాహుల్ రవీంద్రన్)', తండ్రి కొడుకుల మధ్య జరిగే సంఘర్షణ ప్రధానంగా సాగే 'నీది నాది ఒకే కథ (వేణు ఉడుగుల)', 'గూఢచారి (శశికిరణ తిక్క)', RX100 (అజయ్ భూపతి),' 'ఈ నగరానికి ఏమైంది (తరుణ్ భాస్కర్)', 'హుషారు (శ్రీ హర్ష)లి లాంటి సినిమాలు భారీ విజయం సాధించడం కూడా తెలుగు సినిమా మారిపోతోం దనే ఒక కొత్త ఉత్సాహాన్నందించింది 2018.

వీటన్నింటికంటే ముఖ్యంగా, 2018లో వచ్చిన 'కేరాఫ్ కంచరపాలెం (వెంకటేష్ మహా)' సినిమా గురించి చెపవికోవాలి. వైజాగ్‌లోని కంచరపాలెంకి వెళ్లి అక్కడ నివసించే వారినే నటీనటులుగా ఎన్నుకుని వారితో సినిమా తీయడమంటే అది కలలో కూడా జరిగే విషయం కాదనిపించొచ్చు. ప్రపంచంలో ఎక్కడో ఏదో దేశంలోనో, లేదంటే కేరళ, బెంగాల్‌లోనో ఫలానా దర్శకుడు ఇలాంటి ఒక ప్రయత్నం చేశాడంటే కేవలం చదువుకుని వదిలేసే పరిస్థితిలో ఉండే తెలుగు సినిమా, 'కేరాఫ్ కంచరపాలెం' సినిమాతో ఆ కలను నిజం చేసింది.

సాధారణంగా ఇలాంటి ప్రయత్నాలు జరిగినప్పుడు అవి కేవలం అవార్డుల కోసం మాత్రమే తీసిన ఆర్ట్ సినిమాగా మిగిలి పోయే అవకాశాలే చాలా ఎక్కువ. 2018లో కేరాఫ్ కంచరపాలెం సినిమా విడుదలైంది. సాధారణ తెలుగు ప్రేక్షకులే కాదు, దేశంలోని అన్ని మూలల నుంచి ప్రేక్షకులు సినిమా చూసి ప్రశంసలు అందచేశారు. పదేళ్లలో తెలుగు సినిమా పూర్తిగా యూ టర్న్ తీసుకుంది.

ఇప్పుడు తెలుగు సినిమా కేరాఫ్ కొత్త సినిమా!

అంతా మన మంచికే.

ఇది 2019వ సంవత్సరం మే నెల. సమ్మర్ హాలిడేస్‌కి తెలుగు సినిమాకి ఎంతో అవినాభావ సంబంధం ఉంది. మంచి మంచి సినిమాలను సమ్మర్ హాలిడేస్‌లో విడుదల చేసి భారీ విజయాలను అందుకోవాలని ప్రతి నిర్మాతకూ, హీరోకూ ఉంటుంది. కానీ ఈ సమ్మర్‌లో పరిస్థితి వేరు. మజిలీ సినిమా విజయవంతమైంది. ఇది రొటీన్ సినిమా కాదు. ఈ సినిమా దర్శకుడికి ఇది రెండో సినిమానే. 'చిత్రలహరి' విడుదలైంది. కమర్షియల్ సినిమానే నమ్ముకున్న సాయిధరమ్ తేజ్ నటించిన సినిమా. ఇది కూడా విజయవంతమైంది. ఈ సినిమా దర్శకుడు కిశోర్ తిరుమలకి ఇది మూడవ సినిమా.

'జెర్సీ' విడుదలైంది. భారీ విజయం సాధించింది. గత పదేళ్లుగా ఎంతోమంది దర్శకులు, నిర్మాతలు, నటీనటులు కలిసి ఒక్కొక్క సినిమాతో తెలుగు సినిమాని మార్పు దిశగా ప్రయాణం చేపిస్తూ ఇక్కడవరకూ తీసుకొచ్చారు. 'జెర్సీ'తో ఆ మార్పు అత్యున్నత స్థితిని చేరుకుంది. అత్యుత్తమ సినిమా అంటే భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రపంచంలో ఏ మూలనున్న ప్రేక్షకుడినైనా కదిలించే గుణం ఉండాలి. అటువంటి క్వాలిటీ ఉన్న సినిమా 'జెర్సీ'. తెలుగు సినిమా మసాలా దినుసులన్నీ కలిపి కమర్షియల్ హంగులతో తీయగలిగే సినిమా అయినప్పటికీ, తను నమ్మిన కథను ఎంతో నిజాయితీగా తెరకెక్కించాడు దర్శకుడు గౌతం తిన్ననూరి.



ఇప్పుడు మనం కూడా ఒక జెర్సీ మీద టాలీవుడ్ అని రాసుకుని, కాలరెగరేసుకుని మన సినిమాలు ఇతర రాష్ట్రాల వాళ్లకి, ఇతర దేశాల వాళ్లకి గర్వంగా చూపించుకోవచ్చనే ధైర్యం వచ్చింది. ఇక తెలుగు సినిమా గురించి పెద్ద బాధ పడాల్సిన అవసరం లేదనిపిస్తుంది. పైన పేర్కొన్న దర్శకులంతా ఇప్పుడు తెలుగు సినిమాని తమ భుజాల మీద మోస్తున్నారు. ఇక నుంచి మనకు అన్నీ మంచి సినిమాలే ఉండకపోవచ్చు. కానీ మంచి అభిరుచి కలిగిన ప్రేక్షకులకు మంచి సినిమాలు తీసే దర్శకులు ఉన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇంకా ఎంతోమంది కొత్త దర్శకులు కొత్త రకమైన సినిమాలతో మన ముందుకు వస్తారనే నమ్మకం ఉంది. ఈ సంవత్సరంలోనే 'దొరసాని', 'మల్లేశం', 'ఫలక్‌నుమా దాస్', 'బాయ్', 'రాజావారు రాణిగారు', 'డియర్ కామ్రేడ్', 'పలాస' ఇలా ఇంకా ఎన్నో మంచి తెలుగు సినిమాలు మన ముందుకు రానున్నాయి. తెలుగు సినిమా ఇప్పుడు కొత్త ఆశలతో చిగురిస్తోంది.

అంతా మన మంచికే.



'సవతరంగం' సినిమా బ్లాగుతో పాఠకులకు సుపరిచితులైన వెంకట్ శిద్ధారెడ్డి లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి, సినిమా మీద మక్కువతో హైదరాబాదులో సినిమారంగంలో వేళ్లూనుకునే ప్రయత్నం చేస్తున్నారు. రామానాయుడు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో ఫాక్టల్టీగా ఉంటూనే కొన్ని చిత్రాలకు పని చేశారు. ఇటీవల 'సోల్ సర్కల్' కథాసంపుటి విడుదలయింది. సినిమా మీద రెండు వ్యాససంపుటాలు ప్రచురించారు.



వికసించిన పద్మం

పేదపిల్లల పెన్నిధి పద్మశ్రీ గ్రహీత ప్రకాశరావు

శ్రీకాంత్ కాశెట్టి

తనకు దొరకనిది, ఇతరులకయినా అందించాలనే ఆలోచన, ప్రయత్నం అంత తేలికై నవి కావు. దాని కోసం అహరహం శ్రమించాలి. తనకొచ్చే కొద్దిపాటి ఆదాయంతో వందలమంది పిల్లలకు దారి చూపుతున్న ఆదర్శజీవి...

కళ్లు ఉన్నందుకా మనం సంతోషపడాల్సింది.
కన్నీరు వస్తున్నందుకు కదా మనం సంతోషించాల్సింది.
బ్రతికడానికా మనం బ్రతుకుతున్నది
జీవించేందుకు కదా మనం బ్రతికేది.

మన జీతం మనకు ఉపయోగపడుతున్నందుకా మన శ్రమ పరిపూర్ణమయ్యేది.

సమాజానికి కూడా ఉపయోగపడితేనే కదా మన కష్టానికి గౌరవం.

ఒక వ్యక్తి పరిస్థితిని మనం గమనించగలుగుతాం, అతని బాధనూ మనం అనుభవించగలుగుతాం... తెలివితేటలు లేవని 'వారిని', అధికారం కోసమే తప్ప ప్రజల బాగోగులు అవసరం లేదని 'ప్రభుత్వాలను' నిందిస్తాం, బాధ్యతలను చాకచక్యంగా వేరే వారి మీదకు నెట్టేస్తాం. పోనీ వారి పరిస్థితులను మనం మార్చ గలమా అనే ఆలోచన వస్తే ఆ వెంటనే 'మన పరిస్థితే బాలేదు, ఇంకా వేరేవాళ్ల సంగతా? నా జీతం నాకే సరిపోదు ఇంకా మరొ కరికా?' ఈ చిన్న స్టేట్‌మెంట్‌తో మనలో చాలామంది తప్పించు కుంటున్నాము. ప్రకాశరావుగారు అలా అనుకోలేదు. తనకు వంద రూపాయలు వస్తే 60 రూపాయలు సమాజం కోసమే ఖర్చు పెడతారు. 24 గంటలు ఉంటే 15 గంటలు తోటి మనుషుల కోసం వెచ్చిస్తారు. 'ఒక దీపం మరో దీపాన్ని వెలిగించడం ద్వారా కోల్పోయేది ఏదీ లేదని' అబ్దుల్ కలాంగారు చెప్పినట్టుగా పెద్దల అజ్ఞానాన్ని, మూఢ నమ్మకాలను ప్రారదోలుతూ, పిల్లలను విజ్ఞాను లుగా తీర్చిదిద్దుతున్నారు.

టీ కొట్టు ద్వారా ప్రకాశరావుగారికి ప్రతిరోజు 600 నుండి 1000 రూపాయల వరకు వస్తాయి ఒక్కోసారి అవి కూడా రావు. ఎంత ఆదాయం వచ్చినా అందులో సగం (లేదంటే అంత కన్నా ఎక్కువ) తన దగ్గరే చదువుకుంటున్న పిల్లల కోసం ఉపయో గిస్తారు. ప్రకాష్‌గారు ప్రతిరోజు మూడు ఉద్యోగాలు చేస్తుంటారు. ఉదయం టీ కొట్టులో, మధ్యాహ్నం తన స్కూల్‌లో ఉండి చదువు కునే పిల్లల కోసం టీచర్‌గా, సాయంత్రం గవర్నమెంట్ హాస్పి టల్‌కు వెళ్లి తన రాకకోసం ఎదురుచూస్తున్న వారిని ఆత్మీయంగా పలుకరించి ఆరోగ్యం మెరుగుపడడానికి పాలు, పండ్లు, బిస్కెట్లు, అవసరమైతే మందులు ఇస్తారు. డబ్బే కాదు తన విలువైన సమయాన్ని కూడా చుట్టూ ఉన్న మనుషులకు ధారపోశారు. కనుకనే భారత రాష్ట్రపతిగారి చేత 'పద్మశ్రీ' అందుకుని పద్మశ్రీ విలువ పెంచారు.

మన తెలుగువారు

ప్రకాష్‌గారు స్వచ్ఛమైన తెలుగు మనిషి. తన పూర్వీకులు కాకినాడలో పుట్టి గోదారమ్మ తల్లి నీళ్లు తాగి పెరిగారు. ఒడిశా కటక్ బక్షిబజార్ అనే మురికివాడలో ఇలాంటి మంచిపనులు చేస్తూ



వికసించారు. కాళ్లు చేతులకు బలం వచ్చిన దగ్గర నుండి ఆయన టీ కొట్టులో పనిచేస్తూ వస్తున్నారు. నెలకు 20 రోజులకు పైగా టీ కొట్టులో, మిగిలిన రోజులు బడిలో అక్షరాలను చూసేవారు, తాకేవారు. ప్రకాష్‌గారు ప్రజల ఆరోగ్యాన్ని బాగుచేసే 'డాక్టర్' అవ్వాలని ఆశించారు. ప్రయాణంలో అతనికి ఎదురుపడ్డ అతిపెద్ద అడ్డంకి 'డబ్బు'. ఆ రోజుల్లో 42 రూపాయలు లేకపోవడం వల్ల పై చదువుల్లోకి వెళ్లలేకపోయారు. ఇంటర్మీడియట్‌లోనే చదువు 'కొన'డానికి డబ్బు ఎంత అవసరమో అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు.

పేదపిల్లలందరూ తనవారే

కటక్ బక్షిబజార్‌లో తెలుగువారు ఎక్కువ. వారిలో హమాలీలు, రిక్షా కార్మికులు, పనిమనుషులు మొదలైన పనులు చేస్తూ రోజులు పొడిగించుకుంటున్నారు. వాళ్లకు పుట్టిన పిల్లలు ఖరీదైన మనుషులు రోడ్డు మీద ఎక్కడపడితే అక్కడ క్రమశిక్షణ లేకుండా పారేసే చెత్తను ఏరుకుని అమ్మనాన్నలకు ఎంతో కొంత ఆసరాగా ఉండేవారు. ఇలాంటి దైనందిన కార్యక్రమాలు మరికొన్ని సంవత్సరాలు కొనసాగితే వారి జీవితం బాగుచెయ్యడం కష్టమవుతుందని దాదాపు 20 సంవత్సరాల క్రితం తనకున్న రెండు గదులలో ఒక గదిలో 'ఆశా ఓ ఆశ్వాసన్' పేరుతో స్కూల్ తెరిచారు. ప్రస్తుతం ఈ స్కూల్ లో 80 మంది పిల్లలు చదువుకుంటున్నారు, ఆరుగురు టీచర్లు పనిచేస్తున్నారు. టీచర్ల జీతం పిల్లల చదువుకు అవసరం అయ్యే అన్ని అవసరాలు ప్రకాష్ చూసుకుంటారు.

214 సార్లు రక్తదానం

ప్రకాష్‌గారిని జీవితం ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోకి కూలదోసినా అందులో నుండి తేరుకొని మరొకరికి తనలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ప్రయత్నిస్తున్నారు. 20వ సంవత్సరంలో టీబీ ఇంకా పార్షియల్ పెరాలసిస్ వచ్చింది. వెన్నుముకకు ఆపరేషన్ చేస్తే కోలుకునే అవకాశం ఉంది. ఆపరేషన్ కోసం రక్తం అవసరం వచ్చింది. ఆ రోజుల్లో రక్తదానం అంటే అపోహతో కూడిన భయం ఉండేది, అయినా ఒక వ్యక్తి రక్తదానం చేసి ప్రకాష్‌గారిని ఆదుకున్నారు. 6 నెలల పాటు అక్కడే హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ తీసుకోవడంతో అక్కడికి వచ్చే పేషంట్స్ బాధలు దగ్గరి నుండి చూసి అప్పటి నుండి పేదవారికి పండ్లు, పాలు, మందులు ఇస్తున్నారు. 1976 నుండి ఇప్పటికి 214 సార్లు రక్తదానాలు, 17 సార్లు ప్లేట్‌లెట్స్ డొనేట్ చేశారు. చనిపోయిన తర్వాత ఆయన శరీరం మరో నలుగురికి ఉపయోగపడాలని అవయవ దానం కూడా చేశారు.

భారత పౌరసమాజం పద్మశ్రీతో పాటు అనిబిసెంట్ అవార్డ్, హ్యూమన్ రైట్స్ అవార్డుతో ఆయన్ను గౌరవించుకుంది.



శ్రీకాంత్ కాశెట్టి 'చాయ్ బిస్కెట్' అనే వైబ్‌సైట్ ద్వారా 800 పైగా ఆర్టికల్స్ రాశారు. ప్రస్తుతం ఎమ్మెస్సీ సైకాలజీ చదువుతున్న వీరు మనల్ని ప్రభావితం చేసే వ్యక్తుల గురించి తెలుసుకొని, వారిని పరిచయం చేయడం తనకు ఇష్టమైన వ్యాపకం అంటున్నారు.



USA Law

Preventing Another Farmington

Santosh Reddy

In today's climate, international students must take extra precautions when deciding to enroll at a US-based school to further their studies.

On January 30, 2019, an unsealed federal indictment revealed an institution operating as University of Farmington in Michigan was a fake university operated by federal agents as part of a Department of Homeland Security (DHS) investigation conducted by the Immigration and Customs Enforcement (ICE). The University actively recruited prospective international students to enroll by highlighting its national accreditation and status as a Student and Exchange Visitor Program (SEVIS) approved University. Students were lured by the University, which claimed that their prior masters degree credits could be combined with CPT and applied to earn a second masters degree in lieu of a traditional course load. Prospective students completed an application and paid the $100 application fee, thousands of dollars in tuition, and were reassured the University was accredited, as evidenced on the ICE website.

The January 30 unsealed indictment resulted in SEVIS terminations for all students enrolled at University of Farmington and allegations that the more than 600 students enrolled at the University knew it was a fraudulent institution and did so as part "pay to stay" scheme to lawfully remain the United States. For the most part, the basis for terminating the students' lawful status was for failure to maintain status or otherwise comply with the conditions of nonimmigrant student status. These terminations led to a sweep of arrests all throughout the United States. Of the more than 160 students who were arrested nation-wide and placed in immigration removal proceedings, all but one of the detained students were Indian nationals.

Immediately after learning of the arrests Somireddy Law Group (SLG) set up a full-scale team to work day and night in contacting the appropriate immigration officials to inquire as to the whereabouts of the students, to ensure they were in good spirits, and to advocate for their immediate release. Initially, SLG focused efforts on assisting students detained in Virginia, Maryland and the surrounding states. At the outset, SLG was successful in convincing ICE officials to allow several students, who were wanted for questioning and arrest by ICE, to depart the United States for India instead of detaining them in the US for a lengthy period while they await a hearing before an immigration judge.

SLG diligently submitted several written requests for bond to the appropriate ICE officials for

consideration and escalated requests to senior ICE officials. In most cases, ICE did not render decisions regarding custody of the students, but rather waited until after the students were served with a Notice to Appear (NTA) before an immigration judge, which meant that ICE no longer had jurisdiction to decide the custody of the students.

SLG represented several students in removal proceedings in Immigration Court and submitted motions for bond hearings for an immigration judge to consider. Despite the opposition of DHS attorneys, who opposed the release of the students on bond, SLG was successful in securing reasonable bonds in all our cases, as well as successful resolutions for our clients.

Measures to prevent another 'Farmington' crisis

The University of Farmington sting has undoubtedly left international students, and Indian students, concerned and worried. In fact, the fallout from the operation has continued as there were reportedly more students who were enrolled at the University arrested in March. Therefore, it is important for prospective students already in the United States and those abroad, in places like India, to take proactive measures to ensure the school they plan to attend is a legitimate institution.

An important step for students applying to university is to determine whether the school is an accredited institution. A school without proper accreditation is likely to have low standards and not feel compelled to follow immigration law. Accreditations of schools can be searched on the US Department of Education Accreditation website at: https://ope.ed.gov/dapip/#/home. If the school claims to be accredited and heavily advertises its accreditation credentials, it is important to determine the legitimacy of the agency accrediting the university by searching whether the agency is listed as a credible accreditation institution on the US Department of Education's website. The tool can be accessed by visiting: (https://www2.ed.gov/admins/finaid/accred/accreditation_pg2.html. Lastly, if an institution claims to be accredited by a state-approved agency, students should confirm this with the state agency that oversees accreditation in the applicable state where the school exists.

When exploring studying options in the United States, prospective students should also research whether the school they intend on attending has a physical campus. Students should be cautious of enrolling in a school that does not have a physical location and only offers online classes. Generally, part of the accreditation requirements for a school includes having adequate physical space. Therefore, students should be cautious when dealing with an institution that does not have a physical location. In the case of University of Farmington, the institution has a P.O box number but no official address and was housed in a small building with only two rooms. These types of details should be enough to tip prospective students from staying away. Searching the school website, Google Maps, and other online resources for pictures and details of the school campus are helpful ways to research into this question.

Another help tip for prospective students is to ensure the institution they plan to attend actually offers classes that are mandatory for students. Students should be able to have access to the program curriculum and classes that are currently offered prior to enrollment. A red flag should go off if an institution does not allow students to know what classes it currently offers or has offered in the past. Similarly, students should be extra cautious of schools that overemphasize their accreditation and offer the chance to earn degrees in a very short period by attending very few classes.

In today's climate, international students must take extra precautions when deciding to enroll at a US-based school to further their studies. There is a necessary amount of responsibility and due diligence on the part of students that must be taken to ensure protection from sham universities. Students should pay close attention to the offerings of the school they intend on enrolling to prevent any future disruption to their studies and immigration status.



Santosh Reddy Somi Reddy ESq is the founding partner/attorney of Somireddy Law Group Pllc. With offices in Virginia, Maryland and India, Somireddy Law Group is one of the fastest growing full-service law firm in the DC Metropolitan area. They specialize in Immigration, litigation, corporate, employment and criminal law matters.



Jumping In

Bhavana Bhattiprolu

The most fascinating thing about this cultural reinvention is that I'm able to transfuse it with the cultures of the people and places around me. My friends and I have created our own little subculture which is a rich mix of all of our cultures.

I'm the kind of person who jumps into the deep end of most things. I don't like the feeling of being a beginner, and so I push myself to the extremes just to escape this feeling. I've always picked the hardest level on new games on the Xbox, I've always started math exercises from the end, and I've always started my meals with the things on my plate that I detest. I'm not sure if this tendency is beneficial or harmful, but it's important because it has informed most of the decisions I've taken. And, perhaps, the most important decision I've had to take so far in my eighteen years of life is one about college. It's no surprise that when the time came for college, I decided to go as far away as possible from everything and everyone that I've ever known; I traded in the rocky hills of Hyderabad for the sunny vistas of California.

About a year ago, I started school at my dream college, UC Berkeley, and it's been quite a ride ever since. Leaving home was the most difficult thing I've ever had to do and whether or not I was ready for it, I knew it had to be done. If I didn't leave Hyderabad when I did, I wouldn't have ever left. I would've been sucked into the archetype I created for myself in high school and my trajectory would've been extremely limited. I would've hung out with the same people, spoken the same language, and had the same set of thoughts. This sameness scared me far more than the alienness of a new place. And, unexpectedly, America did seem like such a new place. I was born in the US, visited multiple times, and consumed so much media from here; being an outsider just didn't seem like a thing that could happen to me. I soon realized that knowing every lyric to Taylor Swift songs didn't make me American enough.

For someone who always had a voice in any conversation about history, politics, geography, or religion, it was very new for me to not be able to relate to anything being said by even my closest of friends. I found myself constantly looking up the California map to see where my friends were from and going to Urban Dictionary to learn slang. I was actively taking mental notes during any new interaction and was doing my absolute best to assimilate myself. I think the thing I found hardest, though, in terms of cultural transition was my approach to interpersonal relationships. In India, I lived in an extremely tight-knit community of people who didn't really have boundaries with each other. We would tell each other hard truths and hold

people accountable to them. In America, this ingrained attitude started being perceived as aggression or control and I was very confused by it. In my head, I thought that I was just showing love. Calling my roommate and pestering her about her whereabouts suddenly was 'forceful', when I meant for it to be protective. Telling my friends not to do dangerous things evoked reactions like "Let them live their lives." Slowly, I started to understand that showing affection here meant letting people be the versions of themselves that they want to be. Letting people make their own mistakes is the only way to wish growth for them. Once I started acknowledging this freedom to make mistakes, I felt liberated and powerful. In this experimental world, people were molding themselves like clay and not being carved like stone. And I was so ecstatic to transition into clay. Even though I was just sludge at first, I'm truly starting to take shape and I'm content that it's a shape that I've designed.

Another interesting dilemma that I faced was my interaction with my own Indian-ness. India has become somewhat of a mythological place for me and I'm constantly glorifying it. Speaking in Telugu, or even Hindi, gives me an inexplicable adrenaline rush. There's just something special about listening to 'Super Machi' on the streets of Berkeley and walking nonchalantly as though there isn't a full-blown party going on inside my head. Despite this evident love for India, it's become sufficiently obvious that I don't actually have a lot of Indian friends. I don't think I put in any concerted effort for this to happen. In fact, I hardly notice it. I'm so myself and at-ease around my friends that I never really experience any disconnect from my roots. To be honest, I'm really enjoying reinventing what India means to me without the background noise of people going 'Bharat Mata ki Jai.' For Diwali, I hiked up a hill with two of my closest friends for the sunrise and used the sunrays to celebrate the festival of lights. I dispersed the Gully Boy soundtrack to every corner of my friends' lives and saw it inspire them in parlance with me. I've started thinking about spirituality and I've begun this quest by reaching out to the Indian mythology I've been raised upon as a child. The most fascinating thing about this reinvention is that I'm able to transfuse it with the cultures of the people and places around me. My friends and I have created our own little subculture which is a rich mix of all of our cultures. We traverse mountains in the dark as we passionately sing Hindi songs, we devour delicious Bao in Chinatown as we walk the streets in our Kurtas, and we divulge the deepest parts of our subconscious by the shores of Lake Anza, that we've fondly come to call Lake Azadi. This exchange of existence and exploration runs deep in almost all of our interactions and I could not be more grateful for it.

These experiences, coupled with the sheer stimulation of being in such a vibrant place, are giving me the power to survive what's been the most trying time of my life. As my first year here comes to a slow end, I'm at a place where my identities seem to be forking off into multiple paths. I'm trying to build bridges between them, but I'm afraid of falling off in the process. There are versions of me that I expose only to people at home and some that I bring out only when I'm here.

And since I'm in a space where I can truly escape the droning of expectations and pressure, I'm hoping that I grow into a version of myself that's closest to reality. Regardless of whether I keep revisiting my past or jump straight into the future for this, I know I can achieve this by exerting the one thing I've always known to do: by jumping into it headfirst.



Bhavana Bhattiprolu is currently a student at UC Berkeley, but she spent most of her life in Hyderabad. She's fluent in Telugu and English, and even published a book called 'Peaceful Vices' with her English spoken word poems and their Telugu translations.



నివాళి

పాటే ప్రాణంగా...

ముంజులూరి కృష్ణకుమారి

ఆవిడ వెళ్లిపోయారు. తెలుగు జానపద బాణీకి తొలినాళ్లలో పర్యాయపదంగా నిలిచిన వింజమూరి అనసూయ పేరు తెలియని ఒక తరం తెలుగువారు ఉండరంటే ఆశ్చర్యం కాదు. ఆకాశవాణి ఇంటింటా విస్తరించిన రోజుల్లో వింజమూరి అనసూయ , సీత సెలబ్రెటీస్.


కొందరి అదృష్టానికి అసూయపడక్కర్లేదు. అనసూయాదేవి అలా గత నెలలో ఇహ లోకయాత్ర ముగించారు. పైగా అందం పూర్ణాయుషూ కూడింది. ఇంకేం కావాలి? తేనెవంటి తియ్యదనం, జీడిమామిడి ఫలపు గాఢమైన వాసన, గులాబీ అత్తరు సాంద్రత, జీరతో గమకాల సొగసులు వీటిని కలిపి పలికించే ఒక స్వరం అవసరాల అనసూయగా 1920లో ఈ నేల మీద రూపుదాల్చింది. అంతే! జీవితాంతం శాస్త్రీయ సంగీత బాణీల్లోని కచేరీ స్థాయి అరుదైన పదాలు, భావకవుల గీతాల్లోని జిలుగు మెరుగులు, జానపదాల్లోని కొంటె గమకాల గాలాల వంపులను తన గళంలో పలికించారావిడ. స్వయంగా తానే హార్మోనియం వాయించుకుంటూ పాటల విందు చేస్తూ, 1980వ దశకం నుంచి 2018 మార్చి నెలలో తన 98వ ఏట అమెరికాలో కన్నుమూసే వరకు శ్రోతలను ఓలలాడించిన గంధర్వగాయని అనసూయాదేవి.

పిఠాపురంలో వింజమూరి వెంకటలక్ష్మీనరసింహారావు, లక్ష్మీ నరసమ్మ దంపతులకు 1920 మే 12న జన్మించారు అనసూయ. జానపదగేయాల సేకరణ, ప్రచారంతో ఆవిడ చేసిన భాషాసేవ అనితరసాధ్యం. సాగరతీర బెస్తల నుంచి జాలరి పాటలు, కాయ కష్టం చేసేవారి కర్షక గీతాలు, పామరుల పాటలు నేడు అచ్చులో లభించడంలో ఆవిడ కృషి ఎంతో ఉంది.

ఇప్పటివరకూ తెలుగు చిత్రాల్లోని ఏ జానపద పాటా అనసూయ మార్కు విరుపో, కులుకో, విరామమో లేకుండా, ఆ ఛాయలో పాడకుండా ఎవరిదీ రికార్డు కాలేదు. గాయకుల మీద అంతటి ప్రభావం చూపారావిడ. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద తెలుగు జానపదాన్ని తన గళంతో మారుమోగేలా చేసిన తొలి తెలుగు మహిళా స్వరకర్త, గాయని, సినీ సంగీత దర్శకురాలు. జానపదమైనా, దేశభక్తి గీతమైనా, భావగీతమైనా అనసూయ నోట రసాలూరించే తేనెవాకగా పారింది, భ్రమర నాదంగా సాగింది. ఇంతగా పేరు ప్రఖ్యాతులు రావడానికి, సంగీత ప్రపంచంలో ఆవిడ ధ్రువతారగా వెలగడానికి దోహదం చేసిన వారు తండ్రి వింజమూరి వెంకటలక్ష్మీనరసింహారావు, కర్ణాటక సంగీత గురువు మునుగంటి వెంకట్రావుపంతులు, జానపద గురువు వల్లూరి జగన్నాథరావులు. వీరి విశిష్టతల గురించి ఆవిడ ఎన్నిసార్లు చెప్పినా వీనులవిందుగా ఉండేది.

నాటకాలతోనే ప్రారంభం

"అసలు నా సంగీతం నాటక సంగీతంతోనే పుట్టింది. మా నాన్నగారు లక్ష్మీనరసింహారావు చాలా దర్జా మనిషి. కవి, నటుడు, గాయకుడు, నాటక రచయిత, మహా పండితుడు. నాన్నగారి కంఠం చాలా బావుండేది. ఖంగున మోగేది. భగవంతుడు నాకు కొంచెం ఆయన కంఠం ఇచ్చాడేమో! మా ఇంట్లో నాటకాల రిహార్సల్సు జరుపుతుంటే నేనే హార్మోనియం వాయించేదానిని. మునుగంటి వెంకట్రావు పంతులుగారు నాకు సంగీత గురువు.



ఎన్నో నూతన రీతులు నాకు బోధించినవారు, నేర్పినవారు. ఆ రోజుల్లోనే ఆయన అన్ని రకాల సంగీత రీతులను మేళవించి సంగీత వరసలు కట్టేవారు. నేను రాగం, తానం, పల్లవి పాడే స్థాయికి వచ్చాక శాస్త్రీయ సంగీతం వదిలేశాను. భావగీతాలు, జానపద గీతాలలోకి వెళ్లిపోయాను. తర్వాత నాకు 'గిరి' గారితో పెళ్లయి మద్రాసు వెళ్లిపోవడం, రత్నపాప పుట్టడం జరిగింది. ఇక వల్లూరి జగన్నాథరావు నా జానపద గురువు. నాకు చాలా రకాల పాటలు బోధించారు. మాటల్ని ఎలా ఉపయోగించుకోవాలో, గమకాల్ని ఎలా పలకాలో, ఏ మాట మీద ఎంత ఊనిక ఇవ్వాలో నాకు చిన్నప్పుడే నేర్పారు. అందువల్ల ఏ పాట పాడినా నాకు చాలా సులువు అయిపోయింది. దేవదాసీల దగ్గర నుంచి ఎన్నో ప్రాచీన మైన పదాలు, పాటలు సేకరించాను. ఒకానొక సమయంలో నేను జానపదగేయాలా? క్షేత్రయ్య పదాలా? దేనిమీద పరిశోధన చేయాలనే సందిగ్ధంలో పడ్డాను. మద్రాసులో సంగీతాచార్యులు ప్రొఫెసర్ సాంబమూర్తిగారి ఆదేశం మీద నేను జానపదగేయాల్లో పరిశోధన చేయసాగాను" అని చెప్పారు అనసూయ.

తను నేర్చిన శాస్త్రీయ సంగీతజ్ఞానంతోనే తను పాడిన లలితగీతాలకు, జానపద గేయాలకు, ప్రత్యేక స్వరంతో గమకాలను చేర్చి పదాలకు జీవం పోసి, నాటకీయత రంగరించి ఆ పాటలను అజరామరం చేశారు అనసూయ. కాకినాడ కళాశాలలో ఇంటర్ చదువుకునే రోజుల్లోనే శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని స్వరపరిచి బృందగానం నిర్వహించిన నిపుణురాలు ఆవిడ. 1935లో కృష్ణశాస్త్రి రచించిన 'జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి' గీతాన్ని స్వరపరిచి గానం చేశారు. ఈ నేల మీద ఆ పాటా, ఆ బాణీ ప్రతిధ్వనిస్తూనే ఎప్పటికీ ఉంటుంది.

జానపద గీతకోయిల

శాస్త్రీయ సంగీత కచేరీల కాలంలో ఊరూరా దశాబ్దాల పాటు జానపద గీతాలు ఆలపించి అశేష జనాన్ని ఆకర్షించిన ఘనత అనసూయది. కొనకళ్ల రాసిన మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో అనే పాటతో అలరించినా, 'వగలమారి నా మగడు సవితిని తెచ్చాడక్కో' అంటూ స్వరాలతో ఎగ సెక్కాలతో మురిపించినా, 'నెల్లూరు సీమల్లో నెమలి వాలింది. అవునొదినా!' అంటూ అబ్బురపరచినా అనసూయకు మాత్రమే సాధ్యమైంది. ఏలూరులో 1939లో జరిగిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ సభలో కృష్ణశాస్త్రి రచించిన 'ఆకాశము నొసట పొడుచు అరుణతార' పాట పాడి ఆకట్టుకున్నారావిడ. 1988లో మద్రాసు ఆకాశవాణి ప్రారంభోత్సవ సభలో కృష్ణశాస్త్రి పాటలు ఆలపించి తెలుగు బావుటా ఎగరేశారు. ఆ కేంద్ర ప్రారంభ రోజుల్లో కృష్ణశాస్త్రి 'విద్యాపతి' లాంటి తొలి రూపకాలకు సంగీతం సమకూర్చి తాను పాడి ఇతరులతో పాడించి శ్రవ్య రూపకాలకు ఖ్యాతి తెచ్చారు.

దిల్లీలో 1955లో యునెస్కో సభలో వివిధ దేశాల ప్రతినిధులకు తెలుగు జానపద గేయాల చవిచూపిన కీర్తి అనసూయది. ఈ పురుషాధిక్య సంగీత ప్రపంచంలో లలిత, జానపద, సినీ సంగీతాల్లో తొలి పంటలు పండించిన అసాధారణ కృషి ఆవిడది. అనసూయ లలిత సంగీతంలో ఆకాశవాణిలో తొలి ఆంధ్రా టాప్‌గ్రేడ్ కళాకారిణి. అనేక సంస్థల నుంచి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు అనసూయ. కేంద్ర సంగీత నాటక అకాడమీ నుంచి టాగోర్ పురస్కారం స్వీకరించారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ఆవిణ్ని 'కళాప్రపూర్ణ'గా గౌరవించింది.

తాను సేకరించిన జానపద గేయాలను స్వరాలతో సహా ప్రచురించి తర్వాతి తరాల గాయకులకు, పరిశోధకులకు కర దీపికగా అందించారు అనసూయ. ఏ జానపద పరిశోధకుడూ ఇంతకుముందు అలా చేయలేదు. మొత్తమ్మీద పదకొండు గ్రంథాలను వెలువరించారు. తన 94వ ఏట ఆత్మకథను 'అసమాన అనసూయ'గా అక్షరబద్ధం చేశారు. పదం, పాట సేకరించినా, పాడినా, స్వరపరచినా ఆమెకు ఆమే సాటి.

తెలుగుమాట వినబడే ప్రతిచోటా తెలుగు పాటలు పాడుకునే సంస్కృతి, జానపదాలను స్మరించుకునే సంస్కారం, జానపద కళాకారులను గౌరవించే సభ్యత- వీటిని నేర్పడానికే ఆవిడ ఒక జీవితకాలం శ్రమించారు. అందుకు మనమంతా అనసూయకు రుణపడి ఉండాలి.

తెలుగు వెలుగు సౌజన్యంతో



ముంజులూరి కృష్ణకుమారి ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు. పిల్లల కోసం అనేక రచనలు, అనువాదాలు చేశారు. ఆకాశవాణిలో స్త్రీలు, పిల్లల కోసం పలు కార్యక్రమాలు నిర్వహించారు. కథారచన, సమీక్ష, కథ చెప్పడం పై పిల్లల సృజన ప్రోత్సహించేందుకు వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. పలు బాల సాహిత్య పురస్కారాలు పొందారు. నివాసం విజయవాడ.

KALASHA
FINE JEWELS

Presents

EXHIBITION & SALE
AT TANA

4TH - 6TH JULY
11 PM - 7.30 PM

WALTER E,
WASHINGTON CONVENTION CENTER,
WASHINGTON DC

KALASHA JEWELS LLC

In Association With

CapsGold®

A Joint Venture Of

SVK SYSTEMS IT Experts

Veridic SOLUTIONS

HYDERABAD | VIJAYAWADA | BENGALURU | USA
Call : +1 678 387 2899 | WhatsApp : +91 91212 91936
info@kalashausa.com



BEST EVER in the History of ANDHRA & TELANGANA

alakananda

South India's 1st RiverFront Community!

A Rare **300 Acre Gated Community** *of* Villa Plots *on the* Krishna River

30 Mins *by Boat* & **45 Mins** *by Road to* **AMARAVATI**



CRDA / DTCP Approved Plots	3 km Riverfront Boulevard	40 Acre Botanical & Herbal Garden	Riverfront Club House	Adventure & Water Sports	Senior Citizen Active Living Homes
266, 300. 400, 500 & 1000 Sq Yards	★ Holistic Medicine & Wellness Center	★ Passenger & Cargo Cruise Terminal	★ 10 Acres *of* Sports Facilities	★ Spiritual Living Temples & Ashram	★ Gateway to AMARAVATI

G&C Global Consortium

A Leading Real Estate Developer & Consultancy Firm of India

Invest in **Serviced Hotel Apartments across India** to

Earn High Monthly Rental Income

of **Rs.20,000** to **80,000 per month** on Investment of just Rs.33 to 90 Lakhs




4x Greater Rentals than Regular Apartments ★ **ZERO Maintenance** for You for next 20 Years ★ **Successful Model** Already Operational ★ **Highly Affordable** Home Loan Available

gcglobal.in/monthly-income

Divyendhu **+1 845 248 0012** / adrc@gcglobal.in

ALLERGY & ASTHMA Affiliates

TOP DOCTOR from Washingtonian and Northern Virginia Magazines



Srinagesh Paluvoi, MD
Diplomate, American Board of Pediatric & Adult Allergy-Immunology

Specializing in:

- Nasal Allergies
- Allergic Asthma
- Food Allergies
- Chronic Sinus Problems
- Chronic Hives
- Immune Problems . . .

For Appointments Please Call:
703.729.8830 or
703.753.5518
www.vasneezers.com

We Accept Most Insurances

Office Locations:

19415 Deerfield Ave #210 Lansdowne | **703.729.8830**

7576 Gardener Park Drive Gainesville | **703.753.5518**

LAW OFFICE OF THOMAS V. ALLEN, PLLC.

PRACTICE LIMITED TO IMMIGRAION & NATIONALITY LAW



LEADERS IN BUSINESS IMMIGRATION LAW

- The fastest growing imimgration law firm
- The most knowledgeable business immigration attorneys
- Always delivering highly personalized service

NON IMMIGRANT BENEFITS CATEGORIES

- E-1 (Treaty Trader & Treaty Inestor)
- F-1 (Student Visas)
- H-1B (Specialy Worker)
- J-1 Waiver(Advisory Opinion)
- L-1 (Intra-Company Transferees)
- O-1 (Outstanding Researcher)
- R-1 (Religious Workers)

EMPLOYMENT BASED IMMIGRATION CATEGORIES

- NIW (National Interest Waiver)
- EB-1 (a) (Alien of Extraordinary Ability)
- EB-1 (c) (Multinational Manager or Executive)
- PERM Labor Certification
- EB-2 Based on PERM (Professionals, skilled workers and other workers)
- EB-5 (Investor Visa)
- Adjustment of Status
- Concurrent Filing of I-140 & I-485
- Advance Parole
- Work Permit

THOMAS V. ALLEN, ESQ.
ATTORNEY-AT-LAW



GEORGE A ALLEN, ESQ
ATTORNEY-AT-LAW

MIKA B KOZAR, ESQ
ATTORNEY-AT-LAW

DISNA WEERASINGHE, ESQ
ATTORNEY-AT-LAW

SEEMA BANDA, ESQ
ATTORNEY-AT-LAW

Hire us
Experience the success !

South Plainfield, NJ:
50 Cragwood Road, Suite 100, NJ 07080
(732)-832-7978 (732) 444-5998
WWW.THOMASVALLEN.COM

Princeton, NJ:
4390 Route 1 North, Suite 230, NJ 08540
info@thomasvallen.com

AMERICAN BAR ASSOCIATION

సంచిక



ఈ ఆవరణంలో...

1. విచ్చుకున్న సోయగం	నందిని సిధారెడ్డి	109
2. పూలు... పద్యాలు	రవి వీరెల్లి	110
3. మథనం, ఒక మౌనికి	దేవిప్రియ	111
4. తెల్లవారుఝాము కల	శిఖామణి	112
5. లోపలా బయటా	దర్భశయనం శ్రీనివాసాచార్య	113
6. వాలిపోతున్న నీడ	ముకుంద రామారావు	114
7. ఆఖరికి...	విస్సకోట రవిశంకర్	115
8. వెళ్తూ వెళ్తూ...	నిషిగంధ	116
9. నన్ను మరచిపోకు	తమ్మినేని యదుకుల భూషణ్	117
10. ఒకసారి...	స్వేచ్ఛ	117
11. పిల్లల్లేని రోజొక రోజా	బాలసుధాకర మౌళి	118
12. వృద్ధాశ్రమం	సుధారాణి కొండపు	119
13. మళ్లీ ఒక్కసారి...	దేవనపల్లి వీణావాణి	120
14. యుద్ధ వర్షం	బండ్ల మాధవరావు	121
15. పన్నెండుకోట్ల పన్నెండు	అనిల్ డాని	122



VENKAT GURRAM - *MD REALTOR®, Notary Public*
FINANCIAL SERVICES PROFESSIONAL
© 443-776-0990
@ VENKATGURRAM.FINANCIAL@GMAIL.COM

WEALTH BUILDING STRATEGIES & SOLUTIONS

- TAX SAVINGS & OPTIMIZATION
- INVESTMENT STRATEGIES
- REAL ESTATE INVESTMENTS
- RETIREMENT SOLUTIONS
- LIFE INSURANCE OPTIONS
- DOWN MARKET PROTECTION
- WILL & TRUST
- COLLEGE SAVINGS
- LONG TERM CARE
- LAND BANKING
- OIL & GAS INVESTMENTS
- CREDIT CLEARANCE

We bring value to your money

SRK SYSTEMS, INC.

Software, Research & Knowledge

విచ్చుకున్న సోయగం

నందిని సిధారెడ్డి

నాడు తెలుగుభాష
మహోన్నాదు తెలుగుభాష
వేయి పువ్వులొక్కసారి
విచ్చుకున్న సోయగం
కోటి తీగలొక్కసారి
స్వరపరిచిన రాగం ॥నాడు॥

నవరసాలు నడయాడే
కవన సుధా కౌశలం
జానపదుల జనజీవం
తొలుకు పలుకు మధురిమం ॥నాడు॥

పెయ్యి మీద చెయ్యి వేసి
తడిమినంత పులకింత
ప్రేమతొనలు రంగరించి
పిలిచినంత చెమరింత ॥నాడు॥

కార్తెలన్ని ఆర్తితోని
అలదిన రుతుశోభ
నాల్కలెన్నో చిలికి చిలికి
మలచు రుచుల తేజోప్రభ ॥నాడు॥

యుగ యుగాల దాడులెన్నో
తట్టుకొన్న గట్టి భాష
భాష యాస బతుకుదెరువు
తన ముద్రల తల్లి భాష ॥నాడు॥

నుడుల్ పలుకుబడుల్ చెరుకు గడల్
లయల్ మాట హొయల్ సొగసు క్రియల్
వసంతమే వొచ్చినా వరదలే పొంగినా
వర్థిల్లు వర్థిల్లు తెలుగుభాష
ఇల్లిల్లు తుళ్లింత జల్లులై
వర్థిల్లు తెలుగుభాష ॥నాడు॥



పల్లెతనాన్ని తనలో నింపుకున్న కవి. అదే తన కవిత్వంగా ముప్పై సంవత్సరాలుగా ఆరు సంపుటాలుగా విస్తరించింది. రెండు వ్యాస సంపుటాలు, పాటలు, కథల పుస్తకం ప్రచురించారు. వివిధ సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలంగా పనిచేశారు. ఇటీవలే సమగ్ర కవితాసంపుటి ప్రచురించారు. నివాసం హైదరాబాద్. 'నాగేటి చాల్లల్ల నా తెలంగాణ' పాటకి నంది పురస్కారం లభించింది. తెలంగాణ సాహిత్య అకాడెమికి అధ్యక్షులు. 2019 తానా సభల అతిథి.

పూలు... పద్యాలు

రవి వీరెల్లి

నువ్వొస్తున్నావన్న వార్త ఎట్లాగో అట్ల
మొదటి కిరణం కంటే ముందే
ముంగిట్లో పొగమంచై వాలింది.

పూర్తిగా తెల్లారకముందే
పువ్వుకొక్క ప్రేమవాక్యాన్ని కట్టి
బొండుమల్లె చెట్టులా
పూలన్నీటినీ పరుచుక్కూచుంటానా...

కన్నీటి అడవుల్ని కళ్లలో దాచుకుని
బీరపువ్వు సిగలో తురుముకుని
ఎప్పట్లానే నవ్వుకుంటూ నువ్వొచ్చావు.

మాటకు మాటకు మధ్య
భాషకులొంగని ఇష్టవాక్యాలు
గొంతులో పూడుకుపోయాక,

చూపుకు చూపుకు మధ్య
రూపం లేని దేహాలు
రీళ్లు మార్చుకున్నాక,
నువ్వొచ్చింది
బాధల్ని హత్తుకుని ఓదార్చే
పద్యాల కోసమని తెలిసిపోయాక
పరిచిన పూలన్నీటిని
మూటకట్టుకుని వెనుదిరిగాను.

కళ్లు నిండుకున్నప్పుడే
దార్లన్నీ మూసుకుపోతాయెందుకో!

నీదీ నాదీ కాని నగరంలో
ఇప్పుడు
పూలకీ పద్యాలకీ మధ్య
నిచ్చెన ఎవరేస్తారు?



రవి వీరెల్లి పుట్టింది కరీంనగర్ జిల్లాలోని ఆముదాలపల్లి గ్రామం. 'దూప', 'కుందాపన కవితాసంపుటాలు ప్రచురించారు. వాకిలి అంతర్జాల పత్రిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం వర్జీనియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు.

దేవిప్రియ కవితలు

మథనం

సముద్రం దగ్గరికి
వెళుతున్నావా?
నీ లోపలి
సాగరం సంగతి ఏమిటి?

ఆకాశాన్ని తాకి రావాలని
అనుకుంటున్నావా?
నీ లోపలి
అనేక గగనాల సంగతి ఏమిటి?

భూమిలోకి తొలుచుకుపోయి
పొరలు తెరలు తీసి
చూడాలనుకుంటున్నావా?
నీ లోపలి
నేలల నెరెల సంగతి ఏమిటి?

గాలిలో రవ్వలు ఎగరడం లేదని
దిగులు పడుతున్నావా?
నీ లోపలి
నివురులయిన నిప్పు సంగతి ఏమిటి??

ఒక యోనికి

నువ్వు
ఎక్కడ ఏ ఎడారి తోటలో
ఏ రంగు వెలిసిన గాలికి
నవవర్ణ వస్త్రానివై వేలాడుతున్నావో
తెలియదు...


నువ్వు
ఎక్కడ ఏ ఏటి ఎండిన ఉదరం మీద
ఏ పావన పయస్సులు చిలకరించి
ఏ నవాంకురాలు నాటుతున్నావో
తెలియదు.

నువ్వు
ఎక్కడ ఏ యోచనం వనవాటికలో
ఏ తపో కపోతాలకి
ఏ తత్వబోధనలు విసురుతున్నావో
తెలియదు.

నువ్వు
ఎక్కడ ఏ పొంగిపొరలుతున్న
అంధకార జలాశయానికి ఆకాశమెత్తు
ఆనకట్టవై వెలుగుతున్నావో
తెలియదు

ఇక్కడ
నిప్పులు చెరుతుగున్న నియంత్రణ రేఖకి ఇరువైపులా
నేనొక్కడినే ఏకకాలంలో
యుద్ధానివై శాంతినై
చిమ్ముతున్న నెత్తురునై చిందుతున్న అమృతాన్నై
నేనొక్కడినే...!

(ఖాదర్‌కి...)



కవిగా, జర్నలిస్టుగా, సినీ రచయితగా ప్రముఖులైన దేవిప్రియ ఎనిమిది కవితా సంపుటాలు ప్రచురించారు. డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ కె.జె. రావు జీవిత కథని 'డాన్సింగ్ విత్ కోబ్రా' అనే పేరుతో ప్రచురించారు. వీరి 'రన్నింగ్ కామెంటరీ' ఆంధ్రప్రభ, ఉదయం పత్రికల్లో ప్రముఖమైన శీర్షికగా పేరొందింది. 'గాలిరంగు' కవితాసంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించింది. నివాసం హైదరాబాదు.

తెల్లవారుఝాము కు

2019 తానా సభల అతిథి కవిత

శిఖామణి

తెల్లవారుఝామున
అందమైన ఒక కలవొచ్చింది

నాలోంచి
నా పక్కటెముక ఒకటి విడిపడి
ఆరడుగుల సర్పిణియై
చూస్తుండగానే
జరజరా పాక్కుంటూ వెళ్లిపోయింది
మరికాసేపటికి
నేనూ మానవ కుబుసం విడిచి
గోధుమ వర్ణపు కోడెత్రాచునై
దానిని వెంబడించాను
ఎంత దూరం వెళ్లామో
నదులు అడవులు
ఎడారులు మైదానాలు
ఎన్ని పగళ్లు మరెన్ని రాత్రులు
ఒకదాని వెంట మరొకటి
ఒకదానిని మించి మరొకటి
ఎన్ని యోజనాలు పరుగెత్తామో
మాకే తెలియదు

చివరకు
ఒక వెన్నెల రాత్రి
ముఖ్‌మల్ గుడ్డలాంటి
మెత్తని ఆకుపచ్చ మైదానంలో
అలసిసొలసి ఆగిపోయాం!
అప్పుడు ఆకాశం ఒకింత కిందకు వొంగి
మాకోసం కల్లు నురగలాంటి వెన్నెలను
ధవళ వస్త్రపు శయ్యగా పరచింది.

శిరసులెత్తి
పడగలెత్తి
మోహపు మంటల
చీలికల నాలుకలతో
ఒకరినొకరు స్పృశించుకున్నాం
ఒకరినొకరు
బిగికౌగిళ్ల పీఠములుడులై
అల్లుకుపోయాం!
వొట్టి గడ్డి పరకలను
గుప్పెడు గుప్పెడు జోడించి
మెలిపెట్టి ఎంటును పేనినట్టు
వొకరి నొకరం ఎనవేసుకుపోయాం!

ఉతికిన వస్త్రాన్ని
నీళ్లు పిండడానికి
ముమ్మార్లు మెలితిప్పినట్టు
ఒకరినొకరం మెలితిరిగిపోయాం
ఆకల్లాడలేదు గాలి కంపించలేదు
చుట్టూ నిబిడ నిశ్శబ్ద సౌందర్యం!

అంతవరకూ
సముద్రపు కెరటాల్లా
హోరెత్తిన ఉచ్ఛ్వాస నిశ్వాసాల బుసలు
ఒక్కసారిగా నెమ్మదించాయి.
అంతవరకూ
ఒక్కటిగా సాగిన రైలుపట్టా
రెండుమార్గాలుగా చీలినట్టు
చెరోవైపు
ఒకరికొకరు తెలియనట్టుగా
వెళ్లిపోయాం!

తెల్లవారు ఝామున
మంచికల ఒకటి వొచ్చింది
అందమైన కవితావాక్యం
నన్ను సుతారంగా తట్టిలేపుతున్నట్టు



ముప్పై ఏళ్లకు పైగా కవిత్వం రాస్తున్న శిఖామణి తొమ్మిది కవితాసంపుటాలు, నాలుగు వ్యాససంపుటాలు ప్రచురించారు. కవిత్వంలో వివిధ ప్రతిష్టాత్మక పురస్కారాలు పొందారు. యానాం నుంచి వెలువడుతున్న 'కవిసంధ్య' పత్రిక నిర్వాహక సంపాదకులు. నివాసం హైదరాబాద్. 2019 తానా సభల అతిథి.

లోపలా బయటా

దర్భశయనం శ్రీనివాసాచార్య

ఇంత సందడి లోపల ఉత్సవంలా వుంటే
దీన్ని వొట్టి ఏకాంతమని
ఎట్లా అంటారు ఎవరైనా

ఒకటని కాదు,
ఒక అడవి, ఒక సరస్సు, ఒక నది, ఒక పొలం
ఒక ఆకాశం, ఒక పక్షి, ఒక నక్షత్రం, ఒక మేఘం

ఇంకా ఏవేవో కలిసి లోపల కొలువుంటే
దీన్ని వొట్టి ఏకాంతమని
ఎట్లా అంటారు ఎవరైనా
ఒక్క బయటి నిస్సవ్వడినే పట్టుకుని!

అన్నీ ఒక్కసారే రాలేదేమో నా లోపలికి!
ఒకటి పసితనంలో, మరోటి చదువుల రోజుల్లో,
ఇంకొకటి ఓ యాత్రావిహార వేళలో,
మరొక ఇంకొకటి ఓ మైత్రీసంగమంలో,
ఇంకొక మరొకటి నిన్నటి కాలిబాటలో
బహుశా చేరాయేమో నన్ను అడిగో, అడగకనో-
కానీ చేరిన వేళలు నాకూ తెలియదు

వచ్చినవన్నీ వుండిపోయాయని కాదు,
వుండిపోతాయని లేదు
వెళ్లిపోయేవి వెళ్లిపోగా కొత్తగా చేరేవి కొన్ని-
కనుకనే ఎప్పటికప్పుడు కొత్త సందడి!
కనుకనే కాబోలు నాలో అపుడపుడు కొంచెం దిగులు
కొంచెం గుబులు!

బయట బతుకుతున్నట్లే లోపలా ఇష్టంగా బతగ్గలను
కాకపోతే అపుడపుడు లోపల నుంచి
బయటపడ్డానికి ఇచ్చగించను
అపుడపుడు బయటినుంచి లోపలికీ అంతే!

లోపలి సందడి చెదరొద్దని సంగీత కచేరీ ఆగొద్దని
బయట జాగ్రత్త పడతాను
అంతేనా, బహుశా నా బయటి బతుకును
నా లోపలి ఉత్సవం కాపాడుతున్నదేమో!
ఒకటి కోసం మరొకటి! ఒకటిని మరొకటి ఉద్దీపిస్తూ!

ఏమో!
అపుడపుడు నేను అడవిగానో, సరస్సుగానో
నదిగానో, పొలంగానో, ఆకాశంగానో, పక్షిగానో,
లేక ఒకానొక నక్షత్రంగానో, మేఘంగానో అగుపడతానేమో
ఎవరికైనా,
లోపలే బయటైనపుడు!



దర్భశయనం శ్రీనివాసాచార్య వరంగల్ జిల్లాలో పుట్టారు. కవి, విమర్శకుడు. ఎనిమిది కవితాసంపుటాలు, ఒక విమర్శనా వ్యాస సంపుటి ప్రచురించారు. కవిత వార్షిక సంకలనాలకు సహ సంపాదకులు. వార్షిక కవితాసంకలనం 'కవిత' సంపాదకులు. ఆంధ్ర బ్యాంక్‌లో ఉద్యోగం. నివాసం హైదరాబాద్. 2015 తానా సభల అతిథి.

కాలిపోతున్న నీడ

ముకుంద రామారావు

నీడల్ని మింగుతూ
నిశ్శబ్దం ఔషధాన్ని తాగుతూ
ఎవరికీ తెలియని చిరునామాకి
అందరికంటే ముందు చేరాలని
ఆత్రంగా అతనొక్కడే

ఎన్ని సూర్యుళ్లని చూసినా
ఇవాళటి సూర్యుడు
రేపు నిజంగా
కనిపిస్తాడా అనుకుంటాడు

వస్తానని ఊరించేవారు
వస్తారేమో ఎప్పుడో
వచ్చిన దగ్గరనుంచీ
వెళ్లిపోయే సన్నాహాలే
అని నిట్టూరుస్తాడు

అతనికే తెలుసు
తెలిసిన చిరునామాకయినా
ఎంత దూరం వెళ్లాలో
చేరేవరకూ ఆరాటమేనని

అతని నీడ అతన్ని మోస్తోందో
అతనే తన నీడను మోస్తున్నాడో
అతనికే తెలియదు
ఎంత భారంగా వాలిపోతున్నాయో ఆ నీడలు
నేలమీదో గోడమీదో
ఇతర నీడలతో కలిసిపోయేందుకు



ఖరగ్‌పూర్‌లో పుట్టి పెరిగిన ముకుంద రామారావు ఎనిమిది కవితాసంపుటాలు ప్రచురించారు. 1901 నుంచి నోబుల్ కవుల కవిత్వాన్ని, వారి జీవిత విశేషాలను పుస్తకంగా తీసుకొచ్చారు. శతాబ్దాల సూఫీ కవిత్వాన్ని, 10వ శతాబ్దపు బౌద్ధుల నిర్వాణ గీతాలు 'చర్యాపదాల'ను అనువాదం చేశారు. రైల్వేలో ఉద్యోగ విరమణ చేసి, హైదరాబాదులో నివాసం.

ఆఖరికి...

విన్నకోట రవిశంకర్

ఎప్పుడో ఎవరో రాస్తారు
ఈ జీవితం మీద చివరి వాక్యం.

నడచి, నడచి, నడచి
కొన్ని పరుగులు తీసి
అశ్వాన్నధిరోహించి
అవరోధాలెన్నో అధిగమించి
అలసి విశ్రమించాక
పొద్దుపోయే వేళ రాస్తారు
పడిన అడుగుల పద్దులు.

కొంత పగలు, కొంత నిశ
కొంత మెలకువ , కొంత నిషా
కొంత నిజం , కొంత భ్రమ
కొంత సంభ్రమం, కొంత నిరాశ
తగు పాళ్లలోనో, తగని పాళ్లలోనో
కలగలసిన మిశ్రమాన్ని
విడదీసి, విశ్లేషిస్తారు.

తెలిసో తెలియకో
పగతోనో ప్రేమతోనో
లేదా తమకే అర్థం కానీ అత్యుత్సాహంతోనో
ఆ మిశ్రమం నుంచి
మళ్లీ తమదైన సారాన్ని తీస్తారు.

ఒక చివరి వాక్యం రాస్తారు.



విన్నకోట రవిశంకర్ అమలాపురంలో పుట్టి, కాకినాడ, వరంగల్‌లలో చదివి సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. పుస్తకాలు చదవడం, కవితలు, వ్యాసాలు రాయటం వ్యాపకాలు. కుండీలో మర్రిచెట్టు, వేసవివాన కవితాసంకలనాలు ప్రశంసలు పొందాయి. భార్య శ్రీకళ, పాప హిమబిందులతో కొలంబియా సౌత్ కెరొలినాలో నివాసం.

వెళ్తూ వెళ్తూ...

నిషిగంధ

ఎన్నిసార్లని చెప్పలేదూ
వెళ్తూ వెళ్తూ వెనక్కి తిరిగి చూడకనీ...

కురిసెళ్లిపోయిన వానని దాయలేక
దక్షిణపు గాలితో దాగుడుమూతలాడే
ఆకుల మెత్తని అలజడి...
నువ్వు నాటిన నిద్రగన్నేరు చెట్టువే!

అది నాటుతూ మట్టి చేతుల్తో నవ్వే నీ ముఖం...

ఒక కొమ్మ వంగి పువ్వు ని నీకు పరిచయం చేసిన
ఆ లేతకాంతి సాయంత్రం

ఇదో ఇందాకటి వరకూ ఇక్కడే కూర్చుని లేచెళ్లిపోయిన
నునువెచ్చనితనం... ఇంకా పక్కనే!

వెళ్లడమూ... తిరిగి వచ్చేది తెలియకపోవడమూ సరే...
వెళ్తూ వెళ్తూ... కనుమరుగవుతూ
వెనక్కి తిరిగి చూడకని
చాలాసార్లే అన్నట్లున్నాను కదా!

అంటే ఎప్పుడూ చెప్తూనే ఉంటావనుకో
దూరాలన్నీ దిగుళ్లవ్వక్కర్లేదని
అయినా...
వరండా చివర్లలో నీ నీడ
మాయమవుతున్నప్పుడల్లా
గుక్కపట్టి ఏడ్వాలనిపిస్తుంది
గుమ్మం తగిలి బోర్లాపడ్డ పాపలా!

అక్కడే ఆగి అద్దంలో చూసుకుంటాను
నీ చూపు నిలచిపోయిన నా ముఖాన్ని
ఆరిందతనం కాస్త కాస్తా ఆ ముఖానికి
అద్దుకంటూ అనుకుంటాను,
సంభాళించుకోవడం సులువయ్యేదెలానో!?'



విజయవాడలో పుట్టి పెరిగిన నిషిగంధ ఐటి ప్రొఫెషనల్. పుస్తకాలూ, పాటలూ, సినిమాలూ... అతి దగ్గరి స్నేహితులతో బోల్డంతసేపు మాట్లాడుకోవడం ఇష్టమైన వ్యాపకాలు. మానసవీణ అనే బ్లాగుని నిర్వహిస్తున్నారు. నిషిగంధ బ్లాగు అడ్రెస్- http://nishigandha-poetry.blogspot.com/

నన్ను మరచిపోకు

తమ్మినేని యదుకుల భూషణ్

సరోవరాల ముందు
గాలికి ఎగిరే
శిరోజాలతో నీవు

ప్రతిబింబంలా
నిశ్చలంగా
నిలబడతావు

ప్రియా

నీ భాష నాకు రాదు
నా మాటలు నీకు అర్థం కావు

గడ్డి మైదానాల్లో
దళసరి చర్మం గల
అడవి జంతువు
ఒకటి ఈనింది

కళ్లు తెరవని దూడ
తల్లిని వీడదు క్షణం

చెల్లాచెదురుగా
సూర్యకిరణాలు

తటాలున మెరిసిపోతాయి
తటాకంలో నీరు

'నన్ను మరచిపోకు'

తమ్మినేని యదుకుల భూషణ్ కవితలు, కథలు, విమర్శలు రాసినా కవిగా ప్రసిద్ధులు. నిశ్శబ్దంలో నీ నవ్వులు కవితా సంకలనం ప్రచురించారు. రాయలసీమలో జన్మించిన వీరు కొన్నాళ్లు సింగపూర్‌లో పనిచేసి ప్రస్తుతం న్యూజెర్సీలో సోమర్‌సెట్‌లో నివాసం.

ఒకసారి...

స్పేచ్ఛ

ఒకసారి చూడు...
అక్కడ ప్రపంచమే లేదు...
అంతమే లేదు...
మొదలూ లేదు...
కాలం... అలా...
కదులుతూనే ఉంది...

ఎక్కడికెళ్లాలో...
ఎలా వెళ్లాలో తెలియక
ఎక్కడెక్కడో తిరుగాడుతుంది...
ఒడ్డున కూర్చున్న
ఇద్దరు ప్రేమికులను చూసి...
తన అస్తిత్వాన్ని ప్రశ్నించుకుంటూ...

ప్రపంచంలోని
సముద్రాలన్నింటి మీద
ప్రతి అలనూ స్పృశించి
ప్రశ్నిస్తూ...
ఆ ఇద్దరూ
ఒకేసారి తాకిన
అల మీద
అలసి ఆగిపోయింది...



కవిత్వంలో వికసించిన మరో కొత్త గొంతుక స్పేచ్ఛ. 'మట్టిపూల గాలి' కవితా సంపుటి ప్రచురించారు. తెలుగు టివి9లో వార్తలు చదివే స్పేచ్ఛ నివాసం హైదరాబాదు.

పిల్లల్లేని రోజొక రోజా

బాలసుధాకర్ మౌళి

పిల్లల్లేని రోజొక రోజా
బడిలో పిల్లల మధ్య బతికిన క్షణాలు
నిజాలో అబద్దాలో
పిల్లల్లేని ఒక్కరోజూ గడుస్తున్నట్టు లేదు
పోనీ
బిలబిలమని చీమల్లా పుట్టుకొచ్చే
వీధంతటినీ వెన్నెల వనంగా మార్చే
చుట్టుపక్కల ఇళ్లల పిల్లలేరీ
వాళ్లూ లేరు
వేసవికి నీళ్లే కాదు
పిల్లలూ అదృశ్యమౌతున్నారు

పిల్లల్లేని రోజొక రోజా
వడగాలులకు వొళ్లు కాలో భయపడో
ఏ గదిలోనో
పిల్లలు అతుక్కుపోయుంటారు

కోడిపిల్లలను పిలిచినట్టు
పిల్లలనూ పిలవటానికి
ఇంకో కొత్త భాష ఎవరి వద్ద నేర్చుకోవాలో
ఎవరూ పత్తా లేరు
ఒక్క వానపడితే
ఆకాశం కన్ను తెరిచి
ఒక్క చినుకు పువ్వును రాలిస్తే
ఏమో
పిల్లలొస్తారేమో
ఏమో
భుజాలపై ఇంద్రధనుస్సును మోసుకొచ్చి
వీధి ముఖద్వారానికి అలంకరిస్తారేమో
ఈ వెచ్చని వేసవిలో
ముఖాల మీద చల్లని నీళ్లను చిలకరించే
లేత చిట్టిచేతులు
ఇక్కడికిక్కడే పుట్టుకొస్తాయేమో

పిల్లల కోసం
పిల్లలు ఎప్పుడూ వుండే రోజు కోసం
చినుకు కన్నులతో వేచి చూస్తున్నాను



29 ఏళ్లకే రెండు కవితాసంపుటాలు, రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలు పొందిన కొత్త కవితావీచిక బాలసుధాకర మౌళి. 2018 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారం లభించింది. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వీరి నివాసం పోరాం గ్రామం, విజయనగరం జిల్లా.

వృద్ధాశ్రమం

సుధారాణి కొండపు

అదొక ప్రత్యేక ప్రపంచం
బిడ్డలుండీ గొడ్రాళ్లయిన తల్లులు...
రెక్కలొచ్చి ఎగిరిపోయిన బిడ్డల తండ్రులు.

అవ్వా... బువ్వ తిన్నావా
అన్న పలకరింపుకే పులకరించే మనసులు!
తాతా... ఎలా ఉన్నావని
తట్టి అడుగే స్పర్శకై తహతహలాడే తనువులు!

కొన్ని వందల ముసలి ప్రాణాలు
...ఒక్కో ప్రాణానిదొక్కొక్క గాథ

తల్లీ...
నీ రుణం తీర్చ మరుజన్మకు తల్లినై
పుడతానన్న కూతురికి...
ఈ జన్మలో రుణం తీర్చ తీరికే లేకపోయే.

నాన్నా...
నీ అడుగు జాడల్లో నడుస్తానన్న కొడుక్కి
...నా అడుగులెక్కడున్నాయనే ఆలోచనే లేకపోయే!

అప్పులు చేసి చదివించిన గొప్ప చదువులు
ముప్పుతిప్పలై...
మమ్మ రోడ్డున పడేస్తాయని ఊహించకపోయే!

దొరలాగా పెంచిన గారాలపట్టి
దొరల దేశానికి తాకట్టై... కన్న దేశమే కానరాదాయె!

పున్నామ నరకం నుంచి రక్షిస్తారన్న పుత్రులు
పుట్టకపోయినా... మాకే నరక ముండకపోయే!

మానవత్వం మమతై పొంగి పెంచిన అనాథ బిడ్డ
దానవత్వం దాపురించి మమ్మనాథల్ని చేసిపోయే!

కొరివి పెట్ట బిడ్డలేదని కుమిలిపోయే నొక తల్లి,
కొడుకు ఉండీ కొరివిపెట్ట కానరాడని కుమిలిపోయే
మరోతల్లి!

అనాథ ప్రేతాల'కు కొరివి పెట్టే
నా లాంటి' అన్నలు ఇక్కడున్నారనీ,
నాకై అశ్రుధారలర్పించే అక్కలున్నారనీ,
కాటికి కాలుచాపి కుమిలిపోతూ కాష్టాని కెదురుచూసే
...కొన్ని నిర్జీవమైన మనసుతో జీవమున్న కట్టెలు.

గాథలెన్నైనా గోడు ఒక్కటే
మనిషైన వాడికి మది చలించే
ఎన్నో ' మమతలున్న ప్రపంచం'...
అదే వృద్ధాశ్రమం



గోదావరి జిల్లాలలో పుట్టి పెరిగిన కొండపు సుధారాణి ఒక వృద్ధాశ్రమాన్ని చూసి తన మనసును కదిలించిన వ్యథలను చిన్న కవితగా కుదించారు. మాతృభాష పై మమకారంతో వర్జీనియాలో గత 9 ఏళ్లుగా వేసవి శిబిరాల ద్వారా భావి తరాలకు భాషనందించడంతో పాటు, ఇక్కడి తెలుగు సంస్థలలో చురుకుగా పాల్గొంటారు.

మళ్లీ ఒకసారి...

దేవనపల్లి వీణావాణి

ఎటు చూసినా
కుంచించుకుపోయిన
ప్రపంచం కిటికీలోకి
మంత్రమేసినట్టు
వంచిన తలలే

చేతులు ఖాళీ లేవు
నాలుకను విడిచిన భాష
కళ్లూ మునివేళ్ల నడుమ మరుగుజ్జు గుర్తులయింది

మర్చిపోయిన దారిలో తప్పిపోయిన మెదడుతో
పాతికేళ్ల ముగ్గుబుట్టలు పరుగులు పెడితే
తాళం వేసుకున్న ముఖంతో
తలుపెప్పుడూ గాలిని పిలవదు...

ఈసారైనా
ఈ ఖాళీ ఇంట్లో
కనీసం కలలోనయినా
మళ్లీ ఒకసారి
పచ్చి బురదలో నత్తగుల్లనవ్వాలి
కుప్ప పోసుకున్న ఇసుక దాపున
దూదుపుల్ల నాడాలి

దొంగతనంగానైనా
చిలకకొట్టిన జామపండు తెంపి
చిటికెల పందిరి పాడాలి...
మనమిచ్చే బహుమానం



జూలపల్లి మండలం, పెద్దపల్లి జిల్లాకి చెందిన వీణావాణి వృక్షశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి, అటవీశాఖలో అసిస్టెంట్ డైరెక్టరుగా తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడెమిలో పనిచేస్తున్నారు. సాహిత్యాభిరుచితో సున్నిత భావాలను వ్యక్తపరచే వీరి కవితలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. 'నిక్షణ' కవితాసంపుటి ప్రచురించారు. నివాసం వరంగల్.

యుద్ధవర్షం

బండ్ల మాధవరావు

ఒక అసంకల్పిత యుద్ధానికి వారసుడ్నయ్యాను
యుద్ధం మొదలవ్వక ముందే
ఆయుధ వలయంలో చిక్కుకున్నాను
రగులుతున్న ప్రతీకారేచ్ఛలో
తగలబడుతూనే
ఓ కొత్త సూర్యోదయాన్ని
కలగంటున్నాను

అనాహ్వానిత నిర్బంధపుటంచులకు వేలాడుతూ
శిశిరోదయాల్ని ధ్వంసం చేస్తున్నాను
వాడు ఆయుధాల రంగులు మార్చినప్పుడల్లా
నా పక్కటెముకల్లోంచి
కొత్త ఆయుధాల్ని సృష్టిస్తున్నాను

జీవితాన్ని రణరంగంగా మార్చి
నిరంతరం యుద్ధవర్షాన్ని కురిపిస్తున్నాడు
వాడి జెండా, ఎజెండా యెప్పుడూ ఒక్క వర్ణమే
నా ముందు మాత్రం సప్తవర్ణ సమ్మిశ్రిత
మాటల్ని పరుస్తుంటాడు

యుద్ధం నిత్యమైనచోట
ఆకలి వాడికి ఓ ఆట
నా ఓటమి వాడికి తాత్కాలిక గెలుపు
పతనపు రహదారుల్లో ఎగురుతున్న వాడు
నేలను తాకినప్పుడే నన్నూ తాకగలడు
వాడిని గాల్లోనే అంతం చెయ్యడమే
ఎదురుగా నిలిచిన లక్ష్యం



మూడు కవితాసంపుటాలు, ఒక దీర్ఘకవిత ప్రచురించిన బండ్ల మాధవరావు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. పిల్లలకి రచనలో శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. విజయవాడలో శిఖర స్కూలు నిర్వాహకులు. వివిధ సాహిత్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. నివాసం విజయవాడ.

పన్నెండొకట్ల పన్నెండు

అనిల్ డాని

పన్నెండొకట్ల పన్నెండు
మూడువందల అరవై ఐదు రోజుల్లో
పన్నెండు ఒకటో తారీకులు
జీవనసూత్రాల లెక్కలు ఎప్పటికి అర్థంకావు

కనబడరు, కానీ నీవెంట కొంతమంది
నడుస్తూనో పరిగెడుతూనో ఉంటారు
నీ చమట సువాసన మీద ఇష్టంతో
జేబు వెనక గుండెలో భద్రంగా
నాన్నలు, అమ్మలు, కొడుకులూ, కూతుర్లు
జబ్బులు, మందులు, ఫీజులు
అన్ని కలిపి బాధలూ

తల దిమ్మెక్కిపోతుంది
ఇరానీ టీ అయిదు రూపాయలు
సాయంత్రం ఇంట్లో టీ పొడి నిండుకుండ
తల లేకపోతే ఎంత బాగుండు
తలపులు ఉండవు
మధ్యాహ్నం ఆకలిని తప్పించుకోవడానికి
ఉపవాసాలు అక్కరపడతాయి
అసలే బియ్యం కేజీ యాభై

రాత్రికి మాత్రం ఆమె ఎలాగోలా పొద్దుటి భారన్నంతా
కాస్త ఎక్కువే మోస్తుంది అదో వెసులుబాటు
అనుకుంటావు గాని
తనని తనతోపాటు నువ్వు కూడా ఓదార్చలేవు
ఇద్దరిది ఒకే శిక్షా విధి
నువ్వు బయట ఆమె లోపల
కలత నిద్ర
భావాల కుమ్మరింత
సగం విరిగి పడిన రాత్రిలో నుదిటి మీద ముద్దు ఒకటి
కాస్త ఉపశమనం ఈ పర్వంలో

రోడ్లు తప్పించుకుని తిరగడానికే ఉంటాయి
తిట్లు మాత్రం సమాధానం కూడా చెప్పనివ్వవు
పైకి కొన్ని నవ్వుతూ కొన్ని
చేబదుళ్లు కొన్ని
నేను కదారా అప్పు చేసింది
అమ్మేం చేసిందిరా, అక్కదేం పాపంరా
అడగలేం...

అంతా చిద్విలాసమయం
స్వీయ ఊరడింపు
తెగిన చెప్పుకి మేకు కొట్టలేని బలహీనత

ఒక గట్టి మాట ఎప్పుడో ఒకసారి
దిగులు గూడుని చిదిపి మౌనంగా కూర్చుంటుంది
ఎవడూ ఆపలేని సముద్రం కళ్లలో తెగిపోతుంది
దాన్ని ఎవడూ చూడడు
తెలివిలేదనే ఒక్క వాక్యం మాత్రం
ఒంటికి మీద పచ్చబొట్టులా మిగులుతుంది

రెండువైపులా సమానంగా లాగబడే
తాడుఎటు మొగ్గాలో తెలీనప్పుడు
తనకు తానుగా పిగిలిపోవడమే సత్యం
రోజు పగిలిపోయే పాత్రకి ఎన్ని అతుకులేస్తే
ఆగుతుంది
ఎప్పటికప్పుడు ఒకటో తారీకో
జడ పదార్థం
నీ ఆస్తి అప్పుల పట్టీని
ఎప్పటికి సమం చేయని ఒక కనబడని సర్దుబాటు
ప్రతీ ఇల్లోక చిట్టా కాగితం
ప్రతీ పని ఒక పద్దు లెక్క

సంపాదనలేని వాడని
చాలని వాడని
రెండు గుంపులు చేసి ఆవర్జా రాసి
రానిబాకీలని నిర్ధారణ చేసి
చాటింపు ఒకటి వేయించి
ఉరితాళ్లని సిద్ధం చేయాలి
లెక్కలన్నీ పూర్తయ్యాక
మిగిలిన వాళ్లంతా డబ్బు తింటూ
అందులో ఉంటూ ఉంటూ ఉంటూ
కడుపు మిగలపండిపోతారు
భూమి చల్లబడి కాస్త మెత్తబడుతుంది
శేషం సూన్యం వస్తే లెక్క సరిపోతుంది



ఇటీవలి కాలంలో విరివిగా కవిత్వం రాస్తున్న అనిల్ డాని 'ఏనిమిదో రంగు' కవితాసంపుటం ప్రచురించారు. నివాసం విజయవాడ దగ్గర కొండపల్లి.

Persis BIRYANI INDIAN GRILL

44050 Ashburn Shopping Plaza, Ashburn VA - 20147

(703) 723-0040 CATERING@persisindiangrillva.com

AUTHENTIC INDIAN FOOD



GRUBHUB

DOORDASH

Uber Eats



We have seen a billion people derive great satisfaction from a plate of authentic, flavorful royal cuisine

BIRYANI

and wanted America to experience this pleasure as our signature dish.

ప్రవాసీ తెలుగు వారికి ప్రత్యేకం

మన రేడియో

మన సంగీతం... మన సంస్కృతి...

Multiple Radio Stations

Live Radio: Rjs, Celebrities, Music, Cine News

My Radio: ఈనాడు | ఆంధ్రజ్యోతి | సాక్షి

Devotional: Customized For Everyday

Millennium Hits: Latest Hit Music and Entertainment

Entertainment: Evergreen Hits and Entertainment



Launched in more than 20 Locations in USA

LOCAL TELUGU COMMUNITY UPDATES

Entertainment 24X7

Download "manaradio" or manaradio.in

Download on the App Store

ANDROID APP ON Google play

కథాసారం



ఈ ఆవరణంలో...

1.	నిమజ్జనం	సాయిబ్రహ్మోపందం గొర్తి	127
2.	కంచికి చేరని కథలు	కొత్తావకాయ	133
3.	పృష్టిలో తీయనిది	డా॥ నక్కా విజయరామరాజు	138
4.	తొవ్వ	కొట్టం రామకృష్ణారెడ్డి	143
5.	పుత్రోత్సాహము తండ్రికి	ఎస్. నారాయణస్వామి	149
6.	బలభద్రపురం రైల్వేస్టేషన్	వంశీ	154
7.	పేరే పాచికాయే	తాడికొండ కె. శివకుమార శర్మ	158
8.	పడమటి తీరాన ఓ కోయిల	శ్రీనిధి యల్లల	163
9.	లోపలి చొక్కా	సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి	168
10.	రాణి-దాసి	పాలపర్తి ఇంద్రాణి	174
11.	త్రుటిలో...	చందు శైలజ	178
12.	వాడొస్తాడు	మల్లిపురం జగదీశ్	183
13.	జ్ఞాపకం	హరిబాబు మద్దుకూరి	188
14.	అహం-దారం	లలిత	192
15.	మేడిపండు చూడ మేలిమైయుండు	మార్వాడి సంజనాపద్మం	196
16.	త్రిశంకు స్వర్గం - అన్నిటికీ చెడ్డ రేవడి	మల్లాది కృష్ణమోహన్	200
17.	ఫ్రెండ్	వేణు నక్షత్రం	204
18.	ఎన్నికలు	సాంత్వన చీమలమర్రి	211

With best compliments from :

Ph : 732-890-9777

Ph : 732-540-8822

Made in USA

MANA SWAGRUHA FOODS

NO Preservatives

www.manaswagruha.com



SWEETS, SNACKS, PICKLES & POWDERS

HOME DELIVERY & SHIPPING - CORPORATE GIFTS - PARTY ORDERS

ADDRESS : 220st George Avenue, Rahway, NJ-07065

E-mail : manaswagruha@gmail.com

నిమజ్జనం

సాయిబ్రహ్మానందం గొర్తి



ఇండియా నుండి తిరిగొచ్చి ఇంట్లో అడుగుపెట్టిందో లేదో ఫోన్ మెసేజస్ బీప్ చేస్తూ స్వాగతం పలికాయి విజీకి.

ఏడేళ్ల కొడుకు వస్తూనే తనగది వైపు పరిగెత్తాడు. వీడియో గేమ్స్ ఆడడం కోసమని విజీకి తెలుసు.

కారులో బ్యాగేజ్ తరువాత లోపలికి తెచ్చుకోవచ్చులే అనుకొని హాల్లో సోఫాలో కూలబడింది.

ఒక్కసారి జేమ్స్ గుర్తుకొచ్చాడు. దుఃఖం ఆపుకోలేక పోయింది. చూస్తూండగా ఇట్టే ఏడాది గడిచిపోయింది. అతను లేని జీవితం నరకం అనుకున్న క్షణాలు ఈ ఏడాదిలో చాలాసార్లే అనుభవించింది. అయినా పిల్లాడి కోసం తమాయించుకొని వాస్తవంలోకి వస్తోంది.

ఎక్స్ బాక్స్ సరిగ్గా పనిచేయడం లేదంటూ గట్టిగా అరవడం తో మేడపైకి వెళ్లి సర్ది క్రిందకొచ్చింది.

ఫోన్ మెసేజస్ బీప్ శబ్దం ఇంకా మ్రోగుతూనే ఉంది. దగ్గరగా వెళ్లి చూస్తే 30 మెసేజస్ కనిపించాయి. కేవలం రెండు వారాలకే ఇన్ని మెసేజస్ ఉండడం చూసి ఆశ్చర్యంగా ఒక్కొక్కటే వినసాగింది.

మొదటి రెండూ టెలీ మార్కెటింగ్ కాల్స్. ఒక్కొక్కటే వింటూ డిలీట్ చేస్తూ పదో మెసేజ్ వింటూ ఒక్కసారి ఆగిపోయింది.

అది సన్నీవేల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ నుండి.

పోలీస్ అనేసరికి మరలా వెనక్కి తిప్పి వినసాగింది.

"హై. దిస్ మెసేజ్ ఈజ్ ఫర్ విజీ జేమ్స్!..." అంటూ చాలా పెద్ద మెసేజే ఉంది. సన్నీవేల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ తనని కలవడానికి గత వారంగా ప్రయత్నిస్తున్నారని అర్థమయ్యింది.

మిగతా మెసేజస్ ఏవిటాని శ్రద్ధగా వినసాగింది. అన్నీ ఫోన్ కాల్సూ వాళ్ల నుండే! ఏవిటా అని కంగారుపడింది. వెంటనే వాళ్లకి కాల్ చేసింది.

ఆ రోజు ఆదివారం కావడం వలన మర్నాడు కాల్ చెయ్యమని ఒక ఆఫీసర్ చెప్పాడు.

ఏం జరిగిందా అని కంగారు మొదలయ్యింది. తను లేనప్పుడు ఎవరైనా దొంగలు చొరబడ్డారా? అన్న అనుమానం వచ్చి ఇంట్లో ప్రతీ గది గబగబా వెళ్లి చూసింది. ఎక్కడ ఉండాల్సిన వస్తువులు అక్కడే ఉన్నాయి. అన్ని తలుపులూ పరికించి చూసింది. అంతా బాగానే ఉంది.

పోలీస్ కాల్ ఎందుకోనన్న అనుమానం పీకుతూ ఉన్నా రేపు చూడచ్చులే అనుకొని స్నానం చేసి వంట గదివైపుగా వచ్చింది.

అంతలో ఫోన్ మ్రోగితే వెళ్లి తీసింది.

"హలో! కన్ ఐ స్పీక్ టు విజీ..." అంటూ ఒక గొంతు వినిపించింది. ఆవతలి వ్యక్తి తనని తాను పరిచయం చేసుకున్నాడు, జేమ్స్ తనూ కలసి పని చేశామని.

అతని గురించి కొన్ని వివరాలు చెప్పాడు. మాటల మధ్యలో ఇండియా ట్రిప్ ఎలా జరిగిందంటూ ఫోన్ ఆవలి వైపునున్నతను అడిగాడు. అది విని ఆశ్చర్యపోయింది విజీ. ఎందుకంటే తన ఇండియా ట్రిప్ గురించి ఒకరిద్దరికి తప్ప ఎవరికీ తెలీదు.

తను ఇండియా నుండి వచ్చినట్లు ఆవతలి వ్యక్తి ఎలా తెలుసిందోనని అడిగింది. అతనికి తన ఇండియా ప్రయాణం గురించి ఎలా తెలుసో తరువాత చెబుతానన్నాడు.

"మీరు ఇవాళ కేథే పసిఫిక్‌లో పదకొండింటికి ఫ్లైట్ దిగారని తెలిసే కాల్ చేస్తున్నాను. నేను అర్జంటుగా మిమ్మల్ని కలవాలి," అన్నాడు.

ప్రయాణ వివరాలన్నీ తెలిసాయంటే పోలీసు వ్యక్తే అయ్యుండాలి అన్న అనుమానం వచ్చింది విజీకి.

"మర్నాడు కలుద్దామా?" అని అడిగింది.

"లేదు మేమ్! ఈ రోజు సాయంత్రమే కలవాలి. వీలయితే మీ ఇంటికి వచ్చి కలుస్తాను, " అన్నాడు.

తన గురించీ, జేమ్స్ గురించీ చాలా విషయాలు చెప్పడంతో సరేనంది. జేమ్స్ పనిచేసిన హాస్పిటల్ వ్యక్తి అనేసరికి కాదనలేక పోయింది.

జేమ్స్‌కి పాలో ఆల్టో హాస్పటల్లో చాలా మంచి పేరుంది.

"మీ పేరు చెప్పారుగానీ, మర్చిపోయాను. సారీ... మరలా చెప్పగలరా...?"

"రాబర్ట్..." అని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

❖

ఆ సాయంత్రం రాబర్ట్ వస్తూనే - "బెనారస్‌లో జేమ్స్ అస్థికల నిమజ్జనం ఎలా జరిగింది?" అంటూ ప్రశ్నించాడు.

జేమ్స్ అస్థికల నిమజ్జనం సంగతి తనెవరికీ చెప్పలేదు. ఇతనికెలా తెలిసిందనీ ఆశ్చర్యపోయి అదే విషయం అడిగింది. జవాబుగా అతను నవ్వేశాడు.

గట్టిగా రెట్టిస్తే, చెబుతాను ఓపిక పట్టమని అన్నాడు. సోఫాలో కూర్చుంటూ సూటిగా మరో ప్రశ్న వేశాడు.

"జేమ్స్ ప్రమాదంలో పోవడం దురదృష్టకరం. మీకే కాదు, మా హాస్పిటల్‌కే పెద్ద లోటే! మిమ్మల్ని ఒకటడగాలి. జేమ్స్ మిమ్మల్ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు కదూ?"

జేమ్స్ పాలో ఆల్టో హాస్పిటల్లో ఆర్థోపెడీషియన్ సర్జన్‌గా పనిజేసేవాడు. జేమ్స్ పదేళ్ల క్రితం ఒకసారి మెడికల్ కాన్ఫరెన్స్ కోసం హైద్రాబాదు వచ్చాడు. తను ఆ కాన్ఫరెన్సుకి ఈవెంట్ మేనేజర్. ఆ సందర్భంలో అయిన పరిచయం కాస్తా ప్రేమగా మారి ఒక్కరోజులోనే పెళ్లివరకూ వచ్చింది. తను ఒక హైందవ సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన వ్యక్తినీ, తన ఇంట్లో వాళ్లు ఒప్పుకోరని అంటే తన కోసం జేమ్స్ హిందూమతం స్వీకరించి మరీ పెళ్లి చేసు

కున్నాడు. పెళ్లయ్యాక తనకంటే ఎక్కువగానే ఆచారాలూ, పద్ధతులూ పాటిస్తూ ఉండేవాడు. హిందూమతం గురించి చాలా లోతుగా తెలుసుకున్నాడు. తనకే ఆశ్చర్యం కలిగించేలా పిల్లాడికి యోగా అని పేరు పెట్టుకున్నాడు. సజావుగా సాగుతున్న జీవితం లో ఒక్కసారి అగ్నిపర్వతం బద్దలయ్యింది. క్రితం ఏడాది అనుకోకుండా ఒక కారు యాక్సిడెంట్లో జేమ్స్ మరణించాడు. విజీ తట్టుకోలేకపోయింది. తన బాధనంతా దిగమింగుకొని, యోగా కోసం జేమ్స్ లేని జీవితం నెమ్మదిగా అలవాటుచేసుకుంది.

జేమ్స్‌కీ తనకీ పరిచయం ఎలా అయ్యిందీ రాబర్ట్‌కి చెప్పింది.

"జేమ్స్ మీ పెళ్లి గురించి నాకన్నీ చెప్పాడు. మీ పెళ్లి సందర్భంలో కుడిచేతి మీద మీ పేరుని రంగుల్లో టాటూ కూడా పొడిపించుకున్న విషయంతో సహా..."

అవుననన్నట్లు తలూపింది.

మరలా ఒక్కసారి తేరుకొని- ఇతనికి ఇన్ని వివరాలు ఇంత విపులంగా ఎలా తెలుసు? జేమ్స్ తన గురించి ఎవరికీ చెప్పే వ్యక్తి కాదు. చాలా ముభావంగా ఉంటాడు. స్నేహితులు కూడా చాలా తక్కువ.

"మీరు ఆ చేయిని గుర్తు పట్టగలరా?" మరో కొత్త ప్రశ్న వేశాడు.

ఎందుకు గుర్తుపట్టలేదు? శరీరాన్నీ, మనసునీ పెనవేసుకున్న చేయిని ఎలా గుర్తుపట్టలేకుండా ఉంటుంది? ఒకటా రెండా పదేళ్లు పైగా పరిచయమున్న దేహం!

"ఇంతకీ అసలు విషయం ఏవిటో చెప్పండి? ఇలా ప్రశ్నలతో వేధించద్దు!" అంటూ కళ్లల్లో చికాకు చూపిస్తూ అంది.

"మీకే భయమూ, కంగారూ వద్దు. అన్నీ తీరుబడిగా రేపు చెబుతాను. రేపు మీరు నాతో రావాల్సుంటుంది ఆ చెయ్యిని గుర్తించడానికి!" అని వెళ్లాలి అన్నట్లుగా సోఫాలోంచి లేచాడు.

"వా...ట్!" అంటూ గట్టిగా అంది.

వినడానికే ఇదంతా గందరగోళంగా అనిపించింది. ఒక్కసారి తేరుకొని "సారీ" అంది. పరవాలేదన్నట్లు తలూపాడతను.

"మా దగ్గర ఒక చేతి పార్టు వుంది. దాని మీద విజీ అన్న పేరుంది. జేమ్స్ భార్యగా రికార్డుల్లో మీ పేరుంది కాబట్టి మీరు రేపు వస్తే ఆ చెయ్యిని గుర్తించచ్చు. ఆ చెయ్యి అతనిది కాదని నిర్ధారణ అయితే గొడవే లేదు... ఇంతకుమించి వివరాలు నేను చెప్పలేను... కాదు చెప్పకూడదు..." అంటూ ఆగిపోయాడు.

అది వింటూ ఒక్కసారి విజీ కళ్లల్లో కన్నీళ్లు పొంగుకొచ్చాయి. అతను విజీని కంగారుపడవద్దని వారించాడు.

భయమూ, కంగారూ ఏమీలేదనీ, ఇవన్నీ నార్మల్ ప్రొసీజర్స్ అని సముదాయించాడు. రేపు ఉదయం పదకొండింటికి వెళదామనీ చెప్పి బయల్దేరాడు.

"కనీసం మీరెవరో ఇదంతా ఎందుకో చెప్పండి. మీరు జేమ్స్ కొలీగా?"

"మొదట్లో మీకు చెప్పినట్లు నేను జేమ్స్ కొలీగ్ కాదు. నా పేరు రాబర్ట్. ఎఫ్‌బీఐ స్పెషల్ బ్యూరో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్! మా ఆధీనంలోకి ఒక చెయ్యి పార్టు వచ్చింది. ఆ చెయ్యి ఎవరిదై ఉంటుందా? అని చాలా రోజులు ప్రయత్నించాం. చివరకి అది జేమ్స్ చెయ్యో కాదా తేల్చుకోవడానికి మిమ్మల్ని సంప్రదిస్తున్నాం. అంతే. ఇంతకుమించి చెప్పలేను. దయచేసి రేపటి వరకూ ఓపిక పట్టండి. ఒకటి మాత్రం చెప్పగలను. మీకూ, మీ కుటుంబానికీ ఏ హానీ జరగదు. మీరు నిశ్చింతగా ఉండచ్చు. ఇవన్నీ మా ఇన్వెస్టిగేషన్ పద్ధతులంతే!" అంటూ బై చెప్పి వెళిపోయాడు.

అయోమయంతో ఒక్కసారి సోఫాలో కూలబడింది విజీ.

❖

పెళ్లయ్యాక మొదటి సారి అమెరికా వచ్చినప్పటి నుండీ జేమ్స్ తనెంతో ప్రేమగా చూసుకునేవాడు. ప్రతీ విషయం తనతో చెప్పేవాడు. ప్రతీ నిర్ణయమూ తనతో చర్చించే తీసుకునేవాడు. ఇల్లు కొనడం దగ్గర నుండి, కారు కొనాలన్నా, ఆఖరికి ప్రతీ చిన్నదానికీ తనని సంప్రదించేవాడు. జేమ్స్ వాళ్లది నెబ్రాస్కా. అమెరికాలో ఒక మధ్య తరగతి కుటుంబం వాళ్లది. అక్కడే పుట్టి పెరిగాడు. మెడిసన్ అయ్యాక కొంతకాలం న్యూయార్క్‌లో పని జేశాడు. చదువుకునేటప్పుడూ, న్యూయార్క్‌లో ఉండగా ఒకరిద్దరు గర్ల్ ఫ్రెండ్స్ ఉండేవారని విజీకి చెప్పాడు. అవేవీ ఎంతో కాలం నిలవలేదు. తరువాత కేలిఫోర్నియా వచ్చాక తన వృత్తి మీదే దృష్టి పెట్టాడు. తరువాత హైద్రాబాదు రావడం, తనతో పెళ్లవడం అన్నీ చకచకా జరిగిపోయాయి. వచ్చిన కొత్తలో కొంతకాలం చిన్న ఇంట్లో ఉండేవారు. తనొచ్చాక లాస్ ఆల్టోస్‌లో పెద్దిల్లు కొన్నాడు. హిందూగా మారడం అతని తల్లితండ్రులకి నచ్చలేదు. కొంత కాలం రాకపోకలు తగ్గిపోయాయి. యోగా పుట్టిన తరువాత మరలా మొదలయ్యాయి. ఇల్లు కొన్నప్పుడు విల్లు రాయించాడు. తన తదనంతరం ఆస్తులు ఎవరికి చెందాలో అన్నీ వివరంగా రాయించాడు. ఆఖరికి తను పోయాక ఏం చెయ్యాలో కూడా రాస్తే విజీయే అడ్డుకుంది.

"చూడు! ఒకవేళ ఏదైనా జరిగి నేను పోతే హిందూ సంప్రదాయ ప్రకారంగానే అంత్యక్రియలు జరగాలి. నేను ఇండియాలో పుట్టకపోయినా నా అస్థికలు హిమాలయాల్లోనూ, గంగలోనూ కలవాలి. ఇది నీకోసం రాయడం లేదు. యోగా కోసం! వాడు మన కోరికల్ని గౌరవించాలన్నదే ఈ విల్లులో చేర్చడం. అయినా అమెరికాలో ఇది సర్వసాధారణం," అంటూ వివరం చెప్పాడు.

దురదృష్టం తన్నుకొచ్చి క్రితం ఏడాది కారు యాక్సిడెంట్‌లో పోయాడు. అతని కోరిక ప్రకారం తను కొడుకు చేత అస్థికలు హిమాలయాల్లోనూ, గంగానదిలోనూ నిమజ్జనం చేయించింది. గోదావరిలోనూ, తుంగభద్రలోనూ కలుపుదామనుకుంది కానీ, ఢిల్లీలో ఉండగా యోగాకి విపరీతమైన జ్వరం వచ్చి వెనక్కి రావల్సి వచ్చింది. వచ్చే ఏడాది సంవత్సరీకానికి గోదావరిలో నిమజ్జనం చేయచ్చని అనుకుంది.

వచ్చీ రాగానే ఈ మెసేజస్ విజీని కలవరపరుస్తున్నాయి.

ముఖ్యంగా రాబర్ట్ చెప్పింది మనసుని దొలిచేస్తోంది. రాబర్ట్ చెయ్యి వీళ్లకి దొరకడం, తను గుర్తించడం ఏవిటో అర్థం కావడం లేదు.

తనే దగ్గరుండి జేమ్స్ అంత్యక్రియలు సన్నివేల్ క్రెమటోరియంలో జరిపించింది.

రాత్రంతా ఎడతెరిపిలేని ఆలోచనలు విజీని దొలిచేశాయి.

❖

మర్నాడు ఉదయం రాబర్ట్ వచ్చాడు. ఈసారి అతనితో పాటు ఒక పోలీసాఫీసర్ కూడా వచ్చాడు. సరాసరి పాలో ఆల్టో హాస్పటల్‌కి తీసుకెళ్లారు. ఒక రీసెర్చ్ లేబ్ గదిలో కూర్చో బెట్టారు. కొంతసేపటికి ఒక నర్సు ఒక చిన్న ట్రాలీ లాంటి రిఫ్రెజిరేటర్ తోసుకుంటూ వచ్చింది. ఆ ట్రాలీ అద్దాల్లోంచి పెద్ద ట్రేలో ప్లాస్టిక్ బ్యాగు కనిపించింది విజీకి. అందులోంచి నీలం రంగు బ్యాగ్ తీసి అక్కడున్న ఒక టేబిల్ మీద పెట్టింది.

మరో డాక్టర్ వచ్చి చేతికి గ్లౌస్ తొడుక్కొని ఆ బ్యాగ్ ఓపెన్ చేసి ఒక చెయ్యిని ట్రేలో ఉంచాడు.

అది చూడగానే ఒక్కసారి కళ్లు తిరిగాయి విజీకి.

నెమ్మదిగా వెళ్లి చేయిని పరీక్షగా చూసింది. అది ఖచ్చితంగా జేమ్స్ చెయ్యే! చేతి మీద తన పేరు టాటూ ఉంది.

పోయినప్పుడు పెళ్లి ఉంగరం తను తీయకుండానే క్రెమేట్ చేయాలనుకుంది. తన పెళ్లి ఉంగరం కూడా చేతి వేలున కనిపించింది. ఒక్కసారి దుఃఖం పెల్లుబికింది. అది జేమ్స్ చెయ్యేననీ, మణికట్టు వద్ద పుట్టుమచ్చని కూడా గుర్తుపట్టింది విజీ.

ఏడుస్తూ కుర్చీలో కూలబడింది.

"సారీ విజీ! మీరు గుర్తించి చెప్పిన వివరాల ప్రకారం ఇది జేమ్స్ చెయ్యేనని మేమూ భావిస్తున్నాం. కానీ మీరు సన్నీవేల్ క్రెమటోరియంలోనే దహనం చేశారని అంటున్నారు. మాకూ ఈ మిస్టరీ అర్థం కావడం లేదు. మీరేం దిగులు పడనవసరం లేదు. నేను మీతో టచ్‌లో ఉంటాను," అంటూ రాబర్ట్ వెళ్లడానికి సిద్ధ పడుతూ అన్నాడు.

హాస్పటల్ నుండి ఇంటికి రాగానే దాచి పెట్టిన అస్థికల్ని చెత్తకుండీలో విసిరేసింది. ఇన్నాళ్లూ తను ఎంతో పవిత్రంగా జేమ్స్ ఆత్మశాంతి కోసం చేసినవన్నీ బూడిదపాలు అయ్యాయన్నది తట్టుకోలేకపోతోంది.

ఏం చెయ్యాలో పాలుపోవడంలేదు.

ఏం జరిగిందో కూడా అర్థం కావడం లేదు విజీకి.

❖

రెండ్రోజుల తరువాత రాబర్ట్ కాల్ చేశాడు, విజీని కలవడానికి వస్తున్నానని. ఇంటికొచ్చాక కొంతసేపు క్రితంసారి మాట్లాడిన వివరాలే మరలా చెప్పుకుంటూ వచ్చాడు.

మాటల మధ్యన అసలు ఇదంతా ఎలా జరిగిందో చెప్పసాగాడు.

"ఇప్పుడు మీ నుండి మాకు చాలా సహాయం కావాలి. మీ ఇల్లు మేం సోదా చెయ్యాల్సుంటుంది. అలాగే మీ బ్యాంక్ లాకర్లూ చూడాల్సిన అవసరం ఉంది. దయచేసి మీరు మాకు సహకరించండి," రాబర్ట్ అన్నాడు.


విజీకి ఒక్కసారి కోపం ముంచుకొచ్చింది.

"ముందు ఈ చెయ్యి మీకు ఎక్కడనుండొచ్చిందీ? ఇది జేమ్స్‌దేనన్న గ్యారంటీ ఏవిటి? వేరెవరో చేతి మీద నా పేరు టాటూ వేయించుండచ్చు కదా?" అంటూ ఏడుస్తూ అంది.

"విజీ! మీరు కాస్త నెమ్మదించండి. మేం అన్ని పరీక్షలూ చేసాకే మీ దగ్గర కొచ్చాం. హాస్పిటల్లో డాక్టర్ జేమ్స్ డి.ఎన్.ఎ శాంపిల్స్‌తో మేం పరీక్షించాం. ఈ చెయ్యి అతనిదే అన్న నిరధారణకొచ్చాకే మీ వద్ద కొచ్చాం!"

"అయితే ఇది మీకెలా వచ్చిందో చెప్పండి?" అంటూ గట్టిగా అరిచింది విజీ.

"వైద్య రంగంలో ఎంతో ప్రగతి సాధించిన అమెరికాలో ఈమధ్య కొత్తగా పెరిగిన ఒక రహస్య వ్యాపారం అవయవాల ఎగుమతి. ఈ వ్యాపారం ఏసియాలో అంటే చైనా, ఇండియా ఆఫ్రికన్ దేశాల్లో ఎక్కువగా ఉండేది. అది ఈమధ్య కాలంలో అమెరికాలోనూ పెరిగింది. కాళ్లూ, చేతులూ, ఎముకలూ, చర్మాలూ అనేక అవయవాలు విచ్చలవిడిగా ఎగుమతి అవుతున్నాయి. ఈ వ్యాపారాలకి పెద్ద అడ్డా, లండన్ నగరం. ఎన్నో హాస్పిటల్స్‌కీ, వైద్య పరిశోధనా సంస్థలకీ, మందుల కంపెనీలకీ వీటి అవసరం చాలా ఉంది. చూస్తూ చూస్తూ ఎవరూ శవాలని వీటికి ఇవ్వరు. అందువల్ల వీటికి చాలా డిమాండ్ ఉంది.



మా ఎఫ్‌బీఐ వాళ్లు టెక్ససులో హ్యూమన్ ఆర్గాన్ ట్రాఫికింగ్ చేసే ఒక సంస్థని పట్టుకున్నారు. వాళ్లని కూపీ లాగితే లాస్ ఏంజిల్స్‌లో కూడా వాళ్లకి వ్యాపారాలున్నాయని బయల్పడింది. అవన్నీ పట్టుకున్నప్పుడు అక్కడ మాకు మానవ అవయవాలు అంటే కాళ్లూ, చేతులూ ఇలా కొన్ని దొరికాయి. వాటిలో ప్రత్యేకంగా కనిపించింది మీ భర్త జేమ్స్ చెయ్యి. ఆ దొంగ వ్యాపారంతో సంబంధం ఉన్న ఒక వ్యక్తి మాకు పట్టుబడ్డాడు. అతనిచ్చిన వివరాల ఆధారంగా వీళ్లకి ఇవన్నీ ఎక్కడ నుండి వస్తున్నాయో కూపీ లాగాం. కానీ జేమ్స్ చెయ్యి వాళ్లకెలా వచ్చిందో అంతు పట్టడం లేదు. జేమ్స్ చెయ్యి బట్టి దాని వయసు నిర్ధారించి, ఆ వయసులో పోయిన వాళ్ల జాబితా, ముఖ్యంగా ఏక్సిడెంట్‌లో పోయిన వాళ్లది సంపాదించాం. మాకు కనిపించిన దాదాపు పదివేల మంది వివరాలు వెతికాం. ఆ లిస్టులో జేమ్స్ పేరు కూడా ఉంది. అప్పుడు అతని వివరాలు ఆరా తీస్తే జేమ్స్ ఆర్థోపెడిక్ సర్జన్ అనీ, విజీ అంటే మీరు ఆయన భార్యనీ తెలిసింది. అది తెలియగానే మిమ్మల్ని సంప్రదించాం. కానీ మీరు ఊళ్లో లేరు. మీరెక్కడికెళ్లారో వివరాలు అన్నీ ఎఫ్‌బీఐ వాళ్లు సంపాదించారు. అందువల్లే మీరు ఇండియా వెళ్లినట్లూ, మీరు యూఎస్ ఫ్లైట్లో డిక్లేర్ చెయ్యడం అన్నీ దొరికాయి. మీరొచ్చేవరకూ మీ రాకపోకలపై నిఘా ఉంచాం. వచ్చీ రాగానే మిమ్మల్ని కలిశాను," అంటూ రాబర్ట్ వివరంగా చెప్పాడు.

"అంతా గందరగోళంగా ఉంది. జేమ్స్ శవాన్ని నేనే దగ్గరుండి క్రెమేట్ చేయించాను. మేం అక్కడే అస్థికలు తీసుకున్నాం కూడా!" మరోసారి గట్టిగా చెప్పింది విజీ.

"చెప్పాను కదా! మా ఇన్వెస్టిగేషన్ పూర్తయ్యేవరకూ ఏం చెప్పలేం!" అని భుజాలు చిన్నగా ఎగరేస్తూ చెప్పాడు.

"జేమ్స్ చెయ్యొకటే మీకు దొరికిందా? మిగతా శరీర భాగాలు? ఏవి దొరికినా భద్రపరచండి. తన అస్థికలు హిమాలయాల్లో కలపాలని అతను తన విల్లులో రాశాడు. దయచేసి..." ప్రాధేయపడుతూ అంది విజీ.

"వుయ్ సర్టైన్లీ రెస్పెక్ట్ యువర్ సెంటిమెంట్స్! వుయ్ విల్ ట్రై అవర్ బెస్ట్!" అంటూ రాబర్ట బయటకు నడిచాడు.

"ఇదంతా చూస్తూంటే జేమ్స్ శవాన్ని ఎవరో మాయం చేశారు. నేను కోరేదొక్కటే కనీసం ఆ చెయ్యినయినా నాకు అప్పగించండి. దహనం చేసి అదయినా హిమాలయాల్లో నిమజ్జనం చేస్తాను. ప్లీజ్ మీరు నా కోరిక మన్నించండి!" ఏడుపు ఆపుకోలేక పోయింది విజీ.

"తప్పకుండా విజీ! ఐ ప్రామిస్ యూ! మీ సెంటిమెంట్స్ అర్థం చేసుకోగలను. కాని ఇది నెరవేరాలంటే మీరు మాకు సహకరించాలి. మీ సాయంతోనే ఇది సాధ్య పడుతుంది," రాబర్ట్ వెళుతూ చెయ్యి కలిపాడు. అలాగేనంది విజీ.

❖

రెండ్రోజుల తరువాత రాబర్ట్ విజీ ఇంటికొచ్చాడు. అతనితో పాటు మరో నలుగురు ఆఫీసర్లు వచ్చారు. విజీ అనుమతితో ఇల్లంతా సోదా చేశారు. ఫర్నిచర్, ఇల్లూ ఎంత ఖరీదు చేస్తాయో అన్నీ లెక్కలు కట్టారు. విజీని తీసుకొని బ్యాంకుకు వెళ్లి లాకర్లు ఓపెన్ చేయించారు. అందులో ఏమైనా ఆధారాలు దొరుకుతాయేమోనన్న ఆశ రాబర్టది. అందులో ఇంటికి సంబంధించిన పత్రాలూ, మూడు సెట్ల డైమండ్ నెక్లెసూ, విజీ బంగారు నగలూ ఉన్నాయి. కావల్సినవన్నీ ఫొటోలు తీయించుకున్నారు.

"జేమ్స్‌కి తోబుట్టువులెవరూ లేరా?" వెళ్లిపోతూ రాబర్ట్ అడిగాడు.

"అమ్మా, నాన్నా నెబ్రాస్కాలో ఉంటారు. వాళ్లకి జేమ్స్ ఒక్కడే కొడుకు. అతను పోయినప్పుడు మెమోరియల్ సర్వీసుకి వచ్చి వెళ్లారు. అంతే!" అని చెప్పి ఊరుకుంది.

"జేమ్స్ కారు ప్రమాదంలో ఎలా పోయాడో చెప్పగలరా? డెత్ రిపోర్టులో ఉంది కానీ, మీరు ఏం జరిగిందో చెప్పండి!" మరలా రాబర్టే అన్నాడు.

"మా అబ్బాయిని స్కూల్లో దింపి వస్తూండగా హైవే 280 మీద వేగంగా వేరే కారొచ్చి మా కారుని ఢీకొంది. కార్ ఫుల్ లేన్‌లో డ్రైవ్ చెయ్యడం వలన జేమ్స్ వెళ్లి రోడ్ డివైడర్‌కి కొట్టుకున్నాడు. వెనక సీట్లో ఉన్న నాకు అంత గాయాలు తగల్లేదు కానీ, జేమ్స్ తలకి గాయం అయ్యింది. హాస్పటల్‌కి తీసుకెళితే అప్పటికే పోయాడని చెప్పారు. మా కారుని గుద్దింది ఒక స్త్రీ. సెల్‌ఫోన్ మాట్లాడుతూ స్టీరింగ్ అదుపు తప్పిందని కోర్టులో చెప్పింది," అంటూ విజీ క్లుప్తంగా చెప్పింది.

ఇంట్లో చాలా వస్తువులకి ఫొటోలు తీసుకున్నాడు. మరిన్ని వివరాలు తీసుకొని కొంతసేపయ్యాక వెళిపోయాడు.

ఉదయం వెళ్లిన రాబర్ట్ గోడకు కొట్టిన బంతిలా సాయంత్రం మళ్లా వచ్చాడు. ఈ సారి వస్తూనే మరో బాంబు పేల్చాడు.

"మీ భర్త జేమ్స్ గురించి మాకు కొంత సమాచారం దొరికింది. మీరు శవాన్ని క్రెమేట్ చేసిన క్రెమెటోరియం ఓనర్ని ఆరా తీశాం. అది అతను ఈ మధ్యనే కొన్నాడు. పాత యజమాని అతనికి అమ్మేసి సౌతాఫ్రికా వెళ్లిపోయాడనీ చెప్పాడు. ఆ పాత ఓనరు సౌతాఫ్రికా వెళ్లలేదు. శాండీయేగోలో ఉంటున్నాడుట. మా వాళ్లు అతన్ని పట్టుకున్నారు.అతను చెప్పింది వింటూంటే ఒళ్లు జలదరించింది," అంటూ ఆగిపోయాడు.

ఏమయ్యిందని రెట్టించింది విజీ.

"మీ భర్త యాక్సిడెంటులో పోయాక మీరు క్రెమేట్ చేద్దామనుకుని తీసుకెళ్లిన క్రెమెటోరియంలో జేమ్స్ శవానికి బదులు వేరొకరి శవం కాలింది. ఆ అస్థికలే మీకిచ్చారు. జేమ్స్ శవం అక్కడ కాల లేదు. మీరు శవాన్ని ఉంచిన బాక్సుని కన్వేయర్ బెల్టు మీదుంచినంత వరకూ అందులో జేమ్స్ శవమే ఉంది. స్విచ్ ఆన్ చేసాక ఆ బెల్టు ఫర్నేస్ కి బదులు వేరే గదిలోకి వెళ్లింది. అక్కడ బెల్టు మీద జేమ్స్ శవాన్ని తప్పించి వేరొకరి శవాన్ని పెట్టి పంపారు. మీకొచ్చిన అస్థికలు వేరెవరివో?" మెల్లగా చెప్పాడు.

"అంటే నేను ఏడాది క్రిందట ఇండియా వెళ్లి నిమజ్జనం చేసిన అస్థికలు వేరేవాళ్లవా?" గట్టిగా ఏడుస్తూ అరిచింది విజీ!

"అయ్యుండచ్చు! ప్రస్తుతం ఆ క్రెమటోరియం పాత ఓనర్ని విచారణ చేస్తున్నాం. అతని ద్వారా మరికొన్ని తెలిసే అవకాశా

లున్నాయి. ఇంతకీ నేనొచ్చిన పనేవిటంటే రేపు మీరు మాతో గూగుల్ కంపెనీకి రావాల్సుంటుంది. అది చెప్పడానికే వచ్చాను," అన్నాడు.

దేనికన్నట్లు సందేహంగా చూసింది విజీ!

"జేమ్స్ పని చేసిన హాస్పిటల్లో వాళ్లకీ, ఆ క్రెమటోరియం పాత యజమానికీ ఏవో లావాదేవీలున్నాయి. ఆ వివరాలు ఆ ఓనరు ఈమెయిల్లోనే దొరికాయి. మీ హస్బెండ్ మెయిల్స్ చెక్ చేస్తే ఏమైనా దొరుకుతాయేమో నన్న ఆశ. జేమ్స్ పోయాక అతని గూగుల్ ఎకౌంట్ క్లోజయిపోయింది. మేం అతని మెయిల్స్ అవీ చూడాలి. ఇంటర్నెట్ ఈమెయిల్ ప్రైవసీ ప్రొటక్షన్ లా ప్రకారం ఒక వ్యక్తి పోయాక వారి తరపువాళ్ల అనుమతి ఉంటేనే గూగుల్ వాళ్లు జేమ్స్ మెయిల్ని చూడనిస్తారు. ఆ అనుమతికోసం కొన్ని డాక్యుమెంట్లలో సంతకాలూ అవీ కావాలి. కాబట్టి మీరూ రావాల్సుంటుంది," అన్నాడు.

"ఈ ఆర్గన్ ఎక్స్పోర్ట్ వెనుక ఎవరున్నారో పట్టుకోవాలన్నడే మా ధ్యేయం. ఆ క్రెమటోరియం పాత యజమాని లాసేంజిల్స్ వివరాలు ఇచ్చాడు కానీ, ఇక్కడి వివరాలు చెప్పడం లేదు. ప్రస్తుతం మాకున్న ఆధారం జేమ్స్ చెయ్యి ఒక్కటే! అతనికి తెలుసున్న ఎవరికైనా ఈ వ్యాపారంతో సంబంధం ఉండి ఉండ చ్చన్న దిశగా చూస్తున్నాం!" అని విజీకి గూగుల్ కంపెనీకి ఎందుకు వెళ్లాలో చెప్పాడు.

విజీకి రోజుకొక్క కొత్త విషయం తెలిసీ బుర్ర తిరిగిపో తోంది.

ఆమె ఎంతగానో కలవరపడుతోంది. కనీసం జేమ్స్ చెయ్యి నయినా నిమజ్జనం చెయ్యగలుగుతానా? - అన్నది ఇంకో పెద్ద దిగులు.

❖

అనుకున్నట్లుగానే ఆ మర్నాడు గూగుల్‌కి వెళ్లి ఈ జేమ్స్ ఈమెయిల్ ఎక్కౌంట్లన్నీ పరీక్షగా చూశారు. ఎక్కడా ఏ విషయమూ దొరకలేదు. నిరాశగా వెనక్కి వచ్చేశారు. రాబర్టుతో వచ్చిన అధికారి జేమ్స్ ఈమెయిల్ మొత్తం ఒక చిన్న డిస్కులో తీసుకున్నాడు. విజీకి తప్పకుండా జేమ్స్ చెయ్యి అప్పగించేలా చేస్తానని చెప్పి శలవు తీసుకున్నాడు.

"చస్! మనకి ఒక్క ఆధారమూ దొరకలేదు! ఈ రాకెట్ వెనుకెవరున్నారో నిరూపించలేకపోయాం!" అంటూ కారు స్టీరింగుని గట్టిగా కొట్టాడు రాబర్ట్. అతని పక్కనే ఉన్న మరో ఆఫీసర్ ఆశ్చర్యంగా చూసాడు.

"ఆ సన్నీవేల్ క్రెమటోరియం ఓనరు ఏం క్లూ ఇవ్వలేదా సార్?"

"ఇచ్చాడు కానీ అది సరిగ్గా లేదు. ఈ వ్యాపారం నడిపిన వాడు చాలా తెలివిగా మసలుకున్నాడు! ఆ క్రెమటోరియం పాత యజమానికీ, పాలో ఆల్టో హాస్పిటల్లో వాళ్లకీ ఏదో లింకు ఉంది."

"మీ కెవరి మీద అనుమానం ఉంది సార్?"

"ఖచ్చితంగా పాలో ఆల్టో హాస్పిటల్లో ఒకరి మీద నాకు అనుమానం ఉంది. అతనే ఈ వ్యాపారాన్ని చాటుగా నడిపేవాడని చూచాయగా ఆధారాలున్నాయి కానీ అవి మరీ బలంగా లేవు. అతను చాలా తెలివైనవాడు. అతను ఫోన్‌కాల్స్ కానీ, ఈమెయిల్లో కానీ ఎక్కడా సమాచారం లేకుండా జాగ్రత్తపడ్డాడు. వాళ్లందర్నీ మరో సారి ఇంటరాగేట్ చేస్తే ఏదైనా క్లూ దొరకచ్చు. అతనికి ఈ ఆర్గన్ ఎక్స్పోర్ట్ వాళ్లతో లావాదేవీలు ఖచ్చితంగా ఉన్నాయని నా అనుమానం!"

"ఎవరు...? అంటే విజీ హస్బెండ్...?"

"చెప్పలేను. లాస్ ఏంజిల్స్ పట్టుబడ్డతను జేమ్స్ పేరు చెప్పాడు. కానీ ఒక్క ఆధారం కూడా దొరకలేదు. పాలో ఆల్టో హాస్పటల్లో వేరెవరికైనా దీనితో సంబంధం ఉంటే తప్ప... హాస్పటల్లో కూడా అతనికి మంచి పేరుంది. చాలా మంచివాడూ, నెమ్మదస్తుడనే చెప్పారు. నాకయితే జేమ్స్ మీదే అనుమానం..." అంటూ ఆగిపోయాడు.

"అతనే ఈ వ్యాపారం చేసాడంటే నమ్మబుద్ధి కావడం లేదు సార్! అతనే చేస్తే అతని బాడీపార్ట్స్ ఎందుకు రవాణా అవు తాయి?"

"జేమ్స్ యాక్సిడెంటులో పోవడం యాదృచ్ఛికం. అతన్ని క్రెమేట్ చేసిన రోజు క్రెమటోరియం ఓనరు హవాయీ వెకేషన్‌లో ఉన్నాడు. వచ్చేసరికి అంతా అయిపోయింది..!" నిట్టూరుస్తూ చెప్పాడు రాబర్ట్!

"ఈ విషయం విజీకి తెలుసా?"

లేదన్నట్లు తలూపాడు రాబర్ట్.

"చిత్రం! విజీక్కూడా అతను ఏమీ చెప్ప లేదు. ఆమెకేమీ తెలియదు"

పక్కనున్న ఆఫీసరు రాబర్ట్ కేసి ఆశ్చర్యంగా చూసాడు.

"ఈ నెట్‌వర్క్‌తో అతనికి సంబంధాలు వున్నాయని ప్రూవ్ చెయ్యడం కష్టమే...పిటీ ఏవిటంటే తన వ్యాపారానికి తనే విక్టిమ్ అయ్యాడు...!"

ఫ్రీ వే మీద కారు వేగంగా వెళుతోంది.



సాయి బ్రహ్మానందం గొర్తి పుట్టింది, పెరిగింది కోనసీమ అమలాపురంలో. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చదివి, శాన్‌హోసె, కాలిఫోర్నియాలో ఉద్యోగం, నివాసం. అంతర్ముఖ, నేహల ప్రచురితమైన నవలలు. సరిహద్దు కథల సంపుటి. వాగ్గేయకారుడు త్యాగయ్య పై పరిశోధనాగ్రంథం అచ్చులో. వ్యాసాలు, నాటకాలు రాశారు. యాభైకి పైగా కథలు రాశారు. సంగీతంలో అభినివేశం ఉంది. తానాపత్రిక సంపాదకులు.

కంచికి చేరని కథలు

కొక్కొకాయ



మాసాలని ఋతువులుగా విభజించే అధికారం నా చేతిలో ఉంటే కార్తీక మార్గశిరాలని నా పేర్న గుత్తి కట్టేస్తాను.

నాకు చలికాలమంటే యిష్టం. అమెరికా లెక్కల ప్రకారం హాలిడే సీజన్ అంటే మరీ యిష్టం. మత్తుగా నిద్దరోయే ధృవపు ఎలుగుబంటిలా సోఫాలోంచి లేవకుండా ముడుచుకుని సినిమాలు చూడడమంటే మహా యిది. పట్టుమని రెణ్ణెళ్లు కూడా మర్చి పోనివ్వని ప్రాపంచిక విషయాలంటే తగని మంట. ప్రాపంచిక విషయాలంటే మార్ట్‌గేజి బిల్లులు, సంవత్సరం చివరిదాకా గుర్తు రాని డెంటల్ అపాయింట్‌మెంట్లు, అప్పటికైనా కళ్లజోడు కొనుక్కోకపోతే వృధాపోయే ఇన్సురెన్సులు... ఇలాంటివన్నమాట. ఈ యేడాది ఆ లెక్కలో కొత్త ఉద్యోగం కూడా చేరింది. మొద్దుగా నిద్దరోనివ్వని జీవితావసరాలు ఇంటర్వ్యూలు అటెండ్ అయ్యేలా నన్ను ముందుకు తోశాయి. నాకు గతిలేకపోతే నాకు ఉద్యోగమిచ్చినవాడికి మతిలేదు. డిసెంబర్‌లో రమ్మన్నాడు. దేహాన్ని ఈడ్చుకుంటూ పోయి జాయినయ్యాను.

ఉదయాన్నే హడావిడి వలన ఫిల్టర్ కాఫీకి నోచని జీవుడికి ట్రిపుల్ ఫ్లాట్ వైట్‌తో సర్దిచెప్పి ఆఫీస్‌లోకి నడిచాను. డిసెంబరు పన్నెండు. నిర్జనారణ్యంలో నిద్దరోతున్న మానిటర్‌లు. అస్మదీయుడిలా కనిపించేవాడొకడు నా లేప్‌టాప్ మధ్యాహ్నానికొస్తుందని చెప్పి వెళ్లిపోయాడు. తప్పనిసరి పరిస్థితిలో బ్రేక్ రూమ్‌కీ, క్యూబికల్‌కీ పచార్లు చేస్తూ కాలక్షేపం చేస్తున్నాను. మధ్యలో ఉన్న రెస్ట్‌రూమ్‌లోంచి బయటికొస్తూ పలకరింపుగా నవ్విందొకావిడ. ఆకుపచ్చని టర్టిల్ నెక్ స్వెటర్ వేసుకుని పండు తమలపాకులా ఉంది. ఇంకేమనాలి? పాప్లర్ ఆకు?

లంచ్ టైంలో ఎదురుగా ఉన్న సబ్‌వేకి వణుక్కుంటూ వెళ్లొచ్చి క్యూబ్‌లోనా, బ్రేక్ రూమా అని ఆలోచించుకుంటున్నంతలో ఆకుపచ్చ స్వెట్టరావిడ అటుగా వెళ్తూ కనిపించింది. వెనకే వెళ్లి బ్రేక్‌రూమ్‌లో కూర్చున్నాను.

"బాగా చలిగా ఉందివాళ..." మాటలు కలిపిందావిడ.

అవునని అడ్డదిడ్డంగా తలూపి గొణిగాను.

రాబోయే వారంలో శీతోష్ణస్థితి గురించి కాసేపు ముచ్చటించి, నీ అభిప్రాయమేంటన్నట్టు చూసింది. లేచి ఆవిడ కూర్చున్న బల్లకి ఎదురుగా కుర్చీ లాక్కున్నాను.

"కొత్తగా వచ్చినట్టున్నావు... ఇంతకు మునుపు ఈ ఫ్లోర్‌లో చూళ్లేదు," అని వాకబు చేసింది.

అవునన్నాను. టీమ్ వివరాలు చెప్పి ప్రవర వల్లించాను.

"నా పేరు పెట్రీషియా. ఇవాళ ఆఫీస్‌లో నా ఆఖరు వర్కింగ్ డే. సెలవుల తరువాత వచ్చి ఫేర్‌వెల్ పార్టీ ఇప్పించుకుని, లాప్‌టాపూ వగైరా ఇచ్చి వెళ్లిపోతాను," అని చెప్పింది.

"కంగ్రాట్స్! పోన్లే హాయిగా టీవీ చూడచ్చు," అనేసి నాలిక్కరుచుకున్నాను.

"ఒకప్పుడు బాగా చూసేదాన్ని కానీ, ఇప్పుడు కదలకుండా కూచుని చూసినా బుర్రకెక్కడం లేదు. వేరే పనేదో గుర్తొచ్చి అటు వెళ్లిపోతాను. డిమెన్షియా కాదని నా డాక్టరు చెప్పాడు కానీ, నాకు భయమే," మిలమిల్లాడే పళ్లు కనిపించేలా నవ్వుతూ అన్నది.

ఏదీ దాచకుండా భలే చక్కగా కబుర్లు చెప్తారేం వీళ్లు! ఇంతకీ క్రిస్మస్‌కి ఏం చేస్తావని అడిగాను. ఆరున్నర నిమిషాలపాటు తన ప్లాను చెప్పి, ఇక నీ వంతు అని తన సేండ్ విచ్ కొరుక్కుంది.

"మామూలే. ఇల్లు కదలకుండా కూర్చోవాలనుంది. లాప్ టాప్ వచ్చేస్తే బహుశా అంతే. చీకటిపడ్డాక వెస్టన్ ఎస్టేట్ వైపు డ్రైవ్‌కి వెళ్లడం బావుంటుంది. క్రిస్మస్ లైట్స్ చూడడానికి. మా ఇంట్లో ట్రీ ఉంటుంది కానీ అంత గొప్పగా సెలబ్రేట్ చేసుకునే అలవాటేమీ లేదు. నా కూతురి కోసం పెడతానంతే," అని చెప్పాను.

కూతురు అనడం పాపం... చక్కగా తన పిల్లలు, మనవల చిట్టా విప్పి చెప్పింది. పోన్లే కాస్త ఊసుపోతోంది అనుకున్నాను.

"నేనూ, జాన్ నలభై నాలుగేళ్ల క్రితం క్రిస్మస్ పార్టీలో మిసల్‌టో కింద కలిశాం," పెట్రీషియా అందంగా నవ్వింది.

"వండర్ ఫుల్. ఫెయిరీ టేల్‌లా ఉంది."

బోలెడంత ఉత్సాహంగా వాళ్ల పెళ్లి కబుర్లు, అత్తగారెంత మంచిదో, జాన్ హాబీ లిస్టులేంటో గలగలా చెప్పేసింది. నవ్వుతూ తలూపుతూ వింటున్నాను.

"నా గురించే చెప్పి బోర్ కొట్టిస్తున్నట్టున్నాను కదా! నీ గురించి చెప్పు..." అంతే ఉత్సాహం ఆమె గొంతులో.

"మీ ఆయన ఎక్కడ చేస్తారు? మీరెక్కడ నుంచి?" లాంటి రొటీన్ ప్రశ్నలకి భిన్నంగా ఉంది కదా అనుకున్నాను.

"నా గురించి చెప్పడానికి మీ అంత గొప్ప కథేమీ లేదు," పొడిగా నవ్వాను.

"నీ గురించి తెలీదు కానీ, నాకు ముంబాయ్ నుంచొచ్చిన ఫ్రెండ్ ఉండేది. ఎక్కువ అరేంజ్డ్ మేరేజెస్ జరుగుతాయని విన్నాను. బహుశా అందరూ అలా కాదేమో కానీ..." కలుపుగోలుగా అడిగింది పెట్రీషియా.

కాసేపు అవును, కాదుకి మధ్యస్థమైన వివరాలేవో చెప్పాను.

"ఖాళీ సమయంలో ఏం చేస్తావు?" నన్ను హీరోయిన్‌ని చేసే ప్రయత్నం చేస్తోంది. నేనే నేషనల్ లెవెల్ పోకర్ ఆడుతానానో, చెస్ ప్లేయర్‌ననో చెప్తే ననుగన్న మాయమ్మ కూడా ఆశ్చర్యపోయి భయపడేంత పొగుడుతుందీవిడ అని నవ్వుకున్నాను. నావి మరీ ఇంత దారుణమైన ఆలోచనలేంటో!

"కథలు రాస్తాను," అతిశయానికి అట్టేపి మాడెస్ట్‌గా

చెప్పాను. నా గొంతు నాకే, 'స్విమ్మింగ్ వచ్చు' అని వెంకటేష్ చెప్పినట్టు వినిపించింది.

ఇంతలేసి కళ్లతో ఆశ్చర్యపోయి మెచ్చేసుకుంది. తెలుగులో అని చెప్పేసరికి మరింత మెచ్చుకుంది. ఒక అమెరికన్ వనిత టెస్టిమోనీ అక్కరకు వస్తుందో రాదో కానీ...

'నువ్వెప్పుడైనా ఇంగ్లిష్‌లో రాస్తే తప్పక పంప'మని ఒట్టేయించుకుంది. తప్పకుండా అని చేతిలో చేయేసినంత పని చేసాను.

"అసలు ఎలాంటి కథలు రాస్తావు? నా క్లాస్‌మేట్ న్యూయార్కర్‌కి రాస్తుండేవాడు."

పెట్రీషియా లాంటి పాఠకులుంటే నా ప్రభ ఎలా వెలిగేదా అని ఆలోచించుకున్నానో క్షణం.

"ఫిక్షన్."

"మరి నీకు కథలకి వస్తువులెక్కడనుంచొస్తాయ్?"

వెఱ్ఱి నవ్వొచ్చింది.

"నేను కథలు చెప్తూ నీ టైం వృధా చెయ్యను. నాకంటే పనిలేదు కానీ, నీకుంటుంది కదా?" మొహమాటంగా అన్నాను.

"నా టీమ్ అంతా సెలవుల్లో ఉన్నారు. పరవాలేదు చెప్పు..." బుగ్గన చేయేసుకుందావిడ. ఏవిఁటీ ఋణానుబంధం?

తిన్న సబ్ అరిగేదాకా కబుర్లు చెప్పుకుని, మరో కాఫీ తెచ్చుకుందామని డిసైడ్ అయ్యాను.

"మా దేశంలో పెళ్లి ఎలా జరుగుతుందని అడిగావు కదా పెట్రీషియా... నేను నాలుగు కథలు చెప్తాను. అందులో ఒకటే నాది. కనుక్కోగలవా?"

"నువ్వు నాక్కొన్ని హింట్స్ ఇస్తే తప్పక ప్రయత్నిస్తాను. ఓడిపోయినా నాలుగు వండర్‌ఫుల్ కథలు వింటాను కదా! పరవాలేదు."

అరే!! మళ్లీ దోచేసుకుందీవిడ!

❖


"ఏ'ప్రశాంతమైన భారత పల్లెటూరు మాది. రెండు వీధులవతల నాకో స్నేహితురాలుండేది. వాళ్ల అన్నయ్య మాకు జామకాయలు కోసిస్తుండేవాడు. చిన్నప్పుడెప్పుడూ అతనే నా జీవితంలో ఓ కీలక మైన మనిషవుతాడని ఊహించలేదు."

"స్వీట్! అతన్నే ప్రేమించావా?"

"ఊహు... అతనికోసం పక్క ఊరి నుండి వచ్చే స్నేహితుడిని. మా ఊరికి దగ్గర్లో ఇరవై మైళ్లలో సముద్రం ఉంది. అక్కడ కలుసుకునే వాళ్లం. అప్పట్లో ఇండియాలో కేబుల్ టీవీ అనే ప్రభంజనం మొదలయింది. అప్పట్లో హార్లిక్స్ హృదయాంజలి టీమ్ వీధివీధికీ తిరిగి టీవీలో కనిపించాలనే ప్రజల సరదాని తీర్చేది. అలా ఒక దుర్ముహూర్తంలో మమ్మల్ని ఉదయభాను అనే భామ ఇంటర్వ్యూ చేసింది."

"దట్స్ అమేజింగ్!"

"అమేజింగు లేదు, ఆవకాయా లేదు. మొహానికి చున్నీ సగం చుట్టుకుని మాట్లాడాను. ఇంట్లో తెలిస్తే చీరేస్తారని భయం. అలా ప్రేమ అంటూ బీచులమ్మట తిరిగితే ఎంత అప్రదిష్ట! కానీ పక్కన అతనున్న మైకం... గలగలా భానుతో కబుర్లు చెప్పేశాను. 'లక్కీ బోయ్!' అని అతన్ని మెచ్చుకుంది కూడాను. అదెప్పుడు టీవీలో వస్తుందా అని భయం మొదలయింది.



"నా తలకాయ డిసిప్లిన్ పెట్రీషియా. విను... ఆ హృదయాంజలి వచ్చే టైముకి కేబుల్ పీకేయడం ఒక్కటే మార్గం అని, నేను హాల్లోనే కూర్చుని మా తమ్ముడికి లంచం ఇచ్చి ఆ పని చేయించే దాన్ని. మొత్తానికి వారం గడిచిపోయింది. గండం గడిచినట్టే అని ఊపిరి పీల్చుకున్నాను."

"థాంక్ గాడ్!"

"గాడ్ నన్ను మోసం చేసి, నాలుగిళ్ల అవతల ఉన్న మా అత్తకి టీవీ చూడాలనే బుద్ధి పుట్టించాడు. మొహానికి కప్పుకున్న చున్నీ నన్ను కాపాడలేకపోయింది."

"పోన్లే! నువ్వు బోలెడు అదృష్టవంతురాలివి. అడ్వెంచరస్ లవ్ స్టోరీ మొత్తానికి..."

"ఉహు... పప్పులో కాలేసావు. ఇంట్లో విషయం తెలిసి, వీపు చీరి నన్ను మా అక్క ఇంటికి పంపేశారు. నాలుగేళ్లు పోయాక, జామకాయలు కోసిచ్చిన ఫ్రెండు అన్నయ్య ఉన్నాడే... అతను నా మొగుడయ్యాడన్నమాట. అరేంజ్డ్ మేరేజ్. మరో రెండేళ్లకి అమెరికా వచ్చామా... ఒక కూతురు."

"దట్స్ స్వీట్! డెస్టినీ అంతే! ఇంతకీ నీ భర్తకి తెలుసా నీ క్రష్ సంగతి?"

"ఏం చెప్పమంటావ్ పెట్రీషియా! ఉదయభాను రిటైర్ అయ్యే దాకా ఆవిడ తెరపై మెరిసినప్పుడల్లా మా ఆయనకి దాక్షారం సంబంధం బెదిరింపు తప్పదు. దాక్షారం సంబంధమేంటని అడక్కు. అందుకు నీకు తెలుగు వచ్చితీరాలి. అదీ మొదటి కథ!"

"ఇదే నీ కథ అనిపించేలా చెప్పావ్ తెలుసా!"

❖

"ఏ'ఆరోజు జామకాయ కోసిద్దామని ఎప్పట్లాగే చెట్టెక్కి పట్టు తప్పి పడిపోయాడు. ఎముక అతుక్కున్నా కాస్త అవుకు అలా ఉండిపోయింది. పిల్లలం పెద్దవాళ్లయిపోయాం. అతను వీధిలో కనిపించినప్పుడల్లా నాకెందుకో తప్పు చేసినట్టనిపించేది. వయసొచ్చిందేమో ప్రేమ పుట్టింది.

"చీప్‌గా ఉత్తరం రాయడమా అనిపించి, చాలారోజులు ఆలోచించాను. అప్పట్లో సందుకొక నెట్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఈమెయిల్ వచ్చింది. అతని పేరులో రెండు అక్షరాలూ, నా పేరులో రెండు అక్షరాలూ కలిపి, నేను పుట్టిన సంవత్సరం తగిలించి ఐడీ క్రియేట్ చేయించుకున్నాను."

"ఎవరు చేశారు??"

"హెల్ప్ తీసుకునేవాళ్లం. తప్పేం లేదు. నెట్ సెంటర్ అన్నయ్య చేశాడు. జాగ్రత్తగా చీటీమీద రాసుకుని ఇంటికి తీసుకెళ్లాను. ఆ అబ్బాయి కంప్యూటర్స్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు మరి. ప్రేమ తెలియజెయ్యాలంటే నాకు ఆ మాత్రం టెక్నాలజీ తెలియకపోతే ఎలా!"

"యూ ఆర్ రొమాంటిక్ యునో!"

"ఏనో పెట్రీషియా. ఆరోజు సాయంత్రం వెనకవీధి పార్వతీదేవి కోవెలకి వాళ్లన్నయ్యని తీసుకురమ్మని నా ఫ్రెండ్‌ని అడుక్కున్నాను. బోలెడు బతిమాలించుకుని సరే అంది. అక్కడ తనని ఎవరో ఏడిపిస్తున్నారని అబద్ధం చెప్పి తీసుకొచ్చింది పాపం."

"దట్ గాళ్ ఈజ్ బాంబ్!"


"మా వీధిలో అందరూ బాంబులే. ఆ అబ్బాయ్ సైకిల్ ఆపే సరికి నాకు వణుకొచ్చేసింది. తెగించి చీటీ తీసుకెళ్లి తన చేతిలో పెట్టేసా. ఏమిటిదన్నాడు. ఈమెయిల్ ఐడీ అని చెప్పాను. అదిసరే ఎందుకన్నాడు. మెయిల్స్ రాసుకోడానికి అని సహనంగా చెప్పాను. అయోమయంగా పాస్‌వర్డ్ ఎందుకన్నాడు."

"వాట్!!!"

"అవును. చీటీలో మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ కూడా రాసిచ్చాను. 'పాస్‌వర్డ్ లేనిదే లాగిన్ అవలేరని నెట్ సెంటరన్నయ్య చెప్పాడు. అందుకే ఇస్తున్నా... లాగిన్ అవమని' చెప్పాను. అయోమయంగా చూస్తూ ఉండిపోయాడు. ఎప్పటికైనా లాగిన్ అవుతాడు కదా అని బోలెడు ఈమెయిల్స్ రాసాను కూడా. గంటకి పది రూపాయలు ఖర్చు."

పకపకా నవ్వుతోంది పెట్రీషియా.

"ఇదిగో... ఇలాగే నవ్వేవాడు నేను కనిపించినప్పుడల్లా. భలే ఏడుపొచ్చేది. ఈ ప్రేమ మనకి అచ్చిరాలేదని వదిలేశా. ఆ వచ్చే ఏడాది నేను కూడా కంప్యూటర్ ఇంజి



నీరింగ్ జాయిన్ అయ్యాను. అయ్యాక నాలుగైదు నెలలకను కుంటా... బల్బు వెలిగింది. ఆ తరువాతెప్పుడో కనిపించినప్పుడు అదే నవ్వు. ఏడవబోయి నేనూ నవ్వేసాను.''

నా భుజం మీద తట్టి కళ్లు తుడుచుకుని మరీ నవ్వుతోంది. ''ఏమయిందప్పుడు?'' తమాయించుకుని అడిగింది.

''కొన్నాళ్లకి నాకో చీటీ పంపాడు. తన ఈమెయిల్ ఐడీ! పాస్‌వర్డ్ తరువాతెప్పుడో తెలిసిందిలే. నా పేరే.''

''దట్స్ హిలేరియస్ అండ్ సూపర్ క్యూట్!''

''మా పెళ్లయ్యాక చెప్పాడు... నేనిచ్చిన మెయిల్ ఐడీలోకి లాగిన్ అయి నేను రాసిన మెయిల్స్ అన్నీ ఎప్పటికప్పుడు వేడివేడి డ్రాఫ్ట్ చదివానని. నా అజ్ఞానాన్ని పూర్తిగా ఆస్వాదించాడన్నమాట! నేను తనని క్షమించడానికి చాలారోజులు పట్టింది. తలుచుకుంటే ఇప్పుడు కూడా చచ్చేంత కోపమొస్తుంది.''

''ఇది కచ్చితంగా నీ కథే!'' నవ్వుతూ చెప్పింది.

''అయితే మిగిలిన రెండూ చెప్పక్కర్లేదా?''

''నో నో నో... చెప్పు చెప్పు.''

❖

''ఏమేమిద్దరం ఇంజినీరింగ్‌లో కలిశాం. ఒకేసారి కేంపస్ సెలెక్షన్ వచ్చింది. కానీ అమెరికా వచ్చి పనిచేసే ఆన్‌సైట్ వరం తనకి ముందొచ్చింది. నాకు రాలేదు. అతను అమెరికా - నేను ఇండియా. రెండేళ్లు లాంగ్ డిస్టెన్స్ రిలేషన్.''

''ఓహ్. దట్స్ టఫ్!''

''అంతకంటే టఫ్ ఇంకోటుంటుందని నేననుకోను. నేను స్టూడెంట్ వీసా మీద అమెరికా వచ్చాను. ఇక్కడా దూరంగానే! తను కేలిఫోర్నియా - నేను కెంటకీ.''

''వెల్... కొంతలో కొంత నయం కదా!''

''అస్సలు కాదు. దూరంగా ఉన్నప్పటికంటే అందే దూరంలో ఉన్నప్పటి ఆరాటం, బాధ మరీ ఎక్కువ. ఇంతలో తన వీసా ఎక్స్‌టెన్షన్ రిజెక్ట్ అయింది. నేను ఇండియాలో ఉద్యోగం మానేసి ఇక్కడికొచ్చి చదువు మొదలెట్టి ఏడాదే అయింది. మరో ఏడాది నేనిక్కడ చిక్కుకుపోయాను.''

''డేమ్!''

''ఎస్... నా చదువుకి అయిన లోన్ తీర్చుకునేందుకు సీపీటీ మీద ఉద్యోగం మొదలుపెట్టాను. ఆ తరువాత ఓపీటీ ఉద్యోగం కొన్నాళ్లు. అతను అమెరికా రావడానికి మళ్లీ ప్రయత్నాలు. లాటరీ సిస్టం మొదలయింది ఆ సంవత్సరమే! అన్ని రోగాలూ ఆ కుంటి గాడిదకే! ఇక్కడ గాడిద అంటే మేమిద్దరం. ఎంత అలిసిపోయే వాళ్లమో మాకే తెలుసు. ఏడవడానికి కూడా కుదరని పరిస్థితి.''

''పోనీ నువ్వు ఇండియా వెనక్కి వెళ్లిపోవలసింది కదా?''

''నా లోన్ తీరేదాకా నేను అమెరికా వదిలివెళ్లలేను. ఇండియాలో ఎన్ని సంవత్సరాలు పనిచేస్తే ఫిఫ్టీ థౌజండ్ డాలర్స్ కూడబెట్టగలను? ఇద్దరు మనుషులది ఒకటే జీవితం అయినప్పుడు, దాన్ని దూరం విడదీయడమన్నది ఎలా ఉంటుందో మాకు తెలుసు. ఇంకెవరికీ తెలియదని కాదు, మాకు తెలుసని చెప్తున్నానంతే.''

''ఏమయిందప్పుడు? నువ్విక్కడున్నావంటే హేపీ ఎండింగ్ కదా?'' ఆత్రుతగా అడిగింది.

''అఫ్‌కోర్స్... మొత్తం ఐదు సంవత్సరాల దూరం, సందిగ్ధం తరువాత, నాకు హెచ్ వన్ వచ్చింది.''

''మరి తను?''

''డిపెండెంట్ వీసా మీద అమెరికా మళ్లీ వచ్చాడు. నాకు హెచ్ వన్ వచ్చాక ఇండియా వెళ్లి పెళ్లి చేసుకుని యిద్దరం వచ్చాం.''

''గుడ్ బట్ కన్ఫ్యూజింగ్! ఇంత ఇబ్బంది ఉంటుందా వీసాలో?''

''చాలా. అందులోను వైటుకే తరువాత వచ్చినవాళ్లకి వీసా ఇబ్బందులు తప్పవు. పుణ్యం కొద్దీ వీసా, దానం కొద్దీ గ్రీన్ కార్డు. సరే, నేను ఇండియా వెళ్లాను. పెళ్లయింది. అతను డిపెండెంట్ వీసా మీద వచ్చి, స్టూడెంట్‌గా మారి ఉద్యోగం చేస్తున్నాడు. బతకడానికి డబ్బులు కావాలి కదా?''

''ఇంకా ఇబ్బందేనా?''

''రెండేళ్ల క్రితం దాకా. హెచ్ ఫోర్ డిపెండెంట్‌కి వర్క్ పర్మిట్ వచ్చాక కొంత నయం. కానీ తన కెరీర్ నావల్ల చాలా పాడయింది. ఇప్పుడు ట్రంప్ ఏక్షణమైనా ఈ హెచ్ ఫోర్ వర్క్ పర్మిట్ తీసేస్తాడని భయపడుతున్నాం.''

''మీ దేశానికి వెళ్లిపోవచ్చు కదా? ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు కానీ...''

''నా లోన్ తీరింది. ఇంక ఏ క్షణం ఏం జరిగినా భయంలేదు. వెనక్కి వెళ్లిపోతాం. ఇలాంటి మూడున్నర మిలియన్ల కథలుంటాయి పెట్రీషియా. వీసా కథలంటారు వాటిని. కొన్ని సుఖాంతాలు, మిగిలినవి ఒడ్డు కనిపించని ఎదురీతలు.''

''నాకు తెలిసేవే కావు. థాంక్స్ ఫర్ షేరింగ్. ఐ కౌంట్ మై బ్లెస్సింగ్స్ టుడే...''

మౌనంగా ఉండిపోయాను. కాసేపటికి తేరుకుని ఎవరి క్యూబికల్స్‌కి వాళ్లు వెళ్లిపోయాం. కౌగలించుకుని గుడ్ లక్ చెప్పి ఫోన్ నంబర్ ఇచ్చింది. నా గొంతు ఆమె మళ్లీ వినకపోవచ్చు.


నాలుగో కథా? బహుశా అదే నాది కావొచ్చు. మీకు చెప్తాను. మనలో మనకే తెలియని వెలితి ఒకటుంటుంది. కొందరికి అది ఏ వెన్నుమీదో నొప్పి తెలియని పులిపిరిలా ఉండిపోతుంది. కొందరి దురదృష్టానికి అది కంటిమీద మొదలవుతుంది. ఆగలేరింక. దారులు వెతుకుతూ తపిస్తారు. ఏడుస్తూ కవిత్వం రాస్తారు, లేదా బొమ్మలు గీస్తారు, కొందరు కథలు చెప్తారు. ఏం చేసినా మన చేతివేళ్లలో ఇమిడే మరో చెయ్యి వెలితిని పూడ్చడం ఎవరి తరం?

నా ఫోన్ మోగుతోంది. ఏం చేసావ్ ఉదయం నుంచీ అని ప్రశ్న వినబడుతుంది.

పెట్రీషియాకి కథలు చెప్పానని చెప్పనా?

సృష్టిలో తీయనిది

డా॥ నక్కా విజయరామరాజు



రోజూ పొద్దున్నే మా పనసచెట్టు దగ్గర కూర్చుని ఉదయభానుడ్ని చూస్తూ, పిట్టల కూతలు వింటూ దినపత్రికలు తిరగేయటం నా అలవాటు.

వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

చెట్టుకొమ్మ మీద కూర్చుని అదేపనిగా కూస్తుంది కోకిలమ్మ. దాని కూతకు పై కూత వేయటం నాకు సరదా.

అది కూ... అంటే కూ... కూ అని రెట్టిస్తూ నేనూ.

ఈ సీజనంతా మాకిదే కూతాట!

మా జుగల్బందీ చూసి, "ఈ వయసులోనూ చిన్నపిల్లల్లా ఏమిటండీ?" అంటూ పొగలు గక్కే కాఫీలు తెచ్చి పక్కన కూర్చుంది నందిని.

ఘుమఘుమాడే కాఫీ ఉదయాన్నే తాగటం ఓ గొప్ప అనుభూతి. కాఫీ రుచి ఆస్వాదిస్తుంటే నా దోస్తు ఆహారవేటకు వెళ్లినట్టుంది. ఎదురుగ్గా వచ్చి నిలబడ్డాడు మా చిన్నబ్బాయి. వాడి చేతిలో తెలుగు వాచకం!

మామూలుగా ఆవేళపుడు నాకంటబడడు.

'రెండో బూటు మిస్సింగనో... హోంవర్కు బుక్కు నాట్ ఫౌండనో షార్పనర్ నాట్ ట్రేస్డ్ అనో ఏదొక రచ్చచేస్తూ వాళ్ల మమ్మీని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తాడు. వాడి స్కూలు ఆటో వెళ్తే గాలివాన వెలిసినట్టే!

మాటాపలుకూ లేకుండా ప్రతినెలా మొదటివారంలో జీతం కోసం వచ్చే గూర్ఖాలా నిలబడ్డాడు.

విషయం ఏమిటని కళ్లెగరేశా!

చేతిలో పుస్తకాన్ని నా వళ్లో పడేశాడు. ఖాళీకప్పు పక్కన పెట్టి ఆ పుస్తకం తీసుకున్నాను.

"మై మిస్ టోల్డ్ మి టు రీడ్ వన్ చాప్టర్ ఇన్ దట్ బుక్," అన్నాడు.

వాడికి తెలుగు సరిగ్గా రాదు. ఇంటాబయటా అంతా ఇంగ్లీషే! పాపం వాడుమాత్రం ఏం చేస్తాడు? తెలుగు మాట్లాడినట్టు తెలిస్తే గుండు గీయిస్తారట వాడు చదివే గ్రామర్ స్కూలువాళ్లు. అందుకే మా వర్కర్సు, కాంపౌండర్స్‌తో కూడా ఇంగ్లీషే!

నేను పుస్తకంలోని పేజీలు తిరగేస్తుంటే ఆసక్తిగా చూస్తున్నాడు. కృష్ణుడు, కుచేలుడు బొమ్మ వున్న పేజీ దగ్గరకు రాగానే, "దట్ చాప్టర్ డాడ్," అన్నాడు.

"వాడ్డూయూ వాంట్?" అనడిగా.

"వాళ్ల స్కూల్లో ఎస్సే రైటింగ్ కాంపిటీషనుందంట! పొద్దున్నుంచీ నన్నిసిగిస్తుంటే మీ దగ్గరకు పంపా. అదేదో చెప్పండి," సిఫార్సు చేసింఇ నందిని, పేపర్లోంచి ముఖం తిప్పకుండానే. నేని చదువుతుంటే మా బుడ్డోడు పనసచెట్టెక్కి దిగుతున్న ఉడతల్ని చూస్తున్నాడు.

"దిస్ ఈజ్ ఎ స్టోరీ ఆఫ్ ఫ్రెండ్‌షిప్..." అంటూ కృష్ణుడు, కుచేలుని కథ అవుట్‌లైన్ చెప్పా.

అర్థం అయ్యీ కానట్టు తలూపాడు. వాడ తీఇచూపంతా ఈసారి పనసకాయల మీదుంది.

"కట్టె కొట్టె తెచ్చె అన్న టైపులో చెబితే వాడికేమర్థమవుతుందండీ? కొంచెం డీటైల్డ్‌ఆ చెప్పండి," మధ్యలో నందిని కల్పించుకుంది. ఈసారి వాడి ధ్యాస చెట్టు మీద కూస్తున్న పిట్టమీదుంది. సెకండ్ రీడింగు మొదలెట్టా. బుడ్డోడు నాపక్కకొచ్చాడు.

"ఏమండోయ్! ఇది చూశారా? కోతికొమ్మచ్చి బుక్కు రిలీజ్ ఫంక్షనంట! వెళ్దామా?" అంది ఉత్సాహంగా నందిని.

"ఎక్కడంటా..." తెలుగు వాచకం పక్కన పడేసి న్యూస్ పేపరందుకున్నా.

'కోతికొమ్మచ్చి' బాపురమణల జీవిత కథ. అది ఒక వార పత్రికలో సీరియల్‌గా వస్తున్నప్పుడు ఇద్దరం కల్సి చదివాం. దానికోసం వారం వారం ఆసక్తిగా ఎదురుచూసేవాళ్లం. ఒక్కటీ మిస్ కాలేదు. రాజమండ్రి నుంచి నర్సాపురం దాకా... సాక్షి సినిమా నుంచి శ్రీరామరాజ్యందాకా వాళ్ల సినిమాలు, కార్టూన్లు, బొమ్మలు, కథల గురించి మాట్లాడుతూ పరిసరాలనే మర్చిపోయాం.

బుడ్డోడు కూడా చెట్టు పిట్టల నొదిలేసి మా కబుర్లు ఆసక్తిగా వింటున్నాడు.

స్కూల్ ఆటో హారన్ మోతతో ఈ లోకంలోకొచ్చింది నందిని.

వాటర్ బాటిల్స్, టిఫిన్ బాక్సులు, బుక్స్ బ్యాగ్స్‌తో పాటు పిల్లల్ని ఆటోలో కుక్కింది. ఆటో వెళ్లిపోయింది.

ఆ హడావిడిలో బుడ్డోడు తెలుగువాచకం మర్చిపోయాడు.

❖

సాయంత్రం ఆరుగంటలయింది. రవీంద్రభారతి వెలిగిపోతోంది. ఆవరణంతా బాపు బొమ్మలు, కార్టూన్లు అలరిస్తున్నాయి. వాటిని చూసేవారు చూస్తుంటే, చూసినవారంతా మెయిన్ హాలు వైపు వెళ్తున్నారు.

పుస్తకావిష్కరణ ఫంక్షన్ జరిగే చోటదే!

నేనూ వెళ్లాను. గేటు దగ్గర ఇన్విటేషన్స్ తనిఖీ చేస్తున్నారు. పచ్చి వెలక్కాయ గొంతు కడ్డంపడ్డట్టయ్యింది.

'సిరికిం జెప్పడు, శంఖుచక్రములో' అన్న టైపులో బాపురమణల ఫంక్షన్ అనగానే పనీపాటు మానేసి, ఇంట్లోనూ చెప్పకుండా వచ్చేశా!

అక్కడే గేటు దగ్గరే ఆగిపోయా! ఇక్కడ మనల్ని గుర్తుపట్టే దెవరు? అదే మా వూర్లో అయితే నాకీ ఫార్మాల్టీస్ ఏవీ వుండవు, అంతా తెల్సినవాళ్లే కాబట్టి.

ఒక వూరు కరణం ఇంకో వూరు ఎట్టి అంటే ఇదేనేమో! అన్నీ కొత్త ముఖాలే! తిరిగెళ్లిపోదామనుకున్నాను. తెల్సిన ముఖాలే మైనా వుండవా అన్న ఆశతో అక్కడే నిలబడ్డా. కొద్దిసేపటికి చంద్ర, మోహన్, కరుణాకర్, శంకర్‌లు ఇటే రావటం కన్పించింది. అంతా పెద్ద ఆర్టిస్టులు. నా కథలకు బొమ్మల కోసం వారిని అంతకు ముందు కలిశా. వాళ్లందర్నీ ఒక్కసారి ఒక్కచోట చూసేసరికి తిరణాల్లో తప్పిపోయిన పిల్లోడికి అమ్మ కన్పించినంత ఆనందం!

నవ్వుతూ పలకరించా. గుర్తుపట్టినట్టు లేదు. లోనికెళ్లి పోయారు. ఎటూ తేల్చుకోలేక అక్కడే నిలబడ్డా.

పావుగంట గడిచిపోయింది. తిరిగెళ్లిపోదామని వెనక్కి తిరిగే సరికి, ఎదురుగ్గా కాలేజీలో నాతోపాటు చదివి హైద్రాబాద్‌లో పని చేస్తున్న ఫ్రెండ్! హమ్మయ్య! ఊపిరందని పేషెంట్‌కి ఆక్సిజన్ దొరికినట్టయ్యింది.

ఎదురెళ్లి, "నేనురా! నేనూ," అంటూ ఇంటిపేరుతో సహా చెప్పా.

"మీరా? ఇక్కడేం చేస్తున్నారు?" అన్నాడు ఆముదం ఫేసు పెట్టి.

'రవీంద్రభారతిలో చేపలు పట్టడానికొచ్చానని,' చెబుదామనుకున్నా. వెటకారానికి టైం కాదని, "కోతికొమ్మచ్చి బుక్ రిలీజ్ ఫంక్షన్ కదా! బాపు రమణలను చూద్దామని,' చెబుతుండగానే-

"ఓ! ఇన్విటేషన్ లేదా? ఇలాటి పెద్ద ఫంక్షన్‌లకు అది లేకుండా రానివ్వరు బాస్," అన్నాడు వెకిలి నవ్వుతో.

"అదుంటే నువ్వెందుకు? పని చూసుకో బోస్," అన్నాను కోపంగా.

నా మాటలు పట్టించుకోకుండా దులుపుకుని వెళ్లిపోయాడు.

లోపల్నించి పాటలు విన్పిస్తున్నాయి. మీటింగు స్టార్ట్ అయినట్టుంది. నా ఇగో హర్ట్ అయింది. నిరాశగా తిరిగి వస్తుంటే-

అవుట్ గేట్ దగ్గర ఆర్టిస్టు అన్వర్ కన్పించాడు.

బొమ్మల గురించి మోహన్‌గార్ని కలవడానికెళ్లినపుడు పరిచయం.

తలొంచుకుని వస్తుంటే, "లోపల మీటింగు జరుగుతుంటే వెళ్లిపోతున్నారేంటి?" అన్నాడు.

నాలాగా అన్వర్‌గారిక్కూడా బాపురమణలంటే చాలా అభిమానం. మొహమాటపడుతూ, టూకీగా విషయం చెప్పా.


"మీరు భలేవారండీ! అంత దూరం నుంచొచ్చి ప్రోగ్రామ్ చూడకుండా తిరిగెళ్లిపోతారా? ఆర్గనైజర్స్ నాకు తెల్సు, రండీ," అంటూ నన్ను హాలు లోపలికి తీసుకెళ్లి స్టేజీకి దగ్గరగా కూర్చోబెట్టాడు.

ఇంకా లోకంలో మంచోళ్లు ఉన్నారనిపించింది. అప్పుడే 'అమ్మ కడుపు చల్లగా అత్త కడుపు చల్లగా బతకరా బతకరా పచ్చగా...' అంటూ స్టేజి మీద పాట పాడుతున్నారెవరో.

పాట అయిపోగానే టీచర్‌లా బెత్తం చేతపట్టుకుని 'సైలెన్స్... సైలెన్స్' అంటూ రావి కొండలరావు స్టేజిమీదకొచ్చారు.

బాపుగారి జోకులు, రమణగారి అప్పుల అప్పారావు గురించి చెప్పి జనాల్ని నవ్విస్తున్నారు.

ఇంతలో ఎవరో పెద్దమనిషి వచ్చి ప్రసంగం మొదలెట్టబోతే, "ఇక్కడ ప్రసంగాలు, ప్రశంసలు నిషిద్ధం. అన్నీ నవ్వులే," అనేసరికి ఆ పెద్దమనిషి తప్పుకున్నాడు.



మధ్యమధ్యలో బాపుగారి సినిమాల్లోని పాటలు విన్పిస్తు న్నారు. కొంతమంది అమ్మాయిలు బాపు బొమ్మల్లా అలంకరించుకుని వచ్చారు. ఆ తర్వాత, 'కోతి కొమ్మచ్చి' పుస్తక ఆవిష్కరణ జరిగింది. బాపు రమణల స్నేహం గురించి ఒకరిద్దరు క్లుప్తంగా మాట్లాడారు.

మూడు కార్టూన్లు ఆరు నవ్వుల్లా సభ ఆద్యంతం ఆహ్లాదకరంగా జరిగింది. సభ అనంతరం బాపురమణల ఆటోగ్రాఫ్‌ల కోసం బాపిస్టులు ఎగ బడ్డారు. నేనూ ఒక ఫోటోనో, ఆటోగ్రాఫో సంపా దిద్దామనుకున్నానుగానీ ఆ రద్దీలో నావల్ల కాలేదు.

కొద్దిసేపటికి రైలెళ్లిపోయిన ప్లాట్ పారంలా హాలంతా ఖాళీ అయ్యింది.

బయటికొచ్చాను. అక్కడొక కారు దగ్గర అంత ర్వేది తీర్థంలా వుంది. బాపు రమణలను అభిమానుల నుంచి తప్పిస్తూ ఒకరతను కన్పించాడు. బాగా తెల్సిన ముఖం. గుర్తొచ్చింది. మెడికల్ కాలేజీలో నా క్లాస్‌మెట్! ఇక్కడ చదువు అయిపోగానే లండన్

వెళ్లాడు. ఇన్నేళ్ల తర్వాత గుర్తుపడతాడా? ఒకవేళ గుర్తు పట్టినా ఇంతమంది జనం మధ్యలో పలకరిస్తాడా? అలా పలకరించేవాడేగా నిజమైన ఫ్రెండు. మన పిచ్చిగానీ ఈరోజుల్లో అవసరార్థ స్నేహాలేగానీ అసలైన ఫ్రెండ్స్ ఎక్కడున్నారు. చెయ్యూపాను. నన్ను చూసాడో లేదో! బాపురమణలు ఎక్కిన కారు వెళ్లిపోయింది. మిత్రుడు జనంలో కల్సి వెళ్లిపోయాడు.

రోడ్డుమీదికొచ్చాను. వచ్చే కార్లు పోయే బస్సులు అంతా రణగొణధ్వనిగా వుంది.

పొద్దుపోయింది. ఇళ్లకెళ్లాలన్న హడావిడిలో జనం. నా భుజం మీద ఎవరిదో చెయ్యి పడగానే ఖంగారుగా పక్కకి తిరిగి చూశాను. గురవారెడ్డి! మెడికల్ కాలేజీలో నా క్లాస్‌మేట్. ఇందాక బాపురమణలను కారెక్కిస్తూ కనపడ్డాడు. వారితో కల్సి వెళ్లలేదన్న మాట.

సూటూ బూటేసి లండన్‌బాబులా వున్నాడు. ఇరవై ఏళ్ల తర్వాత రిప్‌వాన్ వింకిల్ కథలోలా నా ప్రక్కన ప్రత్యక్షమయ్యేసరికి నోట మాట రాలేదు.

"మీటింగుకొస్తూ మాట వరసకైనా చెప్పలేదేరా?" అన్నాడు నవ్వుతూ.

కాలేజీలోనూ ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ, జోకులు చెబుతూ ప్రాక్టికల్ జోక్స్ వేసేవాడు. వాడి పక్కన ఎప్పుడూ పది మంది పైగా అమ్మాయిలు అబ్బాయిలుండేవారు.

"హడావిడిగా వచ్చేశారా! ఇన్నేళ్ల తర్వాత నేనింకా గుర్తున్నారా?" అనడిగా ఆశ్చర్యంగా.

"అంత వీజీగా మర్చిపోయే పర్సనాల్టీరా నీది?" అన్నాడు కామెడీగా. వాడిలో అందరికీ నచ్చే హ్యూమర్ అదే!

"లండనెళ్లొచ్చినా నీలో ఆ కామెడీ తగ్గలేదురా బాబాయ్," అన్నాను.

"అదేగా మనలో వున్న ప్లస్ పాయింట్ అబ్బాయ్," అన్నాడు వీపు మీద ప్రేమగా చరుస్తూ.

"బాపురమణలను దగ్గరగా చూద్దామని వచ్చా! హేపీస్! వాళ్లతో పాటు కల్సి ఫోటో దిగుదామనుకున్నాగానీ- కుదర్లేదురా! అయినా అది చాల్లే!" అన్నాను.

బాపురమణలంటే కాలేజీ రోజుల్నుంచి మా ఇద్దరికీ చాలా ఇష్టం. అప్పట్లో బాపు, వడ్డాది పాపయ్య బొమ్మలు చూసి గీసేవాణ్ణి. వాడు హ్యూమర్ కథలు రాసేవాడు.

ఫైనల్ ఇయర్లో వుండగా కాలేజీ మేగజిన్ సెక్రటరీగా చేశాడు. దానికి ముఖచిత్రంగా బాపుగారి నుంచి బొమ్మ సంపాదించాడు. ఆ విషయం కాలేజీ మొత్తం చాలా గొప్పగా చెప్పుకున్నారు. కాలేజీ ఆలోచనల్లోంచి తేరుకుని-

"లేటైతే మా వూరెళ్లే బస్సులుండవురా," అన్నాను వాచీ చూసుకుంటూ.

"ఇంత కాలానికి కనబడి ఇంటికి రాకుండా వెళ్లిపోదామనే?" అన్నాడు సెంటిమెంటల్‌గా.

"ఈసారెప్పుడయినా..." గొణిగినట్టన్నా.

"నథింగ్ డూయింగ్... ఆ నల్లకారెక్కు," అన్నాడు.

ట్రాన్స్‌లో నడిచెళ్లి కారెక్కాను.

వెనక సీట్లో ఇద్దరు లేడీస్ వున్నారు. సభ్యత కాదన్నట్టు వెనక్కి తిరిగి చూడలేదు.

ట్రాఫిక్కును చీల్చుకుంటూ బాణంలా దూసుకుపోతుంది కారు. గురవారెడ్డి మెడిసిన్ చదివేప్పుడు నా క్లాస్‌మేట్టేగానీ వాడి గ్రూపు వేరు, మా గ్రూపు వేరు.

మేమంతా రూరల్ మాస్. వాడిది అర్బన్ క్లాస్.

వాళ్లెప్పుడూ హాష్ బూష్ అంటూ ఇంగ్లీషులో మాట్లాడుతూ లీలామహల్లోకొచ్చే ఇంగ్లీషు సిన్మాలన్నీ చూసేవాళ్లు. మాదంతా చిక్కుడు-దొరకుడు, కదలడు వదలడు, అగ్గిబరాటా లాంటి ఎంటీవోడి గ్రూపు. అర్థం కాకపోయినా వాళ్లకు పోటీగా ఇంగ్లీషు సిన్మాలు చూసేవాళ్లం.

వాళ్ల గ్రూపులో వీడు, అరవింద్‌బాబు ఎస్సే రైటింగు, ఎలెక్యుషన్, డిబేటులకెళ్లి ఇంటర్ కాలేజ్, యూనివర్సిటీ లెవల్లో బోలెడన్ని ప్రైజులు కొట్టుకొచ్చేవాళ్లు. అమ్మాయిలంతా వాళ్ల చుట్టే మూగేవాళ్లు. అది చూసి మాకు మండిపోయేది.

మేమేం తక్కువకాదు. ఆటల్లో, నాటకాల్లో, స్ట్రైకుల్లో, గొడవల్లో ముందుండేవాళ్లం. కాలేజీలో ఎప్పుడు ఎలక్షన్ జరిగినా మా రెండు గ్రూపులకు పోటీనే!

నా ఆలోచనలు అంతూ పొంతూ లేకుండా సాగుతున్నాయి. నా ఈ చిన్ని జీవితంలో పరిచయస్తులు, సహాధ్యాయులు, బంధువులు, మిత్రులు... ఎవరెలాంటివారో తెలుసుకోవడం అంత తేలిక కాదని ఎదురైన ప్రతి సంఘటన తెలుపుతూనే వుంటుంది.

అందుకే ముఖం చూసి ఎవర్నీ మంచి చెడు ముద్ర వేయలేము.

వారం కిందట ఊరెళ్లాను. మా దూరపు బంధువు మామ వరసయిన అతనికి ఎప్పట్నుంచో కడుపునెప్పంట! ఎంతమంది డాక్టర్లను కలిసినా తగ్గలేదని ప్రిస్క్రిప్షన్లు, ఇన్‌వెస్టిగేషన్స్ కాగితాల కట్ట నా చేతికిచ్చి భోరున ఏడ్చింది అత్తయ్య.

ప్రతిచోటా ఏటూ జెడ్ టెస్టులన్నీ చేశారు. అంతా స్పెషలిస్టులే! కాగితాలు చూస్తుంటే మా అత్తయ్య భోరున ఏడ్చింది. నా బాధ్యత గుర్తొచ్చింది.

నాతోపాటు మా మావయ్యను దగ్గర్లో వున్న టౌనుకు తీసుకెళ్లాను. ఇక్కడ చుట్టుపక్కల ఊర్లలోనే నాతో చదివిన వాళ్లంతా ప్రాక్టీసు చేస్తున్నారు.

ఊరు మధ్యలో పెద్ద బిల్డింగు కట్టి ఎక్స్ రే, స్కానింగు పరీక్షలన్నీ దాంట్లోనే ఏర్పాటు చేశాడు, నా క్లాస్‌మేట్. తెలివైనవాడు. నా విజిటింగు కార్డు డాక్టరర్ కన్సల్టేషన్ రూంలోకి పంపా. గంట తర్వాత నాతోపాటు వచ్చిన మావయ్యను పిలిచారు.

నేనూ లోనికి పోబోతుంటే సిస్టర్ బయటే ఆపేసింది. చూపించుకుని పది నిముషాల్లో బయటికొచ్చాడు మావయ్య.

మందులు కొనిపెట్టా. అవి చూసి, "ఇవన్నీ రెండేళ్లుగా వాడుతున్నా నబ్బాయ్! ఓపాలి లోనికెళ్లి నా జబ్బేందో పెద్ద డాక్టర్‌తో కనుక్కో," అన్నాడు.

నేను కన్సల్టేషన్ గదిలోకి పోబోతుంటే మళ్లీ బ్రేకేసింది సిస్టర్. ఆమెను పట్టించుకోకుండా లోనికెళ్లాను.

మావయ్య డిసీజ్ గురించి అడిగితే- తడిపొడి మాటలు మాట్లాడి, యూ కెన్ గో అన్నట్టు తర్వాత పేషెంటును చూస్తున్నాడు. మనిషికి చదువు వల్ల పెద్ద పెద్ద డిగ్రీలొస్తాయిగానీ సంస్కారం అబ్బదని అర్థమయింది. బయటికొస్తుంటే-

అదరము కదిలియు కదలక
మృదువైన మాటలుడిగి మౌనవ్రతుడౌ
బదిరాంధక శవము చూడ పాపము సుమతీ!

అనే బద్దెనగారి పద్యం గుర్తొచ్చింది.

ఆరోజే మావయ్యను మనసున్న మంచి డాక్టరుకు చూపించా. ఆయన జబ్బు పూర్తిగా తగ్గిపోయింది. కాలేజీల్లో, స్కూల్లో మనతో కల్సి చదవచ్చు, తినొచ్చు, తిరగొచ్చు... పెద్ద పెద్ద చదువులు చదివి, ప్రాక్టీసు పెట్టి బాగా డబ్బు సంపాదించినాక గానీ వారి ఒరిజినల్ బిహేవియర్ అర్థంకాదు!

ఆలోచనలు జోరీగల్లా ముసురుతున్నాయి.

ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. కారు దిగి వెళితే సరి. వెంటనే కారాపమన్నాను.

కారు ఓ పెద్ద బిల్డింగు ముందాగింది.

డ్రైవరు దిగి డోరు తెరచి నిలబడ్డాడు మర్యాదగా. దిగాను. చుట్టూ ఆకాశాన్నంటే బిల్డింగులు.

తిరిగి చూసేలోపు కారు వెళ్లిపోయింది.

కాంక్రీటు జంగిల్లో మళ్లీ ఒంటరిని. విఠలాచార్య సినిమాల్లోలా గురవారెడ్డి నా పక్కన ప్రత్యక్షమయ్యాడు.

"ఇప్పటికే బాగా లేటయ్యింది. ఇంకా లేటయితే మా వూరెళ్లే బస్సులుండవురా," అన్నాను.

వాడు మాట్లాడకుండా నన్నొక హాలులోకి తీసుకెళ్లాడు.

"బాపురమణలతో కల్సి ఫోటో దిగుతానన్నావుగా?" అన్నాడు.

"ఇంకెక్కడి బాపురమణలురా! వాళ్లెప్పుడో కారెక్కి వెళ్లిపోయారుగా!" అన్నాను నిరాశగా.

నా ఎదురుగ్గా ఇద్దరు పెద్దమనుషులు కూర్చుని భోం చేస్తున్నారు.

"మరి వీరెవర్రా?" అన్నాడు వాళ్ల పక్కన కూర్చోబెట్టి.

ఆనందంతో నోట మాట రాలేదు.

బాపురమణలు!

"ఈ రాత్రికి ఇక్కడే వుంటారు. నీ బస ఇక్కడే. ఎన్ని కావాలంటే అన్ని ఫోటోలు దిగు," అన్నాడు గురవారెడ్డి.

ఆనందంతో కడుపు నిండిపోయింది.

❖

నేనింకా నిద్రపోతుంటే మా చిన్నబ్బాయి వచ్చి నిద్ర లేపాడు.

"గెటప్ డాడీ! ఇటీజ్ టూ లేట్," అంటూ.

"గెట్ లాస్ట్. ఐ యామ్ టైర్డ్," అన్నాను ముసుగు తీయకుండానే.

"ప్లీజ్ డాడ్! గెటప్."

"పోరా! డోంట్ డిస్టర్బ్ మి."

"డాడ్! ఎస్టర్ డే యూ టోల్డ్ మీ ఎ స్టోరీ ఎబౌట్ కృష్ణా ఎండ్ కుచేల."

"యా!"

"ఐ కాంట్ అండర్‌స్టాండిట్."

"ఇఫ్ సో వాట్?"

"దాంట్లోనే ఎస్సే రైటింగు టెస్టు కండక్టు చేశారు మా స్కూల్లో."

"చచ్చింది గొర్రె! బుక్కు మర్చిపోయి వెళ్లావుగా?"

"థాంక్సు డాడీ! నాకే ఫస్టుప్రైజొచ్చింది."

"హా?! ఎలారా?"

"మోర్నింగు చెట్టు కింద కూర్చుని పేపర్లు చదువుతూ మొన్న మమ్మీ, మీరు బాపురమణగార్ల గురించి చెప్పుకున్నారుగా! అదంతా విన్నాను."

"అయితే? మీ ఎస్సేకి దానికి ఏంటిరా కనెక్షన్?"

"బుక్కు మర్చిపోయా. చదవలేదు. కృష్ణా కుచేల స్టోరీ గుర్తు రాలేదు. ఫ్రెండ్‌షిప్ టాపిక్ ఇచ్చారు. బాపురమణల గూర్చి విన్నదంతా రాసేశా."


నా నిద్రమత్తు వదిలిపోయింది.



ప్రముఖ కథకుడు, నవలా రచయిత డా॥ నక్కా విజయరామరాజు పుట్టి పెరిగింది గుంటూరు జిల్లా భట్టిప్రోలు. ఆ ప్రాంతపు జీవనాన్ని కళ్లకు కడుతూ 'భట్టిప్రోలు కథలు', 'మన వూరి కథలు' రాశారు. వివిధ పత్రికల కథల పోటీల్లో అనేకసార్లు బహుమతులు పొందారు. రెండు నవలలు రాశారు. బాపు-రమణలు అంటే ప్రాణం. వృత్తిరీత్యా వైద్యులు. నివాసం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్.

తొవ్వ

కొట్టం రామకృష్ణా రెడ్డి



ఇంకా తెల్లారలేదు.

వాగు అవుతలున్న అడివిని దాపు చేస్కోని పండుకున్న ట్టున్నడు సూర్యుడు... ఇవుతలికి కానొస్తలేడు.

నల్లగ మొగులైంది. సిన్నగ, సల్లగ గాలి వెడ్తున్నది. ఇప్పుడో, ఇంక జరైనంకనో ఆన సప్పరిచ్చేటట్టే ఉన్నది. ఊటగ దంచి కొట్టేటట్టే ఉన్నది.

బుగులు బుగులుగున్నది. నల్లటి మొగులు ఊరంత కమ్ముకున్నది.

రెండు కోల్యాగలు కొట్టుకపోయిండు అనంతయ్య అంగట్లమ్మి ఇన్ని ఇత్తనాలు, యూరియ సంచులు కొనక రానీకె.

మొగడ్ని సాగనంపి సన్నకొయ్యల పొర్కవట్టుకుని ఆకిలి ఊడ్సుడు మొదల్వెట్టింది... యాదమ్మ. ఇంతెడల్పు ఆకిలి. ఆకిలంత ఊకి చెత్త చెదారమంత చాటలకెత్తుకొని పెంటగుంతల ఏసొచ్చింది. ఇంటి పక్కపోంటి... గోడ పక్కకు కట్టేసున్న ఆవుల కాడ్కి వొయ్యి పెండ తీసి సాంపి గోళెంల ఏసి, చిక్కటి సాంపి చేసింది. ఆకిలంత సల్లింది. ముగ్గేసింది.

ఆవు తాన సాపుజేసి పెండెత్కపోయి మల్ల పెంట గుంతల ఏసొచ్చింది. కాల్జేతులు కడుక్కొని సర్వ తీసుకొచ్చి పాలు పిండింది. పొయ్యిలకెళ్లి ఇంత పిడకనుగ్గు తీసి పండ్లు తొమికునే ట్యాల్లకు అర్రల పండుకునున్న సంటి పోరడు కుయ్యిమన్నడు. ఏడి పని ఆడ ఇడ్సిపెట్టి మల్ల కాల్జేతులు కడుక్కుని పోరని పక్కల పండుకుని, నోటికి రొమ్మందించింది. సంటి పోరడు ఆత్రంగ పాలు తాక్కుంట తాక్కుంట మల్ల నిద్రవొయ్యిండు. మెల్లెగ పోరని ఇడిపిచ్చుకుని సర్వలకెళ్లి పెద్ద గిలాసెడు పాలు తీసిపెట్టి పొయ్యి రాజేసింది యాదమ్మ.

అత్త శాంతమ్మ ఉంటె ఇంత పనిల ఆసరైతుండె. మూడొద్దుల కిందనే నాయనకు పానం బాగలేదంటే సూశిరానీకె వొయ్యింది. అన్నంటే పంచ పానాలు శాంతమ్మకు. అన్న మీద పాయిరంతొటే బిడ్డని చేస్కున్నది పెద్ద కొడుకుకి. కోడలిని బిడ్డలెక్క కడుపులవెట్టుకుని చూస్కుంటది శాంతమ్మ.

నాయనకెట్లున్నదో మత్లబు తెల్వక పానమంత కింద మీదయితున్నది యాదమ్మకు. నాయన కండ్లల్ల మెదులుతున్నడు. గింత మెతుకు గూడ సయిస్తలేదు. సంటిపోరని పాలకోసం బల్మీకి బుక్కెడు తింటున్నది.

అత్త శాంతమ్మ ఎంబడె పోదామనుకున్నదిగని నిన్న మొన్ననే ఏరువడ్డ సంసారం... గొడ్డూ గోదా, శెనూ శెల్కా పడావు పెట్టి పోయేటట్టు లేదు. మొగనికి యాలకింత ఉడ్కపెట్టి పెట్టే ఆడ దిక్కులేని కతయితదని ఊకున్నది.

ఇంకా ముగశిర ఎల్లకనే పాయె. నాల్గుదినాల కింద ఒక డొల్లు ఒచ్చిపొయ్యింది. ముందే దుక్కులు దున్నుకుని తయారు గున్నరు గనక సరిపోయింది. ఇంకొక డొల్లు కొడితే పనులు సుదు రాయించుకోవచ్చునంటని... ఊరంత మొగులు దిక్కు తలకాయ లెత్తి ఎదురుసూడవట్టిండ్రు.

యాదమ్మ పాల సర్వ కొండవొయ్యి పాలకేంద్రంల పాలు పోసొచ్చేట్యాలకు తూర్పు దిక్కు మొగులిచ్చుకున్నది. మెల్లెగ సూర్యుడు నిద్ర లేస్తున్నడు.

పొయ్యిమీదికెళ్లి చాయి గిన్నె దింపి గిలాసల పోసుకుంటుం డంగ ఎవలో పిల్సినట్టయ్యి గన్మ దిక్కు సూశింది యాదమ్మ.

కావలాయన నిలవడున్నడు.

గన్మల కొచ్చింది.

"ఏంది నారయా గిట్లొచ్చినవూ," అన్నది.

"పటేలమ్మా!" గుల్గిండు నారయ్య.

"ఏమయిందే నారయ్యన్నా..." ఎందుకో యాదమ్మ గొంతొనికింది. కుత్కెల ఏందో అడ్డం పడ్డట్టయ్యింది.

"నిన్న పొద్దుమూకింతల మీ నాయన రాములయ్య పటేలు కాలం జేశిండంటనమ్మా!" ఎట్ల చెప్పాల్నో అర్తంకాక మెల్లెగ దిక్కులు సూస్కుంట చెప్పిండు నారయ్య.

"ఏందీ?" అన్నది యాదమ్మ, నేను సరీగనే ఇన్ననా అను కుంట.

"అవునమ్మా! నిన్న పొద్దుమూకింతల... దీపాలు గూట్లె పెట్టినంక పానం పోయిందంట," ఈ త్యాప గట్టిగనే చెప్పిండు నారయ్య. చెప్పి, "అట్ల పటేలు పానం ఇడువంగనే ఇట్ల కావలా యనకు చెప్పి పంపిండ్రు, ఆ బడప సరిగ్గ ఒస్తే నువ్వు పొద్దటి బస్సుకు అందుతుంటివి. ఆడు తాగి యాడ్నో పండి లేసి సుతారంగ ఒచ్చి గిప్పుడె చెప్పి పంపిండు... నేను ఉర్కొచ్చిన," అన్నడు నారయ్య.

ఉన్నది ఉన్నతాన్నే, గా గన్మల్లనే కూలవడ్డది యాదమ్మ. నోట్లకెల్లి మాట రాకున్నది. గుడ్లు మిటకరించి సూస్తనే ఉన్నది. మెల్లెగ జరంత జరంత సమజయినంక నెత్తి నోరు కొట్టుకున్నది.

"నాయ్నా... నాయ్నా," అనుకుంట పల్వరించింది. కండ్లు గండ్లుదెగినయి.

'అదాటున లేశి బయటికి ఒచ్చి ఆకిలి దాటి తూర్పు దిక్కుకు ఉరికింది యాదమ్మ. ఆకిలి దాటి పదడుగులేసి మల్ల ఎంకకి ఉర్కొచ్చింది. ఇంట్లకొయ్యి, అర్రల పండుకునున్న సంటి పోరన్ని ఎత్తుకొని, అవుతల బాజుకున్న యారాలింట్లకు ఉర్కింది.

నిన్న మొన్నటి దాంక ఉప్పు నిప్పు తీరుగుండి, యేరు కాపురం బెట్టి ఒకలి గన్మలకొకలు తొంగి సూడకుండ మెసులు తున్నరిద్దరు యారాండ్లు.

యారాల్ని కావలించుకొని ఒక్క తీరుగ ఏడుపందుకున్నది యాదమ్మ.

"అమూర్తా! ఆ దేవుడు నాకన్నాలం జేశిండే... నా నాయ్న నాగ్గాకుండ పొయ్యిండే...

చెల్లే!... నా చెల్లే!!

నాయ్నా... ఓ నాయ్నా!

నాయ్నా... నా నాయ్నా!!

నన్నాలం జేస్తివి నాయ్నా... నా నాయ్నా!!

నన్ను అనాధని జేస్తివి నాయ్నా... ఓ నాయ్నా!!

కష్టమొస్తె ఎవల్కి చెప్పుకుందూ... నా నాయ్నా!!

నా కండ్ల నీళ్లెవలు తుడుస్తరూ... ఓ నాయ్నా!!

నాయ్నా... నా నాయ్నా!

నాయ్నా... ఓ నాయ్నా!!

నాయనా అంట ఎవర్ని పిలుద్దూ... నా నాయ్నా!

నాయనా అంటె ఎవరు పలుకుదురూ... ఓ నాయ్నా!!"

కన్నుకు మిన్నుకు ఏడ్వవట్టింది యాదమ్మ చెల్లెల్ని పట్టుకొని.

అమూర్తమ్మకు గూడ దుఖమాగలె. ఏడ్సుకుంటనే యాదమ్మను గుండెల్లకు పొదువుకున్నది. కండ్ల నీల్లు తుడిచింది. ఎన్ను నిమిరింది. చెంబెడు నీళ్లిచ్చింది. ఒక్క బుక్కల తాగి బయటికొచ్చింది యాదమ్మ.

"ఉన్న ఒక్క బస్సూ మబ్బుల్నే ఎల్లిపోయింది, ఇప్పుడెట్ల పొవ్వాలె అక్కా!" అంటనడిగింది అమూర్త.

"నేనుండను శెల్లే, ఏం లేకుంటెమనాయె, నడ్సుకుంట పోత. నా నాయ్నను సూడాలే," ఏడ్పు దిగమింగుకొని చెప్పింది యాదమ్మ.

"ఎహె! గీ సంటి పోరన్ని వట్టుకొని ఎట్ల పోతవు... జరాగు," యాదమ్మ సంకలున్న పోరన్ని గుంజుకొని సంకలేసుకున్నది అమూర్త.

"నేనుండ... నేను బోత," అనుకుంట ఆకిట్లకొచ్చి, గా మూలకి కట్టేసున్న ఆవుని సూశి ఇంగ ఆగలేదు యాదమ్మ.

ఆవుని పట్టుకొని ఏడ్పందుకుంది.

"అమ్మా!... నా యమ్మా!!

నా నాయ్న నన్నిడిసి పోయిండూ... నా యమ్మా!

నువ్వుగాక నాకు దిక్కెవరూ... నా యమ్మా!!

అమ్మా!... నా యమ్మా!!

పెద్దోనికి పాలు పడలేదనీ... నా యమ్మా!

నిన్ను నాకు తోడు పంపిండ్రూ... నా యమ్మా!!

అమ్మా... నా యమ్మా!!

మనకు అమ్మగారిల్లు కరువాయే... నా యమ్మా!

మనకింక దిక్కెవరే... నా యమ్మా!!'

యాదమ్మకు కడుపులకెల్లి దుఖం ఎగదన్నుకొస్తున్నది. ఆవుని పట్టుకొని శానా సేపు ఏడ్సింది.

జరైనంక ఆవునిడిసి తూర్పు మొకాన నడిసింది.

"గంత దూరమెట్ల పోతవు అక్కా," అని అమూర్త అరుస్తనే ఉంటె, ఇనకుండ, ఏందో గాలి సోకినట్లు అమ్మగారింటి దిక్కు అడుగేసింది యాదమ్మ.

ఊరు దాటి పిల్ల బాటవట్టింది యాదమ్మ. ఆగమాగం దబ దబ ఉర్కినట్టే అడుగులేస్తున్నది. ఒంటి మీద సోయి లేకుండ నడుస్తున్న యాదమ్మకు చెంబట్క పొయ్యొస్తున్న గొల్ల లచ్చుమమ్మ ఎదురొచ్చింది.

"ఏంది పటేలమ్మా, గిటెంకల్ల పోతున్నవూ?" అంటనడిగింది లచ్చుమమ్మ.

యాదమ్మ పెండ్లై గీ ఊర్ల కాలువెట్టినసంది మంచి సోపతి జతయింది ఇద్దరి నడ్మ. మంచికీ చెడ్డకీ ఒకల్నొకలు అరుసుకుంటరు. అత్తగారూర్ల, అక్కజెల్లెండ్ల లెక్క కల్సిమెల్సి ఉంటరిద్దరు.

లచ్చుమమ్మను సూడంగనే బిగ్గెరగ అబ్బలించుకొని శోకాలు వెట్టింది యాదమ్మ.

"అక్కా... నా యక్కా!

అక్కో... ఓ యక్కా!!

ఆ దేవునింట్ల మన్ను వొయ్యా... నా యక్కా!

నా నాయ్నను కొంచవొయ్యిండూ... ఓ యక్కా!!

అక్కో... నా అక్కా!

ఇంగ నన్నెవరు సూస్తరూ... నా యక్కా!

నా కడుపులాకలి ఎవరు కాంటరూ... ఓ యక్కా!!

అక్కా... ఓ యక్కా!

అక్కా... నా యక్కో!!"

యాదమ్మకు దుఖం ఆగుతలేదు. లచ్చుమక్క బుజం ఆసర జేస్కోని ఏడుస్తనే ఉన్నది.

లచ్చుమమ్మ గుండె పిస్కినట్లైంది. కండ్లు వాగులైనయ్యి. ఇన్ని దినాలు యాదమ్మ సుఖంల, సంతోషంల, మంచిల చెడుల పాలు పంచుకున్నది, గియ్యాల దుఖం పంచుకుంటున్నది.

యాదమ్మను గుండెలకదుముకొని చీర కొంగుతోటి కండ్లు తుడిసింది, మొకమంత తుడిసింది. నెత్తి నిమిరింది. పెయ్యంత జివిరింది.

లచ్చుమమ్మ చేతి మహత్యానికి జరంత నిమ్మలమైంది యాదమ్మకు. మెల్లెగ లచ్చుమమ్మను ఇడిపిచ్చుకొని అమ్మ గారింటి తోవవట్టింది.

నడుస్తనే ఉన్నది యాదమ్మ. ఊరు దాటింది. ఏరు దాటింది. చెల్క, మడిచెక్క దాటింది. వొంపు, వాగు, వొంక దాటింది. మిట్ట పల్లమూ, రళ్లూ రప్పలూ దాటుతనే ఉన్నది.

సోయి లేకుండ నడుస్తున్నది, శిగమొచ్చినట్లు నడుస్తున్నది. రాళ్లూ, ముండ్లూ ఏం కానొస్తలేవు కండ్లకు. కండ్ల నిండ నాయననే నింపుకొని నడుస్తున్నది. పచ్చని చెట్టు యాడ కండ్లవడ్డా... నాయననే మెదులుతున్నడు.

దుక్కులల్ల సక్కటి గీతలెక్కున్న నాగేటి సాల్లల్ల నాయననే కండ్లవడుతున్నడు. యాపచెట్ల మీద కిచకిచమంటున్న ఊర విచ్చుకలని సూడంగనే నాయన యాదికొస్తున్నడు.

యాదమ్మ నడుస్తనే ఉన్నది. సూర్యుడు ఎగబాకుతనే ఉన్నడు. దినాం తెల్సిన తోవల్నే నడుస్తున్నడు సూర్యుడు. ఎన్నడు ఎర్గని తోవల్ల, తోడు లేకుండనే నడుస్తున్నది యాదమ్మ.

ఒగవొంపు దాటి మిట్టకెక్కినంక అనుమానమొచ్చింది యాదమ్మకు. తను సరైన తొవ్వల్నే పోతున్ననానని. ఎవల్నైన అడుగుదామంటే సుట్టుపక్కల దరిదాపుల్ల యెవరూ కండ్లవడలె. అట్లనే మొండిగ ముందల్కి నడిసింది. దిక్కులు సూస్కుంట నడుస్తనే ఉన్నది.

ఇంక జరంత నడిసినంక, అల్లంత దూరంకెల్లి నెత్తిల గంపెత్తుకొని, దుక్కి దున్నిన రేగల్లల్ల అడ్డంపడి పోతున్న ఒగ పిల్ల కండ్లవడ్డది యాదమ్మకు.

"ఓ చెల్లే," అంటని కూతవెట్టింది. యాదమ్మ సప్పుడుకు ఎంకకి మల్లి సూశి నిలవడ్డది ఆ పిల్ల.

ఇంక జరంత దగ్గెర్కి పొయ్యినంక, "ఘట్‌పల్లికి పొయ్యే తొవ్వ గిదేనా శెల్లే," అంటని అడిగింది యాదమ్మ.

"తెల్వదక్కా," గా పిల్ల.

"మల్లేడికి పోతది శెల్లె గిట్ల వడిపోతే."

"గిట్ల సక్కగ గీ తోవల బొయ్యినంక, గాడ పెద్ద మర్రి కాడికెల్లి కుడి చెయ్యి బాజుకు మల్లి ఇంగో మైలు దూరం నడుస్తే కేశంపేట ఒస్తది," అన్నది ఆ పిల్ల. అని, "ఒక్కదానివే పోతున్న వక్కా?" అనడిగింది.

ముక్కు మొకం ఎర్కలేని గా పిల్ల పాయిరంగ గట్లడుగంగనే, అప్పటిదాంక లొపట దాస్కునున్న దు:ఖం కండ్ల పొంటి మల్ల కారింది యాదమ్మకు.

ఆ పిల్ల సూపెట్టిన తొవ్వల ముందల్కి నడుసుకుంట, "మా నాయన సచ్చిపోయిండటని తెల్సింది శెల్లె, గందుకే పోతున్న," అనుకుంట కొంగుతోని కండ్లు తుడుసుకుంట... ఎవలో గెదిమినట్లే నడువబట్టింది యాదమ్మ.

"ఏ ఊరక్కా మనది?" మల్లడిగింది యాదమ్మ దిక్కు సూస్కుంటగా పిల్ల.

"ఎక్కపల్లే," ఎంకకు మల్లి సూడకుంటనే గట్టిగ చెప్పింది యాదమ్మ.

ఉర్కినట్టు నడుస్తున్న యాదమ్మ దిక్కే సూస్కుంట శాన సేపు ఉన్నతానున్నట్టే నిలవడి సూశింది ఆ పిల్ల గుండెల మీద చెయ్యేసుకొని.

నడుస్తనే ఉన్నది యాదమ్మ. ఘట్‌పల్లి ఎంత దూరముందో అర్తమైతలేదు. కేశంపేట దాటిపోవాలెననే సంగతైతే తెల్సు, అయినా ఇంకా శానా దూరం పొవ్వాలే, అననుకుంట నడువ బట్టింది యాదమ్మ.

అంబట్యాల్ల అయిపోయింది. బాట పొంటి మ్యాకల కాసే టాయన సూపెట్టిన తొవ్వల కేశంపేట ఊరివుతలకెల్లి ఊరు దాటింది. చెరువులూ కుంటలూ దాటింది. పొద్దటిసంది కడుపు లింత గూడ ఆసర లేకపాయె. బుక్కెడు నీళ్లు గూడ కుత్కె దిగలె. నడిసి నడిసి కాళ్లు పీకుతున్నయి. పెయ్యి సోలినట్టైతున్నది యాదమ్మకు. అట్లనే పానమంత కాళ్లల్లకి తెచ్చుకొని నడుస్తున్నది యాదమ్మ.

పెదిమెలు ఎండిపోయినయ్యి. నోరు తడారిపోయింది. ఒకటే దూప దూప అయితుంది యాదమ్మకు.

నడ్సుకుంటనే దిక్కులు సూడ వట్టింది. యాడ్నన్న ఇంత బాయో, వాగో కండ్లవడితే గొంతు తడుపుకుందామని సూస్కుంట నడుస్తనే ఉన్నది యాదమ్మ.

కానొచ్చినంత దూరం వరకు ఏం కన్నవడలె. అన్ని శెల్కపాలాలె. ఏడ ఇంత నీళ్ల జాడ కాన్రాలె.


కాళ్లల్లకు బలం తెచ్చుకొని నడుస్తున్నది యాదమ్మ. సూర్యుడు నడినెత్తిల కొచ్చిండు. ఎండ సుర్రుమంటున్నది. మొగులు మీద ఆడో మబ్బు తుంక ఈడో మబ్బుతుంక నిండిన చెరువుల బుడుబుంగల తీర్గ కానొస్తున్నయి.

పెయ్యిల సత్తువంత ఒక్క దగ్గెర్కి కూడ దీస్కోని నడుస్తనే ఉన్నది యాదమ్మ. కనుచూపు ఆనినంత నెరువు పిట్టె గూడ కానొస్తలేదు. సీమ సిటుక్కు మంటలేదు.

పిల్ల బాటల పొంటి, బండ్ల బాటల పొంటి, శెల్కల పొంటి, దుక్కుల పొంటి ఆగకుండ నడుస్తనే ఉన్నది.

గొంతు తడుపుకోనీకె యాడ్నన్న బుక్కెడు నీళ్లు దొరికితే బాగుండునని పిస్తుంది యాదమ్మకు.

దిక్కులు సూస్కుంట దుక్కులల్ల నడుస్తనే ఉన్నది. కాళ్లు దుమ్ము దుమ్ము యినయి. చెమటకు రైకంత తడిసిపోయింది. నాయన మీది ప్రేమ యాదమ్మను నడిపిస్తనే ఉన్నది.



ఆడ అంత దూరంల ఎడ్మచెయ్యి బాజుకు దుక్కిల ఆగిన నాగలికాడ ఒగ మనిసి కన్పవడ్డడు. పానం లేసొచ్చినట్లయ్యింది. దబ్బ దబ్బ నడిసింది. ఆ మనిసికి జరంత దూరంల కళ్లం కాడ కానుగు చెట్టుకింద ఆడిమనిసి కానొచ్చింది. జల్ది జల్ది ఉర్కినట్టే ఆళ్ల దగ్గెర్కి ఉర్కింది యాదమ్మ.

"అన్నా బుక్కెడు నీళ్లుంటే పొయ్యిండ్రి పుణ్యముంటది గని," అడిగింది.

"ఆడ చెట్టుకిందికి పోమ్మ, ఆమె కాడ ఉన్నయ్యి," ఆ మనిసి అన్నడు.

కానుగు చెట్టుకిందికి పొయ్యి ఆడున్న ఆడిమనిసిని నీళ్లడిగింది. గొంతుకు గూసొని దోసిలిపట్టింది. ఆమె కడవలకెల్లి నీళ్లు ఒంపుతుంటె దమ్ముదియ్యకుండ కడుపు నిండ తాగింది. పానం జరంత నిమ్మలమైనట్టు గొట్టింది యాదమ్మకు.

ఆమె ఇవరమడిగింది. చెప్పింది యాదమ్మ పానం ఉగ్గ బట్టుకొని. మల్ల నాయన మతిలవడంగనే మల్ల కడుపుల దు:ఖం కండ్లకెల్లి పొంగింది. జరంత సేపు శోకాలువెట్టి ఏడ్సింది. గుండెల బరువు జరంత దింపుకున్నది, పంచుకున్నది.

యాదమ్మ శోకాలకు ఆయన గూడ దగ్గెర్కి ఒచ్చిండు. మొత్తం ఇన్నడు.

"అయ్యో! రాములయ్య పటేలు బిడ్డెవా?" అని అరుసు కున్నడు. రాములయ్యను యాజ్జేసుకొని కండ్లల్ల నీళ్లు దీస్కున్నడు. ఈ సుట్టుపక్కల ఏ ఎద్దుకూ, ఆవుకూ, గొర్రెకూ, మేకకూ ఏమొచ్చినా రాములయ్య దగ్గెర్కి పోవుడు చెప్పిండు. రాములయ్య పోసే పసరు మందుకు, సావు దర్వాజకాడికి పొయ్యింది గూడ, లేసికాళ్ల మీద నిలవడుతుండెనన్న ఇవరం జెప్పిండు. యాదమ్మ బాధ పంచుకున్నడు.

కాలు మడతవడి దుక్కుల్నే కూలవడ్డ ఎద్దు సంగతిజెప్పి ఇంగింత బాధవడ్డడు.

ఎద్దుకు ఏమయ్యిందనుకుంట దుక్కిలకు నడిసి ఎద్దు కాలు పట్టుకొని సూసింది యాదమ్మ. ఇంత లావు వాసింది కాలు. దీనంగ సూసింది ఎద్దు, యాదమ్మ మొకంల మొకం బెట్టి. పానం వొసవొసపోయింది యాదమ్మకు.

సుట్టుపక్కల ఉన్న పొదలల్లకు పొయ్యింది యాదమ్మ. శాన సేపు లెంకి, దోసెడు ఆకు చేతుల నడ్మ నలుపుకుంట ఇవుతలికి ఒచ్చింది. చాన సేపు రెండు సేతుల నడ్మ ఆ ఆకుని నలిపి పసరు తీసి ఎద్దు కాలికి పట్టిచ్చింది. పసరు గారుతున్న నలిగిన ఆకుని ఎద్దుకాలుకు మెత్తి బట్టతోటి కట్టు కట్టింది.

"రేపు పొద్దుగాల కల్ల లేచి తిరుగుతది నీ ఎద్దు," అంటని చెప్పింది యాదమ్మ.

చేతులు జోడించి యాదమ్మ చేతులు, చేతులల్లకు దీస్కోని కండ్లకద్దుకున్నడు.

యాదమ్మ తయారయ్యింది. ఆ మనిసి నసుగుకుంట మెల్లెగ, 'పటేలమ్మా! ఎన్నడో తెల్లంజావున ఎల్లినవు. పచ్చి బాలెంతవు. నిన్ను సూస్తే ఏం తిన్నట్టు లేవు, తాగినట్టు లేవు. రాములయ్య పటేలు ఊరు ఇంగా పదిమైల్లుంది. అంత దూరం నడ్వాలె. ఏమనుకోకుండ మా తాన ఇంత అంబలి తాగి పోమ్మా, కడుపులకింత ఆసరైతది,' అన్నడు.

గట్లనే అని, సత్తు తళ్లెల పోసిచ్చిన అంబలి మొత్తం తాగింది. జరంత కుదార్తమయ్యింది యాదమ్మకు.

"మా తాన తాగుతవో తాగవోననుకున్న పటేలమ్మా! నా ఎద్దును ఆదుకున్నవు, మీ నాయన పేరు నిలవెట్టినవు," అన్నడు ఆ మనిసి.

"ఎదుటోని కడుపు సూసే కులమే అసలు కులం," అని ఆళ్లిద్దర్నీ ఇడిసి ఊరు తోవవట్టింది యాదమ్మ.

కడుపులింత అంబలి ఆసరైనంక ఇంగింత జోరుగ నడువ బట్టింది యాదమ్మ.

సిన్నప్పటి సంది నాయనెనకనే తిరిగి నేర్సుకున్న విద్య నేడు అక్కెరకొచ్చిందని, మల్ల మల్ల నాయనను తలుసుకుంటనే ఉన్నది.

ఏడ జరంత సేపు గూడ కూసోకుండ నడుస్తనే ఉన్నది. ఊర్లకు ఊర్లు దాటుతనే ఉన్నది.

ర్యాగళ్లు, చెల్కలు, మడికట్లు, తుప్పలు, పొదలు, చెట్లూ పుట్టలూ దాటుతనే ఉన్నది.

ఏ సితవల చెట్టును చూసినా, ఏ రేగి చెట్టును చూసినా, ఏ గచ్చకాయ పొదను చూసినా, ఏ కోల్యాగ మెడల పేనిన తాడును సూసినా, నెత్తికి రుమాలు సుట్టుకున్న ఏ మనిసిని సూసినా నాయననే మెదులుతున్నడు యాదమ్మకు.

ఊరు పొలిమేర్లు ఒచ్చినయ్యి. ఊర్లకెల్లి అప్పుడప్పుడు డప్పు సప్పుడు ఇనవడుతున్నది. యాదమ్మ గుండెల్ల గుబులు మొదల య్యింది. దడదడమని కొట్టుకుంటుంది. చేతులు ఒణుకు తున్నయి. కాల్లు తడబడుతున్నయి. ఎరిగిన తావులు, నాయన తోని కలిసి నడిసిన బాటలు, పాత ఊసులు చెప్తున్నయి.

ఊరు దగ్గెరైతున్నకొద్దీ కడుపుల లోపట దాసుకున్న దు:ఖం ఎగదన్నుతున్నది. మెల్లెగ ఏడ్పు గొంతు దాటి బైటికి తన్ను కొస్తున్నది.

'నాయ్నా... నా నాయ్నా!

నాయ్నా... ఓ నాయ్నా!!'

ఉర్కినట్లే నడుస్తున్నది యాదమ్మ.

ఊర్లకు అడుగుపెట్టేట్యాలకు ఇండ్లల్లకు మల్లుతుండ్రు జనాలు.

ఉరుక్కుంట ఒస్తున్న యాదమ్మను జూసి నిలవడి, బాధను తెలుపుతున్నరు.

"అయ్యో! బిడ్డా నాయనను ఆఖిరి సూపులు గూడ సూడక పోతివి గద బిడ్డా!" అంటున్నరు బాటకు అటు ఇటు నిలవడ్డ ముసలోళ్లు.

పానం అవిసిపోయింది యాదమ్మకు. అట్లనే ఉరికింది. సందు గొందులు దాటి ఉరికింది, ఇంటి దాంక ఉరికింది.

Shanta Tripuraneni
President
hr@texplorers.com

Texplorers Inc
simplicity - strength - success
11744 Bosworth Dr, Glen Allen, VA 23059
www.texplorers.com

ఆకిట్లకు అడుగుపెట్టి కుప్ప కూలిపొయ్యింది యాదమ్మ. నడి ఆకిట్ల కూలవడ్డ యాదమ్మ కండ్లు గండ్లు దెగినయ్యి. రెండు చేతులు గాలిల ఆడించుకుంట ఒక్క తీర్గ ఏడ్వవట్టింది యాదమ్మ.

'నాయ్నా... నా నాయ్నా
నాయ్నా... ఓ నాయ్నా
నన్నిడిసి పెట్టి పోయినవూ... నా నాయ్నా
ఇంగ నేనేం జేతూ... ఓ నాయ్నా
ఇంగ నేనెట్ల బతుకుదూ... నా నాయ్నా
ఇంగ నాకు దిక్కెవరూ... ఓ నాయ్నా
నాయ్నా... నా నాయ్నా
నాయ్నా... ఓ నాయ్నా
తెల్ల పంచె కట్టుకొనీ... నా నాయ్నా
తెల్ల కమీజు తొడుక్కొనీ... ఓ నాయ్నా
నెత్తికి రుమాలు చుట్టుకొనీ... నా నాయ్నా
నువ్వు పటేండ్లకే పటేలువూ... ఓ నాయ్నా
నాయ్నా... నా నాయ్నా
నాయ్నా... ఓ నాయ్నా
నువ్వు నాగలివట్టి దుక్కి దున్నితే... నా నాయ్నా
నువ్వు అరక వట్టి కలుపు దీస్తే... ఓ నాయ్నా
నువ్వు ఎడ్లు గట్టి మోట గొడితే... నా నాయ్నా
ఊరు ఊరంత నీ యెనకనే... ఓ నాయనా
నాయ్నా... నా నాయ్నా
నాయ్నా... ఓ నాయ్నా
నువ్వు లేక ఊరు సిన్నవో యిందీ... ఓ నాయ్నా
నువ్వు లేక వాగు వొడి తప్పిందీ... నా నాయ్నా...
నువ్వు లేక శేను వాడిపోయిందీ... ఓ నాయ్నా...
నువ్వు లేక బాట కాడువడిందీ... నా నాయ్నా...
నాయ్నా... నా నాయ్నా
నాయ్నా... ఓ నాయ్నా
నా యిల్లు పరాయి దాయెనే... నా యమ్మా
ఈ ఇంట్ల సొతంత్రం పాయెనే... మా యమ్మా
కష్టమొస్తే ఎవలు కాంటరూ... మా యమ్మా
నలభై మైల్లు నడిసి వస్తినీ... నా నాయ్నా
కండ్ల నిండ నిన్ను కానలేదూ... ఓ నాయ్నా
నిన్ను ఇంత జల్ది కొండవొయ్యిండ్రూ... నా నాయ్నా
యాదమ్మ ఒస్తదని యాదికి రాలేదూ... ఓ నాయ్నా
నాయ్నా... నా నాయ్నా
నాయ్నా... ఓ నాయ్నా'
యాదమ్మ ఏడుస్తనే ఉన్నది.

అన్నదమ్ములు, అక్కజెల్లెండ్లూ ఆమె సుట్టూ గుమి గూడిండ్రు.

"బస్సొచ్చే దాంక సూశినం, నువ్వు రాకపొయ్యేసరికి, ఇగ అందరు ఆత్రం జేసి జల్ది జల్ది తీసేపిచ్చిండ్రు," అన్నది యాదమ్మ అక్క.

అని శెల్లెని పట్టుకొని జరసేపు ఏడ్సింది.

"మీరందరూ నాయనను సూశిండ్రు, నేను ఆఖరి సూపుకు నోసుకోకపోతిని, అయినాగని సచ్చిపోయిన నాయ్నను నేను సూడకనే పోతిని, ఇగ నా యాదిల ఎప్పటికీ నాయన బతికే ఉంటడు, నాయన ఇటెంకళ్ల తిరిగినట్టె గొడ్తడు," అని ఏడ్సుకుంటనే సంబరవడ్డది యాదమ్మ.

నాయన ఆఖరి చూపులకు నొచుకోనందుకు, యాదమ్మ గుండెల్ల నాయ్నను ఎప్పట్కీ నిలుపుకున్నందుకు అందరు అబ్బుర పడ్డరు.

ఎనభైయవ దశకం తొలినాళ్లలో జరిగిన వాస్తవ గాధ.



రంగారెడ్డి జిల్లాలో పుట్టి పెరిగిన కొట్టం రామకృష్ణారెడ్డి దాదాపు 15 కథలు రాశారు. మానవ సంబంధాలు, వాటి చుట్టూ అల్లుకున్న భావోద్వేగాలు ఇష్టమైన ఇతివృత్తాలు. నివాసం హైదరాబాద్. త్వరలో కథాసంపుటి ప్రచురించబోతున్నారు.

పుత్రోత్సాహము తండ్రికి

ఎస్. నారాయణస్వామి



నేను తండ్రిని కాబోతున్నాను అని తెలిసిన రోజున .. అటువంటి ఆనందం, ఉత్సాహం నా ముప్పై రెండేళ్ల జీవితంలో ఎప్పుడూ అనుభవించలేదు. ఫస్టు రేంకులు సాధించినప్పుడూ, కేంపస్ ప్లేస్‌మెంట్‌లోనే మంచి కంపెనీలో మంచి ఆఫరొచ్చినప్పుడూ, తొలి అవకాశంలోనే అమెరికా ఆన్‌సైట్‌కి ఎంపికైనప్పుడూ, చివరికి శ్రుతిని పెళ్లి చేసుకున్నప్పుడు కూడా- ఆయా క్షణాల్లో అవి గొప్ప ఆనందాలే కానీ, శ్రుతి ప్రెగ్నంట్ అన్న వార్త కలిగించిన ఆనందం మట్టుకు... ఇలాగుందని మాటల్లో చెప్పలేను. మొన్నేదో సినిమాలో అదేదో పాటుందే... గాల్లో తేలినట్టుందే... అని... ఆ లెవెల్లో ఫీలయ్యాను. ఆ రోజున నేలమీద నడవటం కష్టమైపోయింది.

డాక్టరాఫీసునించి శ్రుతిని ఇంట్లో దింపి, నేను ఆఫీసుకి చేరగానే నా తోటి ఉద్యోగి, ఆప్తమిత్రుడు డేవిడ్ ఇట్టే గుర్తు పట్టేశాడు.

"ఏంటి సంతోష్! మొహం అలా వెలిగిపోతోంది?" అనడిగాడు, నేను నా సిస్టం ఆన్ చేస్తుంటే.

డాక్టరాఫీసునించే ఇండియా కాల్‌చేసి మా వాళ్లకీ, మా అత్తారింటికీ శుభవార్త చెప్పినా, ఈ ఆనందాన్ని నేరుగా ఎవరితోనన్నా పంచుకుంటే తప్ప మనసు శాంతించేటట్టు లేదు. టూకీగా డేవిడ్‌కి విషయం చెప్పాను.

ఒక్క ఉదుటున తన కుర్చీలోనించి లేచి గట్టిగా కౌగలించుకుని వీపు మీద చరిచాడు.

"బాగుందోయ్! భలే గొప్ప వార్త. అభినందనలు. ఒట్టి అభినందనలు కాదు, మనసారా!" చుట్టుపక్కల వాళ్లు అప్పటికే మా వంక కొంచెం వింతగా చూస్తుండడంతో, "పద, అలా కేఫ్‌టేరియా కెళ్లి కాఫీ తెచ్చుకుందాం!" అన్నాడు.

"ఇదిగో, ఇప్పుడేగా వచ్చాను. కొంచెం మెయిల్స్ చూసుకుని..." అని నేను సిస్టం ముందు కూర్చూబోతుంటే,

"అబ్బ, మెయిల్సర్ ఎప్పుడూ ఉండేవే. ఇంకో అరగంట పోయాక కూడా ఉంటాయ్, కానీ ఇట్లాంటి రోజు మళ్లీ మళ్లీ రాదు. పద!" అని నా భుజం పట్టుకుని కేఫ్‌టేరియాకి దారితీశాడు.

ఇద్దరం చెరో మగ్గు కాఫీ కలుపుకుని ఒక మూల టేబుల్ చూసుకుని కూర్చున్నాం.

"ఊ, ఇప్పుడు చెప్పు. ఏంటి, ఎలా జరిగింది?" అన్నాడు డేవిడ్.

అప్పుడే కాఫీ గుటక వేసిన నాకు పొలమారింది. ఎలాగో ఒక నిమిషంలో సర్దుకుని, డేవిడ్ కేసి కోపంగా చూశాను.

అప్పటికి తనేం అన్నాడో అతనికే వెలిగినట్టుంది. "అహా, అదికాదు నా ఉద్దేశం. డాక్టర్ దగ్గరికి వెళ్లొచ్చారా? అంతా బానే ఉందా? శ్రుతి ఎలా ఉంది?" అన్నాడు తడబాటు సర్దుకుని.

"ఆ, అంతా బానే ఉంది. శ్రుతి కూడా చాలా సంతోషంగా ఉంది. ఏదో తనకి వొంట్లో ఏదోగా ఉందని కొన్ని రోజులుగా అంటూ ఉంటే ఇవ్వాళ్ల ఎపాయింటుమెంట్ దొరికి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లా. న్యూస్ తెలిసేటప్పటికి- ముందు ఊహించినది కాదు కదా- అందుకని కొంచెం తబ్బిబ్బుగా ఉంది యిద్దరికీ కూడా."

"ఏంటీ? ఊహించలేదా? అంటే... అంటే ఇది ఏక్సిడెంటా?" అన్నాడు డేవిడ్ విభ్రాంతిగా.

అతనలా సూటిగా అడిగేప్పటికీ, ఎంత ఆనందంలో తేలుతున్నా, నాక్కొంచెం సిగ్గేసింది. అవునన్నట్టు తలూపాను.

డేవిడ్ బిగ్గరగా నవ్వుతూ మళ్లీ నా వీపు మీద గట్టిగా చరిచాడు.

"భలేవాడివోయ్ సంతోష్! ఐనా ఏం పర్లేదులే. ఈ ప్రపంచంలో, మనలాంటివాళ్లం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ప్రకృతి ఎక్కడో ఒకచోట సందు చూసుకోక మానదు. నీకు తెల్సా? తొలి కాన్పుల్లో సగానికి పైగా ఏక్సిడెంట్లేట. సిగ్గు పడాల్సిందేం లేదులే. మా జెన్నీ కూడా మాకు ముందు ఊహించని భగవత్ ప్రసాదమే!" అన్నాడు.

మళ్లీ తనే కొనసాగిస్తూ, "కానీ ఒకటి మాత్రం నిజం. మనమెరిగిన జీవితం పూర్తిగా మటుమాయం ఇక మీదట. అర్ధ రాత్రులు లేచి పాలు పట్టడాలూ, డయపర్లు మార్చడాలూ... భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతుందో లేదోగానీ మీ యిద్దరి జీవితాలూ మాత్రం ఆ బుల్లి పాపాయి చుట్టూ తిరుగుతాయి. కానీ ఆ చిన్న ప్రాణిని చేతుల్లో ఎత్తుకున్నప్పుడు... ఆ ఆనందమూ తృప్తి... ఓహ్, ఇంకెక్కడా దొరకవు."

"నిజమే, నాకూ అలాగే అనిపిస్తోంది, కానీ అప్పుడే అక్కడిదాకా వెళ్లిపోనక్కర్లేదులే. ఇంకా కనీసం ఆరు నెలల టైముంది."

"అక్కడే పొరబడుతున్నావ్ మిత్రమా. ఆర్నెల్లు ఎంత తొందరగా గడిచిపోతాయో. నువ్వు కొంచెం మానసికంగా ప్రిపేర వడం మంచిది."

"అలాగేలే. పద, ఇంక నన్ను పని చూసుకోనీ."

అలా ఆ పూటకి పనిలోకైతే జొరబడ్డాను కానీ నా మనసు అలా అలా తేలుతూనే ఉంది, పుట్టబోయే పాపాయిని ఊహించుకుంటూ.

ఆరోజు రాత్రి డిన్నర్ చేస్తూ డేవిడ్ ఇలా అన్నాడని శ్రుతితో చెబితే తనూ నవ్వింది. నవ్వి,

"అయినా నీకంత కష్టమేం ఉండదులే. ఎలాగూ మా అమ్మా వాళ్లు వస్తారుగా," అంది.

నాకూ నిజమే కదా అనిపించింది. ఎంతైనా మనవాళ్లలో కుటుంబ ఆపేక్షలు ఎక్కువ కదా. మనవడో మనవరాలో పుడుతున్నారంటే, అమ్మమ్మలు నాయనమ్మలు తాతయ్యలు వస్తారు,

ఉండగలిగినన్నాళ్లు ఉండి సాయం చేసి వెళ్తుంటారు. ఇట్లాంటి ఆపేక్షలు ఈ అమెరికా వాళ్లకేం తెలుస్తాయి? పాపం, పురిటికి ముందూ వెనకా ఆ దంపతులు వాళ్ల బాధలు వాళ్లు పడాల్సిందే గదా.

ఆ తరువాతి రోజుల్లో శ్రుతిని గారాబం చేద్దామని ప్రయత్నించాను కానీ శ్రుతి అస్సలు పడనివ్వలేదు. ఈ మాడ్రన్ అమ్మాయిల్లో ఇదే గొడవ. వాళ్లు అనుకున్నదే నడవాలి, ఒక్క మాట వినరు. ఉద్యోగం మాననంటే మాననంది. నా తెలుగు సినిమాల పరిజ్ఞానం అంతా ప్రయోగిస్తూ, పోనీ మిగతా సమయంలోనైనా రెస్టు తీసుకుంటూ, బలానికి పళ్ల రసాలూ అవీ తాగుతూ ఉండమన్నా. అదీ పడనివ్వలేదు. పైగా, చూడు, ఫలానా వెబ్ సైట్లో ఇలా చెప్పారు. దీనికి సైంటిఫిక్ రీజనింగ్ ఇది. అంటూ నా నోరు మూయించేస్తూ వచ్చింది. తాను రోజూ చేసే జిమ్ము, యోగా వ్యాయామాలతో సహా శ్రుతి ఏదీ మానలేదు. నాకు ఒక పక్కన కోపమూ (నా మాట విననందుకు), ఇంకో పక్కన ఆందోళనా (పాపాయికి ఏమన్నా అవుతుందేమోనని) వస్తూ ఉన్నా, ఎప్పటికప్పుడు దిగమింగేస్తూ వచ్చాను. ఎటువంటి నెగెటివ్ విషయాలు పాపాయి దరిదాపుల్లోకి కూడా రావడం నాకిష్టంలేదు- అందుకని శ్రుతిని కాస్త పరుషంగానైనా ఏమీ అనలేకపోయాను. శ్రుతి చాలా విషయాల్లో నా మాట వినకపోయినా నేను మాత్రం ఆమెని ప్రేమగా, ఎక్కడా నొప్పించకుండా చూసుకుంటూ వచ్చాను.

చూస్తూ చూస్తూ ఉండగానే నెలలు నిండాయి. ఎప్పటి కప్పుడు డాక్టరు దగ్గర పాపాయి అభివృద్ధిని గమనించుకుంటూ వచ్చాం. ఇంతలోనే, మా అత్తగారికీ మామగారికీ వీసాలు రావడం, వాళ్లకి టిక్కెట్లు కొనెయ్యడం కూడా జరిగిపోయింది.

మధ్య మధ్య డేవిడ్ ముగ్గురు పిల్లల్ని కని పెంచిన తన అనుభవమంతా నాకు నూరిపోస్తూనే ఉన్నాడు. మా అత్తారు వస్తార్లేరా బాబూ అని చెప్పినా అతనికి అర్థం కాలేదు. పాపాయిని చూసుకోవడంలో తల్లితో పాటుగా తండ్రికి కూడా ఎంత బాధ్యత ఉంటుందో నాకు పదే పదే నూరి పోశాడు.

"అంతా తల్లి మీద వదిలెయ్యడానికి కుదరదు సంతోష్. అందులో డెలివరీ అయిన కొద్దిరోజులు తల్లి మానసిక స్థితి, ఆరోగ్య స్థితి చాలా సుకుమారమైన స్థితిలో ఉంటాయి. పోస్ట్ పార్టం డిప్రెషన్ అంటారు. పిల్లకి పాలివ్వడం తప్ప ఇంకేమీ పెద్దగా చెయ్యలేరు. అదొకటి. అంతే కాకుండా, నీక్కూడా పాపాయితో ఒక మంచి బాండింగ్ ఏర్పడ్డానికి కూడా నువ్వు కృషి చెయ్యాలి. అది బాగా పసితనం నించీ చేస్తే తప్ప అలవాటు కాదు."

"నాకు చెయ్యడానికి ఎటువంటి అభ్యంతరమూ లేదు సరికదా చాలా ఉత్సాహంగా కూడ ఉంది, డేవిడ్. పాపాయి రాకకోసం నేనెంత ఆత్రుతగా ఎదురుచూస్తున్నానో."

"ఆ పని మొదలవకముందు ఉత్సాహంగానే ఉంటుంది నాయనా. ఓ వారంరోజులు నిద్ర లేకపోతే తెలిసొస్తుంది."

"వారం కాదు, నెలరోజులు నిద్ర లేకపోయినా ఏం పరవా లేదు. నువ్వే చూస్తావుగా," అని నేను కొంచెం గట్టిగానే చెప్పడంతో అప్పటికి కాస్త తగ్గాడు.

శ్రుతికి తొమ్మిదో నెల వచ్చేసరికి మా అత్తగారూ మామ గారూ వచ్చారు. డెట్రాయిట్ ఏర్‌పోర్టు నించి వాళ్లని ఇంటికి తీసుకొచ్చాను. సాయంత్రం మేం ఇల్లు చేరేసరికి శ్రుతి మా అపార్ట్‌మెంట్ కాంప్లెక్సులో ఇంకొక స్నేహితురాలితో కలిసి వాకింగ్ చేస్తోంది. నెలలు నిండిన గర్భం బాగా తెలుస్తూ ఉన్నా, అప్పటి దాకా చక్కగా వ్యాయామం చేస్తుండడం వల్ల నీరసమూ ఓపలేని తనమూ ఏం లేకుండా, ఒక నిండుతనంతో కూడిన అందంతో హుందాగా ఉంది. మా కారు రావడం చూసి స్నేహితురాలికి వీడ్కోలు చెప్పి దగ్గరికొచ్చింది.

మా అత్తగారు కారు దిగుతూనే, తప్పిపోయిన పిల్లని వెదుక్కుని రెక్కల కింద దాచేసుకున్న తల్లికోడిలా, కూతుర్ని కావలించేసుకున్నారు. శ్రుతి చెక్కిళ్లు నిమురుతూ, "ఏంటే చిన్న తల్లి, ఇంత సన్నగా ఉన్నావు. ఆ బుగ్గలు అలా పీక్కుపోయాయి. అసలు తింటున్నావా లేదా? అయినా నెలలు నిండినదానివి, ఇలాగ పడి తిరుగుళ్లేవిటి? ఇంటిపట్టున మెదలకుండా ఉండద్దూ? అవున్లే, ఇక్కడ అన్నీ మీ పనులు మీరే చేసుకోవాలిగా, చేసి పెట్టేందుకెవరున్నారు? పోన్లే, ఇక నేనొచ్చేశానుగా. పద. అవును, ఇంతకీ మనిల్లేది?"

సమాధానం చెప్పడానికి కూడా శ్రుతికి ఛాన్సివ్వకుండా ఆవిడ శ్రుతి ఆరోగ్యాన్ని గురించి ఘోష పడుతుంటే నా మనసు శాంతిగా నిట్టూర్చింది. హమ్మయ్య, శ్రుతి బాగుని పట్టించుకో డానికి ఇప్పుడు నాతో పాటు ఇంకొకరున్నారు. అదీకాక నన్ను, నా మాటల్ని కొట్టేసినట్టుగా శ్రుతి ఆవిడ మాటల్ని తోసిపుచ్చలేదని నాకెక్కడో నమ్మకం కుదిరింది. ఎంతైనా తల్లి కదా. శ్రుతికి ఆవిడ మాట వినక తప్పదు. ఇకనైనా ఊరకే తిరగడం కట్టిపెట్టి కొంచెం స్థిమితం నేర్చుకోక తప్పదు. మా అత్తగారి రాకతో నాకు కొండంత బలమొచ్చినట్టు అనిపించింది.

ఆరోజు రాత్రి భోజనాల సమయానికల్లా శ్రుతి తల్లి చేతిలో బొమ్మ అయిపోయింది. అప్పటికే ఆవిడ వంటిల్లంతా స్వాధీనం చేసేసుకుని, ఇండియా నించి తెచ్చిన పొడులూ, పచ్చళ్లూ సర్దేసి, అచ్చమైన తెలుగు వంటకాలతో భోజనం పెట్టారు. ఎప్పుడూ అన్నమెందుకు అని పాస్తా, శేండ్విచ్చులకి మొగ్గు చూపే శ్రుతి ఆ రోజు వాళ్లమ్మగారి చేతినించి పెరుగన్నం గోరు ముద్దలు తింది. రాత్రి లేట్ నైట్ షో కొంచెమైనా చూసికానీ పడుకోనిది తొమ్మిది న్నరకల్లా మంచమెక్కింది.

మా పుట్టబోయే పాపాయి ఈ లోకంలోకి రావడానికి ముందు శ్రుతిని బాగా చూసుకోవడానికి నాకిప్పుడు ఒక మంచి ఆసరా దొరికినట్లయింది.

మా అత్తగారి సామర్థ్యం మీద నా నమ్మకం వమ్ము కాలేదు. ఇంట్లో అన్ని విషయాల్లోనూ పద్ధతులూ నియమాలూ విధించారావిడ. అప్పుడప్పుడూ కొంచెం ప్రతిఘటించినా, కొద్దిరోజుల్లోనే ఆవిడ చేసే గారాబానికి శ్రుతి పూర్తిగా లొంగిపోయింది. మా యింట్లో మాకిద్దరికీ ఇన్నాళ్లుగా అలవాటైపోయిన ముఖ్యమైన అలవాట్లు కొన్ని మాయమైపోవడం నన్ను కొంచెం ఇబ్బంది పెట్టిన మాట నిజం, కానీ పాపాయి బాగు కోసం ఆ మాత్రం భరించలేనా అని నాకు నేనే సర్ది చెప్పుకున్నా. చూస్తూనే ఆరువారాలు గడిచిపోయాయి. ఒకరోజు మధ్యాన్నం సమయంలో శ్రుతికి నెప్పులు వస్తున్నాయని అత్తగారు ఫోన్ చేసి చెబితే నేను వెంటనే ఇంటికి వెళ్లి, వాళ్లు ముగ్గురినీ కారులో ఆస్పత్రికి తీసుకువెళ్లాను. ముందస్తు పరీక్ష చేసి, డాక్టరు అంతా నార్మల్‌గానే ఉన్నదనీ, ఒకట్రెండు గంటల్లో పురుడొచ్చేస్తుందని చెప్పారు. శ్రుతి చేతిని పట్టుకుని పక్కనే కూర్చున్నాను. కొంతసేపయ్యాక మా అత్తగారు హడావిడిగా లోపలికి వచ్చి నన్ను బయటికి పంపించారు. నేనూ, మా మామగారూ బయట కారిడార్‌లో నించుని ఉన్నాం, కొంచెం ఆదుర్దాగా.

కొంతసేపయ్యాక పురుడు పోసే డాక్టర్ శ్రుతిని అటెండ్ అవడానికి వస్తూ, నన్ను గమనించి పలకరించారు.

"అదేంటి, ఇక్కడ నించున్నారు? మీ పాపో బాబో పుట్టడం చూడరూ... రండి," అని నా భుజమ్మీద చెయ్యేసి లోపలికి తీసుకెళ్లారు.

నాకూ ఆ శుభసమయంలో శ్రుతి చెయ్యి పట్టుకుని తన పక్కనే ఉండాలని ఉంది.

కానీ నేను లోపలికి అడుగు వెయ్యగానే మా అత్తగారు గబగబా ముందుకొచ్చి, "అదేంటి మీరు లోపలికొచ్చేశారు? డెలివరీ అయ్యేదాకా బయట ఉండాల్సిందే," అని ఇంచుమించు బయటికి తోసినంత పని చేసి గది తలుపు వేసేశారు. ఇంతలో డాక్టర్ ఆడ్డుపడి, ప్రశాంతంగా నవ్వుతూనే, తండ్రి ఉండాలి అని గట్టిగా చెప్పారు అత్తగారితో.

నేను వాళ్ల సంవాదం పట్టించుకోకుండా శ్రుతి తల దగ్గరికి స్టూల్ లాక్కుని కూర్చుని ఆమె చెయ్యి పట్టుకున్నా. నెప్పులు అలలుగా వస్తున్నాయి. డాక్టర్, నర్స్ వాళ్ల పనుల్లో బిజీ అయ్యారు. శ్రమ పడుతున్న శ్రుతి మొహంలోకి చూస్తున్నా. అంతలోకే కేరు కేరుమని బిడ్డ ఏడుపు. నేను అటు తిరిగేసరికి డాక్టర్ చేతుల్లో పాపాయి. కాదు కాదు, నా కొడుకు. నా కొ...డు...కు!

ఇల్లు చేరాక, కార్ సీట్‌ని జాగ్రత్తగా కౌచ్ మీద పెట్టి దానిలో నించి బాబుని ఎత్తుకోబోతున్నాను. అప్పటికింకా అపార్ట్‌మెంట్ ద్వారం దగ్గర షూస్ విప్పుతున్న మా అత్తగారి నించి ఒక గావుకేక వినబడింది. ఆవిడకేమైనా అయిందేమోనని బాబుని ఎత్తుకునే ప్రయత్నం విరమించి హడావుడిగా అటు వెళ్లాను.

ఆవిడ ఉగ్రంగా ఊగిపోతూ, శ్రుతి వేపు చురచురా చూస్తూ, "ఆయన ఎత్తుకోడం ఏంటే? బాబుని తీసుకోలేవూ? పిచ్చి మొహమా?" అంటూ హడావిడిగా తానే కార్ సీట్‌లో నించి బాబుని ఎత్తుకుని బెడ్ రూంలోకి వెళ్లిపోయారు. శ్రుతీ నేనూ- ఏం జరుగుతోందిక్కడా? అన్నట్టు నివ్వెరపోయి ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ ఉండిపోయాం.

మొత్తానికి ఆ రాత్రికి అందరం సెటిలయ్యాం. శ్రుతి పక్క ఎక్కుతూనే నిద్రలోకి జారుకుంది. రకరకాల ఆలోచనలు నా మెదడులో సుడులు తిరుగుతుండగా అలా సీలింగ్ వేపు చూస్తూ పడుకున్నాను.

ఏదో సన్నటి సవ్వడి వినిపిస్తోంది. నిజంగా వినబడుతోందా, లేక నాకు తెలీకుండానే నిద్రలోకి జారుకుని ఆ కలత నిద్రలో కలగన్నానా- నా సందేహం తీరకుండానే మా బెడ్ రూం తలుపు తెరుచుకుంది. చప్పుడు చెయ్యకుండా నడవడానికి ప్రయత్నిస్తున్నట్టు ఎత్తెత్తి అడుగులు వేస్తూ... మా అత్తగారు! అప్పటికి నాకు అర్థమైంది. బాబు మేలుకుని ఏడుస్తున్నట్టున్నాడు. నేను లేచి లైట్ వేశాను. ఆవిడ క్రిబ్‌లో నించి బాబుని ఎత్తుకుని సముదాయిస్తూ, శ్రుతిని నిద్ర లేపుతూ, నాతో- "బాబూ, కాసేపు మీరు బయటికి వెళ్లండి," అన్నారు.

లివింగ్ రూంలోకి వచ్చి కౌచ్‌లో చతికిలబడ్డాను. శ్రుతి లేపుతుంటే మెలకువొచ్చింది మర్నాడు తెల్లారాక. నేను తండ్రి నయ్యాను, నాకో ముద్దులు మూట కట్టే కొడుకు పుట్టాడు అనే ఆనందం ఆ మొదటి వారంలోనే ఆవిరైపోతూ వచ్చింది. నేనెరిగిన నా జీవితం మాయమైపోయింది. నా జీవితం మీద నా కంట్రోలు బొత్తిగా లేకుండాపోయింది. అయితే, మొదట్లో డేవిడ్ నన్ను హెచ్చరించిన కారణాల వల్ల మాత్రం కాదు. అప్పట్లో ఎన్నెన్నో కలలు కన్నాను- శ్రుతి బాబుకి పాలిస్తుంటే ఆ మధురమైన దృశ్యాన్ని కళ్ల నిండా చూడాలని, సరిగ్గా వాడి చిన్ని శరీరం పట్టేంత చిన్న స్నానపు తొట్టెలో గోరు వెచ్చని నీళ్లు పాళాలు కలిపి బాబుకి నా చేతుల్తో స్నానం చేయించాలనీ... ఇలా ఎన్నో.

అలా చూస్తూ ఉండగానే నా భార్యనీ, నా కొడుకునీ, ఆఖరికి మా బెడ్‌రూంని కూడా మా అత్తగారు తన ఆధిపత్యంలోకి తీసేసుకున్నారు.

వారం రోజుల లీవ్ తరవాత ఆఫీసుకి వెళ్లాను. పొద్దుటి బ్రేక్ టైములో డేవిడ్ ఆత్రంగా కేఫ్‌టేరియాకి తీసుకెళ్లాడు. పీక్కు పోయినట్టున్నా నా మొహం చూసి నా బుజం చరిచి- "చెప్పానా, నే చెప్పానా, జీవితం పూర్తిగా మారిపోతుందని," అని గట్టిగా నవ్వాడు. అప్పటికే నా గొంతులో పేరుకున్న దుఃఖాన్ని దిగమింగి అంతా బాగానే ఉందని చెప్పాను. నా నీరసం కేవలం నిద్రలేమి వల్ల వచ్చిందని డేవిడ్ అనుకోవడమూ నాకు అప్పటికి ఉపకరించింది. డెలివరీ కాకముందు శ్రుతి మీద ఆంక్షలు విధించడానికి మా అత్తగారి అధికారాన్ని, నిర్ణయాలని అప్పట్లో బలపరిచాను. ఇప్పుడు ఆవిడ అధికారం నాకు బాధ కలిగిస్తోందని ఏ మొహం పెట్టుకుని శ్రుతితో కంప్లెయిన్ చెయ్యను? పోనీ ఏదైనా వీక్ మొమెంట్‌లో శ్రుతితో మాట్లాడుదాం అన్నా అసలు మాకు ఏకాంతం ఏది? సాంప్రదాయాల ప్రకారం బారసాల, ఉయ్యాలలో వెయ్యడం ఇత్యాది వేడుకలన్నీ పెద్దగా నా ప్రమేయం లేకుండానే

జరిగిపోయాయి. నా కొడుకు పసితనం తీరే లోపల అసలు వాణ్ణి ఎత్తుకోగలుగుతానా, ఆ పాలబుగ్గల్ని నా నునువేళ్లతో నిమురు తానా అని అనుమానం మొదలైంది నాకు.

చూస్తుండగానే నెల రోజులు గడిచాయి. బుడ్డాడి మొదటి నెల పుట్టిన రోజు తిథుల ప్రకారం. శుక్రవారం వచ్చింది. నాకు ఏ మాత్రం ఉత్సాహంగా లేదు. ఆఫీసు పనిలో రోజు ఎలాగో గడిపేశాను. డేవిడ్ బయల్దేరుతూ నా సీట్ దగ్గరికి వచ్చి- "ఓ బీర్ తాగేంత టైం ఉందా? మనం కలిసి బీర్ తాగి చాలా రోజులైంది," అన్నాడు. సరేనని అతనితో కలిసి బయల్దేరాను. ఇద్దరం మా ఫేవరెట్ బార్‌కి వెళ్లి కూర్చున్నాం.

బీర్లు వచ్చాయి. ఇద్దరం ఒక్క గుక్క చప్పరించాం. డేవిడ్ సూటిగా నా కళ్లలోకి చూస్తూ అన్నాడు. "సంతోష్, నిన్ను గమనిస్తూనే ఉన్నాను. నువ్వు నువ్వులా ఉండట్లేదు. నిద్రలేమి వల్ల కొంచెం చిరాకు, నీరసం ఉండడం సహజమే. కానీ ఆ అలసటని కడిగి పారేసే ఉత్సాహం పాపాయి బోసినవ్వులు, ఆటలతో వచ్చి చేరుతుంది. ఆ ఉత్సాహం ఏమాత్రం నీలో కనబడ్డం లేదు. ఏమైంది?"

నా దుఃఖానికి అప్పటిదాకా నేను వేసి ఉంచిన ఆనకట్ట కరిగి పోయింది.

చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చాను. ఒక ఐదు నిమిషాలు డేవిడ్ నన్ను ఏడవనిచ్చాడు.

మెల్లగా అంతా చెప్పేశాను నా ఆప్తమిత్రుడికి. అతనేదో చెయ్యగలుగుతాడనీ, నా సమస్యని పరిష్కరిస్తాడనీ కాదు. గుండెకి బరువైన విషయం మనసు విప్పి ఒక ఆత్మీయుడితో చెప్పుకో గలగడమే ఆ బరువుని తగ్గించింది. నా గుండె తేలికపడింది.

అంతా విని డేవిడ్ అన్నాడు. "ప్రేమలో ఊపిరాడకుండా చెయ్యడం అంటే ఇదే. నువ్వూ శ్రుతి బాబుని బాగా చూసుకో గలరని ఆవిడకి ఋజువు చెయ్యాలి. అది చేస్తే నువ్వు మళ్లీ నీ ఇంట్లో నీ అధికారాన్ని స్థాపించుకోగలవు."

దాదాపు ఓ గంటసేపు మాట్లాడుకున్నాం. డేవిడ్ మాటలు ఇచ్చిన బలంతో ఇంటిదారి పట్టాను.

మర్నాడు శనివారం.

తెల్లారక ముందునించీ బాబు క్రిబ్‌నించి ఎప్పుడు చప్పుడవు తుందా అని చెవులు రిక్కించి ఎదురుచూస్తున్నా. వాడు కొంచెం గొంతు సవరించుకోగానే, మా అత్తగారు రియాక్ట్ అయే లోపలే మెత్తగా బెడ్‌రూం లోపలికి వెళ్లి క్రిబ్‌లోనించి బాబుని ఎత్తుకున్నా. బాత్‌రూంలోకి తీసుకెళ్లా, డైపర్ బేగ్‌తో సహా.

ఇంతలోకి మా అత్తగారు లేచి రానే వచ్చారు- "అయ్యో బాబూ, నీకేం చేతనవుతుందీ? ఇటివ్వు," అంటూ.

ఆవిడ మాటల్లో లాలనతో కూడిన అధికారానికి లొంగి పోకుండా నేను డేవిడ్ మాటల్ని గుర్తు చేసుకున్నా. వీడు నా కొడుకు. వీడి పాలనలో నాకు భాగం ఉండటమే కాదు, ఇది నా హక్కు కూడా- అని ఒకటికి రెండుసార్లు మననం చేసుకున్నా.

నేనేమీ సమాధానం ఇవ్వకపోవడంతో ఆవిడ, "నువ్వెటు రా బాబూ. నేనున్నాగా! నీ వల్ల ఇలాంటి పనులు ఏం అవుతాయీ?" అన్నారు, వత్తిడి ఇంకాస్త పెంచుతూ.

నేను బాబుని ఇవ్వక పోగా, నవ్వుతూనే మృదువుగానే అన్నా- "ఇదేం అంత కష్టమైన విద్యా? పోనీ మీరలా నిలబడి చూస్తూ ఏమైనా సూచనలుంటే చెప్పండి."

అంటూనే చకచకా నా పని నేను చేసుకుపోయాను. ఆవిడ బాత్రూం తలుపు దగ్గరే హడావిడి పడుతూ ఉండిపోయి, నేను పని ముగించి బయటకు రాబోతుంటే బాబుని అందుకో బోయారు.

నేను బాబుని ఇవ్వకుండానే, "ఉగ్గు కలపండి అత్తయ్యా, నేను పడతాను," అన్నా.

ఆవిడ ఒక్కక్షణం నావేపు విస్తుబోయి చూసి, ఏమను కున్నారో, కిచెన్‌లోకి వెళ్లిపోయారు. నేను బాబుని వొడిలో పెట్టుకుని కౌచ్‌లో కూర్చున్నాను. రెండు నిమిషాల్లో అత్తగారు తెచ్చి ఇచ్చిన ఉగ్గు చక్కగా పట్టేశాను.

పాలు పట్టడానికి శ్రుతి చేతికి ఇవ్వడం తప్ప ఆ రోజు బాబుని నేను అసలు వదిలిపెట్టలేదు. స్నానం చేయించడం, డయపర్లు మార్చడం, వొళ్లో ఉయ్యాల ఊపుతూ అచ్చం బుచ్చం కబుర్లు చెబుతూ ముద్దాడటం- అన్ని పనులూ నేనే చేశాను.

రాత్రి భోజనాలు అయ్యాక అత్తగారు మా బెడ్ రూం వైపు వెళ్లబోతుంటే, "ఒకరాత్రి వేళ శ్రుతికి ఏమైనా అవసరం పడితే నేను చూసుకుంటాలేండి అత్తయ్యా. మీరు మీ గదిలో పడు కోండి," అన్నా, నా దృష్టిని నా లేప్ టాప్ మీది నించి మరల్చ కుండానే.

డేవిడ్ సలహా పుణ్యమా అని నా కన్నతండ్రి పసితనం నా చేతికి అందింది.



విజయవాడలో పుట్టిన శంకగిరి నారాయణస్వామి డిట్రాయిట్‌లో ఆటోమోటివ్ కంపెనీలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. 1995 నుంచి కథలు రాస్తూ అమెరికాలోనూ ఆంధ్రాలోనూ వివిధ పత్రికల్లో ప్రచురించారు. 'రంగుటద్దాల కిటికీ', 'తుపాకీ' కథాసంపుటాలు ప్రచురించారు. 2015-17 మధ్య కాలంలో తానాపత్రిక సంపాదకులు. భరత నాట్యంలో అభినివేశం ఉంది.

బలభద్రపురం రైల్వేస్టేషన్

కంశీ



నాలాగే డబ్బులు సంపాదించడం ఏమాత్రం రాని మనిషి మా నాన్న.

తనకి చేతగాని వ్యాపారాలన్నీ చేసి ఆస్తి మొత్తం హారతి కర్పూరం చేసేసేక ఎక్కడైనా పని దొరుకుద్దేమో అని ఎక్కడెక్కడో కలతిరిగి చివరకి వాళ్లమ్మమ్మగారి ఊరయిన పసలపూడి చేరేడు.

ఓల్డ్ ఎస్సెసెల్సీ చదువుకున్న తనకి చెల్లూరులో అప్పుడే కొత్తగా కట్టిన షుగర్ ఫ్యాక్టరీలో పని దొరికింది మొత్తానికి.

వెలగల అప్పారావుగారింటి దొడ్డి వేపు వాటా వాళ్ల రెండో అబ్బాయి గోపాలాని కొచ్చింది. ఆ గోపాళం భార్య, పిల్లలు అత్తారి వూరయిన కొమరిపాలెంలో ఉంటారు. తనేమో భూతవైద్యం నేర్చుకోడానికి మన్యం అడవుల్లో కెళ్లిపోయేడు. దాంతో ఖాళీగా వున్న ఆ పోర్షను నెలకి రెండు రూపాయల అద్దెకి దొరికింది మాకు.

చాలా పెద్దదైన ఆ దొడ్లో ఉన్న ఆ పెద్ద పెద్ద నారింజ చెట్లకి కాయలే కాయలు, పండేకా ఎంత తియ్యగా వుంటాయో పండక ముందు అంత పులుపు రొడ్డు. ఇంటి గలావిడ వెలగల పెద సుబ్బయ్యమ్మగారు చూడకుండా నాలుగు కాయలు తెంపే మా అమ్మ, రెండు బద్దలు కోసి తీసిన రసాన్ని సీవెండి గ్లాసులో పోసి నీళ్లూ పందార కలిపి నాకూ మా తమ్ముడికీ ఇచ్చేది.

❖

మాకే ఆస్తిపాస్తీ లేకపోడం వల్ల ఊళ్లో డబ్బున్న రెడ్ల పిల్ల లెవరూ మాతో కలిసేవోళ్లు గాదు. ఆళ్లు కలిసినా కలవకపోయినా కోరి శేషయ్యగారి అరుగు మీద మిషను పెట్టుకు కుట్టుకునే కుమ్మరి బూర్రావు తమ్ముడు త్యాగరాజుగాడూ, పట్టాభి రావయ్య గారి చిన్నాగాడూ చాలా క్లోజుఫ్రెండ్సయిపోయేరు నాకు.

ఆళ్లూ నేనూ బ్రాహ్మలు భరతం నర్సింగారి దొడ్డిగోడల పక్కనించి రోగిబీడు దాటుకుంటా పుంతరేవులో కెళ్లి ఈత కొట్టొచ్చేవోళ్లం. అప్పుడప్పుడూ చింతావోరి తోట నీడల్లో కల తిరుగుతా రాలిన మావిడికాయలేరుకోడం, చెట్లకున్న రాజ ఉసిరి కాయలు కోసుకోడంలాంటి బుల్లి బుల్లి దొంగతనాలు చేసేవోళ్లం.

ఒకరోజు 'కోసేసిన గరికిపాటి చిట్టిగారి పొలాల్లో పరిగలు ఏరదాం' అంటా త్యాగరాజుగాడు అయిడియా యిస్తే ఏరడం మొదలెట్టిన నాకు పిక్కల దగ్గరా, మోకాళ్ల దగ్గరా దురదలే దురదలు. తీరా జూస్తే మేం ఏరుకున్న పరిగలన్నీ తీసుకున్న కోంటి చినెంకట్రాజు బేడకాసు బిళ్లియ్యడానికి చాలా ఇదయిపోయేడు.

మా అక్కాబావలు అన్నవరం వెళ్తన్నారని తెల్సిన నేను మా అక్క పసలపూడి వచ్చినప్పుడు "ఎలాగెల్తన్నారూ?" అన్నాను.

"మా బలభద్రపురంలో రైలెక్కెళ్తాం... ఇంకెలాగెళ్తాం "అంది మా అక్క.

"రైలు బండయితే నేనూ వచ్చేత్తాను," అన్నాను.

దారి పొడుక్కీ మా శేష (వాళ్లపిల్ల) నెత్తుకోవాలిమరీ," అనేసి మా అక్కకండిషన్ పెడితే 'సరే' అంటా తలూపేసేను.

ఆ చీకట్లో మేవెక్కిన రైలు కూతేసి బద్దకంగా కదిలిందో లేదో, ఆ రైలు కూత కంటే పెద్దగా ఏడుపు లంకించుకుంది మా అక్క కూతురు శేషారత్నం.

ఏడాదిన్నర వయసున్న దాన్ని చంకలో వేసుకున్నా, భుజమ్మీ దేసుకున్నా, ఏడుపాపటం లేదా చంటిది. నా పక్కనే కూర్చున్న దాని చిన్నాన్న, (అంటే, మా బావ తమ్ముడు. అబ్బు ఆడి పేరు.) ఇలా ఎత్తుకున్నాడో లేదో ఏడుపాపేసి చీకటి కొమ్మల్లోపలి చింత పువ్వులాగ నవ్వడం మొదలెట్టింది. అలాగ ఒకసారిగాదు, రెండు సార్లుగాదు దారిపొడుక్కీ అంతే. ఇటుపక్క అది ఏడుస్తున్నప్పుడు ఎత్తుకోటం లేదని మా అక్క తిట్లు.

అన్నవరం కొండ మెట్లమీద పావళాకాసు పారేసేనని నా వీపు మీద రెండేసిన మా అక్క వెతకమంటా అరుస్తుంది. ఏడుస్తా ఆ మెట్లమించి ఎళ్లే జనం వచ్చే జనం... వాళ్ల కాళ్ల మధ్యలో ఎంత సేపు వెతికినా దొరకలేదా పావళాకాసు.

తర్వాతెప్పుడో చాలా ఏళ్ల తర్వాత ఇదే మెట్లమీద మా గురువుగారైన కె. విశ్వనాధ్‌గారు, శంకరాభరణం సినిమాలో మర చెంబు దొర్లే సీను తీస్తున్నప్పుడు, అసిస్టెంటు డైరెక్టర్‌గా పనిచేసిన నేను ఆ పావళా పారేసిన చిన్నప్పటి రోజుల్ని ఆ షూటింగ్ షెడ్యూలంతా గుర్తు చేసుకుంటానే ఉన్నాను.

❖

"మా అమ్మమ్మగారి ఊరు బలభద్రపురం. మా అక్క, మా పిన్నిలూ, పెద్దీ అందరిదీ ఆ బలభద్రపురమే," అంటా ఆ సాయంత్రం పూట త్యాగరాజు గాడికి చెపుతుంటే, "నాకెందుకు జెప్తున్నావూ?" అన్నాడు.

"ఆ బలభద్రపురం వూరు చివర స్టేషనుంది. చీకటిపడ్డాకా ఆ స్టేషన్లో రైలు బండాగుద్ది. అదెక్కి అన్నవరం వెళ్దావనుకుంటు న్నాను. నువ్వు వస్తావేంట్రా త్యాగరాజూ?" అన్నాను.

"ఎప్పుడెళ్దామేంటి?" సంబరపడతా అడిగేడు త్యాగరాజు గాడు.

"ముందు మా అమ్మనడిగి చెప్తాను," అంటుండగా మా మధ్యలోకి దూరిన కోమట్లు చిన్నాగాడు, "నేనూ వస్తాన్రా," అన్నాడు.

"మా మీదపడి మేసేస్తావేమో... నీ దగ్గర డబ్బులున్నయ్యా మరి?" అన్నాడు త్యాగరాజు.

నవ్వేసిన చిన్నా, "మా చెల్లి సుగుణ చెక్కభరిణిలో దాచు కున్న డబ్బులు కొట్టుకొచ్చేస్తాన్లేరా," అన్నాడు.

ఇంటికెళ్లేకా మా అమ్మకి చెపితే, "ఎవరెవరెళ్తన్నారు," అంది.

"మిషనుకుట్టు త్యాగరాజుగాడు, కోంట్ల పట్టాభిరామయ్య గారి చిన్నాగాడూ వస్తానంటన్నారు," అన్నాను.

"కాలవ దగ్గర కిళ్లీకొట్టు పట్టాభిరామయ్యకి పిల్లల్లేరు గదా?" అంది మా అమ్మ.

"ఈయనింకోపట్టాభిరామయ్యలే. కోటిపిల్లి సూర్యప్రకాశ రావు గారింట్లో అద్దెకుంటున్నారీళ్లు," అన్నాను.

"మీకూడా రాంగేడ్ని (మా తమ్ముడు) కూడా తీసుకెళ్లండి. లేకపోతే నల్లగచ్చు మీద దొర్లి ఏడుస్తా నానా పెంటా చేసేస్తాడు," అనేసి డొంకినీ తీసుకుని ఆ చెట్ల దగ్గరకెళ్లి పుల్లటి నారింజ కాయలు నాలుగు రాలగొట్టి తీసిన ఆటి రసంతో పులిహోర చేసి ఇత్తడి కేరేజీ నిండా కూరి ఇచ్చింది.

కోటిపల్లి టు రాజమండ్రి వయా రాజానగరం ఆల్ రౌండ్ బస్సెక్కి బలభద్రపురం స్టేషన్ దగ్గర దిగేం ఆ దీపాల వేళప్పుడు.

రైలాగినప్పుడు మాత్రమే వచ్చే స్టేషన్‌మేష్టరుగారు టిక్కెట్లమ్మి ఆగబోతున్న బండికి జెండా చూపించి అదెళ్లేకా, బ్రిటిషోళ్ల కాలంనాటి ఆ స్టేషన్ గదికి తాళమేసుకునెళ్లిపోతున్నవాడల్లా, మమ్మల్ని చూసి, "ఏ బండికిరా?" అన్నారు.

"అన్నవరం" అన్నాను.

"నైన్ డౌను రాత్రి ఎనిమిదింటికొస్తది. అప్పుడే వచ్చేసే రేంటీ?" అంటా సైకిలు స్టేండ్ తీసి ఊల్లో కెళ్లిపోయేరు.

మా తమ్ముడు మా అక్కాళ్లింటికెళ్లిపోతే త్యాగరాజుగాడూ నేనూ కోముట్ల చిన్నా కల్సి ఆ పట్టాల మీదా, గంగరాయి చెట్ల కిందా కలతిరుగుతా గేటు దాటుకుంటా వచ్చిపోయే క్వారీ ట్రాక్టరోళ్లని పలకరిస్తా ఆళ్లడిగిన దానికి సమాధానాలు చెప్తున్నాం.

ఒక ట్రాక్టరు తొట్టిలో ఎర్రకంకర వల్ల రంగు మారిపోయిన గోచీలు పెట్టుకున్న జనాల్లో మా బావ సత్తిరెడ్డి (మేస్త్రి తాతయ్య గారి సత్తిరెడ్డి) కనపడి పలకరిస్తున్నాడు.

అది మద్రాస్ నించి కలకత్తా మెయిన్ లైన్ అవ్వడం వల్ల రకరకాల రైళ్లు వస్తా పోతున్నాయి.

వాల్తేర్ ఎక్స్‌ప్రెస్ వస్తుందంట. చెప్తున్న మనిషి గేటేస్తున్నాడు. అది విన్న చిన్నాగాడు తన నిక్కరు జేబులో ఉన్న రాగిడబ్బు నాకు చూపించి, "ఇదా రైలు పట్టా మీద పెట్టి ఆ రైలెళ్లాకా తీస్తాను. చూస్తుండండి తప్పడయిపోయి... ఎంత వెడల్పుగా సాగిపోద్దో," అంటా పెట్టేడు.

రైలెళ్లేకా తీస్తే వెడల్పాటి రచ్చరేకులాగయిపోయినా రాగి డబ్బుని మాకు చూపించి, "చిన్న బొర్రెట్టి దాంట్లోకి నల్ల మొల తాడు దూర్చి మెడలో కట్టుకుంటాను," అన్నాడు సంబరంగా.

రైలు రావడానికి గంట ముందే స్టేషన్లోకొచ్చేసిన మేష్టారుతో మాటలు కలిపేసిన చిన్నాగాడు ఆ కాసేపట్లోనే, "ఏంటి పసలపూడి షావుకారుగారూ!" అని పిలిపించుకోడం మొదలెట్టేడు.

"మేష్టరుగారూ మీ అసలు పేరేంటండీ?" అన్నాడు చిన్నా,

"బిక్కవోలు సత్యనారాయణాచార్యులు. అయితే ఆ పేరు ఇక్కడ ఎవరికీ తెలీదు," అన్నారు.

"బళ్లు ఆగేటప్పుడు మట్టుకే స్టేషన్లోకొస్తున్నారు. ఉట్టప్పుడిక్కడ ఉండక్కర్లేదండీ?"

"అక్కర్లేదు!"

"అదేంటీ?"

"ఈ స్టేషన్ని హాల్ట్ అంటారు. అమ్మో టిక్కెట్లకి కమీషన్ తప్ప జీతంగా నాకేమీ ఇవ్వరు రైల్వేవాళ్లు. నా అసలు వృత్తి ఊళ్లో వైద్యం షావుకారుగారూ," అన్నారు మేష్టరుగారు.

ఇంకా అదీ ఇదీ బోల్డు మాటాడాక ఆ మేష్టారికీ చాలా ఫ్రెండయిపోయేడు చిన్నాగాడు.

చీకటిగుయ్యారంలాగున్న లైట్లు లేని ఆ చిన్నిస్టేషన్లో కల తిరుగుతున్న నాకు ఎన్నో గుర్తొస్తున్నాయి. జీవితంలో ఫెయిలై పోయిన మా నాన్న కొన్నాళ్లపాటు ఈ ఊళ్లో ఉంచేసినప్పుడు రోజూ ఈ స్టేషన్లోకొచ్చి కూర్చునేవాడ్ని. తర్వాత పసలపూడి వెళ్లిపోయేకా ఇక్కడికొచ్చినప్పుడు ఎక్కువసేపు ఇక్కడే వుండిపోతే సైకిలేసుకొచ్చిన మా పెద్దమ్మ కొడుకు చిన్నోడు (ఆడసలి పేరేదో వుంది) నన్ను అన్నానికి తీసుకెళ్లేవోడు. తిన్నాకా మళ్లీ వచ్చేసి ఇక్కడే, ఈ పట్టాలమ్మటే నడుచుకుంటా ముందుకెళ్తే కానేడు అనే వూరొస్తది. కానేడు మాలక్షమ్మ అనే గ్రామదేవత జాతర్ల కొచ్చినప్పుడు కూడా నేను తచ్చాడేదీ స్టేషన్లోనే. ఒకటా రెండా ఎన్ని పసుపు పచ్చటి జ్ఞాపకాలీ స్టేషన్లో! రాత్రి తొమ్మిది దాటేకా వచ్చిన నైన్ డౌన్ పాసింజరెక్కాం.

మా అమ్మిచ్చిన పులిహోర కేరేజీ పట్టుకొమ్మని మా తమ్ముడికిచ్చి కిటికీలోంచి చీకట్లోకి చూస్తున్నప్పుడు దూసుకుంటా వస్తున్న గాలి నా ముఖానికి తగుల్తుంటే ఒకటే తిమ్మిర్లు. పెదాలు తడారిపోతున్నాయి.

ప్రతి స్టేషన్లోనూ ఆగిపోతున్న పాసింజరు పెదబ్రహ్మదేవం స్టేషను దగ్గరైతే చాలాసేపుండిపోయింది. ఇక సామర్లకోట స్టేషనొచ్చేకా తీసుకెళ్లి లూప్‌లైన్‌లో పారేసినట్టున్నారు. రెండు గంటల తర్వాత వెనక్కొచ్చి ముందుకి కదిలింది.

ఆగుతా నడుస్తా అన్నవరం స్టేషన్లో కొచ్చేటప్పటికి తెల్లవారు ఝాము మూడైంది.

మా తమ్ముడు, త్యాగరాజుగాడు 'ఎందుకొచ్చేంరా బాబూ' అనుకుంటా నిద్ర మొఖాల్తో దిగుతున్నారు. చెప్పకపోడమే నా మొకం కూడా అలాగే ఏడుస్తుంది. ఒక్క చిన్నాగాడు మట్టుకి సైకిలు బెల్ స్ప్రింగ్ మింగినట్టు మాంచి హుషారుగా ఊగి పోతున్నాడు. అరకు దగ్గర బొర్రాగుహలో కాగడాలాగ ఒకటే వెలిగిపోతుందాడి ముఖం.

స్టేషన్‌కి ఎడంపక్కనున్న కొండమీద ధగధగా వెలిగిపోతున్న లైట్ల మధ్య సత్యనాణమూర్తి గుడి. పక్కనే ఉన్నట్టు కనిపిస్తుంది గానీ నడుచుకుంటా వెళ్తుంటే ఎంతకీ తరగడం లేదు దూరం. ఆ చీకట్లో కనపడలేదుగానీ మధ్యలో గోపాలపురం అనే ఊరుంది. అది దాటుకుని కొండ పైకెక్కేటప్పటికీ బాగా తెల్లారిపోయింది. అక్కడ్నించి ఒకటే ఎండ, చెమటకీ చిటచిట్లాడిపోతంది శరీరం.

గుళ్లు గీయించుకుని స్నానాలు చేసేకా దేవుడి దర్శనం చేసుకుని మెట్లు దిగుతా మధ్యలో మంచినీళ్లున్న చోట చూసుకుని ఆగి కేరేజీ విప్పుకుని తినడం మొదలెట్టేం పులిహోర.

ఉప్పేసిన నారింజకాయల రసంలో ఊరి రంగుమారిన పచ్చి మిరపకాయల రుచి పుల్లపుల్లగా, ఉప్పుప్పగా మామూలుగా లేదు.

ఖాళీ అయిపోయిన కేరేజీ కడిగేసి మా తమ్ముడికిచ్చేసి మెట్లు దిగుతున్నప్పుడు నా భుజమ్మీద తడి కాశీ తువ్వాలు విప్పి అప్పుడే గీయించుకున్న త్యాగరాజుగాడి గుండు మీదేసి లాగుతుంటే పల్చగా ఆ గుండు కంటుకుపోయినా తువ్వాలు ఎంతకీ ఊడిరాదే. దాని బదులు ఎనక్కీ, ముందుకీ ఆడొస్తన్నాడు.

అసలే నిద్ర తక్కువై చాలా చిరాగ్గా వున్న త్యాగరాజుగాడికి చిర్రెత్తుకొచ్చి నా మీదకి దూకేసేడు.

ఇద్దరం తెగ కొట్టేసుకుంటుంటే మధ్యలోకొచ్చినా చిన్నాగాడు, సైతిగా మాటాడతా చాలా గమ్మత్తుగా విడదీసి ఆడూ నేనూ ఈ జన్మకి దెబ్బలాడుకోకుండా కలిపేసేడు.

కొండ దిగేకా కింద కొనుక్కున్న ప్రసాదం పొట్లాల్లో ఒకటి విప్పి ప్రసాదాన్ని నోట్లో పెట్టుకున్నానోలేదో మామూలు రుచి కాదు. ఆ రుచి ఇంకెక్కడా రాదు. అప్పుడే పీకల్దాకా పులిహోర లాగించినా తలో రెండు పొట్లాలు తినేసేకా ఇంకో పొట్లం కొనుక్కుందామంటే డబ్బులు సరిపోటం లేదు. అది చూసిన త్యాగరాజు నా భుజమ్మీద చెయ్యేస్తా నాకు అప్పిచ్చేటప్పటికి ఇద్దరం వెళ్లి తలో పొట్లం కొనుక్కున్నాం.

మమ్మల్ని చూసిన చిన్నా మా తమ్ముడితో, "చూసేవా... రావుడూ ఆళ్లిద్దర్నీ ఎలా కలిపేసేనో," అంటా నవ్వేసి, "నాక్కూడా అప్పివ్వరా," అనీ త్యాగరాజు నడిగితే, "ఉంటే ఇద్దును. చూస్కో టిక్కెట్టు డబ్బులు తప్ప," అన్నాడు.

అన్నవరం నించి బలభద్రపురానికి రైలు టిక్కెట్టు డబ్బులు తప్ప ఎగస్తాగా ఏగాణీ లేదు. స్టేషన్లోకొచ్చేకా అంతా టిక్కెట్లు కొంటుంటే చిన్నా మట్టుకి కొన్లేదు.

"అదేంట్రా?" అన్నాను.

నవ్వుతున్నాడు చిన్నా, "టికెట్టు కలెక్టరు పట్టుకుంటే," అన్నాడు త్యాగరాజు.

మళ్లీ నవ్వేసిన చిన్నా ఎవరో అప్పుడే వైజాగు రైలు దిగేసేకా పారేసిన టికెట్టు కనబడితే తీసి జేబులో పెట్టుకుంటుంటే చూసిన మా తమ్ముడు, "అదెందుకూ?" అన్నాడు.

మాటాడకండా మళ్లీ నవ్వేసినా చిన్నా వాలకం చూసిన త్యాగరాజు, "ఈడితో ప్రయాణం చేస్తే మనల్ని కూడా బొక్కలో ఏసేస్తారేమోరా," అన్నాడు.

రాజమండ్రి వేపెళ్లే పాసింజరు బండొస్తే ఎక్కేసేం.

రాత్రి బండిలాగ కనిపించిన ప్రతి స్టేషన్లో ఆగి అక్కడి జనాన్ని పలకరించేక వస్తానన్నోళ్ల నెక్కించుకునిగానీ ముందుక్క దలడం లేదు బండి.

టిక్కెట్టు కలెక్టరొస్తుంటే చాలా అర్జంటన్నట్టు బాత్రూమ్‌లో కెళ్లిపోయిన చిన్నా అతనెళ్లేకా నవ్వుతా వచ్చేడు.

బిక్కవోలు స్టేషను దాటిన మా పాసింజరు కానేడు మాలక్ష్మమ్మ గుడి కూడా దాటేసి వస్తున్న బలభద్రపురంలో ఆగడానికి స్లో అవుతుంటే ఇందాక సంపాయించిన పాత టిక్కెట్‌ని నోట్లో వేసుకుని నమలడం మొదలెట్టేడు చిన్నా.

రైలాగేక అందరి దగ్గర టిక్కెట్లు తీసుకుంటున్న మేష్టారు, "ఏవండీ షావుకారుగారూ బోడిగుండులో బాగున్నారు, టిక్కెట్టివ్వండి," అన్నారు.

"అయ్యయ్యో," అంటా మతిమరుపోళ్లా నటించిన చిన్నా నోట్లో నమిలిన టిక్కెట్టు తీసి మేష్టరుగారికి చూపించేటప్పటికి, "భలేవోడివయ్యా పసలపూడి షావుకారూ" అంటా నవ్వేసేడా బలభద్రపురం స్టేషను మేష్టారు.

అంతటి అపురూపమైన జ్ఞాపకాల పిచ్చిక గూడు మా బలభద్రపురం రైల్వేస్టేషను.

❖

మా మాయ్యనెవరో బిక్కవోలు నక్కలోళ్లు చంపేసేరంటే చూడ్డానికెళ్లినప్పుడు ఆ బలభద్రపురం స్టేషన్లోకెళ్లి కూర్చున్నాను. మా అమ్మమ్మ కాలం చేసినప్పుడొచ్చి కూడా ఆ స్టేషన్లోనే కూర్చున్నాను. లేడీస్ టైలర్ రిలీజప్పుడొచ్చి ఏ బంధువింటికీ వెళ్లకండా సరాసరి ఆ స్టేషన్లోకెళ్లి ఆ బెంచీల మీదే దేకేను. మా మేనకోడలు శేషారత్నం కొడుకు బుజ్జి పెళ్లి మామిడాడ సూర్నాణ మూర్తి గుళ్లో అయితే వెళ్లి తిరిగొస్తా ఈ స్టేషన్లోకొచ్చేసేను. నిరుడు జనవరిలో మా అక్క చనిపోతే వచ్చినోడ్ని ఈ స్టేషన్లోనే కల తిరుగుతుంటే పండు ముసలోడయిపోయిన ఆనాటి స్టేషను మేష్టారు 'ఎప్పుడొచ్చేవూ...' అనేసి ప్రేమగా పలకరించేరు.

అన్నవరం కేంటీన్ సుబ్బారావుగారి అబ్బాయిని ఇంటర్వ్యూ చెయ్యడానికి ఆనాడెక్కినట్టు పాసింజరెక్కెళదామనిపించిన నేను, మా మేనకోడలు కొడుకు బుజ్జికి ఫోన్ చేసి ఇక్కడ రైళ్లాగే టైములు తెల్సుకుని నాకు వాట్సప్ మెసేజ్ చెయ్యమన్నాను.

ఫోన్ చేసి రైళ్ల వివరాలు చెప్పిన బుజ్జి, "మీకో బ్యాడ్ న్యూసండీ పెదనాన్నా," అన్నాడు.

"ఏంటీ?" అన్నాను.

"ఇక మా బలభద్రపురం స్టేషన్లో రైళ్లాగవంటండీ... రైళ్లాగక పోతే స్టేషను మొత్తం పడగొట్టేస్తారు గదండీ???" అన్నాడు బుజ్జి.



ప్రముఖ సినీ దర్శకులు వంశీ తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. బహుళ ప్రాచుర్యం పొందిన వీరి 'పసలపూడి కథలు' టీవీ సీరియల్‌గా కూడా వచ్చాయి. నాలుగు కథా సంపుటాలు, పది నవలలు, రెండు నాటికలు, కొన్ని యాత్రా కథనాలు ప్రచురించారు. తనకు నచ్చిన కథలు రెండు భాగాలుగా ప్రచురించారు. తన ప్రయాణ, జీవన అనుభవాలతో, జ్ఞాపకాలతో అనేక వ్యాసాలు, కథాచిత్రాలు రాస్తున్నారు.

పేరే పాచికాయే

కొడికొండ కె. శివకుమార శర్మ



ఛార్లెస్ డికెన్స్ అన్నట్లు అది అత్యుత్తమ కాలం, అతి హీనమైన, నీచమైన, పరమ నికృష్టమయిన కాలం.

"ఒక పదం చాలు, విశేషణానికి!" అంటాడు చు. అతని ఉద్దేశంలో తనకి వర్తించేవన్నీ అత్యుత్తమాలు తప్ప వేరేవీ కాబోవు. అతని గూర్చి చెప్పడానికి ఎగస్ట్రాట్రీవోళ్లకి ఆ మూడు కూడా చాలవు.

'ఏరా హనుమంతూ, నీ తోకేదీ?' అని చిన్నప్పుడు అతన్ని హేళన చేసినవాళ్లు అతను తన తోకనే సింహాసనంగా చేసుకుని కూర్చుంటూనే పైకొచ్చాడని ఒప్పుకోక తప్పలేదు. అందుకని ఆంగ్లంలో రాసిన అతని మూడక్షరాల పేరులోని మొదటి అక్షరా నికి బదులుగా బి.ని వాడి 'భు' అని అతని మనుమలతో, మనుమరాళ్లతో చు అనుయాయులు ఆడుకుని అతని మెప్పు పొందాలనుకుంటే, నచ్చనివాళ్లు ఆ అక్షరం స్థానంలోనే పి.ని పెట్టి, అతన్ని ద్వేషించేవాళ్లు టి.ని పెట్టి మార్చగా వచ్చిన మూడక్షరాలనీ కలిపి పలికి కొద్దిగానయినా తృప్తి పొందుతుంటారు.

అతని తెలివితేటలకి ప్రాథమిక పాఠశాల నుండీ ఉన్నత పాఠశాల దాకా ఏ ఉపాధ్యాయుడూ మురిసిపోలేదు. అలాగని మరచిపోవడమూ కష్టమేనని వాళ్లు ఏళ్లు గడిచేకొద్దీ గ్రహించక పోనూ లేదు. దానికి రెండు కారణాలు:

మొదటిది, ప్రశ్నాపత్రాలకి అతని జవాబులనీ, వాళ్లు అతని కిచ్చిన మార్కులనీ ఎప్పుడూ మరచిపోలేకపోవడం. సంస్కృతం కొద్దిగా పరిచయమున్నవాళ్లు మాత్రం, 'పూర్ణాత్ పూర్ణ మాదాయ పూర్ణ మేవావశిష్యతే' అన్న ఉపనిషద్ వాక్యానికి విపరీతార్థంలో అతని విద్వత్తుని ఉదాహరణగా తీసుకోవచ్చని తెలుసుకున్నారు. దాన్ని తరగతిలో మిగిలిన విద్యార్థులకు అర్థమయేలా వాళ్లల్లో ఒకణ్ణి చూపిస్తూ, "ఒరేయ్! నీకు నూటికి తొమ్మిది మార్కు లొచ్చెయ్యాంటే పుచ్చకాయంత సబ్జెక్టులో నేరేడుకాయంత తెల్సినట్లన్నమాట. నీకు తెలిసిన ఆ కొద్ది సబ్జెక్టునీ నీ దగ్గర్నుంచీ లాగేసుకున్నాననుకో, నీకు మిగిలేది సున్నా గదా? మన ప్రబుద్ధుడి ప్రత్యేకత ఏమిటో తెలుసా? వాడికి సున్నా వచ్చిందని నవ్వబాకండి. ఏమీరానితనంలోంచి ఏమీరానితనాన్ని తీసేసినా మిగిలేది ఏమీరానితనమే! అదీ వాడి గొప్ప!" అని పగలబడి నవ్వుతూ వివరించేవాళ్లు. దానికి తొమ్మిది మార్కులు వచ్చినవాళ్లతో సహా అందరూ పడీపడీ నవ్వేవాళ్లు.

రెండవ కారణం, అన్ని సున్నాల ముందర ఒకటి ఎలా చేరడంవల్ల అతనింతవాడయ్యాడనే ఆశ్చర్యం.

చు తన పేరులోని మహత్తుని గ్రహించిన క్షణం సిద్ధార్థుడు బుద్ధుడయినప్పటి వంటిది. లేకపోతే, ప్రతి పరీక్షలోనూ తన పేరుని ఇంగ్లీషులో రాసినప్పుడు కళ్ల కెదురుగా కనిపిస్తున్న మహత్తుని పాతికేళ్లు వచ్చేదాకా గమనించకుండా ఎలా ఉంటాడు? ముహూర్తబలమంటే అదే మరి! సిద్ధార్థుడు బుద్ధుడవడానికి ఎవరూ ముహూర్తం పెట్టలేదు; అతను ముసలివాళ్లనీ, చావునీ చూశాడు. ఇండియాలోకి చైనా ఉత్పత్తులు ప్రవేశించడం మొదలు పెట్టినప్పుడు చూసి, అవి సునామీలా మారబోయే కాలాన్ని చు ఆకళింపు చేసుకున్నాడు. పెద్ద అలలు వస్తున్నప్పుడు వాటిమీద సర్ఫ్ చెయ్యడానికి నాంది చుట్టినట్లు, సి. హనుమంతు తన పేరులో వున్న మూడు ఆంగ్ల అక్షరాలని కలిపి, చైనీసు కంపెనీలకి దిగుమతిదారుగా చు అవతారమెత్తాడు. అంటే, అందరూ అనుకున్న ఈ బుద్ధావతారం సిద్ధార్థుడవడానికి ముహూర్తాన్ని తనే పెట్టుకున్నాడన్నమాట. ఆ ముహూర్తబలం వల్లనే తమ పేరున్న వాళ్లతోనే వర్తకం చేసే అవకాశం వచ్చినందుకు చైనీసువాళ్లూ సంతోషించారు.

అతని తల్లిదండ్రులు బ్రతికి వుంటే అతనికా పేరుని పొరబాటున కూడా దాగ్గరకి రానిచ్చేవాళ్లు కాదు. మూడక్షరాల మాట గూర్చి కాదు చెబుతోంది, వాటిని కూర్చిన పదం గూర్చి. దాదాపు తొమ్మిది నెలల గర్భవతిగా ఉన్నప్పుడు కారు ప్రమాదంలో మరణించిన అతని తల్లి గూర్చి. ప్రసవమయ్యాక సహాయముంటుంది గదా అని అమెరికా వచ్చిన ఆమె తల్లి దండ్రులని ఎయిర్‌పోర్టు నుండీ పికప్ చేసుకుని ఇంటికి తీసు కొస్తుంటే ముందు కూర్చున్న ఆమె వెంటే భర్త కూడా పరలోకాలకి వెళ్లడం గూర్చి. హాస్పిటల్ వాళ్లు అమ్మమ్మా, తాతల చేతిలో అతన్ని పెట్టేముందర సర్టిఫికేట్ మీద రాయడానికి పేరు చెప్ప మంటే జన్మనక్షత్రం ప్రకారం 'హ'తో మొదలవాలని తెలిసి నప్పుడు వాళ్లకు నోటికొచ్చిన మొదటి పేరు గూర్చి. వాళ్లు తమతో ఆ పసికందుని ఇండియాకి తెచ్చుకున్నారు.

ఆలనా పాలనా లేని అతని ఎదుగుదలకి కూతురునీ, అల్లుణ్ణీ ఒకేసారి పోగొట్టుకున్న దుఃఖంలో వాళ్లు ఎక్కువకాలం జీవించకపోవడం, కూతురు కొడుక్కు పిత్రార్జితంలో కాక స్వార్జితంలో మాత్రమే తాతగారు అతనికి భాగాన్నివ్వవలసి రావడంవల్ల అతని చేతికి ఎక్కువ డబ్బు రాకపోవడం కారణాలని తెలిసినవాళ్లు లోకంతీరుకు దణ్ణం పెట్టి ఊరుకున్నారు. అతను గాలికి పెరిగాడన్నారు కొందరు. కొడుకుని వాయుదేవుడు జాగ్రత్తగా చూసుకున్నాడన్నారు. బిల్డింగుల మీద 'చు టవర్స్' అని కనిపించడం, అది కూడా ఒక పట్టణానికి మాత్రమే పరిమిత మవకుండా మొదలయిన తరువాత. కొంతమంది చు చరిత్ర కారులు టీవీలకెక్కారుగానీ చరిత్రనెప్పుడూ బయటివాళ్లు మాత్రమే రాస్తారు గనుక వాళ్ల మాటలు గాలిమాటలయ్యాయి. అందరూ ఒప్పుకునే విషయం మాత్రం చుకి బిజినెస్ మొదలు పెట్టడానికి కావలిన విత్తులు మాత్రం ఎలాగో సమకూరాయి. తెలివితేటల గూర్చే ఏకాభిప్రాయం కుదరలేదు.

న్యూయార్క్‌లో చు చెయ్యి ఏ క్షణాన పడిందోగానీ, అతని ఒకప్పటి ఆంతరంగికుడి మాటలని నమ్మేటట్లయితే మాత్రం, అది చు న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో లిమోసీన్‌లో వెడుతూ టైరు పంక్చరై ఆగినప్పుడు అక్కడ కనిపించిన జనప్రవాహాన్ని గమనించిన క్షణం. ఆ ప్రవాహంలో రంగురంగుల చీరల రెపరెప లని గుర్తించిన క్షణం. వాళ్లు వెడుతోంది అక్కడున్న వినాయకుడి గుడికని తెలుసుకున్న క్షణం. బుద్ధుడు సిద్ధార్థుడి దశని దాటి ఇంకా వెనక్కి వెళ్లి శుద్ధోదనుడిలో కలిసిపోయిన క్షణం.

ఆ క్షణానికి వెలకట్టినది మాత్రం, ఆ గుడి రాబడిలో దాదాపు సగం అక్కడ అమ్మే తినుబండారాల వల్ల అని తెలిసి నప్పుడు.

అది అత్యుత్తమ కాలం అని అన్నది అమెరికాలో రాష్ట్రానికో లేక నగరానికో ఒకటని కాక, పేటకో గుడి రావడానికి కృషి చేస్తున్నవాళ్లు. ఆ అభిప్రాయానికి వ్యతిరేక ధ్రువంలో ఉన్నవి కొత్త గుళ్ల రాకతో రాబడి తగ్గిపోతున్నదని అలమటిస్తున్న అప్పటికే కట్టబడ్డ గుళ్ల యాజమాన్యాలు. ఇళ్లు కట్టడానికే కాదు అప్పులిచ్చేది, గుళ్లు కట్టడానికి కూడా! చేసిన అప్పు తీర్చద్దూ మరి?

❖

క్వీన్స్‌లోని ఆ గుళ్లో ఒక్క గణపతికే పెద్ద విగ్రహాన్ని పెట్టి పూజ చెయ్యడం, అతని తమ్ముడికి చేజేతులా అన్యాయం చెయ్యడమేనన్నారు ఆ గుడి యాజమాన్యానికి చు చేత అపాయింట్ చెయ్యబడ్డ బోర్డు సభ్యులు. 'తమ పిల్లలని సమంగా చూసుకోకపోవడాన్ని ఏ తల్లిదండ్రులూ సమర్థించరు! మీకు పార్వతీ పరమేశ్వరుల శాపాలు తప్పవు!' అని వాళ్లు బోర్డు సమావేశంలో ప్లాన్ ప్రకారం మోతాదుని మించి ఆగ్రహించారు. 'ఈ దేశంలోనే ఇది దాదాపు మొదటి గుడి, ఇది ఇలాగే ఎప్పటినించో వుంటోంది, పైగా సుబ్రహణ్యేశ్వర స్వామికి విగ్రహం ఉన్నది గదా!' అన్నారు మిగతా బోర్డు సభ్యులు. "పక్క వీధిలో పెద్ద మురుగన్ విగ్రహాన్ని పెడుతూ గుడి కడితే తమిళియన్లు అక్కడికెళ్లరా?" అని తిరుగు జవాబిచ్చారు చు అపాయింటీలు. "కట్టినప్పుడు చూద్దాం. కల్లో మాట!" అని నిరసించారు కానివాళ్లు.

ఆ పక్కవీధిలో ఇళ్లు ఒకటొకటిగా అమ్ముడవుతున్నప్పుడు గణపతి గుడి యాజమాన్యానికి తెలియలేదుగానీ, వాటిని బుల్‌డోజర్లతో చదును చేయిస్తూ 'మురుగన్ టెంపుల్' అని బోర్డు పెట్టినప్పుడు మాత్రం పరిస్థితి తేటతెల్లమయింది. ఆ గుడితో పోటీవల్ల తమకు తగ్గబోయే రాబడి గూర్చిన ఆదుర్దా వాళ్లను పట్టుకుంది. అసలు శంకుస్థాపన కూడా కాకుండా ఒక రెండు గదుల రేకుల పెట్టె (ట్రెయిలర్)లో మురుగన్ విగ్రహాన్ని పెట్టి పూజ చేయించడం మొదలవగానే అక్కడి కెడుతున్న తమిళియన్ల సంఖ్య పెరిగి, గణపతి గుడికి తగ్గడం ఒక్కటే కాదు వాళ్ల ఆదుర్దాకి కారణం. ఆ వెళ్లేవాళ్లల్లో 'మురుగా, మురుగా,' అంటూ వెళ్లిన వంటలు చేసేవాళ్లతో బాటు వాలంటీర్లు కూడా ఉండడం. అందువల్ల, కొత్తగుడి తెచ్చే ముప్పు భక్తుల సంఖ్యకి మాత్రమే గాక, వారాంతాల్లో కేవలం మంచి భోజనం దొరుకుతుందని అక్కడికి వచ్చే రక్తుల సంఖ్యకు కూడా.

గణపతి విగ్రహం సైజు ఉండే మురుగన్ విగ్రహాన్ని అక్కడే ప్రతిష్ఠించడానికి ఒప్పుకున్నామనీ, కావలసిన మార్పులని గుడి లే అవుట్లో చేయించడానికి ప్రయత్నాలు మొదలుపెడతామనీ యాజమాన్యంవారు చు కి అంగద రాయబారాన్ని పంపించారు. తను కడుతున్న గుళ్లోనే రెండూ ఉంటాయనీ, ఒక్కొక్క విగ్రహమూ ఇరవై అడుగుల ఎత్తు ఉంటుందనీ చు జవాబిచ్చి పంపాడు. 'ఇరవై అడుగుల ఎత్తుట!' అని కొత్త విగ్రహం గూర్చి మురిసిపోతూ భక్తులు తమ ఆరడుగుల ఎత్తు గణపతిని చిన్న చూపు చూస్తారని తలచి తలపట్టుకున్నారు గుడి యాజమాన్యం. పైగా, పూజార్లకి వీసాల కోసం అప్పుడే అప్లై చెయ్యడం మొదలు పెట్టాడనీ, గణపతి గుళ్లో పూజార్లు తను కట్టించే గుళ్లో పనికి కుదురుకోవాలంటే వెంటనే అప్లై చెయ్యాలనీ హనుమ రాయబారంతో చు చెప్పించాడు. దానితో బాటు, గణపతిగుడి బోర్డు మెంబర్లు తన గుళ్లో చిమ్మడం, చెత్తని తీసి అవతల పారేస్తూ ఉండడం, టాయిలెట్లు కడగడం వంటి వాలంటీర్ సర్వీసులు చెయ్యడం తనకి అభ్యంతరం లేదన్నాడు. ఆ రాయబారి ఎటు వంటి పదాల వాడుకకీ లోపం చెయ్యకుండా పరుషవాక్యాలతోనే సందేశాన్ని అందజేసినా, అతను చెయ్యనిదల్లా ఒక పెద్ద ఇనప కడ్డీని పట్టుకుని గుళ్లో వస్తువులని ధ్వంసం చెయ్యడం. ఆ కడ్డీని తీసుకెళ్లద్దని ముందస్తుగా చు చెప్పడం దానికి కారణం.

"యాభై ఏళ్ల స్థల మాహాత్మ్యం ఉన్నది మా గుడికి!" అని వాపోయారు గణపతి గుడి యాజమాన్యం.

"ఆ సంగతి నాకూ తెలుసు. ఆ మాహాత్మ్యాన్ని మీరే గుర్తించడం లేదు!" అన్నాడు చు.

❖

కొత్తగుడికి పేరేం పెట్టాలన్న ప్రశ్న ఎదురయింది. 'గణేష్-మురుగన్ టెంపుల్' అని ఒకరు సూచించారు. మహాత్మా గాంధీ రోడ్డుని కాస్తా ఎం.జీ. రోడ్డుని మార్చి పిలిచినట్లు భారతీయులకి అన్నింటినీ పొట్టిచేస్తేగానీ పలకని అలవాటు ఉండడంవల్ల దాన్ని జీ.ఎం టెంపుల్ అని పిలవడం మొదలుపెడితే, అది జనరల్ మోటార్స్ కట్టించినది అని ప్రజలు అపోహపడతారని చు వద్దన్నాడు. "మురుగన్-గణేష్ టెంపుల్ అని పెడితేనో?" అన్నారొకరు. "అది రెండు విధాలుగా కుదరదు, మొదటిది, దాన్ని ఎం.జీ. టెంపుల్ అని కుదించి ప్రజలు పలకడం, అది ఎం.జీ. రామచంద్రన్‌ని గుర్తుకు తెచ్చి కరుణానిధి పార్టీ వాళ్లు రాకపోవచ్చు, రెండవది, వినాయకుడు పెద్దవాడవడం వల్ల అతనే ముందుండాలి," అని కొందరు వాదించారు. పోనీ, "వినాయక-మురుగన్ టెంపుల్ అని పెడితే?" అన్న ఆలోచన ఒకళ్లకి వచ్చింది. దాన్ని కాస్తా కుదించి వి.ఎమ్. టెంపుల్ అనీ, తరువాత విమ్ టెంపులనీ మార్చేస్తారని అర్థమై, విమ్ అనేది బట్టలుతికే సబ్బు బ్రాండ్ పేరు గనుక వద్దన్నారు. ఎందుకంటే, "విమ్ టెంపుల్‌కి రండి, మీ పాపాలని కడిగేసుకోండి!" అన్న స్లోగన్ తెలుగులో బాగానే వున్నట్టున్నాగానీ, దాని ఆంగ్ల తర్జుమా "కమ్ టు విమ్ టెంపుల్ అండ్ లాండర్ యువర్ సిన్స్!" మాత్రం ఎవరికీ నచ్చలా.

"పార్వతీపుత్ర టెంపుల్!" అన్నాడు చు పేరుని ఖాయం చేస్తూ.

"పి.పి. టెంపుల్! బాగానే ఉన్నది," అన్నారు అన్ని భాషల వాళ్లూ.

"ముందు వినాయకుణ్ణి పెడితే అవతలివాళ్లకీ, మురుగన్ పేరు పెడితే ఇవతలివాళ్లకీ కోపాలొస్తయ్యని ఎంత తెలివిగా పేరు పెట్టారు! అందుకే మీరక్కడా, మేమిక్కడాను," అన్నారు చు భజన బృందం.

"స్టేషనరీ మీద అన్నిచోట్లా పి.పి. టెంపుల్ అని మాత్రమే ఉండాలి!" ఆజ్ఞాపించాడు చు.

"చు టెంపుల్ అని పేరు పెట్టలేదేం?" అని ప్రైవేటుగా అడిగాడు చు ఆంతరంగిక సెక్రటరీ.

"ఆలోచించు. తెలుగువాడివి కదా! అది నా పేరేనయ్యా!" అన్నాడు చు చిర్నవ్వు నవ్వి.

పి.పి. అనేది 'పవనపుత్ర'కి పొట్టిపేరని, చు అని పిలుస్తూ ఆయన అసలు పేరు 'హనుమంతు'ని మరచిపోయాడని కారులో వెడుతూ హనుమాన్ చాలీసా విన్నప్పుడు అర్థమయింది ఆ సెక్రటరీకి. రెండు చేతులూ జోడించి ఆ ఇద్దరు పవనపుత్రులకీ భక్తితో దణ్ణం పెట్టాడతను.

"పి.పి. టెంపుల్? దేరీజ్ టెంపుల్ టు గో పీపీ?" అని అమెరికాలో పుట్టిపెరుగుతున్న చిన్నపిల్లలు అడిగినప్పుడల్లా విన్న వాళ్లకి నవ్వు రాకుండా ఎవ్వరూ ఆపలేకపోయారు.

"పాపుల టెంపుల్‌కి వెడదామా?" అని ఆకతాయి భర్త లన్నప్పుడు "అదేం గుడీ?" అని మొదట ప్రశ్నించిన భార్యలు, "పా.పు.ల" అనేది గుడి పేరుని పొట్టి చేసి తెలుగులో పలికితే వస్తుందని తెలిసిన తరువాత మొగుళ్లని కసురుకున్నారు.

"పాపులు వెళ్లాల్సింది గుడికి కాదు, చర్చికి!" అన్నారు కొందరు.

"మేము అందరమూ పాపులమే! 'దుష్టులతో కూడి దుష్కర్మములు చేశా' నన్నాడు త్యాగరాజు. తనది 'పాపిష్టి బ్రతు' కన్నాడు రామదాసు. 'పాపాలు చేసి బ్రతుకుచున్నాడ!' అన్నాడు అన్నమయ్య. అంతోటి మహానుభావులే పాపులయినప్పుడు ఇంక మేమెంత? వాళ్ల దేవుళ్లే మా దేవుళ్లు కూడాను!" అని భక్తులు జవాబిచ్చారు.

❖

పి.పి. టెంపుల్‌ని ఘనంగా ఆవిష్కరించిన తరువాత, కొత్త సినిమా హాలు పక్క, కొత్త హోటలు పక్క, కొత్త షాపింగ్ మాల్ పక్క పాతవాటి ప్రభనే గణేష్ టెంపుల్ సంతరించుకుంది. అయితే, ఆ స్థల మాహాత్మ్యం కొన్ని నెలలకే బయటపడింది అక్కడ పి.పి. టవర్స్ ఫేజ్-1 వస్తోందని తెలిసినప్పుడు. భక్తులు వెంటనే అందులో అపార్టుమెంటులని కొనుక్కోవడానికి క్యూ కట్టారు కూడా. యాభై అంతస్తుల బిల్డింగ్ పైన చివరి అంతస్తులో న్యూయార్క్ సిటీ గగన వీక్షణాన్ని భక్తులకు ప్రసాదించేలా, స్వామి ఆ ప్రాంతా న్నంతా పర్యవేక్షిస్తూ, పరిపాలిస్తూ, పరిరక్షిస్తున్నానని అభయమిచ్చేలా గుడి ఉంటుంది మరి!

ఏడుకొండలవాడి గుడి అంత ఎత్తున కొండపైన ఉంటుందే గానీ, ఆ పాదాల క్రింద నివసించే భాగ్యమెవరికి దొరికింది గనుక? అదే, ఈ టవర్స్‌లో అయితే, నివసించడానికేగాక, ఆ పాదాల క్రింద పెళ్లిళ్లు చేసుకునే అవకాశాన్ని కలగజేయడానికి మారేజీ హాళ్లు, వంట చేసుకోవాల్సిన అవసరం లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు అద్భుతమయిన భోజన సౌకర్యాన్ని ప్రసాదించడానికి కేఫ్‌టేరియా, స్వామికి అభిషేకం జరిపినప్పుడల్లా ప్రతీ అపార్టుమెంటుకీ ఆ నీటిని నెత్తిన జల్లుకోవడానికో, తాగడానికో, జలకాలాట ఆడుకోవడానికో భక్తుల అభీష్టం మేరకు సప్లై చెయ్యడానికి గొట్టాలూ, ఒక్క ఎయిర్‌పోర్టునించే గాక ఊళ్లో ఎక్కడినించయినా రోజులో ఏ క్షణానయినా చేరవెయ్యడానికి కావలసిన రవాణా సౌకర్యపు వసతులూ ప్రపంచంలో ఇంకెక్కడ లభిస్తాయి? రిటయిరయి, అమెరికాలోనే ఉన్న తమ సంతతికి భారం కాకూడదనుకుని, వేరేగా ఉండడానికి వయసు పెరిగేకొద్దీ భోజనంతో సహా అన్ని వసతులూ ఉండి, ఎక్కడికీ డ్రైవ్ చెయ్యాల్సిన అవసరం లేని నివాసం దొరికేదెట్లా అని మధనపడేవాళ్లకి ఈ అవకాశం ఇంటికొచ్చి తలుపు తట్టినట్లనిపించింది.

పై అంతస్తులో ఆ పాదాలు ఆ ఏడుకొండలవాడివే అయితే బావుండేదన్నారు కొందరు. మారుతీ పుత్రుడివయితే బావుంటుందన్నారు స్వామికార్యాన్ని సదా తలచే చు అనుయాయులు. అయితే, అక్కడ ఉండేది వినాయకుడి విగ్రహమేనన్నాడు చు. "స్థల మహిమ కాకపోతే, అంతకు ముందు వినాయకుడి గుడి ఉన్నచోటే ఇంత పెద్ద కట్టడం ఎందుకు వస్తుంది? పైగా, మెట్లు ఎక్కి పైకి చేరే అవకాశం కూడా! ఎత్తులంటే భయపడేవాళ్లకి బయట కనబడనీయకుండా చెయ్యడం, ఎండాకాలంలో ఆ మార్గంలో ఎ.సి., చలికాలంలో హీటింగ్. ఎంత దూరాలోచన! ఆ దేవుణ్ణి దర్శించుకునే భాగ్యాన్ని ఆ భవనంలో ఉన్నవాళ్లకే పరిమితం చెయ్యకుండా, లిఫ్ట్‌ని ఉపయోగించే అవకాశం అందరి భక్తులకూ అని చెప్పడం, ఆహా, ఏమి ఈ భాగ్యం!" అని తన్మయులయారు భక్తులు.

అయితే, "అన్నదమ్ములిద్దరినీ సమానంగా కొలిచే భాగ్యం భక్తులకి కావాలనే గదా అసలు పి.పి. టెంపుల్‌ని కట్టింది, ఇప్పుడు మళ్లీ ఆ టవర్ పైన ఒక్క వినాయకుడి గుడి మాత్రమే ఉండడం ఏమిటి?" అన్న రంధ్రాన్వేషకులు లేకపోలేదు. ఆ రంధ్రాల సంగతి తన కెరుకేనని తెలియజేస్తూ, బిల్డింగ్ ఫేజ్-1కి ఇటు శంకుస్థాపన అవకుండానే అన్ని అపార్టుమెంట్లూ అమ్ముడయిపోయాయని తెలిసి, అక్కడ ఉండడానికి నోచుకోలేదని నిరాశ చెందిన భక్తులకి ఫేజ్-2 టవర్ ప్రస్తుతం పి.పి.టెంపుల్ ఉన్నచోట త్వరలో మొదలవుతుందని సంతోషం కలిగించే వార్తని చు ప్రకటించాడు. దాని మీద మురుగన్ టెంపుల్ ఉంటుంది. రెండు టవర్లనీ ఆ గుళ్లు ఉండే అంతస్తులో కలుపుతూ మలేషియాలోని పెట్రోనాస్ ట్విన్ టవర్లకి లాగా బ్రిడ్జ్ ఉంటుంది.

భక్తులకి లాంగ్ టర్మ్ ప్లాన్ కూడా చు తెలియజేశాడు. అలాంటివి ఇంకో రెండు టవర్లు వచ్చి చదరంలో నాలుగు మూలలా ఒక్కోమూల ఒక్కో టవర్ ఉండేలా నెలకొంటాయి. వాటిల్లో ఒకదాని మీద ఏడుకొండలవాడు, ఇంకొకదాని మీద మారుతీ తనయుడూ వసతు లేర్పరచుకుంటారు. పై అంతస్తులలో నాలుగు టవర్లనీ కలుపుతూ బ్రిడ్జీలుంటాయి. "పాపుల టవర్స్‌లో నివాసాన్నేర్పరచుకోవడానికి నాలుగు అవకాశాలు!" అని గిట్టనివాళ్లు చేసిన హేళనచేస్తారేమోనని కాదుగానీ, పి.పి. టవర్స్ పేరు మార్చి నలుగురినీ- అంటే, వినాయకుడినీ, వేంకటేశ్వరుడినీ, మురుగన్‌నీ, మారుతినీ- కలిపేలా వి.వి.ఎమ్.ఎమ్. టవర్స్ అండ్ టెంపుల్స్ అని పేరుపెట్టారు. అది కాస్తా ప్రజల నోళ్లల్లో

వి2ఎమ్2టి2 క్రిందకి మారిపోయింది.

ప్రపంచంలోని భక్తులందరికీ మాత్రమేగాక, న్యూయార్క్ లోని ఎంపైర్ స్టేట్ బిల్డింగ్, మలేషియాలోని పెట్రోనాస్, దుబాయ్ లోని బుర్జ్ ఖలీఫా, టొరంటోలోని సీఎన్ టవర్, సియాటిల్ లోని స్పేస్ నీడిల్, షికాగోలోని సియర్స్ టవర్ వంటి ఎత్తయిన కట్టడాల పైకి టిక్కెట్టు కొనుక్కునల్లా ఎక్కి చూసే యాత్రీకులకి ఇది కూడా తప్పనిసరయిన డెస్టినేషన్ అవుతుందని, తద్వారా ఆ వడ్డికాసుల వాడికి రాబడికి ఒకటే మార్గమయితే చుకి రాబడికి ఎన్ని మార్గాలో నని పలువురు విశ్లేషించి ఆయన సూక్ష్మబుద్ధిని శ్లాఘించారు.

❖

అయితే, చు ఒకటి తలిస్తే ట్రంపొకటి తలచాడు. చు ప్లాన్లో ఇండియా నుంచీ అమెరికాకి వచ్చే యాత్రీకుల సంఖ్యేకాక ఉద్యోగ రీత్యాగానీ, బంధుత్వాలవల్లగానీ వచ్చి ముందు గ్రీన్‌కార్డులూ, తరువాత పౌరసత్వమూ సంపాదించి స్థిరపడేవాళ్ల సంఖ్య క్రమంగా పెరుగుతూనే ఉంటుంది, అట్లా స్థిరపడేవాళ్లల్లో తగినంతమంది ఆ టవర్లల్లో నివాసమేర్పరచుకుంటారు. అయితే, దేశాధ్యక్షుడు ట్రంపు ఇండియానించీ వలస వచ్చేవాళ్లకి ఉద్యోగావకాశాలని తగ్గించడమేగాక, గ్రీన్‌కార్డు కోసం కనీసం పదేళ్లు వేచి వుండవలసి వచ్చేలా, బంధుత్వాలవల్ల నయితే జీవితకాలం నిరీక్షణ సరిపో నట్టుగా చట్టాన్ని తిరగరాశాడు. ఏ కారణంవల్లనయినా వీసా గడువు పొడిగించడానికి పెట్టిన అప్లికేషన్లో చిన్న తప్పున్నాగానీ దాన్ని తిరస్కరించడమే గాక వాళ్లు వెంటనే దేశాన్ని విడిచి వెళ్ల వలసి వచ్చేలా ఆజ్ఞలు జారీచేశాడు. ట్రంపు అధ్యక్షపదవి నుంచీ తొలగేదాకా ఈ మార్పుల ప్రభావం తేటతెల్లం కాలేదు. తరువాత వచ్చిన అధ్యక్షులు ముందు ఈ నిబంధనలని తొలగిద్దామను కున్నారుగానీ, "విదేశాల నుండీ వచ్చేవాళ్లతో దేశాన్ని నింపేసి ఇక్కడున్నవాళ్లకి చిప్ప మిగిల్చుతున్నారు!" అన్న ఎగస్పార్టీవోళ్ల నిందని ఎదుర్కొనవలసి వస్తుందని భయపడి ట్రంపు జారీ చేసిన ఆజ్ఞల్ని అలాగే అమలుపరుస్తూ ఉంచేశారు.

ఇంతటి విఘాతాన్ని సామాన్య మానవులు నోరు మెదపకుండా భరిస్తారుగానీ, చు వాళ్లకి పది ఆమడల దూరంలో ఉంటాడు. అతని నెట్ వర్త్ కొన్ని బిలియన్ల డాలర్లవడం దానికి కారణం. ఆ బిలియన్లు ఊరికే కూర్చోవు. ఎప్పుడూ ఇంకొన్ని బిలియన్ల తోడు కోరుకుంటాయి. వాటితో కలిసి మరికొన్ని బిలియన్లని పుట్టిస్తూనే వుంటాయి. బిలియనూ, బిలియనూ రాచుకుంటే పుట్టేది బిలియన్లే మరి! అందుకే అది కుదరనప్పుడు అవి చిందులేస్తాయి. అడ్డొచ్చినవాళ్ల అంతు చూస్తామంటూ సీమటపాకాయల్లాగా కాకుండా లక్ష్మీ అవుట్లల్లాగా పేలతాయి.

దాని ఫలితమే అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేస్తానని చు ప్రకటించడం. అతను అమెరికాలోనే పుట్టాడని ఎప్పుడో నిర్ధారణ అయింది గనుకా, అతని మొదటి పాస్‌పోర్టుని ఆ దేశమే మంజూరు చేసి, దానికి కాలం చెల్లినప్పుడల్లా తిరిగి కొత్తదాన్ని ఇస్తున్నది గనుకా అతను ఆ పోటీకి గల కనీసార్హతని ఎప్పుడో పొంది వున్నాడు. ముఖ్యమైన అర్హత డబ్బు కుప్పలు కుప్పలుగా ఉన్నది. ఇక మిగిలిందల్లా గెలవడమే! అమెరికాలోనే గాక విదేశాల్లో గూడా రియలెస్టేట్ కింగ్‌గా అతనికి ముద్రపడి ఉన్నది గనుక బిజినెసులల్లో బోల్డంతమందికి ఉద్యోగావకాశాలు కల్పించగల్గడం అప్పులు తీసుకోవడానికీ, ఇప్పించడానికీ, వాటికి కావలసిన రాత కోతల వ్యవహారాలని చేపట్టడానికీ, గుళ్లు కట్టడానికీ, అమెరికాకి వచ్చే యాత్రీకుల సంఖ్యని పెంచుతూ ఆ పరిశ్రమలోనూ తనకి సాటిలేని అర్హతగా చు ప్రకటించుకున్నాడు.

అతని పేరు గూర్చే అతని ప్రత్యర్థులు దుమ్ము రేపే అవకాశ మున్నది. ఒకపక్క దాదాపు రెండు బిలియన్ల ప్రజల వారసత్వం, ఇంకోపక్క అమెరికాతో సరితూగే ఆర్థికవ్యవస్థ ఉన్న ప్రత్యర్థి దేశం చైనావాడి పేరు. రెండింటికీ కలిపి బాణాలని గురిపెడతారని చుకి తెలుసు. చు అనేది పొట్టిపేరేగానీ గట్టి పేరు వేరే అని అతని పక్షంవాళ్లు చెబుతామన్నారు. అతను నవ్వి, " 'భారతదేశం నుండీ ఏకులా వలస వచ్చి స్థిరపడి ఆర్థికంగా సామాన్య ప్రజానీకానికంటే ఎంతో ఉన్నత స్థితిలో మేకులా తయారయిన ప్రజల ప్రతినిధుల డీఎన్ఏ కలిగినవాడు!' అని వోటర్లకి కంటగింపు కలిగించడానికి ప్రతిపక్షులు ఎలాగూ ప్రచారం చేస్తా"రన్నాడు. మరి మార్గమేమి టన్నారు అతని అనుయాయులు.

"ముచ్చటగా మూడవ పేరు. హాన్. మై నేమ్ ఈజ్ హాన్! ఇది అమెరికా వోటర్లకి నోరు తిరిగే పేరు. స్టార్ వార్స్ హీరో పేరు గనుక బాగా పరిచయమయిన పేరు. నా పేరులో ఉన్న మొదటి మూడక్షరాల కూర్పే. వోట్ ఫర్ హాన్! ఛార్లెస్ డికెన్స్ అన్నట్లు ఇది అమెరికాకి అత్యుత్తమ కాలం," అన్నాడు చు.

అతని ప్రత్యర్థులు ఏమంటారో మనకెందుకు?



తాడికొండ శివకుమార శర్మ పుట్టింది, చదివింది గుంటూర్‌లో. ఐఐటి మద్రాస్‌లో బి.టెక్, రట్గెర్స్ యూనివర్సిటీ, న్యూజెర్సీలో మాస్టర్స్, పిహెచ్.డి. చేశారు. భార్య మల్లిక, పిల్లలు విరించి, మహతిలతో ఇరవయ్యేళ్లుగా వాషింగ్టన్ డి.సి. దగ్గర్లో నివాసం. ముప్పైకి పైగా కథలు రాశారు. నటించడం, కర్ణాటక సంగీతసాధన అభిరుచులు.

పడమటి తీరాన ఓ కోయిల

శ్రీనిధి యల్లు



ఏ ప్రత్యేకతా లేని ఒక మాములు బుధవారం. మెల్లగా ఒక్కొక్కరే వచ్చి తమ తమ సీట్లలో కూర్చుంటున్నారు. గుడ్ మార్నింగ్ పలకరింపులు, చిరునవ్వులు, తల పంకింపులు అన్నీ అయ్యాక తమ తమ పనులలో బిజీ అవుతున్నారు. కేలండర్‌లో ఇంకో రోజు కరిగిపోడానికి సిద్ధపడుతోంది.

ఎప్పుడూ పని తప్ప ఇంకో ధ్యాస లేదు అనేట్టు ఉండే అనిత, ఆరోజు ఎక్కడో ఏవో ఆలోచనల్లో చిక్కుకుపోయి నట్టు కనపడుతోంది. మాటిమాటికీ కిటికీలోంచి ఎక్కడికో లాగేస్తోన్న చూపులని బల వంతాన స్క్రీన్ పైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. తను రోజూ ఎంతో గర్వంగా కూర్చునే సీట్ ఆరోజు ఎందుకో గుచ్చుకుంటున్నటుగా అనిపిస్తోంది. ఇన్నేళ్ల కెరీర్‌లో సాధించిన ప్రాజెక్టులకి, చేరిన టార్గెట్లకి గుర్తుగా వచ్చిన మొమెంటోలు, సావనీర్లతో ఎంతో ఆర్టిస్టిక్‌గా పెట్టుకున్న తన క్యూబికల్ ఈరోజు ఇరుగ్గా తోస్తోంది ఆమెకి.
కీ బోర్డు మీద టకటకలాడే చేతులు, మెల్లిగా శబ్దాలు చేసే ప్రింటర్లు, ఫాక్స్ మెషిన్లు, ఇటు అటూ తిరుగుతూ ఉండే కొలీగ్స్... ఈ హడావిడి వాతావరణం అంటే ఎంతో ఇష్టం అనితకి. తను ఎంతో కష్టపడి చేరుకున్న స్థానానికి చిహ్నాలు ఇవన్నీ. కానీ ఈ రోజొందెందుకో ఈ శబ్దాలు, ఈ హడావిడి అంతా గందరగోళంగా, ఊపిరాడని ఇరుకు గదిలో చిక్కుకుని పోయినట్లుగా తోస్తోంది ఆమెకి. ఆఫీస్ రూమ్ అంతా కుదించుకుపోయి, నాలుగు వైపుల నుండీ తనని ముంచేస్తున్న భావన. ఊపిరాడని, కంటికి కనపడని నిర్బంధం.

డెస్క్ పైన ఒక మూలగా పెట్టిన ఫ్రేములో ఆనందంగా, ఏ కల్మషం లేకుండా గుండెలనిండుగా నవ్వుతున్న ఇద్దరు పిల్లల ఫోటో. అనిత పిల్లలు వాళ్లు. నిహాల్, నేహా. ముఖ్యంగా నేహా కళ్లల్లో ఆ చిలిపిదనం, పద్దెనిమిదేళ్ల ప్రాయపు ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయి. కాసేపు అలా తన ఇద్దరు పిల్లల ఫోటోని చూస్తే చాలు అప్పటివరకు ఉన్న స్ట్రెస్ అంతా ఎగిరిపోయి నిమిషంలో హుషారు వచ్చేస్తుంది అనితకి. కానీ ఈరోజు అందుకు వేరుగా ఉంది ఆమె పరిస్థితి. అందుకు కారణం నిన్న రాత్రి అనుకోకుండా విన్న నేహా మాటలు.

"హలో, అమ్మా. థాంక్స్ అమ్మ. నేనే చెప్దామనుకున్నాను. ఇంతలో ఎలా తెలిసిపోయింది నీకు?" నేహాకి అండర్ గ్రాడ్యుయేషన్ సీట్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో వచ్చిందని అమ్మకి చెప్పాలనుకున్న వార్త ముందుగానే అమ్మకి తెలిసిపోయిందనే ఆశ్చర్యం, ఆశాభంగం కలగలిపి అడుగుతోంది అనిత.

"నేహా వాట్సాప్ చేసింది నాకు. సో ప్రౌడ్ ఆఫ్ హర్. వాళ్ల తాతయ్య గిఫ్ట్ ఇస్తాను అంటే, తనకి ఏం కావాలో ఆలోచించుకుని చెప్తాను తాతయ్య అని చెప్పిందిట."

"ఓ. నైస్. అవును మా. అప్పుడే తను తీసుకోవాలకున్న కోర్సెస్, డార్మ్‌కి కావలసిన సామాను, ఫ్యూచర్ ప్లాన్స్ అన్నీ కూడా ఒక జర్నల్‌లో ప్లాన్డ్‌గా ఆర్గనైజ్ చేసి పెట్టుకుంది. మేము జస్ట్ మోరల్ సపోర్ట్ ఇస్తే చాలు. ఉంటానమ్మా బై," అంటూ ఫోన్ పెట్టేసి నేహాని డిన్నర్‌కి లాక్కొద్దామని పార్టిషన్ డోర్ తెరిచింది అనిత. బాల్కనీలో నిల్చుని తన విజయాన్ని తన చిన్ని ప్రపంచంతో పంచుకోవా లని ఆరాటపడుతూ, ఆగకుండా వస్తున్న ఫోన్లతో, మెసేజీలతో కుస్తీ పడుతోంది నేహా. అనుకోకుండా అలా రావడంతో నేహా మాటలు చెవినపడ్డాయి అనితకి.

"మై పేరెంట్స్... నో వే... దే ఆర్ సో బోరింగ్ మాన్," అంటూ భుజాలు కదిలిపోయేలా నవ్వుతోంది నేహా.

ఎంత మోడరన్ పేరెంట్స్ అయినా, ఒక్క నిమిషం మనసు చివుక్కుమంది అనితకి. అలికిడికి వెనక్కి తిరిగి అమ్మని చూసి, "ఒక టూ మినిట్స్ మా," అని గోముగా సైగ చేసింది.

ఫోన్ పెట్టేసి ఇవతలికి వచ్చి తల్లిని వెనగ్గా గట్టిగా కౌగిలించుకుంది. సంతోషం వచ్చినా దుఃఖం వచ్చినా పట్టలేని వయసు అది. పిల్లలకి వడ్డించి తను కూడా కూర్చుంది అనిత.

"మా... నాన్న రాలేదా ఇంకా?" నిహాల్ అడుగుతున్నాడు.

"కాస్త బిజీ వర్క్ అంట. లేట్ అవుతుంది అన్నారు. వీకెండ్ ఫామిలీ డిన్నర్‌కి వెళ్దాం అన్నారు. అక్క సక్సెస్‌ని సెలెబ్రేట్ చేసుకోవాలి కదా!" పిల్లల్ని చూస్తూ సంజాయిషీగా అంది అనిత.

"ఆస్ ఆల్వేస్!" అంది నేహా భుజాలెగరేస్తూ. తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ చూపిస్తూ, "అమ్మా మా ఫ్రెండ్, వాళ్ల పేరెంట్స్ డాన్స్ చేస్తున్న వీడియో షేర్ చేసింది. ఎంత బాగా డాన్స్ చేస్తున్నారో చూడు. సో క్యూట్ కదా! దాట్స్ సో రొమాంటిక్! ఈరోజు మా గ్యాంగ్‌లో అంతా ఈ టాపిక్కే నడి చింది," గలగలా పారే సెలయేరులా చెప్తూనే వుంది నేహా.

ఓ ఇదన్నమాట ఇందాక తమకి 'బోరింగ్' అన్న బిరుదు రావడానికి కారణం అనుకుంది అనిత.

పిల్లలంతకై పిల్లలు చెప్తే కానీ ఏదీ రెట్టించి అడగడానికి లేదు. మనసుకి, నోటికీ ఏ ఫిల్టర్ లేకుండా మాట్లాడేస్తారు. ఏమాత్రం అటూ ఇటూ తూలి మాట్లాడినా హర్ట్ అయి పోతారు. రకరకాల జాతుల పేరెంటింగ్ మధ్య పెరిగిన పిల్లలతో స్నేహాలు. ఏ మాటకి ఎలా అర్థం తీసుకుంటారో తెలీదు. ఆచి తూచి ఉండక పోతే లేత హృదయాలు ఎటు దారి తప్పుతాయో అనే భయం. పేరెంటింగ్ లో కూడా అప్‌డేట్ అవుతూ జాగ్రత్తగా నెట్టు కొస్తోంది.

అలా నేహా నోటి వెంట వచ్చిన 'బోరింగ్' అనే పదం దగ్గరే ఆగిపోయింది అనిత మనసు. ఎంతో పాజిటివ్ ఆటిట్యూడ్‌తో ఉంటూ కెరీర్ వైస్‌గా, సోషల్ సర్కిల్ వైస్‌గా ఆక్టివ్‌గా ఉంటూ చాలా సంతోషంగా లైఫ్ లీడ్ చేస్తున్నాను అనుకుంటున్న అనితని ఆలోచనలో పడేసింది ఆ మాట. ఒక్కసారి మళ్లీ ఫోటోలో ఉన్న 'నేహా' వైపు చూసింది. అంతా తన పోలికే. ఇరవయ్యేళ్ల క్రితం తనని తాను చూసుకున్నట్లే ఉంది అనితకి. అప్పటి తనలో ఎంతటి హుషారు, ఎంతటి చలాకీతనం. ప్రపంచంలో ఉన్న జీవశక్తి అంతా తనలో ఉందా అన్నట్టు ఉండేది. ప్రకృతిలో ఉండే ప్రతి చిన్న సంగతీ తనని స్పందింపచేసేది. కోయిల కూసినా, గాలికి కొబ్బరాకు గలగలలాడినా కదిలిపోయేది. మబ్బు మసకేసి వెన్నెలని దాచేస్తే బాధపడేది. అమ్మమ్మ ఇంట్లో పాలు పిండడానికని ఆవు

దగ్గర పొడిచి పొడిచి పాలు తాగుతున్న దూడని లాక్కెళుతుంటే ఎంతలా విలవిలలాడేదని. మళ్లీ పాలు పిండేసాక వదిలిన దూడ తోక ఎత్తి పరుగు పరుగున తన అమ్మని చేరితే అంతే సంబర పడేది. ఏమైపోయింది ఆ అనిత. తను ఎక్కడ ఉంటే అక్కడ సందడి సందడి చేసే అనిత, గట్టు తెగిన గోదారిలా కబుర్లు చెప్పే అనిత, చెట్టుని పుట్టని ప్రతీ పిట్టనీ స్నేహంగా పలకరించి మురిసే అనిత, ఏమైపోయింది. కాలం గిర్రున తిరిగీ తిరిగీ ఇదిగో ఇక్కడ ఇలా నిలబెట్టింది తనని... 'బోరింగ్' అనితగా. ఇక ఒక్క నిమిషం కూడా ఆఫీస్‌లో ఉండలేకపోయింది. ఇంకాసేపు ఇక్కడే ఉంటే పిచ్చెక్కిపోయేలా ఉందని, బాస్‌కి ఒంట్లో బాగోలేదని మెయిల్ పెట్టి, కిందవారికి ఇవ్వాల్సిన వర్క్ ఇచ్చేసి బయటపడింది.

ఇంటికి వచ్చేసి స్ట్రాంగ్‌గా కాఫీ చేసుకుని గార్డెన్‌కి ఎదురుగా బీన్ బాగ్ వేసుకుని కూర్చుంది అనిత. నేహా 'బోరింగ్' అన్నందుకు బాధలేదు తనకి. ఇప్పటి పిల్లలు అంతే, ఏదీ మనసులో పెట్టుకోరు. 'ఐ హేట్ యూ మామ్' అని తలుపులు ధడేలున మూసిన బిడ్డ, పది నిమిషాల్లో 'యూ ఆర్ ది బెస్ట్' అని హత్తుకోవడం తెలుసు తనకి. తను ఇప్పుడాలోచిస్తోంది తనకి తెలీకుండా తాము 'బోరింగ్' ఎప్పుడు అయ్యామా అని! పిల్లలు పుట్టి బాధ్యతలు పెరిగాక పెద్దరికం తెచ్చుకుని, హుందాతనం ముసుగు వేసుకున్నాకా? లేక పిల్లల్ని బాగా చూసుకోవాలి, మంచి లైఫ్ ఇవ్వాలి అని తమని తామే డబ్బు అచ్చు చేసే యంత్రాల్లా మార్చేసుకున్నాక? లేక ఆనందం అంటే వీకెండ్‌లో ఒక ఫ్యామిలీ డిన్నర్, సమ్మర్‌లో ఒక వెకేషన్, సోషియాలజీ ప్రాజెక్ట్‌లో భాగం అయినట్టు ఒక ఇండియా ట్రిప్, అని లెక్కలు వేసుకుని గుడ్డిగా ఆ రూల్స్‌ని యాంత్రికంగా ఫాలో అయిపోతున్నందుకా?

కాదు. ఇందుకు కాదు. నేహా అన్నది మా 'ఇద్దరినీ.' పిల్లలు, కుటుంబం, సోషల్ లైఫ్, వర్క్ లైఫ్ ఇన్నిటిని మానేజ్ చేస్తూ ఒకరి నొకరం మర్చిపోయిన మమ్మల్ని. ఎదుగుదలని బ్యాంకు బాలన్స్‌తో, స్థిరాస్తుల పోగుతో ముడివేసి, మొబైల్ రిమైండర్లతో అనుబంధాలని మెయింటైన్ చేస్తూ, అలారం మోతలకి, లంచ్ బాక్స్‌లకీ, పిక్ అండ్ డ్రాప్‌లకీ, గ్రోసరీ షాపింగులకి మధ్య నలిగిపోయిన తమ బంధాన్ని. ఒకే కప్పు కింద ఉంటూ హడావిడిగా, ఎవరో చెప్పిన ప్రామాణాలకి తగట్టు బతకడానికి పరుగులెడుతూ ఒకరినొకరం మర్చిపోయిన మమ్మల్ని. మబ్బులు తొలగి బయట పడ్డ సూర్యకాంతిలాగా అసలు కారణం ఏంటో అర్థం అయింది అనితకి.

చకచకా ఏదో గుర్తొచ్చిన దానిలా పరుగున వెళ్లి స్టోరేజ్‌లో ఉన్న బాక్స్ ఒకటి తెరిచింది అనిత. గడిచిన జీవితం తాలూకు జ్ఞాపకాలు పేరుకుపోతూ రాగా, కొత్త వాటికి చోటివ్వడానికని జాగ్రత్త చేసిన ఒకప్పటి ప్రియమైన వస్తువులు. అడుగున ఎక్కడో ఉంది తాను వెతుకున్నది. చేతుల్లోకి తీసుకోగానే తనతో పాటు ముడివేసుకున్న అనుభూతుల వెంట పరుగులు తీయించిన చీర, తన పెళ్లిచూపుల నాటి చీర. ఒక్కసారి ఆ చీర మెత్తదనాన్ని బుగ్గలకి తాకించుకుంది, ఇన్నేళ్లు మర్చిపోయిన తనలోని ఒకప్పటి అనితని వెతకడానికా అన్నట్టు! లేత కనకాంబరం రంగు షిఫాన్ చీర. సన్నని బంగారపు అంచు ఉన్నది. ఆరోజు తనకి బాగా గుర్తు పిన్నులతో ఎక్కడా జారిపోకుండా పకడ్బందీగా చీర కట్టుకుని, ఇంత బారు జడలో ఒకేఒక్క రోజాపూవు పెట్టుకుని కాటుక దిద్దుకుంటుంటే, వెనగ్గా వచ్చి నిల్చున్న అమ్మ అలాగే కాసేపు చూస్తూ నిలబడిపోయింది. అప్పుడప్పుడూ తను నేహాని చూస్తుందే అచ్చం అలాగే... తమలో మాయమైన భాగమేదో తిరిగి ప్రాణం పోసుకుని తమ కళ్ల ముందే తిరుగాడుతుంటే సంభ్రమంగా చూస్తున్నట్టు.

ఆరోజు కలిసింది అతన్ని. 'పెళ్లిచూపుల్లో కొన్ని నిముషాలు మాట్లాడుకుని ఎలా డిసైడ్ చేసుకుంటారమ్మా పార్టనర్ని?' అని నేహా అప్పుడప్పుడు ఆశ్చర్యపోతుంటుంది. ఏమో ఎలా తెలిసింది తనకి? తన ఒరవడిని తట్టుకుని నిలకడని ఇవ్వగలడు అతను అని. ఏదన్నా మాట్లాడాలంటే మాట్లాడుకోండి అని పెరట్లోకి పంపించినప్పుడు, నందివర్ధనం చెట్టు కింద మౌనంగా ఉన్న రెండు నిముషాలు, కొబ్బరిచెట్టు కింద చూపులు కలిపిన క్షణాలు, తరువాత సన్నజాజి పందిరి దగ్గర విరిసిన నవ్వులు. ఆ మొదటి చూపుల్లో ఎంత మాయ ఉందనీ. నూరు వరహాల చెట్టు పక్కగా ప్యాంటు జేబులో చేతులు పెట్టుకుని ఒక కాలు పెరటివైపు గోడకి ఆనించి ఏవో మాట్లాడుతున్న అతన్ని, బట్టలుతికే రాయిపైన కూర్చుని అత్యంత శ్రద్ధగా విన్ననన్నూ ఎలా మరచిపోయాను?... అనుకుంటూ మర్చిపోయిన ఆనాటి రోజులని, తమ బంధాన్ని సమీక్షించుకుంటోంది అనిత.

పదినిమిషాల మాటల్లోనే ఎంత దగ్గర మనిషి అనిపించాడు. ఎలా తెలిసింది తనకు? అప్పటి మొదలు ఇద్దరం కలిసి ఎన్ని జ్ఞాపకాలని పోగుచేసుకున్నాము. పెళ్లి వరకు ఉన్న మూడు నెలల వ్యవధిలో ఎన్నెన్ని ఊసులు, ఎన్నెన్ని కబుర్లు. సంతోషానికి, అల్లరి నవ్వులకి, చిరునామాలా ఉండేవాళ్లం. ప్రపంచం మొత్తం ఉన్నది మమ్మల్ని ఆనందింపజేయడానికే అన్న ధీమా. అసలు మేమే ప్రపంచం అనుకునేంత వెర్రి ప్రేమ. ఈ చనువుతో జరిగిన పెళ్లి. ఇద్దరు వేరు వేరు వ్యక్తులు అన్న భావనే లేదు అసలు. తప్పిపోయిన రెండు జిగ్ సా పజిల్ ముక్కల్ని కనిపెట్టి అతికించినంత సులువుగా కలిసిపోయాం. ఎక్కడ చూసినా మేమే, ఎటు చూసినా ప్రేమే అన్నట్టు ఉండేవాళ్లం కదూ. ఎటెళ్లిపోయాడు తను?

గుండెలపైన గుప్పెడు మల్లెలు చల్లినట్టు నవ్వేవాడు. ఒక సారి సెలయేటి ప్రవాహంలా, ఒకసారి సముద్రపు ఉప్పెనలా ఎన్నెన్ని రకాలుగా తనని ప్రేమించేవాడనీ. ఆ జలపాతపు హోరులో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే వెంటనే ప్రశాంతమైన కొలనులా అక్కున చేర్చుకునేవాడు కదూ. ఏమైపోయాడు తను? అతను కూడా తనలో మాయమైన భాగాన్ని వెతుక్కుంటున్నాడా? అసలు తను మారిపోయాడన్న ఆలోచన అయినా వచ్చిందా తనకి. నాకు మాత్రం వచ్చిందా? ఎదురెదురుగా ఉంటే చాలు, కలసి ఒక ఇంట్లో ఉంటే చాలు అనుకునే స్టేజ్‌కి ఎప్పుడు వచ్చాము అసలు? చీర మడతల్లోంచి జారిన ఫోటో ఒకటి చేతిలోకి తీసుకుంది. పెళ్లైన కొత్తల్లో కాశ్మీర్‌లో తీసుకున్నది. కాశ్మీర్ బట్టల్లో, చేతిలో బుట్టతో అందంగా నవ్వుతున్న తనని, అతను వెనుక నుండి వాటేసుకుని తీసుకున్న ఫోటో.

ఎన్ని రోజులైంది అతను ఇలా నవ్వి? గుర్తుచెయ్యాలి... తనకే తెలీకుండా ఎంతలా మారిపోయాడో గుర్తుచెయ్యాలి. అప్పటి అల్లరి నవ్వులని ఒకసారి గుర్తు చెయ్యాలి, అనుకుంది. అనుకున్నదే తడవుగా వెంటనే లేచి ఫ్రెషప్ అయింది అనిత. పెళ్లిళ్ల

కోసమో, పార్టీల కోసమో, ఆఫీస్ మీటింగుల కోసమో కాకుండా అచ్చంగా అతనికోసమే రెడీ అయింది. నిజమే! అతనికోసం, తనని కలవడం కోసం మాత్రమే రెడీ అయ్యి కూడా ఎన్ని రోజులైంది. ఇష్టమైన వారిని కలుసుకునే క్రమంలో ఉండే ఉద్విగ్నత అనుభవించి ఎన్ని రోజులైంది. అనిత అతన్ని కలవడంకోసం బయల్దేరింది. తెలియని సంచలనం ఏదో సీతాకోక చిలుకల రెక్కల సందడిలా కొట్టుకో వడం మొదలయ్యింది కడుపులో. ఇప్పటికిప్పుడు అతని చేతుల్లో వాలిపోవాలనే ఆతృత నెలకొంది. ఇంకో గంట గడిస్తే కానీ చేర లేను అతన్ని, అనే ఆలోచనే భరించ లేకపోతోంది. ఇన్నేళ్లు గంటలు గంటలు క్షణాల్లా దొర్లించేసిన తను, మళ్లీ క్షణాలు యుగాల్లాగా తోస్తున్న ఈ బాధని సరికొత్తగా అనుభవిస్తోంది. చూడాలి, అతన్ని చూడాలి అన్న ఆలోచన మాత్రమే. కారు తీసి అతని ఆఫీస్ అడ్రెస్స్ గూగుల్ మ్యాప్స్‌లో పెట్టి, తన మనోవేగంతో సంబంధం లేని ట్రాఫిక్‌లో బయలు దేరింది అతని దగ్గరికి.

దారి పొడవునా తాను ముందుకు వెళ్తుంటే ఇన్నేళ్లలోని జ్ఞాపకాలు, సంతోషపు క్షణాలు ఒక్కొక్కటే పలకరించి నవ్వుతూ వెనక్కి వెళ్లిపోతున్నాయి, ఇంకాస్త విరహాన్ని పెంచుతూ. పెళ్లికి ముందు ఎవరికీ చెప్పకుండా ఒకసారి ఊరిచివర తోటలోని శివాలయానికి వెళ్లిన సంగతి గుర్తొచ్చింది అనితకి. కాలేజ్ అయిపోయే సమయానికి ఇంటికి చేరొచ్చులే అని. ఎవరికి తెలుసు వాళ్లు వచ్చిన బైక్ ఫెయిల్ అవుతుందనీ. ఆ బైక్‌ని పూజారి గారింట్లో వదిలేసి ఆ ఊరుగాని ఊరిలో లాస్ట్ బస్సు పట్టుకుని ఇంటికి చేరేసరికి పది గంటలు. రాత్రి తొమ్మిది తర్వాత ప్రపంచం ఎలా ఉంటుందో తెలీని నాన్న పెంపకం. 'ఇంటికి వెళ్లను, నాన్నను చూడ లేను ఎట్లైనా పారిపోదాం,' అని రాగాలు తీస్తున్న తనని ఇంటికి తీసుకుని వచ్చి దింపాడు. అగ్నిహోత్రంలా ఉన్న నాన్నని దాటుకుని లోపలికి పరిగెట్టి అమ్మతో మొట్టికాయలు తిని బయటికి వచ్చి చూసేసరికి ఏముంది, ఏమి చెప్పాడో ఏమో ఇద్దరూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు. అతను వెళ్లాక నాన్న నా తలపై ప్రేమగా నిమిరి నిశ్చింతగా చూసిన చూపు మరచి పోగలనా! విడిచి వెళ్లే ప్రతిసారీ 'ఉంటాను అమ్మాయ్!' అంటూ తన చేతిలోకి నా చెయ్యి తీసుకుని నొక్కి వదిలే ఆ ప్రేమని ఎలా మర్చి పోయాను. నా కోసం, మా కోసం, ఇప్పుడు కుటుంబం కోసం తనని తాను మరచిపోయి పరుగులు తీస్తున్న మనిషిని ఎలా మర్చి పోయాను ఇలా ఒక్కసారిగా అతని గురిం చిన ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా శరీరంలో ప్రతి అణువు నిద్రలేచి మరీ అతనికోసం చూస్తున్నట్టు అనిపించింది అనితకి.

సాయంకాలం తీసుకునివచ్చే చీకట్లకి తన దగ్గర తావు లేదన్నట్లుగా నియాన్ లైట్ల వెలుగుల మధ్య ముస్తాబయ్యి మెరిసి పోతోంది శాన్‌ఫ్రాన్సిస్కో నగరం... తనలాగే ఎవరో ప్రియమైన వారికోసం ఎదురుచూస్తున్నట్లుగా. కార్ పార్క్ చేసి మెసేజ్ చేసింది తనకి. రిప్లై వెంటనే రాదు... తనకు తెలుసు. ఆఫీస్... బిజీ... బ్లా బ్లా బ్లా!

మామూలుగా అయితే చికాకుపడేదే... 'ఎప్పుడూ ఏమి పట్టించుకోడని'... అందుకే కదా తాను కూడా అంతే బిజీగా మారిపోయింది. ఇప్పుడు చికాకు లేదు. పందొమ్మిదేళ్ల క్రితం అతని కోసం కాలేజ్ బస్టాప్ దగ్గర ఎదురు చూసినప్పటి ఉద్వేగం తప్ప.

కాల్ చేసింది!

కట్ చేశాడు!

చేస్తాడని తనకు తెలుసు, మీటింగ్‌లో ఉండి ఉంటాడు. తను మళ్లీ చెయ్యకపోతే అసలు కాల్ చేశానన్న విషయం కూడా తనకి గుర్తుండదనీ తెలుసు.

ఈ బిజీనేగా తమని మార్చేసింది, పంతాలకి పోయేలా చేసింది. 'డిపెండెన్సీ', 'ఇండిపెండెన్సీ' అని ఏవేవో తమ మధ్యలోకి తీసుకుని వచ్చి ఈగోలని పెంచింది.

కానీ ఈసారి కోపం రాలేదు, అసహనం అస్సలే లేదు. 'పట్టించుకోడు, అందరి మగాళ్లలాంటి వాడు' అని ఒక తాటికి కట్టేసి తిట్టుకోలేదు ఈసారి. ఎదురుచూసింది.

పెళ్లయ్యాక మొదటిసారి అమ్మావాళ్ల దగ్గరికి వెళ్లినప్పుడు తనని తీసుకెళ్లడానికి వస్తానన్న ఈ మనిషి కోసం ఒళ్లంతా కళ్లు, చెవులు చేసుకుని, పరధ్యానంగా ఉండి అమ్మ దగ్గర చివాట్లు తిని ఒకప్పుడు ఎదురుచూసినంత ఓపికగా ఎదురుచూస్తోంది ఇప్పుడు.

ఏ రెస్పాన్సు లేదు... ఉండదు, తెలిసిందే కదా మనంత మనం తెచ్చిపెట్టుకున్న బిజీ.

మళ్లీ కాల్ చేసింది... వాయిస్ మెయిల్.

ఇంకోసారి...!

ఈసారి ఒక మెస్సేజ్. " ఈజ్ ఎవెరీథింగ్ ఆల్ రైట్? బిట్ బిజీ! ఎనీ ఎమర్జెన్సీ?" అని.

"ఎస్... అర్జెంట్. వెంటనే ఇప్పటికిప్పుడు నిన్ను చూడాలి."

"కమాన్! ఆర్ యూ ఓకే! మిడ్ వీక్ ఇష్యూస్‌లో ఉన్నాను."

"మీ ఆఫీస్ దగ్గరగా ఉన్నాను... వస్తావా! ఉహు... రా... రావాలి... రా చిన్నా!" టైప్ చూస్తుంటేనే గొంతులో ఏదో అడ్డొచ్చినట్టు ఉంది అనితకి. ఎన్ని ఏళ్లైయింది అలా పిలుచుకుని.

వెంటనే మోగింది తన సెల్... 'నాకు తెలుసు... అతను మర్చిపోలేదు మరిచిపోలేడు కూడా. నేనే గుర్తుచెయ్యలేదు ఇన్ని రోజులు. గుర్తుతెచ్చుకునే అవకాశం ఇవ్వలేదు ఎప్పుడూ,' అనుకుంటూ తనలో చెలరేగుతున్న సంచలనాన్ని అదుపుచేసుకుంటూ ఫోన్ ఎత్తింది అనిత.

"ఆర్ యూ సీరియస్... శాన్‌ఫ్రాన్సిస్కో వచ్చావా?"

"హ్మ్మ్"

"ఎక్కడున్నావ్"

"మీ ఆఫీస్‌కి ఎదురుగా... నార్త్ సైడ్ వస్తున్నా."

ఆపైన కట్ చేసేశాడు.

పెయిడ్ పార్కింగ్‌లో కార్ పెట్టి నడుస్తోంది అనిత వడి వడిగా. ఎత్తులు పల్లాల మీద కట్టిన శాన్‌ఫ్రాన్సిస్కో నగరం. ఎటు వైపు చుసినా ఆకాశాన్ని అంటే అద్దాల మేడలే. తన కోసం వస్తానన్న రాకుమారుడు అలసిపోయి ఎంతకీ రాకపోయేసరికి అతని కోసం అడ్డాలమేడలోంచి రాకుమారే వెళ్లింది ఈసారి.

ఈ కింది నుండి ఏటవాలుగా ఆ పైకి ఒక ఐదు నిముషాలు నడిస్తే అతని ఆఫీస్. పెడిస్ట్రియన్ సైన్ పడగానే హడావిడిగా

పరుగులు పెడుతున్న జనం. వారి మధ్యలో నడుస్తూ, చిన్నగా పరిగెడుతూ వెళ్తోంది. అదిగో అక్కడే ఉన్నాడు అతను, ఆ పైన. మబ్బుల పువ్వుల్లాంటి చెర్రీపూల చెట్టు కింద, తోరణంలా వేళ్లాడుతున్న ఎలక్ట్రిక్ బల్బుల కింద. అనిత కనపడగానే రెండు చేతులు జుట్టులోకి పోనిచ్చి ఆశ్చర్యంగా సంభ్రమంగా ఆమెవైపు చూస్తూ. అడుగుల దూరానికి వచ్చేశారు. చెయ్యి చాపాడు. అందుకోకపోతే ఇదంతా కలలోలాగా ఎక్కడ మాయమైపోతుందో అన్న భయంతో వణికే కాళ్లతో ఎక్కడ పడిపోతానో అన్న ఆత్రుతతో వెంటనే అతని చేతిని అందుకుంది అనిత. అందుకోగానే అప్పటి వరకు తాను పడ్డ సంఘర్షణని మాటల్లో చెప్పలేను అన్నట్టుగా గట్టిగా కౌగిలించేసుకుంది. ఏ భాషకీ అందని ఊసులు ఏవో కలబోసుకోవాలి అన్నట్టు కలిసిన పెదవులు. విడివడుతూ ఉండగా చూసింది అతని కళ్లలోకి, తాను వెతుకుతున్న దాని కోసం. జుట్టు పలచబడినా, కొలతలు మారినా ఏ కాలం ఎన్నటికీ మార్చలేని ఆ కనులలో మెరుపుని. అప్పటి అనితకి 'ఇతను తనకోసమే' అన్న భావన కలిగించిన ఆ చూపుని. ఇన్నేళ్లు తాను చూడడం మర్చిపోయిన, చూడాలి అనుకోవడం కూడా గుర్తులేకుండా పోయిన ఆ మెరుపు. అదిగో. తనలో ఉన్న పాత 'అనీ'ని మేల్కొల్పే తను.

"మిస్ యూ, చిన్నూ! మిస్డ్ మైసెల్ఫ్ టూ!" అంటూ అతని గుండెల్లో ఒదిగిపోయింది అనిత.

ఎలా వచ్చిందో, ఎవరు తెచ్చారో... ఎక్కడో దూరంగా తూర్పు వైపు నుండి వచ్చిన కోయిల ఒకటి ఈ పడమటి తీరాన తియ్యగా కూస్తోంది.




శ్రీనిధి యల్లల స్వస్థలం చిత్తూరు జిల్లా పీలేరు. కథలు, వ్యాసాలు రాసే వీరు సాయంకాలం కబుర్లు అనే బ్లాగు నిర్వహిస్తున్నారు. భర్తతో కాలిఫోర్నియాలో నివాసం.

SmartDeck
SOLUTIONS
IT&HEALTHCARE STAFFING

లోపలి చొక్కా

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి



మబ్బిగలో సద్దన్నం పిసుక్కొని ఉల్లిగడ్డ నంజుకొంటూ కడుపు నిండా తాగి లేచాడు రామయ్య.

బైటకు నడిచి ఇంటి ముందు అరుగుమీద కూచున్నాడు.

పక్క జేబులోంచి వక్క తీసి అటు ఇటు నోటితో వూది, పళుక్కున సగం కొరికి మిగతా సగాన్ని జేబులోకి జార్చి, ఆకు తీసి నోటబెట్టుకొని, సున్నపుకాయలోంచి కొద్దిగా సున్నాన్ని గోట తీసి నాలుక్కి రాసుకొన్నాడు. పొగాకు చెక్క మొద్దుల్ని నోట కొరికి దవడకు చేర్చాడు.

కోడలు దొడ్లో ఏదో పని చేసుకొంటూ వుంది.

మనవడు టౌను బడికి వెళ్లినట్టుంది.

మనవరాలు పలక మీద రాసుకొంటూ వుంది- వూర్లో బడికి సిద్ధమవుతూ.

వక్కాకు నములుతూ ఆలోచనల్లో మునిగిపోయాడు రామయ్య.

దారిన వెళుతూ వున్న మనిషి పలకరించినా స్పందించలేదు.

కొంతసేపటికి ఆలోచనల్నించి తేరుకొని అరుగుమీంచి లేచాడు.

ఊపిరి గట్టిగా వదలుతూ, చేయి విదిలిస్తూ, 'అంతే...' అనుకొన్నాడు.

ఇంట్లోకి నడిచాడు.

గూట్లోని ఉతికిన బట్టల్ని కెలికితే పంచె, చొక్కా దొరికాయి.

ఒంటి మీది బట్టలు మాసిపోయి వున్నాయి.

ఉండేది రెండు జతలే.

కట్టుకొన్న పంచె విప్పి, ఉతికిన పంచెతో జతచేసి రెంటిని కలిపి కట్టుకొని గోచి చెక్కాడు. మాసిన చొక్కాపైన ఉతికిన చొక్కా తొడుక్కొన్నాడు.

లోపలిచొక్కా, పంచె బైటకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకొన్నాడు.

తువ్వాలు భుజానేసుకొన్నాడు.

అలమర గూటికి వేసి వున్న బీగం తీసి ఆధార్‌కార్డ్, భూమి పాస్‌బుక్ వగైరాలు లోపలి చొక్కా జేబుల్లో పెట్టుకొన్నాడు. డబ్బు కూడా సర్దుకొన్నాడు.

కాళ్లకు చెప్పులేసికొని బైటకు కదిలాడు.

రాస్తోన్న పలకను పక్కనబెట్టి లేచి అతనికి అడ్డంగా నిలబడింది మనవరాలు.

"అబ్బా! అబ్బా! నేనొకటి అడుగుతా ఇస్తావా?" అంది ముద్దు ముద్దుగా.

'ఏమిటన్నట్లు'గా చూశాడు.

"ఇవ్వాల..." అతని కళ్లల్లోకి గోముగా చూస్తూ అంది.

"ఏందో చెబుతే గదా!" అన్నాడు.

"మా టీచర్ కాపీనోట్స్ తెచ్చుకోమన్నెది. తెచ్చిస్తావా?" అదే గోముతో అంది.

"నేనేడకు పోతండా తెచ్చినికి...?"

"ఇరవై రూపాయలిస్తేటీచరే తెచ్చిస్తాదంట... లెక్కేబ్బా!"

వక్కాకు నోరు కదిలిస్తూ మనవరాలికేసి రెండు క్షణాలు తదేకంగా చూసి, "మీ నాయిన్నడుగు పో..." అన్నాడు.

"నాయన కాడ... నో మనీ..." నడుము కిలిస్తూ చేతులు వొతికెల వేసి తిప్పింది.

"సెనక్కాయలు అమ్మిన లెక్కా పత్తి అమ్మిన లెక్కా ఎట్టబోయిందంటా?"

సమాధానంగా రెండు చేతులు ముందుకు చాచి బైకు హ్యాండిల్ పట్టుకొన్నట్లుగా అభినయిస్తూ, 'బుర్ర్... ర్..." మంటూ పదడుగులు అట్లా గుండ్రంగా తిరిగి వచ్చింది. పిడికిలి బిగించి బొటనవ్రేలు చాచి పైకెత్తి నోట్లోకి వంచుతూ ఏదో తాగుతున్నట్లుగా చూపించింది. డబ్బంతా తిరిగేందుకూ తాగేందుకే ఖర్చు చేస్తున్నాడని తన చిన్నిచిన్ని చేతులతో నటించి చెప్పింది. ఏడేళ్లు కూడా నిండని పాప తండ్రి అవలక్షణాలను బాగా గుర్తు పట్టింది.

కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి రామయ్యకు.

తల పక్కకు తిప్పుకొని కళ్లు తుడుచుకొంటూ లోపలి చొక్కా జేబులో చేయి దూర్చి రెండు పది రూపాయల నోట్లను తీసి మనవరాలికి అందించాడు.

నిమిషం కూడా అక్కడ నిలబడకుండా పొలాల దారి బట్టాడు.

"అబ్బా! గొర్రెను తోలప్పోవా?" వెనకనించి కేకేసింది మనవరాలు.

తలతిప్పి చూశాడు.

గోడ కింద మెత్తగా ముడుచుకొని పడుకొని వుంది గొర్రె. నిన్నటి నుంచి మబ్బుకేసికొని వుంది.

"మీ అమ్మకు చెప్పు- పిడికెడు గడ్డిపోచలు దాని ముందర యిదిలించమని..." మనవరాలికి కేకేసి ముందుకు కదిలాడు.

నడివీధిలో రాజకీయాల గురించి గప్పాలు కొడుతూ వున్న కొడుకు గొంతు వినిపించింది.

'థూ వాని బతుకుజెడ... పొరంబోకు నా కొడుకు...' మనస్సులో కసిగా తిట్టకొంటూ వూరు దాటాడు.

ఇల్లు విడిచి వెళ్లిపోవాలని ఏడాది కిందటే ప్రయత్నించాడు. కుదురుకోలేదు. మనస్సు మొండికేసింది.

వారం రోజుల కిందట జరిగిన ఒక సంఘటనతో యీనాటికి మనస్సు తెగింది.

ఇల్లు విడిచి వెళ్లిపోతూ వున్నాడు.

ఇంటినీ, వూరినీ, పొలాల్నీ వదిలేసి దూరంగా పోవడానికి సిద్ధమయ్యాడు.

పుట్టింది మొదలు యీ మట్టిలోనే పెరిగి, నాగటిచాళ్లల్లో ఆడుకొని, గొర్రె మీద కూచుని, ఎద్దులగిట్టల వెనక అడుగులేసి, జడిగాల మీద పిడికిళ్లు మోపి, పైరు మధ్య తిరిగి, ధాన్యపు కళ్లాల్లో దొర్లాడి, పశువులు పక్షుల సావాసంగా రేయింబవళ్లు యీ మట్టిలోనే బతికిన తను దాన్ని వదిలిపోవాలంటే ఒక భంగిన మనస్సు తెగిరాలేదు. నాలుగు చెంబుల నీటితో ఒంటిమీది మట్టిని కడుక్కొన్నంత సులభం కాదుగదా పొలంతో అనుబంధం తెంచుకోవడం! ఆ మట్టి నరనరాల్లో పేరుకుపోయి వుంటుంది.

కాలి దారి వెంట నడుస్తూ వున్నాడు.

అది చేలగట్ల మీదుగా వెళుతూ వుంది.

చేల దగ్గరకు వెళ్లినట్లే, చూసినట్లే... ఎవరికీ అనుమానం రాకుండా అట్నించటే రోడ్డెక్కాలనుకొన్నాడు. ఏదొక బస్సు పట్టుకొని దూరంగా వెళ్లాలి. అటు కర్నూలో, అనంతపురం జిల్లాలకో వెళ్లి కాశినాయన సత్రాల వద్ద కుదురుకొని శేష జీవితాన్ని అక్కడ స్వామి ఆవుల కాసేందుకో, అన్న సంతర్పణకో వినియోగించాలని నిర్ణయించుకొన్నాడు.

లోపలి చొక్కాలోంచి ఏదో ఊపములల్లాంటిది గుచ్చుకొంటూ వుంది. పై చొక్కా విప్పితేగాని దాన్ని తొలగించలేడు.

చేలకాడ, గెట్లకాడ, చెట్లకాడ, మడవకాడ ఎన్నిసార్లు కొట్లాడి వుంటాడు ఇరుగు పొరుగులతో. ఏమారితే చాలు గెట్లు దున్నుతారు. చేలో పైరు మేపుతారు. అడ్డంగా నడుస్తారు. మడవ తిప్పుకొంటారు. తనకు సంబంధించిన మట్టిని కాపాడుకోడానికీ, మట్టిలోంచి నాణ్యమైన పంట దిగుబడిని సాధించడానికీ జీవితాంతం పోరాడుతూనే వున్నాడు. అలాంటివాడు ఇప్పుడు ఆ మట్టిని వదిలిపోతున్నాడంటే చూసేవాళ్ల దృష్టిలో చులకన అవుతాడు.

అందుకే ఎవరికీ ఏ అనుమానమూ రాకుండా వెళ్లిపోతున్నాడు.

విషయం తెలిస్తే వూరు వెళ్లనివ్వదు.

కొడుకు అడ్డుకోకపోవచ్చు. కోడలు లబలబలాడుతుంది. పిల్లలిద్దరూ చెరో కాలు కరచుకొని అడుగు ముందుకు వేయనీయరు.

అన్నిటికీ మించి కోడలి కన్నీళ్లు తన కాళ్లకు సంకెళ్లు వేస్తాయి.

అందుకే మారుపంచె మారుచొక్కా సంచిలో పెట్టుకు రాలేదు. పైన తొడుక్కొని వెళుతున్నాడు.

ఊరి గమిల్లోనే గొల్లోల్ల గురప్ప ఎదురవగానే ఇంటి వద్ద మబ్బుకేసికొని వున్న గొర్రె గుర్తుకొచ్చింది.

"ఏం మామా! యాడికో బిర్రున పయనమైపోతుండావే?" అడిగాడు గురప్ప.

"సేనికాడికి లేవోయ్."

నమ్మలేనట్లుగా చూశాడు.

"సరేగాని... గొర్రె మెత్తబడిండాది. నిన్నట్నించి మొబ్బుకేసు కోనుండాది. అట్టా పోయి రోంత సూడోయ్! ఆకో, యీకో, వాతో, కోతో ఏదొక వైద్దెం సెయ్యి. సూదిమందు వుంటే చెయ్యి... మా కోడల్నడుగు లెక్కిస్చాది..." చెబుతూ ముందుకు నడిచాడు.

గురప్ప అతనికేసి అదోలా చూశాడు.

తలకు నూనె రాసి, నున్నగా అణగ దువ్వి, ఉతికిన పంచె గోచిజెక్కి, మరకల్లేని చొక్కా తొడిగి, నోటినిండా, వక్కాకు నములుతూ దారిబట్టినాడంటే... చేనికాడికని చెబితే మాత్రం నమ్మేదెట్లా?

రామయ్యకు సంబంధించిన లోపలా బైటా వుండే ఎగుడు దిగుడు జీవితాన్నంతా ఒకసారి అటు ఇటు తిప్పి చూశాడు గురప్ప. చెప్పిన మాట వినటం లేదని కొడుకు మీద ఎక్కసగా వున్నాడు. అట్లనీ కూతురు దగ్గరకు పోయేందుకు ఆమె కూడా ఎడమొగం పెడమొగంగానే వుందని వినికిడి. టౌనుతో యీనకేమీ పనిలేదు. మరి ఎక్కడికి వెళుతున్నట్లు?

పల్లె జీవితంలో ఒకరి రహస్యాలు మరొకరికి తెలియకుండా వుండవు గదా!

తనకు తెలియని రహస్యాలు ఏమున్నాయని?

తల గీరుకొంటూ ఇంటిదారి పట్టాడు గురప్ప.

రామయ్య వంకలోకి దిగి ఎక్కగానే మాల ఏసేబు కని పించాడు, రెండు మేక మరకల్ని కలపచెట్ల మీదకు ఎగమల్లించి మేపుకొంటూ.

"ఏమబ్బో! యాడికో పయనమయినావే?" అన్నాడు రామయ్యను చూస్తూనే.

అతనికేసి కొంత అసహనంగా చూశాడు రామయ్య.

వంకగట్టు ఎక్కుతానే కాలిదారి వదలి గట్టువెంట కంప చెట్లల్లో దూరి బాటదాకా నడిచి తార్రోడ్డు మార్గం చేరాలను కొన్నాడు.

"చెరువు దిక్కు పోయినట్టు లేదు. నారుకయ్యల్నిండా నీల్లుండాయబ్బా! నారు కుల్లిపోతాది. సూసి గెట్లు తెంచుకో పో సామీ!" చెప్పాడు ఏసేబు.

అయోమయంలో పడ్డాడు రామయ్య.

వ్యవసాయంలో ఏ చిన్న పొరబాటునూ సహించని మనిషి తను. తెలిసి కూడా పట్టించుకోకుండా పోతే తను తనుగా లేనట్టే.

తను పారిపోతున్న విషయం పసిగట్టాడంటే తల ఎక్కడ పెట్టుకోవాలి? ఇన్నేళ్ల రైతుదనాన్ని ఏ వంకో పారబోయాలి?

రైతుగానే ఇక్కడ్నించి దాటుకుపోవాలి.

నిట్టూరుస్తూ చెరువు దిక్కు కాలిదారి పట్టాడు.

చెరువు నీటి వూటలు కయ్యనించి కయ్యకు పొర్లుతున్నాయి.

నారుకయ్యలో నీటిని తెంచి కాలువకు వదలి చేతులు కడుక్కొన్నాడు.

'వీధుల్లో పొరంబోకుగా తిరిగే బదులు పొద్దున్నే పొలాల దిక్కు వచ్చి కయ్యో, కాలవో, చెట్టో, గెట్టో చూసుకొనిపోవొచ్చు గదా!' అనుకొన్నాడు కొడుకు గురించి.

ఏడాది నుంచి ఎదురు తిరగటం మొదలుపెట్టాడు వాడు. మాటకు మాట అందిస్తున్నాడు. పని లేకున్నా టౌనుకు తిరగడం అలవాటుపడ్డాడు. దానికితోడు తాగుడు కూడా మొదలుపెట్టాడు. దొరికిన కాడల్లా అప్పు చేస్తున్నాడు. తిండిగింజలు పండే పంట చాలించి రూపాయలు పండే పంటలు సాగు జేస్తున్నాడు. కరువు గాలాల్లో వానలు బిగదీసి బోరుబావులు ఎండి ఒక్క తడినీల్లు తక్కువైనా పెట్టుబడులు కూడా రానంత నష్టం. 'వద్దురా' అంటే వినడు. పసుపు నాటుతానంటాడు. లక్షల్లో పెట్టుబడి. కొర్ర, సజ్జ విత్తుదామనీ, తిండిగింజలు గొడ్లమేపూ దక్కుతాడనీ చెబితే పట్టించుకోడు. 'అప్పులన్నీ ఎట్లా తీరాల?' అంటాడు. మొన్న తొలకరింపుల్లో బోరుబావి కింద దున్ని కొర్ర విత్తబోతోంటే కొట్టేందుకు మీదకొచ్చాడు. చుట్టుపక్కల ఎవరూ లేరు... ఆరోజే మనస్సు తెగింది.

ముసల్ది కాలమైపోయి అదృష్టవంతురాలు. తనే రోగమూ రొస్టూ లేకుండా సండ్రకొయ్య మాదిరి నిలబడి అగచాట్ల పాలవు తున్నాడు.

నోట్లోని వక్కాకు అవశేషాన్నంతా వుండలాగా చేసి నేల మీద వూశాడు.

కాలువలో నీళ్లతో నోరు కడుక్కొని రెండు దోసిళ్లు తాగాడు.

పై గుడ్డతో తేమను తుడుచుకొని, గుడ్డను తలకు చుట్టుకొని దారిపట్టాడు.

పాలుమాలిన గొర్రె కళ్ల ముందుకు రాబోతే దూరంగా తరిమాడు.

మనుమడు, మనవరాలు వచ్చి కమ్ముకోబోతే, గుడ్లురిమి బెదిరించాడు.

'నువ్వు బోతే మా గతి ఎట్ట మామా?' అంటూ కోడలు కన్నీళ్లు పెట్టుకోబోతే, 'పో పో పో... నీ మొగుడూ నువ్వూ ఏదొక అగసాట్లు పడండి,' అంటూ విసురుగా చెప్పి ముందుకు కదిలాడు.

పొలమూ, పైరూ, బర్రెలూ, కోళ్లూ, సంసారమూ, కుట్టాలూ ఎందరు అడ్డొచ్చినా ఆగలేదు. మనస్సు దిటవు చేసుకొన్నాడు. అన్ని దృశ్యాల్నీ అరచేత్తో తుడిచివేస్తూ ముందుకు నడుస్తూ వున్నాడు.

ఉన్నట్టుండి ఎద్దు ఎదురొచ్చింది.

గాట్లో గడ్డి అయిపోతే తొక్కులాడి, మోర విదిలిస్తూ గడ్డి తీసుకురమ్మని సాధికారికంగా హెచ్చరించే ఎద్దు. కాడిమాను ఎత్తగానే తనకై తనే వచ్చి మెడ దూర్చే ఎద్దు ఎదురొచ్చింది. దీనంగా చూస్తూ వుంది.

ఉలికిపాటుగా అటుకేసి చూశాడు రామయ్య.

ఆలోచనల్లో కాదు- నిజంగానే ఎదురుగా తన ఎద్దు.

దారిపక్క చేలో పోటీదారుడు సుబ్బారెడ్డి చేతికింద దున్నుతూ వుంది.

తనను చూడగానే కాడి నిలబెట్టి ముందుకు వచ్చి పండకం సరిజేయబోయాడు సుబ్బారెడ్డి.

జరిగిన మోసాన్ని వెంటనే పసిగట్టాడు రామయ్య.

తన ఎద్దు మీద వేలెడు బెత్తెడు కాదు జానెడు పైగా పర్రేసి దున్నుతున్నాడు అతను. బరువంతా దానిమీదకే జరిపి యీడిపిస్తున్నాడు. వాడి ఎద్దు సులభంగా నడుస్తూ వుంది. తన ఎద్దు ముక్కి ముక్కి యీడుస్తూ వుంది. గస పెడుతూ వుంది.

కోపం రవరవ ఎగదోసుకొచ్చింది రామయ్యకు.

"ఒరే సుబ్బిగా! నువ్వు మాసివా గొడ్డువా?" అన్నాడు ఎద్దు లాగే బుసగొడుతూ.

సుబ్బారెడ్డికి అర్థమైంది.

"పందకం సల్లుబారి రోంత ఆ పక్కకు జరిగిందిలే సిన్నాయనా!" అన్నాడు సంజాయిసీ ఇచ్చే ధోరణిలో.

"సల్లుబారితే ఒక వేలెడు జరుగుతాది. పందకమంతా నడిచీలను దాటుకొని ఇవతలకొస్తదా? దొంగనా కొడుకువురా నువ్వు. నోరునొయ్యి లేని జీవాన్ని నమ్మకంగా కాడిగట్టి ఇస్సే దాని పానాలు ఈస్సావా? నీ ఎద్దులాంటి పానంగాదా దాని పానం? కాపోనివంటరా నువ్వు? కసాయోనివిరా. నన్ను జూసి ఆదరా బాదరా వార్నె సరిజెయ్యడానికి వస్సాండవే- దొంగబుద్ధి గాదూ?" అంటూ పెద్ద గొంతుకతో అరిచి దండించాడు.

ఏదో సంజాయిషీ ఇవ్వబోతున్నాడు సుబ్బారెడ్డి.

"ఛ మాట్లాడొద్దు. కాడి విప్పు నా ఎద్దును నా ఇంటికి తోలు. నీ పోటీ వద్దు, నువ్వొద్దు... ఎద్దు కాడికి వచ్చినావంటే మర్యాదుండదు," అంటూ గద్దించాడు.

సుబ్బారెడ్డి తలొంచుకొన్నాడు.

అప్పటికే తన పరిస్థితి ఏమిటో స్ఫురణకు వచ్చింది రామయ్యకు.

అయినా ఎద్దు పడిన కష్టాన్ని చూసి సహించలేకపోయాడు.

మరో రెండు తిట్లు తిట్టి అక్కన్నించి కదిలాడు.

తన పని తనకే ఎబ్బెట్టుగా వుంది.

ఇల్లూ పొలాలూ వూరూవాడా వదిలిపెట్టి పోతున్నాడు. తన కెందుకు యీ గద్దింపులూ, కోపాలూ, తాపాలూ?

చూస్తూ ఉండలేకపోతున్నాడు.

తన ప్రవర్తన అట్లా కాకుండా మరో విధంగా వుంటే జనాలకు అనుమానం వస్తుంది. వాళ్ల నుంచి దూరమయ్యేదాకా అలా వుండాల్సిందే.

చెరొక ఎద్దును పెట్టుకొని సుబ్బారెడ్డి, తను పోటీ సేద్యం చేసికొంటున్నారు.

నిన్న యీరోజు అతను దున్నుకొన్నాడు.

రేపు తన వంతు.

ఎవరు పోవాలి సేద్యానికి?

తను లేడని తెలిస్తే సుబ్బారెడ్డిగాడే దున్నుకొంటాడు. తన ఎద్దు మీద పర్రేసి దాని ప్రాణం తీస్తాడు.

ఎద్దును అమ్మేసి వూరు విడిచి వుంటే బావుండేది.

వక్కాకు కోసం పక్క జేబులో చేయి దూర్చబోతే లోపలి చొక్కాలోంచి భూమి పాసుబుక్కుల మోట్లు పొట్టలో పొడుచుకుంటున్నాయి.

పాసుబుక్కులు కొడుకు చేతిలో పడితే తాకట్టయినా పెట్టి తాగి తందనాలాడి పిల్లలకు ఏమీ లేకుండా చేస్తాడని భయపడి వాటిని కూడా వెంట తెచ్చుకొంటున్నాడు.

పై చొక్కా మీంచే ముల్లు గుచ్చుకొనే చోట వేలితో తడిమి చూశాడు. చేతిని లోపలికి జొనిపి జాగ్రత్తగా ముల్లును పీకాడు.

లోపల ఆధార్ కార్డ్, వృద్ధాప్య పింఛన్ కార్డు కూడా వుంది.

అన్నింటికన్నా ఇబ్బంది పెట్టేది పింఛన్ కార్డే.

రేపు నెల నించి పెన్షన్ ఎవరు తీసికోవాలి?

పిల్లల పుస్తకాలకూ, చిన్న చిన్న ఖర్చులకు పెన్షన్ సరి పోయేది.

హఠాత్తుగా అప్పుడు గుర్తుకొచ్చింది మనవడు నాలుగు రోజుల క్రితం ఐదు వందల డబ్బు అడిగిన విషయం. పుస్తకాలు కొనుక్కోవాలంట. తండ్రిని అడిగితే అబ్బ వైపు చేయి చూపాడుట.

ఈ నాలుగు రోజుల్నించి వాడు ప్రయత్నిస్తూనే వున్నాడు గాని తనే కావాలని ఆలస్యం చేశాడు. వాడేమో కళ్లనీళ్లు పెట్టుకొంటున్నాడు. వాడి తండ్రికి చీమ కుట్టినంతయినా చురుకు తగలలేదు.

మనవడికి డబ్బులిచ్చి వెళ్లాలి.

పక్క వూర్లో బస్సు దిగి కిలోమీటరు దూరం నడిచి వస్తుంటారు- వ్యాను మోతను భరించలేని పిల్లలు. ఫ్రీ బస్‌పాస్ తీసుకొని వెళ్లి వస్తుంటారు.

సాయంత్రం వరకు వుండి, మనవడు బస్సు దిగే తావుకు వెళ్లి వాడికి డబ్బులిచ్చి అట్నించటే వెళ్లిపోవాలని నిర్ణయించుకొన్నాడు.

"యాడికో దూరంగా పోతున్నెట్టుండావే?" పక్క చేలోని గంగన్న అడిగాడు.

"అదో... ఆ ఎర్ర సేలదాకా..."

"కాదులే బావా! చొక్కా మీద చొక్కా వేసినావంటే వారం పదిరోజులన్నా నిలబడేట్టుండావులే..."

ఉలికిపాటుగా చొక్కా అంచులకేసి చూసికొన్నాడు.

వక్కాకు కోసం చేయి లోపలికి పెట్టినపుడు పైచొక్కా అంచులు మడిగాయి. వాటిని సవరించుకోకుండా వస్తున్నాడు. లోపలి చొక్కా కనిపిస్తూ వుంది.

సమాధానమివ్వకుండా చిన్నగా గొణుక్కొంటూ అక్కన్నించి కదలిపోయాడు రామయ్య.

తమ వూరి పొలాలు దాటి బరకల దాకా నడిచాడు.

చుట్టుపట్ల మేకల మందలు గాని గొర్రెల మందలుగాని లేవు.

దట్టంగా పెరిగి వున్న కలివె చెట్టు నీడన కూచున్నాడు.

పుల్ల తీసికొని నేలమీద పొడుస్తూ ఆలోచిస్తూ వుండిపోయాడు.

మధ్యాహ్నం కావొస్తూ వుంది.

కడుపులో ఆకలి కదలికలు మొదలయ్యాయి.

పొలాల దగ్గరుండుంటే కోడలు సంకటిముద్ద తెచ్చి పెట్టుండేది.

బరకల్లో వున్నాడు.

ఆకలి పెరుగుతూ వుంది.

కలివె పొద మొదట్లోకి అటుఇటు పరిశీలనగా చూసేసరికి బచ్చటాయి తీగ ఆకులు కనిపించాయి. ఆకుల్ని గిల్లి నమిలితే పుల్లపుల్ల రుచితో ఇంపితంగా అనిపించాయి. తీగ వెంట నేల మీద పుల్లతో తవ్వి చూస్తే చేతి గడయారం వెడల్పున గడ్డ కనిపించింది. చిరు చేదుతో, గెనుసుగడ్డలాంటి పిండి పదార్థంతో అదో రుచిగా వుంది.

తల కింద కండువా మడతబెట్టుకొని పడుకొన్నాడు.

కొద్దిసేపట్లోనే నిద్ర వచ్చింది.

లేచేసరికి మూడుగంటలు దాటింది.

లోపలిచొక్కా తడువుకొని చూసుకొన్నాడు.

ఒంటి మీదకు ఎక్కి వున్న ఒకటి రెండు గండుచీమల్ని విదిలించుకొని లేచాడు.

ఆకలిగా వుంది... నీరసంగా వుంది.

వంకలోకి దిగి కొంత దూరం నడచుకొంటూ పోతే నీళ్ల గుండం కనిపించింది.

కడుపునిండా నీళ్లు తాగాడు.

చేలకు అడ్డంగా దారిబట్టి నడవసాగాడు.

గాలి ఆడటం లేదు. ఉక్కపోతగా వుంది.

లోపలి చొక్కాలోంచి చెమట వాసన ఎగిసివస్తూ వుంది.

ఆన్ని వదిలేసి రావలసింది. మారుచొక్కా అవసరం కాబట్టి చొక్కా మీద చొక్కా తొడుక్కొచ్చాడు.

దూరప్రాంతాలకు ఎద్దుల బేరం పోయేప్పుడు ఇదే పని చేస్తుంటారు. పై చొక్కా మాసినపుడూ, ఉతుక్కొనేందుకు అవకాశం లేనప్పుడూ లోపలి చొక్కా తీసి పైకి మార్చుకొంటారు.

ఇప్పుడు లోపలి చొక్కానే మాసి వుంది.

మూడురోజుల పొలం వాసనలూ, ఇంటి వాసనలూ, బర్రె గొర్రె ఎద్దు కోళ్ల వాసనలూ చొక్కాను అంటిపెట్టుకొని వస్తున్నాయి.

కాశినాయన ఆశ్రమానికి వెళ్లినపుడు మాసిన పంచె, చొక్కా ఉతుక్కొని సంచిలో పెట్టుకోవాలి.

నేరుగా బస్సు మార్గానికి వెళ్లాడు.

అక్కడ టీబంకు వద్ద అరకొరగా జనాలున్నారు. సాయంత్రానికంతా టీ, బజ్జీల కోసం, బీడీ సిగరెట్ల కోసం జనం గుమిగూడతారు.

బంకుకు కొంత ఎడంగా జువ్విచెట్టు కింది అరుగు మీద కూచున్నాడు.

పెనంలో మిరపకాయ బజ్జీలు కాలుతున్నాయి.

కడుపులో ఆకలి గోముగోముగా గోలజేస్తూ వుంది.

లెక్క ఖర్చుజేసి అలాంటి చిరుతిండ్లు తినటం అతనికి అలవాటు లేదు.

బంకుకేసి చూడకుండా జేబులోంచి వక్కాకు తీసి తీరిగ్గా నోట్లో పెట్టుకొని నమలసాగాడు. చెక్కమొద్దు కొరుకుతూ వుండే మాదిగ నరసింహులు అరుగు దగ్గరకు వచ్చాడు.

"రామయ్యా! ఆ దున్నపోతు దూడను యీగూడదా! ఎన్నిసార్లు అడిగినా పలికేట్టు లేవబ్బా! ఒకప్పుడు నేను నీ యింటి మాదిగోన్నేలే... రోంత గుర్తుదెచ్చుకో..." అన్నాడు.

"యాడికీ లేకండా అడిగితే ఎట్టబ్బీ?" అన్నాడు వక్కాకు అందిస్తూ.

"ఆజీబాజీ రేటు సూడు. ఒక వందన్నా తగ్గించుకోబ్బా!"

"వందగాదురా రొండొందలు తక్కవీ. ఎప్పుడో పదేండ్ల కిందటి రేటుకు అడుగుతే ఎట్టబ్బీ?"

"పండగపూట నీ పేరు జెపకొని తింటాములేబ్బా!"

"సరే... రేపు రాపోండి..." చెప్పాడు రామయ్య.

కొంతసేపు ఆమాట యీమాట మాట్లాడి బంకు దగ్గరకు వెళ్లాడు నరసింహులు.

తన ప్రవర్తన తనకే కొంత ఎబ్బెట్టుగా అనిపించింది రామయ్యకు.

'ఈ బేరసారాలు ఇంకా తను చేయటమేమిటి? నా కొడుకును అడుగు పోండి అని ఒక్క మాట చెబితే సరిపోతుంది గదా!'

వక్కాకు నములుతూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

కొంతసేపటికి బస్సొచ్చింది.

ఆలోచనల్నించి బైటపడి అరుగుమీంచి దిగాడు.

బస్సులోంచి బిలబిలమంటూ బడిపిల్లలు బైటికొస్తున్నారు.

మనవడికి డబ్బులిచ్చి అదే బస్సు ఎక్కి పోవాలనుకొన్నాడు.

పక్కపిల్లాడి చేతి ఆసరాతో బస్సు దిగుతూ వున్న మనవడిని చూడగానే నోసలు ముడివేశాడు.

కాలు కుంటుతూ వున్నాడు వాడు.

పుస్తకాల సంచి కిందబెట్టి నిస్సహాయంగా నిలబడ్డాడు.

గుండె లబలబలాడుతోండగా మనవడి కాళ్లకేసి చూస్తూ ముందుకు నడిచాడు రామయ్య.

కుడి మోకాలు తోలు లేచిపోయి ఎర్రగా కనిపిస్తూ వుంది.

"ఏమైంది నాయనా?" అంటూ ఆదుర్దాగా దగ్గరికి వెళ్లాడు.

"గ్రౌండులో ఆడుకుంటా కింద పన్నెలేబ్బా!" సంజాయిసీ ఇచ్చాడు.

వంగి కాలు పట్టుకొని చూస్తూ వున్న అబ్బ భుజాన పుస్తకాల సంచి వేశాడు.

అబ్బ వెంట అరుగుదాకా నడిచేసరికే ఇబ్బందిపడ్డాడు.

బస్సు కదిలి వెళ్లిపోతూ వుంది.

మనవణ్ణి ఎత్తు అరుగు మీద కూబోబెట్టి సంచిని అతని పక్కన వుంచాడు రామయ్య.

కాలు పట్టుకొని చూశాడు.

"మీ నాయనకు ఫోన్ చేయలేదా?" అడిగాడు.

"చేసినాబ్బా! ఆయనకేదో పనుందంట. ఎట్లనోకట్ల ఇంటికి పొమ్మన్నేడు," చెప్పాడు.

ఒళ్లు మండిపోయింది రామయ్యకు.

'పిల్లోల్లు కూడా కాబట్టనంత పనేం పనో?' మనస్సులో గొణుక్కున్నాడు.

తను లేకుంటే యీ పిల్లలు రాల్లురప్పల పాలయ్యేట్టున్నారు.

ఏదైనా మోటారుబైకు దొరుకుతుందేమోనని కొంతసేపు చూశాడు.

"చిన్నగా నడుచుకొంటూ పోఆంపాబ్బా!" చెప్పాడు మనవడు.

మరేమీ ఆలోచించలేదు రామయ్య.

మనవడి ముందుకెళ్లి వీపిచ్చి నిలబడి, "నన్ను కరచుకో..." అన్నాడు.

అబ్బ మెడకు రెండు చేతులు చుట్టి, రెండు కాళ్లను నడుముల చుట్టూ వేసి వీపు మీదకు వాలాడు వాడు.

పుస్తకాల సంచి చేతబట్టుకొని, మనవణ్ణి వీపుకు కరిపించుకొని వూరికేసి నడవసాగాడు రామయ్య.

పిల్లవాడి కాలిమడమ నొక్కుకుని లోపలి చొక్కాలోని పాసు పుస్తకాలు పొట్టలో గుచ్చుకొంటున్నాయి.

మనవడి కాళ్ల మట్టిమరకలు, నెత్తుటి మరకల్తో పైచొక్కా కూడా మాసిపోయింది.



యాభై పైగా కథలు రాశారు. నాలుగు కథా సంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. గతంలో ఆటా నవలల పోటీలో 'వీరి కాడి' నవలకి, చతుర నిర్వహించిన పోటీలో 'చినుకు నవ్వడి' నవలకి, 2017లో తానా నిర్వహించిన నవలల పోటీలో 'ఒంటరి' నవలకి బహుమతులు లభించాయి. నివాసం బాలరాజుపల్లె, కడప జిల్లా.

రాణి-దాసి

పాలపర్తి ఇంద్రాణి



రాణీ, దాసీ అక్కడక్కడా పాచిపట్టి, కొండరాళ్ల మధ్యని పిచ్చి మొక్కలు మొలిచి,సగం కూలిన కోట మీద నిలబడి దూరంగా కనబడున్న పొలాలని, ఇళ్లనీ చూస్తున్నారు. అలవాటైన కాలక్షేపం.

రాణి ముసలిది.
దాసి ముసలిది.
రాణి తల్లి రాణి.
దాసి తల్లి దాసి.
దాసి తల్లి రాణి తల్లికి దాసి
పాట ఒకటి పొలాల మీదుగా తేలుతూ వచ్చింది.

ఏరువాకమ్మకి ఏమికావాలి?
ఎర్రఎర్రని పూలమాల కావాలి
ఎరుపుతెలుపుల మబ్బుటెండ కావాలి
ఏరువాకమ్మకి ఏమి కావాలి?
పొలము గట్టున నిలిచి వేడుకోవాలి
టెంకాయ వడపప్పు తెచ్చిపెట్టాలి

రాణికి పెళ్లి అయినప్పుడు రాణితో బాటు ఈ రాజ్యానికి వచ్చింది దాసి.

రాణీగారి ఏడు వారాల నగల మిసమిస, రాజావారి ఠీవీ చూసి ఏడ్చిపోయింది దాసి.

తన లేమితనానికి కుమిలిపోయింది.

అప్పుడు దానికింకా పెళ్లి కాలేదు.

సక్కని గుంటా- రాయే నా ఎంటా
సరసన కూసుంటా -పెళ్లి సేసుకుంటా
గుర్రాన్నెక్కిత్తా -కూడా నేనొత్తా
సర్రూన ఊరంత -సైదిరిగి వత్తాము

అని రాజుగారి భటుడొకడు దాన్ని చూసి పాట పాడేడు.

ఆనక పెండ్లాడేడు.

పెళ్లాడాక దాని మనసు కొంత కుదుటపడింది.

రాజా వారు వేశ్యల చుట్టూ తిరుగుతూ రాణిని పట్టించు కోలేదు.

అప్పుడు దాసీది, దాని మొగుడిదీ అన్యోన్యతను చూసి రాణీ ఈర్ష్య పడింది.

తన దురదృష్టానికి కుమిలిపోయింది.

రాణీకి పండంటి బాబు పుట్టాడు.

చిక్కుడూ పువ్వోరుపు చిలుక ముక్కోరుపు
చిగురెరుపు చింతల్ల దోరపండెరుపు
రక్కిస పండెరుపు రాగి చెంబెరుపు
రాచవారిళ్లలో మాణిక్యమెరుపు
తానెరుపు అబ్బాయి తన వారిలోన

అని పాడింది రాణి.

దాసీకి పండంటి బాబు పుట్టాడు.

ఏటి గట్టూ మీద కరివేప చెట్టు
గాలివానా వచ్చి కొమ్మలల్లాడే
కొమ్మలల్లాడెనే గొలుసులల్లాడె
కొనికొన్ని ముత్యాల చేరులల్లాడె
ఆ చెట్ల పైనుండి అబ్బాయి రాగ
బంగారు తలపాగ చెంగులల్లాడె

అని పాడింది దాసి.

రాణి కొడుకు యువరాజు అయ్యాడు.

దాసి కొడుకు భటుడయ్యేడు.

ఇంతలో ముష్కర మూక రాజ్యం మీదికి దండెత్తి వచ్చింది.

యుద్ధానికి బయలుదేరి వెళ్లిన ముసలి రాజు, పడుచు యువరాజు యుద్ధభూమిలో మరణించారు.

యుద్ధానికి బయలుదేరి వెళ్లిన ముసలి భటుడు, పడుచు భటుడు యుద్ధభూమిలో మరణించారు.

ముష్కర మూక సంపదంతా దోచుకుంది.

కనిపించిన వారినల్లా చంపివేసింది.

నేల మాళిగలో దాక్కున్న రాణి, దాసి బతికిపోయారు.

సంపద, రాజ్యము, అయినవారు, భర్త, కొడుకు అంతా పోగా పొగిలి పొగిలి ఏడ్చింది రాణి.

భర్త, కొడుకు పోగా కుమిలి కుమిలి ఏడ్చింది దాసి.

ఇక అప్పటినించీ రాణీ, దాసీనే కోటకంతా.

పాత రాణి మీద గౌరవంతో రైతులు తెచ్చిచ్చే అయివేజుతో రోజులు గడుపుతోంది రాణి.

రాణి తెలిసిన వయోవృద్ధులు అప్పుడప్పుడూ వచ్చి కూచుని కబుర్లు చెప్పి వెళ్లడమే రాణికి కాలక్షేపం.

సంవత్సరానికి ఒక్కసారి రాణీ, దాసీ అంకాళమ్మ గుడిలో జరిగే తిరుణాలకి వెళ్లేవారు.

కోలాటాలు చూస్తూ కాలక్షేపం చేసి వచ్చేవారు:

ఎడము ఎడమేగాని ఎడము ఎడమే గాని
ఎదుటి కెన్నడు రావు తొడలపై కొస్తి వప్పా లక్ష్మణా
ఒడిలోని వస్తి వప్పా లక్ష్మణా

ఎద్దు కొమ్ముల వారు ఎద్దు కొమ్ముల వారు
ఇద్దరుంటిమి మనము ఒంటిగాణ్ణయితినప్పా
లక్ష్మణా సొంటి తిప్పలొచ్చెనప్పా

కూర్చినా ముత్యాల కూర్చినా ముత్యాల
కుచ్చులాలా మనము కూడి ఉంటిమి తమ్ముడా
లక్ష్మణా దాగుకుంటివే లక్ష్మణా

దాచిన్న పగడాల దాచిన్న పగడాల
దండలాలా మనము దాగి యుంటిమి తమ్ముడా
లక్ష్మణా దాగుకుంటివే లక్ష్మణా

యాడరా లచుమన్న యాడరా లచుమన్న
యాడరా సీతంటే ఏమి జెప్పుదు తమ్ముడా
లక్ష్మణా ఏమి జేతుర లక్ష్మణా

కొండ గరగర దిప్పి కొండ గరగర దిప్పి
కోనలే దాటేసె కొండ తల్లడిస్తాది లక్ష్మణా
తమ్ముడా గుండె తల్లడిస్తాది లక్ష్మణా

మరో నలభై ఏళ్లు గడిచిపోయాయి.ప్రభుత్వాలు మారాయి. తరాలు మారాయి.

అయినా రాణి రాణే. దాసి దాసే.

బీదరికంలోనూ, చుట్టూ ఎవరూ లేకున్నా, రాణి రాణే. దాసి దాసే.

రాణి తన రాణితనమంతా దాసి మీద చూపించేది.

చిన్న పనీ పెద్ద పనీ చెబుతూ నిలబడనీక, కూర్చోనీక సతాయించేది.

దాసికి ఎప్పుడూ ఏదో ఒక పనిని సృష్టించడమే రాణి పని.

గిన్నెలు సరిగ్గా తోమలేదని, బూజులు సరిగ్గా దులప లేదని, నీళ్లు వేడిగా కాచలేదని, అన్నం పలుకులుగా ఉందని, కాళ్లు సరిగ్గా పట్టలేదని ఇలా ఎప్పుడూ అరుస్తూ ఉండేది రాణి.

కుతకుతలాడిపోయేది దాసీది.

కానీ రాణి పోతే తన బతుకు? అందుకని రాణిని తిట్టుకుంటూ, గొణుక్కుంటూ పని చేసుకుంటూ ఆ శిధిల కోటలో తిరుగుతూ ఉండేది దాసి.

మూసేసిన పాడుబడ్డ గదులు, తుప్పు పట్టిన, విరిగిపోయిన కత్తులు, కటార్లు, బూజు పట్టిన నడవలు. ఖాళీగా పడి ఉన్న గుర్రపుశాలలు.

దాసి వంట గదిలో ఏమరుపాటుగా ఉంటే కోట బురుజుల మీద యధేచ్ఛగా తిరిగే కోతులు వంటింట్లోకి దూరి అరటి పళ్లు, గరిటెలు, పళ్లాలు ఏవి కనిపిస్తే అవి ఎత్తుకుపోయేవి. దాసీది కేకలు వేసేది, కర్ర పెట్టి అదిలించబోయేది. అవి దూరంగా పోయినట్టే పోయి పళ్లన్నీ బయటపెట్టి దాసీని వెక్కిరించేవి.

నాగుబాములు, పసరిక పాములు హాయిగా చుట్టలు చుట్టుకుని పడుకునేవి బురుజుల్లో. కోటలోకి వచ్చేసేవి తోచినప్పుడల్లా. ముఖ్యంగా ఎండాకాలంలో. ఎండలు మండిపోతున్నప్పుడు చల్లగా వచ్చేసేవి .

అప్పుడు దాసి పాడేది.

ఉసిరిక చెట్టు కింద పసిరిక పాము
కూసమూడ్చే పాము పడగ బుస్సంది
పాము నన్నూ చూచి పడగనెత్తింది
పడగలెత్తకు పాము పగవారము కాము

రాణీ గదిలో పాము పడగెత్తి ఉంటే రాణి పాడేది.

నాలుకలు దూయకే నీవారము నాగూ
మంచి నాగూవైతె పంచెలెట్టేము
కోడె నాగూవైతె కోకలెట్టేము
పడగలెత్తకు పాము పగవారము కాము

తుఫాన్లకి, జడివానలకి మరింత శిధిలమైంది కోట.
పావురాళ్ల కువకువలతో కోట కోటంతా నిండిపోయేది.
రాణికి దాసికి నిద్ర పట్టేది కాదు.

రాణి పోతే తన బతుకు ఎలాగో అని దిగులుపడేది దాసి.

ఈ రాణి తన నగలు ఎక్కడ దాచిందో ఈ నలభై ఏళ్లల్లో కనిపెట్టలేకపోయింది.

రాణీ, తాను నేలమాళిగలో దాక్కున్నప్పుడు రాణి వంటి మీద ఉన్న నగలు ఆ తరువాత ఏమయ్యాయో తెలియదు.

ఆ నగలు గనక దొరికితే తన మిగిలిన బతుకు వెళ్లిపోతుంది.

రాణీ స్నానానికి వెళ్లినప్పుడు, నిద్ర పోతున్నప్పుడూ వెతుకుతూ ఉండేది నగల కోసం.

విఫల ప్రయత్నాలు.

తను చనిపోయాక రాజలాంఛనాలతో తన అంత్యక్రియలు జరగాలి.

వేలమందికి అన్నదానాలు జరగాలి.

అందుకోసమే తన వజ్రాల నగలు దాచింది రాణి.

తను చనిపోయే ముందు దాసిని పిలిచి నగలు చూపించి తన ఆఖరి కోరిక చెబుతుంది.

కానీ ఒకానొక రోజు వర్షాల రోజుల్లో ఓ సాయంకాలం చీకటి వేళ చనిపోయింది రాణి.

ఈ పాట పాడుకుంటూను-

ఊరికి ఉత్తరాన సమాధిపురములో
కట్టె ఇల్లున్నదే చిలుకా
కర్రలే చుట్టాలు కట్టెలే బంధువులు
కన్నా తల్లెవరే చిలుకా

నువ్వు కాలి పోయేదాక కావలుందురు గాని
వెంటనెవరూ రారు చిలుకా

పాట ఆగింది. రాణి ఇక లేదు.
విగత జీవిగా ఉన్న రాణిని చూసింది దాసి.
తమ మధ్య ఉన్న ఒక తాడు ఏదో తెగిపోయింది.

విచారంగా పాడింది దాసి-

ఊరికి ఉత్తరాన సమాధిపురములో
కట్టె ఇల్లున్నదే చిలుకా
కర్రలే చుట్టాలు కట్టెలే బంధువులు
కన్నా తల్లెవరే చిలుకా
నువ్వు కాలి పోయేదాక కావలుందురు గాని
వెంటనెవరూ రారు చిలుకా

తరువాత లేచి రాణి గది అంతా వెదికింది, పూజా మందిరం వెతికింది ఈమాటు ఇంకా సరిగ్గా.

మందిరం అడుగున రహస్య సొరుగు కనిపెట్టింది.
అందులో ఉన్నది నగల మూట!
మూట విప్పితే ధగధగలాడుతూ వజ్రాల నగలు.
ఈ నగలే తన దగ్గర ఉంటే దూరంగా వెళ్లిపోయి హాయిగా రాణిలా దర్జాగా బతికేది.

దాసిలాగే బతుకంతా కరిగిపోయింది.
ఒక్కో నగా తీసి పెట్టుకుంది దాసి.
అద్దంలో చూసుకుంది.
మహారాణి కన్నా ఏం తక్కువ? తనను తన భర్త చిలకా అని పిలిచేవాడు. వన్నెల రాణీ అనేవాడు.

ఆ మాటలు గుర్తున్నాయిగానీ భర్త మొహం జ్ఞాపకాల్లో మసకబారిపోయింది.

నగలన్నీ పెట్టుకుని రాణి వంక చూసి గర్వంగా నవ్వింది. రాణి బతికి ఉండి తనను చూడగలిగితే?

నగలన్నీ మళ్లీ మూటకట్టింది. తన గదికి తీసుకుపోయి దాచి పెట్టింది.

రేపు తెల్లవారాక అందరికీ చెప్పాలి రాణి ఇక లేదని.
ఇప్పుడు చిమ్మ చీకటి, తుఫాను రాత్రి.
దాసి తన గదిలో పైకప్పును చూస్తూ పాడింది:

శ్రీరామ బంటుడిని మా రాజు సుగ్రీవులూ
అంగదుడు నా పేరు మా తండ్రి వాలిరా ఓరీ
రావణా మా తండ్రి వాలిరా ఓరీ

బలశాలి వాలికి సెడబుట్టినావురా ఓరీ
పగవాని కొలువులో బానిసల బతుకేల ఓరీ
వనచరీ బానిసల బతుకేల ఓరీ

జగము పాలించేటి జగదీశ్వరుడు
మాపాలి పరమాత్మ పగవాడు గాదురా ఓరీ
రావణా పగవాడు గాదురా ఓరీ

ఎక్క గుర్రాలిస్తు యేనుగులనిస్తురా
ఏల బూమూలిస్తు ఎలనాగలిస్తురా ఓరీ
వనచరీ ఎలనాగలిస్తురా ఓరీ

కోటాన కోట్లుగా కోతి దండుదళము
కోదండరాములూ కదలి వస్తారు ఓరీ
రావణా కదిలి వస్తా రోరీ

నల్ల జీమల్లట్ల నరుల నలిపేపిస్తు
కోతిమూకల జంపి గోరీలు కట్టిస్తురా
ఓరీ వనచరీ గోరీలు కట్టిస్తురా ఓరీ

పాడుకుంటూ నిద్ర పోయింది దాసి, భావి జీవితాన్ని కలలు కంటూ.

ఇక మీదట తనకే ఓ దాసి, సొంత ఇల్లూ, కమ్మని భోజనం.

బయట తుఫాను హెచ్చింది.

దాసి ఉన్న గది కొండరాళ్లు కూలి నిద్రలోనే తల పగిలి మరణించింది దాసి.

తెల్లవారింది.
తుఫాను ఆగింది.
యథాప్రకారం కోతులు వచ్చాయి.
శిథిలాల్లో తిరుగుతూ నగల మూట ఎత్తుకుపోయి ఎగురు కుంటూ వెళ్లి బావిలో పడేసాయి.
వజ్రాల నగలన్నీ నీళ్ల పాలయిపోయినాయి.
అప్పుడప్పుడూ అక్కడ ముసలి రాణి, ముసలి దాసి కనిపిస్తూ ఉంటారని, ఏవో మాటలు, పాటలు, అరుపులు వినిపిస్తుంటాయని చెప్పుకుంటుంటారు ప్రజలు.

ఇప్పుడా శిథిలాల వైపుకు ఎవరూ వెళ్లరు.
ఎందుకో మరి కోతులు కూడా.



పాలపర్తి ఇంద్రాణి ఐటి సెక్టర్‌లో ఉద్యోగం చేస్తూ హ్యూస్టన్, టెక్సాస్‌లో నివసిస్తున్నారు. వానకు తడిసిన పువ్వాకటి, అడవి దారిలో గాలిపాట, ఇంటికొచ్చిన వర్షం, కాళీ పదములు- కవితాసంకలనాలు, ఆ నవలిక, చిట్టి చిట్టి మిరియాలు, చిన్ని కథలు, కాకేక కాకికి కాక వచనం ప్రచురించారు.

త్రుటిలో...

చందు శైలజ



దొంగమొహంది.

మొహానికి ఖరీదైన హాండ్ బాగొకటి. పైగా ఎత్తు చెప్పులు. యోగా చేస్తున్నట్లున్నది. నడుము సన్నగా చేసుకుంది. నాజూకు చీరలు కడుతోంది.

జిమ్ములో చేరిందిగా. టక్కులాడిలా నడుస్తోంది. నడక కూడా నేర్పుతారా జిమ్ము వెధవలు. కాల్చి వాత బెడితే సరి. దీని వేషాలన్నీ వివరంగా రాసి దీని అన్నకి ఆకాశరామన్న మెయిల్ ఇస్తే... సిగ్గుతో బావిలో దూకుతాడు, సన్నాసి వెధవ. దగుల్బాజీ నక్కగాడు.

చెల్లెలి మీద ఎక్కడలేని అభిమానం కురిపిస్తాడు. చీకటి గొందిలోకి లాక్కెళ్లి తన్నాలి వెధవని.

చెల్లెలు బంగారంట. వీడి తలకాయ.

విలువలోదేసిన విలువలేని కాకి బంగారం.

ఏంటి ఫోను వంకే చూస్తూ టైప్ చేస్తోంది. వాడికేదో మెసేజ్ పంపుతోంది గావాల.

ఏం ఉంటుందో ఆ మెసేజుల్లో?

'రేపెక్కడ కలవాలీ, ఏం తినాలీ, ఎక్కడ పొర్లాలీ' ఇవేగా. ఇంటికొచ్చీ రాగానే ఆ బాగ్ సోఫాలో పడేసి ఓ పక్కన కూలబడితే, ఏంటర్థం. ఏసీ ఆఫీసుల్లో వెలగబెట్టే ఉద్యోగాలకు ఎట్లా వస్తాయి అంతంత నీరసాలు. దీన్ని, దీన్నసలూ అని కొద్దిగా ఆలోచించి, ఒక బూతు మాట అనుకున్నాడు. చేతిలో ఉన్న గరిటెను నేలకేసి కొట్టాడు. పెద్ద శబ్దం చేస్తూ మూల కెళ్లిపడింది.

ఆ శబ్దానికి మాగన్నుగా నిద్రపోతున్న ఆమె లేచి చూసింది. నిద్రపోయిన అయిదు నిముషాలకే లేచిందేమో, కళ్లు ఎర్రగా ఉన్నాయి.

పొద్దున పసుపుపచ్చ చీర కట్టుకునిపోయింది. ఎవడికైనా ఆ రంగు ఇష్టమేమో.

దీని తమ్ముడికి కాలిరిగితే , ఇంట్లో పెట్టుకుని కట్టు కట్టించి సాకిందెవడు. నా ఇంట్లోనే మూడునెలలున్నారు కుటుంబమంతా.

ఒక్క మాటన్నాడా తను. మోపులకు మోపులు కూర గాయలు తెచ్చిపడేశాడు. ఏమైనా విశ్వాసం ఉందా?

అసలు దాన్ని చేసుకోవడమే బుద్ధి పొరపాటు. ఇప్పుడనుకుని లాభమేంటి.

వేరే ఊళ్లో ఉద్యోగం వస్తే వెళ్లాడు. ఆమె ఈ వూళ్లోనే బాంక్‌లో పనిచేస్తుంది. పరీక్షలు పాసయి ప్రమోషన్ తెచ్చుకుంది. ఆమెకు వారమంతా పని. తనవద్దకు వచ్చే తీరుబాటుండదు.

'తీరుబాటుంటే మాత్రం వస్తుందంటావా బ్రదర్?' మనస్సాక్షి భుజమ్మీద చేరి కిచకిచలాడింది. దూరంగా బతుకు తున్నారనుకున్నాడు గానీ, దూరమైపోతారనుకోలేదు.

రాత్రి భోజనాలయ్యాక సోఫాలో కూర్చుని, వాల్యూం తగ్గించి టీవీ చూస్తున్నాడు. ఆమె బెడ్‌రూంలో లాప్ టాప్ మీద పని చేసు కుంటోంది. పదకొండయ్యింది. ఇక టీవీ కట్టేసి రమ్మంటుందేమో నని చూశాడు. ఆమె పిలవలేదు. అతను సోఫాలోనే నిద్రపోయాడు. మధ్య రాత్రి మెలకువ వచ్చి చూస్తే , చీకటిగా ఉన్నా, గది గోడలు నీలం వెలుతురుతో మెరుస్తున్నాయి.

టీవీ ఆపేసి ఉంది. పక్కనే చారల దుప్పటి కనిపించింది. అది తీసి కప్పుకున్నాడు. ఆలోచనలు నిద్రపోనివ్వలేదు.

రాత్రి ఫోన్‌లో ఆమె మెసేజెస్ టైప్ చెయ్యడం చూస్తూనే ఉ న్నాడు. ఎవరికైయ్యుంటుంది.

అలాగే పడుకుని సీలింగ్ వంక చూస్తూ పడుకున్నాడు. ఎప్పటికీ తెలతెలవారుతుండగా నిద్రపట్టింది.

❖

అతనొచ్చి వారం పదిరోజులవుతోంది. ఒకప్పుడు ఆమె ఉద్యోగం కన్నా మంచి పొజిషన్లో ఉండేవాడు. పెళ్లయిన రెండేళ్లకు అతను చేస్తున్న కంపెనీ మూతపడింది. వేరే ఊళ్లో ఉద్యోగం వస్తే వెళ్లాడు. ఇప్పుడది ఊడింది.

కొత్త ఉద్యోగం వెతుక్కునే వరకూ ఇక్కడే ఉండాలి. ఇది వరకు కూడా ఇలానే ఉండేవాళ్లమా? ఆమెతోనే కాదు, జ్ఞాపకా లతో కూడా ఒక లింక్ తెగిపోయినట్టనిపించింది. గలగలా మాట్లాడకపోయినా ఇల్లు నిశ్శబ్దంగా ఉండేది కాదు. ఎక్కువగా తన లాప్ టాప్‌లో పనిచేసుకుంటోంది.

మౌనంగా గడుపుతోంది.

రాత్రి వస్తే తలుపు తీసి మారు మాట్లాడకుండా లోపలికెళ్లి నిద్రపోతోంది. ఆమె ప్రవర్తించే తీరుతో బెడ్‌రూంలోకి వెళ్లే సాహసం చెయ్యలేకపోతున్నాడు.

ఇంట్లో కలిసి ఎంతసేపున్నా, ఇద్దరి మధ్యా ఒక్క విషయం కూడా చర్చకు రాలేదు.

"పనెలా ఉంది?" అడిగాడు.

తన గురించి అడుగుతుందేమోనని చూశాడు.

బాగానే ఉందన్నట్టు తలూపింది తప్ప ఇంకేమీ పొడిగించ లేదు.

ఉద్యోగం పోయిందని చెప్పినా ఏమీ ఆశ్చర్యం లేదు. అలాగా అన్నట్టు తలూపింది తప్ప, ఎలా పోయింది, ఇప్పుడెలా మరి, అన్న ప్రశ్నలేమీ లేవు. కొత్తది వెతుక్కునే వరకూ ఇక్కడే ఉండాలి. ఇది వరకు బట్టలు మాశాయనో, ఫలానా చొక్కా తనకు నప్పదనో ఏవో చెప్తూనే ఉండేది.

ఆ గదిలోకి, ఈ గదిలోకి తిరుగుతూ తను ఇంట్లో చెయ్యని పనుల గురించీ, చేస్తున్న పనుల గురించీ తిడుతూనో సాధిస్తూనే ఉండేది.

ఆమె మౌనం గురించి తన ఆలోచనలు తప్పేమో, అంతా తన అనుమానమేమో అనుకున్నాడు. అదేదో తేల్చాలి అన్న ఆలోచన లేకపోయినా, స్నానం అయ్యాక తడి టవల్ తెచ్చి హాల్లో సోఫాలమీద వేసి అక్కడే కూర్చుని టీవీలో వచ్చే చర్చ చూస్తున్నాడు. ఆమె వచ్చింది. ఆ టవల్ తీసుకెళ్లి బాల్కనీలో ఆరేసి, అక్కడే నిలబడి కింద రోడ్డు మీద ట్రాఫిక్‌ని గమనిస్తోంది. ఇదివరకెపుడైనా అదేపని చేస్తే ఆ రోజంతా సాధిస్తూనే ఉండేది. ఆసక్తి లేనపుడు గొడవలు కూడా రావేమో.

పరిచయం లేని వాళ్లింటికి అతిథిగా వెళ్లినట్లున్నది అతనికి. ఉద్యోగానికి దూరంగా వెళ్లి తప్పు చేశాడా?

❖

మర్నాడు మధ్యాహ్నం పూట కారు బయటికి తీశాడు. కారు ఇద్దరి కోసమని కొన్నారు. అది ఎప్పుడోగాని ఉపయోగించరు. ఆమె పనిచేసే బాంక్ వైపు వెళ్లాడు. ఆమెను కలుద్దామన్న ఉద్దేశంతో కాదు. ఏదో జరుగుతోందన్న అనుమానంతోనే! బూడిద రంగు చొక్కా వేసుకున్నాడు. జేబు దగ్గర రెండు మూడు లతలు ఎంబ్రాయిడరీ చేసి ఉన్న చొక్కా అతని పుట్టినరోజు అని ఇదివరకెప్పుడో ఆమే కొనిపెట్టింది .

ఆమెకు పారడైజ్ బిరియానీ ఇష్టం. అది పాక్ చేయించుకుని వెళ్లాడు. కొద్దిగా ఎండగా ఉందని గ్లాసెస్ పెట్టుకున్నాడు.

ఆఫీసు కెళ్లే సరికి లంచ్ టైం అయింది. ఎవరూ సీట్లలో లేరు. ఫ్యూన్ అతన్ని గుర్తు పట్టి మేడం కాంటీన్ కెళ్లిందని చెప్పాడు. అక్కడికెళ్లి చూస్తే ఆమె లంచ్ చేస్తూ కనిపించింది, ఎవరితోనో! అతన్ని ఇదివరకెన్నడూ చూసిన గుర్తులేదు. తెలియని వారు చూస్తే చక్కని జంట అనుకునేలా ఉన్నారు.

అతన్ని గుమ్మంలో చూసి , చెయ్యూపి దగ్గరకు రమ్మంది. పరిచయం చేసింది. పేరు వినిపించలేదు. చేతులు కలిపాడు. తన చేయి చల్లగా ఉన్నట్టు తోచింది. అతని చొక్కా జేబు మీద కూడా రెండు మూడు లతల ఎంబ్రాయిడరీ ఉంది. ఏవో మాట్లాడుతున్నాడు కానీ జేబు కింద సెగ రగులుతోంది.

❖

ఇంటికెళ్లడం ఇష్టం లేక ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు. ఆలోచనలు కూడా అతనిలానే! ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదని వాళ్ల నాన్న వచ్చి ఏడిస్తే కదా ఒప్పుకున్నది.

'ఆ... ఒప్పుకున్నావులే. అయితే ఇక జీవితాంతం నీతోనే ఉండి చావాలా? ఎవరినీ ఇష్టపడకూడదా? ఒక మనిషి మీద ఇష్టం ఎన్నాళ్లని ఉంటుందీ?'

మనసులోనే ఇంకెవరో ఎదురొచ్చి వాదిస్తున్నారు. దానికి శాస్తి చెయ్యాలి.

పార్క్‌కు దగ్గర్లో తెల్లని ఎత్తైన కట్టడం ఉంది. మెట్ల మీద కూర్చున్నాడు. పక్కనే పెద్ద చెట్టు. తెల్లని పాలరాతి మెట్ల మీద గాలి విసురుకు రాలిపడ్డ గులాబిరంగు దిరిసెన పూలను చూశాడు.

పాలరాతి చల్లదనం, పూలలో శాంతం, నిశ్శబ్దంలో ప్రశాంతత. అన్నీ తనని ఓదారుస్తున్నాయి. శాంతమంటున్నాయి. గుండెల్లో అలవి కాని సెగ కాల్చెయ్యకపోతే, ఈ అందాన్ని, ఈ శాంతాన్ని అనుభవించేవాడిని కదా అనుకున్నాడు.

ఎందుకీ బంధాలు. ఇప్పుడేం చెయ్యాలి. చచ్చిపోవాలా?

చాలాదూరం నడుచుకుంటూ వెళ్లాడు. ఊరికి దూరంగా ఉన్న ఒక బ్రిడ్జ్ మీద నిలబడి కిందికి చూశాడు. కింద చిన్న సెలయేరు లాంటిది ఉత్సాహంగా పోతోంది. బ్రిడ్జికి అటువేపు నడచి సెలయేరు ఎటుపోతోందో చూశాడు. వేరే నదిలాంటి ప్రవాహాన్ని కలుస్తోంది. రెండూ కలిసే చోట చిన్ని చిన్ని చేపలు ఎగురుతూ ఉన్నాయి.

ఎటువైపు దూకితే ఎక్కువ లోతుంటుందీ? అసలు లోతు లేకపోతే? కాళ్లు మాత్రం విరిగితే !

అలా కాదు. దూకితే ఒకేసారి పైకెళ్లి పోవాలి.

తను పోతే, హాయిగా వాడితో సుఖంగా ఉంటుంది. అలా జరక్కూడదు. తనకే పెద్ద ఉద్యోగం ఉండి, బాగా సంపాదన ఉండి ఉంటే, ఇలా చేసేదేనా?

తన చుట్టూ తిరుగుతూ, అన్నీ అమర్చేది. సెల్ఫ్ పిటీ ఓదారుస్తుంటే కొంత సేదదీరాడు.

దాన్నీ చంపాలి.

చంపేసి చనిపోవాలి.

చంపడం ఎలా. చావడం ఎలా?

గొంతు కోసేసి, తనూ అదే పని చేస్తే?

ఛీ ఛీ... ఏంటిది? కానీ తనకు హత్యలన్నా, ఆత్మహత్యలన్నా, ఎంతో భయం. న్యూస్‌పేపర్లో మర్డర్ల గురించి చదువుతుంటే, వెన్ను వణికేదతనికి.

దాని చావు దాన్ని చావనీ..

ఎన్నాళ్లని తనని భరిస్తుంది. వేరే స్నేహం వెతుక్కుంది. తప్పో, ఒప్పో తనెవరు. ఎవరి జీవితం వారిది... కళ్లవెంట నీళ్లొచ్చాయి. ఇంతేనా ఇక?

మల్లెచెండుని బలవంతాన రెండు చేతులతో లాగి తెంపినట్టూ, వేలు తెగి గాయమై, మల్లెలు ఎర్రబారినట్టూ, మనసంతా గజిబిజిగా ఉంది.

లోపల ఏదో తెలియని బాధ. తీరదు. తరగదు. ఉన్నట్టుండి కోసినట్టనిపిస్తుంది.

నడక సాగించాడు. నడిచే దారిలో గంటలు వినిపిస్తే లోపలికి వెళ్లాడు. ఏమి దేవాలయమో, దేవుడెవరో తెలియదు. లోపలికి వెళ్లి చల్లని రాతి మంటపం పై కూర్చున్నాడు. ఎటూ తెగని ఆలోచనలు. ఎటునుండో చల్లగాలి వీస్తున్నది. రావి ఆకులు గల గల మంటున్నాయి. నడివయసు దంపతులు అందరికీ ప్రసాదం పంచుతూ ఇతని చేతిలో కూడా ఒక పులిహోర దిన్నె పెట్టి వెళ్లారు. దాని వంకే చూశాడు. చావాలనుకుంటున్నపుడు తినడం ఎందుకని

పక్కన పెట్టేశాడు. ఎక్కడి నుండో వీస్తున్న చల్లగాలి అతన్ని సేదదీర్చాలని ప్రయత్నిస్తున్నా, వద్దన్నట్టు దూరంగా జరిగి స్థంభం చాటున కూర్చున్నాడు. ఏడిస్తే బాగుండనిపిస్తోంది. కానీ, ఎలా ఏడవాలి. అనుకున్న వెంటనే చావడం, ఏడవడం ఇవన్నీ సాధ్యమేనా??

కోరుకున్న వెంటనే చావగలిగే వీలుంటే భూమ్మీద ఎంత మంది బతికుంటారు గనక?

❖

ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఊరంతా తిరిగాడు. ఏదేదో చెయ్యమని మనసు లెక్కలేనన్ని సలహాలిస్తోంది. ఇంటికెళ్లడం నచ్చక షాపుల్లో తిరుగుతున్నాడు. ఓ షాపులో ఫారెన్ సెంట్లూ, షేవింగ్ సామాన్లు, ఇంకేవో విదేశీ వస్తువులు కూడా అమ్మకానికున్నాయి. కౌంటర్ మీద స్పై కెమేరాలున్నాయన్న బోర్డ్ కనిపించింది.

ఒక ఆలోచన మొలకెత్తింది.

"ఇంట్లో చిన్న పిల్లవాడిని వదిలేసి వెళ్తున్నాము. ఆయా బాగా చూస్తుందో లేదో తెలియడం లేదు. ఇది పెడితే రికార్డ్ అవుతుందా," అని అడిగాడు.

షాపతను ఒక సెకన్ ఇతని వంక చూశాడు. " నా ఫ్రెండ్ వాళ్లకు. అతనికుంది చిన్న పాప."

"పనివాళ్లనే కాదు సార్, ఎవరినైనా కనిపెడుతుంది. ఎన్ని కావాలి."

ఎన్ని కావాలో ఏమో? ఎట్లా చెప్పడం?

"రెండు తీసుకెళ్లండి. ఒకటి బెడ్‌రూంలోను, ఇంకొకటి హాల్లో!" అవి ఎలా అమర్చాలి, కనెక్షన్లు, అవీ అన్నీ వివరంగా చెప్పాడు. అవి పని చెయ్యడం మొదలయాక ఎలా చూడాలో ఫోన్‌లో ఒక యాప్ ఇన్‌స్టాల్ చేసి ఇచ్చాడు. ఇంటికి వెళ్లేసరికి మధ్యాహ్నమైంది. ఆమె ఆఫీసు నుండి రావడానికి ఇంకా టైముంది.

బెడ్ రూంలో కెళ్లి చూశాడు. బెడ్‌కు ఎదురుగా ఒక అద్దాల బీరువా ఉంది. అందులో ఆమె చీరలున్నాయి. ఒకటి నారింజ రంగు జరీ అంచున్న నల్ల పట్టు చీరకు , ముదురాకు పచ్చ పట్టు చీరకూ మధ్యలో పెట్టాడు. అక్కడి నుండి బెడ్ చక్కగా కనిపిస్తుంది. చీరల మధ్య కెమెరా అమరుస్తుంటే గుండె వేగంగా కొట్టుకుంది.

రెండవది తెచ్చి, హాల్లో టీవీ పక్కన ఉన్న ఫ్లవర్ వేజ్‌లో పొద్దు తిరుగుడు పువ్వులో నల్లని గింజల మధ్య అమర్చాడు. ఇంట్లో ఎవరైనా సోఫా మీద కూర్చుంటే తెలుస్తుంది.

'ఏమిటి తను చేస్తున్నపని. ఆమె అంటే నచ్చకపోతే, విడిపోవచ్చు. ఇదేం పని?'

'విడిపోవడానికి కారణం తెలియాలి కదా!' అని తనకు తాను జవాబు చెప్పుకున్నాడు.

ఆలోచిస్తే, ప్రతి తప్పుకూ చక్కటి సమర్థన దొరుకుతుంది.

❖

"సాయంత్రం బస్ కెళ్తాను. పెదనాన్నని పలకరించి వస్తాను. వంట్లో బాలేదని చెప్పింది చెల్లి."

"మళ్లీ ఎప్పుడొస్తావు?" చాలారోజుల తర్వాత ఓ మాటడిగింది. ఏదైనా ప్లానింగ్‌కు అవసరమేమో, అడుగుతోందను కున్నాడు.

"ఎల్లుండి."

ఇంటి నుండి వెళ్లి రైల్వేస్టేషన్‌లో కూర్చున్నాడు. రైళ్లు వస్తున్నాయి, పోతున్నాయి. రాత్రి అవుతూ ఉంటే రైళ్ల రాకలు తగ్గాయి. జనాలు కూడా తగ్గిపోయారు. తానమర్చిన కెమెరాల్లో రికార్డవుతున్నది లైవ్‌లో ఫోన్‌లో ఎలా చూడవచ్చో కెమెరా అమ్మిన షాపతను నేర్పాడు కానీ, ఫోన్ తియ్యాలంటే గుండె వేగం పెరిగి పోతోంది. ఏం చూడవలసి వస్తుందోనని!

ప్లాట్‌ఫాం మీద ఒక వెయిటింగ్ హాల్‌లాంటి గది ఒకటున్నది. లోపలికి వెళ్లి కూర్చున్నాడు. రెండు ఫాన్లు చప్పుడు చేస్తూ తిరుగుతున్నాయి. గదిలో ఓ మూల ఒక కుక్క ముడుచుకుని పడుకుని ఉంది. అతను లోపలికి రాగానే కళ్లు విప్పి ఇతనివంక ఓసారి చూసి మళ్లీ నిద్రపోతోంది.

అక్కడున్న మెటల్ కుర్చీలో కూర్చున్నాడు. ఫోన్ తీశాడు. చేతులకు చలి అనిపించింది. లేచి ఫాన్ స్విచ్ ఎక్కడుందో వెతికి ఆపేశాడు. నుదిటి మీద చెమటలు కారుతూ ఉన్నాయి. వెయిటింగ్ హాల్ తలుపులు విసురుగా మూసుకుంటూ చప్పుడు చేస్తున్నాయి. బయటికి చూశాడు. గాలిదుమారం వస్తోంది. కాసేపటికి వర్షం కూడా పడుతోంది. వర్షం నుండి కాచుకోవడానికి ప్లాట్ ఫాం మీద మనుషులు ఇతను కూర్చున్న చోటికి వచ్చారు. అక్కడున్న బెంచీలమీద సర్దుకోవడానికి ప్రయత్నిస్తూ ఒకరినొకరు ఆనుకుని కూర్చున్నారందరూ. రకరకాల వాసనలు అతన్ని చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తుఫాననీ, రాత్రంతా ఇలానే ఉంటుందనీ చెప్తున్నారు. పావుగంటకు కరెంట్ పోయింది.

వారందరి మధ్యా కూర్చున్నపుడు ఫోన్ తీసే వీలులేదు. పక్కనున్న వాళ్లేదో పొగ పీలుస్తూ ఉన్నారు. నిద్రపోదామని ప్రయత్నించాడు. దాన్ని నిద్ర అనొచ్చో లేదో... అంతా మెలకువగానే ఉంది కానీ ఈలోకంలో ఉన్నట్టులేదు. కళ్లు తెరిచేసరికి తెల్లవారింది. బెంచీ మీద పడుకుని ఉన్నాడు. మొహమ్మీద ఎండ పడుతోంది. కొత్త ప్రదేశంలో అంత వళ్లు తెలియకుండా ఎలా నిద్రపోయాడో అర్థం కాలేదు. ఇంటికి బయలుదేరి నడిచి వెళుతుంటే ఆమె ఫోన్ చేసింది.

ఇంటి తాళం ఏ కుండీ కింద జాగ్రత్తగా ఎక్కడ పెట్టిందో గుర్తులు చెప్పింది.

ఎవరూ చూడడం లేదని అనుకున్నాక కుండీ కింద తాళం తీసి లోపలికెళ్లాడు. జరుగుతున్నపుడు లైవ్‌లో కెమెరాలో ఎలా

చూడాలో షాపతను చెప్పాడు కానీ, ఇప్పుడు అయిపోయిన రికార్డింగ్ ఎలా చూడాలో అతనికి అర్థంకాలేదు. ఆ రెండు కెమెరా లనూ ఎక్కడ కొన్నాడో అదే షాపుకు తీసుకెళ్లాడు. రాత్రి పనుల వల్ల లైవ్ చూడలేకపోయాననీ ఇప్పుడు చూడాలనీ చెప్పాడు. షాపులోనే ఓ పక్కగా చిన్న గది ఉంది. అందులో ఉన్న కంప్యూటర్‌లో అవి చూసే ఏర్పాటు చేశాడతను. ముందు బెడ్ రూంలో పెట్టిన కెమెరా చూశాడు.

"ఇందులో ఏమీ రికార్డ్ కాలేదండీ" గట్టిగా ఊపిరి పీల్చు కున్నాడు. నుదుటిపై పట్టిన చెమటను అరచేత్తో తుడుచుకున్నాడు. కడుపంతా ఖాళీ ఉన్నట్టు, తల తిరుగుతున్నట్టూ అనిపించింది. సోఫాల ఎదురుగా పెట్టిన కెమెరాలో మాత్రం రికార్డ్ అయింది. ఆమెతో వేరే ఒక మగమనిషి కూడా కనిపిస్తున్నారు. అతనెవరో కాదు. ఆఫీసులో లంచ్‌టైంలో చూసిన మనిషి. ఇద్దరి చేతుల్లోనూ బుక్స్ . ఉన్నాయి. పోటీ పరీక్షలకు చదువుతోందనుకుంటా. నోట్స్ రాసుకుంటున్నారు. మధ్య మధ్యలో చర్చించుకుంటున్నారు. పుస్తకాలు తిరగేస్తున్నారు.

'పాపని చూసుకునే ఆయా మీద నిఘా అన్నావే, అదేమీ లేదేమని,' షాపతను అడగలేదు.

కస్టమర్స్‌ని ఏమడక్కూడదో అతనికి తెలుసు గనక.

రెండు గంటలసేపు చూసినా చదువుకుంటూనే ఉన్నారు. కంప్యూటర్ స్క్రీన్ వైపు చూస్తున్న అతనికి చెమటలు ధారలుగా కారిపోతున్నాయి.

షాపతనికి ఇతని బాధ చూసి జాలేసింది.

"వాళ్లేదో పరీక్షలకు చదువుకుంటున్నారు సార్ అంతే!" అన్నాడు. ఆ కాసేపటిలో అతనికా మాట చెప్పగలిగే చనువొచ్చింది షాపు ఓనర్‌కి.

"థాంక్స్" అని లేచాడు.

అతని వాలకం చూస్తే, స్థిమితంగా లేడని షాపతను అతనితో బాట బయటికి వచ్చాడు. కార్లో కూర్చునే వరకూ చూసి, "జాగ్రత్తగా సార్" అని చెప్పి, కార్ డోర్ వేశాడు.

కార్లో కూర్చున్నాక , తను చేసిన పనికి సిగ్గు పడ్డాడతను.

❖

'నీకిష్టం లేకపోతే విడిపో. అనుమానం ఉంటే విడాకులు తీసుకో. అంతేకానీ కెమెరా పెట్టడం ఏమిటి. తప్పు కదా! ఆమె మీద నిఘా పెట్టడానికి నీకేం హక్కుంది. తన బతుకు తాను బతుకుతోంది. నీకు సహాయం కూడా చేస్తోంది. ఎందుకలా చేశావు...'

మనసులోనే ఎవరో ఉగ్రంగా ప్రశ్నిస్తున్నారు. ఇక ఆమెను కోరుకునే హక్కు లేదనుకున్నాడు. ఫోన్ తీసి 'క్షమించు. నేను నీకు తగను. బెస్ట్ విషెస్' అన్న మెసేజ్ టైప్ చేశాడు.

పక్కకు చూస్తే షాపతను మెట్ల మీద నిలబడి ఇతన్నే చూస్తున్నాడు. మొహమాటంగా చిరునవ్వు నవ్వాలని ప్రయత్నిస్తూ చెయ్యూపి కారు పోనిచ్చాడు.

కారు కదిలాక షాపులోకి నడిచాడు ఓనర్. కస్టమర్లెవరూ లేరని కంప్యూటర్ దగ్గర కూర్చున్నాడు.

కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. అవి కంప్యూటర్ నుండి తీసెయ్యాలనుకుంటూ ఉండగా దృశ్యాలు మారాయి. ఆమె, అతను అప్పటివరకూ చదువుతున్న పుస్తకాలు మూసేసి పక్కన పెట్టేశారు.

వేరే సిలబస్ కవర్ చేయడానికి ఇద్దరూ సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆ పైన కనిపిస్తున్న ఆ విజువల్స్‌కు, షాపతని కళ్లు కుదుపు తిన్నాయి.

"సార్!" అంటూ అనాలోచితంగా బయటకు పరుగు తీశాడు. బయటికి వెళ్లి చూసేసరికి అప్పటికే కారు మలుపు తిరుగుతోంది. 'ఒక్కక్షణం ఆగి ఉంటే బాగుండేది.'

'కాదు, కాదు. అదృష్టవంతుడు. కొంచంలో యాక్సిడెంట్ తప్పింది.'

అనుకుని షాపులోపలికి వెళ్లబోతుండగా, వీధిమలుపులో పెద్దగా చప్పుడు వినిపించింది. మలుపు తిరుగుతుండగా ఎదురుగా వేగంగా వస్తున్న లారీని చూసుకోలేదతను.

షాపు నుండి పరుగు తీసి వెళ్లాడు. అక్కడ దృశ్యం చూస్తే, అతని కారు ఆనవాళ్లు లేకుండా ఉంది.

'దురదృష్టం! ఒక్క క్షణం ఆగి ఉంటే బాగుండేది. యాక్సి డెంట్ తప్పేది.' అనుకున్నాడు.



చందు శైలజ ప్రాథమిక విద్యాభ్యాసం తెనాలిలో, వైద్యవిద్య గుంటూరు మెడికల్ కాలేజీలో, పోస్ట్ గ్రాడ్యుయేషన్ మణిపాల్‌లోను సాగించారు. ప్రస్తుతం ఓమన్‌లోని, ఒక గవర్నమెంట్ హాస్పిటల్‌లో గైనిక్ విభాగానికి హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరు పిల్లలు- నైమిష, నీహార్ వైద్యవృత్తికి సంబంధించని రంగాలలో స్థిరపడ్డారు.

వాడొస్తాడు

ముల్లిపురం జగదీశ్



"ఒక వూరు... మూడు తుఫాన్లు" అంటూ ఆ వూరి దీనస్థితిని కవర్ చేస్తూ బాక్స్ ఐటమ్‌గా ప్రచురించింది ఒక ప్రముఖ దిన పత్రిక.

హుదూద్... తితిలీ... ఫొని. మూడు తుఫాన్లకీ దెబ్బతిన్న వూరు.

గిరిశిఖర గ్రామం. ఎప్పటినుంచో వెళ్లాలని వున్నా వాయిదా పడుతూ వస్తున్న వూరు.

ఆ కొండల మీద పండిన పశుపు కొమ్ములు... చీపుళ్లూ... చింతపండూ.

పదేళ్ల క్రితం ఆ వూర్లో నేను పనిచేసిన రోజులూ.

ఒక్కొక్కటిగా... నా మదిలో.

ఆధార్‌లూ, బయోమెట్రిక్‌లూ లేని రోజులు. ఏకోపాధ్యాయ పాఠశాలగా వున్న దాన్ని చుట్టుపక్కల వూళ్లన్నీ తిరిగి గిరిజన పిల్లల్ని చేర్పించి హైస్కూలుగా చేశాం. ఆరోజుది రోడ్డు లేని గ్రామం. స్కూలుకి వెళ్లాలంటే ఖచ్చితంగా నడవడం కాదు, కొండనెక్కాల్సి వుండేది. మందు మొక్కలకు ప్రసిద్ధి. ఆ కొండ మీద పండిన పశుపు కొమ్ములకు భలే గిరాకీ. చీపుర్లూ, చింత పండు అయితే షావుకార్లు కావిళ్లు కావిళ్లుగా గిరిజనుల చేతే కిందకి దింపించి చవగ్గా వ్యాపారం చేసేవాళ్లు. ఒక సారి విధులకని కొండ ఎక్కామా... మళ్లీ వారాంతంలోనే కిందికి దిగాలి. నాతో పాటు మరో ముగ్గురు. నేనా వూరికి రాకముందు వంతులవారీగా డ్యూటీలు వేసుకునే వాళ్లట.

ఇదంతా ఒక ఎత్తైతే అక్కడే ఆరో తరగతిలో చేరిన సన్యాసి నాకో సవాలుగా నిలవడం మరో ఎత్తు. వాడు స్కూల్లో చేరడమే ఒక వివాదంతో చేరేడు. బడి బయట వున్న పిల్లల్ని చేర్పించే కార్యక్రమంలో భాగంగా చుట్టుప్రక్కల వూళ్లన్నీ తిరుగుతున్నాం. తిరిగి తిరిగి సాయంత్రానికి వూరు చేరి స్కూలు ముందున్న చింత చెట్టు కింద కూలబడ్డాం. అప్పుడొచ్చాడొక ఆసామి. సన్నగా పొడుగ్గా వున్నాడు. మొలమీద లుంగీ... చేతిలో సగం కాలిన బీడీ ముక్క.

"గురూ! ఆ సన్యాసి గాడిని బడిల తోసిద్దు" అన్నాడు నా పక్కనే కూర్చుంటూ. "బడిమానీసిన గుంటడు గురువూ. తండ్రి లేడు. సుల్లారపోడని మేస్టులు పేరు తీస్సేరు"

"ఏమయింది?" అని అడిగాను.

"కేట్లబారుతోని ఆ మేష్టు వుంతున్న గదిలోన బల్బు సితగ్గొట్టీసినాడట. అందుకే ఆ మేష్టు ఈడిని ఒద్దనీసినాడు" చేతిలో చివరి దమ్ములాగి బీడిని చింత చెట్టు మొదలుకి రాస్తూ ఆర్పేడు.

అతడు వదిలిన పొగ ఇంకా గాల్లో తేలుతోంది.

నేను వాళ్లింటికెళ్లేను ఆ సాయంత్రమే.

మట్టిగోడల పూరిపాక. జేగురురంగు ఇంటి గడప అంచులకు మెరుస్తోంది. గోడ మీద చిన్న బల్ల... దానిమీద కొన్ని పాత పుస్తకాలు... పిచ్చికలు వదిలిన ధాన్యం గింజలు... దానికింద చిందర వందరగా వున్న నులకమంచం. ముంజూరు దూలానికి వేలాడుతున్న పిల్లల కోడి పొదుగు తట్ట. నన్ను చూసి కోడి 'కెర్‌ర్..' మని లేచింది.

"సన్యాసీ!" అని పిలిచేను నులకమంచం మీద కూర్చుంటూ.

ఎవరూ పలకకపోగా బయటినుంచి ఓ కుర్రాడొచ్చి నిల బడ్డాడు. చేతిలో ఆరిక తేగల్ని అడ్డతీగతో కట్టి వేలాడదీసుకుంటూ... భుజాన కేటల్‌బారుతో వచ్చేడు. వాడిని చూస్తే... అడవిని జయించినవాడిలా కనిపించేడు.

వాడి పేరు... కుశలమడిగి... నా ప్రక్కనే కూర్చోబెట్టుకుని అడిగాను...

"బడిలోకొస్తావా?" అని.

వస్తాననో... రాననో... సమాధానం ఎదురుచూసిన నాకు షరతు ఎదురయ్యింది.

"వస్తానుగాని..." ఆగిపోయేడు తెగిపోయిన నులక మంచం తాడుని లాగుతూ.

"చెప్పు... ఏం ఫర్వాలేదు. పుస్తకాలు... బట్టలు... భోజనం ఏమి కావాలన్నా అన్నీ ఇస్తాను," అన్నాను.

"అవేటీకాదు... గాని..." నేలచూపులు చూస్తూ అటు తిరిగి పోయేడు.

"చెప్పు. ఏం కావాలన్నా ఏర్పాటుచేస్తాను," అన్నాను సముదాయిస్తున్నట్టు.

దానికి వాడు వాడి భుజానున్న కేటల్‌బారు నావైపు చూపిస్తూ, "ఇది నాతోనే వుండాల," అన్నాడు.

"సరే" అని మా బడి వైపు నడిపించాను. కానీ మిగతా ఉపాధ్యాయ బృందం ఒప్పుకోలేదు. "అసలు వాడిని బడిలోంచి తీసేయడానికి కారణమే కేటల్‌బారు" అన్నారు.

"ఎలా?" అని అడిగాను.

ఆ రోజు... సాయంత్రం... చీకటి పడుతున్న వేళ... హాస్టల్ విజిట్ కోసం సంక్షేమాధికారి ఆపసోపాలు పడి కొండెక్కి చేరుకున్నారట. అలసిపోతూ నీరసంతో హాస్టల్ ఆవరణలోకి అడుగుపెట్టేరో లేదో వీడు ఆ కేటల్‌బారుతో గోడ మీది బల్బుని కొట్టి వూర్లోకి పారిపోయాడట సన్యాసి. బల్బు 'టప్' మని పేలింది. ఒక్కసారిగా చీకటైపోయింది. సరిగ్గా అదే సమయానికి దారి కనబడక ...పక్కనే వున్న గొయ్యిలో పడిపోయేరట ఆఫీసరుగారు. చిన్న చిన్న గాయాలయ్యేయి. 'వాడెవడు? ఆ కుర్రాడు మన

వాడేనా? ఇదేనా మీరు నేర్పుతున్న డిసిప్లిన్?' అని చీవాట్లు పెట్టి మందలించేరట ఆఫీసరు. అప్పటికి తల దించుకున్న మాష్టారు ఆ తెల్లవారే సన్యాసి పేరు తీస్సేరట. ఆ తరువాత వాడిని చేర్చుకోలేదు. ఆ మాష్టారు స్థానంలోనే నేను రావడంతో నిర్భయంగా అడుగుపెట్టేడు సన్యాసి స్కూల్లో.

"బల్బుని పగలగొట్టడం తప్పుకదా! ఎందుకు పగల గొట్టావు?" అని ఓ రోజడిగితే... చెప్పాడు కదా! "ఆరోజు.. వొచ్చి నోడు పోలీసనుకున్నానండి" అన్నాడు.

"అయితే నీకేమి?" అన్నాను.

"హాస్టల్లో గోడివతల ఆలున్నారండి," అన్నాడు.

❖

బయల్దేరేను. ఆ వూరెలా వుందో! వాడెలా వున్నాడో? ఏమి చేస్తున్నాడో? ఒక్కసారి ఆ వూరు చూసొద్దామని బయల్దేరేను. నీలకంఠాపురంలో బస్సుదిగి ఆ దారివైపు చూసేను. నడక దారి ... ఇప్పుడు తారోడ్డైంది. ఆకుపచ్చ కొండమీదికి ఎగబాకిన రోడ్డు నల్లగా మెరుస్తోంది. నడుస్తుంటే ఎవరో పలకరించారు "మేష్టారూ! బాగున్నారా?" అని. అతను బడ్డీ షావుకారి. ఆ రోజుల్లో ఇక్కడే బస్సుదిగి వారానికి సరిపడా సామాన్లు ఏవైనా వుంటే కొనుక్కొని వెళ్లేవాళ్లం. చెప్పాను అలా చూసొద్దామని. "చూడ్డానికేటుందండి... అంతా ఎగిరిపోయిందండి," అన్నాడు. "ఒకటా రెండా... మూడు తుఫాన్లు," అంటూ ఏదో గుర్తొచ్చినవాడిలా 'మేస్టారు!' అని అరిచాడు. నేను వెనుతిరిగాను.

"స్కూలెత్తేసారు కదా! ఇప్పుడెల్లి ఏటి సూస్తారు?" అన్నాడు. గతుక్కుమన్నాను.

"పిల్లలు లేరని స్కూలు కిందకి దించేసారండి"

"ఇప్పుడెలాగెల్తారు ఆ వూరు?" అన్నాడు. "ఏమి" అన్నట్టు చూసాను.

"రోడ్డైనంత మాత్రాన బస్సులెక్కెస్తాయనుకున్నారా కొండలు?' అన్నాడు. 'ఒక గంటాగితే మొండెంఖల్లు షావుకారి ట్రక్కరొస్తుంది. దాంట్లో ఎల్దురుగాని' అన్నాడు. అంతదాక బడ్డీలో స్టూలు వేసి కూర్చోమన్నాడు. అప్పటికీ ఇప్పటికీ వూరు చాలా మారిపోయింది. పూరిళ్లు పూర్తిగా అంతరించిపోయాయి. కొత్త మనుషులు. పరిచయస్తులెవరూ లేరు. నా దగ్గర చదువుకున్న వాళ్లు పెద్దవాళ్లైపోయుంటారు. ఒక్కరూ కనపడరేం? యుక్త వయస్కులై వుంటారు. ఎవరెవరు ఎక్కడెక్కడ వున్నారో? కొంత మందైనా ఉద్యోగులుగా స్థిరపడి వుంటారు. సన్యాసి ఏమి చేస్తున్నాడో?

బడ్డీ షావుకారికి ఏదో అడుగుదామనేంతలో ట్రక్కరు వచ్చింది. "మేష్టారూ! ఇదే బండికొచ్చేయండి లేకపోతే రాడాని కేటుండవు. వుండిపోతారు" అన్నాడు షావుకారి. ఎక్కేశాను. ట్రక్కు వూరు దాటి కొండదారి పట్టింది. జీడి తోటలు కొండల నిండా. తుఫాను దెబ్బకి సజీవ సాక్ష్యాలుగా.

ఒక్కొక్క కొండ దాటుతుంటే సన్యాసి గుర్తుకొచ్చాడు.

చేతిలో కేటల్‌బారు వుంటేనే క్లాసులో కూర్చుంటాననే షరతు ఒప్పుకున్నాక వాడు నాకు చాలా దగ్గరైపోయాడు. సాయంత్రం పూట చుట్టుపక్కల కొండల్నీ పరిచయం చేసేడు. వాళ్లమ్మ సేకరించిన తుమ్మికి పళ్లు, పెరట్లో పండిన దోసకాయలు తెచ్చిచ్చేవాడు. వాడితో స్నేహం నాకూ అలవాటైపోయింది.

ఓ రోజు...

"పెద్దయ్యాక ఏమౌతావురా సన్యాసీ?" అని అడిగాను.

"అన్నవుతానండి," అన్నాడు తడుముకోకుండా.

గతుక్కుమన్నాను. ఆ మాట వెనుక ఎవరుండి వుంటారు? ఏ పరిస్థితులు వాడిచేతలా మాట్లాడిస్తున్నాయి?

నా స్పందనలేవీ వాడికి కనిపించనివ్వలేదు. మెల్లగా అడిగాను, "ఎందుకు?" అని.

"అన్యాయం చేసినోడికి తుపాకితో కాల్చేవొచ్చండి," బెదురు లేని వాడి మాటలకు నాకు భయమేసింది.

నా భయం వాడి భవిష్యత్తు మీద.

ట్రక్కు మెల్లగా కొండ దాటుతోంది. రోడ్డు ఒక్కోచోట కోసుకుపోయింది. సేఫ్టీ వాల్ లేదు. వర్షం నీరు ఎక్కువవడంతో కోతకి గురైంది.

"ఈ రోడ్డెప్పుడేసారు?" మాటల్లోకి దించేను డ్రైవర్‌ని.

"ఏసి పది సమచ్చరాలయిందండి," అన్నాడు డ్రైవరు. "ఇది ఇలగైనా రాడానికి ఆడే కారణమండీ."

అతని వైపు చూసేను. యువకుడే. నోట్లో ఏదో నములుతూ వుండడం వల్ల శరీరం రంగు మారిందేమోగానీ తెల్లగా నిగనిగ లాడుతూ వుండేవాడు.

"ఎవరూ?" అన్నాను

"సన్యాసని... మా యూత్ లీడరండి" అన్నాడు.

"సన్యాసి నీకు తెలుసా? ఎలా వున్నాడు? ఏమి చేస్తున్నాడు," అని అడిగాను. నాలోని ఆతృతని గమనించాడో ఏమో "...వాడే లేకపోతే మా వూరికి రోడ్డొచ్చేది కాదండి. దీనికోసమే సంగంగా జట్టు కట్టేమండి. చుట్టుపక్కల వూర్లన్నీ తిరిగి కుర్రోలందరినీ పోగేసి ముందల నడిచేడండి," అని గేరు మార్చేడు.

గుండెల్లోంచి ఉప్పొంగిన ఉద్వేగం ఎందుకో ఆగలేదు. నా కళ్లలో నీటిపొరని గమనించేడో ఏమో... వాడు చిన్నగా నవ్వేడు.

నా కంటి తడికి అర్థం వీడికి తెలీదు. సన్యాసి భవిష్యత్తు గురించి భయపడినవాడిని... బాల్యంలో వాడి ఆలోచనలు తెలిసి ఏమైపోతాడోనని ఆందోళన పడినవాడిని...

అడవుల్లో వుండిపోతాను... ఎవడైనా తప్పుచేస్తే గురి పెడతాను అనే వాడి మాటలు గుర్తొచ్చి భయమేసేది వీడు పెద్దైతే ఏమైపోతాడోనని. ఈరోజు వాడు నాయకుడయ్యేడన్నమాట. తరగతి గదిలో నేను చెప్పిన పాఠాలు వృధా కాలేదనడానికి వాడే నిదర్శనం. నా తరగతి గదిలో తయారయిన ఆయుధం వాడు.

వాడి కోసమే ఒక్కొక్క సారి ప్రత్యేకంగా కొన్ని కథనాలు చెప్పేవాడిని. దాంట్లో భాగంగానే సామాజికాంశాలు జోడించి మాట్లాడేవాడిని. బేంకులెలా పనిచేస్తాయో... రెవెన్యూ అధికారులేం చేస్తారో... పోస్టాఫీసుల్లో ఏయే పనులు జరుగుతాయో... పోలీసులు ఎంత ఫ్రెండ్లీగా వుంటారో... (పోలీసులు ఫ్రెండ్లీ అంటే వాడు నమ్మలేదు) సమాజం పట్ల ఒక్కో వ్యవస్థ ఎలా పనిచేస్తుందో నని కథలు కథలుగా చెప్తూండేవాణ్ణి.

ఓ వేసవి సెలవుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా అందు బాటులో వున్న కొంతమంది విద్యార్థులను మండల కేంద్రానికి తీసుకు వెళ్లేరు. ఆటలూ... పాటలూ... రాబోయే విద్యా సంవత్సరంలో ఆసక్తి కలిగించడానిక కొన్ని అంశాల్లో బోధన దాని ఉద్దేశ్యం. ఆ కార్యక్రమాలు తూతూ మంత్రంగానే సాగు తుంటాయి. ఆసారి సన్యాసిని తీసుకువెళ్లి మండల కేంద్రానికి అప్పజెప్పారు హెడ్‌మాష్టరు.

కొన్ని రోజులు గడిచాక మధ్యలోనే ఇంటికి వెళ్లిపోదామని ఓ తెల్లవారు ఝామున ఆటోకోసం సెంటర్లో ఒంటరిగా ఎదురు చూస్తున్నాడు సన్యాసి. ఆటో రాగానే ఎక్కడికి వెళ్తుందో అడిగి ఎక్కేసాడు. ఆటో వాడు మాత్రం వాడి వూరి వైపు కాకుండా తిన్నగా పోలీసు స్టేషన్‌కి తీసుకువెళ్లి అక్కడ అప్పజెప్పేసాడు.

వూర్లో ఒక షాపులో దొంగతనం జరిగింది. ఖరీదైన వస్తువు లేవో దొంగిలించబడ్డాయి. ఇంత తెల్లవారున వీడే ఒంటరిగా తిరుగుతున్నాడని ఆ ఆటోవాడు వీడిని అప్పజెప్పేశాడు. సన్యాసిని స్టేషన్లో కూర్చోబెట్టేసారు. షాపు యజమాని ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా వీడిని పోలీసులు ప్రశ్నించారు. నిజంగా తనకేమీ తెలీదని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. రెండు రోజులు వదల్లేదు వాడిని. మండల విద్యాశాఖాధికారి పిలిపిస్తే నేనే వెళ్లాను. సన్యాసిని చూసి ఆశ్చర్యపోయాను. జాలేసింది వాడిని చూసి. కష్టంగా నడుస్తున్నాడు. ఒంటి మీద గాయాల్ని చూపించేడు. నిజంగా జరిగింది చెప్పమన్నాను. వాడు అబద్ధం చెప్పడని నాకు తెలుసు. హెచ్చరించి వదిలేశారు.

ఆ సెలవులు ముగిసి తరగతి గదిలో అడుగు పెట్టేనోలేదో నా మీద ఒక ప్రశ్నతో సిద్ధంగా వున్నాడు సన్యాసి. "ఇప్పుడు చెప్పండి. క్లాసులో మీరు చెపుతున్నదీ బయట జరుగుతున్నదీ ఒకటి కాదు. ఒప్పుకుంటారా లేదా?' అని. బడి బయట వాళ్లమ్మ కూడా నన్ను నిలదీసినట్టే అడిగింది. నాతో వున్న చనువుకొద్ది నన్ను ప్రశ్నించింది. "సెలవుల్లో ఇంటికాడ ఆడుకుంతున్నోడికి తిండిబెట్టి సదివిస్తామూ, ఆడిస్తమూ అని మీ మేస్టర్లే ఆడికి కొంజ బోయినారా? తీరా అక్కడికి పట్టికెల్లి చెయ్యని దొంగతనం అంటగట్టి గుంటడికి బాదెస్తారా?" అని నిలదీసింది.

సన్యాసి అమ్మడిగినదాంట్లో న్యాయముంది. తలవంచుకుని సర్ది చెప్పాను. కానీ సన్యాసి అడిగిన చిన్న ప్రశ్న ఈ వ్యవస్థమీద నమ్మకానికి సంబంధించిందిగా తీసుకున్నాను.

'సరే! ఇప్పుడేం చేస్తే నమ్ముతావ్?' వాడి ప్రశ్ననుంచి ఎలా తప్పించుకోవాలో తెలీక అడిగాను.

'నేను దొంగతనం చేయలేదు. చేయని దానికి స్టేషన్లో దెబ్బలు తిన్నాను. నేను దొంగను కానని నాకు కొట్టిన వాడిచే చెప్పించండి. అప్పుడు మీరు చెప్పేది నమ్ముతా'నన్నాడు.

'సరే' అన్నాను. స్టేషను ఎస్సైగారిని కలిసాను. ఆరోజు దొంగతనం జరగడం... షాపు యజమాని కంప్లైంట్ ఇవ్వడం వాస్తవం. కానీ కేసు ఎందుకని షాపు యజమాని కాగితాన్ని వెనక్కి తీసుకున్నట్టు చెప్పారు. మరి మా కుర్రాడిని ఎందుకు కొట్టేరని అడిగితే తేలిగ్గా తీసిపారేసాడు.

నా వెనకే వున్న సన్యాసి నా వైపు చూసేడు మీరోడిపోయారు అన్నట్టు.

నేను పట్టు వదల్లేదు. ఇది ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానంగా మాత్రమే తీసుకోలేదు.

డీఎస్పీకి ఫిర్యాదు చేశాను. ఐటీడీయే పీవో గ్రీవెన్స్‌లో కాగితం రాయించాను. ఎస్పీ, కలెక్టర్‌లకు కూడ సంప్రదించేను సన్యాసినీ, వాళ్లమ్మనీ పట్టుకుని. అందరూ మా ఫిర్యాదుల్ని పక్కకు పెట్టేసి ఏకవాక్య తీర్మానం చేసినట్టు చెప్పేసారు... సన్యాసినెవరూ కొట్టలేదని. దానికి సంబంధించిన రుజువులేవీ లేవని.

ఆరోజు సన్యాసి నావైపు చూసాడు కదా! ఆ చూపుల్ని తప్పించుకోవడానికి తల వంచుకున్నాను. నేను ఓడిపోయానని కాదు. వాడు ఎటువైపు ప్రయాణిస్తాడని.

ట్రక్కు వూరు చేరింది.

ఎగిరిపోయిన రేకులు... కూలిన మొండిగోడలు... విరిగి పోయిన కరెంటు స్థంబాలు. ఖాళీ చేసిన నిర్వాసిత గ్రామంలా కనిపించింది. స్కూలు మాత్రం భారీ బిల్డింగులతో నిలబడి వుంది నిబ్బరంగా. నేను బదిలీ అయిన తర్వాత మరిన్ని బిల్డింగులు లేచేయి. చుట్టూ ప్రహరీ కిచెన్, డైనింగ్‌హాల్, హాస్టలూ క్లాసు రూములూ వేరు వేరుగా. లోపలికి అడుగుపెట్టాను. ఒక్కో గదిలో ఒకొక్క కుటుంబం వుంది. ఆశ్చర్యంగా అడిగాను. ఒక్కొక్కరూ నన్ను గుర్తు పట్టి చుట్టూ చేరేరు. వరండాలో బడి వున్న రోజుల్లో నేను కూర్చునే చోటనే మంచం వేసేరు. కూర్చున్నాను. పేపర్లో వర్ణించిన దాని కన్నా ఘోరంగా వుంది వూరు. ఇల్లు లేక వూర్లోని అన్ని కుటుంబాలు ఎత్తేసిన స్కూలు బిల్డింగుల్లోనే తలదాచు కుంటున్నాయి. ఒక్కొక్క గదిలో ఒక్కొక్క కుటుంబం. ఇప్పుడది ఖాళీ చేసిన స్కూలులా లేదు. కొత్తగా కట్టిన తుఫాను బాధితుల పునరావాస కేంద్రంలా వుంది.

"వూరు ధ్వంసమైపోయింది బాబూ! పరిహారం కింద పదేసి వేలు బేంకిలోన వేసి చేతులు దులుపుకున్నారు."

"పడిపోయిన ఇంటికి ఇల్లు కట్టిస్తామన్నారు."

"నష్టపరిహారమిచ్చి ఆదుకుంటామన్నారు."

ఒక్కొక్కరు ఒక్కొక్క బాధ చెప్పుకుంటుంటే నిశ్శబ్దంగా

వినడం తప్పా ఏమీ చేయలేక ముభావంగా వుండిపోయాను నిస్సహాయంగా.

ఇంతకీ సన్యాసేడీ? ఎక్కడున్నాడు? ఏమి చేస్తున్నాడు? నేనొచ్చి ఇంతసేపైనా రాడేం? నేనొచ్చిన సంగతి వాడికి తెలీలేదా? అదే అడిగాను.

ఒక్క క్షణం మౌనం తేలియాడింది అందరిలో.

"ఆడే వుండుంతే బాగుణ్ణు బాబు!' అన్నారెవరో.

"అంటే...?" నా గుండెలదిరాయి.

ఒక్కొక్కరూ వారి వారి మాటల్లో వాడిని ఆవిష్కరిస్తున్నారు.

"మొన్న ఎలక్షన్ల కాసి సన్యాసి కనపడ్డం లేదు గురువూ."

"ఏమయ్యేడు?"

"తెలీదు బావూ..."

"ఏమయ్యింది?"

"అదొక పెద్ద తగువు గురువూ..." అని ఆగేడు భుజమ్మీది తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ.

"ఆడు సంగం పెట్టడం బయటోలికి నచ్చలేదు బావూ... ముఖ్యంగా కోట మనుసులుకి."

"పుట్టి బుద్దెరిగి, ఓటంతే తెలిసీది కాదు బావు మాకు... ఎలక్షన్లైమికి కోట మనుసులు వూర్లోకొచ్చి ఒకబక్క తాగడానికి రెండు టిన్నుల సార కొనీసిచ్చోలు బావు. తాగీసి ఇంటిలుండి పోడమే. మా ఓట్లు కోట మనుసులే ఏస్సి ఎలిపోయోలు బాబు. కోట మనిసే ఎమ్మెల్యే అయ్యోలు."

"సన్యాసి కాలేజి నుండి తిరిగొచ్చిన తర్వాత అందరితో మీటింగు పెట్టి, వూర్లన్నీ తిరిగి ఎవరి ఓటు ఆలే ఎయ్యాలని సెప్పేడు."

"దానికి తగువులు... ఎలగో ఒకలాగ ఓటేసేలిమి."

"ఆ తర్వాత కొన్ని రోజులకి కోట మనిషి గిరిజనుడు కాదని ఆల మాట ఇక్కడ చెల్లకూడదని నిలబడ్డాడు."

"ప్రతీ ఎలక్షన్లకీ నిజమైన గిరిజనుడికే ఓటేద్దుమని తీర్మానం చేయించేడు."

"మరొకపక్క అన్నలు ఓట్లెయ్యొద్దని పిలుపునిచ్చేరు... ఎలాగైనా ఓటెయ్యాల. అదీ మనకి నచ్చినోడికే అన్నాడు."

"మరొక్కాసి ఒకదానెనక తుపాన్లు. ఇల్లేటి... పంటలేటి అంతా వూర్సీసింది. అదికార్లూ... నాయకులూ... పార్టీలు... తగువులూ..."

"ఇల్లు దగ్గర తగువు మొదలయ్యింది. అందరికీ ఇల్లివ్వాలన్నాడు సన్యాసి. కుదరదూ కొన్నే సేంక్షనయ్యాయి కొందరికే ఇల్లొస్తుందని కోట మనుషుల తిరకాసు పెట్టేరు..."

"మా వూరి గురించి అడగడానికి నువ్వెడవని సన్యాసంతే... నీ పెద్దరికమేటని ఆలన్నారు... మాటకి మాట... వూరోలందరూ ఒక్కలాగుంతారేటి ఆలకి కొందరు సపోర్టు."

"అప్పుడే సంగం నడుం బిగించింది. ఇక్కడి నుంచి ఒక్క ఓటు కూడ కోటకి పడకూడదని."

"ఎలక్షన్ల ముందు రోజు నుంచే సన్యాసి కనపడ్డంలేదు. కోట మనుషులేటేనే చేసేరోనని అనుమానం గురువా... లేకపోతే పెమాదముందని ఆడే ఎక్కడో దాగిపోనాడో ఏటో మరి..."

"ప్రమాదమా?" నా ఆందోళనని బయటకు కనిపించనివ్వ లేదు.

"ఎత్తీసిన బడికోసం పోరాడేడు... రోడ్డు కోసం తగువాడేడు. వూరు జనం కోసం నిలబడ్డాడు. ఆడికేటేనే అవ్వాల... ఏటి సెయ్యడానికైనా రడీ," అన్నాడో ముసిలోడు.

వాడు కనపడకపోయినా అక్కడి వాళ్ల మాటల్లో స్పష్టంగా వినిపిస్తున్నాడు వాడేంటో.

"కొంపదీసి వాళ్లతో గానీ..." వాడి చిన్నప్పటి నుంచి నన్ను వెంటాడుతున్న సందేహం... అడిగాను.

"ఆ పని మాత్రం చెయ్యడు గురువూ... ఆడెప్పుడూ అంతుండోడు... ఇల్లు బాగు సెయ్యాలంతే ఇంటిలోనే చీపురు పట్టాలని," అది నేనెప్పుడో క్లాసులో చెప్పిన మాట.

ట్రక్కు హార్న్ మోగింది కిందకి దిగిపోతున్నానన్నట్టు. అందరి దగ్గరా సెలవు తీసుకొని ట్రక్‌లో కూర్చున్నాను.

వాడు...

కనిపించకపోయినా... కళ్లముందే కదలాడుతున్నట్టని పిస్తోంది.


నాకు నమ్మకముంది.... వాడొస్తాడు.



విజయనగరం జిల్లాలో జన్మించిన మల్లిపురం జగదీశ్ దాదాపు నలభై కథలు రాశారు. రెండు కథాసంపుటాలు ప్రచురించారు. స్వానుభవపూరకమైన అంశాలతో గిరిజన జీవిత కథలు రాస్తారు. ఉపాధ్యాయ వృత్తి. నివాసం పార్వతీపురం.

జ్ఞాపకం

కొలిబాబు మద్దూరి



"సార్.."

తలెత్తి చూశాను..

తలొంచుకుని చేతులు కట్టుకుని నిలబడున్న హెల్పర్ వాసు కనబడ్డాడు..

"ఇంటికెళ్తున్నారంట కదండీ...!! ఇందాక మా ఇంజనీరు గారన్నారు."

"అవును... పండగ కదా...! ఫ్యామిలీ ఇక్కడికొచ్చేవరకూ అస్తమానూ నేనే తిరుగుతుండాలిగా మరి..!!"

"అంతేకదా సార్.. మళ్లీ రిటర్న్ ఎప్పుడండీ...?"

"ఓ పదిరోజులుండి 18వ తారీఖుకొస్తాను. ఏం?"

"అదీ... మీరేమనుకోనంటే మావాళ్లొచ్చి మీకు నా స్టడీ సర్టిఫికెట్లు ఇస్తారండీ.. అవి కొంచెం తెచ్చిపెడతారని. అంతే సార్..."'

"సర్టిఫికెట్లా... హ్మా... సరే..."

తలూపాను.

"అంటే ఏమీలేదండీ... మా కంపెనీలో శాలరీ బాగా లేటయిపోతోంది. నాది వీసా కూడా అయిపోవచ్చింది. ఈసారన్నా కొంచెం మంచి జాబుకేమైనా చూసుకుందామనుకుంటున్నానండీ..."

పని పురమాయించినందుకు వినయంగా సంజాయిషీ ఇచ్చుకుంటున్నాడు.

"పర్లేదబ్బా వాసూ.. సరిఫికెట్సే కదా... దాన్దేముంది...? తెస్తాను. మీ వాళ్లకి నా ఫోన్ నెంబరివ్వు."

"చాలా థాంక్స్ సార్."

వాసు ఒంట్లో ఉన్న ప్రతీ అవయవంతో కృతజ్ఞత చెప్తున్నట్టు స్పష్టంగా కనబడుతోంది..

అయినా సరే ఇవేం పట్టించుకోనట్టు గుంభనంగా ఉండిపోయాను.

ఈ టైంలో ఇలా ఉంటేనే మన ఇమేజీ మరింత పెరిగేది మరి.

ఈ మధ్యనే ఓ సింగపూర్ లాజిస్టిక్స్ కంపెనీలో మూడేళ్ల ప్రాజెక్టొచ్చింది ఇంటర్నేషనల్ లెవెల్లో ఫేమస్ అయిన మా సాఫ్ట్‌వేర్ కంపెనీకి. ఆ ప్రాజెక్ట్ తాలూకూ హెడ్ & కోర్డినేటర్ అన్నీ నేనే.

అందుకని ఏదో పని మీద ఎలా లేదన్నా ప్రతీ రెండునెలలకో సారైనా ఇండియా - సింగపూర్ తిరుగుతుండాలి.

ఇక్కడికొచ్చాకా పరిచయమయ్యాడు ఈ కంపెనీలోనే హెల్పర్‌గా చిరుద్యోగం చేసుకునే వాసు. వాళ్ల అత్తగారిది, మా అత్తగారిది ఒకే ఊరని, పరిస్థితులు బాగోక సంవత్సరంన్నర క్రితం భార్యని పుట్టింట్లో విడిచి జాబ్ కోసం ఇంత దూరం వచ్చాడని మాటల మధ్యలో తెల్సింది.

మామూలుగా అయితే నా బరువు నాకు మోసుకోవడమే బద్దకం. అందుకని లగేజ్ ఏమీ లేకుండా ట్రావెల్ లైట్ ప్రిఫర్ చేస్తుంటా చాలాసార్లు.

ఇది అందరికీ చెప్పే రీజన్.

కాని ఎవరికీ కనిపించని, నాలోనే కని పెంచిన అసలు రీజన్ ఏంటంటే..

'బోల్డంత డబ్బు పోసి టికెట్లు కొనుక్కుని ఇండియా నించి అన్నేసి గంటలు ప్రయాణాలు చేసొచ్చేది వాళ్లకి వీళ్లకి లగేజీలు మోసుకురావడానికా, నాన్సెన్స్...' అనే ఈగోయిక్ & శాడిస్టిక్ ఫీలింగ్ అసలు కారణం.

పైకి మాత్రం అవేం పైకి క(వి)నబడనివ్వకుండా చిరునవ్వుతో 'నో' చెప్పగల ప్రతిభని స్మార్ట్ స్కిల్స్ పేరిట కార్పొరేట్ ట్రైనింగ్లో పదునుపెట్టారు కాబట్టి ఆ ప్రజ్ఞని అసాధారణంగా ప్రదర్శించేస్తుంటాను ఇలాంటప్పుడు.

❖

చెన్నైలో ఫ్లయిట్ దిగి ఇంటికొచ్చాను..

చిన్నచిన్న పన్లుంటే చూస్కుని తర్వాత మా భార్య వాళ్లూ రెల్లాం.

పల్లె అందాల్ని పీల్చుకుంటుండగా ఓరోజు ఫోన్ మోగింది.

"నమస్తే సార్‌గారు. నేను వాసు వాళ్లత్తయ్యగార్ని మాట్లాడత్నానండీ... బోన్సారాండీ..." ఓ పెద్దావిడ మాట.

"హా నమస్తేండీ.. చెప్పండి."

"వాసు సర్టిఫికెట్లు మీకిమ్మని చెప్పేడండీ..."

అణకువతో కూడిన అభ్యర్థన.

"హా..."

'మీకెప్పుడు కుదురుద్దో చెప్తే నేను పట్టుకొచ్చి ఇత్తానండీ...'

'... ...'

ఎంత అవసరం వాళ్లదైతే మాత్రం పెద్దావిడ్ని మన దగ్గరకి రప్పించుకోవడం బాగోదనిపించింది.

"పర్లేదు.. నేను కూడా ఇక్కడే ఊళ్లోనే కదండీ ఉన్నాను.. నేను సాయంత్రమొచ్చి తీసుకుంటా..." అని చెప్పి ఫోన్ కట్ చేశాను.

'శభాష్.. నేనూ సమాజానికి సేవ చేసేస్తున్నాన్నమాట' కాలర్ ఎగరెయ్యడానికి పక్కకి వెళ్లబోయాను.

"మీరెందుకు వాళ్లింటికెళ్లి మరీ తీసుకోవడం...?? వాళ్లనొచ్చి ఇవ్వమనండి...!!" మా మావగారి ఆశ్చర్యం..

"మీరేం వెళ్తారు...?? ఆవిడ వస్తానన్నారుగా...??" మా ఆవిడ అసహనం..

అది వీళ్లిద్దరి అమాయకత్వం. వీళ్లకి అర్థం కావట్లేదు... కొన్ని కొన్ని మాటల్లో చెప్పలేమంతే..

'అంత పెద్ద ఉద్యోగి అయ్యుండి కూడా మనింటికొచ్చి మరీ తీసుకెళ్లాడంటే చూడు ఎంత గొప్పమనిషో'నని వాళ్లనుకోవద్దూ..

మన కింద ఉండేవాళ్లు మనగురించి గొప్పగా చెప్పుకుంటుంటే కలిగే ఆనందం గురించి అసలు ఏం తెల్సని వీళ్లకి...??

తనని తాను తగ్గించుకున్నవాడు హెచ్చింపబడును..

ఎంత డౌన్ టూ ఎర్త్ ఉంటే అంత ఎలివేటగును..

ఆ లౌక్యం కూడా కూడా తెలీని ముక్కుసూటి అమాయకులు..

నవ్వి ఊరుకున్నాను.

సాయంత్రమైంది. ఫోన్ చేసి వస్తున్నానని చెప్పి బయల్దేరాం మా బావమరిది, నేనూ.

అడ్రస్ అడుగుతూ వేణుగోపాలస్వామి గుడి పక్కన కాస్త దిగువస్థాయి జనాలుండే ఆ కాలనీలోకి ఎంటరవ్వగానే వీధిచివర్న మా కోసమే ముతకచీర కట్టుకుని ఎదురుచూస్తున్న ఓ మధ్య వయస్కురాలు గబగబా పరుగులాంటి నడకతో మా బండి ముందుకొచ్చింది..

రొప్పుతూ దణ్ణం పెట్టబోయింది.

ఆవిడే వాసూ వాళ్లత్తగారని అర్థమవ్వడానికి ఎంతోసేపు పట్టలేదు. ఎందుకో నా మనసులో చిన్న అలజడి. అందరూ పెట్టే దణ్ణాల్లా లేదు ఈమెది..

ముఖం అంత చేసుకుని నవ్వుతూ కంగారు కంగారుగా పరుగులు పెడుతూ బండికెవరూ అడ్డం పడకుండా జాగ్రత్తగా వాళ్లింటికి తీసుకెళ్లింది.

ఇరుకుగా ఉన్న గేటులోంచి పిట్టగోడలు లేని డాబాలాంటి ఇంట్లోకి వెళ్లాం. ప్లాస్టిక్ కుర్చీలేసున్న వాకిట్లోంచి సగం కాంక్రీట్ చేసొదిలేసిన గోడల్ని చూస్తూ కూర్చున్నాం.

అటూఇటూ చూసిన మా బావమరిది ఆఖరికి సెల్ తీసుకుని అందులో పడిపోయాడు.

లోపల్నించి రెండు మిరిండా బాటిళ్లు తెచ్చి గబగబా మూతలు తీసి చేతిలో పెట్టింది.

"మీది పెద్ద పొజిషనని, మంచోళ్లని చెప్తా ఉంటాడండీ వాసు..." నిండుగా నవ్వుతూ చెప్పింది.

"మా ఆయనగారు లేరండీ... కొడుకు ఇల్లరికం బెజవాడెళ్లిపోయేడండీ... మా అమ్మాయిని వాసుకిచ్చి చేసేమండీ... మూడేళ్ల కిందట లారీ కొని అప్పులైపోతే అప్పట్నుంచీ ఆ కుర్రాడే అన్నిటికీ అలా సాగారతన్నాడండీ..."

లోపల తలుపు పక్కన నిలబడి మమ్మల్నే ఓ రకమైన ఆరాధనాభావంతో చూస్తున్న వాసూ భార్యని చూపించింది.


దాదాపు మా ఆవిడ వయసే ఉంటుంది. కుదురుగా, పద్ధతిగా ఉంది. చేతులు జోడించి దణ్ణం పెట్టింది.

ఎందుకో నాకే ఇబ్బందిగా అనిపించింది ఆవిడ్ని చూస్తే. ఆ అమ్మాయి చూపులు చూస్తుంటే భర్త యోగక్షేమాలు ఆర్తిగా అడుగుతున్నట్టు... ఇంకా ఎన్నాళ్లలో వస్తాడన్నట్టు... రకరకాల భావాలు ఆ కళ్లలో.

"హ్మ్... చెప్పాడండీ వాసు... ఇంతకీ మీరేం చేస్తుంటారు??" వాసూ వాళ్లత్తగార్ని అడిగాను మామూలు అవ్వడానికి ప్రయత్నిస్తూ...

"కూలి పనుల్లోకెళ్తానండీ.. ఈవేళ మీరొస్తన్నారని వెళ్ల లేదండీ.."

'అయ్యో... అనవసరంగా పాడు చేశానా ఓ రోజుని' అనిపించింది..



"మా అల్లుడుగారు చెప్తుంటాడు సార్... మీ దగ్గర ఏవన్నా..."

"చూద్దమండీ..."

నా చేతుల్లో ఏముండదు. ఆ విషయం వీళ్లకి చెప్పినా అర్థం కాదు.

"సర్టిఫికెట్లిస్తే బయల్దేరతామండీ. పనుంది."

లోపల్నించి వాసూ వాళ్ల భార్య పదిలంగా తీసుకొచ్చి ఇచ్చింది ఓ పసుపురంగు కవర్. ఆదిలక్ష్మి కట్‌పీసెస్ వారి బట్టల షాపులో ఇచ్చిన కవర్ అది.

నొసలు చిట్లించాను.

తీసుకుని బయల్దేరాం.

ఇంటికొచ్చాకా పక్కన పడేశాను.. సింగపూరెళ్లే రోజు దగ్గర పడటంతో లగేజీ సర్దుదామని ఈ కవర్ కూడా పెట్టబోతుంటే

రాంగ్ ఐటమ్ ఇన్ రైట్ బాక్స్ టైపులో నా లెదర్ బ్యాగుకి, ఆ పాలిథిన్ కవర్కి ఎక్కడా సరిపోవట్లేదు అసలు..

బంగారంపెట్టెలో ఇత్తడిముక్కలాగా ఉంది..

ఎందుకో చేతిలోకి తీసుకుని కాస్త పరీక్షగా చూశాను.

చేత్తో పట్టుకునే కవర్ హ్యాండిల్ దగ్గర ఓ ఎర్రరంగు బొట్టు స్టిక్కర్ అంటించి ఉంది.

ఏంటిది...??

ఆ... గుర్తొచ్చింది... ఈ పల్లెటూళ్లలో అద్దాలకు, బాత్రూమ్ లో గోడలకు అంటించుకుంటూ ఉంటారు కదా... అలాగే అంటించుంటారు ఈ కవర్‌కి కూడా. ఇదే నా మొహాన కొట్టారన్న మాట.

ఛీ ఛీ...

చాలా చిరాకేసింది నాకు.

ఇంకా నయం... జడ దువ్వుకున్నాకా రాలిపడ్డ వెంట్రుకల్ని కూడా ఇందులోనే దాచుకున్నారు కాదు. అవన్నీ పట్టుకు తిరిగితే ఏ చేతబళ్లు చేసుకునేవాడిలాగానో భలేగా ఉండేవాడ్ని. దేన్నైనా సహిస్తానుగానీ ఇలాంటి అలసత్వాన్ని మాత్రం అస్సలు భరించలేను.

పోన్లే అని వీళ్లింటికెళ్లి మరీ సర్టిఫికెట్లు తీసుకుంటే ఇలా పెంటకుప్పల మీద దొర్లే కవర్లో పెట్టి ఇస్తారా చేతికి...??

ఆ మాత్రం చూసుకోలేరా...??

ఒళ్లు మండింది.

❖

ఆ తర్వాత రెండ్రోజులకి ఇండియానించి సింగపూర్‌కి ఎగిరాను.

వెకేషన్ తాలూకా వేదన ఇంకా తీరకముందే డ్యూటీలో కొచ్చిపడ్డాను.

ఆ సాయంత్రం మళ్లీ నా డెస్క్ దగ్గరికొచ్చాడు వాసూ.

"ప్రయాణం బాగా జరిగిందా సార్," అంటూ.

"హా... మీ మిసెస్ వాళ్లింటికెళ్లా."

"చెప్పారు సార్. చాలా పొంగిపోయేరండీ మీరే స్వయంగా ఇంటికొచ్చినందుకు."

"అబ్బే... దాన్దేముంది వాసూ... ఇదెంత పనని...??" అన్నాను పైకి అమాయకం నటిస్తూ..

కానీ లోపలి మనిషి వేస్తున్న డ్యాన్సుల ముందు ప్రభుదేవా ఎందుకూ సరిపోడు..

"సర్టిఫికెట్లొక్కటే ఇచ్చారు. నీక్కావాల్సినవి ఏమైనా ఇవ్వమని చెప్పుండాల్సింది. ఎలాగూ ఖాళీగానే వస్తున్నా కదా..."

"అయ్యో పర్లేదు సార్."

"ఇవిగో సర్టిఫికెట్లు. అన్నట్టు ఆ సర్టిఫికెట్లు పెట్టి ఇచ్చిన కవరుకి ఏదో బొట్టు స్టిక్కర్ అంటుకుపోయింది వాసూ... పాపం చూస్కోలేనట్టుంది మీవాళ్లు..." కళ్లలో ఒకలాంటి శాడిజం.

నా మాటల్లో వెటకారం నాకే తెలుస్తోంది.

ఇంటికొచ్చిన పెద్దమనిషికివ్వాల్సిన కవర్ అలాంటిదాని వెక్కిరిస్తున్నట్టు ఉంది.

సందర్భానికి తగకపోయినా పట్టి చూపుతూ, ఎత్తి పొడుస్తున్నట్టు ఉంది.

మొహమాటంగా నవ్వాడు. ఓ రకమైన నిర్వేదం ఆ నవ్వులో.

"తీసేయ్ అది. మీ రూంలో ఎవరన్నా చూస్తే నవ్వుతారేమో. ఇంకేం దొరకలేదా అని' సలహా ఇచ్చి భుజాలు చరుచుకున్నాను.

ఒక్కక్షణం తలొంచుకున్నాడు. మెల్లగా గొంతు పెగల్చాడు.

"అది... కావాలని పెట్టిందే సార్..."

"వ్వాట్"

ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది నా చుట్టూ..

"రోజూ తను పెట్టుకునే బొట్టుని నాకు గుర్తుగా పంపింది సార్... తనివ్వగలిగేది, నేను దాచుకోగలిగేది, మీకు ఇబ్బంది కలగకుండా, మీకు తెలియకుండా తీసుకురాగలిగేది అదొక్కటే ననండీ."

పక్కనే పవర్ ప్లాంటులో ఉన్న కరంట్ అంతా ఒకేసారి షాక్ కొట్టినట్టు అనిపించింది. నోట్లోంచి మాట రావట్లేదు. ఏమనాలో తెలిస్తే కదా అసలు...??

ఎక్కడో మెలిపెట్టి తిప్పినట్టయ్యింది.

వాసూ వాళ్లింటికి వెళ్లినరోజు దగ్గర్నించీ జరిగినవన్నీ కళ్ల ముందు పరుగెడుతున్నాయి. ముఖ్యంగా ఆవిడ అమాయకమైన చూపులు...

పొట్ట చేత్తో పట్టుకుని దేశాలు దాటెళ్లిన భర్తకి...

పుట్టింట్లో ఒంటరిగా ఉంటున్న భార్య ప్రేమతో పంపిన జ్ఞాపకం గురించి నేను ఈసడింపుగా అన్నమాటలు...

చేసిన ఆలోచనలు...

అన్నీ కలగలిసి ఎక్కడో మెలిపెట్టి తిప్పేస్తున్నాయి. ఏమంటారో కూడా తెలీని ఫీలింగ్‌లాంటిదేదో తెగ కాల్చేస్తోంది.



మద్దుకూరి హరిబాబు ఉండేది దుబాయ్‌లో.
సచ్చేవి మెచ్చేవి రాసుకునేవి అన్నీ తెలుగులోనే.

అహం-దారం

లిఖి



"ఎలార్మ్ పెట్టారా?"

"ఊఁ"

"ఎన్నింటికి?"

"ఐదున్నరకి"

"అమ్మో...కుదరదు... ఐదింటికి పెట్టండి... అసలే దొండకాయ ఓ పట్టాన వేగదు."

"అబ్బా... ఇంకా పడుకోనేలేదు, అప్పుడే లేవడానికి తొందర."

"మీకేం బాబూ... అలాగే అనిపిస్తుంది. నాకివ్వండి ఆ ఫోను- నాక్కావాల్సిన టైముకి నే పెట్టుకుంటా."

"నేనే సెట్ చేస్తున్నాలే... అంత నమ్మకం లేపోతే ఎలా?"

"సరే... సరే! నాలుగూ-ఏభైకి పెట్టండి."

"ఇదిగో... ఐదన్నావు, ఒప్పుకున్నా. ఇంక బేరాలాడకు... కబుర్లాడక పడుకో. మళ్లీ మధ్యలో బుజ్జిగాడు లేస్తే నిదరుండదు నీకు."

"వీడు చూశారా? నిద్రలో నవ్వుకుంటూ ఎంత ముద్దుగా వున్నాడో? పగలు లేచున్నప్పుడు వాడితో కబుర్లు చెప్తూ ఉండక పోతే కేకలేస్తున్నటు ఏడ్చి మరీ అల్లరి చేస్తాడు. గబగబా ఓ రెండు ముద్దులు పెట్టేస్తా ఇప్పుడే... ప్చ్ ప్చ్."

"హూఁ... ఎప్పటికి నేర్చుకుంటావో అమ్మాయ్!"

"ఏంటి?"

"పడుకోక ముందు పిల్లాడికి, పడుకోబోయే ముందు పిల్లాడి తండ్రికీ... ముద్దులు పెట్టాలి అని"

"మీరిప్పుడు నేర్పుతున్నారుగా నేర్చుకుంటా... గుడ్ నైట్ మీకు."

"గుడ్ నైట్!"

❖

"ఊ... ఊ... ఊ... ఊ ఊ ఊ... ఊ... ఊ... ఊ... ఊ ఊ ఊ... ఊ... ఊ... ఊ... ఊ ఊ ఊ..."

"హ్మ్... ప్చ్... లేచాడా?"

"ఆఁ ఆఁ ఆఁ... పడుకోండి... ఇంకా తెల్లార్లేదు. ఊ... ఊ... ఊ... ఊ ఊ ఊ..."

"ఓహ్... "

"మీరు లేవకండి అన్నానా? నేను వీణ్ణి తీసుకుని హాల్లోకి వెళ్తా... ఇప్పుడిప్పుడే నిద్రొస్తోంది వీడికి. మీ గొంతు వింటే నిద్ర తేలిపోయి ఆడ్డం మొదలెడతాడు."

"ఊఁ"

"ఓంటమ్మా బుజ్జిగాడూ... నాన్నగారు లేవట్లేదు...కళ్లు మూసేసుకుని బజ్జో... అమ్మ ఊ... ఊ... పాట పాడతానే!... ఊ... ఊ... ఊ... ఊ ఊ ఊ... ఊ... ఊ... ఊ... ఊ ఊ ఊ... ఊ... ఊ... ఊ... ఊ ఊ ఊ..."

❖

ట్రింగ్... ట్రింగ్... ట్ర్...

"అరె ... అప్పుడే ఐదయిందా?"

"ఐదూ ఇరవై అవుతోంది. స్నూజ్ చేశాలే... పడుకో... రాత్రంతా వాడి ఉంగా-ఉంగా, నీ ఊ... ఊ... పాట వింటూనే వున్నా. ఇవాళ్టికి నాకు బాక్సొద్దులే..."

"ఫర్లేదులెండి. మీరు ఆఫీసుకి వెళ్లాక వాడూ, నేనూ బజ్జుంటాం ఎంచక్కా.... బోల్డన్ని దొండకాయలు తరిగుంచాను. కొత్తిమీర కారం కూర చేద్దామని. మీరు నాతో పాటే లేచిపోకండి. వాడు మీ పక్కన వెచ్చగా గువ్వపిట్టలా బజ్జున్నాడు. ఓ అరగంట మీరలాగే ఉంటే నా స్నానం, కుక్కర్ పెట్టడం అవుతాయి."

"సరే! మరి! ఓ అరగంటలో వచ్చి లేపు."

❖

"ఇదిగో మీ బ్రేక్‌ఫాస్ట్. ఇడ్లీ... పచ్చడి చెయ్యలేదు... కారప్పొడితో తినెయ్యండే!"

"అసలేం వద్దన్నానా? ఆఫీస్ దగ్గర ఏదో ఒకటి తినేసే వాణ్ణిగా! ఏం... నేను మంచి మంచి గ్లేజ్డు డోనట్లు అవీ తింటానని కుళ్లా నీకు?"

"డోనట్లు? మీరు? ఏం నంచుకుని? పండుమిరపకాయల పచ్చడా? పటిక బెల్లం ప్రసాదం పెడితే పచ్చిమిరపకాయ ముక్కలు కలుపుకుని తినే మీరు డోనట్లు తింటారంటే నేన్నమ్మా లనే? గబగబా కానిచ్చి బయల్దేరండి... ఇదిగో మీ లంచ్ బాక్స్..."

"హ్మ్... ఘుమఘుమ... నీ చేతి వంట, పండింది నా కడుపు పంట... "

"చాల్లెండి... అలా మీకు మీరే దిష్టి పెట్టేసుకోకండి... తినేది కొంచెమన్నట్టు, అనేది కుంచం తిన్నట్టు... "

"బావుందమ్మాయ్... నువ్వూ... నీ సొంత సామెతలూ..."

"మరి... ఎంతసేపూ గాంధీ అన్నాడు, నెహ్రూ చెప్పాడు అనుకోవడమే కాదు... మన జీవితంలోంచి మనమేం చెప్పుకోవాలా అనేదే లెక్క నాకు. అందుకే నా కోట్స్ నేనే అనుకుంటా... నా సామెతలు నేనే కనుక్కుంటా... "

"నేనింటికొచ్చేటప్పటికి రాసుంచు... నేను చదూకుంటా... బై మరి!"

"బై- జాగ్రత్త మరి. తొందరగా వచ్చెయ్యండి."

❖

"హలో!"

"హలో! భోంచేశారా?"

"ఊఁ "

"నచ్చిందా?"

"నువ్వు భోంచేశావా?"

"ఇంతసేపా? ఎప్పుడో తినేశా! బుజ్జిగాడితో పాకిపాకి తిన్నది కాస్తా అరిగి కూడా పోయింది. బుజ్జమ్మ కూడా బొజ్జ నిండా పాలు తాగి బజ్జున్నాడు. ఇంతకీ కూర బావుందా?"

"నాకు... ఇప్పుడే ఓ ఐదు నిముషాల్లో మీటింగొహాటుంది... ఓ గంటాగి ఫోన్ చెయ్యనా?"

"ఓ- ఔనా! సర్సరే! కానీయండి... ఇంటికొచ్చాక మాట్లాడుకోవచ్చు. బై మరి!"

"బై... "

❖

"హమ్మయ్య వచ్చేశారా? స్నానం చేసి వచ్చేస్తే వేడివేడిగా తినేసి... వెచ్చవెచ్చగా కూర్చుని కబుర్లాడుకోవచ్చు కాసేపు..."

"ఇప్పుడే ఆకలెయ్యట్లేదు నువ్వు తినెయ్."

"అరె... అదేం? ఒంట్లో బానే ఉందా?"

'ఓ.... సుబ్బరంగా వుంది."

"మరి? మధ్యాహ్నం మీటింగేదో అన్నారు... అసలు భోం చెయ్యడానికి టైం దొరికిందా?"

"ఆఁ "

"ఇంతకీ మీక్కూర నచ్చిందా?"

"హ్మ్."

"నచ్చలేదా?"

"అలా కాదు..."

"ఏదీ... బాక్స్ ఇవ్వండి... మళ్లీ రేప్పొద్దున్నక్కావాలి కదా... కడిగేస్తాను."

"అదీ... "

"అబ్బా! ఇవ్వండి బాబూ..."

"... ... ..."

"ఇంత బరువుగా ఉందేంటి?"

"... ... ..."

"అయ్యో! అసలు తినలేదా?"

"అదీ ... "

"... ... ..."

"అదికాదూ... ఎప్పట్నుంచో మా బాస్ కీత్ థాయ్ రెస్టారెంట్‌కి వెళ్దామంటున్నాడు. నువ్వు ఫోన్ చేసినప్పుడు కాల్ ఉందని చెప్పి పెట్టేశానా? అనుకోకుండా ఆ మీటింగ్ కేన్సెల్ అయింది. ఎలాగూ కాల్ లేదు కదాని నేనూ, కీత్ సెన్-థాయ్‌కి వెళ్లాం లంచ్‌కి... "

"ఓహ్!"

"పాపం... నువ్వు పొద్దున్నే లేచి అంత హడావిడి పడ్డావు..."

"... ... ..."

"అమ్మో! ఆణిముత్యమా! వద్దు నీ కంట నీటిముత్యమా!"

"అబ్బ చాల్లెండి... ఇంత మాత్రానికే ఏడ్చేస్తానా?"

"నువ్వే! ఇది నిజమే! అలగట్లేదా?"

"ఎంచక్కా వేడివేడిగా తిన్నారు ఆ కీత్ పుణ్యమా అని. నేనసలెప్పుడూ అనుకుంటూ వుంటాను... నేను ఎప్పుడో పొద్దున్న ఒండేసి, వేడిగా పెడితే ఉక్కిపోతుందని చల్లగా ఆరబెట్టి మరీ పెట్టేస్తాను... పాపం... ఆ చప్పగా చల్లారిన అన్నాన్ని మీరెలా తింటారా రోజూ అని? మంచిపని చేశారు."

"నిజంగా నీక్కోపం రాలేదా?"

"ఉహూ"

"నిజం?"

"నిజ్జం"

"... ... ..."

"అంత ఆశ్చర్యపోకండి సర్! నా దారం నా చేతిలో... మీ దారం మీ చేతిలో... సింపుల్! మీరెలాగూ ఇప్పుడే తిన్నన్నారు కాబట్టి ఈ బుజ్జిగాడితో ఆడుకోండి... నేనన్నం తినేసొస్తా..."

❖

"ఇవాళ నేను కార్ తీస్కెళ్లను. మెట్రోలో వెళ్తాను. బుజ్జిగాణ్ణి డాక్టర్ స్టీల్ దగ్గరికి సిక్స్ మంత్ చెకప్‌కి తీస్కెళ్లాలన్నావు కదా?"

"ఔను. వాడి అపాయింట్‌మెంట్ ఎలాగూ నాలుగింటికి. అయేటప్పటికి ఐదవుతుంది. డాక్టర్ ఆఫీస్ ఎలాగూ డౌన్-టౌన్ దగ్గరేగా. అదవ్వగానే మీ ఆఫీస్‌కేసి వస్తాను... కలిసొచ్చేద్దాం."

"అలాగే మరి... బై"

"బై... "

❖

"సారీ... కొంచెం ఆలస్యం అయింది. కారెక్కడ పార్క్ చేశావ్?"

"కారు మీ ఆఫీస్ గరాజ్‌లోనే పెట్టా. మీరొచ్చేదాకా సునీల్ కంపెనీ ఇచ్చాడు. ఇప్పటిదాకా ఇక్కడే వున్నాడు."

"పోన్లే... అడిగాడు కూడా... ఇండియా నుంచి వచ్చాకా బుజ్జిగాణ్ణి చూడ్డానికి రావడం కుదరలేదని... ఓసారి మనింటికి వద్దామనుకుంటానన్నానని."

"అదే చెప్పాడు... సరిగ్గా వీడు కూడా తనొచ్చేటప్పటికి లేచాడేమో... ఎత్తుకోవడానికి భలే సరదాపడ్డాడు."

"సునీల్ విశేషాలేంటి?"

"నన్ను వాళ్లావిడకి ట్యూషన్ చెప్పడానికి రమ్మన్నాడు..."

"హహహ ...అదేంటి?"

"ఏదో తన అభిమానం..."

"నీకు ఫ్యాన్ బేస్ బానే వుందని నాకు తెల్సు కానీ... అసలు సంగతేంటో?"

"ఏం లేదు ... మిమ్మల్ని కట్టేయకుండా వుంచుతున్నానని కోప్పడ్డాడు."

"అర్థం కాలే!"

"అదే! సార్‌ని సిగరెట్ కాల్చేనీకుండా చూడలేరా అనడిగాడు."

"నిజంగా? నామీద దండెత్తాడేంటబ్బా సునీలు? నువ్వే మన్నావ్?"

"బాబూ... సునీలూ... నా కన్నా మీ సారుకి బాగా తెల్సు అన్నీ... నా వరకు నేను ఒకసారి మాత్రమే అడిగా మానెయ్యమని. తను మానెయ్యలేక, మానేస్తానని నాకు చెప్పలేక ఇబ్బంది పడుతున్నారని తెలిశాక నేనింకా ఇబ్బంది పెట్టకూడదు కదా? ఎవరి జీవితపు సూత్రం, దారం వాళ్ల చేతుల్లోనే ఉండాలి. ఇంకోళ్లు అది లాక్కోవాలని చూడకూడదూ అని చెప్పా! అహంకారం శోభా నహీ దేతా, పర్ అహం అప్నా దారం పకడ్‌నే సే హీ సబ్ కుచ్ భీ హోతా అంటూ నాదో బహుభాషా-నా-నుడి కూడా చెప్పా."

"నీ అహం-దారం సూత్రం బావుంది... ఇంతకీ తనే మన్నాడు?"

"మీరోసారి మా ఇంటికొచ్చి మా ఆవిడతో మాట్లాడండి, మేడం అన్నాడు."

"వెళ్దామా మరి?"

"ఇంకా నయం! అలా వచ్చి వాక్కచ్చానంటే ఆ అమ్మాయికి నాకన్నా నచ్చనివాళ్లు ఇంకెవ్వరూ వుండరు, వుండబోరు. ఎవరి పాఠాలు వాళ్లే నేర్చుకోవాలి, ఎవరి పీఠికలు వాళ్లే రాసుకోవాలి."

"బావుందమ్మాయ్! నీ దారపు ఉదారానికి మెచ్చి నేన్నీకిచ్చే ఓ పన్-దారపు పేరడీ...

కనిపించని దారాలే
విడిపించే నా నిజదారే
హాయై మనసే మురిసే
చెలిమే తనతో పెరిగే
కనిపించని దారాలే... ఏ... ఏ...



లలిత టి.ఎస్. అన్న పేరుతో తెలుగులో బ్లాగ్, ఇంగ్లీష్‌లో బ్లాగులు వ్రాసే గరై (వడ్లమాని) లలిత స్వస్థలం కోనసీమ. కుటుంబంతో కలిసి ప్రస్తుత నివాసం సెయింట్ లూయిస్. వృత్తి కోటివిద్యల్లో ఒకటైన ఐ.టి. అభిమాన విషయాలు- స్నేహం, సంగీతం, సాహిత్యం. బ్లాగు: boldannikaburlu.blogspot.com

Paradise
Indian Cuisine
FINE DINE, BAR, GRILL & BANQUET

Paradise Indian Cuisine

Fine Dine, Bar, Grill & Banquet

Where Flavors Come First!

BRANCHES

Gwynn Oak, MD Location

* 1660 Whitehead Ct,
Gwynn Oak, MD 21207
410-594-9600

Ellicott City, MD Location

* 8000 Locust Mill St,
Ellicott City, MD 21043
410-203-1115

మేడిపండు చూడ మేలిమైయుండు

మూర్తి సంజనా పద్మం



టింగ్... అని తట్టిన పళెం గంట. అప్పుడే విడిచిన వాన. ఎట్టినా వాన మళ్లీ పట్టేలోగ బిడ్డల్ను పిలిచికొని పోవాల అని తేరేగుల్నీ మరగనుల్నీ అవసర అవసరంగ నిలిపేసి పరిగెత్తి వచ్చికోని ఉండిన అమ్మా అబ్బలు. దాన్నించి అయ్యిన రాకపోకని సరిచేసేదానికి సద్దు చేసికొని ఉండిన చూంపరి. నడువులా దోవ కనిపెట్టేదానికోసరం సద్దు తట్టికొని ఉండిన పలెం పేరేగులు. అన్నిటికంటే అలలు అలలుగా బైటకు వచ్చి కొనీ ఉండిన బిడ్డలు. ఇన్ని సద్దులకు నడువులా మెల్లిగ నడిచి వచ్చికొని ఉండింది ఆ పిల్ల.

నాండు దినం అంతా వాన కురిసికోనే ఉండింది. బిడ్డలు అందురును ఇంటికి పొయ్యేదానికోసరమనీ ఏమో అప్పుడు మట్టుకు విడిచింది. ఎట్టన్నా వాన మళ్లీ పట్టేలోగ ఇంటికి పోడవాల అంట తలిచి, వేగంగ నడిచికొని ఉండే ఆ పిల్ల. లేదు అనీతే ఎప్పుడునూ ఈ వేళకు ఈ సద్దులా ఆ పిల్లకు ఇంటికి పొయ్యేదానికే పట్టదు. నాండు దినమంతా ఇట్టనే ఏదో అవసరం గనే, పొయ్యి ఉండింది. బైట కురిసికోనే ఉండిన వాననించి ఆ పిల్లకు తరగతిని గమనించేదానికే కాలేదు, ఎప్పుడెప్పుడు ఇంటికి పోతుమా అంటనే ఉండింది. ఆ పిల్లకు మట్టుకే కాదు బిడ్డలు అందరికీ అట్టనే ఉండాది. గంట తట్టితట్టకుండనే వెళ్లికొని ఉండిరి.

మెల్లిగ ఆపిల్ల ఇగ్గాను దగ్గిరకి వచ్చింది. ఇనుకు తూరు పడి ఉండె. కోపం కోపంగ వచ్చింది ఆ పిల్లకు. ఐతే దీనికి ఓటీను చెయ్యను కాదు అంట తెలిసికొని, ఇగ్గానును ఒక తొక్కు తొక్కి, పెద్ద మచ్చును విడిచేసి, కూటి తిత్తిని ఇగ్గాను, మాటి, పళెం సంచిని బుజంలా బాగ తూకి పెట్టుకొని, మెల్లిగ ఇగ్గానును తోసికొని నడిచేదానికి ఆరంబించే ఆ పిల్ల. ఒకే సద్దుగాను గుంపుగాను ఉండింది. కొద్దిగా వేళ తాలి పోవచ్చు అంట తలిచితే వాన గీన పట్టుకునునో అనే బయం. సరీ అంటా, ఏడా చిక్కుకోకుండ ఎట్టన్నా బైటకు పోడవాల అంట తలిచి, పళెం తడక పక్కకు నడవను ఆరంబించే ఆపిల్ల. ఇన్ని సద్దులకూ నడువులా ఒగ పెద్ద సీకు సద్దూ, దానీకంటా పెద్దదిగా ' గో ఆన్ లైన్ ' అనీ మైవడిక వాతేరు వేసిన సద్దూ ఆడ ఉండేవాళ్లనీ అందరినీ తల ఎత్తి చూడ పెట్టింది. ఈ అన్నీ సద్దులనూ దాంటి ఇగ్గానును తోసికొన బైటకు వచ్చింది ఆపిల్ల.

ఈ పట్టెం రాకపోకను దాంటిన తోడనే ఒక అమది వచ్చేసింది. 'ఎన్ని తేరేగులు, ఎన్ని మరగాసులు, ఎంత రాకపోకా అంటా తలిచి కోపం తోడనే వచ్చికొని ఉండిన ఆ పిల్లను, వాన పడిన వాసన, జిల్లనీ వీచే గాలి, లేసుగా ఒళ్లు తాంకికోనీ ఉండిన సూర్యండి వెలుతురు, గుంపులు గుంపులుగా గూంటికి తిరిగి వెళ్లికొని ఉండిన గువ్వలు అన్నీను నెమ్మది చేసి. కోపాన్ని మరిచిపొయ్యి ఆ పిల్ల మనసు అమదిగా అయ్యింది. ఇగ్గానును చూసిన తోడనే ఆ పిల్ల మనసులోగా ఎన్నియో యోచనలు పరిగెత్తేదానికి ఆరంబించె.

నాండు కొద్దిగా ముంద్రోటనే పలెంకు వెళ్లి ఉండింది ఆపిల్ల. అబ్బ, అమ్మ, ఇద్దురు సామలు, చెల్లెలు, తమ్ముండు అందురూ బైటకు వచ్చి నీలిచికొని ఉండిరి. కూటి తిత్తి, పళెం సంచి అన్నీనూ అవనుగా ఉండింది. మెల్లిగ మరువును తట్టి వేసికొని, పళెం సంచిని ఎత్తి మాటికొని, కూటి తిత్తిని ఇగ్గానులా మాటేసి, అట్టనే తోసికొని పొయ్యి తడక కాడ నిలిసికొని, అందరికీ వచ్చేను అంట చెప్పేదానికి తిరిగి చూసింది ఆపిల్ల.

"చూసి పోవాల సరినా, మెల్లిగ పోవాల, నీడుబాటను దాంటేనప్పుడు దిగుకో, ఇగ్గానును తోసికోనే పో, అనేక అవతలకు పొయ్యి ఎక్కుకో సరినా, అనీక ఓరు నీలిపి మాటాడినా మాటాడ కూడదు తెలిసినా" అంటా ఆపిల్ల అమ్మ చెప్పేదానికి ఆరంబించె.

"వీడువు అదన్నీను ఆ పిల్లకు తెలుసు, పలెంకు వేళ అయ్యికోనీ ఉండాది చూడు, నువ్వు వెళ్లు పో" అంట ఆ పిల్ల అబ్బ చెప్పె. ఒక నవ్వు నవ్వేసి అందరికీ చెయ్యి ఊంచేసి, ఒకే సంతోషంగా వెళ్లింది ఆపిల్ల.

నాండు నడిచిన ఆ సంబవం నిండా బాగ గురుతు ఉండాది ఆ పిల్లకు. అదే ఆ పిల్ల మొదలుపాలి ఇగ్గనులా పలెంకు పొయ్యిన దినం. అది నడిచేదానికి ఒక వారం ముందర, వాళ్ల ఇల్లు ఒకే కలకలంగా ఉండె. దానిని తలిచి చూసినప్పుడు తనకు తెలవ కుండానే ఆపిల్ల మూతిలా ఒక నవ్వు వచ్చేసి. మెల్లిగ నవ్వికొనే ఇగ్గానును కుక్కపిల్లను తడివేనట్ట తడివిన నడిచికొని ఉండే ఆ పిల్ల. ఒక తేనీరు అంగటినీ దాంటి నడిచికొని ఉండింది. ఆ అంగటిలోగలుండి వచ్చిన ఉడుకుడుకు బజ్జీ బోండా వాసన కడుపులా ఆంకలిని రేపింది. ఇంటికి పొయ్యితే అమ్మ ఏదైనా ఉడుకుగా చేసి పెట్టుండు అంట తలిచకొనే నడిచింది. మళ్లీ ఆ గెవితిల్ల దూంకింది ఆ పిల్ల మనసు.

ఒక వారానికి ముందర వాళ్ల అబ్బ, ఆ పిల్లను ఇళ్లానులా పలెంకు అంపేది అంట చెప్పిన తోడనే, ఇంటిలా ఒకే సద్దు. ఇంకా ఆ దినం బాగ గురుతు ఉండాది ఆ పిల్లకు. నాండు అందురూ కూచుండి కూడు తినకొని ఉండిరి. అప్పుడు వాళ్ల అబ్బ ఈ విషయాన్ని చెప్పే. తోడనే వాళ్ల అమ్మ,"ఇప్పుడు ఏంటికి మీరు ఇగ్గాను. పొమ్మనికొని ఉండారు, వేరే ఓరన్నా ఇగ్గానులా వచ్చేరా చూడండ, అందురూ తేరేగిలో మరగనులో కొనివచ్చి బిడ్డల్ను విడిచికోనీ ఉండారు, ఈ పిల్ల మట్టుకు తనీగ ఇళ్లానులా పొయ్యేదా" అంట ఆరంబించె. "పళెం ముగించి వచ్చితే అలిసి పోవు, ఇంటిలా ఇందురు ఉండామే, ఓరో ఒకరు పొయ్యి పిలిచికొని వచ్చేదానికి ఏమి" అనింది అమ్మ.

దానికి వాళ్ల అబ్బ, "ఎంత వయస్సు అయ్యింది నీ కూతురుకు, ఈడ ఉండే పళెంకు కూడ పోనుకాదా, ఆ పిల్ల పోడుసు, నాకు తెలుసు, నువ్వు గెమ్మట ఉండు," అనీనాండు.

దానినీ వినిన వాళ్ల అమ్మ, అట్టనా అనే మాదిర ఆ పిల్లను చూసింది. ఆ పిల్ల, అమ్మను చూసి పల్లులు అన్నీ తెలిసినట్ట నవ్వింది. మొరసికొని, నాండు దానితోడ విడిచేసింది అమ్మ.

అవతల దినమూ దగ్గర దగ్గిర ఇట్టనే నడిచింది. అందరునూ ఆజారంల కూచుండి ఉండిరి. అబ్బ సోద చూసికొని ఉండితే బిడ్డలు నిట్టరవులా కూచుండి గుసగుస అంట ఏదో మాటాడికోని ఉండిరి. ఒక సామ పత్రిక చదువుకొని ఉండితే, ఇంకొక సామ ఏదో కూరాకును గిల్లుకొని ఉండింది. అప్పుడు వాళ్ల అమ్మ తేనీరును ఎత్తికొని ఆజారంకు వచ్చె. అందరికి ఇచ్చేసి తాగి అయ్యినాక "ఇప్పుడేంటికి ఇగ్గాను..." అంట ఆరంబించె.

దానినీ వినిన తోడనే కోపపడి, "నువ్వు గెమ్ముట ఉండు, ఎప్పుడు చూసినా అందురూ తేరేగిలో మరగనులో కొనివచ్చి విడిచేరు అనేవు ఆడ ఎంత రాకపోకనో చూసితివా," అంట ఆరంబించి, "మనం ఈ పట్టైంకు మార్చిందే ఇంటికి దగ్గిర ఉండాది అంట, ఇప్పుడు ఏమి ఇంత దగ్గిర ఉండే పళెంకు కోనీ పొయ్యి విడవమని చెప్పేవు, అందురూ చేసే పనినే మనమూ చెయ్యాలనా?? పనిలేకుండ. వాళ్లు అందురూ వాళ్ల బిడ్డలను పన్న కోడిలాల సాంకికొని ఉండారు, కాలుకు మన్ను అంటకుండ. మనమూ దానినే చెయ్యాలనా?? ఇప్పుడు నీకు ఏమి బయం, నీ కూంతురుకు ఏదన్నా అయ్యిపోవు అంటనా, అదన్నీ ఓటీను అవ్వదు, ఆ పిల్లకు తనను చూసుకోనేది తెలుసు, నాకు నమ్మిక ఉండాది," అనినాండు.

మల్లీ ఏమో చెప్పేదానికి వచ్చేలోగ, కూరాకును గిల్లికోనీ ఉండిన సామ, దిడీరుంట సద్దుగ, "అవతల ఆ అమ్మ ఇంటికాడ, ఓరో ఇద్దురు దొంగకుక్కలు మురగానులా వచ్చి, గొంతులా ఉండేదానిని అన్నిటినీ పీంకికొని, ఆ అమ్మను కింద తోసేసి పోడిసిరి అంట. ఏంజేసేది కాలం అట్ట చెడి పడింది. ఓరూ బైటనే పోను కాదాల ఉండాది," అంట ఓరో దగ్గిర చెప్పేనట్ట చెప్పేసి, వాళ్ల అబ్బను చూసి తలను ఊంచింది, ఏమో ఆ సంబవం ఇప్పుడు నడిచినట్ట. ఐతే అది నడిచి నాలుగైదు ఏండ్లుకు పైగా ఉండు. ఆ సామ ఎప్పుడునూ ఇట్టనే, ఏది చెప్పినా నేరుగా చెప్పనే చెప్పదు, సొంత కూంతురు దగ్గిర అయ్యినాను సరి.

దీనిని అంతా తలిచినే నడిచి వచ్చేనప్పుడు ఆ పిల్లకు వినాయండి గుడి కంటికి తెలిసింది. లోగాలుండి ఊదుబత్తి వాసన వచ్చింది. వాన పడిన మన్ను వాసనతోడ అదీను చేరి గమగమ అంట ఉండింది. ఆ వాసనకే ఇంకా ఆంకలి జాస్తిగ అయ్యింది. ఇంక రెండు మూండు మొక్కులు మల్లితే ఇంటికి చేరేయచ్చు అంట తలిచికొనీ, చుట్టూ ఉండేదానినీ చూసుకోనీ నేనవులను కదిలించుకొని నడుచుకొని ఉండాది ఆ పిల్ల.

నాండు ఆ సాము అట్ట చెప్పిన తోడనే ఆ మాటను విడిచేసి నాండు వాళ్ల అబ్బ. ఐతే అబ్బ విడిచినా మరుదినం అమ్మ విడిచే నట్ట తెలవలేదు. మల్లీ దానినే ఆరంబించింది. దగ్గిర ఉండే పలెంకు పొయ్యేదానికే ఇన్ని పాలి మల్లి మల్లీ ఇంటిలా జగడం వేసికొని ఉండిన వాళ్ల అమ్మ, అంత లేసు ఐన మనిసి కాదు. ఆ కాలంలోనే తమ్ముండినీ ఇనుల వెండ్రోట కూచుండ పెట్టికొని ఓరును లేని దోవలా తనింగ ఐదారు కిలోమీటర్లు తొక్కికొని పళెంకు పొయ్యిన మనసే. ఐతే కూంతురు అంట వచ్చేనప్పుడు ఒక వెరపు. వాళ్ల అమ్మ మాటాడేది అన్నిటినీ వినేసిన వాళ్ల అబ్బ, "నువ్వు ఎంత దూరం ఇన్దాసులా పొయ్యి చదివి ఉండావు, ఇప్పుడు నువ్వే ఇట్ట మాటాడితే ఎట్ట, నీ కూంతురి పైగా నీకే నమ్మిక లేదా," అని నాండు. "అవ్వు, అది వేరే కాలం ఇది వేరే కాలం, ఆ పిల్ల పొయ్యినానూ ఇప్పుడు కాలం చెడి పడింది," అనింది. దానిని వినిన వాళ్ల అబ్బ "అదేమి అందురూ కాలాన్ని తప్పు చెప్పేసేది?? అన్నీ కాలాలు ఒకటే, మనిసిల్ల మంచివాళ్లూ ఉండారు చెడ్డవాళ్లూ ఉండారు." అని చెప్పేసి, ఆ పిల్లను చూసి "ఈడ చూడు బంగారం, ఈ లోకంలో అందురూ మంచివాళ్లూ కాదు, అందురూ చెడ్డవాళ్లూ కాదు. ఎవురు ఎట్ట అనేది నువ్వు తెలుసుకోవాల అనితే, నువ్వే బైటకు పోవాల, నువ్వే ఈ లోకాన్ని చుట్టాల, అప్పుడే తెలుసుకొనవు. ఇప్పుడు అమ్మా అబ్బ నీడలనే, చెడ్డనే తెలవకుండ పెరిగేస్తే, ఒకనాండు ఎదన్నా చెడ్డ నడిచితే, దానిని ఎట్ట ఎదురుకొనేవు, అన్నీ బయం లేకుండ తెలిసి పెట్టుకోవాల. ఈ లోకంలా మంచిది వచ్చినా చెడ్డది వచ్చినా నువ్వు సమాళించుకుంటువు అనే నమ్మిక నాకు ఉండాది. ఈడ ఉండే పళెంకే ఇగ్గానులా పొయ్యేదానికి పెరిచికొని ఉండితే ఎట్ట" అని నాండు. దానిని వినినాక వాళ్ల అమ్మ ఇంక ఓటీను మాట్లాడ లేదు.

వాళ్ల అమ్మ ఒప్పుకోనీనా, ఇంట్లో ఉండేవాళ్లు విడిచేనట్ట తెలవలేదు. మరుదినం ఆ పిల్ల వాళ్ల, అత్తమ్మ మామాయి ఇద్దురునూ వచ్చి ఉండిరి. అప్పుడు ఒక సామ పొయ్యి, వాళ్ల ఇద్దరికీ ఇంటిలో నడిచినదానిని అంతాను చెప్పింది. వినిన తోడనే అత్తమ్మ ఆ పిల్ల దగ్గిర కూచుండి, "పిలుసుకొని పొలేదు అనితే, ఇంకమట పట్టైంకే పోను అంట ఏడువు" అనింది. దానిని వినిన ఆ పిల్లకు నవ్వు వచ్చింది. ఆ నవ్వును చూసి, "ఏంటికి నవ్వేవు, నిజంగనే చెప్పేను, మీగత బిడ్డలు అందురుసూ వాళ్ల అమ్మాబ్బల కూడనే వచ్చేరు కాదు, నువ్వు మట్టుకు ఏల తనీగ ఇగ్గానులా పొయ్యేవు, అదీను ఇంటిలా ఇందురు మనిసిలను పెట్టికోనీ, మాకు అందరికీనూ ఏమీ పనీ, నువ్వు ఇళ్లానులా పోనే వద్దు" అనింది. ఆపిల్లకు అబ్బ నిన్న చెప్పిందే నీండా పట్టింది. దీనిని అంతాను వీనికోని ఉండిన ఇంకొక సామ "బిడ్డా నీకు ఎట్ట పోవాల అంట తోంచునో అట్టనే పో" అనింది. ఆ సామ ఎప్పుడూ అట్టనే, ఓరినూ తప్పు చెప్పదు, ఏమి మడువు ఎత్తినాను అదే సరి అని చెప్పు.

ఈ నెనవుల్లానే మునిగి ఉండిన ఆపిల్లను, 'పాం పాం' అనీ సెంకు తట్టికొని, బండిలా వేగంగా వచ్చిన పాలమనిసి, బైటకు గుంజినాండు. ఇంకా ఇంటికి రెండు మొక్కులు మల్లితే చాలు. 'ఇంత దగ్గిర పెట్టైం ఉండినాను, ఆడ ఉండే సద్దూ రాకపోకానూ ఈడ కొద్దిగా కూడ లేదే' అంటా తలిచిన ఆ పిల్లకు మల్లీ తోంచింది, ఇంటిలుండి మట్టుకే కాదు, పళెంలుండినూ ఇగ్గాను యోచనకు ఎదిరింపు ఉండింది అంట. ఎట్టనో ఇంటివాళ్లను అందరినీ సమాళించేసి అబ్బ. ఐతే పట్టైం మొదలరికి కమ్మ రాసి

ఇయ్యకుండ వీడవము అనేసిరి. 'సరైన పన్న కోడిలను సాంకికోనీ ఉండారు' అంట తిట్టికోనే ఒక కమ్మను రాసి ఇచ్చి, అనుమతి తీసి ఇచ్చినాండు అబ్బ. తలిచి చూసేనప్పుడు అంతా, ఇంత దగ్గిర ఉండే పళెంకు ఇగ్గానులా వచ్చేదానికి ఎంత పనీ చెయ్యవలిసి వచ్చిందో అనిపించే ఆపిల్లకు.

ఇంకా ఆ దినం నడిచింది బాగ గురుతు ఉండాది ఆ పిల్లకు. మొదలుపాలి ఇనుల పళెంకు పోడిసి ఇంటికి తిరిగి వచ్చినప్పుడు నడిచింది అది. చూసితివా అన్నట్ట అబ్బ ఆ పిల్ల అమ్మను చూసినాండు. దానికి వాళ్ల అమ్మ "అవ్వు, ఈ ఓటింకాల్ పలెంకు మీ కూతురు ఇళ్లానులా పొయ్యిందానికి ఇంత ఎచ్చులు చూంపేరు" అనింది. అవ్వు, తడికి పడితే పళెంలా పడేనంత దగ్గిర ఉండాది. ఇది ఓటీను పెద్ద సాదన కాదు, ఐతేనూ అందురూ వద్దు అన్నప్పుడు వాళ్ల అబ్బ మట్టుకు అందరినీ ఒప్పించి, తనను ఇగ్గానులా అంపిపెట్టింది ఒక నమ్మీకను ఇచ్చింది ఆపిల్లకు," బంగారం ఈ లోకంలా అందురూ మంచివాళ్లూ కాదు అందురూ చెడ్డవాళ్లూ కాదు, ఓరు వచ్చినా నువ్వు సమాళించేసుతువు అనే నమ్మీక నాకు ఉంది అంట అబ్బ చెప్పిన మాటలు ఆ పిల్లకు గురుతు వచ్చె. ఈమాట చాలు, ఏడు కడల్లు దాంటి, ఎన్నెన్నో మలలు దాంటి, ఏమి కష్టం వచ్చినా ఒకే చెయ్యిలా సమాళించెయ్యచ్చు అనే నమ్మికను ఆ పిల్లకు ఇచ్చింది.

ఇదంతా తలిచకొనే ఇంటికి వచ్చి చేరింది ఆ పిల్ల. తడకను మూసేసి ఇగ్గానును నీలిసికొని ఉండాది. ఇంటిలోగాలుండి పెద్దదిగ ఒక సద్దును వీనింది ఆ పిల్ల. ఏనాలు అన్నీ ఉరులుకొని ఉండి. అమ్మా అబ్బా జగడాలు వేసికొని ఉండారు. "బైటకు పొయ్యే, పనీచెయ్యాల అంట ఏమీ ఉండాది. ఇంటిలో ఉండికోనీ బిడ్డలనూ నన్నూ చూసికొనీతే చాలు. నువ్వు అట్ట ఓటీ పెద్దదిగ సంపాదించి చింపద్దు. ఇంటిపనిని చూసికొనితే చాలు. నువ్వు సంపాదించే మేము కూడు తినాలంట లేదు" అంట అబ్బ గొంతు పెద్దదిగ వినపడింది. డమ్మంట ఆ పిల్ల చేతిలుండి కిందపడింది ఇగ్గాను.

పట్టెం -స్కూలు
తేరేగి - కారు
మరగాను - మోటార్ బైకు
రాకపోక - ట్రాఫిక్
చూపరి - వాచ్మేన్
పేరేగి - బస్సు
పట్టదు - నచ్చదు
ఇగ్గాను - సైకిల్
తూరు -చిల్లి
ఓటీను- ఏమీ
మూచు - ఊపిరి
తడక- గేట్
సీకు - విసిల్
మైవడిక వాతేరు - పీటీ టీచర్
అమది-ప్రశాంతం
అవను - తయారు
మరువు-మూ
నీడుబాట - మెయిన్ రోడ్
మొరసి - ఉరుమి సూసి
ఆజారం-వరండ
సోద - వార్తలు
నిట్టిరవు - సోఫా
సామ - అవ్వ
పన్న కోడి-బ్రాయిలర్ కోడి
మొక్కు- మలుపు
సేంకు - హారన్
మొదలరి - ప్రిన్సిపాల్
ఉరులు - దారులు




తెలుగుభాషకు దూరమైన కొంగునాడు ప్రాంతంలోని ఉడుమలపేటలో నివసించే 16 ఏళ్ల సంజనా పద్మం తెలుగు నేర్చుకుని, వారు మాట్లాడుకునే తెలుగులో రాసిన కథ ఇది. ఇలా దాదాపు పాతిక కథలు రాసింది. 'రేగడి నీడల్ల' పుస్తకం వెలువడింది. నవల రాసే ప్రయత్నంలో ఉంది. 2017 సెయింట్ లూయిస్ తానా సభల అతిథి.

Telligen Tech
Information Technology Services

త్రిశంకు స్వర్గం

అన్నిటికీ చెడ్డ రేవడి

ముళ్లపూడి కృష్ణమోహన్



ఆనంద్ ఆఫీస్ నుంచి వచ్చాడు. ఇల్లు అంతా నిశబ్దంగా వుంది. పిల్లలు స్కూలుకి, భార్య ఆఫీసుకి వెళ్లారు. సాయంకాలం దాక రారు. టీవీ ఆన్ చేసి, అమెజాన్ ప్రైమ్‌లోకి వెళ్లి లేటెస్ట్ గా వచ్చిన 'నిన్నుకోరి' సినిమా స్టార్ట్ చేశాడు. పొగ తాగడం ఎందుకు మంచిది కాదో వివరిస్తున్న యాడ్‌తో మొదలైంది అన్ని సినిమాలు లాగానే. విసురుగా సోఫా నుంచి లేచాడు, భయంకరమైన సినిమాలు చూసినా తనకి ఎప్పుడూ భయమేయలేదు, ఈ పొగతాగటం మీద యాడ్స్ చూస్తే మటుకు తనకి ఒకరకమైన భయం, అసహ్యంతో పాటు, కోపం కూడా. ఎవడైనా మంచి మూడ్‌తో సినిమా చూడాలనుకుంటాడు కానీ ఈరకమైన యాడ్స్ తో సినిమాలు మొదలు పెట్టి మూడ్ అంతా పాడుచేస్తున్నారు. నిజంగా కాల్చేవాడు, దీనిని చూసి ఆపుతాడా, తగలేయడానికి వాడి రీజనింగ్ వాడికుండదూ? కాఫీ కలుపుకుని వచ్చాడు. టైటిల్స్ అయి, సినిమా మొదలైంది.

ఫోన్ మోగింది, భార్య రమ చేసింది. బిజీగా వున్నారా అని, తను నేనింకా ఆఫీస్‌లో ఉన్నాననుకుంటోంది.

"అవును బిజీగా వున్నా సినిమా చూస్తూ ఇంట్లో," అన్నాడు ఆనంద్.

"అదేంటి ఆఫీస్ నుంచి అప్పుడే వచ్చేసారా?" అంటూ ఏదో డౌట్ వచ్చి, "ఉద్యోగం పోయిందా?" అంది.

"భార్యని బెటర్ హాఫ్ అని ఎవడన్నాడో కానీ వాడికి హాట్స్ ఆఫ్," అంటూ, "నీ గెస్ వర్క్ కరెక్ట్," అన్నాడు మెచ్చుకుంటూ.

"సర్లే! ఉద్యోగం పొయిందన్న బాధ లేదు," అంది.

"బాధ ఎందుకు, ఓసారి వాడు పీకుతాడు, మరోసారి మనమే వదిలేస్తాం, మరికొన్నిసార్లు కంపెనీ మూసేస్తారు. మనకి ఇవన్నీ మాములేగా ఈ దేశంలో. ఒకటి కాకపోతే మరోటి. మా నాన్న ఓ సామెత చెప్పేవాడు, అడుక్కునే వాడికి అరవై ఆరు కూరలని. అయినా కొంత కాలం బ్రేక్ తీసుకుందామనుకుంటున్నాను," అన్నాడు.

"అవును మార్కెట్‌లో చాలా లేటెస్ట్ టెక్నాలజీస్ వొచ్చాయి, మీరు అవి నేర్చుకుంటే బాగుంటుంది," అంది.

"యు మీన్ ఈ వయసులో మనకి ట్రయినింగ్!!" అంటు పెద్దగా నవ్వేడు ఆనంద్.

ఆ నవ్వు రమని భయపెట్టింది, మళ్లీ ఏదో తిరకాసు పని స్టార్ట్ చేస్తాడు అనుకుంటూ.

"ఉద్యోగం పోయిన అకేషన్ సెలబ్రేట్ చేసుకోటానికి మనం ఇవాళ డిన్నర్‌కి బయటకి వెళుతున్నాము, అక్కడ చెబుతా నా డెసిషన్," అన్నాడు.

"సర్లెండి, నాకు కూడా పని ఉంది," అంటూ ఫోన్ పెట్టేసింది.

ఆనంద్ సీరియస్‌గా సినిమాలో లీనమైపోయాడు.

ఆనంద్, రమ ఇద్దరూ సాఫ్ట్ వేర్ జాబ్స్ చేస్తూ డల్లాస్, టెక్సాస్‌లో ఉంటున్నారు. ఇద్దరు పిల్లలు, అబ్బాయి రవి, అమ్మాయి రాగ. ఇద్దరూ హైస్కూల్లో చదువుతున్నారు. ఆనంద్‌కి కుదురు తక్కువ. ఒక జాబ్‌లో ఉండడు. నాకేంటి భయం నువ్వు వున్నావుగా అంటాడు, నవ్వుతూ. తను ఏదో నెమ్మదిగా ఒక జాబ్‌లో ఉండి నెట్టుకొస్తూ ఉంటుంది. అలాగని తానేమి తక్కువ వాడు కాదు, ఎక్కడ జాబ్ చేసినా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు రావటమే కాకుండా, లీడర్‌గా కూడా ప్రమోట్ చేస్తారు. అన్నీ బావున్నాయి అనుకునేటప్పటికీ, తనకి ఏదో ఆలోచన రావటం, జాబ్ మీద ఫోకస్ లేక పోగొట్టుకోవటం అవుతుంది. పైగా మన దెబ్బకి తట్టుకుని భరించడం కష్టమోయ్ అంటాడు. ఇవాళ రాత్రి డిన్నర్ దగ్గర ఏ ప్లాన్ చేబుతాడో అనుకుని భయపడుతూ, జాబ్‌లో ఫోకస్ చేయడానికి ప్రయత్నించింది.

డిన్నర్‌కి ఆలీవ్ గార్డెన్‌కి వెళ్లారు నలుగురు. ఆర్డర్ ఇచ్చినాక, పిల్లలకి అనౌన్స్ చేశాడు. రేపటి నుంచి మనం ఫ్రీ అని. రవి కన్‌ఫ్యూజ్ అవుతూ అంటే అన్నాడు. డాడీకి జాబ్ ఇవాళ లాస్ట్ డే అంది మమ్మీ.

"ఓ నో! డాడీ ఇంట్లో ఉంటే తెలుగు చదువు, మ్యూజిక్ ప్రాక్టీస్ చేయి, హోమ్ వర్క్ చేయి అంటూ తింటాడు," అంది అమ్మాయి రాగ డిసప్పాయింట్ అవుతూ.

అవును అంటూ రవి తల ఊపుతూ, "టిపికల్ దేశి పేరెంట్స్, అదే మా అమెరికన్ ఫ్రెండ్స్ పేరెంట్స్ ఏమీ చెప్పరు," అన్నాడు.

"అవునురా అందుకే మేము అమెరికా వచ్చాము, ఆ విషయం నేర్చుకుందామని మిమ్మల్నిద్దరిని కనీ స్కూల్‌కి పంపుతున్నాము," అన్నాడు ఆనంద్ కొంచం చిరాగ్గా.

రమ, "సరేలెండి, ఇంతకీ ఏమి చేద్దామనుకుంటున్నారు బ్రేక్ తీసుకుని," అంది, టాపిక్ మారుస్తూ.

ఇంతలో సూప్ వచ్చింది అందరికీ.

ఆనంద్ వేడి వేడి సూప్ తాగుతూ, "ఒక షార్ట్ ఫిలిం తీయాలనుకుంటున్నాను," అన్నాడు అందరి వంకా చూస్తూ.

అమ్మాయి, "బ్రిలియంట్ ఐడియా డాడీ, ఐ వాంట్ టు యాక్ట్ ఇన్ ఇట్," అంది, ఇందాక నెగటివ్‌గా మాట్లాడటం వల్ల డాడీకి కోపంవచ్చిందేమో అని అనుకుంటూ.

"మీ టూ," అన్నాడు, ఫోన్‌లోకి సీరియస్‌గా చూస్తూ రవి.

"మూవీ అంటే చాలా డబ్బు కదా? ఇప్పుడు అవన్నీ ఎందుకు," అంది రమ.

"నో మామ్, ఇవాళ ఫోన్‌తో కూడా షార్ట్ ఫిలిమ్స్ తీస్తున్నారు. ఐ డునాట్ థింక్ వుయి నీడ్ టు స్పెండ్ టూ మచ్ మనీ," అన్నాడు రవి.

"అయితే నాకు ఒకే. నేను కూడా యాక్ట్ చేస్తా. కానీ కండిషన్, హీరోయిన్ రోల్ అయితేనే," అంది హుషారుగా.

ఈలోపున సర్వర్ మెయిన్ కోర్స్ సర్వ్ చేశాడు. అందరూ తింటూ ఉంటే, ఆనంద్ ముగ్గురి వంకా చూస్తూ, "ఇది ఒక ఫామిలీ ప్రాజెక్ట్, అందరం యాక్ట్ చేస్తున్నాం. ఇంకా స్టోరీ అనుకోలేదు, ఇది ఒక ఎక్స్పిరిమెంటల్ మూవీ," అన్నాడు.

"ఈమధ్య చాలా షార్ట్ ఫిలిం కాంటెస్ట్‌లు జరుగుతున్నాయి, మనదీ వాటికి పంపితే ఏదయినా అవార్డ్ వస్తే మనకి హీరోల నుంచి పిలుపు వస్తుంది. అంటే మనం డైరెక్టర్ అవుతామన్న మాట," అన్నాడు కాలర్ ఎగరేస్తూ.

"మహేష్‌బాబు నుంచి కూడా కాల్ వస్తుందా?" అంది కూతురు.

"డాడీ బిల్ వచ్చింది ఫస్ట్," అన్నాడు రవి చాలా మాములుగా.

పిల్లలిద్దరినీ మురిపెంగా చూస్తూ, "మీ టైమింగ్ బాగుంటుందిరా, మీకు మంచి మాటలు రాస్తాను," అన్నాడు.

"అవును వీటినే పంచ్ డైలాగ్స్," అంటారు అంది అమ్మాయి, తెలుగు సినిమాలని గుర్తుకు తెచ్చుకుంటూ. రవి కూడా మ్యూజిక్ యాడ్ చేయాలి డైలాగ్ అయిన వెంటనే అన్నాడు ఎక్సైట్ అవుతూ.

వీళ్ల ముగ్గురిని చూస్తుంటే, పిచ్చి ముదిరినట్టే వుంది దీనిని ఆపాలని ఆనుకుంటూ, "మా కంపెనీలో పొజిషన్ వుంది అప్లై చేయండి, హాయిగా జాబ్ చేసుకోవచ్చు, సినిమా తీయడం అంటే సినిమా చూడటం కాదు కదా," అంది రమ బతిమాలుతూ.

ఆనంద్ అదేమీ పట్టించుకోకుండా, "ఈ డైలాగ్ బాగుంది, నువ్వు పర్మిషన్ ఇస్తే మన సినిమాలో వాడుకుంటా," అన్నాడు.

"నా కర్మ," అంది తల మీద కొట్టుకుంటూ. "పదండి చాలా పనులు వున్నాయి," అంటూ లేచింది.

అన్నట్టుగానే ఆనంద్ సీరియస్‌గా గూగుల్ చేయడం మొదలు పెట్టాడు షార్ట్ ఫిలిమ్స్ గురించి. యూట్యూబ్‌లో కూడా చాలామంది అప్లోడ్ చేశారు. ఒక్కోటి చూస్తూ ఏవిధంగా తీశారో గమనించసాగాడు. ఏ టాపిక్ అనుకున్నా ఎవరో ఒకరు తీసేశారు. ప్రతివాడికీ క్రియేటివిటీ పెరిగిపోయింది, దేన్నీ వదలటం లేదు అంటూ విసుక్కున్నాడు. ఇలా కొన్నాళ్లు గడిచింది. సబ్జెక్టు దొరకటం లేదు. కానీ ఐఫోన్‌తో కొన్ని ఎక్సపెరిమెంట్స్ చేసి వాటిని ఐమూవీ (apple product)లో ఎడిట్ చేసి పిల్లలకీ, భార్యకీ చూపించాడు. బాగుందని మెచ్చుకున్నారు. అందులో ఒకటి స్వచ్ఛభారత్ మీద తీశాడు, చాలామంది మెచ్చుకున్నారు. దానితో తనకీ కాన్ఫిడెన్స్ వచ్చింది. ఇలా కాలం గడుస్తోంది. తను ఒక డైరెక్టర్ అయినట్టుగా కలలు కంటున్నాడు. ఈ వెర్రి చూసి ఇది ఎక్కడి కెళుతుందో అర్థం కాక రమ వర్రీ అవుతోంది.

ఇంటిలోనే వుండటం వల్ల పిల్లల స్కూల్ డ్రాపులు, ఇంటి పని అన్ని తానే చూసుకుంటూ వున్నాడు. పిల్లలు, రమ ఎంత కష్టపడుతున్నారో దగ్గర నుంచి చూడసాగాడు. అమెరికాలో హైస్కూల్ చదువులంటే అంత ఈజీ కాదు అనుకున్నాడు. ఒక ప్రక్క హోంవర్క్, SAT ఎగ్జామ్ ప్రేపరషన్ కోసం ఆఫ్టర్ స్కూల్ ట్యూషన్, రకరకాల ఎక్స్‌ట్రా కర్రీక్యూలర్ ఆక్టివిటీస్, ఇవికాక మన కల్చర్‌కి సంబంధించి టెంపుల్‌లో, ఏదో ఒక అసోసియేషన్ ఫంక్షన్‌లో పాడటం కోసం అమ్మాయి, వయోలిన్ నేర్చుకుంటున్న కొడుకు వాడి ప్రాక్టీస్‌తో క్షణం తీరిక లేకుండా బిజీబిజీగా ఉంటున్నారు. రమ కూడా ఆఫీస్ పనితో, రకరకాల కల్చరల్ ఆక్టివిటీస్‌తో వత్తిడి ఫీల్ అవటం గమనించాడు. రోజులన్నీ మెకానికల్‌గా వెళ్లిపోతున్నాయి. అందరు ఒక ఇంటిలో ఉన్నా, ఒకరికొకరు పట్టనట్టుగా ఉంటున్నారు. ఈ స్మార్ట్‌ఫోన్‌లు వచ్చినాక మనుషుల కమ్యూనికేషన్ లో కూడా చాలా తేడాలొచ్చేశాయి. ఏవో పొడి పొడి మాటలు, అది కూడా వాట్సాప్, టెక్స్ట్‌లోనే.

పిల్లల షెడ్యూల్స్‌తో తను గందరగోళానికి గురి అవుతున్నాడు. ఒకరోజు తను అమ్మాయిని డాన్స్ క్లాస్‌లో డ్రాప్ చేయబోయాడు, అమ్మాయి కూడా చెప్పలేదు, ఫోన్‌లో పాటలు వింటూ కళ్లు మూసుకుని వుంది. డాన్స్ స్కూల్ దగ్గరకి వచ్చినాక అంది డాడీ నాకు మ్యూజిక్ క్లాస్ కదా, ఇక్కడికి వచ్చావేంటి. ఓహ్ సారీ మర్చేపోయాను అంటూ మ్యూజిక్ టీచర్ ఇంటి వేపుకి కారు పోనిచ్చాడు. డాన్స్ ఐతే డాన్స్ డ్రెస్ వేసుకుంటాను కదా అంది నవ్వుతూ. రమకి చెబితే, నాకు కూడా రెండు మూడు సార్లు ఇలాగే అయింది అంది.

మొన్న ఫ్రెండ్ ఫోన్ చేసి అమ్మాయి కనపట్టం లేదు. మీ ఇంటిలో ఏమైనా డ్రాప్ చేశానా అంటూ, దాని పియానో టీచర్ వచ్చింది, ఈ టైంలో ఇంటిలో ఉండాలి అన్నాడు కంగారు పడుతూ. లేదురా మా ఇంటిలో లేదు, అన్నాను. అరే మర్చేపోయానురా, కాన్ఫరెన్స్ కాల్‌లో ఉంటే అది కారు ఎక్కింది, ఎక్కడ దింపానో గుర్తుకు రావటం లేదు, ఫోన్ తీయరు కదా ఈ పిల్లలు అన్నాడు. ఈ లోపున వాడి అమ్మాయి ఇంటిలోకి వచ్చినట్టుంది. సంగీతం క్లాస్‌లో నువ్వే కదా దింపావు నన్ను, రాగాని, పియానో క్లాస్ టైం కి రాగవాళ్ల మమ్మీ డ్రాప్ చేస్తుందని చెప్పను కదా డాడీ అంది. ఫోన్ కూడా ఛార్జ్ అయిపోయింది, అందుకే తీయలేదు అంది. మళ్లీ ఫోన్ చేస్తానురా అని పెట్టేశాడు. పని వత్తిడిలో ఎక్కడ డ్రాప్ చేశాడో కూడా గుర్తుకు రాలేదు వాడికి. నేనూ చూడలేదు నా కూతురు వాళ్లతో వెళ్లిందని. అమెరికాలో చాలా మాములు ఒకళ్లు దింపితే, మరొకరు తీసుకు రావటం.

ఒక్కోసారి అనిపిస్తోంది, ఈ అమెరికా వాడు మరీ తొందర పడి మనకన్నా అడ్వాన్స్ అయిపోవటం వల్లకాదు ఇక్కడికి వచ్చి పడ్డాము. పోనీ వచ్చాము కదా అని ఏదో జాబ్ చేసుకుని రాక, ఎన్నిన్ని వ్యాపకాలు. ఒక పక్క జాబ్ వత్తిడి, కొంతకాలం క్రితం వరకు వీసా టెన్షన్స్, ఇప్పుడు పిల్లల రకరకాల ఆక్టివిటీస్, ఒకవేళ ఏదయినా చేయకపోతే వెనకపడి పోతామేమో అని టెన్షన్, జీవితం అంతా గందరగోళంగా తయారయింది. ఇండియాలో తల్లి

తండ్రులు పెద్దవాళ్లు అయిపోతున్నారు, వాళ్లని చోడటం లేదని బెంగ. ఈ పరుగు ఎక్కడికో, అసలు అర్థం వుందా అనిపిస్తోంది. ఆలోచించేకొద్దీ బుర్ర వేడెక్కిపోయింది.

రమ ఆఫీస్ నుంచి వచ్చింది. ఇద్దరికీ కాఫీ కలిపి తీసుకు వచ్చాడు. ఆనంద్ ఏమి మాట్లాడకుండా ఆలోచిస్తూ ఉండటం గమనించి, ఏంటి ఆలోచిస్తున్నారు అంది. ఆనంద్, రమకి తను అబ్సర్వ్ చేసింది చెప్పాడు. అందరం చాలా వత్తిడి ఫీల్ అవు తున్నాము, ముఖ్యంగా పిల్లలు చాల అలిసిపోతున్నారు. రమ కూడా నిజమే అన్నట్టుగా తల వూపుతూ అన్నిటిలో పిల్లలు, మనం ఉండాలని అనుకుంటూ ఒకరకంగా వత్తిడికి బానిసలమై పోతున్నాము అంది. పోనీ కొన్ని ఆక్టివిటీస్ తగ్గిస్తే బాగుంటుం దేమో అన్నాడు. నిజమే కానీ ఏది వదులు కొంటాం అంది. ఇద్దరు లిస్ట్ వేసి చూశారు. కొన్ని చదువులకి, మరికొన్ని వ్యక్తి వికాసానికి, మిగిలినివి మన కల్చర్‌కి పనికొచ్చేవి.

అన్ని అవసరంగానే అనిపించాయి ఇద్దరికి.

ఆనంద్ తల పట్టుకున్నాడు.

రమ అంది, "నేనొకటి చెప్పనా ఆర్ట్ అఫ్ లివింగ్ వాళ్లు ఏదో మెడిటేషన్‌కి సంబంధించి బూట్ క్యాంపు పెడుతున్నారు. అందరం అందులో జాయిన్ అయితే సరి. వత్తిడిని ఎలా overcome చేయచ్చో వాళ్లు చెబుతారు,లిలి అంది.

"సరే ఇప్పటికే ఇన్నిటితో సతమతం అవుతున్నామంటే నువ్వు మరో క్లాస్‌లో చేరమంటున్నావా?" అంటూ, "ముల్లుని ముల్లుతోనే తీయాలంటావు," అన్నాడు నవ్వుతూ.

"బాగా చెప్పారు. అవును, మీ షార్ట్ ఫిలిం ఎంతవరకు వచ్చింది," అంది.

"ఐడియా రావటం లేదోయి, ఏ ఐడియా వేసిన ఎవడో ఒకడు ఆల్రెడీ తీసేశారు," అన్నాడు.

"పోనిద్దురూ ప్రతీవాడూ తీస్తుంటే, చూసేవాళ్లు ఉండద్దూ," అంది. "సరేలెండి మన బతుకే సినిమాలాగా వుంది, వేరే సినిమా ఎందుకు," అంటూ, "ఇలాగే కబుర్లు చెబుతుంటే పనులు ఆగి పోతాయి. మీరు పిల్లలని తీసుకుని రండి నేను వంట సంగతి చూస్తాను," అంటూ స్పీడ్‌గా వెళ్లిపోయింది.

ఆనంద్ కారు నడుపుతూ, మరొకసారి పిల్లలని ఎక్కడి నుంచి తేవాలో కన్ఫార్మ్ చేసుకున్నాడు రమతో ఫోన్‌లో. రవిని బాస్కెట్‌బాల్ కోర్ట్ నుంచి, రాగని డాన్స్‌క్లాస్ నుంచి తెచ్చుకోవాలి. ముందు రవిని పిక్ చేసుకుని, రాగ దగ్గరకి వెళ్లాలి అనుకుంటూ, బాస్కెట్‌బాల్ కోర్ట్ వేపుకి కారు పోనిచ్చాడు. పిల్లలు ఆడు తున్నారు, కోచ్ ఏదో చెబుతున్నాడు పిల్లలకి. ఇంకా కొంచం టైం ఉంది, నుంచుని వాళ్ల అట చూస్తూ ఆలోచిస్తున్నాడు.

అమెరికా వస్తే డాలర్ ప్రపంచం అన్ని బాగుంటాయి అను కున్నాడు, కానీ ఎన్నో బాధ్యతలు, మరెన్నో సవాళ్లు. ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ, కాలంతో పరిగెడుతూ అందరిని దాటికెళ్లాలని కాకపోయినా, కనీసం నలుగురితో సమానంగా నడవాలి తప్పదు. ఈ ఆటకి ముగింపు లేదు, పరిగెత్తడమే. అలాగని ఇండియాకి వెళ్లినా పిల్లలు అడ్జెస్ట్ అవలేరు. కాదుకాదు అది నిజంకాదు, మేమే అడ్జెస్ట్ అవలేము. అక్కడ పరిస్థితులు మారాయి. ఈ సమస్య పిల్లలకే లేదు. వారు ఇక్కడే పుట్టారు. తల్లితండ్రులకి లేదు, వారు అక్కడే ఇండియాలో ఉన్నారు. ఈ ఇరకాటం మా జనరేషన్ వాళ్లదే. ఒకరకంగా 'త్రిశంకు స్వర్గం' లో ఉన్నాము, అనుకున్నాడు.

ఇందాక కాఫీ తాగుతూ రమ అన్నమాటలు గుర్తుకొచ్చాయి. అవును మన జీవితమే షార్ట్ ఫిలిం ఎందుకు తీయకూడదు? ఆనంద్ మొహంలో చిన్నగా నవ్వు వచ్చింది. రమకి ఫోన్ చేసి థాంక్స్ అన్నాడు. దేనికి అంటూ ఇంకా ఏదో అనబోతే తనని కట్ చేస్తూ, "మన షార్ట్ ఫిలింకి సబ్జెక్టు దొరికింది. దాని పేరు 'త్రిశంకు స్వర్గం'" అన్నాడు.

"బాగుంది మనం ఉన్న పరిస్థితే," అంది, నవ్వుతూ.

"కరెక్ట్‌గా చెప్పావు. ఇందాక నువ్వన్న పాయింటే నా ఫిలింకి మెయిన్ సబ్జెక్టు," అన్నాడు.

"పేరు బాగుంది ఒక టాగ్ లైన్ కూడా తగిలించండి ఈ మధ్య అందరూ పెడుతున్నారు సినిమాలకి," అంటూ 'త్రిశంకు స్వర్గం - రెంటికి చెడ్డ రేవడి' ఎలా ఉంది?" అంది.

"బాగుంది కానీ చిన్న కరెక్షన్ సినిమా టైటిల్ 'త్రిశంకు స్వర్గం' టాగ్ లైన్ 'అన్నిటికీ చెడ్డ రేవడి'," అన్నాడు.

"బాగుంది, చాల బాగుంది. మంచి సబ్జెక్టు, NRIల పరిస్థితి అద్దం పట్టేలాగుంది, అల్ ది బెస్ట్," అంటూ ఫోన్ పెట్టేసింది కుక్కర్ విజిల్‌కి కంగారుపడుతూ.

పైనుంచి దేవతలు తథాస్తు అంటారేమో అని చూశాడు ఆనంద్.

కానీ ఎప్పుడొచ్చాడో చూడలేదు రవి, డాడీ లెటస్ గో అంటూ చేయి పట్టుకున్నాడు.



మల్లాది కృష్ణమోహన్ పోర్ట్‌లాండ్, ఒరెగాన్‌లో 2005 నుంచి నివసిస్తున్నారు. షార్ట్ ఫిలిమ్స్ తీయడం, చిన్న చిన్న కథలు రాయడం ప్రవృత్తి. తెలుగు భాషా వికాసానికి online game (http://mjmgames.us/) ఇద్దరు మిత్రులతో కలసి తయారుచేశారు.

ఫ్రెండ్!

వేణు నక్షత్రం



తానా ఇరవై ఒకటవ మహాసభలు సేంట్ లూయిస్‌లో అంగరంగ వైభోగంగా జరుగుతున్నాయి. రెండేళ్లకోసారి జరిగే తానా సభలు, నేను గత ఇరవై సంవత్సరాలుగా అమెరికాలో ఎక్కడ జరిగినా హాజరు అవుతూనే ఉంటాను. సభ జరిగే మూడు రోజులు ఒక పండగ వాతావరణం. చిన్నప్పటి నుండి నాకు సాంస్కృతిక కార్యక్రమాలు, సాహిత్యం అంటే ఇష్టం కాబట్టి, ఏ కార్యక్రమాన్ని వదలకుండా చూడడం చాలా ఇష్టం. ఇంకా రకరకాల రుచికరమయిన విందు భోజనాలు, అటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఇటు వ్యాపార సంబంధమైన సెమినార్లు, స్త్రీలకయితే వాళ్లకిష్టం అయిన చీరలు, నగల షాపింగ్. స్త్రీలు, పురుషులు, యువకులు, వృద్ధులు అందరి అభిరుచులకు అనుగుణంగా ఎన్నో కార్యక్రమాలు జరుగుతుంటాయి.

ముఖ్యంగా ఎప్పుడో దూరమయిన చిన్నప్పటి మిత్రులని, చదువు చెప్పిన గురువులని, సినిమా యాక్టర్స్‌ని, ఎందరో ప్రఖ్యాత కళాకారులని కలుసు కోవడం ఇలా తానా సభలకు హాజరు అయిన ప్రతిసారి ఎన్నో కొత్త అనుభూతులు, ఎన్నో మధుర స్మృతులు మూట కట్టుకుని వెళ్లడం సాధారణం అయిపొయింది. పోయినసారి సభల్లో నేను ఎప్పుడో ముప్పై ఏళ్ల క్రితం కలసి చదువుకున్న మిత్రుడు కలవడం ఇప్పటికి ఒక మధురజ్ఞాపకం. అంతకుముందు సభల్లో మా పేరెంట్స్ కూడా పాల్గొనడం, మా అమ్మకి వాళ్ల చిన్నప్పటి ఫ్రెండ్ కనపడడం, వాళ్ల సంతోషాన్ని మాటల్లో వర్ణించలేము. అక్కడ ఉన్న మూడు రోజులు, ఒక్క క్షణం విడిచి ఉండలేదు వాళ్లిద్దరూ! ఆ సందర్భం ఇప్పటికీ నాకు ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోయింది. నేను అమెరికాకి వచ్చి రెండు దశాబ్దాలు దాటిపోయింది. అందరిలాగానే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం.

"అవినాష్, మేము డిన్నర్ కి వెళ్తున్నాము, ఇప్పుడు మెయిన్ స్టేజి మీద మంచి ప్రోగ్రామ్స్ ఉన్నాయట, తొందరగా డిన్నర్ చేసి వస్తే వచ్చి ప్రోగ్రామ్స్ ఎంజాయ్ చేయొచ్చు!" ఒక సాహిత్య సమావేశంలో పాల్గొని గతస్మృతులు నెమరు వేసుకుంటున్న నన్ను దాదాపు అరిచినంత పని చేస్తూ పిలిచాడు మిత్రుడు శేఖర్. ఇంక తప్పదన్నట్లు లేచి మా డల్లాస్ నుండి వచ్చిన ఇతర మిత్రులతో కలసి డైనింగ్ హాల్ వైపు అడుగులేస్తున్నాను.

మా మిత్రబృందంతో మంచి విందు భోజనం ఆరగించి కిళ్లీ, తాంబూలాలు కూడా వదలకుండా ప్రధాన సభాప్రాంగణం వైపు వెళ్తున్నాము. అప్పటికే ఆ ప్రాంగణమంతా కిక్కిరిసి ఉంది. విజయవాడ నుండి వచ్చిన ఒక కళాశాల అమ్మాయిల డాన్స్ బృందం అబ్బురపరిచే విన్యాసాలు చాలా చూడముచ్చటగా ఉన్నాయి. సర్కస్‌లాంటి డాన్స్, మానవ పిరమిడ్ చాలా అద్భుతంగా ఉంది. ప్రతి విన్యాసానికి సభలో చప్పట్ల మ్రోతలు,ఈలలు. నా వెనుకవైపు మూడవ వరసలో ఒక వ్యక్తి ఒకటే ఈలలు వేస్తుండడం కొంచెం చికాకు అనిపించినా, అంత ఉత్సాహంగా ఉన్న ఆ మనిషి ఎవరో చూడాలనే ఉత్సాహం నాలో మొదలయింది. మరీ నేను వెనుకకు తిరిగి చూడడం, ఆయన చూస్తే బాగుండదని చూసీచూడనట్టు చూసి వెంటనే తల తిప్పుకున్నాను. ఒక నలభయ్ ఏళ్లకు పైబడిన వ్యక్తి, చాలా ప్రొఫెషనల్‌గానే ఉన్నాడుకానీ ఉత్సాహాన్ని ఆపుకోలేకపోతున్నాడు. ఆ క్షణంలో నా కళ్లు రెండవ వరసలో ఉన్న ఇంకొక వ్యక్తిపై పడ్డాయి. బాగా తెలిసిన వ్యక్తిలా అనిపించింది. ప్రోగ్రాం చూస్తూ ఆలోచిస్తున్నాను ఎవరా అని, మనసుకు తట్టలేదు. మళ్లీ ఒకసారి చూడాలనిపించింది. మెల్లగా తల త్రిప్పి చూశాను. ఇప్పుడు ఆ వ్యక్తి ముఖం చాలా స్పష్టంగా కనిపిస్తుంది, అయితే ఆ వ్యక్తి దృష్టి అంతా స్టేజీ పై కళాకారులపైనే ఉంది. నేననుకున్నదే నిజం, అవును తెలిసిన వ్యక్తే. తెలిసిన వ్యక్తి ఏంటి? బాగా తెలిసిన విక్రమ్. ఒకప్పుడు బాగా కలసి తిరిగేవాళ్లం. నేను అతన్ని చూశానుకానీ అతను నన్ను చూడలేదు. మళ్లీ ఒకసారి చూడాలనిపించింది, కానీ తను నన్ను చూస్తాడేమో అని భయం. రారా, పోరా అనుకునేంత చనువు ఉంది, కానీ ఎప్పుడూ అలా పిలుచుకోలేదు. చాలారోజుల తర్వాత కల్సిన ఫ్రెండ్ అయితే కల్సిన వెంటనే హత్తుకోవడమో, షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడమో జరగాలి, కానీ ఇలా దోబూచులాడడం, నాది నాకే చాలా విచిత్రంగా తోచింది. అయినా నాకెందుకు భయం, నేనెందుకు అతనికి భయపడాలి? ఒక మొండి ధైర్యం. ఇంకోవైపు చాలా మంచి కార్యక్రమం జరుగుతుంది, దాన్ని మిస్ చేయదల్చుకోలేదు. స్టేజీ పై ప్రోగ్రాం కళ్లతో చూస్తున్నట్టే కానీ, ఆలోచనలన్నీ విక్రమ్ చుట్టే. మనసు ఒక ఇరవై సంవత్సరాల వెనుకకు వెళ్లింది.

❖

వైటూకే ప్రాజెక్ట్ కోసం ఇండియా నుండి అమెరికాకి ఏకధాటిగా సాఫ్ట్‌వేర్ నిపుణులు వెళ్తున్న కాలం అది. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ అయిపోగానే ట్రైనీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం దొరికింది. అందరి ఆలోచనలు, అన్ని దారులు అమెరికా వైపే చూస్తున్నాయి అప్పుడు. అమెరికా వీసా కోసం ఏదో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నట్టు నిరూపించుకోవాలి. అప్పుడు సాఫ్ట్‌వేర్ కంపెనీ నుండి పిలుపు రావడమే ఎక్కువ, ఇక శాలరీ గురించి ఎవ్వరూ మాట్లాడరు. ఏదో నామమాత్రపు శాలరీకి నేను జాయిన్ అయిన ఒక వారంరోజులకి అక్కడే జాయినయ్యాడు విక్రమ్. జాయిన్ అయిన కొద్దిరోజుల్లోనే అమెరికా ప్రయత్నాలు మొదలు పెట్టాము. మేము ఇద్దరమూ త్వరగానే ఫ్రెండ్స్ అయిపోయాము. అతనికి ఈమధ్యనే పెళ్లి అయింది, నాకు అప్పటికే సుమలతతో ఎంగేజ్‌మెంట్ అయింది, పెళ్లి ఇంకో రెండు నెలల్లో! మేమిద్దరమూ దగ్గరవడానికి కామన్ పాయింట్ అమెరికా అయితే మా ఇద్దరికీ కొన్ని విషయాల్లో పోలికలు సరిగ్గా సరిపోయాయి. అందుకేనేమో ఆ పదిమందిలో మేమిద్దరమే బాగా క్లోజ్ అయ్యాము. ఆఫీసులో డ్యూటీ అయిపోగానే, బ్లూసీలో చాయ్ సమోసా తిని, ట్యాంక్ బ్యాండ్ మీదుగా ఒక రౌండ్ తిరిగి నెక్లెస్ రోడ్డు నుండి పారడైజ్‌కి వచ్చి ఒక బిర్యానీ ఇద్దరమూ షేర్ చేసుకొని రూమ్‌కి వెళ్లేవాళ్లం. నేను రెండు హోమ్ ట్యూషన్స్ కూడా చెపుతుంటాను, కాబట్టి సాయంత్రం తప్పనిసరిగా రూమ్‌కి వెళ్లేవాడ్ని. ఖర్చులకి పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు.

విక్రమ్ సాయంత్రం కొన్ని గంటలు డేటా ఎంట్రీ చేస్తాడు. భార్య వసంత కరీంనగర్‌లో ఒక ప్రైవేట్ స్కూల్ టీచర్. నెలలో ఒక రెండు మూడుసార్లు కలుసుకొనేవారు. హైదరాబాద్‌లో ఇల్లు రెంట్ తీసుకొని కాపురం పెట్టేంత ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల, విక్రమ్ ఇతర ఫ్రెండ్స్‌తో రూమ్ షేరింగ్‌లో ఉన్నాడు. ఎప్పుడన్నా వసంత వస్తే చాలా ఇబ్బంది అయ్యేది. అందుకనే నేను రెండు మూడుసార్లు నా రూమ్ వాళ్లకి ఇచ్చి నేను ఇతర ఫ్రెండ్స్ రూమ్‌లో తల దాచుకునేవాడ్ని. ఇంతలో నా పెళ్లికి ముహూర్తం ఖరారయ్యింది. విక్రమ్ ఫ్యామ్లీతో అటెండ్ అయ్యాడు. పెళ్లి తర్వాత

ఒకసారి మేము కూడా కరీంనగర్‌లో వాళ్లింటికి వెళ్లాము. సుమలత, వసంత కూడా తొందరగానే క్లోజ్ ఫ్రెండ్స్ అయ్యారు, బాగా మాట్లాడుకునేవారు. ఆరునెలల క్రితం మేము ఎవరమో తెలియదుకానీ కొద్దిరోజుల్లోనే క్లోజ్ ఫ్యామిలీ ఫ్రెండ్స్ అయ్యాము.

ఒకసారి నేను ఆఫీస్‌కి బస్సులో వస్తే , బండి ఏమయ్యింది అని అడిగాడు విక్రమ్.

''కొంచెం రిపేర్ అండ్ మైంటెనెన్సు వర్క్ ఉంది, టైంకి డబ్బులు అందలేదు, అందుకనే తీసుకోలేదు,'' అన్నాను.

''అందులో ఏముంది, నిన్న అడగాల్సింది కదా! నేను సర్దే వాన్ని, కావాలంటే ఇప్పుడు తీసుకో, తర్వాత ఇద్దువు కానీ,'' అంటూ పర్సు తీసాడు విక్రమ్.

''లేదు, ఆల్రెడీ డబ్బులు అందాయి. అవసరం లేదు,'' అన్నాను.


''పర్వాలేదు, డబ్బులు వస్తే రేపు ఇచ్చేయ్. ఉంచుకో అంతవరకు,'' మరీ బలవంతం చేస్తున్నాడు విక్రమ్.

ఇంత మంచి మిత్రుడు దొరికినందుకు చాలా సంతోషం వేసింది. ఈరోజుల్లో అప్పు అడిగితే డబ్బులుండీ ఇవ్వనివారు ఎంతోమంది.

అయినా అవసరం లేనిదే, మనం తిరిగి ఇస్తామని గ్యారంటీ లేనప్పుడు అప్పుచేయక పోవడమే మంచిది అని మా నాన్న చెప్పేవాడు. అవసరం అయితే ఒకపూట తినకుండా ఉండగలను కానీ అప్పు మాత్రం చేయను. అదే విషయం విక్రమ్‌కి చెప్పాను, బలవంతం చేయొద్దు అని. అవసరం ఉంటే తప్పకుండా అడుగుతాను అని కూడా చెప్పాను.

జాయిన్ అయిన ఆరునెలల్లో విక్రమ్‌కి అమెరికా వీసా పేపర్స్ అందాయి. నేను కూడా అప్లై చేశాను కానీ ఇంకా వెయిటింగ్‌లో ఉంది. అమెరికా వెళ్లాలి అంటే చాలా పేపర్ వర్క్ చేయాల్సి ఉంటుంది కాబట్టి విక్రమ్, నేను ఆఫీస్ తర్వాత ఎక్కువగా కలవడం లేదు. వీసా ధరఖాస్తుకు సంబంధించిన అన్ని విషయాలు చెప్పేవాడు ఆఫీసులో. ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ కావాలంటే నా పరిచయం ద్వారా తొందరగా వచ్చేట్టు చేశాను. పనిలో పనిగా నేను కూడా తీసుకొని పెట్టుకొన్నాను. ఇంకో రెండు నెలల్లో వీసా అప్పాయింట్‌మెంట్ డేట్ వచ్చింది, అదే వీక్‌లో నాకూ పేపర్స్ వచ్చాయి. నాకు పేపర్స్ రావడం, నాకన్నా విక్రమ్‌కి చాలా సంతోషం కలిగింది. వీసా అపాయింట్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే టైంకి విక్రంకి డబ్బులు అందలేదు, ట్యూషన్ చెప్పిన డబ్బులు నాకు సమయానికి అందలేదు, కానీ వస్తాయనే గ్యారంటీ అయితే ఉంది. అందుకే తెలిసిన ఇంకొక ఫ్రెండ్‌ని డబ్బులు అడిగి విక్రమ్‌కి ఇచ్చాను పది వేల రూపాయలు. అంత పెద్ద మొత్తం అప్పుచేయడం అదే మొదటిసారి. కానీ మిత్రుని మీద నమ్మకం, అవసరం నన్ను ఎక్కువగా ఆలోచింపచేయలేదు. వీసా స్టాంపింగ్ జరిగిపోయింది, అందరమూ సంతోషించాము. ఆ రాత్రి పారడైస్‌లో బిర్యానీతో చిన్న పార్టీ చేసుకున్నాము.

మూడురోజుల్లో విక్రమ్ డబ్బులు తిరిగి ఇచ్చాడు. ఇప్పుడు నేను కూడా వీసా అపాయింట్‌మెంట్, పేపర్స్ పూర్తి చేయడంలో బిజీ అయిపోయాను. వారంరోజుల్లో విక్రమ్ అమెరికా ఫ్లైట్ ఎక్కేశాడు. దాదాపు పదినెలలుగా కలిసి తిరిగినవాళ్లం విడిపోతున్నామని కొంత బాధ ఉన్నా, అమెరికా వెళ్తున్నామనే సంతోషం ముందు అంత బాధ అనిపించలేదు. అమెరికా వెళ్లిన తర్వాత ఎప్పుడో ఒకసారి అయినా కలుసుకోవచ్చు కదా అనే నమ్మకం మాత్రం ఉంది. అమెరికా వెళ్లిన ఒక నెల రోజుల్లో విక్రమ్‌కి వెరైజన్‌లో జాబ్ కూడా దొరికింది అని మొదటిసారి ఫోన్ చేశాడు వెళ్లిన ఒక నెలరోజుల తర్వాత. చాలా సంతోషం అయ్యింది. అయితే విక్రమ్ ఎంచుకున్న ఫీల్డ్, నేను నేర్చుకున్న కోర్సు వేరు వేరు. అప్పుడు విక్రమ్ నేర్చుకున్న ప్రోగ్రాంకి చాలా డిమాండ్ ఉండేది. ఇంకో రెండు నెలల్లో నాకూ స్టాంపింగ్ అయిపోయింది. సుమలతని విడిచి పోబుద్ధికాలేదు, కానీ అమెరికా డ్రీమ్ ముందు అన్ని దిగదుడుపే! వీసా వచ్చిన వారంరోజుల్లో నేనూ విమానం ఎక్కి డల్లాస్‌లో గెస్ట్‌హవుస్‌కి చేరుకున్నాను. గెస్ట్ హవుస్, పీపుల్ సాఫ్ట్ ట్రైనింగ్, 60 కే సాలరీ అని ఎన్నో మాటలు వింటుంటే చాలా ఊహించుకొనేవాడ్ని, పొంగిపోయేవాడ్ని. కానీ అక్కడ దిగిన



తర్వాత అసలు పరిస్థితి అర్థం అయ్యింది. నా రెండు సూట్ కేసులు పెట్టుకోవడానికి కూడా స్థలం లేదు గెస్ట్ హవుస్ అనబడే ఆ సింగల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌లో. అప్పటికే ఆరుగురు, నేను ఏడవవాడ్ని అక్కడ. ఒక్కొక్కరూ మూడు నెలలకు పైగా అక్కడే ఉన్నారనే విషయం విని అంతవరకూ ఉన్న ఉత్సాహం నీరు కారి పోయింది. నేను అంతవరకూ పనిచేసిన ఫీల్డ్‌లో ఇంటర్వ్యూ అడిగితే, అందులో బిల్లింగ్ చాలా తక్కువ, పీపుల్ సాఫ్ట్‌లో అయితే ఎక్కువ, ఇదే నేర్చుకో అని చెప్పారు కన్సల్టెన్సీ వాళ్లు. అక్కడ వాళ్లు చెప్పిందే వేదం. అయితే మా వీసాలు ఏవీ వాళ్ల కంపెనీ పై లేవు, వేరే ఇంకొక కంపెనీ ద్వారా చేయించబడ్డాయి. కాలచక్రం ఇంకో మూడు నెలలు తిరిగింది, ఏవో ఇంటర్వ్యూలు అని ఎవరెవరో చేస్తున్నారు, కొత్త వాళ్లు రావడం, పాత వాళ్లు వెళ్లి పోవడం జరుగుతుంది. జాబ్ పైనే వెళ్తున్నారో ఇంకో కంపెనీకి వెళ్తున్నారో కూడా సరిగ్గా తెలిసేది కాదు. విక్రమ్ కూడా కొత్త జాబ్, కొత్త వాతావరణం వల్ల ఎక్కువగా మాట్లాడడంలేదు. ఎప్పుడూ బిజీ అంటున్నాడు, చాలా టెన్షన్‌గా ఉంటాడు. ఈ మధ్యనే వసంత కూడా వచ్చింది అమెరికాకి. అన్నీ కాంట్రాక్టు జాబులే, ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు ఊడుతుందో తెలియదు. ఒళ్లు దగ్గర పెట్టుకొని పనిచేయాల్సి ఉంటుంది. నాకైతే ఇంకో రెండు మూడు నెలలు ట్రైనింగ్ చేస్తేకానీ ఇంటర్వ్యూకి పంపేట్టు కనపడడం లేదు.

అమెరికా వీసా పేపర్స్ వచ్చినప్పుడు ఉన్న సంతోషం, జీవితంలో అదొక్కటే మిగులుతుంది. ఆ తర్వాత అంతా టెన్షన్ టెన్షన్. వీసా వస్తుందో రాదో అని టెన్షన్, వీసా వచ్చి అమెరికాకి వస్తే, ప్రాజెక్ట్ వస్తుందో రాదో అని టెన్షన్. ప్రాజెక్ట్ వస్తే ఎన్ని రోజులు ఉంటుందో అని టెన్షన్, ఆ తర్వాత గ్రీన్‌కార్డు టెన్షన్, తర్వాత సిటిజెన్‌షిప్ టెన్షన్. పీటన్నితో పాటు వర్క్ ప్రెషర్ ఎప్పుడూ వుండే ఉంటుంది. ఇంత టెన్షన్, ప్రెషర్ తీసుకొనే జీవితం అవసరమా అని నాలో నేనే ఎన్నోసార్లు వేసుకున్న ప్రశ్న. కానీ జీవితంలో ఎక్కడ వెనుదిరగలేదు, ఇంత దూరం వచ్చి ఒక చేతగానివాడిలా వెళ్లిపోవడం ఆలోచిస్తే ఎంత అవమానంగా ఉంటుందో అర్థం అవుతుంది. ఇదే విషయం సుమలతతో కూడా మాట్లాడిచూశాను.

"నీకు ఉద్యోగం వచ్చే వరకు నేను వెయిట్ చేస్తాను కానీ వట్టి చేతుల్తో ఇండియాకి తిరిగి రావద్దు," అని ధైర్యం చెప్పింది.

ఇప్పుడు నాకు అసలయిన పోరు మా అత్తగారింటి నుండి, ఇంకా భార్యని ఎప్పుడు తీసుకెళ్తావ్ అని! వాళ్లకి ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం అవడంలేదు. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. గెస్ట్ హౌస్‌లో పరిచయం అయిన ఫ్రెండ్ ద్వారా ఇంకొక కంపెనీతో మాట్లాడి, నాకు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌లో ఉద్యోగం చూడమన్నాను. ఇంటర్వ్యూ ఫైనల్ అయ్యింది. నా వీసా స్టాంపింగ్ ఉన్న కంపెనీతో మాట్లాడి, కాంట్రాక్టు ఫైనల్ చేయించా. ఒక పదిహేను రోజుల్లో ఇంటర్వ్యూ ఫైనల్ అయ్యింది. ఫ్లోరిడాలో ఉద్యోగం. జీతం తక్కువే కానీ రెండు జీవితాలు నిలబడతాయి ఈ ఉద్యోగంతో. అప్పుడు అనిపించింది ఈ కన్సల్టింగ్ కంపెనీ వాళ్లు, వారి లాభం కోసం ఎన్ని జీవితాలతో ఆడుకుంటున్నారో అని!

అమెరికా వచ్చిన ఆరునెలల అనంతరం, మొత్తానికి ఫ్లోరిడా వెళ్లి జాబ్‌లో జాయిన్ అయ్యాను. షేరింగ్‌లో ముగ్గురు బ్యాచిలర్స్ తో కల్సి ఉండే అపార్ట్‌మెంట్ దొరికింది. ఇప్పుడు నేను కూడా కొత్త జాబ్ వల్ల, ఆ జాబ్‌ని నిలదొక్కుకోవడం కోసం చాలా సమయం పెట్టాల్సి వస్తుంది. విక్రమ్‌తో వారానికి ఒక్కసారి కూడా మాట్లాడే వీలు కలగట్లేదు. విక్రమ్ కూడా చాల బిజీగా ఉంటున్నాడు. సుమలత కూడా రావడానికి ఏర్పాట్లు చేసుకుంటుంది. అయితే అప్పటికి పనిచేసి రెండు నెలలు అయినా నా సాలరీ ఇంకా నా చేతికి ముట్టలేదు, ఎందుకంటే ఆ డబ్బులు మూడు చేతులు మారాలి. కన్సల్టింగ్ భాషలో దానికి అందమయిన పేరు 'బాడీ షాపింగ్.' పే స్టబ్ ఉంటే తర్వాత చాలా అవసరాలకు పనికి వస్తుంది, లీగల్ స్టేటస్ ఉన్నట్టు తెలుస్తుంది. నాకు మాత్రం ఇంకా సాలరీ ముట్టలేదు. సుమలతకి ఫ్లైట్ టికెట్ బుక్ చేయాలి, ఇల్లు రెంట్ చేయాలి, అమెరికాలో కారులేనిదే ఎక్కడికీ వెళ్లలేము, కారు కూడా కొనాలి. ఫ్లోరిడాలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ బాగానే ఉంది కాబట్టి కారుని వాయిదా వేయొచ్చు అనుకున్నా. అంతా అయోమయంగా ఉంది. ఒక ఫ్రెండ్ చెప్పినట్టు క్రెడిట్ కార్డుకి అప్లై చేసాను. ఎలాగూ ఉద్యోగం ఉంది కదా అనే ధైర్యంతో సుమలతకి క్రెడిట్ కార్డు పై టికెట్ బుక్ చేశాను. ఇంకో పదిహేనురోజుల్లో వస్తుంది సుమలత. అపార్టుమెంట్‌కి అడ్వాన్స్ ఇవ్వాలి, అన్నీ కనీసం ఒక సంవత్సరం లీజు రాయాలి. నా ప్రాజెక్టు ఎన్నిరోజులు ఉంటుందో గ్యారంటీ లేదు. నెలసరి వాయిదా పద్ధతిలో అద్దె కోసం చాలా తిరిగితే కానీ ఎక్కడో ఒక పాత అపార్టుమెంట్ వాళ్లు లీజు లేకుండా ఒప్పుకున్నారు, అయితే అద్దెకి ఒక వంద డాలర్లు ఎక్కువ అన్నారు. అడ్వాన్సు ఇవ్వాలి, ఇంకో ఇరవైరోజుల్లో సాలరీ రావచ్చు అన్నాడు ఎంప్లాయర్. ఇంకా క్రెడిట్ కార్డు బాలన్స్ పోనూ ఇంకో అయిదు వందల వరకు కావాలి అపార్ట్‌మెంట్‌కి అడ్వాన్స్ ఇవ్వడానికి. వెంటనే విక్రమ్ గుర్తుకు వచ్చాడు. విక్రమ్‌కి ఫోన్ చేస్తే ఆఫీసులో ఉన్నాను, ఇంటికి వచ్చిన తర్వాత మాట్లాడతా అన్నాడు. రాత్రి ఎనిమిది దాటింది ఇంకా విక్రమ్ నుండి కాల్ రాలేదు. నాకు చాలా టెన్షన్‌గా ఉంది, మూడు రోజుల్లో అపార్టుమెంట్‌కి చెక్ ఇవ్వాలి. ఇంకా ఎక్కువసేపు ఆలోచించకుండా ఫోన్ చేశాను విక్రమ్‌కి.

"సుమలతకి టికెట్ బుక్ చేశాను, పదిహేను రోజుల్లో తాను వస్తుంది, అపార్ట్‌మెంట్ బుక్ చేయాలి," అని విషయం చెప్పాను. మూడు రోజుల్లో అయిదు వందలు కట్టాలి, మిగతా అమౌంట్ క్రెడిట్ కార్డు ద్వారా కట్టాను అని చెప్పాను. పక్కన నోట్ బుక్‌లో బ్యాంకు అకౌంట్ నెంబర్ రాసి రెడీగా పెట్టుకున్నా, ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఎలాగూ అడుగుతాడు కదా, చెప్పొచ్చు అని!

''వసంత గ్రాసరీ షాపింగ్ కోసం రెడీ అయ్యింది, బయటికి వెళ్లాలి, రేపు మాట్లాడుదాం,'' అని ఫోన్ పెట్టేశాడు. బ్యాంకు అకౌంట్ నెంబర్ అడగకపోవడం, సుమలత వస్తుంది అన్న విషయం విని ఇద్దరూ సంతోషం వ్యక్తం చేస్తారు అనుకున్నా, కానీ 'ఒకే' అనడం తప్ప ఎలాంటి రెస్పాన్స్ రాలేదు. కనీసం నేను అడిగిన దానికి ఏ విషయం చెప్పకుండా ఫోన్ పెట్టేయడం కొంచెం బాధేసింది. కొత్త ప్రాజెక్ట్ కదా, ఏదో టెన్షన్‌లో ఉండొచ్చు, అయినా అతను ఏ మూడ్‌లో ఉన్నాడో అని సర్ది చెప్పుకున్నా నాకు నేనే. ఫోన్ పెట్టేసి కొంతసేపు అలాగే ఉండిపోయా.

వసంత పక్కనే ఉంది కదా, ఆమెకి తెలియకుండా ఇస్తా డేమో, అని నాకు నేను సర్ది చెప్పుకొన్నా. అయినా ఆమె ముందు దాయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆమెకు నేను, సుమలత కూడా బాగా తెలుసు కదా! వీసా కోసం నేనే డబ్బులు సర్దాననే విషయం బహుశా చెప్పి ఉండడు సుమలతకి, చెపితే తాను అలాగ ఉండకపోయేది. ఇలా ఎన్నో ఆలోచనలు విక్రమ్ చుట్టూ తిరుగు తూనే ఉన్నాయి. ఎందుకైనా మంచిది, ఒకవేళ విక్రమ్ సర్దడానికి లేట్ అవుతే...? ఆ ఆలోచన రాగానే 'ఇంకా ఎవరినన్నా అడిగి చూద్దాం' అని ఆలోచిస్తూ ఉంటే మా ఇంజనీరింగ్ బ్యాచ్‌మెట్ సమీర్ గుర్తుకు వచ్చాడు. మా బ్యాచ్‌లో మొట్టమొదట అమెరికాకి వచ్చాడు వాడు. వాళ్ల మామయ్య ఇక్కడే చాలారోజుల నుండి సెటిల్ అయ్యాడు, వాళ్ల కంపెనీలోనే జాయిన్ అయ్యాడు. ఒక మాట అడిగి చూద్దాం అనుకుని ఫోన్ చేశాను, వాడు చెప్పే సోది వినలేకపోయాను. వాడితో లాభం లేదని అర్థం అయ్యింది. వాడు కాలేజ్‌లో ఉన్నప్పుడు కనీసం, చాయ్, సమోసా కోసం కూడా జేబులో నుండి పర్సు తీసినట్టు గుర్తుకులేదు, అనవసరంగా వాడికి ఫోన్ చేశాను అనుకున్నాను. జీవితంలో మొట్టమొదటిసారి అప్పు అడిగే పరిస్థితి వచ్చినందుకు కొంత బాధ కలిగింది. పనిచేస్తూ రెండు నెలలు అయినా సాలరీ రాకపోవడం, అక్కడ ఇండియాలో పెళ్లి అయిన అమ్మాయి తల్లితండ్రుల వద్దే ఉంటే ఆ ఇబ్బంది ఎలా ఉంటుందో సుమలత చెపుతుంటే వినడం తప్ప ఏమీ చేయ లేని పరిస్థితి. అందుకే ఎట్టి పరిస్థితిల్లో సాధ్యమైనంత త్వరలో సుమలతని ఇక్కడికి తీసుకురావాలి అని నిర్ణయించుకున్నాను. రేపు విక్రమ్ కాల్ కోసం వెయిట్ చేయడం మినహా నా ముందు ఇంకేం మార్గం కనిపించలేదు, ఆలోచిస్తూ ఉంటే ఎప్పుడు నిద్ర పట్టిందో కూడా తెలియలేదు.

ఆఫీసులో అయితే విక్రమ్ ఫ్రీగా మాట్లాడతాడేమో అనిపించి ఆఫీసుకి వెళ్లగానే ఫోన్ చేశాను.

"పక్కనే మేనేజర్ ఉన్నాడు, మళ్లీ ఫోన్ చేస్తాను," అన్నాడు.

అయ్యో అనవసరంగా ఈ టైంలో ఫోన్ చేశానే అనుకుని ఫోన్ కట్ చేసి నా పని పై శ్రద్ధ పెట్టాను. సాయంత్రం చాలాసేపు ఎదురుచూశాను. విక్రమ్ నుండి ఫోన్ రాలేదు. మన అవసరం కోసం అవతలి వారిని ఎప్పుడూ తప్పు పెట్టొద్దు అని మా నాన్న చెప్పేవాడు. విక్రమ్ ఎలాంటి పరిస్థితిలో ఉన్నాడో తెలుసుకోకుండా ఏ నిర్ణయానికి రాకూడదనుకున్నా, కానీ లోపల కొంత ఆందోళన, బాధ మాత్రం అలాగే ఉంది. మరునాడు ఆఫీసుకి వెళ్లగానే విక్రమ్ ఫోన్ చేశాడు. చాలా సంతోషం అయ్యింది. ఏదో ఇబ్బందివల్లే రాత్రి ఫోన్ చేయలేకపోయాడు, అందుకే పొద్దున్నే కాల్ చేస్తున్నాడు అని అనుకున్నాను. ఎవరినీ తొందరగా తప్పుగా అర్థం చేసుకోకూడదు అన్న మాటే నిజమయ్యింది అనిపించింది విక్రమ్ ఫోన్ కాల్‌తో.

"సారీ విక్రమ్, నిన్న మరిచిపోయాను ఫోన్ చేయడం," చాలా తాపీగా అన్నాడు.



మరిచిపోవడమా...? ఇక్కడ నేను ఇంత ఇబ్బందుల్లో ఉంటే, అన్నిసార్లు ఫోన్ చేస్తే...? ఎలా అనగలుతున్నాడు ఇంత తేలికగా?

కానీ నా ఫీలింగ్స్ ఏవీ బయటకు కనపడకుండా, "ఏ... ఏం పర్వాలేదు... దానిదేముంది," అని మాత్రం అనగలిగాను.

సుమలత ఎప్పుడు వస్తుంది, అపార్ట్ మెంట్ రెంట్ ఎంత అని అడిగాడు. ఇండియాలో మాతో పనిచేసిన ఇంకెవరికో వీసా వచ్చిన విషయం చెప్పాడు. కానీ నేను ఎదురుచూస్తున్న దానికి సమాధానం మాత్రం రాలేదు. ఇంతవరకూ నా జీవితం లో ఇబ్బందికర క్షణాలు అంటే మాత్రం విక్రమ్‌తో మాట్లాడిన ఈ మూడు నిమి షాలు మాత్రమే. ఒక ఫ్రెండ్ ఇబ్బందుల్లో

ఉండి సహాయం చేయమంటే అదీ తాను సహాయం పొందిన వ్యక్తికి ఇలా తిరిగి సహాయం చేయకుండా, ఏ విషయం సరిగ్గా చెప్పకుండా మాటలు దాటవేయడం ఎంత వరకు సబబో నాకు అర్థంకాలేదు. ఎందుకని అడిగానా అనిపించింది కొంతసేపు. ఇండియాలో బైక్ రిపేర్ అప్పుడు డబ్బులు తీసుకొమ్మని బలవంతం చేసిన విక్రమ్ ఈ రోజు ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో అర్థం కాలేదు.

విక్రమ్ నుండి ఎలాంటి సమాధానం రాకపోడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. సుమలత టికెట్ కాన్సల్ చేద్దాం అనుకున్నా, కానీ రిఫండ్ రాదు అన్నారు. ప్రయాణం వాయిదా వేస్తే, మళ్లీ నా ప్రాజెక్ట్ ఎక్కడ ఉంటుందో, నేను ఎక్కడ ఉంటానో కూడా తెలియదు. అంతేకాక మళ్లీ రెండువందల డాలర్ల నష్టం. అసలే కష్టాల్లో ఉన్నా, ఏమి చెయ్యాలో ఆలోచిస్తూనే ఉన్నా. అపార్ట్‌మెంట్ వాళ్లకి ఫోన్‌చేసి, కాళ్లా వేళ్లా పడి ఇంకో రెండు రోజులు అడ్వాన్స్ ఇవ్వడానికి గడువు పొడిగించుకున్నాను. ఆ అపార్ట్‌మెంట్ పోతే, ఆ రేటులో ఇంకోటి దొరికే అవకాశాలు చాలా తక్కువ. కొంచెం రిలాక్స్‌గా అనిపించింది ఇంకో రెండు రోజులు దొరికాయి కదా అని! కానీ ఆలోచనలు మాత్రం విక్రమ్‌తో మా స్నేహం మొదలయిన నుండీ ఒక్కో సంఘటన గుర్తుకు వస్తుంది. ఇద్దరమూ కల్సి ఏ రెస్టారెంట్‌కి వెళ్లినా డబ్బులు కట్టడంలో విక్రమ్ వెనుకకు పోయేవాడు కాదు, అలాగే నేను కూడా! అందుకే వీసా కోసం విక్రమ్ అడగక ముందే డబ్బులు ఆరెంజ్ చేశాను పూర్తి నమ్మకంతో. ఈరోజు నాకూ ఉద్యోగం ఉంది, నేనూ సంపాదించ గలుగుతున్నాను. ఇంత వరకూ డబ్బులు ఎవర్నీ అడిగింది లేదు, ఎగ్గొట్టిందీ లేదు.

నేనేమి వేల డాలర్లు అడగలేదు కదా? విక్రమ్ ఇప్పటికే అయిదు నెలలకి పైగా ఉద్యోగం చేస్తున్నాడు, ఒక అయిదు వందలు సర్దలేడా? నిజంగానే అంత కష్టాల్లో ఉన్నప్పుడు చెప్పుకోవచ్చు కదా ఇప్పుడు ఇవ్వలేను అని! ఆ మాత్రం అవగాహన మా ఇద్దరి మధ్య ఉంది కదా! రూపాయలలో మొదలయిన మా స్నేహంలో కష్టాలు, నష్టాలు అన్నీ విడమర్చి చెప్పుకున్నాం, అడగక ముందే ఒకరిని ఒకరు ఆదుకున్నాం! మరి ఆ స్నేహం డాలర్ల లోనికి మారగానే ఎంత మారిపోయిందో ఈరోజు!

ఈ సృష్టిలో ప్రతి సమస్యకి పరిష్కారం ఉంటుంది, గట్టిగా ప్రయత్నిస్తే దొరుకుతుంది. కాకపోతే దాన్ని వెదికి పట్టుకోవడం లోనే అసలు సమస్య. కొందరు కనీసం ప్రయత్నించకుండానే ఓడిపోవడానికి సిద్ధం అవుతారు. నిజంగా ఆలోచిస్తే ఈరోజు నాకు వచ్చింది పెద్ద సమస్యే కాదు, కేవలం ఒక నమ్మకం లేదా ఒక అవకాశం చేజారడం. ఇప్పుడు ఇంకో దారి వెతుక్కోవాలి. ఎవ్వరి మీద పూర్తిగా ఆధారపడకూడదు అని మాత్రం అర్థం అయ్యింది. ఎట్టి పరిస్థితిలో సుమలతని అనుకున్న టైంకి అమెరికాకి తీసుకురావాలి అని గట్టిగా నిర్ణయించుకున్నా.

గెస్ట్ హౌస్‌లో పరిచయం అయిన ఒక మిత్రుడికి ఫోన్ చేస్తే బంగారం కుదువ పెట్టుకుని డబ్బులు ఇచ్చే పాన్ షాప్ వివరాలు చెప్పాడు. నాకా ఆ సలహా బాగా నచ్చింది. అత్తగారు పెట్టిన ఒక గోల్డ్ చైన్, రింగ్ ఇప్పుడు ఇవే నా పరువును, మర్యాదను కాపాడే అద్భుతదీపంలా కనబడ్డాయి, కానీ పెళ్లిలో పెట్టారే అనే సెంటిమెంట్ అడ్డు వచ్చింది. సెంటిమెంట్ కన్నా పరిస్థితుల ప్రభావం ఎక్కువగా ఉండటంవల్ల, ఇంకేమి ఆలోచించకుండా సెంటిమెంట్‌ని పక్కకి పెట్టి, దగ్గర్లో ఉన్న పాన్‌షాప్‌కి వెళ్లి అడిగితే ఆరు వందల డాలర్లు ఇస్తా అన్నారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ డాలర్లు తీసుకొని అపార్ట్‌మెంట్‌కి అడ్వాన్స్ ఇచ్చాను. ఒక పెద్ద భారం దిగింది అనిపించింది. అలా సోఫాలో కూర్చున్నానో, లేదో కళ్లు అంటుకున్నాయి. ఫోన్ రింగ్ కావడంతో ఎవరా అని చూశాను. అది నేను ప్రస్తుతం పనిచేస్తున్న ఎంప్లాయర్.

"అవినాష్, మాకు నీ క్లయింట్ నుండి మెయిల్ వచ్చింది. వాళ్లకు నీ పనితీరు బాగా నచ్చింది, అందుకనే నీ ప్రాజెక్ట్‌ని ఒక సంవత్సరం పొడిగిస్తున్నారు." చాలా టెన్షన్‌తో ఎత్తిన ఆ ఫోన్ కాల్ ఇంత మంచి వార్త చెప్పడంతో ఎగిరి గంతేయాలనిపించింది.

"అంతేకాదు, నీకు ఇష్టమయితే మా కంపెనీ నీకు ఎంప్లాయిమెంట్ ఆఫర్ చేస్తుంది. 60కే సాలరీ అగ్రిమెంట్ పంపుతాను, కాంట్రాక్టు సైన్ చేస్తే నీకు రెండు నెలల సాలరీ అడ్వాన్సు కూడా ఇస్తాం." తంతే గారెలబుట్టలో పడ్డట్టనిపించింది.

ఏమాత్రం ఆలోచించకుండా కాంటాక్ట్ సైన్ చేసి కొత్త కంపెనీలో జాయిన్ అయ్యాను. అనుకున్న సమయానికి సుమలత రావడం, ఇల్లు రెంటల్ అగ్రిమెంట్ నెలసరి వాయిదా నుండి సంవత్సరం లీజు రాయడం, అదే కంపెనీ గ్రీన్‌కార్డు చేయడం అన్నీ వరసగా జరిగిపోయాయి. కానీ విక్రమ్ నుండి మాత్రం ఆ తర్వాత ఎప్పుడూ కాల్ రాలేదు. నాకు ఫోన్ చేయాలని ఉన్నా ఏదో ఈగో అడ్డు వచ్చింది. కానీ ఈ సంఘటన మర్చిపోవడానికి చాలారోజులు పట్టింది. సరిగ్గా రెండు దశాబ్దాల తర్వాత, ఇప్పుడు నా పక్కనే విక్రమ్. కేవలం రెండు అడుగుల దూరంలో!

అబ్బురపరిచే విన్యాసాలు ఒకవైపు, తెలియని ఆందోళన ఇంకొకవైపు! మాట్లాడాలా, వద్దా?మనసంతా చాలా గందరగోళంగా, చికాకుగా ఉంది. కేవలం అయిదువందల డాలర్లు అప్పుగా ఇవ్వడం కోసం ఇంత సిల్లీగా ప్రవర్తించినందుకు వాడు బాధపడాలి. జీవితంలో నేను ఎప్పుడూ అయిదు వందల డాలర్లు సంపాదించుకోలేనేమో అని నన్ను దూరం చేసుకోవన్న వాని అజ్ఞానికి వాడు సిగ్గుపడాలి. అప్రయత్నంగా 'వాడు' అనే పదం వచ్చింది.

అవును, ఇప్పుడు వాడికి అంతకంటే మర్యాద ఎందుకివ్వాలి? అయ్యో మిత్రుడు కష్టాల్లో ఉన్నాడు అని హెల్ప్ చేయవల్సింది పోయి, నోరు విడిచి అడిగినాకానీ, కనీసం స్పందించిన వాన్ని ఎందుకు పట్టించుకోవాలి? కలసి తిరిగిన రోజులు గుర్తుకు వచ్చి కలవరపెడుతుంటే, ఏమిచెయ్యాలో అర్థంకావడంలేదు.

'విక్రమ్ నన్ను చూసి ఉంటాడా? చూసి కూడా చూడనట్టు నటిస్తున్నాడా?' ఎన్నో సందేహాలు, ఏవేవో నిర్ణయాలు. అన్నీ మనసులోనే! వెనుక నుండి ఆ విజిల్ వీరుడు ఇంకా విజిల్ వేస్తూనే ఉన్నాడు. ఆ అవకాశాన్ని వినియోగించుకుని మరొక్కసారి తిరిగి చూడాలని మనసు ఆరాటపడుతుంది, కాదు... కాదు... విక్రమ్ నన్ను చూస్తాడా లేదా? చూస్తే వాడి ప్రవర్తన ఎలా ఉంటుందో పరీక్షించాలనిపిస్తుంది. నన్ను చూసి కూడా చూడనట్టు ఉంటాడా, లేదా పలకరిస్తాడా? మనసులో ఎన్నో వింత కోరికలు.

అంతలో ఆ డాన్స్ షో అయిపోయింది, పెద్ద చప్పట్ల మ్రోత, విజిల్స్! హాల్ అంతా దద్దరిల్లిపోయింది. ఇదే అవకాశంగా నా ఆలోచనలు పక్కకుపెట్టి వెనక్కి తిరిగి చూస్తే వాడు లేడు. కొద్ది మంది ప్రేక్షకులు లేచి వెళ్తున్నారు, కొందరు బాత్రూం బ్రేక్ తీసుకుంటున్నారు. ఇంత తర్జనభర్జన పడి ఒక నిర్ణయానికి వచ్చి చూస్తే వాడు లేడు. ఎక్కడికి వెళ్లాడా అని వెనుకకి తిరిగి చుట్టుపక్కల చూశా. విక్రమ్ ఎక్కడా కనపడలేదు. బహుశా బాత్రూమ్‌కి వెళ్లి ఉంటాడేమో అనుకుని మళ్లీ స్టేజీ పైకి దృష్టిని కేంద్రీకరించాను.

ఇంతలో ఇంకొక కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా పేరున్న ఒక ఆచార్యుల వారు ప్రవచనాలు చెపుతున్నాడు. ఆయన బాగా చెపుతుంటాడు అని విన్నానుకానీ ఎప్పుడూ ఆయన ప్రసంగాలు వినలేదు. మొట్టమొదటిసారి ఆయన ప్రసంగం వినబోతున్నాను ప్రత్యక్షంగా. చెవులు ప్రసంగాన్ని వింటున్నా కళ్లు అప్రయత్నంగా విక్రమ్ కోసం చూస్తున్నాయి. మనదేశ సంస్కృతి మన ఇతిహాసాలు, పురాణాలు, వాటి గొప్పతనం, వాటి వెనుక దాగివున్న సైంటిఫిక్ కారణాలు ఇంజనీరింగ్ చేసిన నాకే అర్థం కానీ విషయాలు చాలా విడమర్చి చెపుతుంటే ఎన్నో తెలియని విషయాలు తెలుస్తున్నాయి. ఇంతలో సుమతి శతకాల గొప్పదనం, దాని ప్రభావం విజయాలు, నిత్య జీవితంలో ప్రభావాలు చెపుతున్నాడు.

"ఉపకారికి నుపకారము విపరీతము కాదు సేయ..." చిన్నప్పుడు స్కూల్లో నేర్చుకున్న పద్యమే. మనకు హాని చేసిన వాడికి అయినా వాడు ఆపదలో ఉంటే సహాయం చేయమని చెపుతుంది. క్షమాభిక్ష, ఓర్పు అనేవి మన దేశ సంస్కృతిలో భాగం, దాని ఫలితాలు ఒక్కొక్కటీ చెపుతుంటే ఔరా అనిపించింది. విన్నది రెండు నిమిషాల ప్రసంగమే అయినా నాలో చాలా ప్రభావం చూపింది. విన్నవి ఆ రెండు మాటలే కానీ పదే పదే ఆలోచింప చేస్తున్నాయి. ఆయన చెప్పిన మాటలు నా సమస్యతో పోల్చుకున్నాను. విక్రమ్ తప్పు చేశాడుకానీ నాకు ఎలాంటి హాని చేయలేదు! వాడేమీ ఆపదలో లేడు, ఇప్పుడు నేను మాట్లాడకపోయినా నాకు కానీ, విక్రమ్‌కి కానీ పెద్దగా ఒరిగేది ఏమీలేదు. కానీ మాట్లాడితే మాత్రం నా మదిలో జరుగుతున్న సంఘర్షణకి ఒక ముగింపు ఉంటుంది. అంతేకాక ఇప్పుడు మొదలయిన ఈ మానసిక సంఘర్షణ మరచిపోవడానికి చాలారోజులు పట్టొచ్చు. అప్పుడంటే కొత్త ఉద్యోగం, కొత్త సంసారం, కొత్త బాధ్యతలు, కాబట్టి తొందరగానే మరచిపోయాను. ఒకసారి హలో చెపితే నాకు వచ్చిన నష్టమేమి లేదు, వాడు స్పందించకుంటే అది వాడి కర్మ అని వదిలేయాలని గట్టి నిర్ణయానికి వచ్చి వెనక్కి తిరిగి చూశాను. విక్రమ్ ఇంతకుముందు చూసిన ఆ చైర్‌లో లేడు. నా కళ్లు చుట్టుపక్కల అణువణువూ వెతుకుతున్నాయి ఎక్కడయినా కనిపించకపోతాడా అని! కొన్ని నిమిషాల క్రితం పక్కనే ఉన్నవాన్ని పట్టించుకోలేదు. ఇప్పుడు కలవాలనుకున్నప్పుడు కనబడడం లేదు, ఏంటో అంతా విచిత్రం. సరే మరొక్కసారి కలవకపోతాడా ఇంకా ఒక్క రోజు ఎలాగు ఇక్కడే ఉంటాము కదా అనుకుని మళ్లీ స్టేజీ వైపు తిరిగాను. ఇంకా ప్రవచనాలు చెబుతూనే ఉన్నాడు. అటు తిరిగానో లేదో ఒక బలమైన చేయి 'అవినాష్' అని నన్ను పిలుస్తూ నా భుజంపై పడింది. ఎవరా అని చూస్తే అది విక్రమ్! ఆశ్చర్యంతో పాటు చాలా ఆనందం అయ్యింది.

❖

ఒక చిన్న ప్రవచనం ఈరోజు ఇద్దరు మిత్రులని కలిపింది. మన సంస్కృతి గురించి వినడమే కాదు, దాని గొప్పతనాన్ని ఈ రోజు ప్రత్యక్షంగా చూశాననే సంతోషం ఎక్కువయింది నాకు. కారణం ఏదయినా సారీ చెప్పడం మినహా ఇంకే మాటలు విక్రమ్ గొంతు దాటి రాలేకపోయాయి. ఒక మనిషి మారాడు అని చెప్పటానికి అంతటి పశ్చాతాపం కన్నా మించిందేముంటుంది? ఈ రోజు విక్రమ్ వచ్చి నన్ను కలవడానికి కూడా కారణం ఆచార్యుల వారి ఆ ప్రవచనాలే అనే విషయం తర్వాత తెలిసింది. ప్రతిసారి తానా సభల నుండి ఒక మంచి అనుభూతితో వెళ్లే నాకు ఇక ఎప్పుడూ కలవను అనుకున్న మిత్రుడిని మళ్లీ దగ్గరికి చేసిన తానాకు మనసులో అభినందనలు చెప్పకుండా ఉండలేక పోతున్నాను.




వేణు నక్షత్రం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంసీఏ పూర్తి చేసి 1998లో అమెరికా వెళ్లారు. సిద్ధిపేట మంజీరా రచయితల సంఘం ప్రేరణతో కాలేజీ రోజుల నుండే రచనలు చేయడం అలవాటు చేసుకున్నారు. 'మౌనసాక్షి' కథల సంపుటి ప్రచురించారు. నాలుగు లఘుచిత్రాలు- అందులో ఒకటి స్వీయ దర్శకత్వంలో అమెరికన్ నటీనటులతో నిర్మించారు. 'పిలుపు' అనే వెబ్ ఛానల్ నిర్వహిస్తున్నారు. కంప్యూటర్ రంగంలో పనిచేస్తూ, నివాసం వాషింగ్టన్ డి.సి.

ఎన్నికలు

సాంత్వన చీమలమర్రి





ఇరవయ్యొకటో శతాబ్దపు మొదటి దశకం అదృష్టవంతుడి కొబ్బరికాయలాగా సరిగ్గా మధ్యకు పగులుతోన్న రోజుల్లో ఓ టీనేజ్ అమ్మాయి- డాబర్ వాటికా డబ్బాలో ముంచి తీసిన రెండు మధ్యస్తపు పొడుగు జడలతో, పదిమంది సాయిపల్లవీలని సూపరింపోజ్ చేసినట్టున్న ఇటిక ఎరుపు చెంపలతో, బూడిద రంగు కుర్తా పై నీలం పెట్టిన తెల్ల చున్నీ రెండు భుజాలకీ పిన్ చేసుకుని... సరే... ఈ మాత్రానికి డీపర్సనలైజేషన్‌లాంటి టెక్నిక్స్ అవ్వీ ఎందుగ్గానీ... నేనే.

రసాయనశాస్త్రం క్లాస్ పరమ రసహీనంగా సాగుతోంది. గడియారంలో చిన్నముల్లు పదికీ పదకొండుకూ మధ్య పక్క పరుచుకు పడుకుంది. లేపితే మళ్లీ దడుచుకుని తొమ్మిది మీదకి జారిపడి ఇంకోసారి లెక్కల క్లాసు వినాల్సొస్తుందేమోనని భయపడి తదేకంగా దాన్నే చూస్తున్నాను. అంతకు ముందే "Find X" అన్నప్పుడల్లా ముల్లోకాలూ వెదికి ఆరుసార్లు 'X' నోట్లో గుడ్డలు కుక్కి omni వ్యాన్లో పడేసి కిడ్నాప్ చేసి తేవాల్సొచ్చింది. నా కుడివైపు సరోజ లైబ్రరీ నుంచి ఎత్తుకొచ్చిన పేపర్లు, పత్రికలూ అంచుల్లో తడిపి గజినీ సూర్యా ఫోటోలు శబ్దం రాకుండా చింపుకుంటోంది. ఎడమవైపున జ్యో చేతికి ఫెవికాల్ జిగుర్రాసి ఆరబెట్టి మళ్లీ పీక్కుంటోంది. వెనకనుంచీ ఎవరో పుణ్యాత్ములు చింపేసిన సోషల్ నోట్స్ పేజీలో బాబర్ చక్రవర్తి సాక్షిగా బఠాణీలు పంపిణీ చేస్తున్నారు.

బోర్డు మీద ఈక్వేషన్లలో కార్బన్ కణం ఎప్పట్లాగే అన్నిటితో చనువుగా వుంటూ ఎవరిమీద ప్రేమో స్పష్టంగా బయటపెట్టకుండా నానా రభసా చేస్తోంది. ఆక్సిజన్ వచ్చి హైడ్రోజెన్ దగ్గర వాపోతోంది "You know I was once in a toxic relationship with carbon? We were called the monoxide couple back then. Bloodcurdling days!" - బదులుగా హైడ్రోజెన్ కార్బన్తో చెట్టపట్టాలేసుకు తిరిగిన hydrocarbon బాండింగ్ రోజులన్నీ తలుచుకుని కుమిలిపోయింది- ఇద్దరూ కలిసి ఏడ్చి ఏడ్చి (కన్)నీరయ్యారు. వెధవది కాస్త alcohol కొట్టి శాంతిద్దామంటే మళ్లీ ఆ కార్బన్ కాళ్ల దగ్గరికే పోవాలి ఇద్దరూ మరి. ఆ కోపంలో హైడ్రోజెన్ గంధకంతో కలిసి జీవితాన్ని కంపు చేసుకుంది.. ఇంత జరుగుతున్నా పెద్ద మనుషులైన ఆర్గాన్ నియాన్ రేడాన్ చలించలేదు. నేను వెళ్లి కార్బన్ కాలర్ పట్టుకుని ఊపేశాను- 'ఎందుకిలా చేస్తున్నావ్?' అని ఆక్రోశించాను- 'వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి వజ్రమూ నేనే బొగ్గూ నేనే!' అని ఏదో గుసగుసగా చెప్తోంది కార్బన్.

"సర్క్యులర్!" అన్న గావుకేకతో అదాటుగా కళ్లు తెరిచాను. హమ్మయ్య! ఇంకొక్క పదినిమిషాలాగితే ఇంటర్వెల్ కొట్టేస్తారు. ప్రశాంతంగా ప్రియాంకా టిఫిన్‌బాక్స్‌లో పూరీకూర మీద తలో చెయ్యీ చేసుకోవచ్చు. బఠాణీలేమూలకీ?!

సార్ కనుబొమ్మలు ముడేసి సర్క్యులర్ చదువుతున్నారు.

"ఒసేయ్! ఎవరైనా పోయారేమోనే... సెలవిచ్చేస్తే బాగుండు" జ్యో ఉబలాటపడింది.

"సేయ్ శకున షక్షీ! చేతిక్కాదు.. మూతికి రాసుకోవే జిగురు! దరిద్రమొదులుతుంది!" సరోజ కస్సుమంది.

"ముయ్యండెహే! మ్యాటరేంటో తెలీకండాని..."- లో గొంతుకలో తిట్టాను. నా ఆదుర్దా నాది. సార్ సర్క్యులర్‌లోంచి నా మొఖానికేసి ఇప్పటికి మూడుసార్లు మార్చి మార్చి అనుమానంగా చూశారు. కొంపదీసి మొన్న మెస్ దగ్గర కోసిన కొబ్బరి మావిడికాయల సంగత్తెలిసిపోయి నా మెళ్లో మావిడాకుల హారమేసి 'నేను దొంగని' అనే పలక పట్టుకునించోమనరుగా?

సార్ గొంతుసవరించుకు చదివారు- "The following students have been nominated as the candidates for the school apex body elections based on the tenets of discipline, leadership qualities and general popularity. They are requested to meet the coordinator during the morning break."- ఒక ఐదు నిముషాలపాటు పదవులూ వాటికోసం నించోడానికి నామినేటైన జనాల పేర్లూ చదవబడ్డాయి. క్లాసంతా బెంచీల మీద బాదీ బూటుకాళ్లతో నేలను మోదీ హర్షం వ్యక్తం చేశారు. చివరగా 'హెడ్ గర్ల్' ప్రకటించారు. "మిస్ సింధు - మిస్ మానిక..." మళ్లీ ధనధనా ధమధమా. "అండ్ మిస్ సాంత్వన"- క్లాసంతా ఒక్కసారిగా తీసుకున్న ఎగశ్వాస శబ్దం వినబడ్డ వాతావరణశాఖ వారు పొరబాట్న 'పుస్కీ' తుఫాను హెచ్చరిక జారీ చేశారు. నేనూ అవాక్కయ్యి చూస్తున్నా. సరోజ అడిగింది- "సరిగానే చూశారా సార్? ఇది హెడ్ గర్ల్ క్యాండిడేటేంటి లేపోతే?"

సార్ తన్నుకొస్తున్న నవ్వును ఆ పళంగానే మింగేసి అటెండర్ని పంపించేసి మళ్లీ కార్బన్ కాంప్లికేటెడ్ ప్రేమపురాణం అందుకున్నారు.

నా ప్రత్యర్థుల గుణగణాలని ప్రస్తావించే ముందర నా సుగుణాలని మీ ముందుంచుతాను. ఆ పైన ఇచ్చిన మూడు క్రైటీరియాల్లో ఒక్కోదాన్నీ పరిశీలిద్దాం.

1. డిసిప్లిన్-

కావల్సినది - అలారాన్నే నిద్రలేపగలిగే మరియు బెల్ కొట్టకముందే క్లాస్‌లో ఉండే సమయపాలన.

ఉన్నది - వాకిట్లో స్కూల్‌బస్ ఆగినపుడు షూ చేత్తో పట్టుకొని, నోట్లో రిబ్బన్లు పెట్టుకొని సగం అల్లిన జడలతో సాహసం శ్వాసగా రోడ్డు దాటడం. అసెంబ్లీ అయినాక తీరుబడిగా సరోజతో కలిసి రెస్ట్‌రూంకి వెళ్లొచ్చి చక్రవాకంలో ప్రవంతి-ఇక్బాల్‌లది స్నేహమా ప్రేమా? లాంటి నాపసాని టాపిక్స్ చర్చిస్తూ ధిలాసాగా అటెండెన్స్ వేసే టైముకు క్లాస్ గుమ్మంలో 'మే ఐ కమిన్ సార్?' అని గేదెలా అరవడం.

కావాల్సినది - ఎవరు చూస్తున్నా చూడకపోయినా సరైన పనే చేసే నిబద్ధత.

ఉన్నది - ఆఖరి బెంచిమీద కంపాస్‌తో ముచ్చటైన హృదయాకారం చెక్కి మధ్యలో 'కహో నా ప్యార్ హై' అని రాయడం.

2. లీడర్‌షిప్ క్వాలిటీస్ -

కావాల్సినది - అందరినీ ఒకే తాటిపైన నడిపించగలగటం. లేని పని మీదేసుకుని భుజాలు విరక్కొట్టుకోడం.

ఉన్నది - తాటిపట్టకి ఎదురు దేకడం. పందిరి గుంజకు పని చెప్పటం.

కావాల్సినది - అందరికీ మంచి ఉదాహరణగా నిలవడం.

ఉన్నది - తెల్ల యూనిఫామ్ వేసుకున్న సంగతి మర్చిపోయి Add Gel నల్ల రీఫిల్ ములుకు పీకి నోటిలో పెట్టుకుని ఊదడం. (I prefer, అనూహ్యంగా DIY designer టై అండ్ డై కుర్తా తయారుచేసుకోడం.)

3. పాప్యులారిటీ -

దీనికి మాత్రం పెద్దగా లోటులేదు. సరోజతో కలిసి అసెంబ్లీ కాయిర్లో పాడడం, అపుడప్పుడూ సోలో పాటలు లంఘించుకోవడం. ఇవికాక తెలుగూ ఇంగ్లీష్ వ్యాసరచన, వక్తృత్వం లాంటి పోటీల్లో బహుమతులూ- అన్నిటినీమించి బాగా తెలివైన విద్యార్థిని అన్న గుర్తింపు. Not exaggerating. ఐతే ఇవన్నీ మనల్ని టీచర్ల దృష్టిలో పడేస్తాయిగానీ పిల్ల పిశాచాల అభిమానానికి కొలమానాలు వేరే వుంటాయి. వాటిల్లో అతి ముఖ్యమైనది 'స్పోర్ట్స్.'

చిన్నతనంలో చాలావరకూ ఆటల్లో ఒకే బంతికోసం తుచ్ఛంగా రెండు గుంపులు కొట్టుకోడం- బంతిని బాది హింసించడం లాంటివి చూసి చలించిపోయి నావల్ల యే బంతికీ హాని జరగదని నా UKG బాల్యమిత్రురాలు బంతి జానకికి ప్రమాణం చేశాను. ఇప్పటికీ ఎంత ట్రైస్‌లో వున్నా ట్రైస్‌బాల్ వాడను.

ఇక ఎగస్పార్టీ విషయానికొస్తే ముందుగా సింధు- ఏ సెక్షన్ క్లాస్ నుంచీ బీ సెక్షన్ క్లాస్‌కి కూడా ఉరుక్కుంటూ వెళ్లే టాప్ రేంజ్ అథ్లెట్. ఆ పిల్ల ఆటతీరు చూసి మురిసిపోయిన ఒక భార్యా భర్తా తన పేరు కనుక్కుని వాళ్ల కూతురికి పెట్టుకున్నారు. ఆ అమ్మాయే మొన్న ఒలింపిక్స్‌లో వెండి పతకం తెచ్చిందన్నమాట. ఇక మౌనిక- మంచి అథ్లెట్టే కాక వాలీబాల్ కెప్టెన్ కూడా. గొప్ప డాన్సర్. ఇద్దరూ హాస్టల్ అమ్మాయిలు. అందువల్ల అరివీర భయంకర పాప్యులారిటీ. వీళ్ల క్రమశిక్షణా నాయకత్వ లక్షణాలూ పొగడాలంటే అడీషనల్ పేపర్లు తీసుకోవాలి.

గంట మోగింది.

ఇందాక చెప్పిన పేర్లుగల శాల్తీలంతా ఆఫీస్ బిల్డింగ్‌కి వలస పోయారు. నేనూ సరోజా జ్యో కలిసి ప్రియాంక టిఫిన్ బాక్స్ పైకి వరదబాధితుల్లా ఎగబడ్డాము. ప్రియాంక వాళ్లమ్మగారు మా పాలిటి పూరీపూర్ణ. రోజు మార్చి రోజు ఎగస్ట్రా పూరీలేసి పంపే వారు. ఆవేళ మాత్రం నేనెంత వెళ్లనంటున్నాసరే (నా వాటా పూరీల మీద కన్నేసి) నన్ను పథకం ప్రకారం ఎగదోసి, సార్ తిడతారని భయపెట్టి నన్ను కూడా ఆఫీసుకు పంపించారు మా వాళ్లు.

నేను వెళ్లేసరికే చాలా inspirational విషయాలు మాట్లాడేసి నట్టున్నారు. ఒక్కొక్కరూ పోరాటస్ఫూర్తితో తళతళలాడుతున్నారు.

"యేమ్మా! దీనిక్కూడా లేటేనా?" చిరాకుపడ్డారాయన.

"అంటే ఆటో దొరకడం ఇబ్బందైంది సార్. ఎండాకాలం కదా!"

"మీ క్లాసు నుంచీ ఆఫీస్‌కి సరిగ్గా ఇరవయ్యడుగుల దూరం."

"హ్హిహ్హిహ్హి సరదాకి సార్... అది.. పూరీ..."

"పూరీ యేంటి?"

"పూరీ కాదు... ఛ ఛ... పూరీ అన్నానా? పూర్తి - పూర్తి వివరాలు తెలుసుకుందామని నోటిస్‌బోర్డ్ దగ్గరికెళ్లి చూసొచ్చాను."

"ఏదో ఒకటి చెప్తావ్! సరే ఈ నామినేషన్ పేపర్ తీసుకో. సాయంకాలంలోపు నింపి ఆఫీస్‌లో ఇచ్చేయండి అందరూ."

అందరూ వెనుదిరిగారు. నేను మాత్రం ఆయన ఆఫీస్ బీరువాకి జారబడి కళ్లు చిన్నవి చేసి శూన్యంలోకి ఏకాగ్రతతో చూస్తూ మేధావిలా ఆనే ప్రయత్నం చేస్తున్నాను.

సార్ ఏవో పేపర్లు సర్దుకుంటూ తల పైకెత్తకుండా అన్నారు.

"ఏంటీ?"

"నాకూ... ఆలోచించగా ఒకటే అనిపిస్తోంది సార్. ప్రజల సమస్యలపై పోరాడటానికి అధికారమే అక్కర్లేదు. Absolute power corrupts absolutely అంటారు కదా... అందుకని నేను అధికారానికి బానిస కాదలుచుకోలేదు. నామినేషన్ వెయ్యను సార్."

"హ్మ్మ్... అంత absolute power నీకెవరివ్వరులే. తేడా వేషాలేస్తే తాట తీయడానికి మేమంతా లేమూ... ఇంకేదైనా రీజన్ చెప్పు."

"అటెన్షన్ స్టాండటీజ్ అని గాఠిగా అరవాలి. గొంతు పాడై పోతుంది సార్..."

"మైక్ ఏర్పాటు చేసే బాధ్యత నాది, సరేనా?"

"ఆ హెడ్ గర్ల్ తాలూకు నీలం కోటు ఎపుడైనా వాసన చూశారా? యాక్! ఎపుడో రాతియుగాల నాడు కుట్టించారు. కిందటి జెండావందనానికి అది తీసినపుడు దులిపితే రెండు బుల్లి రాకాసి బల్లి శిలాజాలు బయటపడ్డాయి. ఈనాడు జిల్లా ఎడిషన్‌లో బాక్స్ కట్టి మరీ వేశారు... మర్చిపోయారా?"

"కావలిస్తే Dry clean కిద్దాం."

"నాకు మార్చ్‌ఫాస్ట్ అసలు రాదు సార్... ఒంటెలా ఉంటాను మార్చ్ చేస్తే..."

"Says who? ఇలాంటివన్నీ పట్టించుకుంటారా?"

"అదికాదు సార్... నేను కచ్చితంగా ఓడిపోతాను వాళ్లతో పోటీ అంటే. అందరూ నవ్వుతారు సర్!"

"అదీ... అల్లా చెప్పు. నీకు భయం. వెళ్లి ప్రిన్సిపల్ మేడంకి చెప్పు ఇదేమాట."

వెళ్లాను. చెప్పాను.

"అమ్మాయి! ఇప్పటిదాకా నువ్వు యే పోటీకి పేరిచ్చినా కనీసం యాభైశాతం పైనే నెగ్గుతావనే నమ్మకముండేది నీకు. ఇపుడు అది యే ఐదుశాతమో పదిశాతమో వుందంతే. రేప్పొద్దున్న పెద్దయ్యాక ఇంతకంటే తక్కువ నమ్మకమున్న చోట కూడా శక్తిమొత్తం వెచ్చించి పనిచెయ్యాల్సొస్తుంది. ఓడడం కూడా చాలా అవసరమైన, ముఖ్యమైన అనుభవం. అందరూ నవ్వే ముందే నువ్వు నవ్వేసెయ్యి సరిపోతుంది," అని మాత్రమే అన్నారావిడ.

Dumbledore గదినుంచి బయటికొచ్చిన Harry Potter లాగా ఉంది నా పరిస్థితి.

వచ్చి నామినేషన్ వేశాను.

ఆ సాయంత్రం లాటరీలో అందరికీ గుర్తుల్చొచ్చాయి.

సింధుకు బల్బు. మౌనికది త్రాసు. నాకు హెలికాప్టర్!!!

ఎన్నికల వేడి క్యాంపస్ మొత్తం రాజుకుంది. శత్రువర్గాల ఎక్సిట్ పోల్స్‌లో ఎంట్రీ కూడా దక్కలేదు నాకు. సన్నిహితవర్గాల నుంచి ఐదూ, సినిమాకి తీసుకెళ్లి పెప్సీ పాప్‌కార్న్ ఇప్పించే పూచీ మీద తమ్ముడి క్లాసు నుంచి నాలుగూ... నాది వొకటి. ఎక్కీ తక్కీ పది వోట్లు పడిపోతాయిలెమ్మని ధీమాగా వున్నాను.

క్యాన్వాసింగ్ కోసం సింధు బ్యాట్రీకి తగిలించిన వెలిగే బల్బు తోనూ, మౌనిక థెర్మోకోల్ త్రాసుతోనూ తిరిగారు. పోయిందే ముందని నేనూ ఒక మీడియం సైజు బొమ్మ హెలికాప్టర్‌తో ఒకటో తరగతి నుంచి మొదలెట్టి అన్ని క్లాసులకీ వెళ్లాను.

ఆరోజు ఉదయం పోలింగ్. మధ్యాహ్నం కౌంటింగ్. సాయంత్రం ఫలితాలు. మెస్ నుంచి నూనె డబ్బాలు బాగా కడిగించి తెప్పించి బ్యాలెట్ బాక్సులుగా మార్చేశారు. రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా వంద శాతం పోలింగ్. స్వస్తిక్ సీల్‌తో వోటు వేశాక ఇండియన్ ఇంకుతో గోటి చుక్క కూడా పెట్టారు అందరికీ. లంచ్ అవర్లో చిన్నపిల్లలంతా బుల్లి చేతులూ, వాటి మీద చుక్కలూ చూపించుకుంటూ పరిగెత్తారు.

❖

మధ్యాహ్నం తరగతులన్నీ రద్దు చేశారు. అందరం కుర్చీలు వరండాలోకి లాక్కుని ఆఫీస్ బిల్డింగ్ పైనున్న లౌడ్ స్పీకర్ వైపు చెవులు రిక్కించాము. తురాయిచెట్ల చల్లటి నీడల్లోకి తగులుతున్న వేడిగాలి గమ్మత్తుగా ఉంది. సన్నగా కబుర్లు.

అంతలో ఒకటో తరగతి ఫలితాలు చదివారు- హెడ్‌బాయ్, స్పోర్ట్స్ కెప్టెన్, కల్చరల్ సెక్రెటరీ వగైరాలు అయ్యాక హెడ్ గర్ల్ - 73 వోట్లు మొత్తం. సింధుకు 3. మౌనికకు 2. నాకు 68.

పూర్తి నిశ్శబ్దం.

'స్వీప్' అన్నారెవరో.

రెండో తరగతి- వోట్లు 67. సింధుకు 4. మౌనికకు 3. నాకు 60.

పేర్లేమైనా తప్పు చదువుతున్నారేమో?

ఐదో తరగతిదాకా అదే వరస. ఆరు నుంచి కొంచెం గాలి మారింది. అయినప్పటికీ క్లాసుకొక్క 15-20 వోట్ల దాకా పడుతూనే ఉన్నాయి.

తొమ్మిదో తరగతి చివరకు సింధుకు 330 వోట్లు. నాకు 298. మౌనికకు 272. ఎవ్వరికీ ఏమీ అర్థం కావట్లేదు. శత్రువర్గం మొఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

పదో తరగతిలో మాత్రం నేను అనుకున్నట్టు 6 వోట్లు. తక్కినవన్నీ ఇద్దరికీ దాదాపు చెరిసగం పడ్డాయి.

సింధుకు 361. నాకు 304. మౌనికకు 305.

విజేతలని ప్రకటించారు. వేరే పోస్టుల్లో గెలిచిన వాళ్లక్కూడా వాళ్లు నెగ్గిన ఆనందం కంటే నాకిన్ని వోట్లెల్లా పడ్డాయా అనే ఆశ్చర్యం.

సరోజా, జ్యో నా మీద పడిపోయారు. "ఓడినా పర్లేదు. ఎన్ని వోట్లొచ్చాయో దీనికి అసలు!" ఎవరెవరికో చెబుతున్నారు.

సింధు దగ్గరికొచ్చి షేక్‌హ్యాండ్ ఇచ్చింది- "That was a tough fight dear" అని. కంగారులో కంగ్రాట్స్ బదులు "సారీ నో మెన్షన్ ప్లీస్" అని చెప్పి ఎటువైపుకో నడిచెళ్లిపోతున్నా. మెల్లిగా విషయం సింక్ అవుతోంది.

కోఆర్డినేటర్ సార్ ఎదురుపడ్డారు. "కంగ్రాట్స్ అమ్మా! భయం భయం అంటూనే భలే లాగేశావే వోట్లు!"

"ఊరుకోండి సార్... హెలికాప్టర్ బొమ్మ నచ్చి చిన్నపిల్ల లంతా గుద్ది పారేసివుంటారు. ఈ మాత్రం దానికే?"

ఆయన నవ్వేశారు. "అయ్యుండొచ్చు. అయినా సరే అనుకున్న దానికంటే అన్ని క్లాసుల్లోనూ ఎక్కువే పడ్డాయి నీకు... అందుకే మరి నామినేషన్ వెయ్యను అంటే ఒప్పుకోనిది."

నేనూ నవ్వేసి గ్రౌండ్ వైపుకు పరిగెత్తాను. గాలి గట్టిగా వీస్తోంది. ఎదురు పరిగెత్తి ఆ చివరకి చేరుకున్నాను. చేతుల్లో ఏముందో చూసుకోలేదు. బొమ్మ హెలికాప్టర్. ఓ క్షణం అది నిజంగానే ఎగురుతుందేమోననిపించింది.



సాంత్వన చీమలమర్రి బెంగుళూరులో Natural Language Processing పరిశోధనా విద్యార్థిని. చదవటం - పాడటం, నవ్వించటం - కబుర్లు చెప్పటం... అప్పుడప్పుడూ రాయటం ఇష్టమైన పనులు.

Sponsored by Vidyadhar Garapati, CEO of Movers.com

MOVERS.Com™

For all your moving needs



NIMBLE ACCOUNTING
see every thing

Accounting Solution Tailored For Your Business

Since its inception, Nimble Accounting is delivering significant industry specific accounting solutions and premium bookkeeping services globally for staffing, property and retail industries.




Nimble Property

Hotel Accounting Software

Hospitality industry specific software built with seamless integrations and automations which makes the productivity of the General Managers and accounting departments work lot easier.

- Multi-property Management: Single Login for your group of Hotels
- Automation: Daily Sales, Bank Reconciliation & Transactions
- Integration: PMS, Payroll Vendors, Banks & financial institutions
- STR Import: Get your detailed Competitor Analysis report
- GSS Import: Review your customer reviews
- Insights: KPI dashboard for insights on ADR, RevPar, Expenses, etc.
- ACH (Receipts & Payments): Pay & get paid faster
- Budget & Forecast: Departmental wise Operational Budget with Statistics
- Reporting: 60+ reporting to help you make better decisions

NO MAINTENANCE | ECONOMIC PRICING | EASY TO USE | QUICK SETUP & SUPPORT



Nimble Staffing

IT Staffing Accounting Software

America's Only Staffing Accounting Software 'Nimble Staffing' is perfectly crafted exclusively for the staffing industry needs, increasing the productivity and decreasing the manual intervention.

- Consultant Center: Manage all your Consultants at ONE place
- Automation: Timesheet Processing, Invoicing, Commissions
- Intuitive Dashboard: Get realtime actionable insights on your business
- Intercompany Operations: Consolidate your Intercompany finances
- Payroll Support: Preview your consultants payroll information
- Bank Reconciliation: Connect your banks and do auto reconciliation
- Profitability Analysis: Get hourly Profitability of your Consultant
- Staffing Reports: Access 80+ Exclusive Staffing Reports
- Compliance: Get your consultants Compliance Right& Accurate
- Alerts: Get realtime alerts on dues, VISA expiry and pending invoices

5 STAR SUPPORT | IMRPOVED ACCOUNTING PERFORMANCE | QUICK SETUP & SUPPORT

Contact Us

info@nimbleaccounting.com +1 (866)-964-6253

200 Motor Pkwy #26, Hauppauge, NY 11788, USA www.nimbleaccounting.com

SAREEN & ASSOCIATES


Accounting, Tax, Payroll &
Business Consulting

703 366 3444
resolutions@sareentax.com
www.sareentax.com



7 CPAs, 3 EAs, 50+ Employees

*"We Resolve or Reduce **IRS and State** Tax Issues"*



SAREEN TAX RESOLUTION CENTERS

MANASSSAS, VA
10702 VANDOR LANE

HOLLYWOOD, FL
3800 S. OCEAN DR.,
SUITE G-9

FREDERICKSBURG, VA
4620 PLANK ROAD

STEPHENS CITY /
WINCHESTER, VA
1013 AYLOR RD

SPRINGFIELD
5411-F BACKLICK ROAD

"Creating Equity For The Future"
Since 1982

We invest in Real Estate.
We take pride in multiplying your assets.
We stand strong on our commitment.
Let us work for you!

My Heartiest Congratulations and Best Wishes to

TANA

in its efforts to serve the social, cultural and educational needs of the Telugu community in North America and across the world!



Chowdary 'Charlie' Yalamanchili
President

CNC INVESTMENTS LTD LLP

4420 FM 1960 West, Suite 224
Houston, TX 77068
(281) 444-1585 Phone
(281) 444-1538 Fax
www.cncinvestments.com
charliey@cncinvestments.com

EQUAL HOUSING OPPORTUNITY